# మానవ మహోపకారి

## ముహమ్మద్

సల్లల్లాహు అలైహి వ సల్లం

269

"Mohsin-e-Insaniyat"
(Telugu)

# మానవ మహోపకారి

## ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వ సల్లం)

ఉర్దూ మూలం
నయీమ్ సిద్దీఖీ

అనువాదం
అబ్దుల్ వాహెద్

ప్రకాశకులు :
TIP TRUST
తెలుగు ఇస్లామిక్ పబ్లికేషన్స్ ట్రస్ట్
సందేశభవనం, లక్కడ్‌కోట్, ఛత్తాబజార్,
హైదరాబాద్ - 500 002. ఫోన్ : 24564583

# Maanava Mahopakari Muhammed (SAS)

**"Mohsin-e-Insaniyat" (Telugu)**

**TIP Series No. : 269**

Writer : Naeem Siddiqi

Translated by : Abdul Wahed

*All Rights Reserved with Publishers*

First Edition : March 2013

Second Edition : March 2017

Copies : 1000

**Price : Rs. 150/-**

ISBN : 978-93-81111-20-8

Published by : **Telugu Islamic Publications Trust** (Regd.)
Sandesha Bhavanam,
Lakkadkot, Chatta Bazar,
Hyderabad-500 002. India.
Phone: 040 - 24576237, 24564583
E-mail: geeturaiweekly@gmail.com

Typeset by : Geeturai Graphics
Lakkadkot, Hyderabad-2.

Printed at : : Cosmic Printers
Lakkadkot, Hyderabad-2.



ప్రతికాలంలోనూ

అసత్య తుఫానులను

ఎదురొడ్డి నిలిచిన

సత్యపథగాములకు

ఆ తెల్లని నగుమోము సాక్షిగా

దైవకారుణ్యం కోసం ప్రార్థనలు జరుగుతాయి

ఆయన.. అనాథలకు ఆధారం

ఆయన ... వితంతువులకు, నిరుపేదలకు.. కొండంత అండ...

దారి చూపే దీపకాంతి

మానవాళికి మహోపకారి

చీకటి తెరలను చీల్చిన సాఫల్యతేజం

మా గుండెల్లో నిండి ఉన్న సత్యధామం

## ముహమ్మద్ (స)

అల్లాహ్ ప్రవక్త

ఆయన వెంట ఉన్నవారు

అవిశ్వాసుల పట్ల కఠినంగా ఉంటారు

పరస్పరం కరుణామయులుగా ఉంటారు.

నీవు వారిని చూసినప్పుడు వారు రుకూ, సజ్దాలలో అల్లాహ్ అనుగ్రహాన్ని ఆయన ప్రసన్నతను అర్థించడంలో నిమగ్నులై ఉండడం కనిపిస్తుంది.

సజ్దా సూచనలు వారి ముఖాలపై ఉంటాయి. వాటి వల్ల వారు ప్రత్యేకంగా గుర్తింపబడతారు. వారి గుణగణాలు తౌరాత్‌లో ఇలా ఉన్నాయి. ఇక ఇంజీల్‌లో వారు ఒక పంట పొలంతో పోల్చబడ్డారు. ఆ పొలం మొదట్లో మొలకను అంకురింపజేసింది, తరువాత దానికి బలం చేకూర్చింది, ఆ తరువాత అది లావుగా ఏపుగా పెరిగింది, ఆపై తన కాండంపై నిలబడింది. రైతులను అది ఆనందపరుస్తుంది. అవిశ్వాసులు వారి వృద్ధి వికాసాలను చూసి అసూయపడాలని, విశ్వసించి సత్కార్యాలు చేసే ఈ వర్గం వారికి క్షమాభిక్షనూ, గొప్ప ప్రతిఫలాన్నీ ప్రసాదిస్తానని అల్లాహ్ వాగ్దానం చేశాడు.



## విషయసూచిక

| | | |
|---|---|---|
| **ఒక్కమాట** | ..... | 11 |
| **ప్రస్తావన** | ..... | 15 |
| మానవాళికి మార్గదర్శి | ..... | 15 |
| కారు చీకటిలో కాంతి కిరణం | ..... | 17 |
| మొలకెత్తిన విప్లవం | ..... | 23 |
| ఉద్యమం | ..... | 31 |
| ఉద్యమస్ఫూర్తి | ..... | 37 |
| మనిషిలో మార్పు | ..... | 40 |
| అనుపమాన త్యాగాలు | ..... | 42 |
| ప్రవక్త (స) జీవితాన్ని ఎలా అధ్యయనం చేయాలి? | ..... | 47 |
| **అధ్యాయం - 1** | | |
| **ముహమ్మద్ (స) రూపురేఖలు** | ..... | 56 |
| ముఖవర్చస్సు | ..... | 58 |
| వస్త్రధారణ | ..... | 62 |
| గృహ జీవనం | ..... | 67 |
| వ్యక్తిగత అలవాట్లు | ..... | 72 |
| భావావేశాలు | ..... | 73 |
| వినోదం | ..... | 77 |
| కొన్ని ప్రత్యేక గుణగణాలు | ..... | 79 |
| **అధ్యాయం - 2** | | |
| **మక్కా జీవితం** | ..... | 82 |
| దేవుడు ఒక్కడా వేలమంది దేవుళ్ళా? | ..... | 88 |
| రహస్య ప్రచారం మొదటి దశ | ..... | 90 |

బహిరంగ ప్రకటన ..... 92
హింసాత్మక వ్యతిరేకత ..... 94
వ్యవస్థీకృత వ్యతిరేకత ..... 102
తీవ్రమైన విద్వేషం ..... 114
అబిసీనియాకు వలస ..... 118
ఉమర్ ఇస్లామ్ స్వీకరణ ..... 123
సంఘ బహిష్కరణ ..... 127
స్వర్గారోహణ ..... 133
మక్కాకు వీడ్కోలు ..... 135


## అధ్యాయం – 3


**మదీనాలో జీవితం - మలుపు తిరిగిన చరిత్ర** ..... 139
స్వాగతం పలికిన మదీనా ..... 143
ఇస్లామీయ రాజ్యం ..... 147
యూదుల నమ్మకద్రోహం ..... 149
జవాబులేని ప్రశ్నలు ..... 153
ప్రజా ధనాగారం ..... 160
యూద కుట్రలు ..... 164
దుష్ప్రచారాలు ..... 166
హజ్రత్ ఆయెషా (రజి)పై విష ప్రచారం ..... 173
మేలు చేసిన కీడు ..... 178
హత్యా ప్రయత్నాలు ..... 184
ఖురైషుల కక్షసాధింపు ప్రయత్నాలు ..... 192




## అధ్యాయం – 4


**కరవాలాల ఛాయలో** ..... 201
ప్రవక్త (స) సైనిక విధానం ..... 210
వ్యూహాత్మక పరిస్థితి ..... 214
తదనంతర పరిణామాలు ..... 226
ముట్టడి ..... 243
హుదైబియా ఒప్పందం ..... 254
ఖైబర్ యుద్ధం ..... 263
మక్కా విజయం ..... 269
విజయం పరిపూర్ణం ..... 284


## అధ్యాయం – 5


**హేతుబద్ధవాదన** ..... 291
నైతిక బలం ..... 297


## అధ్యాయం – 6


**రాజకీయ ఒప్పందాలు** ..... 320
ఉద్యమ స్ఫూర్తి ..... 329


## అధ్యాయం – 7


**ప్రవక్త ముహమ్మద్ (స) సంబంధాలు** ..... 334
ప్రవక్త ముహమ్మద్ (స) వివాహాలు ..... 339
చివరి దశ ..... 345
అరఫాత్ ప్రసంగం ..... 348
గదీర్, ఉహుద్ చెరువుల వద్ద ..... 353

# మరో మాట

ప్రవక్త ముహమ్మద్ (స) పవిత్ర జీవితచరిత్ర గురించి అనేక పుస్తకాలు వచ్చాయి. భవిష్యత్తులో మరెన్నో పుస్తకాలు వస్తాయి. ఆయన మహోన్నత వ్యక్తిత్వాన్ని ఆవిష్కరించే ఈ జీవిత చరిత్రలను ఎన్ని సార్లు చదివినా తనివితీరదు. సత్యధర్మాన్ని ప్రజలకు చేరవేసిన ఆయన్ను ఒక బోధకునిగా, ఒక ప్రచారకునిగా, ఒక రాజ్యాధిపతిగా, ఒక జీవన వ్యవస్థ నిర్మాతగా, ఒక సంస్కర్తగా, అనూహ్య విజయాలు సాధించిన సేనానిగా వివిధ కోణాల్లో ఆయన జీవితాన్ని ప్రజలకు పరిచయం చేయవలసిన అవసరం ఎంతయినా ఉంది. ఈ విధంగా ఆయన గురించి ప్రచారంలో ఉన్న అనేక అపోహలు, అపార్థాలను దూరం చేయడమే కాదు ప్రపంచ చరిత్రను మలుపు తిప్పిన ఆ మహనీయుని ఉద్యమాన్ని, ఆయన స్థాపించిన సత్సమాజాన్ని, సుసమాజాన్ని స్థాపించిన ఉద్యమాన్ని కూడా మనం ప్రజలకు పరిచయం చేయగలం.

సాధారణంగా ఒక మత ప్రవక్త జీవిత చరిత్ర అంటే మహత్యాలతో నిండి ఉంటుందన్న భావన ఉంది. కాని ప్రవక్త ముహమ్మద్ (స) జీవిత చరిత్రలో మనకు మహ త్యాల ప్రస్తావనకు ప్రాముఖ్యం ఎక్కువగా కనబడదు. ప్రపంచ చరిత్రను మలుపు తిప్పిన మహోద్యమానికి ఆయన సారథ్యం వహించారు. ఒక ఉద్యమ గమనంలో ఎదురయ్యే ఆటుపోట్లు, ఒడిదుడుకులన్నీ మనకు ఆయన జీవితచరిత్రలో కనబడతాయి. ప్రవక్త ముహమ్మద్ (స) మానవాళికి సాఫల్యమార్గం చూపించడానికి ఈ ప్రపంచంలోకి వచ్చారే కాని మహత్యాలను ప్రదర్శించడానికి రాలేదు. రాజకీయంగా, సాంస్కృతికంగా, ఆర్థికంగా మానవాళికి మార్గదర్శనమిచ్చారాయన.

ప్రవక్త ముహమ్మద్ (స) జీవితచరిత్రను వివిధ కోణాల్లో ఆవిష్కరించిన పుస్తకాలు ఇంతకు ముందు అనేకం వచ్చినప్పటికీ **మౌలానా నయీమ్ సిద్దీఖీ** ఉర్దూలో రాసిన ఈ **'ముహ్‌సినె ఇన్సానియత్'** పుస్తకానికి ఒక ప్రత్యేకత ఉంది. మౌలానా నయీమ్ సిద్దీఖీ తన పుస్తకంలో ఉద్యమ సారథిగా ప్రవక్త (స) చూపించిన సమయస్ఫూర్తిని, దివ్యఖుర్‌ఆన్ బోధనలకు అనుగుణమైన సత్సమాజ స్థాపనాక్రమాన్ని మన ముందు ఆవిష్కరించారు. దివ్యఖుర్‌ఆన్‌ను స ిగా అర్థం చేసుకోవాలంటే ప్రవక్త ముహమ్మద్ (స) జీవితచరిత్రను అధ్యయనం చేయడం ఎంతో అవసరం. ఇలాంటి గొప్ప పుస్తకాన్ని తెలుగులో అనువదించే అవకాశం నాకు లభించడం నా సౌభాగ్యంగా భావిస్తున్నాను. అనువాదంలో ఏవయినా పొరబాట్లు దొర్లి ఉంటే క్షమించాలని పాఠకులను కోరుకుంటూ నాకు ఈ అవకాశాన్ని కల్పించిన తెలుగు ఇస్లామిక్ పబ్లికేషన్స్‌కు నా ధన్యవాదాలు తెలుపుకుంటున్నాను.

హైదరాబాద్  
మార్చి 18, 2013

**- అబ్దుల్ వాహెద్**



అనంతకరుణామయుడు, అపారకృపాశీలుడు అయిన అల్లాహ్ పేరుతో...

# ముందుమాట

ప్రతికాలంలోనూ మానవాళికి సత్యధర్మ సౌభాగ్యాలు కేవలం రెండే రెండు మార్గాల ద్వారా అందాయి. ఆ మార్గాలు ఒకటి దైవవాణి. రెండు దైవప్రవక్తలు (అస). అల్లాహ్ తన బోధనలు మానవాళి వద్దకు చేర్చడానికి, ప్రజలకు బోధించడానికి, ప్రచారం చేయడానికి, అర్థమయ్యేలా వివరించడానికి తన ప్రవక్తలను పంపాడు. అంతేకాదు, దైవబోధనలకు ఆచరణాత్మక ఉదాహరణగా, మార్గదర్శక జ్యోతులుగా కూడా వారిని భూమిపైకి పంపడం జరిగింది. ఆ విధంగా ప్రవక్తలు దైవాభీష్టాన్ని పరిపూర్ణంగా ప్రజలకు తెలియజేయడానికి, వ్యక్తులను, సమాజాన్ని సంస్కరించడానికి, గాడితప్పిన మానవజీవనాన్ని చక్కదిద్దడానికి, సత్సమాజ నిర్మాణం చేసి చూపడానికి అరుదెంచారు.

అ రెండు.. అంటే, దైవవాణి, దైవప్రవక్తలు.. అ రెంటినీ ఒకదానితో ఒకటి వేరు చేసి చూడడం సాధ్యం కాదు, ఇందులో ఏ ఒక్కటి లేకపోయినా మనిషికి ధర్మం గురించి సరయిన అవగాహన ప్రాప్తమయ్యే అవకాశం లేదు. హితబోధను పూర్తిగా గ్రహించి ప్రయోజనం పొందడం వీలుపడదు. దైవప్రవక్త లేకుండా కేవలం దైవగ్రంథం మాత్రమే ఉండడం అంటే ఆ పరిస్థితి – సరంగు లేకుండా నావలో ప్రయాణించడం వంటిది. నావ గురించి తెలియని సగటు మనిషి జీవన సముద్రంలో ఆ నావపై ఎన్ని చక్కర్లు కొట్టినా తన గమ్యానికి చేరుకోలేడు. అలాగే దైవగ్రంథం లేకుండా కేవలం దైవప్రవక్త మాత్రమే ఉంటే ఆ పరిస్థితి – దైవమార్గం ఏదో తెలుసుకునే బదులు మనిషి మార్గదర్శినే దేవుడుగా భావించే పరిస్థితి ఏర్పడుతుంది. అనేక జాతులను పరిశీలిస్తే ఈ ఫలితాలు మనకు స్పష్టంగా కనబడతాయి.

ప్రతికాలంలోను మనిషి సన్మార్గాన్ని, సత్యపథాన్ని గ్రహించాలంటే ఈ రెండు మార్గాలు తప్పనిసరి. ఒకటి దైవవాణి. ఇప్పుడు ఎలాంటి మార్పులు, చేర్పులు లేకుండా స్వచ్ఛమైన రూపంలో మానవాళి అందరి కొరకు అందుబాటులో ఉన్న దివ్యగ్రంథం ఖుర్‌ఆన్. రెండవ మార్గం చివరి ప్రవక్త ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లమ్ జీవితం ఆచరణాత్మక ఉదాహరణగా మన ముందుంది. కాబట్టి మనిషి సత్యధర్మం గురించి అవగాహన చేసుకోవాలంటే, దివ్యవాణి ఖుర్‌ఆన్‌ను ప్రవక్త ముహమ్మద్ (స) జీవిత చరిత్రతో కలిపి చదవాలి. అలాగే ప్రవక్త ముహమ్మద్ (స) జీవితచరిత్రలో ఖుర్‌ఆన్ బోధనల ఆచరణాత్మక ఉదాహరణలను గ్రహిస్తూ చదవాలి. ఈ విధంగా ఈ రెంటినీ కలిపి చదవడం ద్వారా మాత్రమే ధర్మం గురించిన

సరయిన అవగాహన మనకు లభిస్తుంది. లేకపోతే ధర్మం గురించిన అవగాహన లోపించడం, ఫలితంగా హితబోధను సరిగా తెలుసుకోలేకపోవడం జరగవచ్చు. దివ్యఖుర్ఆన్, ప్రవక్త ముహమ్మద్(స) – ఈ రెండు మార్గాల గమ్యం ఒక్కటే. లక్ష్యం ఒక్కటే. ఉద్దేశ్యం ఒక్కటే. కాబట్టి ఈ రెండింటిని అర్థం చేసుకోవాలంటే, ఈ గమ్యం గురించి, లక్ష్యం గురించి, ఉద్దేశ్యం గురించి తెలుసుకోవడం కూడా అవసరం. లక్ష్యం, ఉద్దేశ్యాల గురించిన అవగాహన లేకుండా చదివితే, దివ్యఖుర్ఆన్ లోని కొన్ని బోధనల పుస్తకంగాను, ప్రవక్త (స) జీవితచరిత్ర కొన్ని సంఘటనల సమాహారం గాను కనబడుతుంది. ఆ విధంగా చదవడం వల్ల మనిషి విశ్లేషణలు, వ్యాఖ్యానాలు రాయగలడు, చారిత్రక పరిశోధనల పాండిత్యాన్ని ప్రదర్శించగలడు. ప్రవక్త (స) జీవిత చరిత్ర గురించి వివిధ సంఘటనల గురించి తెలుసుకోగలడు కాని సత్యధర్మ సారం ఏమిటో తెలుసుకోవడం సాధ్యంకాదు. ఎందుకంటే, సత్యధర్మం అన్నది కేవలం కొన్ని బోధనల్లోను, కొన్ని సంఘటనల్లోను లేదు. దివ్యఖుర్ఆన్ ఏ లక్ష్యంతో, ఏ ఉద్దేశ్యంతో అవతరించించిందో ఆ లక్ష్యం, ఆ ఉద్దేశ్యాలకు సంబంధించినది. ప్రవక్త ముహమ్మద్ (స)ను ఆ లక్ష్య సాధన కోసమే పంపడం జరిగింది. లక్ష్యం గురించి, ఉద్దేశ్యం గురించి అవగాహన ఎంత స్పష్టంగా ఉంటే దివ్యఖుర్ఆన్, ప్రవక్త జీవిత చరిత్రను అర్థం చేసుకోవడం అంత స్పష్టంగా వుంటుంది.

మరో వాస్తవమేమంటే, దివ్యఖుర్ఆన్, ప్రవక్త (స) జీవితచరిత్ర ఈ రెండు కూడా చెలియలికట్ట లేని కడలి వంటివి. వీటిని సంపూర్ణంగా అధ్యయనం చేసానని గాని, వీటి అంతరార్థాలను పూర్తిగా అవగాహన చేసుకున్నానని గాని ఎవరూ చెప్పలేరు. అయితే, మనిషి తన శక్తిమేరకు సాధ్యమైనంత ఎక్కువగా ఈ రెండింటిని అవగాహన చేసుకోవడానికి, అర్థ తాత్పర్యాలను గ్రహించడానికి ప్రయత్నం చేయాలి. ఆ విధంగా సత్యధర్మ సారం తెలుసుకునే కృషి కొనసాగించాలి.

మౌలానా నయీమ్ సిద్దీఖీ రాసిన పుస్తకం ఎంతయినా అభినందించదగ్గది. ఈ సందర్భంగా నా ప్రయత్నం ఒక్కటే, నయీమ్ సిద్దీఖీ గారు సుదీర్ఘకాలం ఎంతో శ్రమించి ప్రవక్త (స) జీవితచరిత్రపై ఈ పుస్తకం రాసి అల్లాహ్ ప్రసన్నత పొందడానికి చేసిన ఈ ప్రయత్నంలో నేను కూడా కొంత భాగం పంచుకోవాలనుకుంటున్నాను. ఈ పుస్తకాన్ని చదివే వ్యక్తి ఈ పుస్తకాన్ని చదివే ముందు ప్రవక్త (స) జీవితచరిత్ర ఏ లక్ష్యంతో, ఏ ఉద్దేశ్యంతో చదవాలన్నది ముందుగా స్పష్టంగా అర్థం చేసుకోవాలి. అప్పుడే నయీమ్ సిద్దీఖీ గారు శ్రమించి రాసిన పుస్తకం వల్ల ఎక్కువ ప్రయోజనం పొందగలుగుతాము.

**– అబుల్ ఆలా**

**లాహోర్, 8 మే 1960**



# ఒక్కమాట

ప్రవక్త ముహమ్మద్ (స) జీవిత చరిత్రపై మరిన్ని వివరణాత్మక గ్రంథాలు రావలసిన అవసరం ఎంతయినా ఉంది. పవిత్రమైన ఆ జీవితచరిత్ర ప్రస్తావన ఎన్నిసార్లు చేసినా మనసుకు సంతృప్తి కలుగదు. పవిత్రమైన ఆయన జీవితం గురించి తెలుసుకోవాలన్న కోరిక మిగిలే ఉంటుంది. మాటల ద్వారా, రాతల ద్వారా ప్రవక్త జీవిత చరిత్రను పదిమందికి పరిచయం చేయడం, ప్రచారం చేయడానికి మించిన మహత్కార్యం మరేదీ ఉండదు. అనేక సంవత్సరాలుగా అనేక ప్రసంగాల్లో ఆ పవిత్ర జీవితం గురించిన ప్రస్తావనలు వచ్చినా, వేలాది పేజీలు ఆయన జీవితం గురించి రాయబడినా ఇంకా ఆయన గురించి మాట్లాడాలన్న తపన, ఆయన గురించి రాయా లన్న ఆకాంక్ష తీరవు. మానవాళికి కారుణ్యమూర్తిగా అవతరించిన ఆ మహానుభావుని జీవితచరిత్రను సంపూర్ణంగా, సమగ్రంగా అన్ని కోణాల్లో రాయగలిగామని చెప్పే సాహసం ఎవరూ చేయలేరు. ఇప్పటి వరకు అలా చెప్పే ధైర్యం ఎవరూ చేయలేదు. ప్రవక్త ముహమ్మద్ జీవిత చరిత్రను రాయాలన్న సంకల్పం చేసుకున్న ప్రతి ఒక్కరు ఆ విధంగా శ్రేయోశుభాలను పొందడానికే ప్రయత్నం చేశారు.

"సీరత్ ఇబ్నే ఇస్హాఖ్" భాష్యకారుడు అబ్దుర్రహ్మాన్ సుహేల్ (మరణం హి. శ. 185) రాసిన "రోజె అలాయఫ్" కాని, హాఫిజ్ బ్దుల్ మొమిన్ దమియాతి (హి. శ. 705) రాసిన సీరత్ దమియాతి కాని, ఇలాంటి ఇంకా అనేక పుస్తకాలు కాని లేక హాఫీజ్ ఇబ్నెజౌజి రాసిన షర్ఫుల్ ముస్తఫా సీరత్ అబ్దుబ్బర్, ఇబ్నె సయ్యదున్నాస్ "ఈదనుల్ అసర్", ఖస్తలానీ "మువాహిబుల్ దునియా", ఈ పుస్తకానికి భాష్యం "జర్ఖస్లానీ అల్ మువాహిబ్", షిబ్లి నూమానీ, సయ్యద్ సులైమాన్ నద్వీలు రాసిన సీరత్ పుస్తకాలు కానీ, ఖాజీ సులైమాన్ మన్సూర్పురి రాసిన "రహ్మతుల్లిల్ ఆలమీన్" కాని – ఈ సీరత్ (ప్రవక్త (స) జీవితచరిత్ర) పుస్తకాలు రాసిన రచయితలందరి ప్రయత్నాలు శుభప్రదమైనవి, అభినందించదగ్గవి. ఈ పెద్దలు చరిత్ర రచనలో, జీవిత చరిత్ర

రచనలో గొప్ప సామర్థ్యాన్ని ప్రదర్శించారు. కాని ఈ పెద్దలు ఎవరు కూడా ప్రవక్త (స) జీవిత చరిత్రను సమగ్రంగా, సంపూర్ణంగా అక్షరబద్ధం చేశామని చెప్పుకునే ధైర్యం చేయలేదు. తమ పుస్తకం ప్రవక్త (స) జీవితంపై సంపూర్ణమైనదని ప్రకటించనూ లేదు. గమనించవలసిన విషయమేమంటే, ప్రవక్త (స) జీవితచరిత్రపై వచ్చిన ఈ పుస్తకాలన్నీ ఒకేవిధమైనవి కావు. ప్రామాణికత దృష్ట్యా కూడా ఇందులో తేడాలున్నాయి. కొందరు రచయితలు ప్రవక్త (స) జీవితాన్ని అక్షరబద్ధం చేస్తున్నప్పుడు పరిశోధనకు, ప్రామాణికతకు ప్రాముఖ్యం ఇవ్వలేదు. ప్రవక్త (స) జీవితానికి సంబంధించినదిగా తమ ముందుకు వచ్చిన ప్రతి ఒక్క సమాచారాన్ని పొందుపరిచారు. ఈ క్రమంలో కల్పితాలు కూడా జీవితచరిత్రలో భాగాలుగా వచ్చేశాయి. ఫలితంగా ఈ కల్పిత కథనాలు కూడా జీవిత చరిత్రలుగా సాధారణ ముస్లిముల్లో ప్రచారం పొందాయి. మిలాదున్నబీ సభలు సమావేశాల్లో ఈ కల్పిత కథనాలే వినిపించే పరిస్థితి కనిపిస్తోంది.

ప్రముఖ ఉర్దూ సాహితీవేత్త నయీమ్ సిద్దీఖీ కూడా సీరత్‌పై రచనలు చేశారు. ప్రవక్త (స) జీవిత చరిత్రపై తన శక్తిసామర్థ్యాల మేరకు పుస్తకం రాసి, ప్రవక్త (స) పట్ల తన ప్రేమాభిమానాలను ప్రకటించి శ్రేయోశుభాలు పొందారు. ఇది ఒక పెద్ద సౌభాగ్యం. దేవుని దయవల్ల ఆయనకు ఈ సౌభాగ్యం లభించింది.

ప్రపంచంలో చాలా మంది ముస్లిమ్ కవులు, రచయితలు, సాహిత్యకారులు ఉన్నారు. అయితే ఇస్లామ్ కోసం రచనలు చేసిన వారు అందులో చాలా తక్కువ. నయీమ్ సిద్దీకీ తలచుకుంటే సినిమా కథలు కూడా రాయగలిగి ఉండేవారు. ఆ విధంగా ఆయన పేరు ప్రఖ్యాతులు, ధనసంపదలు సంపాదించుకోగలిగి ఉండేవారు. కాని ఆయన కలం పవిత్రమైన రాతలకే ప్రాముఖ్యం ఇచ్చింది. పెద్ద పెద్ద రచయితలు, కవుల కలాల మాదిరిగా జిలుగు వెలుగుల ఆకర్షణలవైపు ఆయన కలం మొగ్గు చూపలేదు. ప్రాపంచిక కీర్తి ప్రతిష్ఠలు, ధనసంపదల వైపు నయీమ్ సిద్దీఖీ గారు కన్నెత్తి చూడలేదు. సత్యం కోసం పాటుపడ్డారు. సత్యధర్మం కోసం రాశారు. ఈ మార్గంలో ఆయన ఇబ్బందులు కష్టాలు ఎదురైనా చలించలేదు. ఆర్థిక కష్టాలను చిరునవ్వుతో భరించారు. ఈ పరీక్షలను తట్టుకోవడం వల్లనే ఆయన జీవితంలో వన్నె వచ్చింది. ఆయన భాషలో పటుత్వం వచ్చింది. ఆయన రాతల్లో బలం వచ్చింది.



ఆయన రాసిన "ముహ్‌సినె ఇన్సానియత్" అనే పుస్తకం ప్రవక్త (స) జీవితచరిత్రపై ఒక గొప్ప పుస్తకం. ఈ పుస్తకంలో నయీమ్ సిద్దీఖీ కలం ఎంత పవిత్రమైనదో, ఆయన ఆలోచనలు ఎంత పరిశుభ్రమైనవో, మనసు ఎంత నిర్మలమైనదో, హృదయం ఎంత స్వచ్ఛమైనదో స్పష్టంగా మనకు తెలుస్తుంది. ఈ పుస్తకంలో ప్రతి ఒక్క పంక్తిలో ప్రవక్త (స) పట్ల ఆయనకున్న ప్రేమాభిమానాల సువాసన గుబాళిస్తుంది. ప్రతి ఒక్క పుటలో ప్రవక్త (స) పట్ల ఆయన విశ్వాసకాంతులు ప్రకాశిస్తున్నాయి. చరిత్రకారుడెవ్వడూ జరిగిన సంఘటనల్లో తన తరఫున ఎక్కువ తక్కువ చేయలేడు. సంఘటనలను అక్షరబద్ధం చేయడానికి సంబంధించి చరిత్రకారుడెవ్వడూ గ్రంథకర్త కాదు, కేవలం సంకలనకర్త మాత్రమే. అయితే ఆ సంఘటనలను ఒక క్రమంలో అల్లుకురావడంలోనూ, సంఘటనలను చెప్పే విధానం లోను చరిత్రకారుడి సామర్థ్యం బయటపడుతుంది. ఈ దృష్టితో చూస్తే నయీమ్ సిద్దీఖీ రాసిన ఈ పుస్తకం ఆయనకు భాషపై ఉన్న పట్టును, శిల్పంపై ఉన్న సామర్థ్యాన్ని, ఆయన ఆలోచనల స్వచ్ఛతను, ధార్మిక దృష్టినీ రచనా పాటవాన్ని చాటి చెబుతుంది.

నయీమ్ సిద్దీఖీ ప్రవక్త (స) జీవిత చరిత్ర రచనలో వివిధ సంఘటనలను కూర్చే క్రమంలో చాలా జాగ్రత్తలు తీసుకున్నారు. కల్పితాలేవీ తన పుస్తకంలో చోటు చేసుకోకుండా, కేవలం స్వచ్ఛమైన ముత్యాల వంటి నిజమైన సంఘటనలు, ప్రామాణికమైన సంఘటనలు మాత్రమే తన పుస్తకంలో ఉండేలా పరిశోధనతో ఈ పుస్తకం రాశారు. ఆ విధంగా కారుణ్యమూర్తి ప్రవక్త ముహమ్మద్ (స) జీవితచరిత్ర సమగ్రంగా, ప్రామాణిక ఆధారాలతో పాఠకుల ముందుకు వచ్చేలా చేశారు. మహత్యాలు, మహిమల ప్రస్తావన లేకుండా కూడా ఆధ్యాత్మిక విప్లవం సాధించిన ప్రవక్త ముహమ్మద్ (స) పట్ల విధేయత చూపడానికి కావలసిన సామగ్రిని ఆయన అందజేశారు. ప్రవక్త (స) జీవితం ఎంత పవిత్రమైనదో, ఎంత ఉత్తేజకరమైనదో ఈ పుస్తకం చాటి చెబుతుంది.

ప్రవక్త (స) ప్రదర్శించిన మహత్యాలను నయీమ్ సిద్దీఖీ నిరాకరిస్తున్నారని ఈ పంక్తులకు అర్థం కాదు. ప్రవక్త (స) యావత్తు మానవాళి కోసం, సాధారణ ప్రజల కోసం, వారికి సాఫల్య మార్గం చూపడానికి ఈ ప్రపంచంలోకి వచ్చారు. అంతేకాని కేవలం మహిమలు, మహత్యాలు చూపడానికి ప్రపంచంలోకి రాలేదు.

మానవాళి జీవన విధానం తెలుసుకోవడానికి అత్యుత్తమ ఉదాహరణ ఆయన జీవన విధానంలోనే ఉంది. మహిమలు, మహత్యాలలో కాదు. నయీమ్ సిద్దీఖీ రాసిన "ముహ్సినె ఇన్సానియత్" హృద్యమైన భాష, ఆకట్టుకునే శైలి, చక్కని ఒరవడి, పూలదండలా ఆకర్షణీయంగా పేర్చిన సంఘటనల కూర్పుతో చదువరులను మంత్రముగ్ధులుగా చేస్తుంది.

ప్రవక్త (స) జీవిత చరిత్రపై ఉర్దూలోనే కాదు ఇతర భాషల్లో కూడా అనేక పుస్తకాలు వచ్చాయి. ఆయా పుస్తకాలు చదివిన వారు "ముహ్సినె ఇన్సానియత్" చదివి దీని ప్రత్యేకతను తప్పక గుర్తిస్తారు. ఈ పుస్తకానికి ఇన్షాఅల్లాహ్ ప్రజాదరణ లభిస్తుందని నమ్ముతున్నాను.

నయీమ్ సిద్దీఖీ కాగితాలపై రాసిన అక్షరాలు ఇన్షాఅల్లాహ్ ప్రజల హృదయాలపై ముద్రించబడతాయని, ఆ విధంగా ఆయన చేసిన ప్రయత్నం, ఆయన పేరు పదికాలాల పాటు నిలబడతాయని విశ్వసిస్తున్నాను.

మాహిరుల్ ఖాద్రి

**కరాచీ, అక్టోబర్ 5, 1959**



# ప్రస్తావన

## సందేశం లక్ష్యం చారిత్రక ప్రదేశం

ప్రవక్త ముహమ్మద్ (స) జీవిత చరిత్రను చదివే ముందు మనం ప్రవక్త (స) నడిపిన ఉద్యమం గురించి స్పష్టమైన అవగాహనకు రావడం అవసరం. ఆయన ఏ మహత్కార్య సాధనకు ప్రపంచంలో పంపబడ్డారో ఆ మహత్కార్యం గురించి తెలుసుకోవడం అవసరం. ఆయన జీవితాంతం ఆ లక్ష్య సాధన కోసమే పోరాడారు. ఆయన జీవితం ఒక విశ్వజనీన ఉద్యమ గాథ. ఆయన జీవితం దివ్యఖుర్ఆన్ బోధించిన శాశ్వత సూత్రాలకు ఆచరణాత్మక ఉదాహరణ. ప్రవక్త ఆదమ్ (అస), ప్రవక్త ఇబ్రాహీమ్ (అస), ప్రవక్త మూసా (అస), ప్రవక్త ఈసా (అస) ఇతర ప్రవక్తలందరు ఏ ఆధ్యాత్మిక సందేశాన్ని తీసుకువచ్చారో, ప్రచారం చేసారో దానికి ముగింపు ప్రవక్త ముహమ్మద్(స) జీవితం. ప్రవక్త (స) ఏ ఉద్యమాన్ని నడిపారో దాని గురించి అవగాహన, ఆ ఉద్యమ స్వరూప స్వభావాల పరిజ్ఞానం, ఆ ఉద్యమ పరిధి గురించి ఎరుక లేకపోతే మనం ప్రవక్త (స) జీవిత చరిత్రను సంకలనం చేయలేము. వివిధ సంఘటనలకు దారితీసిన కారణాలను అర్థం చేసుకోలేము, ప్రవక్త (స) జీవిత చరిత్ర అధ్యయన లక్ష్యం గ్రహించలేము.

## మానవాళికి మార్గదర్శి

చరిత్ర అధ్యయనంలో అనేక మంది ప్రముఖుల గురించి తెలుస్తుంది. కొందరు మృదుభాషణంతో అందరినీ ఆకట్టుకున్నవారు, ఉత్తేజభరితమైన ప్రసంగాలతో ఉగ్రరూపం దాల్చినవారు — ఉగ్రరూతలూగించినవారు, తత్వవేత్తలు అనేకమంది ప్రతికాలంలోను కనబడతారు. రాజులు, చక్రవర్తులు ఎంతో మంది కనబడతారు. గొప్ప గొప్ప సామ్రాజ్యాలను వారు స్థాపించారు. సామ్రాజ్యవిస్తరణ కాంక్షతో సైన్యాలు నడిపి అనేక రాజ్యాలను ఆక్రమించుకున్నవారు ఎందరో ఉన్నారు. అలాగే, నాగరికతా వికాసానికి తోడ్పడిన మేధావులు ఎంతోమంది మనకు చరిత్రలో కనబడతారు. విప్లవ ఉద్యమాలను నడిపి మార్పులు సాధించినవారు, సంస్కర్తలు ఇలా ఎందరో మనకు చరిత్ర

అధ్యయనంలో కానవస్తారు. విభిన్న మతధర్మాలను బోధించినవారు ఉన్నారు. నైతిక ప్రమాణాలకు పెద్దపీట వేసిన వారు ఉన్నారు. కాని వారి బోధనలు, వారు సాధించిన విజయాలు, ఫలితాలు పరిశీలిస్తే అందులో సమాజ శ్రేయోశుభాలు బహుకొద్దిగా మాత్రమే కానవస్తాయి. ఏదో ఒక జీవన రంగానికి మాత్రమే ఈ ఫలితాలు పరిమితమై ఉంటాయి. ఆ ప్రయోజనాలతో పాటు కొన్ని అవాంఛనీయమైన ధోరణులు కూడా అక్కడ కనబడతాయి. మానవ చరిత్రలో మనిషి జీవితాన్ని సంపూర్ణంగా, అన్ని రంగాల్లో సంస్కరించిన వారు కేవలం ప్రవక్తలు తప్ప మరెవ్వరూ లేరు. మనిషి అంతరంగాన్ని, మనిషి బాహ్య ఆచరణలను సమస్తాన్ని చక్కదిద్దినవారు ప్రవక్తలు మాత్రమే.

ప్రవక్త ముహమ్మద్ (స) జీవితలక్ష్యం కూడా ఇదే. ఆయన సందేశం మనిషి జీవితాన్ని, సామాజిక జీవితాన్ని, వ్యక్తిగత జీవితాన్ని సంపూర్ణంగా మార్చివేసింది. మనిషి అంతరంగంలో మార్పులు సాధించింది. ఆరాధనాస్థలమైన మస్జిదు మొదలు ఆర్థిక కార్యకలాపాలు కొనసాగే మార్కెట్టు వరకు, పాఠశాల నుంచి న్యాయస్థానం వరకు, ఇంటి నుంచి యుద్ధరంగం వరకు అన్ని చోట్ల దైవభీతి, దైవభక్తి అలుము కున్నాయి. ప్రజల ఆలోచనా విధానం మారింది. భావాలు మారాయి. భావావేశాల్లో మార్పు వచ్చింది. ధృక్కోణం మారింది. అలవాట్లు మారాయి. ఆచరణలు మారాయి. ఆచారాలు, సంప్రదాయాలు మారిపోయాయి. హక్కులు, బాధ్యతల తీరుతెన్నులు మార్పుకు గురయ్యాయి. మంచి చెడు ప్రమాణాలు, ధర్మబద్ధం, ధర్మనిషిద్ధం అన్న కొలమానాలు మారిపోయాయి. నైతికవిలువలు, సంవిధాన సూత్రాలు, శాసనాలు, యుద్ధనియమాలు, శాంతి విధానాలు అన్నీ మారిపోయాయి. ఉపాధి మార్గాలు, దాంపత్య నియమాలు పూర్తిగా మారిపోయాయి. నాగరికత, సామాజిక జీవనాలకు సంబంధించిన సమస్త రంగాలు విప్లవాత్మక మార్పుకు గురయ్యాయి. జీవనరంగా లన్నింటినీ అలుముకున్న మార్పు ఇది. ఈ మార్పుల్లో ప్రతిచోట మనకు శ్రేయోశు భాలే కనబడతాయి. ఈ మార్పుల్లో ఎక్కడా చెడు మచ్చుకు కూడా కనబడదు. ఎక్కడా హాని అగుపడదు. ఎక్కడా విచ్ఛిన్నం లేదు. అన్ని వైపులా నిర్మాణమే. ఎటు చూసినా ప్రగతి వికాసాలే. నిజం చెప్పాలంటే మానవాళికి మార్గదర్శి అయిన ప్రవక్త ముహమ్మద్ (స) వల్ల యావత్తు మానవ జీవితానికి సరికొత్త జీవితం లభించింది. ప్రవక్త ముహమ్మద్ (స) వల్ల మానవాళికి ఒక కొత్త ఉదయం ప్రాప్తమయ్యింది. విశ్వజనీన సోదరభావానికి పునాదులు పడ్డాయి. చరిత్రలో నూతన అధ్యాయం ప్రారంభమయ్యింది. ఆయన సాధించిన ఈ మహత్కార్యం చరిత్రలో సాటిలేనిది.



ఇలాంటి మరో ఉదాహరణ మరే కాలంలోను కనబడదు.

మానవాళికి మార్గదర్శి ప్రవక్త ముహమ్మద్ (స) జన్మించిన నాటి పరిస్థితులను మనం పరిశీలిస్తే, అప్పుడు పూర్తి ప్రపంచం చీకటిలో కూరుకుపోయిందని తెలుస్తుంది. కొన్ని చోట్ల ప్రజలు నిత్యం భయభీతుల్లో బతుకుతుంటే, మరి కొన్ని చోట్ల విగ్రహారాధన, బహుదైవారాధనలు ప్రబలమై ఉండేవి. ఈజిప్టు, భారతదేశం, బాబిలోనియా, గ్రీకు, చైనా - ప్రతి చోట చీకటి తెరలే అలుముకున్నాయి. రోమ్ పర్షియాల్లో నాగరికత మినుకు మినుకు మంటున్న పరిస్థితి. రోమన్ సామ్రాజ్యం, పర్షియా సామ్రాజ్యాలు పెద్ద సామ్రాజ్యాలుగా ఉన్నప్పటికీ, వాటి గొప్పదనం పైకి కనిపించే తళుకు బెళుకులకే పరిమితమైంది. కాని ఈ సామ్రాజ్యాల మహా ప్రసాదాల్లో హీనమైన దౌర్జన్యాలు, దుర్మార్గాలు అడ్డు అదుపు లేకుండా కొనసాగేవి. ఎటు చూసినా సగటు మనిషి జీవితం గాయాలపాలయ్యింది. మానవత్వం కొన ఊపిరితో కొట్టుకుంటున్న పరిస్థితులవి. భగవదంశతో పుట్టామని రాజులు చెప్పుకునేవారు. కొందరు పాలకులు మరికాస్త ముందుకు వెళ్ళి ఎవరికి వారు దేవుళ్ళుగా ప్రకటించు కున్నారు. జాగీరుదార్లు, జమిందారులు, మతపెద్దలు, పాలకులతో కుమ్మక్కయ్యేవారు. రోమ్‌లోను, పర్షియాలోను ఈ పాలకవర్గాలు సాధారణ ప్రజాజీవనాన్ని దుర్భరం చేశారు. ప్రజల నడుం విరగ్గొట్టే పన్నులు ఒకవైపు, లంచాలు మరోవైపు, శిస్తులు, రకరకాల వసూళ్ళు ఇలా ప్రజలను జలగల్లా పీడించేవారు. జంతువుల్లా వెట్టిచాకిరీ చేయించేవారు. బానిసలుగా మార్చేవారు. ప్రజల సమస్యల పట్ల ఈ పాలకులకు ఎలాంటి ఆసక్తి ఉండేది కాదు. ప్రజల కష్టాల పట్ల సానుభూతి శూన్యం. సమస్యలకు, కష్టాలకు పాలకుల వద్ద ఎలాంటి పరిష్కారాలు ఉండేవి కావు. ఈ కులీన వర్గాల భోగభాగాల్యకు, వారి విలాసాలకు సాధారణ ప్రజలు బలిపశువులయ్యేవారు. ఎక్కడా నైతిక ప్రమాణాలు, నీతి సూత్రాలు కనబడేవి కావు.

## కారుచీకటిలో కాంతి కిరణం

ప్రవక్త ముహమ్మద్ (స) జన్మించిన ఆ కాలంలో యావత్తు ప్రపంచం అజ్ఞానాంధకారంలో కొట్టుమిట్టాడుతూ ఉంది. బహుదైవారాధక విశ్వాసం సర్వ సామాన్యంగా కనబడేది. విగ్రహారాధన ప్రబలంగా ఉండేది. నాగరిక జీవనం పునాదు లకు అజ్ఞానం చీడ పట్టింది. ఈజిప్టు నుంచి ఇండియా వరకు, గ్రీకు నుంచి చైనా వరకు అప్పటి ప్రపంచంలో నాగరికతా కాంతులు మసకబారసాగాయి. రోము, పర్షియా సామ్రాజ్యాలు నియంతృత్వ ఉక్కు పాదాల క్రింద నలిగిపోయిన కాలం

అది. మానవత్వం తలదాచుకునే నీడ కూడా కరువైన కాలం అది. ఎటు చూసినా దౌర్జన్యం, అణిచివేతలు, దుర్మార్గాలు, బీభత్సం తాండవించిన కాలం అది. పాలకులు తమను తాము దేవుని ప్రతినిధులుగా ప్రకటించుకునేవారు. అంతేకాదు, మరో అడుగు ముందుకు వేసి తామే దేవుళ్ళుగా చాటింపు వేసుకునేవారు. ఈ చక్రవర్తుల అడుగులకు మడుగులొత్తుతూ సామంత రాజ్యాలు, ధార్మిక కేంద్రాలు ఉండేవి. వీరంతా కలిసి సాధారణ ప్రజల జీవితాన్ని దుర్భరం చేసేశారు. ప్రజల నెత్తిన మోయలేని పన్నుల భారం ఉండేది. లంచాలు లేనిదే ప్రభుత్వోద్యోగులు పనులు చేసేవారు కాదు. ప్రభువులకు ఇష్టం వచ్చినప్పుడు బలవంతంగా ప్రజలతో వెట్టి చాకిరీ చేయించుకునేవారు. సమాజంలో సర్వసమాన్యమైపోయిన ఈ రుగ్మతలను పారద్రోలాలన్న ఆలోచన కూడా ఎవరిలోను కనబడేది కాదు. ఈ పరిస్థితులను చక్కదిద్దే పరిష్కారం కనుచూపు మేరలో అగుపించని కాలం అది. విలాసాలకు, భోగాలకు అలవాటు పడిన ప్రభువులు నైతిక నియమాలను తుంగల్లో తొక్కి ఇష్టా రాజ్యంగా వ్యవహరించేవారు. నీతినియమాలు పట్టించుకునేవారు కాదు. మరోవైపు యుద్ధాలు, పోరాటాలతో తరచూ వినాశాలు చవిచూడవలసి వచ్చేది. యుద్ధాల వల్ల తరచూ పాలకవర్గం మారిపోతూ ఉండేది. ఈ మార్పులు సాధారణ ప్రజలకు ఎలాంటి ఊరడింపు కలిగించేవి కాదు, సరికదా వారి జీవనాన్ని మరింత కఠినతరం చేసేవి. కొత్త పాలకులు సరికొత్త అణిచివేతలకు పాల్పడేవారు. రోము, పర్షియా సామ్రాజ్యాలు ఎల్లప్పుడూ యుద్ధాల్లో మునిగితేలుగూ ఉండేవి. పెద్ద పెద్ద భూభాగాలు ఒక సామ్రాజ్యం చేతుల్లోంచి మరో సామ్రాజ్యం చేతుల్లోకి మారుతూ ఉండేవి. ఒక సామ్రాజ్యం భూభాగాలను ఆక్రమించుకున్న మరో సామ్రాజ్యం అక్కడ తన అధికారాన్ని స్థిరం చేసుకోవడంతో పాటు, అక్కడ ప్రజలపై దుర్మార్గపు అణిచి వేతలు అధికం చేసేది. ఈ పరిణామాల ఫలితంగా ఆరాధనాలయాల స్వభావమే మారిపోయింది. ఆరాధనాలయాలు దైవారాధనకు కాక పాలకుల స్తుతిగానాలకు కేంద్రాలుగా, విజేతలను ఆరాధించే నిలయాలుగా మారిపోయాయి. ప్రపంచ వ్యాప్తంగా సాయుధ ఘర్షణలు ఎటు చూసినా కనబడేవి. ఈ ఘర్షణల్లో మానవత్వం నలిగిపోయేది. అమాయక ప్రజలు మాడి మసయ్యేవారు. సాధారణ ప్రజలకు మౌలిక జీవిత అవసరాలు సయితం లభించేవి కాదు. కనీసం నిరసన స్వరం వినిపించే స్వేచ్ఛ కూడా ఉండేది కాదు. ఆపాటి శక్తి కూడా సాధారణ ప్రజల్లో లేదు. మనస్సాక్షిని అనుసరించే స్వేచ్ఛ అన్నది నాడు ఎవరికీ తెలియని విషయం. వ్యక్తిగత స్వేచ్ఛకు ఎలాంటి స్థానమూ లేదు. మానవ సమాజాలు అంధకారంలో కొట్టుమిట్టాడుతున్న



కాలం అది. ఎక్కడ కూడా మిణుకు మిణుకు మనే ఆశ కనబడేది కాదు. ఏ మతమూ, ఏ సిద్ధాంతమూ వెలుగు బాట చూపించలేదు. రుషులు, ధర్మవేత్తలు, ప్రవక్తల బోధన లన్నీ మార్పులు చేర్పులకు గురైపోయాయి. ఆధిపత్యం ఉన్నవారికి అనుకూలంగా మతగ్రంథాలకు వివరణలు తయారయ్యాయి. కొద్దోగొప్పో మిగిలిన మతబోధనలు కూడా మతసంస్థలకు వ్యాపార సాధనాలుగా మారిపోయాయి. ఈ మతసంస్థలు పాలకవర్గాలతో కుమ్మక్కై ఉండేవి. గ్రీకు తత్వశాస్త్రం కాంతిహీనమై పోయింది. కన్ఫ్యూషియస్, మని తదితరుల బోధనలను ప్రజలు మరిచిపోయారు. బౌద్ధ, వైదిక సిద్ధాంతాలకు కొత్త భాష్యాలు పుట్టుకొచ్చాయి. యావత్తు మానవాళి నిరాశ, నిస్పృహల్లో కూరుకుపోయింది. ఈ చీకటి ఊబి నుంచి బయటపడే మార్గం తెలియక కొట్టు మిట్టాడసాగింది. ఈ సంక్షోభం పరాకాష్ఠకు చేరుకున్న కాలంలో మానవాళి బాధలకు ఉపశమనంగా కారుణ్యకెరటం ప్రవక్త ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లమ్ జన్మించారు.

ప్రవక్త ముహమ్మద్ (స) జన్మించిన దేశం, అరబ్బు భూభాగం ఆ కాలంలో నైతికంగా అధోపాతాళానికి పతనమై ఉంది. అరబ్బు నేలపై ఒకప్పుడు గొప్ప నాగరికతలుగా వెలిసిల్లిన ఉర్, నైనివా, ఆద్, సమూద్, ఈడెన్, సబా వగైరా నాగరికతలన్నీ చరిత్ర గర్భంలో కలిసిపోయాయి. అరేబియా యావత్తు ఆటవిక రాజ్యంగా తయారైంది. ఎటు చూసినా దుర్మార్గం తాండవించేది. వ్యభిచారం, మద్య పానం, జూదం గర్వకారణంగా భావించేవారు. విగ్రహారాధన సర్వసామాన్యమై పోయింది. అరబ్బుల్లో ప్రముఖ తెగ ఖురైషులు మతాధిపత్యం కలిగి ఉండేవారు. దైవగృహం కాబా నిర్వహణాధికారం వారి చేతుల్లో ఉండేది. మతాన్ని వ్యాపారంగా మార్చేసుకున్నారు. అరబ్బు తెగలు ఒకదానిపై ఒకటి కత్తులు దూసేవి. చిన్న చిన్న కారణాలకే రక్తం ఏరులై పారేది. యూదులు మతపరమైన వివాదాల్లో తలమునకలై ఉండేవారు. అరేబియాలోని మక్కా, తాయిఫ్ నగరాల్లోని వడ్డీ వ్యాపారులు అత్యధిక వడ్డీ రేట్లతో పెద్ద ఎత్తున వడ్డీ వ్యాపారాలు నిర్వహించేవారు. బానిసల వ్యాపారం పరాకాష్ఠకు చేరుకుంది. కర్ర గలవాడిదే బర్రె అన్న ధోరణి ప్రబలంగా ఉండేది. బలవంతులదే రాజ్యం. బలహీనులు అణిగిమణిగి బతకవలసి వచ్చేది. ఈ చీకటి లోయలో కాంతిశిఖరంలా ప్రవక్త మహనీయులు (స) ప్రభవించారు. మానవత్వానికి మళ్ళీ ప్రాణం పోశారు. తాను ప్రారంభించిన మహోద్యమాన్ని జయప్రదం చేసి ప్రపంచానికి చూపించారు. ఒంటరిగా, ఒంటిచేత్తో ప్రపంచ పరిస్థితులను మార్చడానికి

నడుం కట్టారు. ఆ కాలంలో ఈ చెడులను చూసి కలత చెందినవారు, ఈ పరిస్థితులను మార్చలేక, సమాజాన్ని సంస్కరించడం సాధ్యపడక అడవుల్లో, కొండగుహల్లో దైవ ధ్యానం చేసుకోవడానికి పరిమితమైపోయారు. కాని ప్రవక్త ముహమ్మద్ (స) అలా చేయలేదు. ధైర్యంగా పరిస్థితులను ఎదుర్కొన్నారు. సమాజాన్ని సంస్కరించారు. మానవాళికి మానవవిలువలు నేర్పారు. మానవత్వానికి పట్టం కట్టారు. రోము, పర్షియా సామ్రాజ్యాల ఘర్షణల వల్ల తలెత్తిన సాంస్కృతిక సంక్షోభాన్ని పరిష్కరించడానికి ఆయన మూడవశక్తిగా, సరయిన ప్రత్యామ్నయంగా నిలబడ్డారు. తన మార్గాన్ని తన సమాజాన్ని పటిష్టపరచి ఆనాటి అగ్రరాజ్యాలుగా చెలామణి అవుతున్న రోము, పర్షియా సామ్రాజ్యాలకు వణుకు పుట్టించే సవాలుగా మారారు. దౌర్జన్యాలకు నిలయాలుగా మారిన ఆ సామ్రాజ్యాలను కుప్పకూల్చి సాధారణ ప్రజలకు స్వేచ్ఛా స్వతంత్రాలను ప్రసాదించారు.

ఈ మహా విప్లవాన్ని సాధించడానికి తగిన వ్యక్తిగా దేవుడు ప్రవక్త ముహమ్మద్ (స)ను ఎన్నుకున్నాడు. ఈ ప్రయత్నానికి సరయిన ప్రదేశంగా అరేబియా ఎడారిని ఎంచుకున్నాడు. సత్యసందేశాన్ని స్వీకరించడానికి సరయిన ప్రజలుగా అరబ్బులను ఎంపిక చేశాడు. సత్యసందేశం అవతరించడానికి ఆ కాలం కూడా పూర్తిగా తగిన కాలం. నియంత ప్రభువుల ఆధిపత్యం చివరిదశకు చేరుకున్న కాలం అది. సౌభ్రాత్రతా భావాల దశ ప్రారంభం కావడానికి తగిన కాలం అది. చరిత్ర ఒక గొప్ప మలుపు తిరగడానికి ఎదురుచూస్తున్న కాలం అది. ఆ కాలంలో ప్రవక్త మహనీయులు (స) జన్మించారు. సత్యం, న్యాయాలను నిలబెట్టడం అత్యావశ్యకమైన సమయం అది. సత్యసందేశంలో సమస్త ప్రపంచాన్ని కాంతివంతం చేయవలసిన కాలం అది. అన్ని విధాలుగా ఆశ వదులుకున్న మానవాళి, దౌర్జన్యాలను భరిస్తూ, అజ్ఞానాంధకారంలో కొట్టుమిట్టాడుతున్న ప్రజానీకం ఇస్లాం ప్రతిపాదించే శాంతిసందేశాన్ని కళ్ళకు అద్దుకుని స్వీకరించడానికి అనువైన సమయం అది. అరేబియా ఒక ఎడారి భూభాగమైనప్పటికీ, అప్పటి రాజకీయ ప్రపంచంలో ఒక కేంద్రస్థానం కలిగి ఉండేది. ప్రాచ్య పాశ్చాత్య వర్తక బృందాలు అక్కడ నుంచే వెళ్ళేవి. వివిధ దేశాల అంతర్జాతీయ వాణిజ్యం అరబ్బు వర్తకుల చేతులు మీదుగా నడిచేది. ఒమ్మాన్, ఎమన్, మక్కా జిద్దా, యంబూ, మదీనా వగైరా నగరాల గుండా నిరంతరంగా వర్తక బృందాలు వెళుతూ ఉండేవి. అరబ్బుల సహకారం, ఖురైషుల అనుమతి లేకపోతే ఈ వర్తక బృందాలు క్షేమంగా ఇక్కడి నుంచి వెళ్ళడం అసాధ్యం. ఆ విధంగా అరేబియా ముఖ్యంగా మక్కా, తాయిఫ్, మదీనా, యంబూ తదితర నగరాలకు ఇతర దేశాలతో



ముఖ్యంగా ఇండియా, చైనా, ఈరాన్, రోమ్, అబిసీనియా వగైరా దేశాలతో సంబంధాలుండేవి. కాబట్టి ఈ ప్రాంతం విశ్వజనీన ఉద్యమాన్ని ప్రారంభించడానికి ఆదర్శప్రాయమైన ప్రాంతంగా ఉండేది. ధార్మికంగా, వాణిజ్యపరంగా చూస్తే మక్కా, మదీనా నగరాలు చాలా ముఖ్యమైన కేంద్రాలుగా ఉండేవి. ఆవిధంగా అనాగరికమూ, అవ్యవస్థీకృతమూ, ఆర్థికంగా బలహీనమైన అరేబియా ప్రాంతం ఈ విషయాల్లో కొన్ని ప్రతికూలాంశాలు ఉన్నప్పటికీ అజ్ఞానాంధకారాన్ని పారద్రోలే కాంతికిరణం లాంటి సత్యసందేశం ఏ మూల నుంచి వచ్చినా స్వీకరించడానికి సిద్ధంగా ఉంది. మరో ముఖ్యమైన విషయమేమంటే, అరేబియాపై అప్పట్లో బయటి రాజకీయ ప్రభావాలు దాదాపు శూన్యం. అలాగే అరేబియాలోను పూర్తిదేశంపై ఆధిపత్యాన్ని చెలాయించే శక్తి ఏదీ లేదు. కొత్త ఉద్యమాన్ని అణిచవేయగలిగిన కేంద్రీకృత శక్తి అంటూ అక్కడ ఏదీలేదు. గతంలో అవతరించిన అనేకమంది దైవప్రవక్తల ఉద్యమాలు ఇలాంటి శక్తి అణిచవేయడం వల్ల దెబ్బతిన్న ఉదాహరణలు మనకు కనబడతాయి. అరేబియాలో ఖురైష్ తెగ ఆధిపత్యం ఉండేది, కాని ఖురైషులు కూడా ధార్మికంగా వాణిజ్యపరంగా బలంగా ఉన్నప్పటికీ కేంద్రీకృత ప్రభుత్వం స్థాయికి ఎదగలేదు.

ఇక ధార్మికంగా చూస్తే ప్రపంచంలో ప్రవక్తలు ఎక్కడెక్కడ సత్యసందేశ ప్రచారం చేశారో ఆయా ప్రదేశాల పురాతత్వ అవశేషాలు భద్రంగానే ఉన్న కాలం అది. ఉత్తరాన ప్రవక్త ఇబ్రాహీమ్ (అస) ఉర్ పట్టణంలో జన్మించారు. ఇంకాస్త ఉత్తరాదికి వెళితే నూహ్, లూత్, సాలిహ్ ప్రవక్తల పట్టణాలున్నాయి. అక్కడే పలస్తీనా, జెరూసలేంలు కూడా ఉన్నాయి. ఇక్కడే యూదుల ఉత్థాన పతనాల చరిత్ర ఉంది. ఇక్కడే ప్రవక్త ఏసు (అస) జన్మించారు. ఇక్కడే ఆయన సత్యసందేశాన్ని వినిపించారు. దక్షిణాదికి వెళితే ఆద్, సమూద్, మారిబ్ జాతుల ఆవాసాల అవశేషాలున్నాయి. మారిబ్ ఆనకట్ట తెగి ధిక్కరించిన ఆ జాతిని పూర్తిగా ముంచేసింది. ఇక పశ్చిమాన సముద్రతీరాన ఈజిప్టు ఉంది. ఈ నేలలో మూసా, జోసెఫ్ ప్రవక్తలు సత్యసందేశాన్ని వినిపించారు. ఇక మక్కాలో ప్రవక్త ఇబ్రాహీమ్ (అస), ప్రవక్త ఇస్మాయీల్ (అస)లు ఏకదైవారాధక కేంద్రాన్ని స్థాపించారు. ఈ ప్రాంతంలో సత్యం వైపునకు పిలుపు ఇవ్వడం అంటే గత ప్రవక్తల బోధనలు ప్రజల మనోమస్తిష్కాల్లో తళుక్కుమనేలా చేయడమే.

అరేబియాలో ఆ కాలంలో మానవ వనరులు పుష్కలంగా ఉన్నాయి. పర్షియా, రోమ్ నాగరికతల ప్రభావానికి లోనుకావడం కూడా జరగలేదు. అరేబియాలోని మానవ వనరులు రోమన్, పర్షియన్ నాగరికతల కాలుష్యానికి గురికాలేదు. అరేబియా

తెగలు సంచార జీవనంవల్ల వారిలో కొన్ని లోపాలు ఉన్నప్పటికీ, వారిలో సుగుణాలు కూడా పుష్కలంగా ఉండేవి. వారు చాలా సరళమైన జీవనం గడిపేవారు. అందువల్ల వారిలో కృత్రిమ భేషజాలు, అట్టహాసాలు ఉండేవి కావు. ప్రకృతికి దగ్గరగా జీవించే వారు. ప్రకృతిలో సూచనలు సునాయసంగా గ్రహించేవారు. ఎడారిలో తీవ్రమైన ఎండ, వేడిగాడ్పులు, రాత్రింబవళ్ల ప్రయాణాలు, ఆకలిదప్పులను భరించే అలవాటు, రక్తపాతాల మధ్య జీవనం గడుపడం, హత్యలు, దోపిళ్ళ మధ్య బతకడం వల్ల వారు కష్టనష్టాలను తట్టుకునే విధంగా రాటుదేలారు. ధైర్యసాహసాలకు మారుపేరుగా మారారు. ఒక విశ్వజనీన ఉద్యమానికి ఈ గుణగణాలు ఎంతైనా అవసరం. అంతేకాదు అరబ్బులు దాతృత్వానికి మారుపేరుగా ఉండేవారు. బలమైన జ్ఞాపకశక్తి వారి సొంతం. ప్రతి వ్యక్తి తన వంశవృక్షాన్ని పూర్తిగా చెప్పగలిగి ఉండేవాడు. తన వంశవృక్షమే కాదు తన గుర్రం వంశం గురించి కూడా చెప్పగలిగేవాడు. అపారమైన ఆత్మవిశ్వాసం, ఆత్మాభిమానం, ఆత్మగౌరవం కలిగి ఉండేవారు. తమ ఆత్మాభిమానాన్ని ఎన్నటికీ వదులుకునేవారు కాదు. అందువల్లనే స్వేచ్ఛాస్వతంత్రాలను కాపాడుకోగలిగారు. అభివృద్ధి చెందిన, అత్యంత సమర్థవంతమైన భాష వారిది. ఈ భాషా సంపద సత్యఉద్యమ ప్రచారానికి ఎంతగానో తోడ్పడే వనరు. అరబ్బులు మొక్కవోని అంకితభావం కలిగి ఉండేవారు. తాము ఎన్నుకున్న మార్గం మంచిది కాకపోయినా వెనక్కుమరలడం వారి స్వభావంలో లేదు. ఆ మార్గంలో ఎదురయ్యే కష్టనష్టాలన్నింటినీ భరించేవారు కాని మడమతిప్పేవారు కాదు. అలాంటి స్వభావం కలిగిన అరబ్బులు సన్మార్గాన్ని అవలంబిస్తే ఆ మార్గంపై కూడా అంతే స్థిరంగా కొనసాగుతారు. కాబట్టి, ప్రవక్త ముహమ్మద్ (స) సత్యసందేశ ప్రచారానికి తగిన వ్యక్తిగా ఎంపిక చేసిన దేవుడు, ఆయనకు తగిన మానవవనరులను కూడా ఏర్పాటు చేశాడు. ఒక గొప్ప నాగరికత పుట్టి పెరగడానికి అనువైన ప్రాంతాన్ని కూడా దేవుడే ఎంచుకున్నాడు.

అరబ్బులు అప్పటికే ప్రగతీవికాసాల మార్గాల అన్వేషణలో ఉన్నారు. కొందరు మేధావులు ఈ దిశగా ఆలోచించడం, మథనపడడం జరుగుతూ ఉన్న కాలం అది. రాజకీయంగా దైవిక మార్గదర్శకత్వం కోసం ఎదురుచూసేవారు. మక్కా, మదీనా వంటి నగరాల్లో ప్రభుత్వ వ్యవస్థ వంటిది క్రమేణా రూపుదిద్దుకుంటున్నది. ఒకవిధమైన ప్రాథమికస్థాయి ప్రజాస్వామిక రాజ్యం రూపురేఖలు కూడా స్పష్టమయ్యాయి. కాని దేశంలోని పరిమితమైన ఆర్థిక వనరుల వల్ల ప్రజలు ఇతర ప్రాంతాల వైపు చూడడం కూడా ప్రారంభమైంది. ఒక చారిత్రక సత్యమేమంటే, ఏదన్నా నాగరికత సంక్షోభంలో కూరుకుపోతే, రాజకీయ నాయకత్వం తడబడుతూ దుర్మార్గాలను అణచలేని స్థితిలో



ఉంటే కొత్త శక్తి పుట్టుకు వస్తుంది. ఫారోల అధికారాన్ని సవాలు చేస్తూ యూదులు ఎదురుతిరిగినట్లే, అరబ్బు సంచారతెగలు, బదూయిన్లు కూడా ఎదురుతిరిగే పరిస్థితులు నెలకొన్నాయి. కాబట్టి ప్రవక్త ముహమ్మద్ (స) ఉద్యమానికి తగిన వేదికగా అరేబియా ప్రజల్లో ఉత్సాహాన్నీ, ఉద్రేకాన్ని ప్రోత్సహించే ప్రాంతంగా రుజువయ్యింది.

## మొలకెత్తిన విప్లవం

సమాజసంస్కరణా కార్యక్రమం ఏదో హడావుడిగా ప్రారంభం కాలేదు. ఒక దృఢమైన సంకల్పం, లోతైన ఆలోచన, ధ్యానం, దైవిక మార్గదర్శకత్వాలతో ఈ ఉద్యమం ప్రారంభమైంది. జీవితం గురించి ఆలోచనలు, జీవితమంటే ఏమిటో తెలుసుకునే జిజ్ఞాస, జీవిత ఉద్దేశ్యాలు గ్రహించాలన్న తపన అనేక సంవత్సరాలుగా ప్రవక్త ముహమ్మద్ (స) మనోమస్తిష్కాల్లో తరంగాలు సృష్టించేది. మక్కాకు సమీపంలో ఉన్న హీరా కొండగుహలో ఆయన తన స్వంత శక్తిసామర్థ్యాల గురించి ఆలోచిస్తూ, ప్రపంచ పరిస్థితులను గురించి మథనపడేవారు. మానవసమాజాలను దుర్భరం చేస్తున్న మౌలిక సమస్యలపై తన దృష్టి కేంద్రీకరించేవారు. అయితే దైవిక మార్గదర్శకత్వం వచ్చేవరకు ఆయన ఆచరణాత్మకంగా ఎలాంటి చర్య చేపట్టలేదు. ప్రపంచంలో అందరూ గుర్తుంచుకోవలసిన సత్యం ఏమంటే, విశ్వానికి యజమాని దేవుడు. మనిషి దేవునికి దాసుడు. ఈ విశ్వాసం వేరుగా ఒక సమగ్రమైన నాగరికత మహా వృక్షంగా పెరగాలి. ఈ నాగరికతా వృక్షం వేళ్ళు భూమిలో లోతుగా పటిష్టంగా పాతుకోవాలి. శాఖోపశాఖలు ఆకాశాల్లోకి విస్తరించాలి.

ప్రవక్త ముహమ్మద్ (స) ఇచ్చిన విప్లవాత్మక నినాదం – లాయిలాహ ఇల్లల్లాహ్ – ఇది క్లుప్తమైనదే అయినా సాటిలేని బలమైన ప్రభావం వేసే నినాదం. అల్లాహ్ (దేవుడు) తప్ప మరో ఆరాధ్యుడు లేదు. ఆయన ఒక్కడే దేవుడు. ఆయన పట్ల విధేయత చూపాలి. ఆయన్నే దేవునిగా ప్రేమించాలి. ఆయన్నే ఆరాధించాలి. ఆయన్నే స్తుతించాలి. ఆయన్నే స్మరించాలి. ఆయన నుంచే మనం అన్నివిధాల మంచిని ఆశించాలి. ఆయన ఆగ్రహానికి మనం భయపడాలి. ఆయన పుణ్యాత్ములకు బహుమతి ఇస్తాడు. పాపాత్ములను శిక్షిస్తాడు. ఆయనే యజమాని, పాలకుడు, చట్టాల ప్రదాత, ఆయన ఆదేశాలను శిరసావహించాలి. ఆయన నిషేధించిన వాటికి దూరంగా ఉండాలి. ఆయన విధిగా చెప్పిన వాటిని తూ.చ.తప్పక పాటించాలి. ఆయన అభీష్టానికి అనుగుణంగా జీవితాన్ని మలచుకోవాలి. ఆయన అనుగ్రహించిన వారి పట్ల గౌరవమర్యాదలు చూపాలి. ఆయన ఆగ్రహించిన వారిని వ్యతిరేకించాలి.

ఆయన ఆదేశాలపై సమస్తం త్యాగం చేయాలి. ఆయన ప్రసన్నతే జీవిత ధ్యేయంగా చేసుకోవాలి. ప్రవక్త ముహమ్మద్ (స) ఇచ్చిన ఏకదైవారాధన నినాదంలో ఈ సంపూర్ణమైన, సమగ్రమైన ఆధ్యాత్మిక భావన దాగి ఉంది.

దేవునికి సంబంధించిన ఈ లక్షణాలు, గుణగణాలను వేర్వేరు చేసి, దేవుని నుంచి పక్కకు తొలగించి విభిన్న వ్యక్తులకు ఆపాదించి వారిని దేవుళ్ళుగా చేసుకుంది సమాజం. ఆ విధంగా అసంఖ్యాక ఆరాధ్యులు సమాజంలో రాజ్యం చేసేవారు. మనిషి దైవదాస్యం మరిచి కోరికలకు, సంప్రదాయాలకు, ఆచారవ్యవహారాలకు, నియంతలు, పెత్తందార్ల ప్రాబల్యానికి, రాజులు, చక్రవర్తుల అధికారానికి దాస్యం చేయడం ప్రారంభమైంది. ఈ శక్తుల ముందు మనిషి బలహీనుడైపోయాడు. కాని, లాయిలాహ ఇల్లల్లాహ్ అన్న నినాదం ఈ శక్తులపై గొడ్డలిపెట్టులా పడింది. ఈ విశ్వాసాన్ని స్వీకరించిన వ్యక్తి దేవుడి ఔన్నత్యాన్ని తప్ప మరెవ్వరి ఔన్నత్యాన్ని అంగీకరించేది లేదని చాటి చెబుతాడు. దేవుని అధికారానికి తప్ప మరెవ్వరి అధికారానికి దాసుడు కాడు. దేవుడు నిర్దేశించిన నియమ నిబంధనలను తప్ప ఇతరులు కట్టడి చేసిన వాటికి తలవంచడు. ఏ ఇతర శక్తికీ తలవంచడు. ఇతరులెవ్వరి ప్రసన్నత కోసం ప్రయత్నించడు. ఇతరుల అభీష్టానికి అనుగుణంగా తన జీవితాన్ని మార్చుకోడు. ఏకైక దేవుడి ఆదేశాలు తప్ప ఇతర ఆదేశాలన్నింటిని త్రోసిపుచ్చుతాడు. నిజానికి ఈ నినాదం మనిషి స్వేచ్ఛా ప్రకటన వంటిది. ఈ నినాదంలో ఇది మొదటి భాగం మాత్రమే. రెండవ భాగం మనిషి సాధికారతకు, సామాజిక సంస్కరణకు మార్గాన్ని సూచిస్తుంది. దేవుడు ఏర్పాటు చేసిన ప్రవక్తల పరంపర మాత్రమే మనిషికి సాధికారతను, సమాజసంస్కరణను సాధిస్తుందని తేల్చి చెబుతుంది. నిజమైన జ్ఞానం అన్నది దైవసందేశం, దేవుని హితబోధ ద్వారా మాత్రమే సాధ్యమని తెలియజేస్తుంది. ప్రవక్త ముహమ్మద్ (స)కు ఆ దైవసందేశం చేరిందని, ఆయనకు ఆ సందేశమే మార్గదర్శకత్వం ఇస్తుందని, ఆయన చివరి ప్రవక్తగా ప్రభవించారని చాటి చెబుతుంది. ఈ మార్గం ద్వారా మాత్రమే జీవిత లక్ష్యం నెరవేరుతుంది. మానవాళి నిజమైన లక్ష్యాన్ని సాధించడం, నిజమైన గమ్యం వైపు అడుగులు వేయడం అన్నది ఈ దైవిక మార్గదర్శకత్వం ద్వారా మాత్రమే సాధ్యం. ప్రవక్త ముహమ్మద్ (స) ఇచ్చిన నినాదం లోని ఈ భావార్థాలే ఇస్లాంలోని ప్రముఖ విషయాలు.

ఈ నినాదం మస్జిదుల్లో ముఅజ్జిన్లు ప్రతిరోజు ప్రకటిస్తూ ఉంటారు. అత్యంత ఉత్కృష్టమైన పఠనం హోదా దీనికి లభించింది. ఇస్లామీయ ఉద్యమానికి కీలక అంశం ఇది. ఈ నినాదం మనిషి మనోమస్తిష్కాల్లో గూడుకట్టుకున్న తర్వాత మనిషి



ఆలోచనల పంథానే మార్చేసింది. ఒక కొత్త మనిషికి జన్మనిచ్చింది. సన్మార్గంపై నడిచే, సత్యధర్మంపై స్థిరంగా నిలబడే సత్యసమాజానికి పునాది వేసింది.

ప్రవక్త జీవిత చరిత్ర నుంచి పూర్తి ప్రయోజనం పొందాలంటే, సమాజ సంస్కరణకు ప్రవక్త (స) దృష్టిలో ఉన్న ఆదర్శాలు ఏవి, ఆ దిశగా ఆయన చేపట్టిన ఉద్యమం విస్తృతి ఎంత, సమాజ నిర్మాణంలో ఏదో ఒక పాక్షికమైన మార్పు మాత్రమే ఆయన కోరుకున్నారా, లేక సంపూర్ణమైన స్వరూప పరివర్తనాన్ని అభిలషించారా, ఆయన ఇచ్చిన పిలుపు కేవలం ధార్మికమైనది, నైతికమైనది మాత్రమేనా లేక రాజకీయ ప్రాధాన్యత కూడా ఉందా? అనే విషయాలు పరిశీలించాలి. ఉద్యమం లక్ష్యమేమిటి? అనే విషయాలు పరిశీలించాలి. దివ్యఖుర్ఆన్ ఈ విషయాలను చాలా సందర్భాల్లో వివరించింది. ఇక్కడ కేవలం రెండు వాక్యాలను మాత్రమే ప్రస్తావిస్తున్నాను. ప్రవక్తలు అందరి లక్ష్యాన్ని దివ్యఖుర్ఆన్ క్రింది విధంగా ప్రకటించింది.

> **"మేము మా ప్రవక్తలను స్పష్టమైన సూచనలతో, హితోపదేశాలతో పంపాము. వారితో పాటు గ్రంథాన్నీ, త్రాసునూ అవతరింపజేశాము: ప్రజలు న్యాయంపై స్థిరంగా నిలబడాలని."** ***(దివ్యఖుర్ఆన్ 57 : 25)***

ఈ వాక్యానికి అర్థం స్పష్టంగా ఉంది. సంపూర్ణ న్యాయం మూసలో మానవ జీవితాలను పోతపోయడానికి, సామాజిక సమతుల్యాన్ని స్థాపించడానికి ప్రవక్తల ఉద్యమాలు నడిచాయి. లోహంతో చేసిన సాధనాల ప్రస్తావన కూడా ఇక్కడ కనబడు తుంది. అంటే సత్యస్థాపన కొరకు, న్యాయాన్ని రక్షించడానికి అవసరమైతే రాజకీయ, సైనికశక్తిని ఉపయోగించడం కూడా అనివార్యమవుతుందన్న సూచన కూడా ఇందులో ఉంది.

ప్రవక్త ముహమ్మద్ (స) ఉద్యమం గురించి కూడా స్పష్టంగా, పదే పదే దివ్య గ్రంథంలో ప్రస్తావించడం జరిగింది.

> **ఆయనే తన ప్రవక్తకు మార్గదర్శకత్వాన్నీ, సత్యధర్మాన్నీ ఇచ్చి పంపాడు, దానిని సకల ధర్మాలపై ఆధిక్యం వహించే ధర్మంగా చేయడానికి: ఇది బహుదైవారాధకులకు ఎంత అనిష్టమైనా సరే.** ***(దివ్యఖుర్ఆన్ 61-9)***

ఆయన బోధించిన ఆదర్శమేమిటో తెలుసుకోవడానికి ప్రవక్త జీవితాన్ని ఇప్పుడు అధ్యయనం చేద్దాం.

ప్రవక్త ముహమ్మద్ (స) తన సందేశ ప్రచారం ప్రారంభదశలో తన తెగ బనీ హాషింకు చెందిన వారిని ఒక విందుకు పిలిచారు. ఆ విందు సందర్భంగా తన సందేశాన్ని వినిపించారు. ఇహలోకంలోను, పరలోకంలోను వారి

శ్రేయోసంక్షేమాలు ఈ సందేశం ద్వారా సాధ్యమని ఆయన వారికి హామీ ఇచ్చారు. ఈ సంఘటన జరిగిన తర్వాత కొంత కాలానికి ఒక ప్రతినిధి బృందంతో ఆయన మాట్లాడుతూ ఈ మాటలే మళ్ళీ పునరుద్ఘాటించారు.

"మీరు నా సందేశాన్ని స్వీకరిస్తే, అది మీ మంచికే అవుతుంది. ఇహలోకం లోనూ, పరలోకంలోను." అన్నారు.

ఇక్కడ మనం గుర్తించవలసిన విషయమేమంటే, మనిషి జీవితంలోని ఏదో ఒక రంగంలో మంచి చేసే పాక్షిక ప్రయోజనకరమైన ప్రయత్నాలు వ్యర్థమైనవి. ఇలాంటి పాక్షిక ప్రయోజనాలు చాలా ఉద్యమాల్లో మనం చూస్తాం. ఒక చెడు వ్యవస్థలో కూడా పిసరంత మంచి లేకుండా పోదు. కాని మనిషికి కావలసింది సంపూర్ణంగా జీవితరంగాలన్నింటిని సంస్కరించే, సమాజాన్ని సముద్ధరించే, న్యాయాన్ని నిలబెట్టే, సన్మార్గజీవనానికి బాటలు వేసే సమగ్రమైన మార్పు.

ప్రారంభదశలో ప్రవక్త (స) తన ప్రచారంలో క్రింది విధంగా చెప్పేవారు.

"ఇది కేవలం ఒకే ఒక్క వాక్యం. దీన్ని మీరు స్వీకరిస్తే మొత్తం అరేబియా మీకు అధీనమవుతుంది. అంతేకాదు, అరబ్బేతర భూభాగాలు కూడా మీ కిందికి వస్తాయి."

బజారుల్లో, బహిరంగ ప్రదేశాల్లో, హజ్ యాత్ర సందర్భంగా వివిధ తెగల నాయకులతో ప్రవక్త ముహమ్మద్ (స) మాట్లాడేవారు. "నన్ను మీతో పాటు మీ తెగవారి వద్దకు తీసుకెళ్ళండి. దేవుడు నన్ను ఏ పని కోసం పంపించాడో ఆ పని గురించి మీ అందరికి తెలియజేసేవరకు మీతో కలిసి పనిచేసే, మీతో సహకరించే అవకాశం నాకు ఇవ్వండి" అని కోరేవారు. బనూ అమీర్ తెగ నాయకుడు బహరా బిన్ ఫిరాస్ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లమ్ చేపట్టిన ఉద్యమం గురించి విని చాలా ప్రభావితుడయ్యాడు. ప్రవక్త ముహమ్మద్ (స) వ్యక్తిత్వం, ఆయనలో సత్యసందేశం పట్ల ఉన్న అంకితభావం తెలుసుకుని ఆశ్చర్యపోయాడు. ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లమ్ ఉద్యమానికి అనుకూలంగా చివరకు ఒక ప్రకటన చేశాడు. "ఈ యువకుడి మాటలు వింటే, ఇతడిని మనలో ఒకడిగా చేసుకుంటే మనం పూర్తి అరేబియాపై ఆధిపత్యం పొందగలం" అన్నాడు.బహరా దృష్టి గొప్ప భవిష్యత్తును చూడగలిగింది. ఆయన ఈ విషయమై ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లమ్‌తో ఒక ఒప్పందం చేసుకోవాలనుకున్నాడు. ప్రవక్త (స)తో సహకరించడానికి ఒప్పుకున్నాడు. కాని ఒక షరతు కూడా పెట్టాడు. అదేమంటే, ఉద్యమంపట్ల ప్రస్తుతం ఉన్న వ్యతిరేకతలు, ప్రతిఘటనలు అన్నీ చల్లారిపోయిన తర్వాత, ప్రవక్త (స) తన



అధికారాలను బదిలీ చేయాలని షరతు పెట్టాడు. బహరా దృష్టి భవిష్యత్ పరిణామా లపై ఉంది. ప్రవక్త (స) ఉద్యమం కేవలం ప్రచారానికి పరిమితమైన ఉద్యమమైతే ఆయన ఏమని ఉండేవారు.. బహుశా ఇలా అని ఉండేవారు.. "సోదరా! నేను కేవలం దేవుడి దాసుడిని, నేను అధికారం పొంది ఏం చేసుకుంటాను. నా ఉద్య మంలో అధికారం సాధించడం అన్న ప్రశ్నేలేదు." అని చెప్పిఉండేవారు. కాని ప్రవక్త (స) అలా చెప్పలేదు. అందుకు బదులు ఆయన చెప్పిన మాటలు ఎంతో గమనించదగ్గవి. "అధికారం అన్నది దేవుడి చేతిలో ఉంది. ఆయన తనకు నచ్చిన వారికి అధికారం కట్టబెడతాడు" అన్నారు. బహరాతో ఒప్పందం చేసుకోవడానికి తిరస్కరించారు.

ప్రవక్త (స) ఉద్యమంలో అరబ్బు నేలపై ఆధిపత్యం, అరబ్బేతర ప్రాంతాలపై ప్రాబల్యం అన్న ప్రస్తావనలు బలంగా ఉండేవి. ఇస్లామ్ ఉద్యమం త్వరలో జయప్రద మవుతుందన్న అభిప్రాయం బలంగా వ్యాపించింది. అందరూ దాని గురించి మాట్లాడేవారు. ఎంతగా ఈ చర్చలు జరిగేవంటే, వ్యతిరేకులు ఈ మాటలు ప్రస్తావించి పరిహసించడం, అపహాస్యం చేయడం ఒక పనిగా పెట్టుకున్నారు. ఎందుకంటే బానిసలు, బలహీనజనం ఎక్కువగా ఇస్లామ్ ఛత్రఛాయ కింద చేరడం జరిగేది. ఖురైషు సర్దారులు తాము అణిచివేసిన వారిని ఎత్తిపొడుస్తూ అవహేళన చేసేవారు. "చూడండి వీళ్ళని! వీళ్ళు అరబ్బులకు, అరబ్బేతరులకు నాయకులవ్వాలని కలలు కంటున్నారని" ఎద్దేవా చేసేవారు.

ఈ అవహేళనలు, అణిచివేతలు, అపహాస్యాలు ఎన్ని ఉన్నప్పటికీ ఖురైష్‌లలోని ఆలోచించగల శక్తి ఉన్న వారికి ప్రవక్త (స) ఉద్యమ ప్రభావం అవగతం కాసాగింది. ఇది సాధారణమైన ఉద్యమం కాదని, విస్తృతస్థాయి ప్రభావం ఉన్న ఉద్యమమనీ వాళ్ళు గ్రహించారు. ఒక సందర్భంలో మక్కాలోని వివిధ తెగల నాయకులు ప్రవక్త (స) వద్దకు తమ ప్రతినిధిని పంపించారు. ప్రతినిధిగా ఉత్బా అనే మాటకారి, మేధావి అయిన వ్యక్తిని ఎంచుకున్నారు. ప్రవక్త (స)తో మాట్లాడి ఆయన ఉద్యమం విరమించుకునేలా చేయాలని అతడిని కోరారు. ప్రవక్త ముహమ్మద్ (స) వద్దకు ఉత్బా వచ్చాడు. ప్రవక్త (స) తన ఉద్యమాన్ని విరమించుకునేలా చేయడానికి అన్ని రకాల ప్రతిపాదనలు చేశాడు. ప్రలోభాలకు గురిచేయడానికి ప్రయత్నించాడు. ప్రవక్త (స) దేనికీ లొంగలేదు. దివ్యఖుర్‌ఆన్‌లోని హామీమ్ సజ్దా సూరాలోని కొన్ని వాక్యాలను చదివి ఉత్బాకు వినిపించారు. ఈ వాక్యాలు విన్న ఉత్బా మాట్లాడలేకపోయాడు. ఈ వాక్యాలు ఉత్బాపై తీవ్ర ప్రభావం వేశాయి. నిరుత్తరుడై అక్కడి నుంచి ఖురైష్

సర్దారుల వద్దకు వెళ్ళిపోయాడు. అతడి ముఖం రంగుమారిపోయింది. ఖురైష్ సర్దారుల వద్దకు వెళ్ళి వారితో "ప్రవక్త (స) ఉద్యమంలో ఒక గొప్పదనం ఉంది. గొప్ప మార్పు సాధించే సామర్థ్యం ఆ ఉద్యమానికి ఉంది. ఒక గొప్ప విప్లవం రానుంది. ఈ ఉద్యమం మనందరి జీవితాలను మార్చేస్తుంది" అన్నాడు. అంతేకాదు ఖురైష్ సర్దారులకు ఒక సలహా ఇస్తూ ప్రవక్త ముహమ్మద్ (స)ను ఆయన మానాన ఆయన్ను వదిలివేయాలని, ఆయన పనిలో జోక్యం చేసుకోవద్దని, ఒకవేళ అరబ్బు తెగలు ఆయన్ను ఓడిస్తే ఎలాగూ ఖురైషుల కోరిక నెరవేరుతుంది. వారికి ఊరట లభిస్తుంది. ఒకవేళ ప్రవక్త (స) విజయం సాధిస్తే, ఆయన సాధించే అధికారం ఖురైష్ తెగకే లభిస్తుంది. అరబ్బుల్లో ఖురైషుల గౌరవమర్యాదలు ఇనుమడిస్తాయని చెప్పాడు. ఆవిధంగా ఉత్బా కూడా ప్రవక్త (స) ఉద్యమ సామర్థ్యాన్ని అంచనా వేయగలిగాడు. ఈ ఉద్యమం ఒక మహా విప్లవంగా చరిత్రను మలుపు తిప్పుతుందని గ్రహించగలిగాడు. ప్రత్యర్థులు కూడా ఆయన ఉద్యమ సామర్థ్యాన్ని అంచనా వేయగలిగినప్పుడు, స్వయంగా ప్రవక్త (స)కు, ఆయన వెంట నడిచే సహచరులకు తమ ఉద్యమం పట్ల ఎంత బలమైన విశ్వాసం ఉంటుందో, వేరే చెప్పాలా?

ప్రవక్త (స) పట్ల వ్యతిరేకత పరాకాష్ఠకు చేరుకున్న ఒక సందర్భంలో ప్రవక్త (స) అనుచరులు కొందరు తాము ఎదుర్కుంటున్న కఠినపరిస్థితుల గురించి ప్రవక్త (స) వద్ద మొరపెట్టుకున్నారు. తమపై దౌర్జన్యాలకు పాల్పడుతున్న వారిని శపించాలని కోరారు. అప్పుడు ప్రవక్త (స) వారిని సముదాయిస్తూ సత్యఉద్యమ మార్గంలో కష్టాలు, కఠినపరిస్థితులు సహజమేననీ, ఇలాంటి ఉద్యమానికి తీవ్ర వ్యతిరేకత, అడ్డంకులు, దుర్గమపరిస్థితులు ఎదురవుతాయనీ వివరించారు. అంతేకాదు, గత ప్రవక్తలకు కూడా ఇలాంటి కఠినపరిస్థితులను ఎదుర్కోవడం తప్పలేదని తెలియజేశారు. అంతేకాదు, గొప్ప ఆత్మవిశ్వాసంతో ఆయన వారికి శుభవార్తను కూడా వినిపించారు. "దైవం సాక్షి! దైవకృపతో ఈ ఉద్యమం విజయం సాధిస్తుంది" అన్నారు. ఏం జరగబోతుందో భవిష్యత్తును కూడా ఆయన వివరించారు. "సనా నుంచి హజరల్‌మౌత్ వరకు ప్రయాణించే బాటసారికి దైవభయం తప్ప మరో భయం ఏదీ ఉండని కాలం రానుందని" చెప్పారు. ఆయన ఎలాంటి పరిస్థితుల్లో ఆ భవిష్యత్తును చెప్పారో కూడా గమనించాలి. దోపిళ్ళు, దౌర్జన్యాలు, పట్టపగలే హత్యలు, అతివలపై అత్యాచారాలు సర్వసాధారణంగా జరుగుతున్న కాలంలో ఆయన ఈ మాటలు చెప్పారు. అరాచకం తాండవిస్తున్న కాలంలో ఆయన ఈ దుస్థితి పోయి, శాంతి న్యాయాలు నెలకొంటాయని జోస్యం చెప్పారు. బాటసారులు ఎలాంటి భయం లేకుండా



ప్రయాణించగలరనీ, వారిపై దాడి చేయడానికి, దౌర్జన్యం చేయడానికి ఎవ్వరూ సాహసించలేని పరిస్థితి వస్తుందని భవిష్యవాణి వినిపించారు. మరో సందర్భంలో కూడా ఆయన ఇలాంటి మాటలే వినిపించారు. ఎలాంటి రక్షకదళాలు లేకుండా వర్తకబిడారులు మక్కాకు వచ్చే కాలం రానుందని అన్నారు.

## ఎలాంటి సందేహాలకు తావులేని ప్రస్ఫుటమైన లక్ష్యం ఆయనది

కాబా గృహం తాళం చెవులు ఉస్మాన్ బిన్ తల్హా వద్ద ఉండేవి. ఒకసారి ప్రవక్త ముహమ్మద్ (స) ఉస్మాన్ బిన్ తల్హాతో మస్జిదు తాళాలు తెరువవలసిందిగా కోరారు. కాని ఉస్మాన్ బిన్ తల్హా అందుకు నిరాకరించాడు. ప్రవక్త (స) ఈ సమాధానం విని కాస్త ఇబ్బంది పడ్డారు. ఆ తర్వాత ప్రశాంతంగా ఉస్మాన్ బిన్ తల్హాతో కాబాగృహం తాళం చెవులు తన వద్ద ఉండే కాలం రానుందని, అప్పుడు తాను తనకు ఇష్టం వచ్చిన వారికి ఆ తాళం చెవులు అప్పగించే పరిస్థితి వస్తుందని జవాబు ఇచ్చారు.

అకబా వద్ద మదీనా నుంచి వచ్చిన అన్సారులు చేసిన చరిత్రాత్మక ప్రతిజ్ఞను మనం గమనిస్తే, అన్సారులకు కూడా భవిష్యత్తులో వచ్చే విప్లవాత్మక మార్పుల అంచనా ఉందని తెలుస్తుంది. ప్రవక్త (స) చేపట్టిన సత్యఉద్యమం వల్ల తలెత్తే రాజకీయ ఘర్షణల గురించి అవగాహన వారిలో కూడా ఉంది. ఈ ఘర్షణలు చివరకు యుద్ధాలకు కూడా దారితీస్తాయని వాళ్ళు ఊహించారు. అన్సారులు ప్రవక్త (స)కు ఆయన ఉద్యమంలో పూర్తి సహకారం అందిస్తామని ప్రతిజ్ఞ చేశారు. ప్రాణత్యాగాలకు, ఆస్తిపాస్తుల విధ్వంసాలను భరించడానికి సిద్ధమయ్యారు. అయితే ప్రవక్త (స) నుంచి ఒక హామీ కూడా తీసుకున్నారు. దేవుడు అధికారాన్ని ప్రసాదించిన తర్వాత ప్రవక్త (స) వారిని వదిలి మక్కా నగరానికి తిరిగి వెళ్ళరాదని కోరారు. సంఘర్షణ, త్యాగాలు, అధికారం .. వీటన్నింటిని పరిశీలిస్తే ప్రవక్త (స) దృష్టిలో ఉన్న గొప్ప లక్ష్యం ఏమిటో ఊహించడం కష్టం కాదు. ప్రవక్త (స) మక్కా నగరాన్ని వదిలి మదీనా నగరానికి తరలి వెళ్ళినప్పుడు దేవుని తరఫునుంచి అవతరించిన ప్రార్థనా వాక్యాలు ఈ విషయాన్ని మరింత స్పష్టంగా అర్థం చేసుకోవడానికి ఉపయోగపడతాయి. ఆ ప్రార్థనా వాక్యాలలో చివరి పంక్తులు ఇలా ఉన్నాయి. ".. నాకు నీ సహాయాన్ని, అధికారాన్ని ప్రసాదించు." అని ఆ ప్రార్థన ముగుస్తుంది. ఈ పవిత్ర ఉద్యమం ముందుకు సాగాలంటే అధికారం, ప్రాబల్యం అవసరం. ప్రవక్త (స)కు ఆయన పెదనాన్న అబూతాలిబ్ పూర్తి మద్దతు ఇచ్చేవారు. అయితే అబూతాలిబ్ ఇస్లామ్ స్వీకరించలేదు. ఆయన తన తాతముత్తాతల ధర్మంపైనే

ఉన్నారు. ప్రవక్త (స)కు మద్దతు ఇవ్వడం మానుకోవాలని ఖురైష్ సర్దారులు అబూతాలిబ్‌పై తీవ్ర ఒత్తిడి తీసుకొచ్చారు. అప్పుడు అబూతాలిబ్ ప్రవక్త (స)తో "నన్ను ఇంకా ఇబ్బంది పెట్టకు. మరిన్ని కష్టాలకు గురయ్యేలా చేయకు" అన్నారు. అప్పుడు ప్రవక్త (స) చెప్పిన మాటలు చరిత్రలో నిలిచిపోయాయి. ఖురైషులు తన కుడిచేతిలో సూర్యుడిని, ఎడమచేతిలో చంద్రుడిని పెట్టినా తాను ఉద్యమాన్ని ఆపేది లేదని ఖరాఖండిగా చెప్పారు. "ఉద్యమం జయప్రదమైనా కావాలి, లేదా ఈ మార్గంలో నా ప్రాణాలైనా పోవాలి" అన్నారాయన. అంటే తాను చేపట్టిన ఉద్యమంలో ప్రాణ భయం ఉందన్నది ఆయనకు పూర్తిగా తెలుసు. మదీనాలో అదీ బిన్ హాతిమ్ ప్రవక్త(స) వద్దకు వచ్చి ప్రవక్త (స) వ్యక్తిత్వాన్ని దగ్గరగా ఉండి అధ్యయనం చేశాడు. ప్రవక్త (స) ఉద్యమాన్ని గురించి అర్థం చేసుకోవడానికి ప్రయత్నించాడు. ప్రవక్త (స) నడవడి, స్వభావం, గుణగణాలు పరిశీలించి ఎంతగానో ప్రభావితుడయ్యాడు.

అదీ బిన్ హాతిమ్ మనసులోని భావాలను గమనించిన ప్రవక్త (స)అతడితో బాబిలోనియాలోని శ్వేతసౌధాలు తన అధీనంలోకి వస్తాయని, కుప్పలు తెప్పలుగా సంపద వచ్చి పడే రోజు రానుందని, ముస్లిములు సంఖ్యాపరంగా కూడా చాలా పెరుగుతారని భవిష్యవాణి వినిపించారు. అంతేకాదు ఇస్లాంలోని న్యాయవ్యవస్థను కూడా తెలియజేశారు. త్వరలో పరిస్థితులు మారుతాయని, ఎంతగా మార్పు వస్తుందంటే హత్యలు దోపిళ్ళు అత్యాచారాల స్థితి అంతరిస్తుందని అన్నారు. ఖదీసియా నుంచి ఒంటరి మహిళ మదీనాలోని ప్రవక్త (స) మస్జిదు వరకు సురక్షితంగా చేరుకోగలదని ఆత్మవిశ్వాసంతో అన్నారు. ఆయన ఈ మాటలు ఎలాంటి పరిస్థితుల్లో చెప్పారో కూడా గమనించాలి. మక్కా నగరం నుంచి మదీనా నగరానికి వలస వచ్చి, తీవ్రమైన ఇక్కట్లు, కఠినమైన పరిస్థితులు ఎదుర్కుంటున్న నేపథ్యంలో ఆయన ఈ మాటలు చెప్పారు. పర్షియా చక్రవర్తి ముంజేతి కంకణాలు సరాగా అనే సాధారణ వ్యక్తి చేతికి వచ్చే భవిష్యత్తును చూడగలిగారు. ఆయనకు తన అంతిమ లక్ష్యం గురించి పూర్తి అవగాహన ఉంది. సమగ్రమైన సామాజిక దృక్పథం ఉంది. ఆయన అధికారాల కోసం ప్రయత్నించలేదు. కానీ అవన్నీ ఆయన ఉద్యమ క్రమంలో దేవుని కానుకలుగా ఆయనకు లభించాయి. ప్రభుత్వం అన్నది వ్యక్తిగత ప్రాబల్యం కోసం కాదు. ప్రాపంచిక ప్రయోజనాలు సాధించడానికి కాదు. సత్య ఉద్యమాన్ని సాధించ డానికి, సత్సమాజ నిర్మాణానికి సాధనం కావాలి. శాంతిభద్రతలు, న్యాయపాలన



స్థాపించాలంటే అధికారాలు చేతిలో ఉండాలి. మానవత్వాన్ని నిలబెట్టడానికి ప్రభుత్వం కావాలి. నిజానికి ప్రవక్త (స) దృష్టిలో ఆధ్యాత్మిక నైతిక విప్లవమే ఉన్నప్పటికీ దాని పరిధిలో రాజకీయ విప్లవానికి కూడా ఆయన సమాన ప్రాధాన్యత ఇచ్చారు.

## ఉద్యమం

తత్వశాస్త్రం అన్నది మేధోపరమైన అభ్యాసంగా ఉంటుంది. తత్వవేత్తలకు ఆచరణీయ జీవితంతో కాని, చరిత్రతో కాని ప్రత్యక్ష సంబంధం ఉండదు. తత్వవేత్త కొన్ని సంఘటనలు, కొన్ని పరిస్థితుల ఆధారంగా కొన్ని అంచనాలు వేసుకుంటాడు. ఆ పరిస్థితులు లేదా సంఘటనలు మార్చడానికి ఎలాంటి ప్రత్యక్ష ప్రయత్నం చేయడు. మతం (ఇప్పుడు మతానికి ఉన్న పరిమిత అర్థంలో కూడా) మరికాస్త ముందుకు వెళ్ళి కొన్ని ధార్మిక విశ్వాసాలను ప్రతిపాదిస్తుంది. వ్యక్తిని సమాజం నుంచి వేరు చేస్తుంది. మనిషికి కొన్ని నైతిక నియమాలు, నీతిపాఠాలు అందిస్తుంది. కాగా, సామూహిక వ్యవస్థతో సంబంధం లేనిదిగా ఉండిపోతుంది. రాజకీయ పరిస్థితుల విషయంలో ఎలాంటి జోక్యమూ చేసుకోదు. సాంఘిక వ్యవస్థలో ఎలాంటి మార్పులకు ప్రయత్నం చేయదు. పాలకుల వ్యవహారశైలిని సవాలు చేయడమూ ఉండదు. మతబోధన అన్నది కేవలం ఒక నీతిపాఠంగా కొనసాగుతుంది. బోధకుడు కొన్ని గొప్ప విలువలను, ప్రమాణాలను, మూల్యాలను ప్రబోధాత్మకంగా చెప్పి వెళ్ళిపోతాడు. తన బోధనలను వినేవారి స్థితిగతులను గురించి ఆయన ఏమాత్రం పట్టించుకోడు. తన బోధనలు వినేవారు స్వేచ్ఛగా బోధనలపై నడిచే స్వాతంత్ర్యం కలిగి ఉన్నారా లేక ఏమైనా బంధనాల్లో ఇరుక్కుని ఉన్నారా అన్నది ఆలోచించడు. స్వార్థశక్తుల కార్యకలాపాల వల్ల ప్రజల మనోభావాలు ఎలాంటి మార్పులకు గురై ఉన్నాయో ఆలోచించడు. నిత్య వ్యవహారాలపై ప్రభావం వేసే ధోరణులను దృష్టిలో పెట్టుకోడు. తన బోధనలకు వ్యతిరేకంగా ఉన్న సిద్ధాంతాల గురించి కూడా పట్టించుకోడు. అంతేకాదు తనను అనుసరించేవారు ఎలాంటి సాంఘిక వ్యవస్థలో బతుకుతున్నారో కూడా చూడడం జరగదు. అతడి దృష్టిలో ఎలాంటి సాంఘిక నిర్మాణం ఉండదు. సాంఘిక వ్యవస్థను మార్చే ఆలోచన కూడా ఉండదు. ఎలాంటి రాజకీయ ఆలోచనలూ ఉండవు. నాయకత్వ సామర్థ్యమూ ఉండదు. మనిషి జీవితంలోని ఏదో ఒక రంగంలో పాక్షికంగా కొన్ని విలువలను ప్రబోధించడానికి మాత్రమే ప్రయత్నించడం జరుగుతుంది. మిగిలిన జీవిత రంగాల ప్రక్షాళనకు ప్రయత్నాలు ఉండవు. ఆయా జీవిత రంగాల్లో చెడులు యథావిధిగా కొనసాగుతూనే ఉంటాయి. ఒక దైవదాసుడికి ప్రాపంచిక వ్యవహారాలతో సంబంధమేమిటి అనుకుంటాడు.

కాని ప్రవక్త ముహమ్మద్(స) అలా చేయలేదు. ఏదో ఒక తత్వవేత్తలా వాస్తవ పరిస్థితులను పట్టించుకోకుండా కొన్ని గొప్ప గొప్ప ఆదర్శాలను, సిద్ధాంతాలను ప్రకటించి ఊరుకోలేదు. అలాగే ఒక ప్రబోధకుడి మాదిరిగా సమాజంలో అలుముకుని ఉన్న చెడులను చూడకుండా, ఆ చెడుల పరిణామాలను పట్టించుకోకుండా కేవలం ప్రసంగాలు, ప్రబోధాలు చేసి ఊరుకోలేదు. మానవత్వాన్ని నిలబెట్టిన కారుణ్యమూర్తిగా ఆయన పూర్తి సామాజిక చైతన్యంతో వ్యవహరించారు. మానవసమాజాల సంపూర్ణ విప్లవం కొరకు ప్రణాళికాబద్ధంగా పనిచేశారు. సమాజంలో ప్రబలంగా ఉన్న శక్తులను అర్థం చేసుకున్నారు. ఒక మొరటు సామాజిక సరళిలో ఉండే నాయకత్వాన్ని ఆయన అర్థం చేసుకున్నారు. ఆ సామాజిక సరళికి, ఆ నాయకత్వానికి వ్యతిరేకంగా నిలబడ్డారు. దాన్ని విమర్శించారు. దాన్ని సవాలు చేశారు. చరిత్ర ధోరణిని అవగతం చేసుకున్నారు. ప్రతి సంఘటనను జాగ్రత్తగా పరిశీలించారు. ప్రతి విషయాన్ని ఒక నాయకుడిగా సూక్ష్మదృష్టితో చూశారు. రాజకీయ చైతన్యంతో పరిశీలించారు. తన సంస్కరణా ఉద్యమంలో ప్రయోజనకరమైన సంఘటనలేవి, అడ్డంకులుగా మారే అంశాలేవి అన్నది ఆచితూచి నిర్ణయించుకున్నారు. ఆయన సమాజంలోని అన్ని శక్తులు, అన్ని అంశాలపై తన దృష్టిని నిలిపారు. తన ఉద్యమంలో ఎవరి నుంచి ఎప్పుడు సహాయం ఆశించవచ్చన్న ఖచ్చితమైన అంచనాతో నడిచారు. శత్రువుతో పోల్చితే తన బలం ఎంత ఉందో దృష్టిలో ఉంచుకున్నారు. సరయిన సమయం కోసం ఎదురు చూశారు. తగిన సమయం రాగానే ఆయన అనుపమాన ధైర్యసాహసాలతో శత్రువును ఎదుర్కొన్నారు. ప్రజాభిప్రాయాన్ని చాలా లోతుగా అధ్యయనం చేశారు. శత్రువు చేసే ప్రాపగాండాను సమర్థవంతంగా ఎదుర్కొన్నారు. చాకచక్యంగా ఆ ప్రాపగాండాను నిర్మూలించారు. శత్రుగణంలో ఉన్న కవులు, ప్రబోధకులు, ఉపన్యాసకులు తమ తమ శక్తి మేరకు ప్రవక్త (స) ఉద్యమాన్ని అణచడానికి ప్రయత్నించారు. ఈ ప్రచార యుద్ధాన్ని ఎదుర్కోవడానికి ఆయన తగిన కవులను, ఉపన్యాసకులను ఏర్పాటు చేశారు. తన నియమాలకు, విలువలకు కఠినంగా కట్టుబడ్డారు. అయితే ఏ సందర్భంలోను గ్రుడ్డిగా వ్యవహరించలేదు. సమాజంలోని పరిస్థితులను, పరిణామాలను జాగ్రత్తగా పరిశీలిస్తూ అత్యంత వివేకంతో తన మార్గాన్ని నిర్దేశించుకున్నారు. అవకాశం దొరికిన ప్రతిసారీ ఆయన ముందడుగు వేశారు. ప్రతికూల పరిస్థితుల్లో వెనక్కి తగ్గారు. రెండు చెడులు ఒకేసారి ఎదురైతే, ఒకదాన్ని ప్రక్కన పెట్టి మరొకదాన్ని ఎదుర్కొన్నారు. యుద్ధం అనివార్యమైనప్పుడు ఆయన వెనకడుగు వేయలేదు. శాంతి సాధ్యమైనప్పుడు ఆయన వైదొలగలేదు. తన స్నేహహస్తాన్ని



అందించారు. తన వ్యవహారాలన్నింటా, తన పనులన్నింటా దైవభీతి కలిగి మసలుకున్నారు. దైవభీతిని ప్రచారం చేశారు. నైతిక ప్రమాణాలను బోధించారు. ప్రతి పనిలోనూ నైతికతను ప్రబోధించారు. దివ్యఖుర్ఆన్ బోధనల వెలుగులో మనం ఈ విషయాలను పరిశీలిస్తే, ఒక మతానికి, ఒక వ్యవస్థకు మధ్య వ్యత్యాసం, కేవలం ప్రబోధనాత్మక పిలుపులకు, విప్లవాత్మక పిలుపులకు మధ్య తేడా, వ్యక్తిగత పవిత్రతకు సామూహిక సంస్కరణకు మధ్య తారతమ్యం స్పష్టంగా అర్థం అవుతుంది.

ప్రవక్త (స) ఒక కొత్త సామాజిక సరళిని నిర్మించాలని అనుకున్నారు. కాబట్టి అందుకు తగిన వ్యక్తులను ఎన్నుకున్నారు. ఆలోచనాపరులను, హృదయాల్లో సత్య జ్యోతి ప్రకాశిస్తున్న వారిని ఈ సామాజిక చట్రంలోకి తీసుకున్నారు. ఆటవిక వ్యవస్థను ఎదుర్కోవడానికి ఆ సమయంలో తనకు అందుబాటులో ఉన్న బలగాలన్నింటినీ ఆయన సమర్థవంతమైన నాయకత్వంతో ముందుకు నడిపారు. మేధోపరంగాను, రాజకీయంగాను, చివరకు యుద్ధరంగంలోను శత్రుశక్తులతో తలపడ్డారు. ఆయన తన చుట్టూ చేరిన వారినీ సూఫీలుగా, సన్యాసులుగా, ఫకీర్లుగా మార్చలేదు. లోకాన్ని పరిత్యజించి, సమాజానికి దూరంగా బతికే సర్వసంగపరిత్యాగులుగా చేయలేదు. చెడుకు భయపడే వారిగాను లేదా అధికారంలో ఉన్నవారిని చూసి భీతిల్లే వారిగాను మార్చలేదు. ఆయన అనుచరులు ముక్కు మూసుకుని దైవధ్యానంలో జీవితాన్ని గడపలేదు. ధైర్యం, నిర్భీతి, అవగాహన, వివేకవిచక్షణలు, ఆత్మగౌరవం, హుందాతనం, ఆలోచన, చురుకుదనం, శక్తిసామర్థ్యాలకు మారుపేరుగా నిలిచిన అలుపెరుగని కార్యకర్తలు వాళ్ళు. వాళ్ళు ఫకీర్లు, సన్యాసుల మార్గాన్ని అవలంబించలేదు. ముందువరుసలో నిలబడి ప్రజలకు నాయకత్వం వహించగలిగిన సామర్థ్యం ఉన్న వాళ్ళు. అత్యుత్తమ స్థాయి వ్యక్తిత్వం ఉన్నవాళ్ళు. ఉన్నతస్థాయి శిక్షణపొంది, అత్యుత్తమ సమూహంతో కలిసి ఉండి, విశిష్టనాయకత్వం పర్యవేక్షణలో ఓటమెరుగని సైన్యంగా రూపొందారు. అందువల్లనే సంఖ్యలో చాలాతక్కువ ఉన్నప్పటికీ సంచార అరబ్బు తెగలపై ఆధిపత్యం సంపాదించ గలిగారు. మక్కాలో ఉన్నప్పుడు ముస్లిములసంఖ్య కేవలం 40మాత్రమే. అప్పుడు కూడా ఈ ఉద్యమం మక్కా నగరంలో ఎంత సంచలనం సృష్టించిందంటే, ఆ తర్వాత సంవత్సరాల తరబడి ఇదే చర్చ జరిగింది. మదీనాలో ఇస్లామీయ ఉద్యమానికి మద్దతు ఇచ్చే వారి సంఖ్య కొన్నివందలు కూడా లేనప్పుడు, మదీనాలో ముస్లిమేతరులు అసంఖ్యాకంగా ఉన్నప్పుడు కూడా వారి సమక్షంలోనే ఇస్లామీయ ప్రభుత్వాన్ని స్థాపించగలిగారు. ఒక సామూహిక వ్యవస్థను స్థాపించడానికి ప్రవక్త ముహమ్మద్ (స) యావత్తు

అరేబియా ఇస్లాం స్వీకరించే వరకు ఎదురు చూడలేదు. కనీసం ఆయా ప్రాంతాల్లో అధికసంఖ్యాకులు ఇస్లామ్ స్వీకరించేవరకు కూడా వేచి ఉండలేదు. బోధనలు చేస్తూ ఆలోచనలను, విశ్వాసాలను మార్చడానికి ప్రయత్నించడం ఆవిధంగా ఒక సంపూర్ణ సామాజిక వ్యవస్థ ఉనికిలోకి వచ్చేలా చేయడం లేదా దైవం తమకు ఆధిపత్యం ప్రసాదించే పరిస్థితి దానికదే వచ్చేవరకు ఎదురుచూడడం ఆయన చేయలేదు. ఆయనకు చారిత్రక సత్యాల అవగాహన ఉంది. సాధారణంగా సమాజంలో అధిక సంఖ్యాకులు విప్లవ ఉద్యమాలకు దూరంగానే ఉంటారని, ఏ విధమైన ప్రతిస్పందన లేకుండా జడంగా గడిపేస్తారని, కేవలం కొద్దిమంది మాత్రమే ఉద్యమాలకు ప్రతిస్పందిస్తారని ఆయనకు తెలుసు. ఉద్యమాలపై ప్రతిస్పందించేవారిలో కొద్దిమంది సంస్కరణల ధ్వజాన్ని భుజానికెత్తు కుంటారు. విప్లవ రథాన్ని ముందుకు నడుపుతారు. మిగిలిన వారు ఉద్యమాన్ని వ్యతిరేకిస్తూ, అడ్డంకులు, అవరోధాలు సృష్టిస్తుంటారు. ఈ రెండు వర్గాల మధ్య మాత్రమే ఘర్షణ ఉంటుంది. ఆ ఘర్షణ ముగిసిన తర్వాత అప్పటి వరకు జడంగా ఉద్యమం పట్ల ఎలాంటి వైఖరి ప్రదర్శించని జనబాహుళ్యం విజేతవర్గం వెంట నడుస్తుంది. కాబట్టి ప్రత్యర్థి శక్తుల నాయకత్వం బలంగా ఉన్నంత కాలం, ప్రజల ఆలోచనలపై ప్రభావం వేస్తున్నంత కాలం, సాధారణ జనబాహుళ్యం ఈ ఉద్యమానికి దూరంగా ఉండేలా చేయగలుగుతున్నంత కాలం ప్రజలు సంస్కరణా దిశగా రమ్మని పిలిచే పిలుపులకు ప్రతిస్పందించడం జరగదు. తమ జీవితాల్లో మార్పును ఆహ్వానించడం జరగదు. ఈ పిలుపు పట్ల ప్రతిస్పందించిన వాళ్లు కూడా సమాజంలో కలుషిత వాతావరణం ఉన్నప్పుడు తమ జీవితాలను పూర్తిగా సంస్కరిం చుకోవడం సాధ్యపడదు. ఈ వాస్తవాలను ఆయన చక్కగా అర్థం చేసుకున్నారు.

సుదీర్ఘ ప్రయత్నాల తర్వాత ఉద్యమాన్ని ఒక స్థాయికి తీసుకు వెళ్ళిన తర్వాత విప్లవాన్ని ఇంకా ఆలస్యం చేస్తే ఆ స్థాయిని నిలబెట్టుకోవడం కష్టమైపోతుంది. ఎందుకంటే వ్యతిరేక శక్తులు అన్నీ ఏకమై ఉద్యమాన్ని పూర్తిగా అణిచివేయడానికి ప్రయత్నిస్తాయి. కాబట్టి ఉద్యమం జయప్రదంగా ముందుకు సాగాలంటే సమాజంలో మార్పుల పట్ల ప్రతిస్పందించేవారిలో సాధ్యమైనంత ఎక్కువమందినీ, సారూప్యభావాలు కలవారినీ ఉద్యమంలో కలుపుకోవాలి. వారిని వ్యవస్థీకరించి ఉద్యమాన్ని వ్యతిరేకిస్తున్న ప్రత్యర్థి శక్తులను నిర్వీర్యం చేయడానికి ఉపయోగించాలి. చరిత్రను పరిశీలిస్తే ఉద్యమాల విజయాలు స్వల్పసంఖ్యలో ఉన్న వారివల్లనే సాధ్యమయ్యాయని తెలుస్తుంది. అయితే ఈ ఉద్యమం సంస్కరణల కోసం ప్రారంభమైన ఉద్యమం



కాబట్టి సమాజంలో ఆలోచించేవారు చాలా మంది ఉద్యమం పట్ల సానుకూలంగా స్పందించే అవకాశం ఉంది. ఎందుకంటే ఈ ఉద్యమం వారిలో సన్మార్గ భావాలను ప్రేరేపిస్తుంది. శిక్షణ ద్వారా వారి నైతికబలాన్ని పెంచుతుంది. ప్రత్యర్థి శక్తులు భౌతికంగా బలంగా ఉన్నప్పటికీ, ప్రాబల్యం కలిగి ఉన్నప్పటికీ, సంపద సాధనాలు, వనరులు ఉన్నప్పటికీ, సంఖ్యాపరంగా ఎక్కువగా ఉన్నప్పటికీ చివరకు ఓటమి పాలుకాక తప్పదు. బద్ర్‌యుద్ధం దీనికి చక్కని ఉదాహరణ. ప్రవక్త (స) తన భావాలతో ఏకీభవించే గుప్పెడు మందిని తన ఉద్యమంలో చేర్చుకున్న తర్వాత, ఆయన అనుచరులు నైతికశిక్షణ ద్వారా తమ మనోబలాన్ని పెంచుకున్న తర్వాత అసత్య శక్తులనూ వారి నాయకత్వాన్నీ ఎదుర్కోవ డానికి సంసిద్ధులయ్యారు. అప్పుడాయన రాజకీయ లక్ష్యాలు సాధించడానికి సంకోచిం చలేదు. మక్కా విజయంలో ముఖ్యమైన అంశం ఏమంటే, ప్రత్యర్థి శక్తులు, అజ్ఞానాంధ కారానికి ప్రతినిధులుగా ఉన్నవారు పూర్తిగా లొంగిపోయారు. ఈ విజయం సాధించిన మరుక్షణం ప్రజలు పెద్దసంఖ్యలో ఇస్లామ్‌లోకి వచ్చారు.

చరిత్రను పరిశీలిస్తే అసత్యం రాజ్యాధికారంలో ఉన్నప్పుడు ఆ పరిధిలో సత్యం పురోగమించడం జరగలేదు. అలాగే రాజకీయ సంఘర్షణ లేకుండా కేవలం ప్రబోధనలు, ఉపన్యాసాలు, వ్యక్తిగత సంస్కరణా ప్రయత్నాల ద్వారా ఒక సామూహిక విప్లవాన్ని సాధించిన ఉదాహరణ కూడా చరిత్రలో కనబడదు. నలుగురు ఖలీఫాల కాలం తర్వాత ఇప్పటికి పదమూడు శతాబ్దాలు గడిచిపోయాయి. ఈ కాలంలో అనేక పాఠశాలల్లో, విద్యాసంస్థల్లో, ఆశ్రమాల్లో, మస్జిదుల్లో, బహిరంగ ప్రదేశాల్లో వ్యక్తిగత సంస్కరణా ప్రయత్నాలు జరుగుతూనే ఉన్నాయి. కాని నేటి వరకు ఉలమాలు, సూఫీలు, ప్రబోధకులు, రచయితలు చేసిన ప్రయత్నాలు అనేకం ఉన్నప్పటికీ అభిలషించిన మేరకు సంస్కరణ కనబడడం లేదు. పద్నాలుగు శతాబ్దాల క్రితం ప్రవక్త ముహమ్మద్ (స) అరేబియా ప్రజల సామూహిక జీవితాల్లో సాధించిన మాదిరి విప్లవం నేటి వరకు మరో ప్రయత్నమేదీ సాధించలేకపోయింది. కాస్త జాగ్రత్తగా గమనిస్తే ఈ ప్రయత్నాల్లో ఏదో లోపం ఉన్నట్లు తెలుస్తుంది. రాజకీయ మద్దతు లేకుండా నాయకత్వాన్ని మార్చడం సాధ్యంకాదు. కాబట్టి సామాజిక చక్రాన్ని వదిలేసి వ్యక్తిగతంగా ప్రజలను సంస్కరించడానికి చేసే ప్రయత్నాలు అనుకున్న ఫలితాలు సాధించడం కష్టం.

ప్రవక్త ముహమ్మద్ (స) సాధించిన విజయాల్లోని రాజకీయ అంశాలపై అంతగా పరిశోధన, చర్చ జరగకపోవడం దురదృష్టం. ఆయన ఉద్యమం, ఆయన

లక్ష్యం గురించి సంపూర్ణ అవగాహన కలగాలంటే ఆయన సాధించిన రాజకీయ విజయాలను కూడా దృష్టిలో ఉంచుకోవడం అవసరం. ఈ అంశాలు దృష్టిలో లేకపోతే పరిమితమైన ధర్మపరాయణతకు, విస్తృతమైన ఇస్లామీయ వ్యవస్థకు మధ్య తేడాను అర్థం చేసుకోలేం. ప్రవక్త ముహమ్మద్ (స) ఒక పరిపూర్ణ వ్యవస్థను తీసుకొచ్చారు. ధర్మపరాయణతపై ఆధారపడిన ఒక జీవనసరళిని స్థాపించడానికీ, దైవిక చట్టాలను అమలు చేయడానికీ ఆయన వచ్చారు. ఆయన విస్తృత అర్థంలో సామూహిక సంస్కరణల ఉద్యమాన్ని ఆరంభించారు. ఒక కొత్త సమాజ స్థాపనకు ఈ ఉద్యమం నడిచింది. ఈ ఉద్యమాన్ని నడుపడానికి అవసరమైన నాయకత్వ సామర్థ్యం, రాజకీయ అవగాహన ఆయనకు దైవం ప్రసాదించాడు. ఇతర గుణగణాల్లోను ఆయనకు సాటివచ్చేవాడు మరెవడూ లేడు. అదేవిధంగా రాజకీయ విజ్ఞతలోను ఆయనకు ఆయనే సాటి. ప్రవక్త (స) నిరంతర ధర్మపరాయణతను బోధించారు. సత్యం ప్రాబల్యం పొందేలా చేయడానికి సంఘర్షించారు. ఈ పునాదులపై ఒక సంపూర్ణవ్యవస్థను స్థాపించారు. ఇవన్నీ మతానికి సంబంధించిన పరిమితమైన, సంకుచితమైన నిర్వచనంలో అర్థమయ్యే విషయాలు కావు. ఆయన ప్రారంభించింది ఒక విప్లవం, ఒక ఉద్యమం.

ప్రవక్త ముహమ్మద్ (స) నడిపిన ఆ మహోన్నత ఉద్యమం ఒక దైవిక వ్యవస్థను స్థాపించింది. ఒక ఆధ్యాత్మిక విప్లవాన్ని సాధించింది. మనిషి జీవనరంగాలన్నింటా ఏకదైవారాధక విశ్వాసం అలుముకునేలా చేసింది. యావత్తు సామాజిక సరళిని ప్రభావితం చేసింది. సాంఘిక సంస్థలన్నీ దీన్ని స్వీకరించాయి. మస్జిదు నాలుగు గోడల మధ్య ఆరాధించే ఏకైక దేవుడు అన్ని చోట్లా ఉంటాడు. ఆయన సర్వశక్తి సంపన్నుడు. మస్జిదుల్లో పుణ్యకార్యంగా పఠించే దివ్యగ్రంథం ఖుర్‌ఆన్ న్యాయస్థానాల్లో తీర్పులకు ఆధారంగా నిలిచింది. ఇండ్లలో ఏ నైతిక ప్రమాణాలు పాటించేవారో అవే నైతిక సూత్రాలు అంతర్జాతీయ ఒప్పందాల్లో కూడా కనబడేవి. ధార్మిక ప్రసంగాల్లో వినిపించే విలువలే పాలనా వ్యవహారాల్లోను వినబడేవి. వ్యక్తి గతంగా ప్రభావం వేసిన విశ్వాసాలే సామూహిక సంస్థల్లో ప్రేరకాంశాలుగా నిలిచాయి. విద్యావ్యవస్థకు ఆధారభూతమైన ఆలోచనలే పూర్తి సాంస్కృతిక వ్యవహారాలకు పునాదులయ్యాయి. ప్రార్థనల్లో దేవుని ప్రసన్నతను ఏవిధంగా కోరుకునేవారో అదేవిధంగా దేవుని ప్రసన్నతను యుద్ధరంగంలో ఖడ్గాలు, విల్లంబులు ప్రయోగిస్తున్నప్పుడూ కోరుకునేవారు. యావత్తు మానవ జీవితం ఒకేఒక్క దైవిక చట్టం పరిధిలోకి వచ్చిన సమగ్ర వ్యవస్థ అది. విభిన్న ప్రాంతాల్లో భిన్న ప్రమాణాలు, సూత్రాలు,



చట్టాలు అవలంబించే పరిస్థితి అంతరించింది. ఈ వ్యవస్థలో ఎలాంటి వైరుధ్యాలు లేవు. విభిన్న విభాగాల మధ్య ఎలాంటి ఘర్షణ లేదు. ఎలాంటి అయోమయం లేదు. ఎలాంటి గందరగోళం లేదు. ఈ కారణాల వల్లనే చరిత్రలో ఎన్నడూ లేని విధంగా మానవాళి ఈ వ్యవస్థలో పురోగమించింది.

## ఉద్యమస్ఫూర్తి

మానవచరిత్రలో అత్యంత దురదృష్టకరమైన విషయమేమంటే, అధికారంలోకి ఎవరు వచ్చినా, వారు సాయుధపోరాటంతో అధికారం సాధించినవారు గాని, కుట్రలు కుతంత్రాలతో అధికారం సాధించినవారు గాని, ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికైన వారు గాని, లేక యాధృచ్ఛికంగా ఈ అవకాశాన్ని పొందినవారు గాని అందరూ తమను తాము ప్రబోధకులుగా, సంస్కర్తలుగా భావించే ధోరణి ఒకటి కనబడుతుంది. ఇలాంటి ప్రబోధకులు, సంస్కర్తలు అధికారంలోకి రాగానే ప్రపంచంలోని వివేకం, వివేచన అంతా తమ వద్దనే ఉన్నట్లు వ్యవహరిస్తారు. తమను తాము మహా మేధావులుగా భావిస్తారు. జ్ఞానవిజ్ఞానాలను ప్రసాదించే సమస్త వనరులను త్రోసిరాజంటారు. సమాజంలోని మేధావులు, ఆలోచనాపరుల భావాల పట్ల నిర్లక్ష్యం వహిస్తారు. నష్టదాయకమైన చర్యలకు పూనుకుంటారు. హింసా దౌర్జన్యాల ద్వారా ప్రజల్లో తాము కోరిన సంస్కరణ తీసుకురావడానికి ప్రయత్నిస్తారు. మెడపై కత్తిపెట్టి మార్పు సాధించాలనుకుంటారు. ఇలాంటి సంస్కర్తలు, విప్లవనేతలు సాధారణంగా మానవ స్వభావాన్ని అర్థం చేసుకోరు. మానవస్వభావం గురించి కనీస పరిజ్ఞానం కూడా వారికి ఉండదు. సంస్కరణలకు సరయిన మార్గాలేవో వారు ఆలోచించరు. సమాజంలో పతనానికి కారణాలేమిటో తెలుసుకోరు. పతన కారణాలను తొలగించే ఉత్తమ మార్గాలేవో గ్రహించే ప్రయత్నం చేయరు. గత అనుభవాల నుంచి పాఠాలను గ్రహించకుండా తమ స్వంత ప్రయోగాలు ప్రారంభిస్తారు. తమ ప్రయత్నాల్లో ఎదురయ్యే అడ్డంకులను తొలగించాలని చూస్తారు. తమపై వచ్చే విమర్శల పట్ల ఆగ్రహిస్తారు. సలహాలను పెడచెవిన పెడతారు. అన్ని సమస్యలకు వారివద్ద ఒకే ఒక పరిష్కారం ఉంటుంది. ఆ పరిష్కారం బలప్రయోగం, హింసావాదం. క్రూరమైన చట్టాలతో ప్రజలను నిరంకుశంగా అణిచివేస్తారు.

కాని ప్రవక్త ముహమ్మద్ (స) సాధించిన విప్లవం అలాంటిది కాదు. ఇందులో హింసలేదు. పైగా ప్రేమాభిమానాలు అందులో పొంగిపొర్లాయి. ఈ ఉద్యమంలో ప్రతిచోట మానవసంక్షేమం పట్ల శ్రద్ధాసక్తులు పల్లవించాయి. ప్రవక్త ముహమ్మద్ (స) మానవాళి పట్ల అపారమైన ప్రేమ కలిగి ఉండేవారు. మానవత్వం పట్ల నిజమైన

అభిమానం కలిగి ఉండేవారు. ఆయన తన ఉద్యమ స్వభావాన్ని వివరిస్తూ చెప్పిన ఉదాహరణ ఇక్కడ గమనించదగ్గది. నరకగుండం వైపు పిచ్చిగా పరుగెదుతున్న వారిని అందులో పడిపోకుండా తాను కాపాడుతున్నట్లు ఆయన చెప్పారు. అందుకే దివ్యఖుర్ఆన్ ఆయన్ను కారుణ్యమూర్తిగా అభివర్ణించింది. ఆయన అనవసర బలప్రయోగం లేకుండా ఒక గొప్ప విప్లవాన్ని ఎలా సాధించి ఉంటారో ఒక్కసారి ఊహించండి. మదీనాలో ఆయన గడిపిన దశాబ్ధకాలం అనుదినం ఆపత్సమయమే. ఖురైషులు మూడుసార్లు పెద్దఎత్తున దాడికి వచ్చారు. చిన్న చిన్న ఘర్షణలు సరిహద్దుల్లో జగడాలు నిత్యకృత్యాలుగా ఉండేవి. విభిన్న ప్రాంతాల నుంచి భిన్నతెగలు వివిధ సమయాల్లో మదీనాపై దండెత్తి వచ్చాయి. మదీనా నుంచి అనునిత్యం పహారా బృందాలను పంపించడం జరిగేది. కల్లోలం సృష్టించడానికి యత్నించే శక్తులను ఎదుర్కోవడానికి సైనికబలగాలను పంపవలసి వచ్చేది. రాత్రులు అప్రమత్తంగా నగరాన్ని కాపలా కాయవలసి వచ్చేది. వీటన్నింటికి తోడు మదీనాలోని యూదులు, కపటవిశ్వాసులు నిత్యం ఏదో ఒక కుట్రలో నిమగ్నమై ఉండేవారు. క్లుప్తంగా చెప్పాలంటే ఈ పదేళ్ళ కాలం సైనిక శిబిరంలో గడిపిన కాలం. ముస్లిం సమాజంలో కల్లోలం సృష్టించే పుకార్లు కుట్రలు నడిచాయి. ముస్లిముల్లో అసమ్మతి సృష్టించే ప్రయత్నాలు జరిగాయి. ప్రవక్త (స) ఉద్యమాన్ని నిర్వీర్యం చేయడానికి, ఆయన్ను హతమార్చడానికి అనేక ప్రయత్నాలు జరిగాయి. ఇంతకన్నా ఆపత్కాలం మరొకటి ఉంటుందా? కాని ప్రవక్త (స) ఎన్నడూ నిరంకుశాధికారాలు తీసుకోలేదు. నియంతృత్వ శాసనాలు చేయలేదు. అలాంటి ఆపత్కాల చట్టాల ద్వారా ఎవరినీ పట్టుకుని శిక్షించడమూ జరగలేదు. ఎవరినీ నిర్బంధించలేదు. ఎవరిపై కూడా జరిమానాలు, భారీ పన్నులు విధించలేదు. దైవిక చట్టంలో పేర్కొన్న పరిమితికి మించి ఎవరిపై కూడా ఎలాంటి శిస్తులు వేయలేదు. వ్యతిరేక భావాలు కలిగి ఉండే హక్కు, విమర్శించే హక్కులను గౌరవించారు. అభిప్రాయ ప్రకటన స్వేచ్ఛ లేకుండా ఎవరి గొంతును నొక్కలేదు. ఎవరినీ ఖైదు చేయలేదు. కాపట్యానికి, మోసానికి మారుపేరుగా నిలిచిన అబ్దుల్లా బిన్ ఉబై వంటి వ్యక్తికి కూడా స్వేచ్ఛ లభించింది. ప్రవక్త ముహమ్మద్ (స)కు తన ఉద్యమం సత్యమైనదన్న విశ్వాసం, తన వ్యక్తిత్వంపై సంపూర్ణ నమ్మకం ఉండేవి. ఆయన ఇతరులపై తన ఆధిపత్యాన్ని ఎన్నడూ ప్రదర్శించలేదు. ఆయన ఎన్నడూ అతిగా మాట్లాడలేదు. ఎవరినీ కించపరచలేదు. శత్రువుల దురుసుతనాన్ని ఓపిగ్గా భరించారు. నిజానికి శత్రువు బలహీనంగా ఉన్నా వారి పరుషపదజాలాన్ని సహించారు. ఆయనలోని ఆ లక్షణమే శత్రువుల హృదయాలను గెలుచుకుంది.



ఆయన అనుచరులు ఆయన పట్ల పూర్తి విధేయత కలిగి ఉండేవారు. ఆయన శత్రువులు ఆయన ముందు మరుగుజ్జులుగా మారారు. చివరకు శత్రువులు సత్యం, ధర్మం ముందు లొంగిపోయి, తలలు దించుకున్నప్పుడు, వారు పూర్తిగా మారిపోయి సంస్కరణ పొందిన వ్యక్తులుగా రూపొందారు.

ప్రవక్త ముహమ్మద్ (స) హృదయంలో దైవం పట్ల అపారమైన ప్రేమ ఉండేది. ఆ ప్రేమ సరికొత్త రూపంలో బహిర్గతమైంది. ఆయన దేవుడిని ఎంతగా ప్రేమించేవారో, దేవుడి సృష్టితాలను కూడా అంతగా ప్రేమించేవారు. ఆయన మానవాళిని ఎంతగా ప్రేమించేవారో తెలుసుకోవడానికి ఒక్క ఉదాహరణ చూద్దాం. మక్కా నగర ప్రజలు ఆయన ఉద్యమాన్ని తీవ్రంగా వ్యతిరేకించారు. అయన పట్ల, ఆయన అనుచరుల పట్ల అమానుషంగా వ్యవహరించారు. అయినా మక్కా నగరం కరువు కోరల్లో చిక్కుకున్నప్పుడు ఆయన వారి కోసం ఆహార పదార్థాలు పంపించారు. మక్కాలోని పేదలకు పంచడానికి ఐదువందల బంగారు నాణాలు కూడా పంపించారు. బద్ర్ యుద్ధం తర్వాతి రాత్రి బద్ర్ యుద్ధంలో పట్టుబడిన ఖైదీల రోదనలు విన్నారు. ఆ యుద్ధఖైదీలకు కట్టిన తాళ్ళు వదులు చేసేవరకు ఆయన నిద్రపోలేదు. బనూ హవాజిన్ తెగకు చెందిన ఆరువేలమంది యుద్ధఖైదీలు దీనంగా మొరపెట్టుకుంటే వారందరినీ విడుదల చేయాలని ఆదేశించారు. మానవాళి పట్ల ఆయనకున్న అపార ప్రేమ మక్కా విజయానంతరం మరింత స్పష్టంగా కనబడుతుంది. ప్రవక్త (స)ను తీవ్రంగా వ్యతిరేకించి ద్వేషించిన శత్రువులు, ప్రాణశత్రువులు, ఇరవై సంవత్సరాల పాటు ఆయనతో యుద్ధాలు చేసినవారు అందరూ లొంగిపోయి తలలు దించుకుని ఆయన ముందు హాజరైనప్పుడు ఆయన వారందరినీ క్షమించి వదిలేశారు. చరిత్రలో ఇలాంటి సందర్భాల్లో విజేతలు ఊచకోతలు కోయించిన సందర్భాలున్నాయి. లేదా జీవితఖైదు విధించారు గాని క్షమించి వదిలేసిన విజేత మరెవ్వరూ లేరు. మక్కా నాయకులు న్యాయపరంగాను, నైతికంగాను దోషులే. వారికి శిక్ష విధించడం సముచితమే. కాని మానవాళిని అపారంగా ప్రేమించే ప్రవక్త (స) వారి నేరాలన్నింటిని క్షమించారు. అంతేకాదు, ఒక సాధారణ ప్రకటన చేస్తూ "ఈ రోజు మీకు ఎలాంటి శిక్షా లేదు, మీరంతా స్వతంత్రులు" అన్నారు. ఆయన వారిని పరాభవించలేదు. వారి హృదయాలను గెలుచుకునేవిధంగా వారిపట్ల వ్యవహరించారు. వారికి బాధ్యతా యుతమైన పనులు అప్పగించారు. ఎందుకంటే, ప్రవక్త (స)కు తెలుసు ప్రతీకారాన్ని తీర్చుకోవడమంటే తన విప్లవాన్ని తక్కువ చేయడమే. పగ తీర్చుకోవడం వల్ల విప్లవం తన సమాధిని తానే తవ్వుకోవడం అవుతుంది. కాని శాంతంతో వ్యవహరించి

క్షమించడం ద్వారా విప్లవం ప్రత్యర్థుల హృదయాలను గెలుచుకుంటుంది. ఉద్యమాన్ని వ్యతిరేకించిన వారి మద్దతు కూడా సాధించగలుగుతుంది. మక్కా ఖురైష్ సర్దారులు ప్రవక్త (స)తో యుద్ధానికి వచ్చినప్పుడు ఆయన వీరోచితంగా అద్వితీయ ధైర్యసాహసాలతో పోరాడారు. యుద్ధంలో శత్రువులకు సాధ్యమైనంత తక్కువ నష్టం కలిగించి గెలుపు సాధించే సైనిక వ్యూహాలతో, రక్షణవిధానాలతో ఆయన పోరాటపంథా ఉండేది. యుద్ధరంగంలో కూడా మానవ విలువలను కాపాడే చర్యలు ఆయన తీసుకు న్నారు. మానవత్వం పట్ల, మానవాళి పట్ల అలాంటి ప్రేమాభిమానాలు మనకు మరో ఉద్యమంలో ఎక్కడా కనబడవు. ఆయన విప్లవం యావత్తు మానవాళి సంక్షేమా నికి ఉద్దేశించిన ఉద్యమం. జ్ఞానజ్యోతులు వెలిగించే ఉద్యమం.

## మనిషిలో మార్పు

అనేక సంస్కరణా ఉద్యమాలు, విప్లవాల చరిత్ర మనకు తెలుసు. కాని ఈ ఉద్యమాలను పరిశీలిస్తే ఇవన్నీ మనిషిని యథాతథంగా స్వీకరించాయి. మనిషి బాహ్యాపరిస్థితులను మార్చడానికి ప్రయత్నించాయి. అంతర్గతంగా మనిషిలో మార్పు తేవడానికి ఎలాంటి ప్రయత్నమూ జరగలేదు. కాని బాహ్యా పరిస్థితిలో మార్పు అన్నది తాత్కాలికమే అవుతుంది. అందువల్ల మనిషి జీవితంలో ఎదురయ్యే సమస్యల పరిష్కారంలో వైఫల్యమే ఎదురైంది. ప్రవక్త ముహమ్మద్ (స) సాధించిన అత్యుత్తమ విజయమేమంటే, ఆయన మనిషిని అంతర్గతంగా మార్చారు. మనిషిలో సంపూర్ణమైన మార్పు వచ్చేలా చేశారు. స్వంత ప్రయోజనాలు, స్వార్థప్రయత్నాలతో పశుసమానంగా బతుకుతున్న మనుష్యుల్లో సత్యం జాగృతమైంది. సత్యంలో దాగి ఉన్న శక్తి వారిలో మానవీయ విలువలను ప్రేరేపించింది. పశుసమాన జీవితాన్ని వదిలి ఆ స్థానంలో దైవభీతి, నియమబద్ధత తొణికిసలాడే మానవులు రూపొందారు. ప్రవక్త ముహమ్మద్ (స) సాధించిన ఈ అద్భుతాన్ని చూస్తే, మంత్రం వేసినట్లు మనుషుల్లో వచ్చిన మార్పును గమనిస్తే ఆశ్చర్యంతో నోరుతెరువక తప్పదు. మక్కా నగరంలో తాగుబోతు యువకుడిగా ఉన్న హజ్రత్ ఉమర్ (రజి)లో వచ్చిన మార్పును గమనించండి. ఆయన వ్యక్తిత్వం పూర్తిగా పరివర్తనం చెందింది. ఆయన మారిపోవడమే కాదు, ఒక మహోవ్యక్తిగా ఎదిగారు. అలాగే ఫుజాలా ఎంతగా మారిపోయారు. ఎంత గొప్ప వ్యక్తిగా పరివర్తన చెందారు. అలాగే జుల్ బజద్దైన్‌ను చూడండి ఆయన ఏ విధంగా సంపదను, భోగవిలాసాలను వదిలి సాధారణ జీవితం వైపునకు వచ్చారో గమనిస్తే ఈ ఉద్యమం మనుష్యులను ఎంతగా మార్చేసిందో అర్థం అవుతుంది. అలాగే హజ్రత్ అబూజర్ (రజి)ను చూడండి. ఎలాంటి విప్లవభావాలు ఆయనలో



పుట్టుకు వచ్చాయంటే, కాబా గృహం వద్దే అవిశ్వాసులను ధైర్యంగా సవాలు చేసి వారి చేతిలో చిత్రహింసల పాలైనా కూడా తన విశ్వాసంపై దృఢంగా నిలబడ్డారు. అలాగే కాబ్ బిన్ మాలిక్ (రజి)ను చూడండి. ఆయన వ్యక్తిత్వంలోని నిజాయితీని గమనించండి. అబూ ఖైస్మాను గమనించండి. లుబైనా, సుమయ్యా వంటి నౌకర్లు ప్రదర్శించిన విప్లవాత్మక ధైర్యసాహసాలు గమనించండి. మాజ్ బిన్ మాలిక్ అస్లమీ, గమీదియాల వైపు దృష్టి సారించండి. ప్రవక్త (స) కాలంలో సత్యంపై స్థిరంగా నిలబడిన ఈ మహానుభావుల్లో ఈ మార్పును సాధించిన ఉద్యమం గొప్పదనం చెప్పకనే తెలుస్తుంది. నేటి ఇథియోపియా ఆనాటి అబిసీనియా రాజు నీగస్ దర్బారులో హజ్రత్ జాఫర్ నిస్సంకోచంగా, నిర్భయంగా, నిశ్చింతగా సత్యాన్ని చాటి చెప్పిన వైనం గమనించండి, పర్షియా సైన్యాధిపతి సమక్షంలో రాబీ బిన్ ఆమీర్ ప్రదర్శించిన అనుపమాన ధైర్యసాహసాలను చూడండి. సత్యం పట్ల నిబద్ధతతో ఈ మహానుభావులు ప్రదర్శించిన ధైర్యసాహసాలు గొప్ప గొప్ప యోధుల్లో కూడా కానరావు.

ప్రవక్త (స) ఉద్యమ ఫలితంగా రూపుదిద్దుకున్న ఈ గొప్ప వ్యక్తులతో ఏర్పడిన సమాజం అది. సత్య వ్యవస్థను నడపడానికి ఇలాంటి నాయకులు, కార్యకర్తలు పుట్టుకు వచ్చారు. మద్యనిషేధ ఆదేశం ప్రకటించబడగానే నోటి వరకు వెళ్ళిన మధుపాత్రలను కూడా గిరాటేసారు. కుండల్లో దాచుకున్న మద్యాన్ని మదీనా వీధుల్లోకి తీసుకొచ్చి పారబోశారు. మహిళలు తమ తలపై కప్పుకోవాలని వస్త్రధారణ నియమాలు జారీ అయినప్పుడు తక్షణం తగిన వస్త్రాలు తయారయ్యాయి. జిహాద్ కోసం పిలుపు ఇవ్వగానే పిల్లలు కూడా మునికాళ్ళపై నిలబడ్డారు. తగిన ఎత్తు లేరన్న కారణంగా యుద్ధంలో పాల్గొనే అవకాశం చేజారుతుందని భయపడి అలా చేసేవారు. విరాళాల కోసం పిలుపు ఇస్తే సంపన్న వర్తకులు హజ్రత్ ఉస్మాన్ (రజి) వంటి వారు సంపదతో ఉన్న ఒంటెల బిడారులను తీసుకొచ్చి నిలబెట్టారు. హజ్రత్ అబూబక్ర్ (రజి) వంటి వారు తమ వద్ద ఉన్నదంతా తెచ్చి ప్రవక్త (స) పాదాల వద్ద పోశారు. కూలినాలి చేసుకునే కష్టజీవులు కూడా రోజుకూలిగా లభించిన ఖర్జూరాలను అన్నింటినీ తెచ్చి ఆయనకు సమర్పించుకున్నారు. తాము తినడానికి ఏదీ లేకపోయినా సమస్తం ఆయన పాదాల వద్ద పోశారు. మక్కా నుంచి మదీనాకు తరలి వచ్చిన ముహాజిరీన్లకు సహాయం చేయాలని మదీనాలోని అన్సార్లకు చెప్పినప్పుడు వాళ్ళు తమ ఆస్తిపాస్తులన్నీ లెక్కవేసి, సగం ఆస్తి ముహాజిరీన్ సోదరులకు ఇచ్చేశారు. వారి ఇండ్లు, వారి పొలాలు, వారి తోటలు అన్నింటిలో సగభాగం ఇచ్చి అద్వితీయమైన సోదరభావాన్ని ప్రదర్శించి చూపించారు. ప్రజాసేవ కోసం ప్రభుత్వ అధికారులను

నియమించినప్పుడు చరిత్రలో ఎన్నడూ లేని విధంగా నెలకు ఒక దిర్హం జీతం తీసుకుని గవర్నర్ పనిచేసిన సంఘటన ఆ కాలంలోనే సాధ్యమయ్యింది. యుద్ధంలో లభించిన యుద్ధసొత్తును సైనికాధికారి వద్ద జమచేయాలని ఆదేశించినప్పుడు తమ వద్ద ఉన్న యుద్ధసొత్తును చివరకు గుండుసూది కూడా తెచ్చి జమచేశారు. మదాయన్‌లో ఒక పెద్ద సంపద ఒక సైనికుడి చేతికి చిక్కింది. ఆ సైనికుడి పేరు ఆమిర్. సైనికాధికారి వద్ద యుద్ధసొత్తు జమచేయాలన్న ఆదేశం వినగానే అతడు అర్ధరాత్రి ఎవరి కంట పడకుండా ఆ సంపద అంతా తీసుకొచ్చి సైనికాధికారికి స్వాధీనం చేశాడు. ఇలాంటి సంఘటన చరిత్రలో మనకు మరెక్కడైనా కనబడుతుందా? చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖించదగిన సంఘటనలివి. మానవచరిత్రలో సత్యాన్ని సగర్వంగా నిలబెట్టిన మనుష్యులు వాళ్ళు. ఆ కాలంలో నేరాలంటే ఏమిటో తెలియని పరిస్థితి నెలకొంది. మదీనా నగరంలో ప్రవక్త (స) గడిపిన పదేళ్ళ కాలంలో న్యాయస్థానానికి వచ్చిన కేసులను వేళ్ళపై లెక్కపెట్టవచ్చు. పరిస్థితులు ఎంత గొప్పగా ఉండేవంటే నేరపరిశోధనకు ఎలాంటి సంస్థ అవసరమే కలుగలేదు. ప్రజల మనస్సాక్షి వారిని రక్షించేది. నేరాలనుంచి నిరోధించేది. వారికి మార్గదర్శనం చేసేది.

ఇది ప్రవక్త (స) సాధించిన మహోన్నత విప్లవం. మనిషి బాహ్యపరిస్థితులను మార్చడమే కాదు, అంతర్గతంగా మనిషిని పూర్తిగా మార్చేసిన విప్లవం అది. మనిషి వ్యక్తిత్వాన్ని, నడవడిని, మనస్సును, మస్తిష్కాన్ని, భావాలను, ఆలోచనలను, ఆవేశాలను, అన్నింటిని మార్చేసి కొత్తమనిషిగా రూపొందించిన విప్లవం అది. మానవ జీవితంలోని మౌలికసమస్యల పరిష్కారంలో ఈ విప్లవం విజయం సాధిం చింది. ఆ విధంగా సమాజంలో నెలకొన్న సంక్షోభాలను చక్కదిద్దడంలోను జయప్రద మైంది.

## అనుపమాన త్యాగాలు

ఇస్లామీయ ఉద్యమానికి మరో ప్రత్యేకత ఉంది. ఈ ఉద్యమం గొప్ప విజయాలు సాధించినప్పటికీ, ఆ విజయాల కోసం ఈ ఉద్యమకర్త ప్రవక్త ముహమ్మద్ (స) అనితరసాధ్య త్యాగాలు చేసినప్పటికీ, ఉద్యమం సఫలమైన తర్వాత దాని నుంచి ఎలాంటి ప్రతిఫలమూ పొందలేదు. ఎలాంటి పారితోషికమూ ఆశించలేదు. మానవాళి మేలు కోరి ఆయన తన సర్వస్వం త్యాగం చేశారు. కాని అందుకు బదులుగా న్యాయబద్ధంగా, హేతుబద్ధంగా, సాంప్రదాయికంగా తీసుకోదగిన పాటి ప్రతిఫలము కూడా ఆయన తీసుకోలేదు. ఈ గొప్ప విజయం తర్వాత పూచికపుల్ల పాటి స్వార్థం



కాని, గడ్డిపోచపాటి ఆశ కాని మనకు కనబడదు. ఇలాంటి ఉదాహరణ, కనీసం దీనికి దరిదాపుల్లోకి వచ్చేపాటి ఉదాహరణ మనకు మరొకటి చరిత్రలో కనబడుతుందా?

ఆర్థిక కోణంలో చూస్తే ప్రవక్త ముహమ్మద్ (స) ఉజ్వలంగా నడుస్తున్న తన వ్యాపార వాణిజ్యాలను వదులుకున్నారు. తన సంపద యావత్తూ ఉద్యమానికి ఇచ్చేశారు. ఆ ఉద్యమం విజయపథంలో నడుస్తున్నప్పుడు ఆయన తన సంపద అంతా తన స్వహస్తాలతో పంచేశారు. ఆయన చాలా సాధారణమైన, సరళమైన జీవితాన్ని ఇష్టపడ్డారు. ఆయన తన కుటుంబం కోసం సొమ్ము వదిలి వెళ్ళలేదు. కుటుంబానికి ఎలాంటి ఆస్తిపాస్తులు ఇవ్వలేదు. తన జీవితంలో తన కుటుంబ సభ్యులకు ఎలాంటి ఆర్థిక హక్కులు కల్పించలేదు. తన తదనంతరం వారి కోసం ఎలాంటి వారసత్వమూ ఇవ్వలేదు. ఆయన గార్డులను కాని, నౌకర్లను కాని నియమించుకోలేదు. తన కోసం ఎలాంటి వాహనసదుపాయమూ పొందలేదు. తన ఇంటిలో విలాస వస్తువులను ఇష్టపడలేదు.

ఇక రాజకీయ కోణంలో చూస్తే, ఆయన తన కోసం ఎలాంటి ప్రత్యేకాధికారాలు, ప్రత్యేకహోదాలు కోరలేదు. దేవుడు ఆజ్ఞాపించిన పరిధిని దాటి తన అధికారాన్ని ఎవరిపై కూడా ప్రయోగించలేదు. తన రాజకీయ హోదాను పటిష్టం చేసుకోవడానికి లేదా మరింత పెంచుకోవడానికి ఆయన ఏకపక్షంగా ఎలాంటి చట్టమూ చేయలేదు. ప్రవక్త (స) మదీనాలో గడిపిన పదేళ్ళ కాలం అంతా సంఘర్షణలతో ఆపత్కాలంగా ఉన్నప్పటికీ, నానాటికీ యూదులు, కపటవిశ్వాసుల కుట్రలు కుతంత్రాలతో సతమతమవుతున్నప్పటికీ ఆయన ఎవరి విషయంలోను జోక్యం చేసుకో లేదు. ఎలాంటి ఆంక్షలు ఎవరిపైనా విధించలేదు. ఎవరి విషయంలో కూడా అధికారికంగా తుదముట్టించమన్న ఆదేశాలు జారీ చేయలేదు. ఎలాంటి అత్యవసర న్యాయస్థానాలను ఏర్పాటు చేయలేదు. కొరడాదెబ్బల శిక్షలు విధించలేదు. అంతేకాదు, ఆయన విమర్శలకు పూర్తి అవకాశం ఇచ్చారు. అభిప్రాయభేదాలను, సలహాసూచనలను ఆహ్వానించారు. తన వ్యక్తిగత సూచనలను తిరస్కరించే స్వేచ్ఛ ఆయన అందరికీ ఇచ్చారు. ఈ హక్కులు, అధికారాలు ఏదో కాగితాలపై రాసినవి కాదు, ఇవి ఆచరణాత్మకంగా సమాజంలో కనబడేవి. కొన్ని సందర్భాల్లో ప్రవక్త (స) తన సొంత అభిప్రాయాన్ని పక్కకు పెట్టి ఇతరుల సూచనలను అంగీకరించారు.

ఆయన ఎవరికైనా ఏవైనా మినహాయింపులు ఇవ్వాలనుకున్నప్పుడు కూడా ఆయన తన సహచరులతో మాట్లాడి వారి అనుమతి తీసుకునేవారు. ఉదాహరణకు

ఒకసారి హజ్రత్ అబుల్ ఆస్ ఖైదీగా పట్టుబడ్డారు. హజ్రత్ జైనబ్ ఆయన విడుదల కొరకు పరిహారంగా ఒక కంఠహారాన్ని పంపించారు. ఆ కంఠహారం హజ్రత్ ఖదీజా (రజి), ప్రవక్త (స) మొదటి ధర్మపత్నిగారిది. హజ్రత్ జైనబ్, హజ్రత్ ఖదీజా (రజి) గారి కుమార్తె అన్నది ఇక్కడ గమనించాలి. హజ్రత్ ఖదీజా (రజి) తన కంఠహారాన్ని కుమార్తెకు కానుకగా ఇచ్చారు. ప్రవక్త (స) ఆ కంఠహారాన్ని ఆమెకు తిరిగి పంపాలనుకున్నారు. ఆయన తలచుకుంటే తక్షణం ఆదేశించవచ్చు. కాని ఆయన అలా చేయలేదు. బహిరంగంగా అందరి ముందు ఈ విషయాన్ని ఉంచి ఆ కంఠహారాన్ని తిరిగి ఇచ్చేసే అనుమతి కోరారు. అలాగే అబుల్ ఆస్ ఆస్తిపాస్తులు యుద్ధసొత్తుగా చేజిక్కినప్పుడు కూడా ఆయన అందరి అనుమతి తీసుకుని వాటిని తిప్పి పంపారు. హునైన్ యుద్ధంలో కొందరు యుద్ధఖైదీలు పట్టుబడ్డారు. ఆ యుద్ధఖైదీల విడుదల కొరకు ఒక ప్రతినిధి బృందం జరానా వద్దకు వచ్చింది. ప్రవక్త (స)కు బాల్యంలో పాలు తాపించిన తల్లిగారి ప్రాంతం నుంచి వాళ్ళు వచ్చారు. ఆమె పేరిట యుద్ధఖైదీలను విడుదల చేయాలని అభ్యర్థించారు. కాని అప్పటికే ఆ యుద్ధఖైదీలను వివిధ తెగల వారికి పంచేయడం జరిగింది. ప్రవక్త (స) తన స్వంత అభ్యర్ధనతో ఖురైష్ తెగవారికి ఇవ్వబడిన యుద్ధఖైదీలను విడుదల చేయించారు. తర్వాత ఒక బహిరంగ సభలో ఇతరులను అభ్యర్థిస్తూ ఆ యుద్ధఖైదీలను విడుదల చేయాలని కోరారు. ప్రవక్త (స) స్వయంగా తన బంధువులకు కేటాయించిన యుద్ధఖైదీలను విడుదల చేసారని తెలియగానే మిగిలిన వారు కూడా తమకు కేటాయించిన యుద్ధఖైదీలను విడుదల చేసారు. ఇలాంటి సందర్భాల్లో ప్రవక్త (స) ఎన్నడూ ఎవరిపై ఎలాంటి ఒత్తిడి తీసుకురాలేదు.

ఇక సామాజికంగా చూస్తే ప్రవక్త (స) అందరితో సమానంగా ఉండేవారు. తన కొరకు ప్రత్యేక హోదా గౌరవాలు ఎన్నడూ కోరలేదు. అన్నవస్త్రాల విషయంలో ఎన్నడూ ఎలాంటి ప్రత్యేక ప్రమాణాలు ఆశించలేదు. బహిరంగ సభల్లో ఆయన తన కొరకు ప్రత్యేక స్థలాన్ని కూడా కోరేవారు కాదు. తన ముందు ఇతరులు గౌరవ సూచకంగా నిలబడడం, లేదా తనను నాయకుడిగా, సర్దారుగా సంబోధించడాన్ని ఆయన ఎన్నడూ ప్రోత్సహించలేదు. యుద్ధరంగంలో కాని, ప్రయాణాల్లో కాని, కందకాలు తవ్వడంలో కాని, మస్జిదులు కట్టడంలో కాని ఆయన తన సహచరులతో సమానంగా కష్టపడి పనిచేసేవారు. నిర్మాణ సామగ్రిని మోసేవారు. రాళ్ళను పగుల గొట్టేవారు. తన స్వహస్తాలతో కలపను సేకరించేవారు. తాను ఎవరివద్దనైనా రుణం తీసుకుంటే, తన వద్ద నుంచి ఆ రుణాన్ని కఠినంగా వసూలు చేసుకోవాలని ఆయన



ప్రోత్సహించేవారు. తాను ఎవరి పట్ల నైనా తప్పుగా వ్యవహరించి ఉంటే తన పట్ల ప్రతీకారం తీర్చుకోవచ్చని ఆయన తన్ను తాను ప్రజలకు సమర్పించుకున్నారు.

మానవత్వాన్ని నిలబెట్టిన ఆ మహానుభావుడి గొప్ప ఆదర్శాలివి. ఈ ఆదర్శాలు నేడు మనకు వారసత్వంగా అందాయి. ఆ సత్యసందేశాన్ని ప్రచారం చేసే బాధ్యత మనకు లభించింది. అందుకే మానవాళిపై సాక్ష్యంగా నిలబడే ఉత్తమ సమాజంగా మనలను అభివర్ణించడం జరిగింది. ఆ సత్య సందేశాన్ని మనకు ఒక అప్పగింతగా ఇవ్వడం జరిగింది. ప్రవక్త (స) అనుచరసమాజంగా మనం ప్రవక్త (స) పోషించిన మానవత్వాన్ని నిలబెట్టే పాత్రను మనస్థాయిలో పోషించవలసి ఉంది. మానవాళి సమస్యల్లో కూరుకుపోయినప్పుడు, సమాజం సంక్షోభానికి గురైనప్పుడు మనం ఈ సమస్యలు సంక్షోభాల పరిష్కారానికి ప్రయత్నించవలసి ఉంది. కాన వాస్తవమేమంటే, ఈ సత్యసందేశ బాధ్యతను నిర్వర్తించడంలో మనం విఫలమవుతూనే ఉన్నాం. చేజేతులా దీన్ని మనమే నష్టపరుస్తున్నాం. ఫలితంగా ఆధునిక యుగం కొత్త మలుపు తిరిగి భౌతిక సుఖభోగాలే ప్రధానంగా మారినప్పుడు ఈ ధోరణిని అరికట్టడంలో మనం విఫలమయ్యాం. మన వైఫల్యాల ఫలితమే నేడు యావత్తు మానవాళి సంక్షోభ పరిస్థితులను ఎదుర్కుంటోంది. నేడు ప్రపంచ నాయకత్వం దైవశాసనాలను అంగీకరించని వారి చేతుల్లో ఉంది. పరస్పర విరుద్ధ భౌతికవాద సిద్ధాంతాలు ఒకదానితో ఒకటి తలపడుతున్నాయి. ఈ ఘర్షణలు శాంతిని భంగపరుస్తున్నాయి. మనశ్శాంతి లేకుండా చేస్తున్నాయి. స్వయంగా మనమే వాటికి బానిసలుగా మారుతున్నాం. అనేక దురదృష్టకరమైన సంఘటనలు పరంపరగా జరుగుతున్నప్పటికీ లజ్జాభావన మనకు కలగడం లేదు. ఇస్లామీయ సమాజాల్లోని అస్తవ్యస్త స్థితి, మానవ సమాజాల్లో సంక్షోభాలు మనకు మన బాధ్యతలను గుర్తు చేయలేకపోతున్నాయి.

భ్రమల దుప్పట్లు పరుస్తున్న ఆధునిక భౌతికవాద నాగరికత వెనుక దాగి ఉన్న సత్యాలను పరికిస్తే ఒళ్ళు గగుర్పొడుస్తుంది. దిక్కుతోచక విలవిలలాడుతున్న మానవత్వం మన కళ్ళముందు ప్రత్యక్షమవుతుంధి. నేడు మానవాళి విచిత్రమైన విలువల గుప్పిట ఇరుక్కుంది. ఎక్కడ చూసినా అధికారం కోసం, ఆదాయం కోసం సంఘర్షణ కనబడుతుంది. మనిషిలో ఉండే నైతిక స్పృహ అదృశ్యమైపోయింది. నాగరికత పెరుగుతున్న కొద్దీ నేరాలు పెరుగుతున్నాయి. మానసికంగా సంక్లిష్ట ధోరణులు ముప్పిరిగొంటున్నాయి. మనశ్శాంతి అన్నది కనుమరుగైపోయింది. మనిషి మనోమస్తిష్కాల్లో, వ్యక్తిత్వంలో అన్నింటా అయోమయం తాండవిస్తోంది. మనిషి జీవితంలోని ఏ ఒక్క రంగం కూడా కాలుష్యానికి దూరంగా లేదు. వివేకం, వివేచనల్లో

సత్యం మృగ్యమై పోయింది. విశ్వాసాలు, ఆలోచనల్లో నిజాయితీ కరువైపోయింది. ఆధ్యాత్మిక విలువలు పతనమయ్యాయి. చట్టాలున్నాయి కాని వాటిలో న్యాయపరమైన స్పృహ లోపించింది. రాజకీయాల్లో సేవాభావం నశించింది. దాని స్థానంలో స్వప్రయోజనాలకు పాకులాడే ధోరణి ప్రబలింది. సాంఘీకంగా అణగారిన వర్గాలు, అణిచివేతలకు పాల్పడే వర్గాలుగా వేర్పాటు కనిపిస్తోంది. లలిత కళల్లో అసభ్యత అధికమైంది. సాంఘీక జీవనంలోని అన్ని రంగాల్లో వైరుధ్యాలు కనిపిస్తున్నాయి. వైరి వర్గాల పోరాట వేదికగా సమాజం మారిపోయింది. చరిత్ర ఇప్పుడు ఒక బీభత్స నాటకంగా మారింది. విద్యాజ్ఞానాలు అభివృద్ధి చెందాయి. కాని విద్యా వ్యవస్థలోని లోపాలు మనల్ని వెంటాడుతున్నాయి. జ్ఞానజ్యోతులు వెలుగుతున్నాయి కాని ఇవే జ్యోతులు అనేక అపార్థాలను, అపనమ్మకాలను పెంచుతున్నాయి. ఈ అపనమ్మకాలు మనుష్యులను దాసులుగా చేసుకుంటున్నాయి. సంపద గుట్టలు గుట్టలుగా పడి ఉంది. కాని పెద్ద సంఖ్యలో ప్రజలు నేటికీ కూటికి గతిలేని వారిగా జీవిస్తున్నారు. వేలాది సంస్థలు, రాజకీయ గ్రూపులు, సైద్ధాంతిక వర్గాలు, వైరుధ్య సంబంధాలు ఉనికిలోకి వచ్చాయి. కాని మనిషికి మనిషికి మధ్య సోదర సంబంధాలు కనబడడం లేదు. రాజకీయ, హేతుబద్ధ, నైతిక, సామాజిక చైతన్యం సృష్టించాలన్న వాదనలు వినిపిస్తున్నాయి. కాని అత్యంత అసహ్యాకరమైన అణిచివేతలు, హింసాదౌర్జన్యాలు అడ్డూ అదుపు లేకుండా కొనసాగుతున్నాయి. చరిత్ర ఒక పెద్ద యుద్ధమైదానంగా మారిపోయింది. ఇక్కడ సామ్రాజ్యవాద శక్తులకు స్వేచ్ఛాపిపాసులకు మధ్య ఘర్షణలు, కమ్యూనిజానికి కేపిటలిజానికి మధ్య సంఘర్షణలు, ప్రజాస్వామ్యానికి నియంతృత్వానికి మధ్య పోరాటాలు, వ్యక్తితత్వానికి సామూహిక తత్వానికి మధ్య జగడాలు, ప్రాచ్య పాశ్చాత్య రగడలు మామూలయ్యాయి.

ఇది మనం జీవిస్తున్న ప్రపంచం. మనం ప్రాపంచిక సంక్షోభాన్ని ఎదుర్కొం టున్నాము. ఈ సంక్షోభం ఒక భీకరమైన సవాలు. ఆధునిక భౌతికవాద నాగరికత లేదా ఈ నాగరికత రూపొందించిన మనిషి ఈ సంక్షోభాన్ని పరిష్కరించలేదు. తాత్కాలిక ఊరటనైనా ఇవ్వగల కొత్త సిద్ధాంతం ఏదీ లేదు. ఎక్కడా ప్రశాంతత, సమస్యల పరిష్కారం అందుబాటులో లేదు. మనిషిని అన్ని వైపుల నుంచి చీకటి చుట్టుముట్టిన ఈ సంక్షుభిత సమయంలో కనబడుతున్న ఒకే ఒక్క ఆశాకిరణం, సుదూరంగా, పధ్నాలుగు వందల సంవత్సరాల క్రితం వెలిగించిన ఆశాజ్యోతి ఒక్కటే. మానవాళికి కారుణ్యకెరటంగా అవతరించిన ప్రవక్తముహమ్మద్ (స) మాత్రమే ఆ



ఆశాజ్యోతి. ఆయనకు అనుచర సమాజంగా మనం చెప్పుకుంటున్నాం. కాని అయోమయ ఆలోచనల్లో, నియమరాహిత్యంలో కొట్టుమిట్టాడుతున్నాం.

## ప్రవక్త (స) జీవితాన్ని ఎలా అధ్యయనం చేయాలి?

ప్రవక్త (స) జీవిత చరిత్ర అధ్యయనం ఏ ఉద్దేశ్యంతో చేయాలంటే, ఆ మహా ఉద్యమం, ఆ సత్య సందేశం తాజాగా మన కళ్ళ ముందు, యావత్తు మానవాళి ముందు ఆవిష్కరించబడాలన్నదే ఆ ఉద్దేశ్యం కావాలి. క్రీ.శ. ఆరవ శతాబ్దంలో సంక్షోభాల ఊబిలో కూరుకుపోయిన మానవాళికి ఏవిధంగా అదరువు లభించిందో అదేవిధంగా నేడు చీకటి కుహరంలో కొట్టుమిట్టాడుతున్న మానవాళికి మరోసారి ఆశాజ్యోతి లభించాలి.

దురదృష్టవశాత్తు మనం ప్రవక్త (స) చరిత్రను సరయిన స్ఫూర్తితో చదవడం లేదు. మనకు ఆదర్శనమూనాగా ఆయన జీవితాన్ని అర్థం చేసుకునే దృక్పథంతో చదువడం లేదు. మన జీవితాలను ఆ నమూనాకు అనుగుణంగా మలచుకోవాలన్న ఆలోచనతో చదువడం లేదు. పైగా ఇతర ఉద్దేశ్యాలు, లక్ష్యాలు ప్రవక్త (స) జీవిత చరిత్ర అధ్యయనంలో ముఖ్యమైనవిగా మారిపోయాయి.

ముస్లిములు సహజంగానే ప్రవక్త (స) జీవిత చరిత్ర పట్ల శ్రద్ధాసక్తులు చూపిస్తారు. ఎందుకంటే, ఆధ్యాత్మికంగా ప్రతిఫలం లభిస్తుందన్న ఆశతో. కేవలం పుణ్యకార్యంగా, పుణ్యాలు పొందడానికి మాత్రమే చదువుతున్నాం. ప్రవక్త (స) జీవితం గురించి తెలుసుకునే ప్రతి ప్రయత్నం దేవుడి దృష్టిలో ఒక పుణ్యకార్యం అనడంలో ఎలాంటి సందేహం లేదు. ఈ ప్రయత్నానికి తగిన ప్రతిఫలం మనం ఆశిస్తాము. కాని ఈ ప్రయత్నంలో అసలు ఉద్దేశ్యం మన జీవితాలను సంస్కరించడం కావాలి. ప్రవక్త (స) జన్మదినం సందర్భంగా మనం బహిరంగ సభలు నిర్వహిస్తాం. ప్రవక్త (స) ఆత్మ ఈ బహిరంగ సభలకు హాజరవుతుందని కూడా అనుకుంటారు. తన అనుచర సమాజంలో ఉన్న శ్రద్ధాభక్తులు చూసి ప్రవక్త (స) ఆనందిస్తారని కూడా భావిస్తారు. మిఠాయిల పళ్ళాలు, పూలమాలలు, ప్రవక్త (స)ను స్తుతించే ఖవ్వాలీలు, కవితలు, అగరొత్తుల పొగలు, కళ్ళు మిరుమిట్లు గొలిపే విద్యుత్‌దీపాలంకరణలు ఇవన్నీ కేవలం ప్రదర్శనాత్మకమైనవి మాత్రమే. ఇలాంటి బహిరంగ సభల్లో ప్రవక్త (స) జీవిత చరిత్రను ఏవిధంగా వినిపిస్తారంటే, ఆ జీవిత చరిత్ర వింటే ఆయన మనిషి కాదు, ఆయన ఒక దైవాంశ సంభూతుడనిపిస్తాడు. ఆయన శరీరం రక్తమాంసాలతో కాదు కాంతికిరణాలతో తయారైనట్లు, ఆయన నీడ అస్సలు భూమి మీద పడదన్నట్లు, ఆయన జీవితం యావత్తు మహిమలు, మహత్యాలతో నిండి

ఉన్నట్లు, ఆయన విధులూ బాధ్యతలు, ప్రార్థనలన్నింటినీ దైవదూతలు నిర్వర్తిస్తారన్నట్లు, ఆయనకు సంబంధించిన సమాచారం అంతా ఒక మార్మిక సమాచారమన్నట్లు చెబుతారు. నిస్సందేహంగా ప్రవక్త ముహమ్మద్ (స) అధ్యాత్మికంగానూ, నైతికంగానూ మానవులందరిలోను అధికులు, ఉన్నతులు. ఆయన జీవితంలో మానవాతీతమైన సంఘటనలు, మహత్యాలు, దైవదూతలు రావడం వంటివి కూడా ఉన్నాయి. అయితే ఆయన జీవితం ఒక మానవజీవితం. ఆయన ఔన్నత్యానికి కారణం కూడా అదే. ఎందుకంటే సాటిలేని జీవితాన్ని ఒక మనిషిగా ఆయన జీవించి చూపించారు. ఆయన జీవితంలోని ప్రతిపని ప్రకృతి నియమాల ప్రకారమే జరిగింది. చరిత్ర, సంస్కృతులకు సంబంధించిన మౌలిక విషయాలు ఆయన జీవితంలోనూ కనబడ తాయి. ఆయన జీవితంలో సాధించిన విజయాల్లో ప్రతి దశలోను త్యాగాలు చేశారు. ఆయన జీవితం మనకు ఒక నమూనా. ఒక మనిషిగా ఆయన జీవితాన్ని అవగాహన చేసుకున్నప్పుడే మనం మనుష్యులుగా ఆ నమూనాకు అనుగుణంగా మన జీవితాలను మలచుకోగలం. ఆయన జీవితం నుంచి పాఠాలు గ్రహించగలుగు తాము. విలువ లకు, సూత్రాలకు కట్టుబడడం నేర్చుకోగలుగుతాము. మన విధి బాధ్యతలు గుర్తెరగడం సాధ్యమవుతుంది. ఆయన జీవిత చరిత్ర స్ఫూర్తిగా ధైర్యసాహ సాలు, దృఢసంకల్పాలను అలవర్చుకోగలుగుతాము. ఆయన ఒక ఉదాహరణగా మానవాళికి సేవ చేయడాన్ని అలవరచుకోవడం సాధ్యమవుతుంది. దుష్టశక్తులకు వ్యతిరేకంగా పోరాడాలన్న ప్రేరణ లభిస్తుంది. మనం ప్రవక్త (స) జీవితాన్ని ఒక మహత్యంగా, ఒక మహిమగా మార్చేసు కుంటే, ఆయన జీవితం ఒక మానవాతీతమైన జీవితంగా చిత్రీకరించుకుంటే, ఇక మనుష్యులకు ఆదర్శనమూనా అన్నది ఎలా సాధ్యం. అలాంటి మానవాతీత ఆదర్శ నమూనా ప్రకారం మన జీవితాలను మలచు కోవాలన్న ఆలోచన కూడా సాధ్యంకాదు. ఆయన గుణగణాలను మన జీవితాల్లో సాధించే ప్రయత్నం కూడా చేయలేం. ఆ విధంగా మనం ఆయన్ను అత్యధికంగా గౌరవించగలమేమో కాని ఆయన్ను అనుస రించడం సాధ్యం కాదు.

ఇటీవల ఒక కొత్త ధోరణి పుట్టుకొచ్చింది. ఈ ధోరణి పాశ్చాత్యదేశాల నుంచి దిగుమతి అయిన ధోరణి. హీరో వర్షిప్. వ్యక్తిపూజ. ఈ ధోరణి ప్రకారం చరిత్రలోని మహాపురుషులను అత్యధికంగా అభిమానించడం వారిని ఆరాధించడం, వారి విగ్రహాలు ప్రతిష్ఠించడం ప్రారంభమైంది. వారి జన్మదిన వేడుకలను అట్టహాసంగా చేయడం జరుగుతుంది. కాని ఈ అట్టహాసాలన్నీ కేవలం ప్రదర్శ నాత్మకమైనవి. వీటి వల్ల మానవాళికి లభించే ప్రయోజనం ఏదీ ఉండదు. ఇలాంటి వేడుకల్లో ఒక



స్థాయి వరకు అట్టహాసాలు సహజమేనని భావించినప్పటికీ, ఈ వేడుకల వల్ల మన జీవితాలపై పడే ప్రభావం ఏదీ ఉండదు. మనలో వచ్చే మార్పు ఏదీ ఉండదు.

మరో ధోరణి కూడా కనబడుతోంది. అదేమంటే ప్రవక్త (స) జీవితాన్ని ఒక మతంగా పరిమిత దృష్టితో చూడడం. ఆయన జీవితం మనిషికి ఎలా జీవించాలో తెలియజేసే నీతిపాఠమన్న వాస్తవాన్ని గుర్తించకపోవడం. ఈ ధోరణి కలిగిన వారు ప్రవక్త (స) ఏవో కొన్ని బోధనలు చేయడానికి ప్రపంచంలో అరుదెంచారని, కొన్ని ఆచారాలు, కొన్ని విశ్వాసాలు, కొన్ని ప్రార్థనలు, కొన్ని నైతిక విలువలు, కొన్ని మతపరమైన కట్టుబాట్లు నేర్పారని అనుకుంటారు. ప్రవక్త (స) ఉద్దేశ్యం ముస్లిములుగా పిలువబడే వారిని తయారు చేయడం మాత్రమే అనుకుంటారు. ఇలాంటి వారి దృష్టిలో ప్రవక్త (స) జీవితం కొన్ని పరిశుభ్రతా నియమాలు, కొన్ని ప్రార్థనలు, పారాయణాలు, వ్యక్తిగత నైతిక ప్రమాణాల మిశ్రమం తప్ప మరేమీ కాదు. కాబట్టి విస్తృత సాంఘిక జీవనంలో ఎలాంటి సంకోచం లేకుండా ఎంతటి చెడు ఉద్దేశ్యం సాధించుకోవడానికైనా పూనుకుంటారు. ఎలాంటి మోసాల్లోనైనా పాల్గొంటారు. ఇలాంటి వారు ప్రవక్త (స) జీవితంలోని సువర్ణాధ్యాయాలను అర్థం చేసుకోలేదు. ప్రవక్త (స) జీవిత చరిత్ర అధ్యయనంలో ముందుమాటను దాటి ముందుకు వెళ్ళలేరు. ప్రవక్త (స) జీవితం గురించి ఇలాంటి చిత్రీకరణలు ఆధునిక కాలంలో ఇతర జాతులపై ఎలాంటి ప్రభావమూ వేయలేవు. చివరకు ముస్లిం యువకులు కూడా అనుమానాలు, అపార్థాల వలయంలో చిక్కుకుపోతారు. ఆధునిక నాగరికత కారణంగా జన్మించే అనేక సమస్యల పరిష్కారానికి ప్రవక్త (స) మార్గం చూపించ గలరన్న విశ్వాసం వారిలోను లోపిస్తుంది. నేటి వైజ్ఞానిక ఆధునిక యుగానికి సంబం ధించిన సంక్లిష్టమైన, కఠినమైన సమస్యల పరిష్కారం కూడా ప్రవక్త (స) ద్వారా సంతృప్తికరంగా సాధ్య మవుతుందంటే నమ్మలేరు. ఇలాంటి ధోరణుల వల్ల ప్రవక్త (స) జీవితంలోని సువర్ణా ధ్యాయాలపై ఒక పరదా కప్పేయడం జరుగుతోంది. ఈ తప్పుడు సంప్రదాయాలు, తప్పుడు భావాలు ఎందుకు ప్రచారంలోకి వచ్చాయంటే మన సామాజిక వాతావరణం ఇలాంటి భావాలు అభిప్రాయాలను ప్రోత్సహించేదిగా ఉంది కాబట్టి. ఇప్పుడు ఆచరణలో ఉన్న రాజకీయ, సాంఘిక వ్యవస్థలు, మనం జీవిస్తున్న విధానం.. వీటన్నింటి చట్రంలో బతుకుతున్న మనం ఒక విశిష్టమైన మానవాతీత వ్యక్తిని చూడ్డానికే ఇష్టపడతాం. అంటే ప్రవక్త (స) జీవిత చరిత్రలో కనబడే విప్లవాత్మక, సంస్కరణాత్మక వ్యక్తిత్వాన్ని ఆహ్వానించే స్థితిలో మనం లేము. ప్రవక్త (స) జీవిత చరిత్ర నుంచి స్ఫూర్తిని పొంది, అలాంటి ఆలోచనా విధానాన్ని,

అలాంటి భావాలను పెంపొందించు కునే వాతావరణం, మానసిక స్థితి నేడు లోపించింది. తల్లిదండ్రులు తమ పిల్లలను తమకు నచ్చిన రీతిలో పెంచుతున్నారు. తమకు నచ్చిన విధంగా తీర్చిదిద్దుతున్నారు. ఏళ్ళ తరబడి విద్యాభ్యాసం కొనసాగుతోంది. అయితే ఈ విద్యాభ్యాసం యావత్తు ఐహిక జీవిత ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని మాత్రమే ఉంటుంది. ఈ మూసలోనే యావత్తు ప్రపంచం ఒదిగిపోయింది.

ఉద్దేశ్యపూర్వకంగానో లేక అనుద్దిష్టంగానో ఏవిధంగానైనా యావత్తు ప్రపంచం ఇదే నడక నడుస్తోంది. ఈ నేపథ్యంలో ఇహలోక ప్రయోజనాల మూసలో ఇమిడిపోయిన ప్రపంచం ప్రవక్త (స) జీవిత చరిత్రలోని విప్లవాత్మక సంస్కరణాత్మక అంశాల నుంచి పాఠాలు గ్రహించే స్థితిలో లేదు. ప్రవక్త (స) జీవితంలోని ఈ అంశాలపై ప్రసంగాలు, ప్రబోధనలు చెవికెక్కించుకునే పరిస్థితి కనబడడం లేదు. ప్రవక్త (స) జీవితం మన ముందు ఉంచుతున్న ఆదర్శ నమూనాను అనుసరించాలన్న తపన నేడు కానరావడం లేదు.

వాస్తవమేమంటే ప్రవక్త (స) జీవితంలో దాగి ఉన్న అసలు పాఠాలను మనం గ్రహించలేకపోతున్నాం. ఎందుకంటే మన దృష్టిలో ఇతర దృక్పథాలు కదలాడుతున్నాయి. మన ఆలోచనల్లో ఇతర అంశాలు మెదులుతున్నాయి. మన మనోమస్తిష్కాల్లో ఇహలోక ప్రయోజనాల పథకాలు మెరుస్తున్నాయి. అందువల్ల ప్రవక్త (స) జన్మదిన వేడుకలు అట్టహాసంగా జరుపుకున్నా, ఘనంగా నిర్వహించినా, ప్రవక్త (స) పట్ల అపార ప్రేమాభిమానాలు, శ్రద్ధాసక్తులు ఉన్నప్పటికీ, ఆయన జీవిత చరిత్ర అధ్యయనం జరుగుతున్నప్పటికీ, ప్రవక్త (స) జీవితంలో ఉన్న నమూనా జీవితాన్ని అనుసరించ లేకపోతున్నాం. ప్రవక్త (స) తన జీవితాన్ని ఏ ఆదర్శాలకు అంకితం చేశారో ఆ ఆదర్శాల కోసం స్థిరమైన నిబద్ధతతో పనిచేయడం ద్వారా తప్ప మరో విధంగా మనం మన జీవితాల్లో ప్రవక్త (స) జీవితాన్ని ఆహ్వానించలేం.

ప్రవక్త (స) జీవితం రుస్తుం, సోహ్రాబ్‌ల కథ వంటిది కాదు. అరేబియన్ నైట్స్ కథల్లోనిది కాదు. ఇది ఒక కాల్పనిక వ్యక్తి గురించిన కథ కానే కాదు. ప్రవక్త (స) జీవిత అధ్యయనం అన్నది ఏదో సాహిత్య వ్యాపకంగా లేదా కాలక్షేప వ్యవహారంగా చూడరాదు. ఇది ఒక వ్యక్తి కథ కాదు. ఇది ఒక చారిత్రక శక్తి సాధించిన విజయాల గాథ. ఆ చారిత్రక శక్తి ఒక మనిషి రూపంలో సమాజంలో జీవించి ఒక ఆదర్శనీయ జీవనవిధానాన్ని మానవాళికి పరిచయం చేశారు. ప్రపంచానికి దూరంగా అడవుల్లో ముక్కు మూసుకుని దైవధ్యానంలో గడుపుతూ, కేవలం వ్యక్తిగత ఆత్మప్రక్షాళన కోసం జీవితాన్ని వెచ్చించిన ఫకీర్ జీవితం కాదు. ఒక మహా ఉద్యమానికి ప్రాణాలూదిన



మహాశక్తి జీవితచరిత్ర అది. ఆయన జీవిత చరిత్ర కేవలం ఒక వ్యక్తి జీవిత చరిత్ర కాదు. ఒక సమూహం చరిత్ర. చారిత్రక సంఘటనల రికార్డు, సచ్ఛరితులను తయారు చేసిన మహామనిషి జీవిత చరిత్ర. సత్సమాజ స్థాపకుడి ఉత్తమ ఆచరణల చరిత్ర. ఒక కొత్త ప్రపంచాన్ని సృష్టించిన వ్యక్తి గాథ. ఒక సమూహం సాధించిన విజయగాథ. ఒక విప్లవోద్యమం నడిచిన బాట ఆయన జీవిత చరిత్ర. సామూహిక కృషికి అద్దం పట్టే చరిత్ర అది. ఇవన్నీ ఆయన జీవిత చరిత్రలో అంతర్లీనంగా ఉన్నాయి. ప్రవక్త (స) జీవితం హీరా గుహ నుంచి సౌర్ గుహ వరకు, కాబా గృహం పవిత్ర ప్రాంగణం నుంచి తాయిఫ్ బజారుల వరకు, ప్రవక్త (స) ధర్మపత్నుల పవిత్ర గృహసీమల నుంచి యుద్ధమైదానాల వరకు ఆయన జీవితంలోని ప్రతి చర్య ఆధ్యాత్మిక, రాజకీయ, సాంఘీక విప్లవానికి నిలువుటద్దం. ఆయన ఆచరణలే గీటురాళ్ళుగా అనేక మంది తమ జీవితాలను సంస్కరించుకున్నారు. హజ్రత్ అబూబక్ర్ (రజి), హజ్రత్ ఉమర్ (రజి), హజ్రత్ అమ్మార్ (రజి), హజ్రత్ యాసిర్ (రజి), హజ్రత్ ఖాలిద్ (రజి), హజ్రత్ బిలాల్ (రజి), హజ్రత్ సుహైల్ (రజి) వీరంతా ఒకే జీవితానికి సంబంధించిన విభిన్న అధ్యయాలు. ఆయన నడిపిన ఉద్యమం ఒక పెద్ద పూలతోట. ఇందులో ప్రతిపుష్పం తోటమాలి జీవితాన్ని ఆవిష్కరిస్తుంది.

మనం గొప్ప మనిషి అని సాధారణంగా అంటూ ఉంటాం. కాని గొప్ప మనిషి అన్న పదం ప్రవక్త (స) జీవితాన్ని పూర్తిగా ఆవిష్కరించలేదు. ఆయన జీవితం ఒక గొప్పవ్యక్తి జీవితం లాంటి పరిమితమైన జీవితం కాదు. ఒక ప్రసిద్ధ వ్యక్తి జీవితంలా ఏదో ఒక పరిధిలో గడిచిన జీవితం కాదు. గొప్పవ్యక్తులు, ప్రసిద్ధ పురుషులందరి జీవితాల కన్నా అత్యున్నతమైన జీవితం ఆయనది. ప్రపంచంలో అనేకమంది గొప్పవాళ్ళు జన్మించారు. ముందు ముందు కూడా జన్మిస్తుంటారు. నిర్మాణాత్మక సిద్ధాంతాలు ప్రతిపాదించిన గొప్పవాళ్ళు అనేకమంది ఉన్నారు. నైతిక న్యాయ సూత్రాలను రూపొందించిన మహానుభావులు ఉన్నారు. సామాజిక సంస్కరణ కోసం జీవితాన్ని అంకితం చేసిన ఉన్నత చరితులు ఉన్నారు. పెద్ద పెద్ద భూభాగాలను జయించిన మహావిజేతలు ఉన్నారు. సాటిలేని విజయాలను చరిత్రలో నమోదు చేసిన వారూ ఉన్నారు. మహాసామ్రాజ్యాలను సమర్థవంతంగా పాలించిన చక్రవర్తులు ఉన్నారు. ఆధ్యాత్మికంగా అద్భుతమైన ఉదాహరణలుగా నిలిచిన పుణ్యాత్ములూ ఉన్నారు. వ్యక్తిగత నైతిక వర్తనంలో అసాధారణ స్థాయి ప్రదర్శించిన సచ్ఛరితులు ఉన్నారు. కాని ఈ గొప్ప గొప్ప వాళ్ళ జీవిత చరిత్రలను అధ్యయనం చేసినప్పుడు వారి శక్తి సామర్థ్యాలన్నీ జీవితంలోని ఏదో ఒక రంగంలో కేంద్రీకృతమై కనబడతాయి.

మిగిలిన జీవిత రంగాల్లో వారి పాత్ర కనబడదు. జీవితంలోని ఒక రంగం ప్రకాశమానంగాను మిగిలిన రంగాలు చీకటి దొంతరలుగాను కనబడతాయి. అంటే ఒక రంగంలో విజయాలు మరో రంగంలో లోపాలు. కాని మహాప్రవక్త ముహమ్మద్ (స) జీవితంలోని అన్ని రంగాలు ప్రకాశమానమైనవి. ఆయన జీవితంలోని అన్ని రంగాల్లోను సమతుల్యం కనబడుతుంది. ఆయన యావత్తు జీవితం ఒక ఖచ్చితమైన నమూనాగా, పరిపూర్ణ ఆదర్శంగా మన ముందుకు వస్తుంది. ఆయన జీవితంలో ప్రేమాభిమానాలున్నాయి. సహనం సంయమనాలున్నాయి. ఆధ్యాత్మికత ఉంది. ప్రాపంచిక వ్యవహారాలున్నాయి. ప్రార్థనలున్నాయి. ఇతరుల పట్ల గౌరవాదరాలు ఉన్నాయి. ఒక సమూహానికి నాయకత్వం వహించడమూ ఉంది. ఇంటి పనులు చక్కబెట్టుకోవడమూ ఉంది. అణగారిన వారికి సహాయం చేయడమూ ఉంది. అణిచివేతకు పాల్పడిన వారి పట్ల సహనమూ ఉంది. ఈ గుణగణాలన్నీ చక్కని సమతుల్యంతో, ఒకదానికి ఒకటి పొందికగా ఒక పరిపూర్ణ మనిషిని ఆవిష్కరిస్తున్నాయి. మనిషి జీవితంలోని అన్ని రంగాలకు సంబంధించి ఆయన జీవితంలో గొప్ప ఉదాహరణలున్నాయి. ఆయన జీవితం నుంచి మనిషి పాఠాలు గ్రహించడం ప్రారంభిస్తే ఆ మనిషికి మరో మార్గదర్శకత్వం ఏదీ అవసరం లేదు. ప్రపంచంలోని సర్వమానవాళికి వారు ఏ ప్రాంతానికి చెందిన వారైనా, ఏ జాతి వారైనా, తెల్లవారైనా, నల్లవారైనా, చలి దేశాల వారైనా, వేడి దేశాల వారైనా అందరికీ అన్ని కాలాల వారికి ఆచరణల పాఠ్యగ్రంథం ఆయన జీవితం. ఈ మహోన్నత వ్యక్తి జీవితం నుంచి అనేకమంది గొప్పవాళ్ళు పాఠాలు గ్రహించారు. జీవితంలో ప్రగతీ వికాసాలు సాధించారు. ప్రపంచంలో ప్రగతీ వికాసాలు సాధ్యమయ్యాయంటే దానికి కారణం ఈ మహాపురుషుడు చూపించిన మార్గమే. ఆయన అనుచర సమాజంగా ఏర్పడిన వారికి ఆయన సందేశాన్ని ప్రచారం చేయవలసిన బాధ్యత ఉంది. కాని ఈ సమాజం స్వయంగా దారితప్పింది. అస్తవ్యస్తంగా కొట్టుమిట్టాడుతోంది. ఆయన సాధించిన విజయాల గురించి, ఆ విజయాలను సాధించడానికి అనుసరించిన మార్గాల గురించి వేలాది పుస్తకాలు రచించబడ్డాయి. కాని ఆయన అనుచర సమాజంలో ఆ ఉదాహరణ నేడు కనబడడం లేదు. వారి ఆచరణల్లో, వారి వైఖరుల్లో ఈ ఉదాహరణల మెరుపులు కానరావడం లేదు. ప్రవక్త (స) ఆలోచనలు, రాజనీతి, జీవితం, నడవడి, వ్యక్తిత్వం ఆయన చూపించిన సంస్కృతి ఇప్పుడు కూడా మసక మసకగా కనబడుతున్నప్పటికీ, అనేక కొత్త కొత్త భావాల రంగునీళ్లు పడి వెలిసిపోతున్నాయి. ప్రవక్త (స) గడిపిన ఉన్నత జీవితానికి ప్రతినిధులుగా నిలబడే స్థాయి నేడు ఈ సమాజం



కోల్పోయింది. ఆయన స్థాపించిన సంప్రదాయాలకు ప్రాతినిధ్యం వహించే స్థితిలో లేదు. ప్రతి విపరీత సిద్ధాంతం ముంగిట బిచ్చపాత్రతో నిలబడే స్థితిలో తన వద్ద ఉన్న సుసంపన్నమైన వారసత్వాన్ని గుర్తించలేకపోతోంది. దివ్యఖుర్‌ఆన్‌ను పవిత్రంగా అల్మారాల్లో దాచే స్తున్నారు. ప్రవక్త (స) జీవితాన్ని మరిచిపోతున్నారు. అన్నింటికన్నా దురదృష్టమేమంటే, ముస్లిం సమాజం నేడు తన విశ్వజనీన లక్షణాన్ని మరిచి పోయింది. ఒక ధార్మిక మతపరమైన సమూహం స్థాయికి పడిపోయింది. అలాగే ప్రవక్త (స)ను ఒక ఆధ్యాత్మిక, జాతీయ నాయకుడి స్థాయికి తగ్గించివేయడమూ కనబడుతోంది. ప్రవక్త (స) ప్రపంచ మానవాళికి బోధకుడిగా, మానవత్వాన్ని నిలబెట్టిన విశ్వ నాయకుడిగా జీవించినప్పటికీ ఆ అంతర్జాతీయ శక్తిని, ఆయన ఇచ్చిన విశ్వజనీన సందేశాన్ని కేవలం ఒక సమూహానికి మాత్రమే పరిమితం చేసుకోవడం జరిగింది.

ఈ నేపథ్యంలో ప్రవక్త (స) జీవితం మానవాళికి సాటిలేని ఆదర్శం అన్న విషయాన్ని అందరికి స్పష్టంగా తెలిసేలా చేయడం ఎంతైనా అవసరం. ఆ విధంగా ఆ మహాపురుషుని జీవితాన్ని ఉదాహరణగా తీసుకుని ఏ ఒక్కరు తమ జీవితాన్ని మార్చుకున్నా చాలు. అలా మార్చుకున్న వ్యక్తి స్వయంగా సంతోషానందాలు పొందడమే కాదు, మిగిలిన మానవాళికి కూడా ప్రయోజనకరమైన జీవితాన్ని గడుపుతాడు. మానవ సమాజాలను చీకాకు పరుస్తున్న సంక్లిష్ట సమస్యల నుంచి విముక్తి పొందుతాడు. ఒక పరిశుభ్రమైన జీవనవ్యవస్థను సాధించుకుంటాడు. సూర్యరశ్మిలా, వర్షపు చినుకులా ప్రవక్త (స) జీవితం కూడా యావత్తు మానవాళికి చెందిన విశ్వజనీన కాంతిపుంజం. మనం అజ్ఞానంతో, అనాచరణతో కళ్ళు మూసుకుని ఆ కాంతి పుంజాన్ని చూడడం లేదు. చేతులు ముడుచుకుని ఆ ఉదాహరణ ప్రకారం నడుచుకోవడం లేదు. మనం ప్రపంచంలోని గొప్ప తత్వవేత్తల నుంచి పాఠాలు గ్రహించడానికి ప్రయత్నాలు చేస్తూంటాం. ప్లేటో, సోక్రటీస్, మిషెవల్లి, మార్క్స్, ఫ్రాయిడ్, ఐన్‌స్టీన్ వంటి బోధనల నుంచి పాఠాలు గ్రహించడానికి ఎలాంటి భేషజాలు లేకుండా పక్షపాతాలు లేకుండా ప్రయత్నిస్తున్నాము. కాని ప్రవక్త (స) జీవితం నుంచి పాఠాలు గ్రహించడానికి అనేక భేషజాలు అడ్డొస్తున్నాయి. అనేక పక్షపాతాలు అవరోధాలుగా నిలుస్తున్నాయి. ఒక విచిత్రమైన వైఖరి కనబడుతోంది. ప్రవక్త ముహమ్మద్ (స) ముస్లిముల ప్రవక్త కాబట్టి మిగిలిన వారికి ముస్లిములతో ఎలాంటి సంబంధమూ లేదు కాబట్టి, ముస్లిములకు కూడా మిగిలిన వారితో ఎలాంటి సంబంధమూ ఉండదన్న వైఖరి కానవస్తోంది. కాబట్టి ముస్లిముల ప్రవక్త అయిన ముహమ్మద్

(స) పట్ల మిగిలిన వారికి ఎందుకు ఆసక్తి ఉండాలి? అన్న భావన కూడా బలపడింది. ఈ భావన బలపడడానికి ముఖ్యంగా ముస్లిముల వ్యవహారశైలి కారణమని చెప్పాలి. ఆధునిక ప్రజాస్వామిక యుగంలో ప్రపంచ నాయకత్వ పగ్గాలు చేపట్టిన పాశ్చాత్య దేశాలు ప్రవక్త (స) ప్రచారం చేసిన సందేశాన్ని కాని, ఆయన స్థాపించిన సత్యవ్యవస్థను కాని అర్థం చేసుకోలేవు. యూరోపు పునరుజ్జీవనానికి ముందు ప్రకాశమానంగా వెలుగులు విరజిమ్మిన ప్రవక్త (స) వ్యక్తిత్వాన్ని యూరోపియన్ మనస్తత్వం చూడలేదు. ఆధునిక ప్రజాస్వామ్య, అంతర్జాతీయ ఉద్యమాలు, ధార్మిక సంస్కరణల నేపథ్యంలో లీలా మాత్రంగా కదలాడే ఆ మహోవ్యక్తిత్వాన్ని యూరోపు దర్శించలేదు. దీనికి చాలా కారణాలున్నాయి. ముఖ్యమైన కారణం మతపరమైన అసహనం. చరిత్రలో ముస్లిములకు వారికి మధ్య జరిగిన పోరాటాలు, ముఖ్యంగా క్రూసేడు యుద్ధాలు సృష్టించిన విద్వేషం, వైమనస్యాలు ఈ పరిస్థితికి కారణమని చెప్పవచ్చు. మరో కారణమేమంటే ప్రవక్త (స) జీవితంలోని విభిన్న అధ్యయాలను వేర్వేరుగా చదవడం జరిగిందే కాని సంపూర్ణ జీవితాన్ని అధ్యయనం చేయడం జరగలేదు. ఈ క్రమంలో పాశ్చాత్య ఆలోచనాధోరణిని సహించని అధ్యాయాలకు అధిక ప్రాముఖ్యం ఇచ్చి ప్రచారం చేయడం జరిగింది. ఒక ఉద్యమాన్ని, ఒక ఉద్యమ నాయకుడి జీవితాన్ని ఈ విధంగా అధ్యయనం చేయడం వల్ల సరయిన నిర్ణయాలకు రావడం ఎన్నటికీ సాధ్యపడదు. ఫలితంగా ఈ విషయమై పక్షపాతంతో కూడిన, విద్వేషంతో కూడిన సాహిత్యం పుంఖానుపుంఖాలుగా వచ్చింది. ఈ సాహిత్యం సత్యం పట్ల మొగ్గు చూపేవారి మనోమస్తిష్కాలను కూడా కలుషితం చేసింది. పక్షపాతాలు, విద్వేషాల సాలెగూటిని తొలగించడానికి, అపార్థాలు, అపోహలు, అపనమ్మకాల మబ్బులను చెల్లాచెదురు చేయడానికి చిరు ప్రయత్నమే ఈ పుస్తకం. మానవాళికి ప్రవక్త (స) జీవితాన్ని సమగ్రంగా, సంపూర్ణంగా పరిచయం చేయడానికి స్వల్ప ప్రయత్నం ఇది. ప్రవక్త (స) సందేశంలోని విశ్వజనీన లక్షణాన్ని ప్రజలకు తెలియజేసే చిన్నపాటి కృషి ఇది. సమస్త మానవాళి పట్ల, ప్రాచ్యులు, పాశ్చాత్యులు, తెల్లవాళ్ళు, నల్లవాళ్ళు, సంపన్నులు, నిరుపేదలు, కులీనులు, కష్టజీవులు, స్త్రీలు, పురుషులు అన్ని మతాల వారు, అన్ని రాజకీయ వర్గాల వారు, పాలకులు, పాలితులు, పండితులు, పామరులు అందరి పట్ల ఆయనకున్న అపారమైన అభిమానం, అందరి శ్రేయం కొరకు ఆయన పడిన తపన స్పష్టంగా వివరించాలన్నదే ఈ ప్రయత్నం.



**అధ్యాయం - 1**

# ముహమ్మద్ (స) రూపురేఖలు

"వ ఇజ్ నజర్తు ఇలా అసుర్రతి వజ్‌హిహీ
బరఖత్ కబర్‌ఖిల్ ఆరిజిల్ ముతహల్లలీ"

— అబూ కబీర్ హజ్లీ

ఆ ప్రఫుల్ల సుందరవదనం
మబ్బుదొంతరల్లో మిరుమిట్లు గొలిపే మెరుపుతీగ

(అజ్ఞాన కాలానికి చెందిన ఒక ప్రముఖ అరబ్బు కవి హజ్లీ రాసిన కవిత ఇది. హజ్రత్ ఆయెషా (రజి) ఒకసారి ప్రవక్త ముహమ్మద్ (స)కు ఈ కవిత సరిగా సరిపోతుందని అభివర్ణించారు)

ఈ నగుమోము
ఒక అసత్యవాది ముఖం
ఎన్నటికీ కాదు..

— అబ్దుల్లా బిన్ సలామ్

## సంక్షిప్తంగా :

మహోకార్యశీలురైన వ్యక్తులు (ముఖ్యంగా ప్రవక్తలు) అసాధారణ స్థాయి వ్యక్తిత్వం కలిగి ఉంటారు. సంస్కరణా కార్యకలాపాలు, ఉద్యమాలకు మార్గదర్శకత్వం, నాగరికతల నవనిర్మాణం చేసే మహానుభావులకు వారి వ్యక్తిత్వమే నిజమైన శక్తిగా నిలుస్తుంది. ఈ వ్యక్తిత్వం విశిష్టమైన, ప్రత్యేకమైన ఆలోచనలు, దృక్పథాలతో రూపు దిద్దుకుంటుంది. ప్రవక్త ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లమ్ జీవిత చరిత్ర అధ్యయనంలో ఒక ముఖ్యమైన అంశం ఆ కారుణ్యకిరణం వ్యక్తిత్వాన్ని అవగాహన చేసుకోవడం.

ఏ వ్యక్తినైనా అర్థం చేసుకోవడానికి ఆ వ్యక్తి ముఖవర్ఛస్సుఎంతైనా ఉపయోగపడుతుంది. అంతేకాదు, ఆ వ్యక్తి రూపురేఖలు కూడా వ్యక్తిత్వాన్ని తెలియజేస్తాయి. సౌష్ఠవరూపం, శరీరాకృతి వంటివి ఆ వ్యక్తి శారీరక, మానసిక, నైతిక, భావావేశపరమైన స్థాయిని తెలియజేస్తాయి ముఖ్యంగా మనిషి ముఖవర్ఛస్సు ఆ వ్యక్తి నడవడిని, ఆ వ్యక్తి వ్యవహారశైలిని తెరిచిన పుస్తకంలా పరిచయం చేస్తుంది. మనిషి ముఖాన్ని చూడగానే మొదటి చూపులోనే ఆ వ్యక్తి గురించి ఒక అంచనాకు రావడం సాధ్యపడుతుంది.

కాని మన దురదృష్టమేమంటే, ప్రపంచంలో సాటిలేని ఆధ్యాత్మిక విప్లవసారథి, కారుణ్యకిరణం ప్రవక్త ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లమ్ రూపురేఖల గురించి స్పష్టమైన దృశ్యం మనముందు లేదు. ప్రవక్త ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లమ్ సుందరవిగ్రహం మనకు కేవలం ఆయన సందేశసరళి, సాధించిన మహోన్నత విజయాల అద్దంలో మాత్రమే కనబడుతోంది.

ప్రవక్త ముహమ్మద్ సల్లల్లాహు అలైహి సల్లమ్‌కు సంబంధించిన ఎలాంటి చిత్రమూ, రేఖాచిత్రమూ ఎవరి వద్ద లేదు. స్వయంగా ప్రవక్త (స) తన చిత్రపటాల నుంచి ప్రజలను దూరంగా ఉంచారు. ఎందుకంటే చిత్రపటాల చెడుగు దైవానికి భాగస్వామ్యం కల్పించే మహాఉపద్రవంగా మారే ప్రమాదం నివారించలేనిది. ఒకవేళ ప్రవక్త ముహమ్మద్ (స) చిత్రం ఈ రోజు ఉన్నట్లయితే, ఆ చిత్రానికి మహత్యాలు, మహిమలు, అసాధారణ శక్తులు ఇలా ఎన్నెన్నో కల్పనలతో ఎలాంటి పరిస్థితి తలెత్తి ఉండేదో ఊహించలేం. ఆ చిత్రపటానికి గౌరవమర్యాదల పేరుతో ఎలాంటి ఆచారాలు, ఉత్సవాలు, ఆచరణలు ఉనికిలోకి వచ్చేవో? పూజాపురస్కారాలు ప్రారంభమైనా ఆశ్చర్యం లేదు. యూరప్‌లో ప్రవక్త ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లమ్ కల్పనా చిత్రాలు వేసేవారు. కాని ఆ కరుణా సముద్రుడి సంపూర్ణ వ్యక్తిత్వాన్ని ఊహించడం ఏ కళాకారుడికి సాధ్యం? ఎవరు ఆ కృపారూపుడి రూపురేఖలను ఊహించి చిత్రీకరించ గలరు. ఈ కల్పనా చిత్రాలు ఏవి కూడా ఆ మహోన్నత వ్యక్తిని ప్రతిబింబించలేవు. ఏదో ఒక రూపానికి చిత్రపటంగా రంగులు అద్ది ప్రవక్త (స) పేరు పెట్టడం మాత్రమే జరిగేది. ఈ వ్యవహారంలో నిజాయితీ ఏ కోశానా లేదు. ఇలాంటి ఊహాచిత్రాలు ఒక బలహీనమైన, అల్పవ్యక్తిత్వాన్ని ప్రతిబింబించడం కూడా జరగవచ్చు. యూరప్‌లో ఇలాంటి చిత్రాలు వేసిన వారు, తమకు కావలసిన



వివరాలను అప్రమాణికమైన పుస్తకాలు, ప్రస్తావనల నుంచి గ్రహించారన్నది కూడా ఇక్కడ గుర్తుపెట్టుకోవాలి. ఈ అప్రమాణికమైన పుస్తకాలు అవగాహనాలోపానికి, అవాస్తవ సమాచారానికి నిదర్శనాలు. అలాంటి పుస్తకాలు ప్రస్తావనల నుంచి లభించిన వివరాల రంగులు తాము వేసిన చిత్రానికి అద్దేవారు. ప్రవక్తలు, పుణ్యపురుషుల కల్పనా చిత్రాలను వేయడం, లేదా ఆ మహానుభావుల పాత్రలను నాటకాల్లో రంగస్థలాలపై ప్రదర్శించడం వల్ల వాటిల్లే నష్టం ఇదే. ఆ నిష్కాగరిష్ఠుల నిజవ్యక్తిత్వం పలచబడిపోతుంది. నాటకంలోని తెరల మాటున ఆ పుణ్యపురుషుల వ్యక్తితం మసకబారిపోతుంది.

అయితే ప్రవక్త (స) సహచరులు (రజి) ప్రవక్త గారి రూపురేఖలను స్పష్టంగా అభివర్ణించారు. ఈ వర్ణనలను తర్వాతి తరాల వారు భద్రపరిచారు. తరతరాలుగా ఈ ఉటంకాలు సురక్షితంగా కొనసాగుతూ వచ్చాయి. ఆ కారుణ్య కిరణం జీవిత చరిత్రను అధ్యయనం చేసే ముందు ఆయన రూపురేఖల వర్ణనలను తెలుసుకుని మనోనేత్రంతో ఆ మహోన్నత వ్యక్తిని ఒకసారి చూద్దాం. ఇది ఒక దృశ్యవర్ణన, ఇది ఒక సంక్షిప్త పరిచయం.

ప్రవక్త ముహమ్మద్ సల్లల్లాహు అలైహివసల్లమ్ ముఖవర్ఛస్సు, శరీరాకృతి, రూపురేఖలు, మాటతీరు, నడవడి, ముఖారవిందం గురించిన వివరాలు శతాబ్ధాల దొంతరల నుంచి మన వరకు భద్రంగా చేరాయి. ఆ వివరాలను పరిశీలిస్తే మన కళ్ళ ముందు కనబడే వ్యక్తిత్వం ... ఒక మేధావి, మహాశూరుడు, సహనశీలుడు, వినయం, వివేచన, నిజాయితీ, వాక్చాతుర్యం, బాధ్యతాభావం, గాంభీర్యం వంటి అత్యున్నత గుణగణాలతో ప్రకాశించే వ్యక్తిత్వం. నిజం చెప్పాలంటే ప్రవక్త (స) శరీరాకృతి ఆయన ప్రవక్త అని చెప్పకనే చెప్పేలా ఉండేది. ఆయన ముఖవర్ఛస్సు స్వయంగా ఆయన ఔన్నత్యాన్ని చాటిచెప్పేలా ఉండేది. ఈ సందర్భంగా ప్రవక్త ప్రవచనం ఒకటి మనకు తప్పక గుర్తుకు వస్తుంది. “దైవభీతి మాత్రమే ముఖాలను ప్రకాశవంతం చేస్తుంది” అన్నారాయన. ప్రవక్త పదవి అన్నది దైవవిశ్వాసం, దైవభీతికి సంబంధించి అత్యున్నత స్థాయి. అందువల్ల ప్రవక్త (స) ముఖారవిందం మహాతేజస్సుతో ప్రకాశించడం సహజమే.

దీన్ని బట్టి ఆ సత్యభానుడి రూపురేఖలు మనకు ఈ క్రిందివిధంగా కనబడతాయి.

## ముఖవర్చస్సు :

నేను ప్రవక్త గారిని చూడగానే అనుకున్నాను. ఆయన ముఖం ఒక అసత్యవాది ముఖం కాదు. (అబ్దుల్లా బిన్ సలామ్)

(పాదసూచిక : ఈయన ఆ కాలంలో యూదుల ప్రసిద్ధ పండితుడు. ఆయన పేరు హుస్సేన్. ప్రవక్త (స) మదీనా తరలివచ్చినప్పుడు, ఈ యూద పండితుడు ప్రవక్త (స)ను చూడ్డానికి వెళ్ళాడు. ప్రవక్త (స)ను చూడగానే ఆయన మనసులో కదలాడిన భావాన్ని ఈవిధంగా తెలిపారు. ఆ తర్వాత ఆయన ఇస్లాంను స్వీకరించి అబ్దుల్లాగా మారారు. (సీరతుల్ ముస్తఫా, మౌలానా ఇద్రీస్ కాంధల్వీ, మొదటి సంపుటం, పేజీలు 349, 350)

నేను నా కుమారుడిని తీసుకుని ఆయన వద్దకు వెళ్ళాను. అక్కడ ఉన్న వారు నాకు ఈయనే దైవప్రవక్త అని చూపించారు. చూడగానే నేను ఈయన నిజంగానే దేవుని ప్రవక్త అన్నాను. (అబూ రమ్సా యతామా) (పాదసూచిక: షిమాయిలె తిర్మిజి)

– ప్రశాంతంగా ఉండండి. నేను పున్నమి నాటి చంద్రునిలా ప్రకాశించే ముఖారవిందం ఉన్న వ్యక్తిని చూశాను. ఆయన మీతో చెడుగా వ్యవహరించే వ్యక్తి కానేకాదు. అలాంటి వ్యక్తి (ఒంటెకు సంబంధించిన సొమ్ము) చెల్లించకపోతే, నేను ఆ సొమ్ము ఇస్తాను. (ఆనాటి ఒక మహిళ)

(మదీనాలో ఒక వర్తకబృందం వచ్చింది. మదీనా నగరానికి బయట విడిది చేసింది. ప్రవక్త (స) యాధృచ్ఛికంగా అటునుంచి వెడుతున్నారు. ఆయన అక్కడ ఒక ఒంటెను కొన్నారు. ఒంటెను తీసుకుని తనతో వస్తే ఒంటె సొమ్ము చెల్లిస్తానని చెప్పారు. ఆయన వెళ్ళిన తర్వాత వర్తకులు పరిచయం లేని మనిషిని నమ్మి ఒంటె ఇచ్చామని బాధపడసాగారు. అప్పుడు ఆ వర్తకబృందం నాయకుడి భార్య ఈ మాటలు చెప్పింది. ఈ వృత్తాంతాన్ని తారిక్ బిన్ అబ్దుల్లా ఉటంకించారు. ఆయన అప్పుడు ఆ వర్తకబృందంలో ఉన్నారు. ఒంటెను తీసుకెళ్ళిన ప్రవక్త (స), ఆ వర్తకులు కోరిన మొత్తం కన్నా ఎక్కువ విలువ కలిగిన ఖర్జూరాలు వారికి పంపించారు. (సీరతున్నబీ, మౌలానా షిబ్లి, రెండవ సంపుటం, పేజి 380, అల్ మువాహి బుద్దునియా, పేజీ నెం. 244)



మేము ఇలాంటి సుందర ముఖాన్ని ఎక్కడా చూడలేదు. ఆయన ముఖం నుంచి ప్రకాశం వెలువడడాన్ని మేం చూశాము. (అబూ ఖుర్సాఫా తల్లి, పినతల్లి)

(**పాదసూచిక:** ఈ ఇద్దరు మహిళలు ఇస్లాం స్వీకరణ కోసం అబూ ఖుర్సాఫాతో పాటు ప్రవక్త (స) వద్దకు వెళ్ళారు. వెనక్కి వస్తున్నప్పుడు ప్రవక్త (స) గురించి తమ అభిప్రాయాన్ని ఇలా చెప్పారు.)

ప్రవక్త (స) కన్నా సుందరవదనాన్ని ఎక్కడా చూడలేదు. ఆ ముఖం చూస్తే ప్రకాశించే సూర్యుడిలా ఉండేది. (అబూ హురైరా (రజి)

మీరు ప్రవక్త (స) గారిని చూస్తే సూర్యోదయమైందనుకుంటారు. (రాబిఆ బింతె మాజ్)

ఆయన్ను చూసిన వారు మొదటి చూపులోనే ఆకర్షితులైపోతారు. (హజ్రత్ అలీ (రజి)

నేను ఒకసారి వెన్నెల రాత్రి ప్రవక్త ముహమ్మద్ (స)ను చూస్తున్నాను. ఆయన అప్పుడు ఎరుపు రంగు వస్త్రాలు ధరించి ఉన్నారు. నేను కొంత సేపు చంద్రుడిని, కొంతసేపు ఆయన ముఖారవిందాన్ని చూడసాగాను. చివరకు చంద్రుడి కన్నా ప్రవక్త (స) గారే అందంగా ఉన్నారని తేల్చుకున్నాను. (హజ్రత్ జాబిర్ బిన్ సమ్రా)

ప్రవక్త (స) సంతోషంగా ఉన్నప్పుడు ఆయన నగుమోము చంద్రబింబంలా మెరిసేది. ఆయన ముఖంలోని మెరుపులను చూసి మేం ఆయన సంతోషంగా ఉన్నారని గుర్తించేవాళ్ళం. (కాబ్ బిన్ మాలిక్ (రజి)

ప్రవక్త రూపురేఖలు, ముఖవర్చస్సు గురించి ఎవరేమన్నారో ఇప్పుడు చూద్దాం...

**ముఖారవిందం** : ఆయన మోము నిండు చంద్రునిలా ప్రకాశించేది (హింద్ బిన్ అబీ హాలా)

ఆయన ముఖం చంద్రుడిలా గుండ్రంగా ఉండేది (బారా బిన్ అజీబ్)

ఆయన ముఖం పూర్తిగా గుండ్రంగా లేదు, కొద్దిపాటి కోలగా ఉండేది (హజ్రత్ అలీ)

విశాలమైన నదురు, వంపు తిరిగిన దట్టమైన కనుబొమలు మధ్యలో విడివడి ఉండేవి. ఆ రెంటి మధ్య ఒక ఉబ్బిననరం కనిపించేది. ఆయన కోపంగా ఉన్నప్పుడు ఈ ఉబ్బెత్తు నరం మరింత పైకి ఉబికి కనబడేది. (హింద్ బిన్ అబీ హాలా)

**రంగు** : మరీ తెల్లని తెలుపు కాదు. ఎండలో కమిలిన తెలుపు కూడా కాదు. తెలుపు అధికంగా ఉన్న గోధుమ వర్ణం (హజ్రత్ అనస్)

ఎరుపు దనంతో కూడిన తెలుపు (హజ్రత్ అలీ)

ఆకర్షణీయమైన తెలుపు (హజ్రత్ తుఫైల్)

ప్రకాశమానమైన తెలుపు (హింద్ బిన్ అబీ హాలా)

**కళ్ళు:** నల్లకళ్ళు, కనురెప్పల వెంట్రుకలు పొడవుగా ఉండేవి (హజ్రత్ అలీ)

నల్లకళ్ళు, కొద్దిగా అరమోడ్పుగా ఉండేవి. లజ్జతో కనుసన్నల నుంచి చూసే అలవాటు ఉండేది. (హింద్ బిన్ అబీ హాలా)

తెలుపు భాగంలో ఎరుపు చారలు ఉండేవి. వెడల్పయిన కళ్ళు. సహజంగానే కనుకొలకుల్లో నలుపుదనం ఉండేది. (జాబిర్ బిన్ సమ్రా)

**ముక్కు:** ఎత్తయిన ముక్కు ప్రత్యేకమైన ప్రకాశంతో ఉండేది. అందువల్ల మొదటిసారి చూసినప్పుడు పెద్దదిగా కనబడేది. (హింద్ బిన్ అబీ హాలా)

**చెంపలు:** సొష్టవంగా, మృదువుగా ఉండేవి. చెంపల క్రింది భాగంలో కొద్దిగా క్రిందికి వాలి ఉండేవి (హింద్ బిన్ అబీ హాలా)

**నోరు:** వెడల్పయిన నోరు (జాబిర్ బిన్ సామ్రా)

కొద్దిగా వెడల్పు (హింద్ బిన్ అబీ హాలా)

**దంతాలు** : పలుచని, ప్రకాశమానమైన, సౌష్టవం కలిగిన దంతాలు, ముందరి పళ్ళ మధ్య ఖాళీ ఉండేది (హజ్రత్ ఇబ్నె అబ్బాస్)

మాట్లాడుతున్నప్పుడు దంతాల నుంచి మెరుపులు కురుస్తున్నట్లు ఉండేది (హజ్రత్ అనస్)



**గడ్డం** : నిండైన దట్టమైన గడ్డం (హింద్ బిన్ అబీ హాలా)

**మెడ** : పలుచని పొడవైన మెడ, చక్కగా చెక్కిన శిల్పంలాంటి మెడ, మెడ వెండిలా తెల్లగా మెరుస్తూ అందంగా ఉండేది. (హింద్ బిన్ అబీ హాలా)

**తల** : పూర్తి సౌష్టవాకారం ఉన్న పెద్ద తల (హింద్ బిన్ అబీ హాలా)

**కేశాలు** : తిన్నని కేశాలుకాదు, పూర్తి ఉంగరాల జుట్టూ కాదు (ఖతాదా)

కొద్దిగా ఉంగరాల జుట్టు (హజ్రత్ అనస్)

**దట్టమైన కేశాలు** : ఒక్కోసారి చెవిలోలకుల వరకు ఉండేవి. ఒక్కోసారి భుజాల వరకు ఉండేవి (బారా బిన్ అజీబ్)

మధ్యపాపిడి (హింద్ బిన్ అబీ హాలా)

శరీరంపై ఎక్కువగా కేశాలు లేవు. రొమ్ము నుంచి నాభి వరకు కేశాలు సన్నని రేఖలా ఉండేవి. (హజ్రత్ అలీ,హింద్ బిన్ అబీ హాలా)

భుజాలపై, చేతులపై, ఛాతీపై భాగాన కొద్దిగా కేశాలు ఉండేవి (హింద్ బిన్ అబీ హాలా)

**సాధారణ ఆకారం** : దృఢమైన శరీరం, కీళ్ళ వద్ద ఎముకలు పెద్దగా, బలంగా ఉండేవి. (హింద్ బిన్ అబీ హాలా)

లావైన శరీరం కాదు (హజ్రత్ అలీ)

మరీ పొడవు కాదు, పొట్టి కాదు, మధ్యస్థమైన ఎత్తు

## వస్త్రధారణ

వస్త్రధారణ విషయమై ఖుర్ఆన్ క్రింది విధంగా చెప్పింది.

**"ఆదము సంతానమా! మేము మీపై దుస్తులను అవతరింపజేశాము. అవి మీరు సిగ్గుపడే మీ శరీర భాగాలను కప్పుతాయి. మీ శరీర రక్షణకు, శోభకు సాధనంగా ఉంటాయి. భయభక్తులు అనే దుస్తులే మంచి దుస్తులు."**

***(దివ్యఖుర్ఆన్ 7 : 26)***

మరోచోట ఇలా పేర్కొంది

**"మీకు వేడిమి నుంచి కాపాడే దుస్తులనూ, యుద్ధరంగాలలో మిమ్మల్ని రక్షించే కవచాలనూ మీకు ప్రసాదించాడు."** ***(దివ్యఖుర్ఆన్ 16 : 81)***

ఆవిధంగా ఈ నియమాల ప్రకారమే ప్రవక్త(స) వస్త్రధారణ ఉండేది. దుస్తులు శరీరానికి రక్షణ ఇచ్చేవిగా, హుందాగా ఉండేవి. అన్నింటికి మించి దుస్తులు దైవభీతిని ప్రతిబింబించేవిగా ఉండేవి. అవసరానికి తగినవిధంగా, ఖచ్చితమైన నైతిక ప్రమాణాలకు అనుగుణంగా, మంచి అభిరుచిని చాటి చెప్పేవిగా ఆయన దుస్తులు ఉండేవి. ప్రవక్త(స) అహంకారాన్ని, అభరణాలతో అలంకరణలను అసహ్యించు కునేవారు. తాను దైవదాసుడినని, అందుకు తగినవిధంగా తన దుస్తులు ఉంటాయని చెప్పేవారు. సాధారణంగా ప్రవక్త(స) ఒక లుంగీ వంటి వస్త్రాన్ని నాభిపైన కట్టుకునేవారు. అది మోకాళ్ళ కన్నా కాస్త క్రిందికి వుండేది. మడమల కన్నా పైకి ఉండేది. ఈ లుంగీ ముందుభాగంలో కాస్త పైకి, వెనుక భాగంలో కాస్త కిందికి ఉండేలా కట్టేవారు. ఒక పొడవైన కుర్తా, తలపాగా ధరించేవారు. అనుచరులు పైజామా ధరించడాన్ని చూసినప్పుడు వాటిని ఇష్టపూర్వకంగా ఆమోదించారు. తన కోసం కూడా పైజామా కొనుక్కున్నారు. ఆయన మరణానంతరం ఆయన వదిలి వెళ్ళిన వస్తువుల్లో ఈ పైజామా కూడాఉంది. ఆయన అప్పుడప్పుడు టోపీ కూడా ధరించేవారు. మేజోళ్ళు తొడుక్కునేవారు. అబిసినియా రాజు నీగస్ పంపించిన మేజోళ్ళ జత చాలా కాలం ధరించారు. వుజూ చేస్తున్నప్పుడు పాదాలు కడిగే బదులు మేజోళ్ళపై తడి చేతులతో రాసేవారు. వహియా కల్బీ కానుకగా పంపిన మేజోళ్ళ జత కూడా చాలా కాలం ధరించారు. ఆయన తెల్లని దుస్తులను ఇష్టపడేవారు. మృత శరీరాలను కూడా తెల్లటి వస్త్రాల్లో చుట్టాలని ఆదేశించారు. ఆయన చెప్పుల వంటి పాదరక్షలు ధరించేవారు. తన చిటికెన వేలికి ఒక ఉంగరాన్ని ధరించేవారు. ఆ ఉంగరంపై... ముహమ్మద్ రసూలుల్లాహ్... అని చెక్కబడి ఉండేది. ఈ ఉంగరాన్ని ముద్రికగా కూడా ఉపయోగించేవారు. ఆయన వస్త్రాలు ఎల్లప్పుడు పరిశుభ్రంగా ఉండేవి. ఆయనకు ఆడంబరాలంటే ఇష్టం ఉండేది కాదు. అయితే ఆయన ఎన్నడూ తాపసుల మాదిరిగా లేదా సర్వసంగ పరిత్యాగి మాదిరిగా వస్త్రాలు ధరించలేదు.

ఆయన ఇంటి వద్ద ఉన్నా లేక ప్రయాణంలో ఉన్నా ఎల్లప్పుడు ఏడు వస్తువులు తన పడక వద్ద ఉంచుకునేవారు 1. తలనూనె 2. దువ్వెన 3. సుర్మాదాని 4.కత్తెర



5. దంతంపుల్ల 6.అద్దం 7.లాఠీ. ఆయనకు సువాసనలంటే చాలా ఇష్టం. ఎవరైనా సువాసన ద్రవ్యాలు కానుకగా ఇస్తే సంతోషంగా స్వీకరించేవారు.

ఆయన ఎప్పుడూ చాలా హుందాగా, బలంగా నడిచేవారు. నడుస్తున్నప్పుడు చూపులు ముందుకే ఉండేవి. అనేక బాధ్యతల్లో తలమునకలై ఉన్నప్పటికీ ఆయన సామాజిక చర్చల్లో పాల్గొనేవారు. ఈ చర్చల్లో అన్ని విధాల ధార్మిక, ప్రాపంచిక విషయాలు ప్రస్తావనకు వచ్చేవి. ఆయన ఎప్పుడూ చాలా నెమ్మదిగా మాట్లాడేవారు. ప్రతి పదం స్పష్టంగా పలికేవారు. వినేవారికి ప్రతి పదం గుర్తుండిపోయేది. ఆయన మాట్లాడుతున్నప్పుడు స్వరం హెచ్చుతగ్గులు ఆకట్టుకునేలా ఉండేవి. భావ వ్యక్తీకరణకు, అభిప్రాయ ప్రకటనకు భాషాపరంగా అరబీ భాష అప్పటికే చాలా అభివృద్ధి సాధించింది. అత్యుత్తమ వ్యక్తీకరణలు అరబీ ప్రత్యేకతగా ఉండేవి. ప్రవక్త ముహమ్మద్(స) మాట తీరు మరింత మృదువుగా, మరింత ఉత్కృష్టంగా ఉండేది. ప్రేరణాత్మకంగా ఉండేది. స్పష్టతలో కాని, శైలిలో కాని ఆయన మాట తీరు సాటిలేనిదిగా ఉండేది. మాట తీరులో సాటిలేని విశిష్టత ఉండేది. క్లుప్తత, భావస్పష్టత ఆయన ప్రత్యేకతలుగా ఉండేవి. ఆయన మాట్లాడిన కొన్ని పదాలు కూడా గొప్ప భావాలను ప్రకటించేవి.

ఆయన ప్రసంగాల్లో ముఖ్యమైన రెండు ప్రసంగాలు. ఒకటి, మక్కా విజయానంతరం చేసిన ప్రసంగం. రెండవది, చివరి హజ్ యాత్ర సందర్భంగా చేసిన ప్రసంగం. చివరి హజ్ ప్రసంగం నిజానికి చరిత్రలో ఒక కొత్త అధ్యాయాన్ని ప్రారంభించింది.

ప్రవక్త(స) బయటకు వెళ్ళినప్పుడు ఎవరు కనబడినా పలకరించేవారు. తనకు కనబడిన వారిని తానే ముందు పలకరించి సలామ్ చేసేవారు. ఎవరికైనా ఏదైనా సందేశం పంపుతున్నప్పుడు తన శుభాకాంక్షలు కూడా పంపించేవారు. ఎవరి నుంచైనా ఏదైనా సందేశం వచ్చినప్పుడు ఆ సందేశం తీసుకొచ్చిన వ్యక్తికి, సందేశం పంపిన వారికి ఇద్దరికీ శుభాకాంక్షలు చెప్పేవారు. ఒకసారి ఆయన దారిలో కొంతమంది పిల్లలను చూశారు. వారికి తానే ముందు సలామ్ చేశారు. అలాగే దారిలో కనబడిన మహిళలకు కూడా తానే ముందుగా సలామ్ చేసేవారు. ఆయన ఇంటి నుంచి బయటకు వెళుతున్నప్పుడు, ఇంటిలోకి వస్తున్నప్పుడు ఇంటి వారికి సలామ్ చేసేవారు. ఆయన స్నేహితులతో కరచాలనం చేసేవారు. వారిని ఆలింగనం చేసుకునేవారు.

ఒక్కోసారి వారి నుదుటిని ముద్దాడేవారు. చేయి కలిపి కరచాలనం చేస్తున్నప్పుడు ఎదుటి వ్యక్తి తన చేయి వెనక్కి తీసుకున్న తర్వాతే తాను చేయి వెనక్కి తీసుకునేవారు, సభలు, సమావేశాల్లో ఆయన ఎల్లప్పుడూ ఒక మూల ప్రదేశాన్ని ఇష్టపడేవారు. ముందు వరుసలో కూర్చోవడానికి ఇతరులను నెట్టుకుంటూ ముందుకువెళ్ళేవారు కాదు. ఒక దైవదాసుడు ఎలా కూర్చోవాలో నేను అలా కూర్చుంటాను అనేవారు. తనపట్ల ప్రజలు గౌరవసూచకంగా లేచి నిలబడడాన్ని ఆయన ఇష్టపడలేదు. ఎవరైనా తనను కలువడానికి వస్తే వారు కూర్చోవడానికి దుప్పటి పరిచేవారు. వచ్చిన వారు తమకు తాము వెళ్ళడానికి సిద్ధపడే వరకు ఆయన వారిని వదిలివెళ్ళేవారు కాదు. నలుగురితో మాట్లాడుతున్నప్పుడు అసంబద్ధ విషయాలేవీ ఆయన ప్రస్తావించేవారు కాదు. ఏ విషయం గురించి అందరూ మాట్లాతున్నారో అదేవిషయంపై తాను మాట్లాడేవారు. తన సహచరులతో ఆయన చాలా ఆత్మీయంగా మాట్లాడేవారు. ఇస్లామ్‌కు పూర్వకాలం నాటి సంఘటనల గురించి కథలు చెప్పుకునేవారు. నాటి పరిస్థితిపై నవ్వుకునేవారు. దివ్యఖుర్ఆన్ వాక్యాలను పఠించడం, వ్యాఖ్యానం చేయడం కూడా ఈ గోష్ఠులలో జరిగేది. ఏదన్నా విషయం పట్ల ప్రజల్లో ఆసక్తి తగ్గినట్టు అనిపిస్తే ప్రవక్త(స) వెంటనే ఆ విషయాన్ని మార్చి వేరే విషయంగురించి మాట్లాడేవారు. ప్రవక్త(స) అందరితో సమానమైన ఆప్యాయత కనబరిచేవారు. తన పట్ల ప్రవక్త(స) పక్షపాతంగా ఉన్నారని లేదా వివక్ష చూపిస్తున్నారని ఫిర్యాదు చేసే అవకాశం ఎవరికీ ఉండేది కాదు. ఏదన్నా విషయమై చర్చ జరుగుతున్నప్పుడు ఎవరైనా ఏదైనా అసంబద్ధమైన విషయాన్ని మాట్లాడితే లేదా అనవసరంగా వేరే విషయం గురించి ప్రస్తావిస్తే ప్రవక్త(స) దానిగురించి పెద్దగా పట్టించుకునేవారు కాదు. చర్చ ఏ విషయంపై జరుగుతుందో ఆ విషయం గురించే మాట్లాడేవారు. ఆ తర్వాత అసంబద్ధ విషయాన్ని ప్రస్తావించిన వ్యక్తి వైపు తిరిగి మృదువుగా తెలియ జేసేవారు. ఆయన ఎన్నడూ ఎవరి నుంచి ముఖం తిప్పుకోలేదు. ఎదుటి వ్యక్తి తన ముఖాన్ని తిప్పుకునే వరకు లేదా ఎదుటి వ్యక్తి తన మాట పూర్తిచేసేవరకు ప్రవక్త(స) ఆ వ్యక్తి వైపే చూసేవారు. తనకిష్టంలేని విషయం గురించి ఎదుటి వ్యక్తి మాట్లాడు తున్నా ప్రవక్త(స) సహనంతో వినేవారు. అవసరమైతే మృదువుగా మందలించేవారు. తాను ఇష్టపడని వారితో కూడా నవ్వుతూ మాట్లాడేవారు. ఒకసారి ఒక వ్యక్తి ఆయన వద్దకు వచ్చాడు. అందరికన్నా నాసిరకం మనిషిగా ప్రవక్త(స) ఆ వ్యక్తిని భావించేవారు.



అయినా ఆ వ్యక్తితో ప్రవక్త(స) చాలా ఆత్మీయంగా మాట్లాడారు. ఇదిచూసి హజ్రత్ ఆయెషా(రజి) ఆశ్చర్యపోయారు. ప్రవక్త(స) ఆమెకు వివరిస్తూ... దైవం సాక్షి, కఠినమైన మాట తీరు వల్ల ప్రజలను దూరం చేసుకున్న వ్యక్తికి తీర్పుదినాన చాలా చెడ్డ పరిస్థితి ఉంటుంది.. అన్నారు.

అయన ఎవరినైనా కలువడానికి వెళ్ళినప్పుడు బయటి నుంచి అనుమతి కోరేవారు. ఒకవేళ రాత్రిపూట ఎవరినైనా కలువడానికి వెళితే ఇంటి బయట నుంచి తగ్గుస్వరంతో పిలిచేవారు. ఆ వ్యక్తి మెలకువగా ఉంటే మాత్రమే వినబడేలా పిలిచే వారు. ఒకవేళ పడుకుని ఉంటే నిద్రాభంగం కాని విధంగా పిలిచేవారు. లోపలి నుంచి ఎలాంటి జవాబు రాకపోతే ఆయన ఎలాంటి కోపాన్ని లేక చిరాకును ప్రదర్శించకుండా అక్కడినుంచి వెళ్ళిపోయేవారు. ఎవరైనా తన దుస్తులపై నుంచి దుమ్ము లేదా గడ్డిపరకలను తొలగిస్తే ఆయన వెంటనే కృతజ్ఞతలు చెప్పేవారు. అతనికోసం దేవున్ని ప్రార్థించేవారు. మీకు అయిష్టమైన వాటన్నింటినీ అల్లాహ్ మీకు దూరంగా ఉంచుగాక అని ప్రార్థన చేసేవారు. ఆయన కానుకలు స్వీకరించే వారు. తాను కూడా బదులుగా కానుకలు ఇచ్చేవారు. ఎవరైనా తన వద్దకు కొత్త దుస్తులు ధరించి వస్తే ఆయన మెచ్చుకోలుగా.. బాగున్నాయి... బాగున్నాయి... ఈ దుస్తుల్ని బాగా తొడుక్కోండి.. ఇవి ఎంతకాలం మన్నుతాయో అంతకాలం తొడగండి అనేవారు. తన పట్ల చెడ్డగా వ్యవహరించిన వారితో కక్షసాధింపు వైఖరి ఆయనలో ఉండేది కాదు. వారిని క్షమించి విడిచిపెట్టేవారు. ఎవరైనా తనను పిలిస్తే ఆ పిలిచిన వారు ఎవరైనా గాని ఆయన చాలా మర్యాదగా ఏమిటని అడిగేవారు.

రోగుల పరామర్శ పట్ల ఆయన చాలా శ్రద్ధ చూపించేవారు. రోగుల వద్దకు వెళ్ళివారిని పరామర్శించేవారు. వారికి ఎలా ఉందో అడిగి తెలుసుకునేవారు. రోగి పక్కన కూర్చుని, రోగి నుదుటిపై చేయి వేసి అడిగేవారు. రోగి ఏదన్నా తినడానికి కావాలని అడిగితే, ఆ పదార్థం తినడం వల్ల అతడికి ఎలాంటి నష్టమూ లేనిదైతే ఆ పదార్థాన్ని తప్పక రోగికి పంపించేవారు. ఆయన రోగిని ప్రేమగా స్పర్శిస్తూ ధైర్యం చెప్పేవారు. దైవం తలిస్తే నువ్వు తప్పక కోలుకుంటావు అనేవారు. వ్యాధిగ్రస్తులైన బంధువులు వారు ఇస్లాం స్వీకరించని వారైనాగాని ప్రవక్త(స) తప్పక పరామర్శిం చేవారు. ఆయన ఒకసారి మంచాన పడి ఉన్న ఒక యూదబాలుడిని పరామర్శించారు.

ఆ తర్వాత ఆ యూద బాలుడు ఇస్లాం స్వీకరించాడు. రోగుల పరామర్శకు ఒక నిర్ధారిత సమయం అంటూ ఉండేదికాదు. ఎవరైనా జబ్బుపడ్డారని తెలిస్తే ప్రవక్త(స) తనకు తక్షణం చేయవలసిన పనులు లేనట్లయితే వెంటనే పరామర్శకు వెళ్ళేవారు. మదీనానగరంలో ప్రవక్త(స)కు ఇబ్బందులు సృష్టిస్తున్న కపట విశ్వాసుల నాయకుడు అబ్దుల్లా బిన్ ఉబై జబ్బుపడినప్పుడు, ప్రవక్త(స) అతడిని కూడా పరామర్శించారు.

ఎవరైనా మరణించారని తెలిస్తే వెంటనే ఆ ఇంటికి వెళ్ళేవారు. ఆ కుటుంబ సభ్యులను ఊరడించేవారు. ఇలాంటి సందర్భాల్లో బిగ్గరగా రోదించడాన్ని ఆయన నివారించారు. మృతదేహాన్ని పరిశుభ్రమైన తెల్లని వస్త్రంలో చుట్టాలని చెప్పేవారు. తన ముందు నుంచి ఎవరిదైనా శవయాత్ర అయినా ఆయన ఇలాగే చేసేవారు. మరణం తర్వాత మృతదేహాన్ని ఆలస్యం లేకుండా ఖననం చేయాలని గట్టిగా చెప్పారు. ఆయన ముస్లిముల శవప్రార్థనలకు నాయకత్వం వహించి ప్రార్థనలు చేయించారు. శవయాత్రలో వెంట నడిచేవారు. మరణం సంభవించిన ఇంటికి ఇతరులు ఆహార పదార్థాలు పంపించాలని చెప్పారు. ప్రయాణాల నుంచి తిరిగి వచ్చిన వారిని ఆలింగనం చేసుకుని స్వాగతం పలికేవారు. ప్రయాణమై వెళుతున్న వారికి వీడ్కోలు పలికేవారు.. మీ ప్రార్థనల్లో నన్ను గుర్తుంచుకోండి. అని చెప్పేవారు. ఆయనకు పిల్లలంటే చాలా ఇష్టం. దేవుని ఉద్యానవనంలో పుష్పాలుగా పిల్లలను అభివర్ణించే వారు. ఇస్లామీయ ఉద్యమానికి భవిష్యత్తులో నాయకత్వం వహించేది పిల్లలే కదా అనేవారు. పిల్లలను వెన్నుతట్టి ప్రోత్సహించేవారు. వారి కోసంప్రార్థనలు చేసేవారు. పుట్టిన శిశువును తన వద్దకు తీసుకుని వస్తే ప్రవక్త(స) ఆ శిశువును తన ఒడిలోకి తీసుకునేవారు. దారిలో ఆయనకు ఎవరైనా పిల్లలు కనబడితే వారిని తన వాహనంపై ఎక్కించుకునేవారు. తనవద్దకు వచ్చినపండ్లను పిల్లలకు పంచిపెట్టేవారు. అప్పుడప్పుడు ఆయన పిల్లలతో ఆటలు కూడా ఆడేవారు.

ప్రజలతో ప్రవక్త(స) వ్యవహారశైలిని హజ్రత్ అనస్(రజి) చక్కగా వివరించారు. నేను ప్రవక్త(స)తో పదేళ్ళు ఉన్నాను. ఈ పదేళ్ళ కాలంలో ఒక్కసారి కూడా ఆయన నా పట్ల చిరాకు పడలేదు. విసుక్కోలేదు. ఆయన కోసం నేను చేసిన ఏ పనిని ఆయన ఎన్నడూ విమర్శించలేదు. ఆయన చెప్పిన పని చేయలేకపోతే కోపగించనూ లేదు. ఆయన తనపై ఆధారపడినవారిని, తన నౌకర్లను అందరినీ సమానంగా



చూసేవారు. తన నౌకర్లను ఆయన ఎన్నడూ కొట్టలేదు.. ఇదే విషయాన్ని హజ్రత్ ఆయెషా(రజి) కూడా తెలియజేశారు. ప్రవక్త(స) తన నౌకర్లను ఎన్నడూ కొట్టలేదని అన్నారు. అలాగే ఆయన ఎవరిపై పగతీర్చుకోవడం కూడా జరుగలేదని చెప్పారు.

## గృహ జీవనం

ప్రవక్త(స) వ్యక్తిగత సామూహిక జీవితం అంతటా ఒకే విధమైన నియమాలు ఉండేవి. ఒకసారి హజ్రత్ ఆయెషా(రజి) ఒక ప్రశ్నకు సమాధానం ఇస్తూ చెప్పిన మాటలు ఇక్కడ ఎంతైనా గమనించదగ్గవి. ఆమె ఏమన్నారంటే... ఆయన కూడా ఇతరుల మాదిరిగా ఒక మామూలు మనిషి. ఆయన తన దుస్తుల విషయం తానే చూసుకునేవారు. గొర్రెల పాలు పితికేవారు. చినిగిన దుస్తులు కుట్టుకునేవారు. పాదరక్షలు, తోలు సంచులు బాగు చేసుకునేవారు. సరుకులు మోసుకువచ్చేవారు. పశువులకు మేత వేసేవారు. ఎవరైనా నౌకరు పనిచేస్తుంటే తానుకూడా నౌకరుకు తోడుగా పనిచేసేవారు. మార్కెట్ నుంచి ఇంటికి కావలసిన సరుకులు తానే స్వయంగా తెచ్చేవారు. సరుకులను ఒక గుడ్డలో మూట కట్టి తెచ్చేవారు. హజ్రత్ ఆయెషా(రజి) ప్రవక్త గృహ జీవితం గురించి ఇంకా వివరింగా తెలియజేస్తూ ఏమన్నారంటే... ఇంటి వద్ద ప్రవక్త చాలా మృదువుగా ఉండేవారు. ఎప్పుడూ చిరునవ్వుతో, ఆత్మీయంగా ఉండేవారు. నిజం చెప్పాలంటే కుటుంబసభ్యులను ఆయన ప్రేమించినట్లుగా మరెవ్వరూ ప్రేమించలేరు. హజ్రత్ అలీ (రజి) ప్రకారం ప్రవక్త(స)కు ఇంటి వద్ద ముఖ్యంగా మూడువిధాలైన వ్యాపకాలు ఉండేవి. కొంత సమయం ఆయన ప్రార్థనల్లో గడిపేవారు. కొంత సమయం ఆయన తన కుటుంబసభ్యులతో గడిపేవారు. కొంత సమయం విశ్రాంతి తీసుకునేవారు. అయితే ఇదే సమయంలో ఆయన కొంత సమయాన్ని మస్జిదులో సమావేశాలకు కూడా వెచ్చించేవారు. స్నేహితుల కోసం, అతిథుల కోసం సమయం కేటాయించేవారు. అలాగే వ్యక్తిగత అవసరాలతో తన్ను కలవడానికి వచ్చిన వారిని కూడా కలుసుకునేవారు. నిజం చెప్పాలంటే ఆయనకు విశ్రాంతి తీసుకునే సమయమే లభించేది కాదు. తన భార్యల కోసం ఆర్థిక ఏర్పాట్లు చేయడం, వారి శిక్షణ విషయమై శ్రద్ధచూపడం ఆయన బాధ్యతలుగా ఉండేవి. మహిళల్లో శిక్షణ సంస్కరణల కార్యభారాన్ని ప్రవక్త(స) భార్యల ద్వారానే నిర్వహించడం జరిగింది. చాలామంది మహిళలు తమ సమస్యలతో ఆయన వద్దకు వచ్చేవారు.

ప్రవక్త(స) భార్యలకు ఈ సమస్యలు తెలియజేసి వారి ద్వారా ప్రవక్త(స)కు ఈ విషయాలు నివేదించేవారు. ఇంతగా శిక్షణ, సంస్కరణ కార్యకలాపాలు, ఉద్యమ కార్యభారం ఉన్నప్పటికీ ప్రవక్త(స) ఇంటి జీవితం ఎన్నడూ నిస్సారంగా గడపలేదు. ఒక మామూలు కుటుంబంలో ఉండే అనుభూతులు ఆనందాలు అన్నీ అక్కడ ఉండేవి. చిరునవ్వులు ఉండేవి, కన్నీళ్ళు ఉండేవి. ప్రేమాభిమానాలు ఉండేవి, ఈర్ష్య అసూయలు కూడా ఉండేవి. ఆందోళనలు ఉండేవి, ఆహ్లాదాలు ఉండేవి. ప్రవక్త(స) ఇంట్లో అడుగు పెట్టగానే సంతోష తరంగాలు ఉప్పొంగేవి. ఇంట్లో ఆసక్తికరమైన అంశాలపై మాట్లాడుకోవడం జరిగేది. కథలు చెప్పుకునేవారు. చిన్న చిన్న సంఘటనలు ప్రస్తావించుకునేవారు. ప్రవక్త(స) ఇంట్లో జరిగిన ఒక సంఘటన ఆ ఇంట్లో ఎలాంటి చక్కని వాతావరణం ఉండేదో తెలుసుకోవడానికి ఎంతైనా ఉపయోగపడుతుంది. ప్రవక్త(స) ధర్మపత్ని హజ్రత్ ఆయెషా(రజి) ఒకరోజు మాంసంతోను, గోధుమలతోను చేసిన ఒక వంటకం తయారు చేసారు. ఆ రోజు ప్రవక్త(స)గారి మరో సతీమణి హజ్రత్ సౌదా(రజి) కూడా అక్కడే ఉన్నారు. ప్రవక్త(స) వారిద్దరి మధ్య కూర్చుని ఉన్నారు. కులాసాగా మాట్లాడుకుంటున్న వాతావరణం. హజ్రత్ ఆయెషా(రజి) తాను చేసిన వంటకం కొద్దిగా రుచి చూడమని హజ్రత్ సౌదా (రజి)ను కోరారు. ఆమె వద్దన్నారు. హజ్రత్ ఆయెషా(రజి) మళ్ళీ తన వంటకాన్ని తిని చూడాలని అభ్యర్థించారు. హజ్రత్ సౌదా(రజి) తనకు వద్దని తిరస్కరించారు. దాంతో హజ్రత్ ఆయెషా(రజి) ఆ వంటకాన్ని తన చేత్తో తీసుకొని హజ్రత్ సైదా(రజి) ముఖానికి పూసేశారు. ఇది చూసి ప్రవక్త(స) గట్టిగా నవ్వుతూ హజ్రత్ సౌదా(రజి)తో నువ్వు కూడా బదులు తీర్చుకోఅన్నారు. హజ్రత్ సౌదా (రజి) అలాగే చేశారు. ప్రవక్త(స)తోపాటు వారిద్దరు నవ్వుతున్న ఈ సమయంలో హజ్రత్ అబూబక్ర్ (రజి) అక్కడికి వచ్చారు. తన కుమార్తె హజ్రత్ ఆయెషా(రజి) ప్రవక్త(స)తో మర్యాద అతిక్రమించి అతిచనువుగా వ్యవహరిస్తుందని ఆగ్రహించారు. ఎంతగా ఆగ్రహించారంటే, ఆయన కూతురిని కొట్టబోయారు. ప్రవక్త(స) కల్పించుకుని ఆయన్ను శాంత పరిచారు. హజ్రత్ అబూ బక్ర్(రజి) వెళ్ళిపోయిన తర్వాత ప్రవక్త(స) హజ్రత్ ఆయెషా(రజి)తో.. చూశావా నేను కాబట్టి నిన్ను ఆ పెద్దమనిషి నుంచి కాపాడాను" అన్నారు.

ప్రవక్త(స) తన జీవితాంతం అర్థరాత్రి తర్వాత లేచి, వుజూ చేసుకుని తహజ్జుద్



ప్రార్థనలు చేసేవారు. ప్రశాంతంగా దివ్యఖుర్ఆన్ పఠించేవారు. ఒక్కోసారి ఆయన ప్రార్థనల్లో ఎంతసేపు నిలబడేవారంటే ఆయన కాళ్ళు వాచిపోయేవి. ఆయన సహచరులు అది చూసి ప్రవక్త(స)తో 'మీరు ఇంతగా శరీరాన్ని కష్టపెట్టాలా, దేవుడు మీకు క్షమాభిక్ష హామీ ఇచ్చాడు కదా అంటే ఆయన జవాబిస్తూ నేను ఒక కృతజ్ఞుడైన దాసుడిగా ఉండవద్దా అనేవారు.

ప్రయాణంలో ఉన్న ఒక బాటసారి చెట్టునీడన కాసేపు విశ్రాంతి తీసుకొని తిరిగి తన ప్రయాణాన్ని ఏవిధంగా కొనసాగిస్తాడో ఆవిధంగా మనిషి ఇహ జీవితం గడపాలని, ఇంటిలో వస్తుసామాగ్రి ఆవిధంగానే ఉండాలని ఆయన భావించేవారు. అంటే, పరలోక జీవితాన్ని తమ లక్ష్యంగా చేసుకున్నవారు ప్రయాణంలో బాటసారి మాదిరిగా ఇహలోకంలో తమ విధులను నిర్వర్తిస్తూ జీవించాలి. ప్రపంచంలో ఒక ఉన్నత ఆదర్శం కోసం పరిశ్రమించేవారు, దాని కోసం పోరాడేవారు, సంఘర్షించేవారు ఇక్కడ మహా సౌధాలను నిర్మించడానికి, విలాస వస్తు సామాగ్రి సమకూర్చుకోడానికి తమ సమయం వెచ్చిస్తారా? కాబట్టి ప్రవక్త(స) కాని, ఆయన అనుచరులు గాని ఇక్కడ మహాప్రాసాదాలు కట్టలేదు, విలాస వస్తుసామాగ్రి సమకూర్చుకోలేదు. వారి ఇళ్ళు కేవలం నాలుగు రోజులు గడపడానికి ఉద్దేశించిన ఆశ్రమాలుగా ఉండేవి. ఎండ, చలి నుంచి రక్షణ,క్రూరమృగాల నుంచి భద్రత కల్పించి, వ్యక్తిగత అవసరాలకు కావలసిన సౌలభ్యం ఇచ్చే ఆశ్రయాలుగా మాత్రమేఉండేవి. ప్రవక్త(స) తన భార్యల కోసం మస్జిదుల్ నబవీ వద్ద చిన్న చిన్న గదులు నిర్మింపజేశారు. ఆ గదుల్లో అలంకరణ సామగ్రి కేవలం పరిశుభ్రత, పవిత్రతలు మాత్రమే. ప్రవక్త(స) పరిశుభ్రత పట్ల చాలా శ్రద్ధగా ఉండేవారు. ఇండ్లను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సహచరు లకు బోధించేవారు. ప్రవక్త(స) ఇంట కేవలం కొన్ని పాత్రలు మాత్రమే ఉండేవి. ఒక కలప పాత్ర ఉండేది. దానిపై ఒక ఇనుప మూత ఉండేది. ఈ పాత్ర భోంచేయడానికి ఉపయోగపడేది. ఇంట్లో సరుకులు నిల్వ చేసుకోవడం అనే ప్రశ్నే లేదు. ఎందుకంటే నిత్య జీవితావసరాలకు కావలసిన సామగ్రి లభించడమే కష్టంగా ఉండేది. తోలుతో కుట్టిన పరుపు, లోపల గడ్డి కూరి వుండేది. నారతాళ్ళతో పేనిన మంచంపై పడుకునేవారు. చాలాసార్లు ఎలాంటి పరుపూ లేకుండా కేవలం ఆ మంచంపైనే పడుకునేవారు. అందువల్ల శరీరంపై నారతాళ్ళ గుర్తులు పడేవి. ఈ పరిస్థితి చూసి ఒకరోజు హజ్రత్ ఉమర్(స) దు:ఖాన్ని ఆపుకోలేకపోయారు.

రోము,పర్షియా చక్రవర్తులు భోగభాగ్యాలతో జీవిస్తుంటే ప్రవక్త ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లమ్ ఇలాంటి స్థితిలో ఉండటం తట్టుకోలేకపోతున్నానని అన్నారు. ప్రవక్త(స) ఆయన్ను ఊరడిస్తూ రాజులు చక్రవర్తులు ఇహలోకాన్ని పొందితే ప్రవక్త పరలోక సౌభాగ్యాలను సొంతం చేసుకోవడం మీకు సంతోషాన్నివ్వదా అని ప్రశ్నించారు. గోనె సంచులు పరిచిన పడకపై ఆయన విశ్రమించేవారు. ఒకసారి నాలుగు గోనెసంచుల మందం ఉన్న పడక ఆయన కోసం వేయడం జరిగింది. ఆ పడకపై ఆయన ఆదమరిచి నిద్రపోయారు. ఫలితంగా తహజ్జుద్ ప్రార్థనలకు అర్థరాత్రి తర్వాత లేవలేకపోయారు. అప్పటినుంచి అలా గోనెసంచులతో మెత్తటి పడకను ఇష్టపడేవారు కాదు. అలాంటి సౌకర్యవంతమైన పడకను తన కోసం పరచరాదని కఠినంగా నిషేధించారు.

ఆయన అన్నపానీయాల విషయంలోను చాలా సున్నితంగా ఉండేవారు. ఆయన మాంసాహారాన్ని ఎక్కువగా ఇష్టపడేవారు. పశువు, కాలి చీలమండల మాంసం, మెడమాంసం, వెన్ను మాంసం, పక్కటెముకలను చాలా ఇష్టపడేవారు. రొట్టెతోను, షేర్వాతోను చేసిన అరబ్బు వంటకం అంటే చాలా ఇష్టపడేవారు. తేనె, వెనిగార్, మెలన్, దోసకాయ, ఆనపకాయ, వెన్న అంటే ఇష్టంగా తినేవారు. బియ్యంలో పప్పు కలిపిన వంటకం అంటే ప్రత్యేక ఇష్టం చూపేవారు. ఖర్జూరాలను పాలలో కాని, వెన్నలో కాని కలిపి ఇష్టంగా తినేవారు. దోసకాయపై ఉప్పు అద్ది తినేవారు. మెలన్‌పై పంచదారతో తినేవారు. ఖర్జూరాలను నీటిలో వేసి ఆ నీటిని సాయంత్రం వరకు తాగేవారు. ఆ తర్వాత వాటిని పారేసేవారు. ఎందుకంటే ఎక్కువ సమయం ఖర్జూరాలు నీటిలో నానితే కుళ్ళి మద్యంగా మారడం ప్రారంభం అవుతుంది కాబట్టి ఆ నీటిని, ఖర్జూరాలను పారేసేవారు. నీటిని తాగుతున్నప్పుడు నిశ్శబ్దంగా ఎలాంటి శబ్దం లేకుండా తాగేవారు. నీటిపాత్రను కనీసం మూడుసార్లు నోటి నుంచి పక్కకు తీసేవారు. ప్రతిసారి దేవుని స్తుతించేవారు. అందరూ కలిసి సహపంక్తి భోంచేయడాన్ని ఇష్టపడేవారు. భోజనానికి టేబుల్ కుర్చీలు వాడడం నిరాడంబర జీవితానికి విరుద్ధమైనవి. అలాగే ఆయన ఆహార పదార్థాలు చిన్న చిన్న పాత్రల్లో వడ్డించడాన్ని ఇష్టపడేవారు కాదు. వెండి, బంగారు పాత్రలను నిషేధించారు. సాధారణంగా గాజుపాత్రలు, మట్టిపాత్రలు, కలప పాత్రలు లేదా జింక్‌తో చేసిన పాత్రలు ఉపయోగించేవారు. భోజనానికి చాపపై కూర్చునే ముందు తన పాదరక్షలు తీసి, చేతులు కడుక్కుని



కూర్చునేవారు. తినేటప్పుడు కేవలం కుడిచేతిని మాత్రమే ఉపయోగించేవారు. తనవైపు ఉన్న పాత్రలనుంచి మాత్రమే వడ్డించుకునేవారు. పాత్రల్లో వేళ్ళు ముంచేవారు కాదు. తినేటప్పుడు ఒక పక్కకు ఆనుకుని భోంచేయడాన్ని ఆయన ఇష్టపడలేదు. భోజనానికి కూర్చోవడం కూడా కాళ్ళు మడిచి, ప్రార్థనలో కూర్చునే ఖాయిదా భంగిమ మాదిరిగా లేదా బాసిపట్టు వేసుకుని కూర్చునేవారు. ఆయన ఏదన్నా పదార్థాన్ని ఇష్టపడకపోతే మౌనంగా పక్కకు పెట్టేవారు. అంతేగాని, ఆ పదార్థాన్ని విమర్శించేవారు కాదు. చాలా వేడిగా ఉన్న ఆహారాన్ని ఇష్టపడేవారు కాదు. ఒక్కోసారి ఆయన మాంసాన్ని కోసి తినేవారు. కేవలం మూడు వేళ్ళతో మాత్రమే తినేవారు. వేళ్ళు పూర్తిగా ఆహారంలో మునిగేలా తినేవారు కాదు. ఒక్కోసారి నిలబడి ఏదన్నా పండు తినేవారు. ఒక్కోసారి రెండు పండ్లను నోటిలో వేసుకునేవారు. ఉదాహరణకు ఖర్జూరాలు, మెలన్ వంటి పండ్లను రెండేసి నోటిలో వేసుకునేవారు. తీపి పదార్థాలను ఇష్టంగా తినేవారు. వేయించిన బార్లీ పిండిని నీటిలో కలిపి తినడాన్ని కూడా ఇష్టపడేవారు. ఒకసారి బార్లీ పిండికి బదులుగా ఆల్మండ్ పండ్ల పిండిని కలిపి ఇచ్చినప్పుడు ఆయన దాన్ని తిరస్కరిస్తూ అది సంపన్నుల ఆహారంగా వ్యాఖ్యానించారు. ఒకసారి ఒక కూర తయారు చేస్తున్నప్పుడు ఆయన దాన్ని మరింత పలుచగా చేయాలని అలా చేస్తే పొరుగువారికి కూడా పంపవచ్చని అన్నారు. ఆయన ఏ చిన్న ఆహార పదార్థం నోటిలో వేసుకున్నా దేవునికి ధన్యవాదాలు చెప్పేవారు. భోజనం తర్వాత తప్పనిసరిగా చేతులు కడుక్కునేవారు. తనతోపాటు అతిథి ఎవరన్నా ఉంటే కొసరి కొసరి వడ్డించేవారు, ఇంకొంచెం తీసుకోండని పదేపదే చెప్పేవారు. తనను ఎవరన్నా భోజనానికి ఆహ్వానిస్తే నిరాకరించేవారు కాదు. తనతోపాటు ఇంకా ఎవరైనా ఉంటే వారి విషయంలో ఇంటి యజమాని అనుమతి తప్పక తీసుకునేవారు. భోజనానంతరం దేవునికి కృతజ్ఞతలు తెలుపడంతోపాటు ఆతిథ్యమిచ్చిన వారి కోసంప్రార్థన చేసేవారు. భోజనానికి తనతోపాటు కూర్చున్నవారు ముగించి లేచేవరకు ఆయన లేచేవారు కాదు. ఇతరులు తనకన్నా ముందు భోజనం ముగిస్తే వారితో పాటు తాను కూడా లేచేవారు. వేడి వేడి ఆహారపదార్థాలను, లేదా పానీయాలను ఊది తినడం తాగడాన్ని ఆయన ఇష్టపడేవారు కాదు. అలాగే ఆహార పదార్థాన్ని వాసన చూడ్డం కూడా ఆయనకు ఇష్టం ఉండేది కాదు. నోటి దుర్వాసనను అసహ్యించుకునేవారు. అందువల్ల ఉల్లి,వెల్లుల్లి తినేవారు కాదు. ఆయన వద్దకు ఏదైనా ఆహార

పదార్థం వస్తే తనతో ఉన్న సహచరులను కూడా తినమనేవారు. అక్కడ లేనిమిత్రులు, సహచరుల వాటాను కూడా తీసి పక్కన పెట్టేవారు. ఒకసారి ఆయనపై విషప్రయోగం జరిగింది. ఆ తర్వాతి నుంచి తన వద్దకు దూరప్రాంతం నుంచి ఏదైనా ఆహార పదార్థం వస్తే ఆ పదార్థం పేరేమిటో అడిగేవారు. ఆ పదార్థంలో ఒక్క ముద్దయినా తీసుకొచ్చినవ్యక్తి తినాలని కోరేవారు. భోజనపానీయాల విషయంలో ఆయన అభిరుచి అత్యుత్తమంగా ఉండేది. అయితే చాలా సందర్భాల్లో ఆయన నిరాహారంగానే ఉండ వలసి వచ్చేది. ఒక దైవదాసుడుఎలా ఉండాలో అలాగే తాను అన్నపానీయాలు తీసుకుంటానని అనేవారు.

## వ్యక్తిగత అలవాట్లు

ఆయన కూర్చుంటున్నప్పుడు ఒక్కోసారి గొంతుక్కూర్చున్నట్లు కూర్చునేవారు. రెండు మోకాళ్ళపై రెండు చేతులు చుట్టి కూర్చునేవారు. ఒక్కోసారి తన దుప్పటి కాళ్ళపై కప్పుకుని కూర్చునేవారు. చేతిని ఆన్చి కూర్చునేదైతే ఎడమ చేతిని ఆన్చి కూర్చునేవారు. లోతుగా ఆలోచిస్తున్నప్పుడు ఏదన్నా పుల్లతో నేలను తవ్వుతూ కనబడేవారు. నిద్రపోతున్నప్పుడు సాధారణంగా కుడిపక్కకు తిరిగి పడుకునేవారు. తన కుడి చేతిని కుడిచెంప క్రింద ఆన్చి పడుకునేవారు. అప్పుడప్పుడూ వెల్లకిలా కూడా పడుకునేవారు. ఒక కాలు మరోకాలిపై వేసి కూడా పడుకునేవారు. అయితే శరీరంపై దుస్తులు తొలగిపోకుండా, శరీరం అనాచ్ఛాదితం కాకుండా జాగ్రత్త పడేవారు. బోర్లా పడుకోవడం ఆయనకు చాలా అయిష్టమైన విషయం. ఇతరులను కూడా అలా పడుకోవద్దని చెప్పేవారు. చీకటి గదిలో పడుకోవడాన్ని లేదా పైకప్పు లేని గదిలో పడుకోవడాన్ని ఇష్టపడేవారు కాదు. పడుకునే ముందు వుజూ చేసు కునేవారు. నిద్ర పట్టేవరకు దైవప్రార్థనలు చేసేవారు. ఆయన నిద్రలో మంద్ర స్థాయిలో గురకపెట్టేవారు. ఒకవేళ అర్ధరాత్రి కాలకృత్యాలు అవసరమై లేస్తే కాల కృత్యాలు ముగిసిన తర్వాత చేతులు, ముఖం కడుక్కునేవారు. పడుకునేటప్పుడు ఒక పెద్ద వస్త్రాన్ని ప్రత్యేకంగా ఉంచుకునేవారు. సాధారణంగా పడుకునే ముందు తన చొక్కా విప్పి పడుకునేవారు. అందువల్ల ఈ వస్త్రాన్ని ఆచ్ఛాదనగా వాడేవారు. ఆ కాలంలో మరుగుదొడ్లు లేవు. అందువల్ల ఆయన(స) కాలకృత్యాలకు పట్టణాన్ని వదిలి చాలా దూరం దాదాపు రెండు మైళ్ళ దూరం వరకు వెళ్ళేవారు. ఆ విధంగా



నిర్మానుష్యమైన ప్రాంతంలో కాలకృత్యాలు తీర్చుకునేవారు. కాలకృత్యాలకు మెత్తని నేలను ఎన్నుకునే వారు. ఎందుకంటే, నీటిని వాడినప్పుడు నీటి తుంపరలు మళ్ళీ తనపై కాని, వస్త్రాలపై కాని పడకుండాఉండటానికి మెత్తటి నేలను ఎన్నుకునేవారు. కాలకృత్యాలకు ఏదన్నా పెద్ద రాతిచాటున కాని, లేదా గుట్ట చాటున కాని తీర్చుకునే వారు. కాబా దిశగా ముఖం లేదా వీపులేకుండా జాగ్రత్తపడేవారు. తన ఉంగరాన్ని తొలగించేవారు. ఉంగరంపై అల్లాహ్ పేరు ఉన్నందువల్ల అలా చేసేవారు. ఆయన స్నానం చేస్తున్నప్పుడు ఏదన్నా తెరచాటున మాత్రమే చేసేవారు. వర్షపు నీటిలో స్నానం చేస్తున్నప్పుడు పెద్ద వస్త్రాన్ని చుట్టుకునేవారు. తుమ్ము వస్తే ఎల్లప్పుడు ఏదన్నా గుడ్డ తన ముక్కుకు అడ్డంగా పెట్టుకునేవారు. ఆయన సాధారణంగా తన ప్రయాణాలు గురువారం నాడు ప్రారంభించేవారు. తన వాహనాన్ని తీవ్ర వేగంగా నడిపేవారు. మార్గమధ్యలో మజిలీచేసినప్పుడు తన సహచరులతో పాటు తాను కూడా వివిధ పనులు చేసేవారు. ఒకసారి సహచరులు వంట పనులను పంచు కుంటున్నప్పుడు ప్రవక్త(స) పొయ్యిలో మండించటానికి వంటచెరుకు సేకరించే పని తానే తీసు కున్నారు. ప్రవక్త(స) పనిచేయడం ఎందుకంటూ ఇతరులు వారించినా, తాము చేస్తామని ముందుకు వచ్చినా ఆయన వారిని కాదని తానే స్వయంగా ఆ పనిచేశారు. ఆయన ఎల్లప్పుడు తన వాహనంపై కాలినడకన వెళ్ళే బాటసారిని ఎక్కించుకునేవారు. ఆయన ప్రయాణం నుంచి తిరిగి వచ్చినప్పుడు ముందుగా మస్జిద్‌లో ప్రార్థన చేసేవారు. ఆయన రాక గురించి సమా చారం ఇంటి వారికి చేరిన తర్వాత ఆయన ఎలాంటి హడావుడీ లేకుండా ఇంటికి వెళ్ళేవారు.

## భావావేశాలు

ప్రవక్త(స) కూడా భావావేశాలను ప్రదర్శించేవారు. ఇతరుల సుఖదు:ఖాలలో పాలుపంచుకునేవారు. తన కుటుంబ సభ్యుల పట్ల, ధర్మపత్నుల పట్ల అపారప్రేమ కలిగి ఉండేవారు. సతీమణి హజ్రత్ ఆయెషా (రజి)తో ఆడుకోవడానికి అన్సార్ బాలికలను తన ఇంటికి ఆహ్వానించేవారు. ఒకసారి అబిసీనియా బాలికలు విన్యాసాలు ప్రదర్శిస్తున్నప్పుడు హజ్రత్ ఆయెషా(రజి) ప్రవక్త(స) భుజంపై తన చుబుకాన్ని ఆన్చి ఎంతో ఆసక్తిగా చూడసాగారు. ప్రవక్త(స)ఆమెతో చాలా ఇంకా చూస్తావా అంటే ఆమె మరింత ఆసక్తిగా ఇంకా చూస్తాననడం, అలా ఆ ప్రదర్శనను హజ్రత్

ఆయెషా(రజి) సుదీర్ఘ సమయం చూశారు. అంత సమయం ప్రవక్త(స) కూడా ఇక్కడే ఉన్నారు. హజ్రత్ సఫియా (రజి) ఒంటె ఎక్కడానికి వీలుగా ప్రవక్త(స) తన మోకాళ్ళు వంచి వాటిపై ఎక్కి ఒంటెను అధిరోహించేలా చేసేవారు. ఒకసారి ఒంటె బెదరడం వల్ల ప్రవక్త(స), హజ్రత్ సఫియా(రజి) ఇద్దరూ కిందపడిపోయారు. అక్కడున్న సహచరులు వారికి సహాయంగా పరుగెత్తుకు వచ్చారు. ప్రవక్త(స) వారితో ముందు హజ్రత్ సఫియా(రజి)ను లేపండని కోరారు. ఆయన తన కుమారుడు ఇబ్రాహీమ్‌ను చూడడానికి ఎంతో దూరం ప్రయాణం చేసి వెళ్ళేవారు. తన కుమార్తె హజ్రత్ ఫాతిమా (రజి) తనను చూడడానికి వచ్చినప్పుడు ఆయన లేచి నిలబడి స్వాగతం పలికేవారు. హజ్రత్ ఫాతిమా(రజి) కుమారులుహజ్రత్ హసన్(రజి), హజ్రత్ హుస్సేన్ (రజి)ల పట్ల ప్రవక్త(స) ఎంతో ప్రేమ కలిగి ఉండేవారు. వారితో ఆటలు ఆడేవారు. వారిని భుజాలపై ఎక్కించుకుని తిప్పేవారు. ప్రార్థన సమయంలో కూడా ఈ ఇద్దరు మనుమలు ఆయన భుజాలపై ఎక్కి ఆటలాడడం జరిగేది. ప్రవక్త ముహమ్మద్(స) తన మనుమడు హుస్సేన్‌పట్ల అత్యంత ప్రేమతో ముద్దాడడాన్ని చూసి ఒక వ్యక్తి ఆశ్చర్యపోయాడు. ఇది గమనించిన ప్రవక్త(స) ఆ వ్యక్తితో ఇతరుల పట్ల ప్రేమాభిమానాలు ప్రదర్శించలేని వ్యక్తి ఇతరుల నుంచి వాటిని ఆశించరాదని అన్నారు. ఆయన కుమారుడు ఇబ్రాహీమ్ మరణించినప్పుడు ప్రవక్త(స) కళ్ళు నీటితో నిండిపోయాయి. తన మారు సోదరుడు ఉస్మాన్ బిన్ మాజూన్ చనిపోయినప్పుడు కూడా ప్రవక్త(స) చాలా దుఃఖించారు. ఉస్మాన్ బిన్ మాజూన్ మృతదేహం నుదుటిని చుంబించి దుఃఖం వెలిబుచ్చారు. ఇలాంటి దుఃఖ సందర్భాల్లో తనలోని భావావేశాలను ప్రవక్త(స) క్రింది విధంగా వివరించారు. కళ్ళు నీటితో నిండిపోతాయి. హృదయం బాధాతప్తమవుతుంది. కాని మనం కేవలం దేవుని అభీష్టం ప్రకారమే అన్ని జరుగుతాయన్న మాట తప్ప మరొక మాట పలకం... అన్నారు. దుఃఖ సమయాల్లో తరచు ఆయన క్రింది మాటలు పలికేవారు.

**"మాకు అల్లాహ్ చాలు. అయనే శ్రేష్ఠుడైన కార్యసాధకుడు"** ***(3 : 173)***

దుఃఖిస్తున్నప్పుడు ఆయన స్వరం వినిపించేది కాదు. బిగ్గరగా ఆయన రోదించేవారు కాదు. భారమైన  నిట్టూర్పుల శబ్దం మాత్రం వినిపించేది. దైవప్రార్థనలో ఉన్నప్పుడు కూడా ఆయన సున్నితమైన మనసు దుఃఖాతిశయంతో విలపించేది. ఆయన కంట నీరు ఉబికేది. ఒకసారి ఆయన అబ్దుల్లా ఇబ్నె మసూద్‌తో ఖుర్‌ఆన్



చదవమని కోరారు. అబ్దుల్లా ఇబ్నె మస్ఊద్ ఖుర్‌ఆన్ చదువుతూ....

**"మేము ప్రతిసమాజం నుంచి ఒక సాక్షిని తెచ్చి నిన్ను (ముహమ్మద్ సఅసమ్‌ను) వారికి సాక్షిగా నిలబెట్టినప్పుడు వారు చూసి ఏంచేస్తారో ఆలోచించు."**

***(ఖుర్‌ఆన్ 4 : 41)***

అన్న వాక్యం చదివినప్పుడు ప్రవక్త(స) కళ్ళల్లో జలపాతాలు ప్రవహించాయి. అలాంటి సున్నిత మనస్కుడైన ప్రవక్త(స) అత్యంత కఠిన పరిస్థితుల్లో మొక్కవోని సహనాన్ని, ఉక్కు వంటి స్థిరచిత్తాన్ని ఎలా ప్రదర్శించారో కదా?

ఇంతకుముందు మనం చెప్పుకున్నట్లు ప్రవక్త(స)  ఎప్పుడూ చిరునవ్వుతో ఉండేవారు... ఎవరినైనా కలుస్తున్నప్పుడు చిరునవ్వుతో కలువడం కూడా పుణ్యకార్యమే అనేవారు. గొప్ప గొప్ప ఘనకార్యాలు సాధించాలనుకునేవారు చిరునవ్వుతో ప్రజలతో వ్యవహరిస్తే ప్రజల హృదయాలను గెలుచుకోగలరని చెప్పేవారు. అందుకే ప్రవక్త(స)ను క్రింది విధంగా వర్ణించడం జరిగింది.

"ఆయన ప్రజలను ఆప్యాయంగా చిరునవ్వుతో కలుసుకుంటారు. ఆయన అభిమానం వారి హృదయాల్లో గూడుకట్టుకుంటుంది."

ఆప్యాయంగా,  అభిమానంగా,  ఆసక్తికరంగా మాట్లాడే ఆయన మాటలు ఆయన చుట్టూ ఉన్న సహచరుల్లో కొత్త ఉత్సాహాన్ని నింపేవి. అయితే ఆయనెప్పుడూ తన సంభాషణల్లో మర్యాదను, సమతుల్యాన్ని కాపాడుతూ మాట్లాడేవారు. ఆయన మాటల్లో హాస్యం అతిసున్నితంగా ఉండేది. రొట్టెలో ఉప్పు మాదిరిగా అతి తక్కువ మోతాదులో సంభాషణను ప్రభావశీలంగా, అహ్లాదభరితంగా మార్చేది. ఎవరినీ గాయపరిచేదిగా ఉండేదికాదు. అలాగే ఆయన ఎన్నడూ పగులబడి నవ్వేవారు కాదు. ఆయన నవ్వు అరవిరిసిన పుష్పంలా చిరునవ్వుగా ఉండేది. కేవలం ఆయన పళ్ళు మాత్రమే కనబడేవి.  నోరంతా తెరిచి నవ్వేవారు కాదు. ఒకసారి హజ్రత్ హురైరా(రజి) ప్రవక్త(స)తో మాట్లాడుతూ, మీరు మాతో కూడా హాస్యం ఆడుతారా అన్నారు. ప్రవక్త(స) జవాబిస్తూ.. అవును, కాని సత్యానికి విరుద్ధంగా ఒక్కమాట కూడా చెప్పను అన్నారు.ప్రవక్త(స)గారి హాస్యానికి సంబంధించి కొన్ని ఉదాహరణలు చూడండి.

ఒకసారి ఒక వ్యక్తి ప్రవక్త(స)తో తనకు ఒక వాహనాన్ని ఇవ్వవలసిందిగా కోరాడు. ప్రవక్త(స) ఆ వ్యక్తితో నేను నీకు ఒక ఒంటెపిల్లను ఇస్తాను అన్నారు. ఆ వ్యక్తి ప్రవక్త(స)తో అయ్యా నేను ఒంటె పిల్లను ఏం చేసుకోను అన్నాడు. ప్రవక్త(స) నవ్వుతూ ప్రతి ఒంటె పుట్టినప్పుడు పిల్లగానే ఉంటుంది లేవయ్యా' అన్నారు.

ఒకసారి ఒక ముసలి మహిళ ప్రవక్త(స) వద్దకు వచ్చి తన కోసం దేవుని ప్రార్థించాలని కోరింది. దేవుడు తనకు స్వర్గంలో కాస్త స్థలం ఇచ్చేలా ప్రార్థించండని కోరింది. ప్రవక్త(స) నవ్వుతూ ముసలి స్త్రీ ఎవ్వరూ స్వర్గంలో ప్రవేశించడం కుదరదని అన్నారు. ఆ ముసలి స్త్రీ కన్నీళ్ళతో అక్కడి నుంచి వెనుదిరిగింది. ప్రవక్త(స) ఆమెను వెనుకకు పిలిపించారు. ముసలివారుగా ఎవరినీ దేవుడు స్వర్గంలోకి ప్రవేశపెట్టడని తెలియజేశారు. దేవుడు చేసిన వాగ్దానాన్ని గుర్తుచేశారు.

**"వారి భార్యలను మేము ప్రత్యేకంగా సరిక్రొత్త పంథాలో సృష్టిస్తాము, వారిని కన్యలుగా చేస్తాము." అల్‌వాఖిఅహ్ : (56 : 35-37)**

అంటే స్వర్గంలోకి ప్రవేశించే ప్రతి వ్యక్తి యవ్వనంతో ప్రవేశిస్తాడు. ప్రవక్త(స)కు ఒక బదూయిన్ మిత్రుడు ఉండేవాడు. ఆ మిత్రుడు బజారులో సరుకులు అమ్మడం, కొనడం చేసేవాడు. ఒకసారి ఆ బదూయిన్ బజారులో ఉండగా, ప్రవక్త(స) నిశ్శబ్దంగా అతడి వెనక్కి వెళ్ళి తన చేతులతో రెండు కళ్ళను మూసి, తానెవరో కనుక్కోమన్నారు. మొదట ఆ బదూయిన్ అయోమయానికి గురయ్యాడు. తర్వాత ప్రవక్త(స)ను గుర్తించాడు. ప్రవక్త(స) మరింత హాస్యంగా, ఈ బానిసను ఎవరైనా కొంటారా అని గట్టిగా అరిచారు. బదూయిన్ కూడా జవాబిస్తూ ఈ పనికిమాలిన బానిసను కొంటే నష్టంలో ఉంటారు' అన్నాడు. అప్పుడు ప్రవక్త(స) అతడితో నీవు దేవుని దృష్టిలో పనికిమాలినవాడివి కాదు అన్నారు.

ఒకసారి ప్రవక్త (స) తన సహచరులతో ఖర్జూరాలు తింటూ కూర్చున్నారు. తాను తిన్న ఖర్జూరాల గింజలను కావాలని హజ్రత్ అలీ(రజి) ముందు పడేలా వేస్తూ వచ్చారు. చివరకు హజ్రత్ అలీ(రజి) ఎదుట కర్జూరపు గింజలు ఒక గుట్టగా పడ్డాయి. అప్పుడు ప్రవక్త(స) హజ్రత్ అలీ(రజి)తో నువ్వు చాలా ఖర్జూరాలు తిన్నట్లున్నావే అన్నారు. హజ్రత్ అలీ(రజి) జవాబిస్తూ అవును... నేను ఖర్జూరాలు గింజలతో సహా తినను, గింజలను ఊసేస్తాను.. అన్నారు.



యుద్ధరంగంలో కూడా ప్రవక్త(స) ఛలోక్తులాడేవారు. కందక యుద్ధంలో అలాంటి సంఘటన ఒకటి జరిగింది. సాద్‌బిన్ ఆమిర్ ఒక శత్రువుపై బాణాల వర్షం కురిపిస్తున్నారు. కాని ఆ శత్రువు తన ఢాలుతో వాటి నుంచి తప్పుకుంటున్నాడు. ఇక లాభం లేదని సాద్ తన విల్లు పక్కన పెట్టి, శత్రువు ఢాలు నుంచి తన తల బయటికి తీసే వరకు వేచి ఉన్నారు. శత్రువు తల బయటపెట్టగానే ఆయన సంధించిన బాణం గురి తప్పలేదు. తిన్నగా శత్రువు నుదుటిని తాకింది. ఆ బాణం దెబ్బకు వాడు తలక్రిందులుగా, రెండు కాళ్ళు పైకి లేచి పడ్డాడు. ఆ పడిన భంగిమ ఎంత విచిత్రంగా ఉందంటే అక్కడ ఉన్న అందరూ నవ్వారు.

సాధారణంగా మతపెద్దలు, మతస్థాపకులు చాలా గంభీరంగా, చాలా తీవ్రమైన ఆలోచనలోఉంటారని అందరూ భావిస్తారు. కాని ప్రవక్త(స) అలా ఉండేవారు కాదు. ప్రార్థనల్లో నిమగ్నమవుతూ,దైవానికి భయపడుతూ, అనితర సాధ్యమైన బాధ్యతలను నిర్వర్తిస్తూ, అనేక సమస్యలను, ఆందోళనలను ఎదుర్కొంటూ కూడా ఛలోక్తులకు, హాస్యానికి సమయం వెచ్చించేవారు.

దైవభీతి, దైవభక్తి, విశ్వాసశక్తి కలిగి వుండడం అంటే గంభీరంగా బ్రతకడం కాదు. ఇబ్నె ఉమర్ ఒక ప్రశ్నకు సమాధానమిస్తూ ఇలా అన్నారు. ప్రవక్త సహచరులు మనసారా నవ్వేవారని, వారి హృదయాల్లో విశ్వాసం శిలాసదృశ్యంగా స్థిరపడినప్పటికీ వారు హాయిగా నవ్వుకునేవారని అన్నారు. ప్రవక్త (స) సహచరులు విలు విద్య పోటీల్లో పాల్గొనేవారు. హాయిగా మనసారా నవ్వుకునేవారు. ప్రాత:కాలం నమాజు తర్వాత సాధారణంగా సమావేశమయ్యేవారు. ఇస్లాం ముందు కాలం నాటి సంఘటనల గురించి చెప్పుకునేవారు. తన సహచరులతోపాటు ప్రవక్త(స) కూడా నవ్వుతూ మాట్లాడేవారు. తన కుటుంబసభ్యులతో, పిల్లలతో ప్రవక్త(స) చాలా సరదాగా, హాయిగా నవ్వుతూ మాట్లాడేవారు.

## వినోదం

పరిమితులకు లోబడిన వినోదం కూడా సమతుల జీవన విధానానికి ఎంతో అవసరం. లేకపోతే జీవితం మరీ నిస్సారంగా మారిపోతుంది. రోజువారి కార్యకలాపాల నుంచి మనిషికి కాస్త విశ్రాంతి అవసరం. మనోమస్తిష్కాలను నిత్యజీవిత వ్యవహారాల నుంచి కాస్సేపు తప్పించే మనోరంజనం కూడా ఎంతో అవసరమవు

తుంది. ఇలాంటి అనుమతించదగిన, అతికానటువంటి, పరిధులకు పరిమితులకు లోబడిన మనోరంజనాన్ని ప్రవక్త(స) కూడా ఒప్పుకున్నారు. ఆయన కూడా అప్పుడప్పుడు ఇలా సమయాన్ని గడిపేవారు. ఉదాహరణకు ఆయన తోటలు, ఉద్యానవనాలకు వాహ్యాళిగా వెళ్ళడాన్ని చాలా ఇష్టపడేవారు. ఒక్కోసారి ఒంటరిగా వెళ్ళేవారు, ఒక్కోసారి తన సహచరులతో కలిసి వెళ్ళేవారు. ఇలాంటి విహారాలలో కూడా అనేక ముఖ్యమైన విషయాలపై చర్చలు జరుగుతూ ఉండేవి. అలాగే ప్రవక్త(స) సహచరుల మధ్య ఈత పోటీలు కూడా జరిగేవి. ఇద్దరు ఇద్దరు ఉన్న జట్లుగా విడివడి పోటీపడేవారు. ఇలాంటి ఈత పోటీల్లో ఒకసారి హజ్రత్ అబూబక్ర్ (రజి) ప్రవక్త(స)కు జంటగా ఈత పోటీలో పాల్గొన్నారు. సాధారణంగా ఎడారి భూభాగాల్లో వర్షం చాలా తక్కువగా కురుస్తుంది. వర్షం కురిసినప్పుడు ప్రవక్త(స) వర్షపు నీటిలో స్నానంచేసేవారు. ఒక పెద్ద దుప్పటి వంటి వస్త్రం చుట్టుకుని వర్షంలో స్నానం చేసేవారు. పరుగుపందెం, విలు విద్య ప్రదర్శనలంటే ఆయనకు చాలా ఇష్టంగా ఉండేది. అలాగే కుస్తీపోటీలన్నా ఆయనకు చాలా ఇష్టం. ఈ పోటీలను చూస్తూ ఇతరులతోపాటు నవ్వుతూ పోటీలను ఆస్వాదించేవారు. అలాగే సంతోష సమయాల్లో డప్పు వాయించడాన్ని ఆయన ఇష్టపడేవారు. డ్రమ్స్ అంటే ఒకవైపు ఖాళీగా మూత తెరువబడిఉన్న రకం డప్పులను వాయించటం ఆయనకు ఇష్టంగా ఉండేది. అమ్మాయిలు పాటలు పాడడాన్ని కూడా ఆయన ఆమోదించారు. ఒకసారి రమజాన్ పండుగ సందర్భంగా హజ్రత్ ఆయిషా (రజి) వద్ద ఇద్దరు అమ్మాయిలు పాటలు పాడడాన్ని చూసి హజ్రత్ అబూబక్ర్(రజి) ఆగ్రహించారు. కాని ప్రవక్త(స) ఆయన్ను వారించి ఆ అమ్మాయిలను పాటలు పాడుకోనిచ్చారు. వివాహ వేడుకల్లో కూడా ఇలాంటి డప్పులు వాయించడాన్ని ప్రవక్త(స) ఆమోదించారు. హజ్రత్ ఆయెషా(రజి)తో ఉండే ఒక అన్సార్ బాలిక వివాహం సందర్భంగాప్రవక్త(స) మాట్లాడుతూ, అన్సారులకు పాటలంటే చాలా ఇష్టం,కాబట్టి వధువుతోపాటు ఒక పాటలుపాడే అమ్మాయిని పిలిపించాలని అన్నారు. ఆ అమ్మాయి మేము మీ వద్దకు వచ్చాము. మేము మీ వద్దకు వచ్చాము. మీరు చల్లంగా ఉండాలని, మేము చల్లంగా ఉండా లని.. అంటూ పాడాలని చెప్పారు. ఇలాటి ఒక వేడుకలో కొందరు అమ్మాయిలు పాటలు పాడుతున్నారు. అక్కడికి హజ్రత్ ఆమిర్ బిన్ సాద్(రజి) వచ్చి,పాటలు పాడుతున్న అమ్మాయిలపై ఆగ్రహించారు. కాని అక్కడ ఉన్నవారు సాద్ (రజి)ను



వారించి మీరు వినాలనుకుంటే కూర్చుని వినండి. లేకపోతే వెళ్ళిపోండి. మాకు ప్రవక్త(స) నుంచి అనుమతి లభించింది అన్నారు. ప్రవక్త(స)కు కవిత్వం పట్ల కూడా అభిరుచి ఉండేది. అయితే ఆ కాలంలో ప్రబలంగా ఉన్న శైలికి భిన్నంగా ఆయన కవిత్వ ధోరణి ఉండేది. కాని దివ్యఖుర్ఆన్ అవతరణల పరంపరలో, ప్రవక్త పదవి బాధ్యతల్లో మునిగిఉన్న ఆయన కవిత్వానికి సమయం కేటాయించలేకపోయారు. అయితే మంచి కవిత్వాన్ని గుర్తించి మెచ్చుకోవడం తప్పక చేసేవారు. నిజం చెప్పాలంటే ఆయన కవిత్వానికి ఒక కొత్త ఉరవడి ఇచ్చారు. జాబిర్‌బిన్ సమ్రా(రజి) ప్రకారం, ఆయన ప్రవక్త (స) గారి సమావేశాల్లో దాదాపు వంద సమావేశాల్లో పాల్గొన్నారు. ఆ సమావేశాల్లో ఇస్లాం పూర్వకాలం నాటి కథలు సంఘటనల గురించి ప్రస్తావించడం జరిగేది. సహచరులు కవిత్వంరాసి వినిపించేవారు. ఒకసారి ప్రవక్త(స) అప్పటి కవి లాబిద్ రాసిన ఒక పద్యాన్నిచాలా మెచ్చుకున్నారు. ఆ పద్యం క్రింది విధంగా ఉంది:

దేవుడు తప్ప మిగిలినదంతా నశించేదే
ఆనందాలన్ని అంతం అయ్యేవే

ఉమయ్యా బిన్ అబీసాత్ రాసిన కవిత్వం వంద పంక్తులను ఒకసారి ప్రవక్త(స) విన్నారు. హజ్రత్ షారిద్ ఈ పంక్తులను ఆయనకు వినిపించారు. ఆ పంక్తులను విన్నతర్వాత ప్రవక్త(స) మాట్లాడుతూ, ఈ మనిషి ఇస్లాంకు చాలా దగ్గరగా వచ్చాడని అన్నారు. కొన్ని సందర్భాలో, ముఖ్యంగా యుద్ధరంగంలో ప్రవక్త(స) అనుకోకుండా కవితాత్మకంగా మాట్లాడేవారు. ఇస్లాం వ్యతిరేకులు ఇస్లాంకు విరుద్ధంగా రాసే కవిత్వానికి జవాబుగా తగిన కవిత్వం రాయాలని ఆయన హజ్రత్ హసన్, కాబ్ బిన్ మాలిక్‌లకు చెప్పారు. వాళ్ళు రాసిన కవిత్వాన్ని చదవమని కోరేవారు. మస్జిద్ ప్రసంగ ప్రదేశం నుంచి ఈ కవిత్వాన్ని చదివి వినిపించండని హజ్రత్ హసన్‌ను అనేక సార్లు కోరారు. కవిత్వాన్ని విని శత్రువులపై కరవాలాల కన్నా ఈ కవిత్వం చాలా ఉపయోగపడుతుందని వ్యాఖ్యానించారు. ఒక ముస్లిం తన కత్తితోనే కాదు, తన కలంతో కూడా జిహాద్ చేస్తాడని ఒకసారి చెప్పారు.

## కొన్ని ప్రత్యేక గుణగణాలు

ప్రవక్త(స) ఏదన్నా వస్తువు ఎవరికన్నా ఇస్తున్నప్పుడు, లేదా ఎవరి వద్ద నుంచయినా ఏదన్నావస్తువు తీసుకుంటున్నప్పుడు తన కుడిచేతిని ఉపయోగించేవారు.

కుడిచేత్తో ఇచ్చేవారు. కుడిచేత్తో పుచ్చుకునేవారు. ఉత్తరాలు, లేఖలు రాస్తున్నప్పుడు ముందుగా అల్లాహ్‌పేరు రాయమని లేఖరికి చెప్పేవారు. ఆ తర్వాత లేఖ రాస్తున్నవారి పేరు, ఎవరికి రాస్తున్నారో వారి పేరురాసిన తర్వాత ఉత్తరంప్రారంభించేవారు. ఉత్తరం ముగిసిన తర్వాత చివరన తన ముద్ర వేయించేవారు. ప్రవక్త(స) ఎన్నడూ ఎలాంటి మూఢనమ్మకాలు చూపలేదు. మంచిరోజులు, మంచి ముహూర్తాల గురించిఎన్నడూ ఆలోచించలేదు. అయితే ఆయన మంచి పేర్లను మెచ్చుకునేవారు. చెడ్డపేర్లను ఇష్టపడేవారు కాదు. ఎప్పుడైనాప్రయాణంలో ఉన్నప్పుడు మార్గమధ్యంలో మజిలీ చేయవలసి వస్తే మజిలీ చేసే ప్రదేశం పేరు ఎలా ఉందో చూసేవారు. సంతోషం, సౌభాగ్యం, విజయం వంటి అర్థాలున్న పేరు గల ప్రదేశాల్లో మజిలీ చేసేవారు. వివాదం, ఘర్షణ, జగడం,నష్టం వంటి అర్థాలున్న పేరు ఎవరికన్నా ఉంటే అలాంటి వ్యక్తికి ఏ పని అప్పగించేవారు కాదు. సంతోషం, విజయం అర్థమిచ్చే పేరుగల వ్యక్తులకే పనులు అప్పగించేవారు. కొంతమందికి పేర్లు మార్చి మంచి పేర్లు కూడా పెట్టారాయన. వాహనాల విషయంలో ఆయన గుఱ్ఱాన్ని ఎక్కువగా ఇష్టపడేవారు. గుఱ్ఱం మెడ జూలులో తీర్పుదినం వరకు దైవానుగ్రహం ఉంటుందని అనేవారు. ఆయన తన స్వహస్తాలతో తన గుఱ్ఱం కళ్ళను, ముక్కును, నోటిని శుభ్రం చేసేవారు. ప్రవక్త ముహమ్మద్(స)కు గందరగోళం, చప్పుళ్లు, హడావుడి నచ్చేవికాదు. ప్రతి పనిలోను నెమ్మది, హుందాతనం, క్రమబద్ధతను ఇష్టపడేవారు. చివరకు ప్రార్థనలకు వెళ్ళేటప్పుడు కూడా అనవసర కంగారును, తొందరపాటును, పరుగెత్తడాన్ని ఆయన వద్దని వారించారు. నెమ్మది, హుందాతనాలు మీకోసమే ఉన్నాయి అనేవారు. ఒకసారి హజ్ యాత్ర సందర్భంగా విపరీతమైన గందరగోళం, చప్పుళ్ళు, హడావుడి ఉండటాన్ని చూసి ప్రవక్త(స) తన గొంతెత్తి వారించారు. అనవసరపు హంగామా పుణ్యకార్యం కాదని అన్నారు.

ప్రవక్త ముహమ్మద్(స) అలవాట్లు, వారి నడవడి గురించి చెప్పుకోవాలంటే ఒక ప్రత్యేక అధ్యాయం అవసరమవుతుంది. ఎందుకంటే ఆయన పూర్తి జీవితం అత్యుత్తమ నడవడికి నిలువుటద్దం. హజ్రత్ ఆయిషా(రజి) ప్రకారం ఆయన నడవడి, ఆయన పద్ధతి అంతా దివ్యఖుర్ఆనే. ప్రవక్త(స) నడవడి గురించి అనస్ బిన్ మాలిక్ (రజి) చెప్పినమాటలు అత్యంత సమగ్రమైనవి. ఆయన ఇలా వివరించారు. ఆయన అందరిలోను ఉత్తముడు. అందరికన్నా దయాగుణం అధికంగా కలిగినవారు.



అందరికన్నా అధిక ధైర్యసాహసాలుకలిగినవాడు. దైవిక ఆదేశాల ప్రకారం తప్ప ఆయన ఎన్నడూ తన జీవితంలో ఎవరికి ఎలాంటి బాధ కలిగించలేదు. ఎవరి నుంచి ప్రతీకారం తీర్చుకోలేదు. ఆయన తనకు నష్టం కలిగించినవారిని కూడా క్షమించేవారు. ఆయన క్షమాగుణం ఏస్థాయిలో ఉండేదంటే, మక్కా తాయిఫ్ నగరాల్లో తనపై దాడులు చేసినవారిని, తనపై హత్యాయత్నానికి పూనుకున్నవారిని కూడా ఆయన క్షమించారు. ఎవరన్నా సహాయంచేయమని కోరితే ఆయన ఎన్నడూ ఆ కోరికను త్రోసిపుచ్చలేదు. ఆ వ్యక్తికి తాను సహాయం చేయలేకపోతే ఇతరుల ద్వారా సహాయం అందే ఏర్పాటైనా చేసేవారు. అలాకూడా సాధ్యం కాకపోతే సహాయం కోరిన వ్యక్తిని మరో రోజువస్తే సహాయం చేస్తానని చెప్పేవారు. అలాకూడా సాధ్యంకాకపోతే మౌనంగా ఊరుకునేవారు. ఆయన ధైర్యసాహసాలు సాటిలేనివి. సత్య సందేశాన్ని చాటి చెప్పడానికి ఆయన ఒంటరిగా నిలబడ్డారు. కష్టనష్టాలను, ప్రాణ ప్రమాదాలను నిబ్బరంగా ఎదుర్కొన్నారు. అత్యంత ప్రమాదకరమైన పరిస్థితుల్లో కూడాఆయన భయమంటే ఏమిటో ఎరుగని అనితరసాధ్య సాహసాన్ని చూపించారు. ఉక్కు సంకల్పంతో ముందుకు సాగారు. అలసత్వానికి, బలహీనతకు తావీయలేదు. సౌర్ గుహలో అత్యంతప్రమాదకరమైన పరిస్థితిలో ఉన్నప్పుడులేదా ఉహుద్, హునైన్ యుద్ధాల్లో పరిస్థితులు ప్రతికూలంగా మారిన ఆందోళనకరమైన పరిస్థితుల్లోను దైవం పట్ల ఆయన విశ్వాసం కించిత్ కూడా సడలలేదు. ఆయన స్థిర సంకల్పంలో ఎలాంటి మార్పు రాలేదు.

## అధ్యాయం - 2

# మక్కా జీవితం

రబీవుల్ అవ్వల్ 9వ తేదీ, అంటే క్రీ.శ. 571 ఏప్రిల్ 22వ తేదీన ప్రవక్త ముహమ్మద్(స) మక్కానగరంలో ఒక బీద కుటుంబంలో జన్మించారు. ఆ కుటుంబం డబ్బుకు బీద కుటుంబమే అయినా సామాజికంగా అత్యంత ఉన్నత స్థాయి కలిగిన కుటుంబం. సాంఘికంగా అత్యున్నత స్థాయిలో ఉన్న ఖురైష్ తెగకు సంబంధించిన కుటుంబం. అరబ్బు సంప్రదాయాలప్రకారం ఆయన చిన్నతనంలో పెంపకానికి పల్లె సీమలకు పంపబడ్డారు. అక్కడ ఒక గౌరవనీయ మహిళ పోషణలో పెరిగారు. ఆ విధంగా ఆయన ఆరోగ్యకరమైన పల్లెసీమల్లో పెరిగారు. ఎడారి కఠిన జీవనానికి అలవాటుపడ్డారు. ఆ విధంగా ముమ్ముందు తనకు ఎదురుకానున్న కఠినమైన జీవితాన్ని తట్టుకునే శిక్షణ పొందారు. అక్కడ గొర్రెలు కాస్తూ జాతులకు న్యాయకత్వం వహించే శిక్షణ పొందారు. ఆయన ఒక అనాథగా పుట్టారు. ఆయన జన్మించడానికి కేవలం కొన్ని నెలల ముందే తండ్రి మరణించారు. జన్మించిన కొన్ని సంవత్సరాలకు తల్లిగారు పరమపదించారు. ఆ పిదప ఆయన తన తాతగారి ప్రాపకంలో పెరిగారు. కాని తాతగారు కూడా ఎక్కువ కాలం కనిపెట్టుకుని ఉండలేకపోయారు. తాతగారి మరణం తర్వాత పినతండ్రి ఆయనకు పెద్ద దిక్కయ్యారు. ఆ విధంగా ప్రాపంచికంగా తనవారందరి సహాయ సహకారాలను ఆయన కోల్పోయారు. తనవారనబడే వారి ప్రేమాభిమానాలు ఆయనకు లభించలేదు. కేవలం ఆ దేవుని సహాయ సహకారాలతో ఆయన తన ముందున్న మహా బాధ్యతల భారాన్ని మోయడానికి సన్నద్ధమయ్యారు. బాల్యంలో ఆయన మన పిల్లల మాదిరిగా ఆటపాటల్లో సమయాన్ని గడపలేదు. తన సమయాన్ని వ్యర్థ కాలక్షేపాల్లో గడుపలేదు. వయసుకు మించిన పరిపక్వతను ప్రదర్శించేవారు. పెద్ద వయసు వారిలో ఉండేనిగ్రహాన్ని, సంయమనాన్ని, వివేచనా, విచక్షణలను చిన్నప్పుడే కలిగి ఉండేవారు. ఆ కాలంలో అరబ్బు సమాజంలో ఉన్న చెడులకు ఆయన దూరంగా ఉన్నారు. సమాజంలో అవినీతి, వ్యభిచారం, జూదం, మద్యపానం తదితర చెడులు ప్రబలి ఉన్న నేపథ్యం అది. కాని ఆయన ఆ చెడు లన్నింటికీ దూరంగా ఉన్నారు. పరిశుద్ధంగా, పవిత్రంగా, స్వచ్ఛంగా నిలబడగలిగారు.



ఆయన ఎన్నడూ విగ్రహాల ముందు తల వంచలేదు. ఖురైష్ తెగ ఆచార సంప్రదా యాల్లో విగ్రహపూజ అతి ముఖ్యమైనదైనప్పటికీ ఆయన విగ్రహాలకు దూరంగా ఉన్నారు. విగ్రహాలకు బలిచ్చిన మాంసాన్ని ఆయన ఎన్నడూ తీసుకోలేదు. నిర్ద్వంద్వంగా తిరస్కరించేవారు. సమాజంలో ఉన్న చెడులకు తోడు ఖురైషులు కొత్త ఆచారాన్ని ప్రారంభించారు. అసభ్యకరమైన ఆచారమది. కాబాగృహం చుట్టు నగ్నంగా ప్రదక్షిణలు చేసే ఆచారం. అలాగే అరాఫత్ మైదానంలో విడిది చేసే హజ్ ఆచారాన్ని రద్దు చేసుకున్నారు. కాని బాల్యంలో కూడా ప్రవక్త ముహమ్మద్(స) ఈ దురాచారాలను ఎన్నడూ పాటించలేదు. ఈ దురాచారాలకు ఎల్లప్పుడూ దూరంగానే ఉన్నారు. చిన్నపిల్లవాడిగా ఉన్నప్పుడు ఫుజ్జార్ పోరాటంలో ఆయన పాల్గొన్నారు. ఆ పోరాటంలో ఆయన ఖురైష్‌ల పక్షాన పోరాడారు. ఈ యుద్ధంలో న్యాయం ఖురైష్‌ల పక్షాన ఉందని ఆయన భావించడం వల్లనే ఆ యుద్ధంలో పాలుపంచుకున్నారు. కాని ఆయన ఎవరిని హతమార్చలేదు. తన చేతులకు రక్తం అంటనీయలేదు.

నవయువ్వనంలో కూడా ఆయన ఇతరులకు భిన్నంగా ఉన్నత నైతిక ప్రమాణా లకు ఆలవాలంగా నిలిచారు. సారూప్య భావాలున్న యువకులతో కలిసి ఆయన పనిచేసేవారు. ఈ యువకులు అందరూ కలిసి ఒక సంస్కరణాత్మక సంస్థగా ఏర్పడ్డారు. పేదవారికి సహాయంచేయడం, అణగారిన వారిని ఆదుకోవడం, దౌర్జన్యపరుల దుర్మార్గాలను అడ్డుకోవడం వంటి పనులు చేసేవారు. ఈ సంస్థ హల్ఫుల్ ఫుజూల్ సంస్థగా పేరు పొందింది. పైన పేర్కొన్న మంచి పనులు చేయాలని ప్రతిజ్ఞ చేసి ఈ సంఘంగా ఏర్పడ్డారు. ముహమ్మద్(స) తర్వాత ప్రవక్తగా తన బాధ్యతలు నిర్వర్తిస్తున్నప్పుడు కూడా అప్పుడప్పుడు ఈ సంస్థ గురించి ప్రస్తావిస్తూ అప్పుడు చేసిన ప్రతిజ్ఞలకు బదులు తనకు ఎర్ర ఒంటెలు ఇచ్చినా తీసుకునేవాడిని కాదని, నేటికి కూడా అలాంటి ప్రతిజ్ఞ చేసి ఒక్కటి కావడానికి ఎవరన్నా పిలిస్తే తిరస్కరించడం జరగదని అన్నారు. వివేకానికి, విచక్షణకు పేరెన్నిక గన్న ముహమ్మద్(స) ప్రదర్శించిన సమయస్ఫూర్తికి ఒక్క ఉదాహరణ చాలు. ఒకసారి కాబా గృహం పునర్నిర్మాణం జరుగుతోంది. ఈ సందర్భంగా వివిధ తెగల మధ్య ఉద్రిక్తత తలెత్తింది. కాబా గృహంలో నల్లరాయిని ఎవరు అమర్చాలన్న విషయమై వివిధ తెగల మధ్య తీవ్రమైన వాదోపవాదాలు జరిగాయి. చివరకు ఆగ్రహావేశాలు ఆకాశాన్నంటాయి. కత్తులు ఒరల నుంచి బయటకు వచ్చాయి. చివరకు ఈ ఉద్రిక్త పరిస్థితిని నివారించే బాధ్యత ముహమ్మద్(స) భుజస్కంధాలపై పడింది. ఆయన

సమయస్ఫూర్తితో ఒక దుప్పటి తెప్పించారు. ఆ నల్లరాయిని ఆ దుప్పటిలో ఉంచారు. వివిధ తెగల నాయకులు ఆ దుప్పటిని నాలుగువైపులా పట్టుకుని మోసు కుంటూ గోడ వద్దకు చేర్చారు. ప్రవక్త(స) స్వయంగా తన చేతులతో ఆ నల్లరాతిని గోడకు అమర్చారు. ఈ ఏర్పాటు అందరికీ నచ్చింది. ఉద్రిక్తత చల్లారింది.

యుక్త వయస్సుకు చేరుకున్న తర్వాత ఆయన వ్యాపారాన్ని ఉపాధి మార్గంగా స్వీకరించారు. మక్కాలో పేరెన్నికగన్న పెట్టుబడిదారులు ఆయన ద్వారా తమ వ్యాపార వాణిజ్యాలు నిర్వహించాలని ఉవ్విళ్ళూరేవారు. మక్కాలోని ప్రముఖ వ్యాపారులు సాయిబ్, ఖైస్ బిన్ సాయిబ్ మఖ్జామి, హజ్రత్ ఖదీజా వంటి వారికి ముహమ్మద్(స) నిజాయితీ, వ్యాపార దక్షతల గురించి అనుభవపూర్వకంగా తెలిసింది. నిజాయితీ పరుడైన వ్యాపారిగా ఆయన పేరెన్నికగన్నారు. ముహమ్మద్(స) ప్రవక్తగా నియమించ బడక పూర్వం, ఒక సందర్భంలో అబ్దుల్లా బిన్ అబిల్ హమ్సా అనే వ్యక్తి ప్రవక్త(స)ను బజారులో కలిసి మీరు ఇక్కడే ఉండండి నేనిప్పుడే వస్తాను అని వెళ్ళాడు. కాని ఆ వ్యక్తి ఆ విషయాన్ని మరిచిపోయాడు. మూడు రోజుల తర్వాత అబ్దుల్లా తిరిగి అదే మార్గాన రావడం జరిగింది. ప్రవక్త(స) ఇంకా అక్కడే అతని కోసం ఎదురుచూస్తూ నిలబడి ఉండడం కనబడింది. ఇది చూసి ఆయన చాలా సిగ్గుపడ్డారు. మూడు రోజుల వరకు ఇచ్చిన మాట కోసం అక్కడే నిలబడి ఎదురు చూశారాయన.

ఆయన వివాహ వయస్సుకు చేరుకున్నప్పుడు ఆయన అందమైన అమ్మాయిల కోసం చూడలేదు. సౌశీల్యానికి, సౌజన్యానికి, మంచితనానికి, ధార్మికతకు పేరుపబడిన మహిళను తన జీవిత భాగస్వామిగా ఎంచుకున్నారు. నిజానికి ఈ పెళ్లి ప్రతిపాదన స్వయంగా ఆ మహిళ తరఫునేవచ్చింది. ఆమె మరెవరోకాదు, విశ్వాసుల మాతృమూర్తి హజ్రత్ ఖదీజా(రజి). ఆమె తరఫు నుంచి వచ్చిన ప్రతిపాదనను ప్రవక్త(స) ఆమోదిం చారు. పెళ్ళి విషయంలో ఆయన తీసుకున్న నిర్ణయం ఆయన ఉన్నత విలువలకు, ఉత్కృష్ట ప్రమాణాలకు నిదర్శనంగా నిలిచింది. అంతేకాదు, ఆయన దూరదృష్టికి, ఉత్తమ వ్యక్తిత్వానికి, మచ్చలేని స్వచ్ఛమైన గుణగణాలకు ఈ నిర్ణయం ఒక ఉదాహరణ. జీవిత భాగస్వామి ఎన్నిక విషయంలోనేకాదు, ఆయన మిత్రుల ఎంపికను పరిశీలించినా మనకు ఈ వాస్తవం స్పష్టంగా బోధపడుతుంది. ఆయన మిత్రుల్లో ఉత్తమ వ్యక్తిత్వం విషయంలోఅనుమానించదగ్గ వ్యక్తి ఒక్కరు కూడా కనబడరు. పనికిమాలిన అలవాట్లున్న ఒక్క వ్యక్తి కూడా ఆయన మిత్ర బృందంలో లేరు. మోసపూరిత స్వభావమున్న ఏ ఒక్కరుకూడా ఆయన మిత్రుడిగా కనబడదు. ఆయనకు



అత్యంత సన్నిహితుడైన మిత్రుడు హజ్రత్ అబూ బక్ర్ (రజి). ప్రవక్త(స) వయసు హజ్రత్ అబూబక్ర్(రజి)వయసు దాదాపు సమానమే. ఇద్దరి అభిరుచులు కూడా ఒక్కటే. మరో స్నేహితుడు హాకిమ్ బిన్ హాజమ్. ఈయన హజ్రత్ ఖదీజా(రజి)కు వరుసకు సోదరుడు అవుతాడు. కాబా యాత్రికుల బాగోగులు చూసే బాధ్యత ఆయన నిర్వహించే వారు. హాజమ్ చాలా కాలం వరకు ఇస్లామ్ స్వీకరించలేదు. హిజ్రత్ తర్వాత ఎనిమిదేళ్ళ వరకు ఆయన ఇస్లామ్ స్వీకరించకపోయినప్పటికీ ప్రవక్త(స) ఆయన్ను చాలా అభిమానంగా, చాలా గౌరవంగా చూసేవారు. తన అభిమానాన్ని ప్రదర్శిస్తూ ఒకసారి ప్రవక్త(స) ఆయనకు 50 బంగారు నాణాల విలువైన ఒక అంగీ కానుకగా పంపించారు. కాని హాజిమ్ ఆ అంగీ ధర చెల్లిస్తానని పట్టు పట్టి ధర చెల్లించారు. ప్రవక్త(స) స్నేహితుల్లో మరొకరి పేరు జోమాద్ బిన్ సలాబా అజ్దీ. ఈయన శస్త్రచికిత్స చేసేవారు. ఒక వ్యక్తిని అతని స్నేహితులు, మిత్రుల ఆధారంగా ఆ వ్యక్తి గుణగణాలను అంచనా వేసేదైతే, ప్రవక్త(స) మిత్ర బృందాన్ని చూస్తే చాలు ఆయన ఉన్నత గుణగణాలు అర్థం అవుతాయి.

తన దైనందిన కార్యకలాపాల నుంచి, తన వ్యాపార కార్యకలాపాల నుంచి తీరిక సమయం లభిస్తే ఈ యువకుడు వ్యర్థ కాలక్షేపాల్లో ఆ సమయాన్నిఎన్నడూ వెచ్చించలేదు. హిరా గుహకు వెళ్ళి ఏకాంతంలో దైవాన్ని ప్రార్థించేవారు. తన స్వంత వివేచన ప్రకారం దైవాన్ని ప్రార్థిస్తూ సత్యావిష్కరణ కోసం మేథోమథనం చేసేవారు. సమాజంలో నెలకొని ఉన్న చెడులు, నైతిక పతనం గురించి తీవ్రంగా యోచించేవారు. యావత్తు ప్రపంచంలో ఉన్న అనాచారాల గురించి ఆలోచించేవారు. వీటి పరిష్కారాల కోసం పరితపించేవారు. ఈవిధంగా సమాజం కోసం, సమాజంలో వేళ్ళూనుకొని ఉన్న చెడుల నిర్మూలన కోసం ఆలోచించే, పరితపించే యువకుడి స్వభావాన్ని అర్థం చేసుకోవడం కష్టం కాదు. తీరిక సమయాల్లో వ్యర్థ కాలక్షేపాలకు బదులు సత్యం కోసం ఆలోచించిన యువకుడి మనస్తత్వం ఎలాంటిదో ఊహించడం కష్టంకాదు. ప్రవక్తగా తనను దేవుడు నియమించాడని తర్వాత ప్రకటించిన ఈ యువకుడు ప్రజల ముందు ఒక స్పష్టమైన, నిర్దిష్టమైన జీవన విధానాన్ని ప్రతి పాదించాడు. ఆయన ఆ ప్రజల మధ్యనే జన్మించారు. వారి మధ్యనే పెరిగి పెద్దవార య్యారు. తన బాల్యాన్ని, తన యవ్వనాన్ని వారి మధ్యనే గడిపారు. వారి కళ్ళ ముందే ప్రాజ్ఞతకు చేరుకున్నారు. ఆయన జీవితం వారి ముందు తెరిచిన పుస్తకం మాదిరిగా ఉంది. ఆయన వ్యక్తిత్వంలో చిన్నపాటి మచ్చను కూడా వేలెత్తి చూపే

సమయస్ఫూర్తితో ఒక దుప్పటి తెప్పించారు. ఆ నల్లరాయిని ఆ దుప్పటిలో ఉంచారు. వివిధ తెగల నాయకులు ఆ దుప్పటిని నాలుగువైపులా పట్టుకుని మోసు కుంటూ గోడ వద్దకు చేర్చారు. ప్రవక్త(స) స్వయంగా తన చేతులతో ఆ నల్లరాతిని గోడకు అమర్చారు. ఈ ఏర్పాటు అందరికీ నచ్చింది. ఉద్రిక్తత చల్లారింది.

యుక్త వయస్సుకు చేరుకున్న తర్వాత ఆయన వ్యాపారాన్ని ఉపాధి మార్గంగా స్వీకరించారు. మక్కాలో పేరెన్నికగన్న పెట్టుబడిదారులు ఆయన ద్వారా తమ వ్యాపార వాణిజ్యాలు నిర్వహించాలని ఉవ్విళ్ళూరేవారు. మక్కాలోని ప్రముఖ వ్యాపారులు సాయిబ్, ఖైస్ బిన్ సాయిబ్ మఖ్జూమి, హజ్రత్ ఖదీజా వంటి వారికి ముహమ్మద్(స) నిజాయితీ, వ్యాపార దక్షతల గురించి అనుభవపూర్వకంగా తెలిసింది. నిజాయితీ పరుడైన వ్యాపారిగా ఆయన పేరెన్నికగన్నారు. ముహమ్మద్(స) ప్రవక్తగా నియమించ బడక పూర్వం, ఒక సందర్భంలో అబ్దుల్లా బిన్ అబిల్ హమ్సా అనే వ్యక్తి ప్రవక్త(స)ను బజారులో కలిసి మీరు ఇక్కడే ఉండండి నేనిప్పుడే వస్తాను అని వెళ్ళాడు. కాని ఆ వ్యక్తి ఆ విషయాన్ని మరిచిపోయాడు. మూడు రోజుల తర్వాత అబ్దుల్లా తిరిగి అదే మార్గాన రావడం జరిగింది. ప్రవక్త(స) ఇంకా అక్కడే అతని కోసం ఎదురుచూస్తూ నిలబడి ఉండడం కనబడింది. ఇది చూసి ఆయన చాలా సిగ్గుపడ్డారు. మూడు రోజుల వరకు ఇచ్చిన మాట కోసం అక్కడే నిలబడి ఎదురు చూశారాయన.

ఆయన వివాహ వయస్సుకు చేరుకున్నప్పుడు ఆయన అందమైన అమ్మాయిల కోసం చూడలేదు. సౌశీల్యానికి, సౌజన్యానికి, మంచితనానికి, ధార్మికతకు పేరుపబడిన మహిళను తన జీవిత భాగస్వామిగా ఎంచుకున్నారు. నిజానికి ఈ పెళ్లి ప్రతిపాదన స్వయంగా ఆ మహిళ తరఫునేవచ్చింది. ఆమె మరెవరోకాదు, విశ్వాసుల మాతృమూర్తి హజ్రత్ ఖదీజా(రజి). ఆమె తరఫు నుంచి వచ్చిన ప్రతిపాదనను ప్రవక్త(స) ఆమోదిం చారు. పెళ్ళి విషయంలో ఆయన తీసుకున్న నిర్ణయం ఆయన ఉన్నత విలువలకు, ఉత్కృష్ట ప్రమాణాలకు నిదర్శనంగా నిలిచింది. అంతేకాదు, ఆయన దూరదృష్టికి, ఉత్తమ వ్యక్తిత్వానికి, మచ్చలేని స్వచ్ఛమైన గుణగణాలకు ఈ నిర్ణయం ఒక ఉదాహరణ. జీవిత భాగస్వామి ఎన్నిక విషయంలోనేకాదు, ఆయన మిత్రుల ఎంపికను పరిశీలించినా మనకు ఈ వాస్తవం స్పష్టంగా బోధపడుతుంది. ఆయన మిత్రుల్లో ఉత్తమ వ్యక్తిత్వం విషయంలోఅనుమానించదగ్గ వ్యక్తి ఒక్కరు కూడా కనబడరు. పనికిమాలిన అలవాట్లున్న ఒక్క వ్యక్తి కూడా ఆయన మిత్ర బృందంలో లేరు. మోసపూరిత స్వభావమున్న ఏ ఒక్కరుకూడా ఆయన మిత్రుడిగా కనబడడు. ఆయనకు



అత్యంత సన్నిహితుడైన మిత్రుడు హజ్రత్ అబూ బక్ర్ (రజి). ప్రవక్త(స) వయసు హజ్రత్ అబూబక్ర్(రజి)వయసు దాదాపు సమానమే. ఇద్దరి అభిరుచులు కూడా ఒక్కటే. మరో స్నేహితుడు హాకిమ్ బిన్ హాజమ్. ఈయన హజ్రత్ ఖదీజా(రజి)కు వరుసకు సోదరుడు అవుతాడు. కాబా యాత్రికుల బాగోగులు చూసే బాధ్యత ఆయన నిర్వహించే వారు. హాజమ్ చాలా కాలం వరకు ఇస్లామ్ స్వీకరించలేదు. హిజ్రత్ తర్వాత ఎనిమిదేళ్ళ వరకు ఆయన ఇస్లామ్ స్వీకరించకపోయినప్పటికీ ప్రవక్త(స) ఆయన్ను చాలా అభిమానంగా, చాలా గౌరవంగా చూసేవారు. తన అభిమానాన్ని ప్రదర్శిస్తూ ఒకసారి ప్రవక్త(స) ఆయనకు 50 బంగారు నాణాల విలువైన ఒక అంగీ కానుకగా పంపించారు. కాని హాజిమ్ ఆ అంగీ ధర చెల్లిస్తానని పట్టు పట్టి ధర చెల్లించారు. ప్రవక్త(స) స్నేహితుల్లో మరొకరి పేరు జోమాద్ బిన్ సలాబా అజ్దీ. ఈయన శస్త్రచికిత్స చేసేవారు. ఒక వ్యక్తిని అతని స్నేహితులు, మిత్రుల ఆధారంగా ఆ వ్యక్తి గుణగణాలను అంచనా వేసేదైతే, ప్రవక్త(స) మిత్ర బృందాన్ని చూస్తే చాలు ఆయన ఉన్నత గుణగణాలు అర్థం అవుతాయి.

తన దైనందిన కార్యకలాపాల నుంచి, తన వ్యాపార కార్యకలాపాల నుంచి తీరిక సమయం లభిస్తే ఈ యువకుడు వ్యర్థ కాలక్షేపాల్లో ఆ సమయాన్నిఎన్నడూ వెచ్చించలేదు. హిరా గుహకు వెళ్ళి ఏకాంతంలో దైవాన్ని ప్రార్థించేవారు. తన స్వంత వివేచన ప్రకారం దైవాన్ని ప్రార్థిస్తూ సత్యావిష్కరణ కోసం మేథోమథనం చేసేవారు. సమాజంలో నెలకొని ఉన్న చెడులు, నైతిక పతనం గురించి తీవ్రంగా యోచించేవారు. యావత్తు ప్రపంచంలో ఉన్న అనాచారాల గురించి ఆలోచించేవారు. వీటి పరిష్కారాల కోసం పరితపించేవారు. ఈవిధంగా సమాజం కోసం, సమాజంలో వేళ్ళూనుకొని ఉన్న చెడుల నిర్మూలన కోసం ఆలోచించే, పరితపించే యువకుడి స్వభావాన్ని అర్థం చేసుకోవడం కష్టం కాదు. తీరిక సమయాల్లో వ్యర్థ కాలక్షేపాలకు బదులు సత్యం కోసం ఆలోచించిన యువకుడి మనస్తత్వం ఎలాంటిదో ఊహించడం కష్టంకాదు. ప్రవక్తగా తనను దేవుడు నియమించాడని తర్వాత ప్రకటించిన ఈ యువకుడు ప్రజల ముందు ఒక స్పష్టమైన, నిర్దిష్టమైన జీవన విధానాన్ని ప్రతి పాదించాడు. ఆయన ఆ ప్రజల మధ్యనే జన్మించారు. వారి మధ్యనే పెరిగి పెద్దవార య్యారు. తన బాల్యాన్ని, తన యవ్వనాన్ని వారి మధ్యనే గడిపారు. వారి కళ్ళ ముందే ప్రాజ్ఞతకు చేరుకున్నారు. ఆయన జీవితం వారి ముందు తెరిచిన పుస్తకం మాదిరిగా ఉంది. ఆయన వ్యక్తిత్వంలో చిన్నపాటి మచ్చను కూడా వేలెత్తి చూపే

పరిస్థితి అక్కడ ఎవ్వరికీలేదు. ఆయన ప్రజలను మోసగిస్తున్నాడని అనుమానించడానికి ఎలాంటి ఆస్కారమూ లేని స్వచ్ఛమైన జీవితాన్ని ఆయన వారి మధ్య గడిపారు. ఏదో ఒక అసత్యాన్ని ప్రచారం చేస్తున్నాడని లేదా తన స్వార్థం కోసం దేవుని పేరును వాడుకుంటున్నాడని ఎవరూ ఆరోపించే పరిస్థితి లేనేలేదు. వ్యాపార ప్రయోజనాల కోసం లేదా చౌకబారు ప్రచారం కోసం ఆయన ఇదంతా చేస్తున్నాడని చెప్పే సాహసం ఎవరూ చేయలేకపోయారు. అలాంటి ఉత్తమమైన, స్వచ్ఛమైన, మచ్చలేని జీవితాన్ని ఆయన వారి మధ్య గడిపారు. ఆ ప్రజలు ఆయన నిజాయితీని ఎన్నడూ శంకించలేదు. ఆయన సత్యసంధను ప్రతి సందర్భంలోను ఒప్పుకున్నారు. ఆయన నమ్మదగ్గ మనిషని, విశ్వసనీయుడని, వివేకం, వివేచనల విషయంలో సాటిలేని వాడని, నైతికంగా ఉత్తమ వ్యక్తిత్వం కలవాడని అందరూ అంగీకరించారు. ఆయన పట్ల తీవ్రమైన వ్యతిరేకత ఉన్నప్పుడు కూడా ఆయన్ను హతమార్చాలన్న వైరం ప్రబలిన పరిస్థితుల్లో కూడా ఆయన వ్యక్తిత్వాన్ని వాళ్ళు శంకించలేకపోయారు. నిజం చెప్పాలంటే ప్రవక్త(స) ఆ సమాజంలో, ఆ ప్రజల మధ్య గడిపిన జీవితమే ఆయన ప్రచారం చేసే సత్య సందేశానికి గొప్ప బలంగా మారింది.

> **"ఈ గ్రంథం అవతరించక పూర్వం నేను మీ మధ్య ఒక జీవితకాలాన్నంతా గడిపాను. మీరు బుద్ధిని ఉపయోగించరా?"** ***(దివ్యఖుర్ఆన్ 10 : 16)***

సానబెట్టిన వజ్రంలాంటి అత్యుత్తమ వ్యక్తిత్వంతో ఆ సమాజంలో బతికిన ఆయన దైవప్రవక్తగా ప్రజల ముందు సత్యాన్ని ప్రకటించినప్పుడు ప్రజలు ఒక్కసారి ఆయనకుప్రత్యర్థులైపోయారు. ఆయన నిజాయితీ, ఆయన విశ్వసనీయత, ఆయన సత్యసంధతలకు ఒకసారి విలువ లేకుండా పోయింది. ఆయన ప్రకటిస్తున్న సత్యాన్ని ప్రశ్నించే స్వరాలు మిన్నంటాయి. అంతకుముందు రోజు వరకు సమాజంలో తమందరికి గర్వకారణం వంటి వాడని ప్రస్తుతించిన వాళ్ళే ఒకసారి విమర్శించడం ప్రారంభించారు. ఆయన్ను శత్రువుగా చూడ్డం మొదలుపెట్టారు. ఆయన ఒక్కసారిగా చెల్లని నాణం అయిపోయాడా? కాదు.. ఎన్నటికీ కాదు. లోపం ఆయనలో లేదు. ప్రజల్లోనే ఆ లోపం ఉంది. ప్రజల దృష్టికోణంలోనే ఆ లోపం ఉంది. ఖురైషులకు ఆయన గురించి బాగా తెలుసు. ఆయన్ను వాళ్ళు పూర్తిగా అర్థం చేసుకున్నారు. అయినా సత్యాన్ని గ్రహించకుండా ఉద్దేశపూర్వకంగా కళ్ళు మూసుకున్నారు. ఎందుకంటేవారి స్వార్థ ప్రయోజనాలు, వారి పక్షపాతాలు వారిని గుడ్డివారిగా చేశాయి.



> **"వారికి కళ్ళు ఉన్నాయి. కాని వారు వాటితో చూడరు."** (7: 179)

నిజం చెప్పాలంటే, ఒక సంప్రదాయ వ్యవస్థలో ఖురైషులకు నాయకత్వ హోదా లభించింది. అరబ్బు తెగల్లో వారికి అత్యుత్తమ హోదా గౌరవాలు ప్రాప్తించాయి. ఈ వ్యవస్థ ఇలాగే కొనసాగితే యథాతథ స్థితి ఉన్నప్పుడే వారి హోదా గౌరవాలు కొనసాగుతాయి. రాజకీయ, ధార్మిక అధికారాలన్నీ వారి చేతుల్లోనే ఉన్నాయి. వ్యాపార వాణిజ్యాలలో వారిదే నాయకత్వం. ఒక ప్రత్యేక మతవ్యవస్థలో వారిదే పెత్తనం. ఈ పెత్తనం కాపాడుకోవాలంటే యథాతథస్థితి కొనసాగాలి. అందువల్ల తమ సంప్రదాయక వ్యవస్థను కాపాడుకోవడానికి ప్రయత్నించారు. కాని ప్రవక్త(స) ఆ వ్యవస్థను నిర్మూలించడానికి కంకణం కట్టుకున్నారు. అందుకే వివిధ తెగల నాయకులు, దారితప్పిన సమాజంలో పెత్తందార్లు, మతపెద్దలు, స్వార్థ ప్రయోజనాల కోసం ఒక్కటయ్యారు. సత్యానికి వ్యతిరేకంగా నడుం కట్టారు. సంస్కరణలను అడ్డుకోవ డానికి ప్రయత్నించారు.

ప్రవక్త(స) ఆయన వెంట ఉన్న కొద్దిపాటి సహచరులు ఎలాంటి కఠిన పరిస్థితులను ఎదుర్కొన్నారో, వారిపై ఎలాంటి కష్టనష్టాల పర్వతాలు విరుచుకుపడ్డాయో తెలుసుకునేముందు, ఆ దుర్భర పరిస్థితుల్లోను, దుర్గమమైన మార్గంలో ప్రవక్త(స), ఆయన సహచరులు ఎంత నిబ్బరంగా ముందుకు సాగారో తెలుసుకునే ముందు ఆ చీకటి దొంతరల అజ్ఞాన కాలంలో కూడా కనబడిన కొన్ని కాంతిపుంజాల గురించి తెలుసుకుందాం. ఎందుకంటే, ఈ కాంతిపుంజాలు ఆ తర్వాత రానున్న ప్రకాశమానమైన దీపకాంతికి ముందు సూచనలుగా కానవచ్చాయి. మార్పు కోసం, సంస్కరణ కోసం పరితపిస్తున్న మానవ స్వభావాన్ని ఇవి చాటిచెప్పాయి. అంధకారంలో కొట్టుమిట్టాడుతూ విసిగివేసారిన మానవ సహజ ప్రవృత్తిని ఇవి తెలియజేస్తున్నాయి. ప్రవక్త(స)కు దైవవాక్యాలు అవతరించక ముందే, సమాజంలో పేరుకుపోయిన చెడులపై తిరుగుబాటు జాడలు కానవచ్చాయి. ఈ చెడులపై ఆలోచనాపరుల్లో తిరస్కారం చోటుచేసుకుంది. తిరుగుబాటుకు పునాదులు పడ్డాయి. కేవలం దైవిక మార్గదర్శకత్వం కోసం ఎదురుచూడ్డం మాత్రమే మిగిలివుంది.

ఒకరోజు ఖురైషులు ఒక పెద్ద ఉత్సవం చేసుకుంటున్నారు. విగ్రహాల స్తుతి పాఠాలు గొంతెత్తి పాడుతున్నారు. విగ్రహాలకు నైవేద్యాలు సమర్పిస్తున్నారు. ఆరాధనా భావంతో విగ్రహాలకు ప్రదక్షిణలు చేస్తున్నారు. కాని నలుగురు వ్యక్తులు మాత్రం

ఈ ఉత్సవాలకు దూరంగా ఆలోచనల్లో మునిగి ఉన్నారు. వారి పేర్లు వర్ఖా బిన్ నౌఫిల్, అబ్దుల్లా బిన్ జహష్, ఉస్మాన్ బిన్ అల్‌హోవారిస్, జైద్ బిన్ అమ్ర్ బిన్ నౌఫిల్. ఈ నలుగురు ఉత్సవ ఆర్భాటాలకు దూరంగా ఒకచోట సమావేశమయ్యారు. ఒక రహస్యప్రతిజ్ఞ చేసుకున్నారు. సమాజం దురాచారాల్లో కూరుకుపోయిందని, తమ ప్రజలు అనాచారాల విషవలయంలో చిక్కుకుపోయారని, తమ పూర్వీకుడు ఇబ్రాహీమ్(అలై)బోధించిన మతధర్మానికి పూర్తిగా దూరమయ్యారని, రాతి విగ్రహాల ముందు మోకరిల్లుతున్నారని, ఈ విగ్రహాలు కనీసం చూడలేవు, వినలేవు, అలాంటి విగ్రహాల ముందు మోకరిల్లుతున్నారని, ఈ విగ్రహాలు కనీసం చూడలేవు, వినలేవు, అలాంటి విగ్రహాలు ఎలాంటి ప్రయోజనాన్ని చేకూర్చలేవని, ఎవరికీ హాని కూడా చేయలేవని, కాబట్టి వాస్తవ ధర్మమైన ప్రవక్త ఇబ్రాహీమ్(అలై) బోధించిన ధర్మానుయాయులను అన్వేషించాలని వారు ప్రతిజ్ఞ చేసుకున్నారు. ఆ తర్వాత వర్ఖా బిన్ నౌఫిల్ క్రైస్తవుడిగా మారిపోయాడు. అబ్దుల్లా బిన్ జహష్ సత్యాన్వేషణలో పరితపిస్తూ మొదట ఇస్లామ్ స్వీకరించాడు. ఆ తర్వాత క్రైస్తవునిగా మారిపోయాడు. ఉస్మాన్ రోమ్ చక్రవర్తి వద్దకు వెళ్ళి క్రైస్తవునిగా మారిపోయాడు. జైద్ మాత్రం క్రైస్తవుడిగా మారలేదు. అసలు ఏ ధర్మాన్నీ స్వీకరించలేదు. సత్యాన్వేషణ కొనసాగించాడు. తన సమాజం పాటిస్తున్న మతాన్ని కూడా తిరస్కరించాడు. విగ్రహారాధన మానుకున్నాడు. విగ్రహాల ముందు బలిచ్చిన ఆహారాన్ని తినేవాడు కాదు. ఆడశిశువులు పుట్టగానే హతమార్చే దురాచారాన్ని తీవ్రంగా నిరసిస్తూ ప్రచారం చేసేవాడు. తాను ప్రవక్త ఇబ్రాహీమ్(అలై) మతాన్ని ఆచరిస్తున్నానని ప్రకటించేవాడు. దేవుని ఆరాధించే సరైన పద్ధతి తనకు తెలియదని, ఆ పద్ధతి తెలిస్తే తప్పక ఆ పద్ధతిని అనుసరించి ఉండేవాడినని చెప్పుకునేవాడు. ఆయన సాధారణంగా క్రింది వాక్యాలు పలుకుతూ ఉండేవాడు.

## దేవుడు ఒక్కడా వేలమంది దేవుళ్ళా?

వివిధ దేవుళ్ళ మధ్య తన వ్యవహారాలను పంచేసేది ఒక మతమా?.. అనేవాడు.

నేను లాత్, ఉజ్జా ఇంకా వాళ్ళందరినీ (ఖురైష్‌ల దేవతా విగ్రహాలు) తిరస్కరిస్తున్నాను. స్థిరమైన సహనం కలిగిన మనిషి చేయవలసిన పని ఇదే అనికూడా చెప్పేవాడు. కాని నేను నా దేవుడిని ఆరాధిస్తున్నాను.ఆయనే పోషకుడు.



## ఆ ప్రభువు నా పాపాలను క్షమించుగాక

కాబట్టి మీరు ఆ దేవుడిపట్ల భయభక్తులు కలిగి వుండండి అని పలికేవాడు. ఈ దైవభీతి మీరు కలిగి ఉన్నంతకాలం మీకు ఎలాంటి నష్టం ఉండదు అని బోధించేవాడు. అతడి భార్య సఫియా, అల్ హజ్రామీ కుమార్తె. ఆమె ఎప్పుడూ అతడిని వేధిస్తూ ఉండేది. అతను సత్యాన్వేషణలో ఇల్లు వదిలి వెళ్ళాలనుకున్న ప్రతిసారి ఆమె ఖత్తాబ్ బిన్ నౌఫిల్‌కు ఆ విషయం తెలియజేసేది. అతను వచ్చి తాతముత్తాతల మతాన్ని వదిలేస్తావా అని మందలించి బలవంతంగా జైద్‌ను వెళ్ళకుండా ఆపేవాడు. జైద్ కాబా గృహంలో అడుగుపెట్టిన ప్రతిసారి గొంతెత్తి ప్రభూ! నేను ఒక విధేయుడినైన, నిజాయితీ కలిగిన సేవకుడిగా నీ సన్నిధిలో హాజరయ్యాను ప్రభూ అని పలికేవాడు.

ప్రవక్త ఇబ్రాహీమ్(అలై) ఎవరి రక్షణ కోరారో ఆ దేవుడి రక్షణ కోరుతున్నానని ప్రార్థించేవాడు. అతడి పట్ల ఖత్తాబ్ బిన్ నౌఫిల్ వ్యతిరేకత పెరిగి వైరంగా మారింది. చివరకు అతడిని మక్కా నగరం నుంచి బహిష్కరించే వరకు చేరుకుంది. జైద్ తిరిగి మక్కాలోకి ప్రవేశించకుండా కొందరు యువకులను కూడా ఖత్తాబ్ బిన్ నౌఫిల్ నియమించాడు. రహస్యంగా జైద్ మక్కాలోకి అడుగుపెడితే ఈ యువకులు పట్టుకుని చావగొట్టి బయటకు తరిమేసేవారు. చివరకు అతను మక్కాను వదిలి దేశాలు పట్టుకుతిరిగాడు. మోసుల్, ఇరాక్, సిరియా వగైరా దేశాల్లో తిరిగాడు. కలుషితం కాని ప్రవక్త ఇబ్రాహీమ్(అలై) ధర్మం కోసం అన్వేషించాడు. చివరకు డెమాస్కస్‌లో ఒక జ్ఞానిని కలుసుకున్నాడు. ప్రవక్త ఇబ్రాహీమ్(అలై) ధర్మాన్ని స్వచ్ఛంగా పాటిస్తున్నవాళ్ళు ఇప్పుడు ఎవరూలేరని ఆ జ్ఞాని తెలియజేశాడు. కాని జైద్ వదిలి వచ్చిన మక్కా నగరంలోనే ఒక ప్రవక్త అరుదెంచనున్నాడని, ఆయన ఇబ్రాహీమ్ ప్రవక్త(స) ధర్మాన్ని పునఃస్థాపిస్తాడని చెప్పాడు. ఆ జ్ఞాని సలహా ప్రకారం జైద్ తిరిగి మక్కాకు బయలుదేరాడు. కాని మార్గమధ్యంలో లాకిమ్ వద్ద అతను హత్యకు గురయ్యాడు. జైద్ గురించి ఒకసారి హజ్రత్ ఉమర్(రజి) ప్రవక్త ముహమ్మద్(స)ను ప్రశ్నిస్తూ ఆయన సాఫల్యం కోసం ప్రార్థించవచ్చా అనడిగారు అప్పుడు ప్రవక్త(స) జవాబిస్తూ తప్పక ప్రార్థించవచ్చని, జైద్ తీర్పుదినాన, ఆయన ఒక్కడే ఒక ప్రత్యేక సమాజంగా లేపబడతాడని అన్నారు. ఈ విషయాన్ని తర్వాత జైద్ కుమారుడు తెలియజేశాడు.

ఇస్లామ్‌కు ముందు కవులు రాసిన కవితల్లో కూడా అక్కడక్కడా మనకు సత్య ధర్మం కోసం పరితపన కనిపిస్తుంది. ఆలోచనాపరుల్లో సమాజం పట్ల, సామాజిక పతనంపట్ల గూడుకట్టుకున్న భావాలను ఈ కవితలు తెలియజేస్తున్నాయి. అలాంటి కవుల్లో ఉమయ్యా బిన్ సాల్ట్ పేరు ముఖ్యమైనది. దేవుని ఏకత్వం గురించి స్వర్గ నరకాల గురించి, పాపాలకు శిక్షల గురించి ఆయన భావాలు ప్రశంసించదగ్గ స్థాయిలో ఉన్నాయి. ధర్మపరాయణతను, మంచి నడవడిని బోధిస్తూ ఆయన అనేక కవితలు రాశారు. చరిత్ర ఆతృతగా ఎదురుచూసిన విప్లవశక్తి, సమాజానికి ప్రాణం పోసే సంస్కరణాశక్తి సరైన సమయంలో ప్రవక్త ముహమ్మద్(స) రూపంలో ఆవిర్భవించింది. ఆయన సందేశం ఆ కాలంలో ఉన్న వ్యవస్థకు వ్యతిరేకంగా ఇచ్చిన సందేశం మాత్రమే కాదు. ఉనికిలో ఉన్న వ్యవస్థ పట్ల కేవలం తిరుగుబాటు కాదు. ఆ సందేశం ఒక సమగ్రమైన ఆదర్శం. ఒక సంపూర్ణమైన వ్యవస్థకు సంబంధించిన సందేశం. సమాజాన్ని సామూహికంగా, పరిపూర్ణంగా మార్చివేసే సందేశం. ఇలాంటి విప్లవాత్మక పిలుపును చరిత్ర విస్మరించటం సాధ్యమా?

## రహస్య ప్రచారం మొదటి దశ

ముహమ్మద్(స) ప్రవక్తగా నియమించబడిన మొదటి దశలో ఆయనకు దైవిక స్వప్నాలు వచ్చేవి. కొన్ని సందర్భాల్లో దైవదూత కనబడేవారు.ఒకరోజు మొదటి దైవిక సందేశం ఆయన వద్దకు వచ్చింది. ఆ సందేశంలోని వాక్యాలు

**"(ఓ ప్రవక్తా) పఠించు సర్వాన్నీ సృష్టించిన నీ ప్రభువు పేరుతో.."**

***(దివ్యఖుర్ఆన్ 46 : 1)***

దైవవాణి మొదటిసారి అవతరించినప్పుడు ఆయన చాలా భయానికి గురయ్యారు.చాలా ఆందోళన చెందారు. దైవవాణి హీరా గుహలో అవతరించింది. అక్కడి నుంచి ఆయన వణుకుతూ ఇంటికి వచ్చేశారు. తన భార్య హ[జత్ ఖదీజా(రజి)కు జరిగిన వృత్తాంతం వినిపించారు. ఆమె తన భర్తను ఊరడించారు. ఉపశమనం కలిగించే వాక్యాలు పలికారు. మీ దేవుడు మిమ్మల్ని ఎన్నటికీ వదలిపెట్టడు అని ధైర్యం చెప్పారు. ఆయన్ను తీసుకొని వర్ఖా బిన్ నౌఫిల్ వద్దకు వచ్చారు. ఆయన కూడా ఇదే విషయాన్ని చెప్పారు. ప్రవక్త మూసా(అలై) వద్దకు వచ్చిన దైవదూతే మీ వద్దకు వచ్చాడు అని ధృవీకరించడమేకాదు,ప్రజలు మిమ్మల్ని విశ్వసించరని, మిమ్మల్ని కష్టనష్టాలకు గురిచేస్తారని, దౌర్జన్యాలకు దిగుతారని, దేశం



నుంచి బహిష్కరిస్తారని, మీపై యుద్ధానికి దిగుతారని తెలియజేస్తూ అంతవరకు తాను బతికి ఉంటే తప్పక మీకు మద్దతుగా నిలబడతానని అన్నాడు.

ముహమ్మద్(స) ఒకప్రవక్తగా నియమించబడ్డారు. ఒక గొప్ప బాధ్యత ఆయన భుజస్కంధాలపై ఉంది. ఆయన సత్యసందేశాన్ని మొదట తన భార్య హజ్రత్ ఖదీజా(రజి)కు వినిపించారు. ఆమె తక్షణం ఆ సందేశాన్ని, ఇస్లామ్‌ను స్వీకరించారు. ఆవిధంగా ఇస్లామ్ స్వీకరించిన మొదటి వ్యక్తి హజ్రత్ ఖదీజా(రజి) అయ్యారు. ఆ తర్వాత సత్యసందేశ ప్రచారం నెమ్మదిగా, రహస్యంగా కొనసాగింది. తన భార్య హజ్రత్ ఖదీజా(రజి)కు సంత్యసందేశం వినిపించిన తర్వాత ప్రవక్త ముహమ్మద్(స) తన బాల్యమిత్రుడు, అభిరుచుల్లో తనతో సారూప్యం ఉన్నవాడు అయిన హజ్రత్ అబూబక్ర్ (రజి)కు సత్యసందేశాన్ని వినిపించారు. హజ్రత్ అబూబక్ర్(రజి) ఆ సందేశం కోసం ఎప్పటినుంచో ఎదురు చూస్తున్న వ్యక్తి మాదిరిగా తక్షణం ఆ సందేశాన్ని స్వీకరించారు. ఆ తర్వాత ఇస్లామ్ స్వీకరించిన ఘనత ప్రవక్త(స) వద్ద బానిసగా ఉన్న హజ్రత్ జైద్(రజి)కు లభించింది. జైద్(రజి)ను ప్రవక్త(స) స్వయంగా పెంచారు. ప్రవక్త(స)ను దగ్గరిగా పరిశీలించిన వ్యక్తి హజ్రత్ జైద్ (రజి). ప్రవక్త(స) సత్యసందేశం వినిపించగానే ఆయన తక్షణం ఇస్లామ్‌స్వీకరించారు. ప్రవక్త(స)కు దగ్గరగా ఉన్నవారు, ఆయన గురించి బాగా తెలిసినవారు, ఆయన వ్యక్తిత్వం పట్ల పూర్తి అవగాహన ఉన్నవారు మొదటిగా ఇస్లామ్ స్వీకరించడం జరిగింది. దీన్నిబట్టి ప్రవక్త(స) ప్రచారం చేసిన సత్యసందేశం వాస్తవికత మనకు స్పష్టంగా అర్థం అవుతుంది.

హజ్రత్ అబూబక్ర్ (రజి) కొత్త విశ్వాసానికి చురుకైన కార్యకర్తగా మారారు. తనకు పలుకుబడి ఉన్న ప్రతిచోటా ఆయన ఈ విశ్వాసాన్ని ప్రచారం చేయడం ప్రారంభించారు. మక్కా నగరంలో కొందరు ముఖ్యమైన వ్యక్తులు ఈ ప్రచారం వల్ల సత్యసందేశం గురించి తెలుసుకున్నారు. సాద్ బిన్ వఖ్ఖాస్, హజ్రత్ ఉస్మాన్, హజ్రత్ జుబైర్, హజ్రత్ అబ్దుర్రహ్మాన్ బిన్ ఔఫ్, హజ్రత్ తల్హా వంటి వారు హజ్రత్ అబూ బక్ర్(రజి) ప్రయత్నాల వల్ల ముస్లిములుగా మారారు. సత్యసందేశానికి కార్యకర్తలుగా మారిన వాళ్ళు అత్యంత ఉత్సాహంగా, రహస్యంగా సందేశ ప్రచారాన్ని కొనసాగించడం ప్రారంభమయ్యింది. ఈ క్రమంలో అమ్మార్, ఖత్తాబ్, అర్ఖాం, సయీద్ బిన్ జైద్, అబ్దుల్లా బిన్ మసూద్, ఉస్మాన్ బిన్ మాజూన్, ఉబైదా, సొహైబ్

రూమీ వంటి వారు ఈ మొదటి దశ రహస్య ప్రచారంలో ముస్లిములుగా మారారు. ఈ దశలోప్రచారం, ధార్మిక విధులు ఎంత రహస్యంగా జరిగేవంటే, ప్రవక్త(స) తన సహచరులతో కలిసి ఎవరికీ కనబడకుండా కొండల్లోకి వెళ్ళి ప్రార్థనలు చేసుకునేవారు. ఒకసారి ప్రవక్త (స) పినతండ్రి అబూతాలిబ్ ఈ రహస్య ప్రార్థనలను చూడడం జరిగింది. ఆయన ముహమ్మద్ (స)తో ఈ కొత్త మతధర్మం ఏమిటి అని ప్రశ్నించారు. ఇది మన పూర్వీకుడు హజ్రత్ ఇబ్రాహీమ్(అలై)అనుసరించిన సత్యధర్మం అని జవాబిచ్చారు ప్రవక్త(స). అబూ తాలిబ్ ఆ మాటలు విని తాను ఈ కొత్త ధర్మాన్ని స్వీకరించలేనని, అయినప్పటికీ ప్రవక్త(స) ఈ ధర్మాన్ని అనుసరించడాన్ని తాను అడ్డుకోనని, ఈ ధర్మానికి పూర్తి సహకారం అందిస్తానని అన్నారు.

ఈ రహస్య ప్రచార కాలంలో ముస్లిముగా మారిన మరో వ్యక్తి హజ్రత్ అబూజర్ (రజి). ఆయన అప్పటికే విగ్రహారాధన పట్ల విసిగి వేసారి విగ్రహాలను పూజించడం మానుకున్నారు. తన బుద్ధికి తోచినవిధంగా దైవప్రార్థన చేసేవారు. ఆయనకు ప్రవక్త(స) చేస్తున్న ప్రచారం గురించితెలిసింది. ఆయన తన సోదరుణ్ణి ప్రవక్త(స) వద్దకు పంపించారు. ఆ మతధర్మం ఏమిటో తెలుసుకుని రమ్మన్నారు. సోదరుడు తిరిగి వచ్చి అబూజర్‌తో ప్రవక్త(స)ను ప్రజలు ధర్మభ్రష్టుడిగా భావిస్తున్నారని, కాని ప్రవక్త(స) మంచి నడవడిని బోధిస్తున్నారని, ఆయన కొన్ని అద్భుతమైన వాక్యాలుచదువుతున్నారని, ఆ వాక్యాలు కవిత్వంలా లేవని, ఆయనకూడా మీలానే వ్యవహరిస్తున్నారని చెప్పాడు. ఆ తర్వాత అబూజర్(రజి) స్వయంగా ప్రవక్త(స) వద్దకు వెళ్ళి ఆయన్ను కలుసుకుని ఇస్లామ్ స్వీకరించారు.

ఈ సత్యసందేశ ప్రచారాన్ని చాలాకాలం ఖురైషులు పెద్దగా పట్టించుకోలేదు. ఈ ప్రచారం రహస్యంగా సాగడం వల్ల వారి దృష్టి దీనిపై పెద్దగా పడలేదు. దారితప్పిన యువకుడి ప్రయత్నాలుగా భావించారు. త్వరలోనే ఆయన పశ్చాత్తాపపడి తిరిగి ప్రధాన స్రవంతిలోకి వచ్చేస్తాడని, ఎందుకంటే ఖురైష్ బలం ముందు ఇలాంటి చిన్న చితకా ఉద్యమాలు నిలబడడం సాధ్యంకాదని అనుకున్నారు. తాము పూజిస్తున్న, నైవేద్యాలు సమర్పిస్తున్న దేవతలు తమను, తమ మతధర్మాన్ని కాపాడుతాయని భావించారు. కాని ముహమ్మద్(స) ఉద్యమం రహస్యంగా విస్తరించడం కొనసాగింది. శాఖోపశాఖలుగా సమాజంలో అలుముకోసాగింది.

## బహిరంగ ప్రకటన



ఈవిధంగా రహస్య ప్రచారంలో మూడేళ్ళు గడిచిపోయాయి. అసత్యాన్ని ఎదిరిస్తూ సత్యం బహిరంగంగా నిలబడాలని, అసత్యంతో తలపడాలని దైవం తలపోశాడు. ఆవిధంగా సత్యం గెలుపొందవలసి వుంది.

**"మేము అసత్యాన్ని సత్యంతో దెబ్బతీస్తాము." *(దివ్యఖుర్ఆన్ 21 : 18)***

ఆ తర్వాతి దశకు సంబంధించిన ఆదేశం ఆ వెంటనే అవతరించింది.

**"కనుక ప్రవక్తా! నీకు ఆజ్ఞాపించబడుతూ ఉండిన విషయాన్ని బహిరంగంగా ఎలుగెత్తి చాటు."** ***(దివ్యఖుర్ఆన్ 15 : 94)***

ఆవిధంగా ప్రవక్త ముహమ్మద్(స) తన విశ్వాసశక్తిని, సంకల్పబలాన్ని ప్రదర్శిస్తూ కొత్తపరిస్థితిని ఎదుర్కోవడానికి సమాయత్తమయ్యారు. ఆయన సఫా కొండపైకి ఎక్కారు. ఆ కాలంలో అరబ్బుల్లో ఉన్న సంప్రదాయం ప్రకారం ఏదన్నా ఆపద వాటిల్లుతుంటే, లేదా ఏదన్నా సంక్షోభం తలెత్తితే ఆ వార్త అందరికి చెప్పడానికి ఆ కొండపైకెక్కి ప్రజలను పిలిచేవారు. ఆ సంప్రదాయాన్ని ప్రవక్త(స) అనుసరిస్తూ సఫా కొండపైకి ఎక్కి ప్రజలందరిని ఎలుగెత్తి పిలిచారు. ప్రజలందరూ ఏం జరిగిందో తెలుసుకోవడానికి గుమిగూడారు. ప్రవక్త(స) వారినిఉద్దేశించి బిగ్గరగా ఈ కొండకు అవతల ఒక పెద్ద సైన్యం ఉందని నేను చెబితే మీరు విశ్వసిస్తారా?అని ప్రశ్నించారు. అక్కడ గుమిగూడిన ప్రజలు ఆ ప్రశ్నకు జవాబిస్తూ ఎందుకు విశ్వసించం.. మీరు అబద్ధాలు చెప్పగా మేమెన్నడూ వినలేదు అన్నారు.

ఈ జవాబు విని ప్రవక్త(స) వారితో, అయితేవినండి. మీకు చెబుతున్నాను. దేవుని విశ్వసించండి. అబ్దుల్ ముత్తలిబ్ సంతానమా, అబ్ద్ మనాఫ్, జహ్రా, మఖ్జూమ్, తమీమ్, అసద్‌ల సంతానమా జాగ్రత్తగా వినండి, మీరు విశ్వసించకపోతే ఒక పెద్ద ఆపద కాచుకుని ఉంది అన్నారు.

ఆవిధంగా క్లుప్తమైన పదాలతో ప్రవక్త(స) తన ఉద్యమం గురించి వారికి స్పష్టంగా చెప్పేశారు. కాని ఆ గుమిగూడిన జనాల్లో ప్రవక్త(స) పినతండ్రి అబూలహబ్ కూడా ఉన్నాడు. ఈ మాటలు విని ఆగ్రహంతో ఆయన ముఖం జేవురించింది. ముహమ్మద్(స)ను దూషిస్తూ దీనికోసమేనా మమ్మల్నందరినీ నువ్వు పిలిచింది అన్నాడు. అబూలహబ్ ఖురైష్ ప్రముఖుల్లో ఒకనిగా పేరుపొందినవాడు. ఖురైష్ పెద్దలతో కలిసి అక్కడినుంచి వెళ్ళిపోయాడు. అనవసరంగా తమ సమయాన్ని వ్యర్థం చేశాడని నానా మాటలు అంటూ వెళ్ళిపోయాడు. ఆవిధంగా బహిరంగ

ప్రకటన తర్వాత ప్రవక్త ముహమ్మద్(స) తన ఉద్యమాన్ని ముందుకు నడిపించే తదుపరి కార్యక్రమానికి పూనుకున్నారు. తన వంశం వారందరినీ విందుకు పిలిచారు. ఆ విందు సందర్భంగా ఆయన ఒక సంక్లిష్టమైన ప్రసంగం చేశారు. తనకు దైవం తరఫున అవతరిస్తున్న సందేశాన్ని, సత్యధర్మాన్ని వాళ్ళు విశ్వసిస్తే వాళ్ళంతా ఇహ లోకంలో సౌభాగ్యాలు పొందడమేకాదు, పరలోకంలోను సాఫల్యం పొందుతారని తెలియజేశారు. ఈ ప్రసంగం విని అక్కడికి చేరిన వారంతా మ్రాన్పడిపోయారు. ఎవరూ మాట్లాడలేదు. కాని ఒక బాలుడు ముందుకు వచ్చాడు. నాకు కండ్లకలక వచ్చి కళ్ళు మండుతున్నాయి. నా కాళ్ళు బలహీనంగా ఉన్నాయి. నేనింకా చిన్న వాడినే. అయినా నేను ఈ ఉద్యమంలో మీవెంట నడుస్తాను అన్నాడు. ఆయన మరెవరో కాదు హజ్రత్ అలీ(రజి). ఆ తర్వాత కాలంలో ఆయన ఇస్లామీయ ఉద్యమంలో ప్రముఖ పాత్ర పోషించారు. అక్కడ విందుకు హాజరైన మిగిలినవాళ్ళు మాత్రం పగలబడి నవ్వారు. ఈ ప్రసంగంపై పరిహాసాలు చేశారు. ఇలాంటి అనుచరుడు ఉన్న నాయకుడి ఉద్యమం ఏ స్థాయిలో ముందుకుసాగుతుందో చూడాలంటూ అపహాస్యం చేశారు. ఇది ఒక పిచ్చిపని అన్నారు. వేళాకోళానికి, ఎగతాళికి తప్ప మరి దేనికి పనికిరాదని అనుకుంటూ వెళ్ళిపోయారు.

## హింసాత్మక వ్యతిరేకత

ఒకసారి ప్రవక్త ముహమ్మద్(స) ఆయన సహచరులు ఒక కొండచరియ వద్ద రహస్యంగా ప్రార్థనలు చేస్తున్నప్పుడు శత్రుగణం అటువైపుగా రావటం తటస్థించింది. ప్రార్థనలు చేస్తున్న వీరినిచూసి దూషించడం ప్రారంభించారు. ఎగతాళి మాటలు, వెక్కిరింపులు, ప్రార్థనలు చేస్తున్న వారి వివిధ భంగిమలపై అపహాస్యం చేయసాగారు. కాని ప్రవక్త ముహమ్మద్(స) కాని ఆయన సహచరులు కాని ఈ దూషణలకు ప్రతిస్పందించలేదు. ఇది చూసి మరింత రెచ్చిపోయిన శత్రుమూక ప్రవక్త(స), వారి సహచరులపై దాడికి దిగింది. ముష్టిఘాతాలు కురిపించింది. కత్తులు దూసి వారిపై దూసుకువచ్చింది. ఈ ఘర్షణలో సాద్ బిన్ అబీ వఖ్ఖాస్ కత్తివేటుకు గురయ్యారు. ఆ విధంగా హింసాత్మక వ్యతిరేకత ప్రారంభమైంది. సత్యసందేశాన్ని బహిరంగంగా ప్రచారం చేయమన్న దైవిక ఆదేశాలు ప్రవక్త(స)కు అందిన తర్వాత ప్రారంభమైన హింసాకాండల పరంపరలో ఇది మొదటిది. సత్యసందేశాన్ని బహిరం గంగా ప్రచారం చేయాలన్న దైవిక ఆదేశానికి అనుగుణంగా ప్రవక్త ముహమ్మద్(స) కాబా గృహం వద్ద సందేశప్రచారానికి పూనుకున్నారు. ఇది



తమను అవమానించడంగా శతృగణం భావించింది. కాబా గృహాన్ని అపవిత్రం చేయడంగా పరిగణించింది. అంతే ప్రవక్త(స)పై అందరూ కలిసి విరుచుకుపడ్డారు. ఎంత విచిత్రం. ఒకే దేవుని ఆరాధనకు నిర్మించబడిన దైవగృహంలో మతం పేరిట అన్నివిధాల అసభ్య చేష్టలను ఆచారాలుగా చేసుకున్న వాళ్ళు ఈ అశ్లీల ఆచారాల వల్ల అపవిత్రత వాటిల్లిందని భావించలేదు. కాని సత్యాన్ని అక్కడ ప్రకటిస్తే, దైవేకత్వాన్ని గురించి ప్రకటిస్తే కాబా గృహం అపవిత్రం అయిపోయిందని భావించారు. జనం రణగొణగా గుమిగూడి ప్రవక్త(స)ను నానామాటలు అన్నారు. ఈ గుంపులో హారిస్ బిన్ ఉబై ముందుకువచ్చి జనాన్ని శాంతపరచడానికి ప్రయత్నించాడు. కాని జనం అతడిపై దాడిచేసి చంపేశారు. శాంతియుతంగా సత్యంవైపునకు ఇచ్చిన పిలుపుపై హింసాత్మక వ్యతిరేకత పెల్లుబికింది. కత్తులు కరవాలాలు దూసుకువచ్చాయి. హింసాత్మక పద్ధతులన్నింటిని ఉపయోగించి ఈ ఉద్యమాన్ని ఆపడానికి ప్రయత్నాలు మొదలయ్యాయి. హజ్రత్ బిలాల్(రజి)ను వేడివేడి ఎడారి ఇసుకపై బోర్లా పడేసి పెద్ద బండరాయిని ఆయన వీపుపై పెట్టి క్రూరంగా హింసించారు. ఈ హింసాకాండ ఎంత తీవ్రంగా సాగినప్పటికీ సత్యసందేశం పురోగమించసాగింది. ఆ విధంగా ప్రవక్త(స) సహచరుల సంఖ్య 40కి పెరిగింది.

అవహేళనలు, అపహాస్యాలు, దూషణలతో సత్యసందేశాన్ని అడ్డుకోవడం శత్రుమూకలకు సాధ్యం కాలేదు. ఇక ప్రవక్త ముహమ్మద్(స)ను అడ్డుకోవడానికి కొత్త పద్ధతి అవలంబించారు. ప్రవక్త(స)పై విద్వేష ప్రచారం ప్రారంభించారు. కొత్త ఆరోపణలు కనిపెట్టి ఆయన్ను నిరోధించాలని, బలహీనపరచాలని ప్రయత్నించారు. ఆయన మతభ్రష్టుడని, నాస్తికుడని ప్రచారం చేశారు. అరబ్బులు ఇష్టపడని సాబియా మతాన్ని బోధించేవాడని కూడా ప్రచారం చేశారు. (సాబియా మతపంథా ఏకదైవో పాసనకు సంబంధించిన మత పంథా. అతిప్రాచీన మతపంథాల్లో ఒకటి. తర్వాత ఈ పంథా నక్షత్ర ఆరాధకులుగా మారింది). ఆవిధంగా ప్రవక్త(స)కు అబీ కబ్షా అని శత్రుగణం పిలిచేవారు. అబీ కబ్షా అంటే కబ్షా తండ్రి అని అర్థం. కబ్షా అనే వ్యక్తి నక్షత్ర ఆరాధకుల మత బోధకుడు. నక్షత్ర ఆరాధనను అరబ్బులు ఏవగించుకునేవారు. అందువల్ల ప్రవక్త(స)కు ఇలాంటి పేరు పెట్టడం ద్వారా ఆయన్ను కించపరచాలనుకున్నారు. ఇలాంటి ప్రచారం ద్వారా ప్రజలు ప్రవక్త(స) బోధనలు వినకుండా అడ్డుకోవాలని భావించారు. నక్షత్ర ఆరాధకుల మతబోధకుడు కబ్షా గురించి అనేక కథలు ప్రచారంలో ఉండేవి. విగ్రహాల శాపం వల్ల కబ్షా పిచ్చివాడై పోయాడన్న కథ కూడా అలాంటిదే. ఆవిధంగా ప్రవక్త(స)పై కూడా విగ్రహాల

శాపం పడుతుందన్నట్లు ప్రచారం చేసేవారు. అంతేకాదు ముహమ్మద్(స)ను మంత్రగాడనన్నారు. మార్మికవాది అని, జ్యోతిష్కుడని, కవిత్వం చెప్పేవాడని ఇలా అనేక రకాలుగా పేర్లు పెట్టి ఆయన ప్రాధాన్యత తగ్గించడానికి, ప్రజలు ఆయన మాటలు వినకుండా చేయడానికిప్రయత్నాలు చేసేవారు. కాని ఈ దుష్ప్రచారాలేవి పనిచేయలేదు. సత్యం దేదీప్యమానంగా ప్రకాశించసాగింది. ఆ ప్రకాశ కాంతి ముందు శత్రుమూకల ఆరోపణ చీకట్లు త్వరలోనే చెల్లాచెదురయ్యాయి. అందువల్ల రోజుకో కొత్త ఆరోపణ కనిపెట్టి ప్రచారంలోకి తీసుకురావడం మొదలుపెట్టారు. ప్రజలు ఆయన వద్దకు రాకుండా, ఆయన బోధనలు వినకుండా అడ్డుకునే ప్రయత్నాలు ఉధృతంగా జరిగాయి. కాని ఒక పిచ్చివాడు, ఒక మంత్రగాడు లేదా ఒక కవి నడిపే ఉద్యమానికి కార్యకర్తలు లభిస్తారా? లభించినా నిలకడగా వెంట ఉంటారా? సాధ్యంకాదు. ప్రవక్త(స) ఉద్యమం ఒక సత్య ఉద్యమం, అందువల్ల ఆయన అనుచరులు స్థిరంగా సత్యంపై నిలబడ్డారు. వ్యతిరేకతలు, అవహేళనలు, ఎత్తి పొడుపులు, అపహాస్యాలు, దూషణలు ఎంత తీవ్రస్థాయిలో కొనసాగుతున్నప్పటికీ ప్రవక్త (స) ఉద్యమం నానాటికి పురోగమించసాగింది. ప్రవక్త(స) తన సత్యసందేశ ప్రచారంపై స్థిరంగా నిలబడ్డారు. ఉద్యమాన్ని మరింత వ్యవస్థీకరించసాగారు. ఈ నేపథ్యంలో మళ్ళీ దైవిక ఆదేశాలు అవతరించాయి.

> **"ప్రవక్తా ! మృదుత్వం, మన్నింపుల వైఖరిని అవలంబించు. మంచిని ప్రబోధించు, మూర్ఖులతో వాదానికి దిగకు"** ***(దివ్యఖుర్‌ఆన్ 7 : 199)***

ఈ ఆదేశంలో మూడు ఉత్తర్వులు ఇవ్వబడ్డాయి. అవి ఒకటి : దూషణలు, ఆరోపణలకు పెద్దగా ప్రాముఖ్యం ఇవ్వరాదు. రెండు: సత్యసందేశ ప్రచారాన్ని కొనసాగిస్తూ వెళ్ళాలి. మూడు: వ్యతిరేకులతో ఘర్షణకు దిగరాదు. శత్రుగణం ఆరోపణలను దైవవాణి నిర్ద్వందంగా తోసిపుచ్చింది. ఆ ఆరోపణలకు తగిన జవాబు ఇచ్చింది.

> **"ఏ కవికి చెందిన వాక్కూ కాదు. కాని మీరు విశ్వసించడం అనేది చాలా తక్కువ. ఇంకా ఇది ఏ జ్యోతిష్యుని వాక్కు కూడా కాదు. కాని, మీరు ఆలోచించడం అనేది చాలా తక్కువ."** ***(దివ్యఖుర్‌ఆన్ 69 : 41- 42)***

శత్రుమూకలు ప్రవక్త(స)ను సవాలుచేస్తూ విచిత్రమైన ఆధారాలు చూపించాలని చెప్పేవారు.



> **"దైవమా! ఇది నిజంగా నీ తరఫునుండి వచ్చిన సత్యమే అయితే, మాపై ఆకాశం నుండి రాళ్ళను కురిపించు లేదా ఏదైనా బాధాకరమైన శిక్షను మా పైకి తీసుకురా."** ***(దివ్యఖుర్‌ఆన్ 8 : 32)***

> **"నీవు సత్యవంతుడివే అయితే ఆకాశపు తునకను దేనినైనా మాపై పడేలా చేయి"** ***(దివ్యఖుర్‌ఆన్ 26 : 187)***

శత్రుమూకలు మరో కొత్త ఆరోపణను కనిపెట్టాయి. ప్రవక్త ముహమ్మద్(స) వద్దకు జిన్ (భూతం) ఏదో వస్తుందని, ఈ వింత వింత వాక్యాలను ఆ భూతమే నేర్పుతుందని ప్రచారం ప్రారంభించారు. మక్కాలో ఉన్న క్రైస్తవ బానిస జాబిర్ ఆయనకు ఈ మతాన్ని నేర్పుతున్నాడని, ఆయన చెప్పే బోధనలని కూడా ఆ క్రైస్తవ బానిసే రాసిస్తున్నాడని ప్రచారం చేశారు. ప్రవక్త(స) సమక్షంలో కూడా ఒకసారి ఇలాంటి ఆరోపణలు చేస్తూ ఆయనకు ఇవన్నీ నేర్పుతున్న యమామాకు చెందిన అర్రహ్మాన్ గురించి తమకుతెలిసిందని అన్నారు. అర్రహ్మాన్‌ను విశ్వసించేది లేనే లేదన్నారు. ఈ ఆరోపణల వెనుక ఉన్న ముఖ్య ఉద్దేశ్యం ఒక్కటే. ప్రవక్త ముహమ్మద్(స) ఇతరుల చేతుల్లో పనిముట్టుగా వ్యవహరిస్తున్నారని ప్రజల్ని నమ్మించడం. అంతేకాదు, ప్రవక్త(స) చెబుతున్నది దైవవాణి కాదని, దైవిక అవతరణలుగా ప్రవక్త(స) చెబుతున్న వాక్యాలు అసాధారణమైనవి ఏమీ కాదని జనాన్ని నమ్మించడానికి ఈ ప్రచారాలు చేసేవారు. ఈ ఆరోపణలన్నింటికీ దివ్యఖుర్‌ఆన్ ధీటైన సమాధానం ఇచ్చింది. ఖుర్‌ఆన్‌లోని ఒక చిన్న అధ్యాయం లేదా కనీసం ఒక్క వాక్యం లాంటిది రాసి చూపించండని సవాలు చేసింది. మనుష్యులు జిన్నాతుల నుంచి ఎవరి సహాయం అయినా సరే తీసుకుని ఈ పని చేసి చూపించండని సవాలు చేసింది. ఈ సవాలుకు శత్రుగణం జవాబు చెప్పలేకపోయింది. కొత్తకొత్త ఆరోపణలతో ప్రవక్త(స)పై దాడి మరింత తీవ్రమయ్యింది. ప్రవక్త(స) చెబుతున్నవి పాతకాలం నాటి కథలు మాత్రమేనని ఇందులో కొత్త విషయాలు ఏవీలేవని, ఈ పాత కథలతో సామాజిక సమస్యలు పరిష్కరించడం సాధ్యంకాదని ప్రచారానికి పూనుకున్నారు. అంతేకాదు, కొంతమంది కవులను కూడగట్టి ప్రవక్త(స)కు వ్యతిరేకంగా అశ్లీలమైన, అసభ్యమైన కవితలు రాయించి ప్రచారంలోకి తీసుకువచ్చారు. ఒక ప్రణాళిక ప్రకారం ముహమ్మద్(స)ను ఆయన ఉద్యమాన్ని అడ్డుకోవడానికి శాయశక్తులా ప్రయత్నించారు.

> **"ఈ ఖుర్‌ఆన్‌ను అసలు వినకండి. అది వినిపించబడేటప్పుడు వినబడకుండా విఘ్నం కలిగించండి. బహుశా ఇలాగైనా మీరు ప్రాబల్యం వహించవచ్చు"**

***(దివ్యఖుర్ఆన్ 41 : 26)***

ఇలాంటి ప్రచారంలో భాగంగానే ఆస్ బిన్ వాయిల్ అస్సహామి ప్రవక్త(స)ను ఉద్దేశించి అత్యంత హీనంగా వ్యాఖ్యానించాడు.

".. ఆయన్ను వదిలేయండి. ఆయన వారసుడెవడూ లేని ఒంటిరివాడు. తన వెనుక ఆయన ఎవరినీ వదిలి వెళ్ళేదిలేదు. ఆయన మరణించిన తర్వాత మరుక్షణం ఆయన్ను జనం మరిచిపోతారు" అన్నాడు.

ఆ విధంగా ఆయనకు వారసుడెవ్వడూ లేడన్న విషయం గురించి కూడా అవహేళన చేయడం ఆయన్ను కించపరచడం జరిగేది. కాని ప్రవక్త ముహమ్మద్(స) వారసులు ఆయన ఆచరణలేనని, ఆయన సహచరులే ఆయన ఉద్యమాన్ని ముందకు తీసుకెళతారని వారు గ్రహించలేకపోయారు. ఈ అవహేళనలను స్వయంగా దివ్యఖుర్ఆన్ తిప్పికొట్టింది. అవిశ్వాసులే ఒకరితో ఒకరు సంబంధంలేకుండా ఉన్నారని, మరణానంతరం జనం వారినే మరిచిపోతారని ప్రకటించింది. ప్రవక్త(స)కు అపారమైన దైవానుగ్రహం లభించిందని తెలియజేసింది. ఈ సందర్భంగా శత్రు మూకలు ప్రవక్త(స)ను సవాలు చేస్తూ ఏదైనా విస్పష్టమైన సూచన తీసుకురావాలని కోరారు.

**'ఈ ప్రవక్తపై ఇతని ప్రభువు తరఫునుండి ఏదైనా సూచన ఎందుకు అవతరింప జెయ్యబడలేదు?"** ***(దివ్యఖుర్ఆన్ 10 : 20)***

**"దైవదూతలు మావద్దకు ఎందుకు పంపబడటం లేదు? మేము మా ప్రభువును ఎందుకు చూడకూడదు?"** ***(దివ్యఖుర్ఆన్ 25 : 21)***

ప్రవక్త(స) చెబుతున్నది నిజంగా దేవుని తరఫున అవతరించిన వాణి అయినట్లయితే రాతపూర్వకంగా ఉన్న ఒక పుస్తకం తమ ముందుకు ఆకాశం నుంచి ఎందుకు దిగిరాలేదని, లేదా ప్రవక్త(స) స్వయంగా ఆకాశానికి అధిరోహించి ఆ పుస్తకాన్ని తమ కళ్ళ ఎదుట ఎందుకు తీసుకురావటంలేదని అడిగేవారు. సాధారణ మనిషి మాదిరిగా ప్రవక్త(స) కూడా జీవించడాన్ని, సాధారణ మనుషుల మాదిరి అవసరాలు కలిగి ఉండడాన్ని కూడా వాళ్ళు ఎద్దేవా చేసేవారు. ఆయన్ను దేవుడు నిజంగానే ప్రవక్తగా నియమించి ఉన్నట్లయితే దైవదూతలు ఆయనకు అంగరక్షకులుగా ఎందుకు నడవడంలేదని ప్రశ్నించేవారు. ఆయన దైవప్రవక్త అయినట్లయితే ఆకాశం నుంచి ఆయన కోసం ఒక గొప్ప నిధి ఏదన్నా వచ్చి ఉండాలిగా అనేవారు. కనీసం



ఆయనకు ఒక అందమైన పండ్లతోట, అందులో మధురమైన పండ్లు, ప్రవహించే సెలయేళ్ళు ఉండాలిగా అని ఎద్దేవా చేసేవారు. కాని ప్రవక్త(స) ఆయన సహచరులు పేదవారు. ప్రాపంచిక భోగభోగ్యాల విషయానికి వస్తే ప్రవక్త(స) సహచరులు అందరూ అట్టడుగు వర్గాలకు చెందినవాళ్ళే. అలాంటి బీద జనం ముహమ్మద్(స)ను ప్రవక్తగా ఎలా విశ్వసిస్తున్నారని హేళన చేసేవారు. ప్రవక్త ముహమ్మద్(స) ఎక్కడికి వెళ్ళినా అలాంటి వ్యాఖ్యలతో ఆయన్ను ఎగతాళి చేయడం జరిగేది.

**"ఈ వ్యక్తినేనా దేవుడు ప్రవక్తగా చేసి పంపినది?"** ***(దివ్యఖుర్ఆన్ 25 : 41)***

అంటూ పగలబడి నవ్వేవారు. ఈ హేళనలు, దూషణలు, అవమానాలు విన్న ప్రవక్త(స) ఎంత బాధపడి ఉంటారు? కాని ఇవేవీ ఆయన్ను బాధ్యతల నిర్వహణ నుంచి పక్కకు తప్పించలేకపోయాయి. ఆయన సంకల్పశక్తిని నీరుగార్చలేకపోయాయి. ఆయన సహనం, సంకల్ప బలం ఎంత గొప్పవో దీన్నిబట్టి అర్థమవుతోంది.

వీటన్నింటికి మించి శత్రుమూకలు అత్యంత హీనమైన దాడికి కూడా తెగబడ్డాయి. ప్రవక్త(స) నడిచే దారిలో ముండ్లు పరిచేవారు. తెగల నాయకులు స్వయంగా ఇలాంటి నీచమైన చేష్టలకు పాల్పడేవారు. ఆయన ప్రార్థన చేసుకుంటు న్నప్పుడు నానా చప్పుళ్ళు చేసి పగులబడి నవ్వేవారు. ఒకసారి ఆయన ప్రార్థనలో సాష్టాంగపడినప్పుడు పశువుల ప్రేగులను, వాటిలో అశుద్ధంతో సహా తీసుకొచ్చి ఆయన వీపుపై పారేశారు. ఇంకోసారి ఆయన మెడచుట్టూ దుప్పటి బిగించి ఊపిరాడనివ్వకుండా బిగదీసేవారు. అల్లరి పిల్లలను రెచ్చగొట్టి ఆయనపై ఎగతాళి చేసేలా, ఆయన ప్రార్థిస్తున్నప్పుడు దేవుడిని దూషించేలా చేసేవారు. బక్కెట్లలో కసువు, చెత్తాచెదారం తీసుకొచ్చి మేడపై నుంచి ఆయన తలపై కుమ్మరించేవారు. ప్రవక్త(స)ను వేధించడంలో అబూలహబ్ భార్య అందరికన్నా రెండడుగులు ముందు ఉండేది. ఆయన దారిలో ముళ్ళకంపలు వేసేది. చివరకు దివ్యఖుర్ఆన్ వాక్యాలు ఆమెను శపిస్తూ అవతరించాయి. ఈ హింసాత్మక చేష్టలు, ఈ దాడులు, ఈ అవమానాలు ఏవి కూడా ప్రవక్త(స) ఉద్యమాన్ని మందగించేలా చేయలేకపోయాయి. ఆయన ఉన్నత వ్యక్తిత్వం, ఆయన విశ్వాస శక్తి అచంచలమైనవిగా నిలిచాయి. అవిశ్వాసులు చివరకు ప్రవక్త(స)ను హతమార్చడానికి రహస్య సన్నాహాలకు తెగబడ్డారు. కాని ముహమ్మద్(స) ఆయన పినతండ్రి అబూతాలిబ్ రక్షణలో ఉన్నారు. అబూతాలిబ్ రక్షణలో ఉన్నంతకాలం ఆయనపై హత్యాప్రయత్నం చేయడమంటే యావత్తు బనీ హాషిం తెగతో వైరం కొని తెచ్చుకోవడమే అవుతుంది.అయితే బనూహాషిం తెగ

కూడా పూర్తిగా ప్రవక్త(స)కు మద్దతు ఇవ్వలేదు. బనూహాషిం తెగ మద్దతు ఇవ్వాలని భావించిన ప్రతిసారి వారి ప్రత్యర్థి తెగ అయిన బనూ ఉమయ్యా ఆ ప్రయత్నాన్ని అడ్డుకునేది. బనూ హాషిం తెగవారిని నయనా భయానప్రవక్త(స)కు మద్దతు ఇవ్వ కుండా నచ్చచెప్పేది. తర్వాత ముహమ్మద్(స)కు అబూతాలిబ్ రక్షణ ఇవ్వకుండా చేయడానికి ప్రయత్నాలు ప్రారంభమయ్యాయి. అబూతాలిబ్ రక్షణ నుంచి ప్రవక్త(స)ను తప్పిస్తే శత్రుమూకలకు ఒక పెద్ద ఆటంకం తొలగిపోయినట్లే. ఈ పని చేయడానికి ఒక బృందాన్ని అబూతాలిబ్ వద్దకు పంపించారు. ఆ బృందంలో రాబియా కుమారులు ఉత్బా, షైబాలతో పాటు అబూజహల్, వాలిద్ బిన్ అల్ముగైరా, నబియా, మునబ్బా, ఆస్ బిన్ వాయిల్ తదితర పలుకుబడి కలిగిన ప్రముఖులు ఉన్నారు. ఈ బృందం అబూతాలిబ్ వద్దకు వచ్చింది.

అబూతాలిబ్, మీ అబ్బాయి మా దేవుళ్ళను దూషిస్తున్నాడు. మన మతాన్ని విమర్శిస్తున్నాడు. మన పూర్వీకులను మూర్ఖులు అంటున్నాడు. వారంతా తప్పు మార్గాన ప్రయాణించారని భావిస్తున్నాడు. కాబట్టి నీవు మీ అబ్బాయిని ఇవన్నీ మానుకునేలా చేయి. లేదా మాకు మీ అబ్బాయికి మధ్య నిలబడడం మానేయి. మాతోపాటు నీవు కూడా అతడి మతానికి వ్యతిరేకంగా నిలబడు. అతనికి బదులు మేము నీకు చాలు.. అన్నాడు.

అబూతాలిబ్ వాళ్ళు చెప్పిన మాటలు శ్రద్ధగా విన్నారు. ఆ బృందాన్ని శాంత పరిచి వెనక్కి పంపించారు. ఈ ప్రయత్నం పెద్దగా ఫలించలేదు. ఈసారి మరో బృందాన్ని ఖురైషులు అబూతాలిబ్ వద్దకు పంపించారు. ఈసారి స్పష్టమైన కొన్ని ప్రతిపాదనలతో పంపారు. ఆ బృందం నాయకుడు అబూతాలిబ్ వద్దకు వచ్చి ఇలా అన్నాడు :

.. అబూతాలిబ్! వయస్సురీత్యా, పెద్దరికం రీత్యా మీరు మాలో గౌరవ నీయులు. మీ అబ్బాయి చేస్తున్న ప్రచారం నుంచి మిమ్మల్ని కాపాడమని మేము కోరాము. కాని మీరు ఆ పని చేయలేదు. మన పూర్వీకులను, తాతముత్తాతలను మీ అబ్బాయి ఇలా అవమానించడం, మన దేవతలను పరాభవించడం, అపవిత్రం చేయడాన్ని ఇకమేము భరించలేము. కాబట్టి మీరు మీ అబ్బాయిని ఈ పనులు చేయకుండా ఆపకపోతే మీతోను, మీ అబ్బాయితోను ఇద్దరితోను మేము యుద్ధం చేస్తాం. మనలో ఎవరో ఒకరు మాత్రమే మిగిలేవరకు ఈ పోరాటం కొనసాగుతుంది అని హెచ్చరించారు. ఆ తర్వాత అబూతాలిబ్ ప్రవక్త ముహమ్మద్(స)ను పిలిచి



మాట్లాడారు. ఆయనకు పరిస్థితిని వివరించారు. తెగలతో వైరం కొనితెచ్చుకుని తనపై భరించలేని ఒత్తిడి తీసుకురావద్దని కోరారు. ఇది ప్రవక్త(స)కు పెద్ద సంక్షోభం వంటి పరిస్థితి. ఆయనకు ఉన్న ఒకే ఒక్క ఆధారం కూడా ఇప్పుడు వదులుతోంది. నిజానికి అది ఒకపెద్ద ఆపదతో ముఖాముఖి వంటి పరిస్థితి. అయినా ప్రవక్త(స) చలించలేదు. ఏమాత్రం తొణకలేదు. చెక్కుచెదరని నిబ్బరాన్ని ప్రదర్శిస్తూ పినతండ్రికి ఇలా జవాబిచ్చారు. చిన్నాన్న! దేవుని తోడు, వీళ్ళు నా కుడిచేతిలో సూర్యుడిని, ఎడమ చేతిలో చంద్రుడిని తీసుకొచ్చి ఇచ్చినా నేను నా పనిని మానను. ఈ పనిలో నా ప్రాణాలు పోయినా సరే అని జవాబిచ్చారు. ఆయనచేపట్టిన ఉద్యమం, ఆయన వినిపించిన సత్యసందేశం చరిత్ర గతిని మార్చేసిన విప్లవ శక్తులయ్యాయి. వ్యతిరేకత లను, వైరాలను,విద్వేషాలను అన్నింటిని అధిగమించి, అడ్డంకులను దాటుకుని ఆ ఉద్యమం గొప్ప విజయాలు నమోదు చేసింది. కాని ఖురైష్ శత్రుగణం ఈ ఉద్యమ శక్తిని తెలుసుకోలేకపోయింది. కాని అబూతాలిబ్ ప్రవక్త ముహమ్మద్(స) మాటలతో చాలా ప్రభావితుడయ్యారు. ఆయన ప్రవక్త(స)తో ఇలా అన్నారు.

... బాబూ, నీవు కోరుకున్నది బోధించు. నేను నీకు మద్దతు ఇవ్వడం ఎన్నటికీ మానను... అన్నారు.

చివరకు మరో బృందం అబూతాలిబ్ వద్దకు వచ్చింది. ఈ బృందానికి నాయకుడు తమతోపాటు అమారా బిన్ వాలిద్ అనే యువకుడిని తీసుకొచ్చి అబూతాలిబ్‌తో ఇలా అన్నాడు.

.. ఈ యువకుడు అమ్మారా బిన్ వాలిద్‌ను చూడు. అందమైన, బలమైన యువకుడు. ఇతడిని తీసుకో, నీకుమారుడిగా దత్తత చేసుకో, ఈ యువకుడి శక్తిసామర్థ్యాలు, బుద్ధివివేకాలు నీకు ఉపయోగపడతాయి. ముహమ్మద్(స)ను మాకు అప్పగించు. అతడు మా తాతముత్తాతలను దూషిస్తున్నాడు. సమాజంలో అలజడి సృష్టిస్తున్నాడు. అతడిని చంపేస్తాం. అతడికి బదులు మరోయువకుడిని నీకు ఇస్తున్నాం అన్నారు.

అబూతాలిబ్‌కు ముంచుకొస్తున్న ఆపదలు ఒక్కొక్కటిగా కనబడ్డాయి. అప్రమత్తం కావలసిన సమయం ఆసన్నమయిందని గ్రహించారు. ఆయన వెంటనే తన వంశం వారైన బనూ హాషిం, బనూ ముత్తలిబ్ వారందరినీ సమావేశపరిచారు. ముహమ్మద్(స)కు మద్దతివ్వవలసిన అవసరం ఉందని వారికి బోధించారు. ఈ వాదనకు చాలామంది అంగీకరించారు. కాని ప్రవక్త(స) మరో పినతండ్రి అబూలహబ్ మాత్రం తీవ్రంగా వ్యతిరేకించాడు. ఆవిధంగా ఆ సమావేశం ఎలాంటి నిర్ణయం

లేకుండా అర్థాంతరంగా ముగిసింది. కాని ఈలోగా ఉద్యమం మరింత విస్తరించ సాగింది. అప్పటి వరకు బడుగు, అణగారిన వర్గాలు మాత్రమే ఉద్యమంలో ప్రవేశించాయి. కాని ఇక సమాజంలో పలుకుబడి కలిగిన వారు కూడా ఉద్యమంలోకి రావడం ప్రారంభమయ్యింది. ఈ పరిస్థితి చూసి శత్రుగణం మరోసారి అబూ తాలిబ్‌ని కలువడానికి వచ్చింది. అప్పటికి ఆయన వ్యాధిగ్రస్తుడై మంచాన పడి వున్నారు. ఒక ఒప్పందానికి వద్దామని చెప్పారు. ఒకరికి ఒకరుహాని తలపెట్టరాదని, ఎవరి ఇష్టం వచ్చినట్లు వారు చేసుకోనీయాలని కోరారు. ప్రవక్త ముహమ్మద్(స)ను అక్కడికి పిలువడం జరిగింది. వారి మధ్య చర్చలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ప్రవక్త ముహమ్మద్(స) వారితో ఇలా అన్నారు. నేను బోధించేది ఒక సరళమైన విశ్వాసం. దీన్ని స్వీకరిస్తే మీరు అరబ్బులకు నాయకులవుతారు. అరబ్బేతర ప్రాంతాలు మీ వశమవుతాయి. ఈ మాటలు ఆయన ఏ పరిస్థితిలో చెప్పారో కూడా గమనించాలి. తీవ్రమైన వ్యతిరేకత, వైరం, విద్వేషం తాండవిస్తున్న నేపథ్యంలో కేవలం గుప్పెడు మంది సహచరులను మాత్రమే కలిగి ఉన్నప్పటికీ అత్యంత ఆత్మ విశ్వాసంతో, తన ఉద్యమం ఎంత శక్తివంతమైనదో పూర్తి అవగాహనతో ఆయన మాట్లాడారు. కాని ఈ మాటలు అక్కడ ఉన్న అబూజహల్‌కు రుచించలేదు. అతడు రుసరుసలాడుతూ ఆగ్రహంతో వీరంగం వేస్తూ వెళ్ళిపోయాడు.

అవిశ్వాసులు ఆ పిదప మరో ఎత్తుగడ ప్రయోగించారు. ప్రవక్త ముహమ్మద్(స) సహచరులకు లభిస్తున్న రక్షణ లభించకుండా చేయాలనుకున్నారు. అబూ సల్మాకు అబూతాలిబ్ రక్షణగా ఉన్నారు. బనూ మఖ్జూమ్ తెగ అబూతాలిబ్ వద్దకు వెళ్ళి ఈ రక్షణను ఉపసంహరించుకోవాలని చెప్పింది. ఈ మాటలు విని ఆయన... ముహమ్మద్ నా సోదరుని కుమారుడు. అతను నా రక్షణలో ఉన్నాడు. మీరు అతడిపై వేధింపులకు పాల్పడుతున్నారు. అతడిని దౌర్జన్యాలకు గురిచేస్తున్నారు. మీరు ఈ వేధింపులు ఆపకపోతే అతను ఎక్కడ ఉన్నా నేను అతనికి రక్షణగా నిలబడతాను అని ఖరాఖండిగా చెప్పేశారు. అలాగే హజ్రత్ అబూబక్ర్(రజి)కు ఇబ్నుద్ దుగునా రక్షణ ఇచ్చి ఉన్నాడు. హజ్రత్ అబూబక్ర్(రజి) వీనులకు విందుగా దివ్యఖుర్ఆన్ పారాయణం చేసేవారు. ఆయన పారాయణం చాలా మధురంగా ఉండేది. ఆ స్వరం అందరిపై ప్రభావం వేసేది. శత్రుగణం ఇబ్ను దుగానా వద్దకు వెళ్ళి హజ్రత్ అబూబక్ర్(రజి) ఖుర్ఆన్ వాక్యాలను చాలా మధురంగా ఆలపిస్తారని, ఆయన స్వరం వల్ల బలహీన మనస్కులైన తమ పిల్లలు, మహిళలు ప్రభావితులవుతున్నారని, కాబట్టి దుగానా ఇక నుంచి హజ్రత్ అబూబక్ర్(రజి)కు రక్షణ ఇవ్వడం మానుకోవాలని కోరారు.



దుగానా హజ్రత్ అబూబక్ర్(రజి) వద్దకు వెళ్ళి ఖుర్ఆన్ వాక్యాలను బిగ్గరగా చదవవద్దని కోరారు. కాని హజ్రత్ అబూబక్ర్(రజి) దానికి ఒప్పుకోలేదు. బదులుగా తనకు రక్షణ అవసరంలేదని దుగానా నుంచి రక్షణ బాధ్యతను తొలగించారు.

## వ్యవస్థీకృత వ్యతిరేకత

ప్రవక్త(స) ఉద్యమాన్ని అంతం చేయాలని శత్రుమూకలు ఎన్ని ప్రయత్నాలు చేసినప్పటికీ సత్యసందేశ ప్రచారం విస్తరిస్తూ పోయింది. ఖురైష్ శత్రుగణానికి మక్కాలో మంచి పట్టు ఉంది. మక్కాలో వాళ్ళు తలచినది చేయగలిగిన పరిస్థితిలో ఉన్నారు. కాని మక్కా నగరం అరేబియా కేంద్రం వంటిది. వర్తక బిడారులు, వాణిజ్య బృందాలు, కాబా యాత్రికులు అందరూ అక్కడికి వస్తారు. బయటి నుంచి వచ్చే ఈ ప్రజానీకం ఖురైషుల ప్రభావంలో కాని, ఖురైషుల పెత్తనంలో కాని ఉన్న వాళ్ళు కాదు. అలాగే సత్యసందేశానికి లేదా ప్రవక్త ముహమ్మద్(స) ఉద్యమం పట్ల వారిలో ప్రత్యేకంగా వ్యతిరేకత ఏదీ ఉండేదికాదు. ఇలా వచ్చేవారిలో చాలామంది ఆలోచనాపరులు ఉండేవారు. ఏ ఉద్యమాన్నయినా దాని మంచిచెడ్డల నేపథ్యంలో అంచనా వేసే శక్తిసామర్థ్యాలు కలిగినవాళ్ళు. ఇలాంటి పరిస్థితిలో మక్కా బయటి ప్రాంతాలకు చెందిన ఈ ప్రజలు సత్యసందేశ ప్రభావానికి గురవుతున్నప్పుడు, సత్యసందేశం పట్ల ఆకర్షితులవుతున్నప్పుడు కేవలం మక్కా నగరంలో సత్యసందేశాన్ని అడ్డుకునే శత్రుగణ ప్రయత్నాల వల్ల ఎలాంటి ప్రయోజనమూ ఉండదు. ఇదే విషయాన్ని ఖుర్ఆన్ కూడా స్పష్టంగా తెలియజేసింది.

> **"కాని మేము భూమిని విభిన్న దిశల నుండి తగ్గిస్తూ వస్తున్న విషయం వారికి కనిపించడం లేదా?"** ***(దివ్యఖుర్ఆన్ 21 : 44)***

ముఖ్యంగా హజ్ యాత్ర సందర్భంగా ఖురైషుల ప్రయత్నాలేవీ ఫలించేవి కావు. హజ్ యాత్ర కాలంలో అరేబియాలోని వివిధ ప్రాంతాల ప్రజలు మక్కా నగరానికి తరలివచ్చేవారు. మక్కాలోనే బస చేసేవారు. ప్రవక్త ముహమ్మద్(స) ఇలా హజ్ యాత్రకు వచ్చిన వారందరి శిబిరాలకు వెళ్ళేవారు. ప్రతి శిబిరానికి వెళ్ళి తన సందేశాన్ని వినిపించేవారు. ఈ ప్రచార ప్రభావాన్ని ఖురైషులు గుర్తించారు. హజ్‌కాలం సమీపించగానే ఈ ప్రచారాన్ని అడ్డుకోవడానికి పథకాలు రచించారు. ప్రవక్త(స) ప్రభావం నుంచి హజ్ యాత్రికులను దూరంగా ఉంచడం ఎలా అన్నది ఆలోచించారు. వలీద్ బిన్ ముగైరా సలహా మేరకు ఒక ఎత్తుగడ వేశారు. ప్రవక్త(స)

భవిష్యత్తు చెప్పే జ్యోతిష్కుడు కాదు లేదా ఏదో భూతం ప్రభావానికి గురైన వ్యక్తి కూడా కాదు, లేదా పిచ్చిపట్టిన వారు కూడా కాదు, ఆయన కవి కాదు, మంత్రగాడు కాదు ఈ విషయాలు వారందరికీ బాగా తెలుసు. ఆయన మాటలు మృదు మధురంగా, మనస్సును తాకేలా ఉండేవి. అందువల్ల ప్రవక్త(స) ప్రభావాన్ని తిప్పికొట్టడానికి ఖురైషు శత్రుగణం ఒక కొత్త ఎత్తుగడ వేసింది. ఒక కొత్త ప్రచారాన్ని మొదలుపెట్టింది. ఆయన జ్యోతిష్కుడని, ఆయన మాటల్లో మంత్రజాలం ఉంటుందని, ఆయన ప్రజల్లో విభేదాలు నాటుతాడని, భార్యాభర్తల మధ్య సంబంధాలు చెడిపోతాయని, సోదరుల మధ్య వైరం తలెత్తుతుందని, తండ్రీకొడుకుల మధ్య విద్వేషం పుట్టుకొస్తుందని, కాబట్టి ఆయన మాటలు ఎవరూ వినకూడదని ప్రచారం ప్రారంభించారు. ఈ ప్రచారం చాలా జోరుగా సాగింది. కాని ఈ ప్రచారం వల్ల అనుకున్న ఫలితాలు వాళ్ళు సాధించలేకపోయారు. ప్రవక్త(స) సత్యసందేశం మారుమూల ప్రాంతాలకు కూడా చేరుకోవడం ప్రారంభమయింది. ఈ ప్రచారం నిజానికి ఖురైషుల పన్నాగాలకు విరుద్ధంగాపనిచేసింది. అంతవరకు ప్రవక్త(స) గురించి, ఆయన ప్రారంభించిన ఉద్యమం గురించి తెలియని వారికి కూడా ముహమ్మద్(స) ఏదో ఒక కొత్త ఉద్యమంప్రారంభించారని తెలియవచ్చింది. ఈ ప్రచార యుద్ధాలు ఏ విధంగా ఉండేవో మనకు రాబియా బిన్ ఉతాబా మాటల వల్ల తెలుస్తోంది. ఆయన ఏమన్నాడంటే...

మినా వద్ద నేను నా తండ్రితోపాటు వెళ్ళినప్పుడు నేను చాలా చిన్నవాడిని. అక్కడ ప్రవక్త(స) ప్రతి శిబిరానికి వెళ్ళడం, ఆ శిబిరంలో ఉన్నవారిని ఉద్దేశించి... నేను దేవుడి తరఫున మీ వద్దకు పంపబడిన ప్రవక్తను. మీరు ఒకే దేవుడిని ఆరాధించండి. ఆ దేవుడికి భాగస్వాములను కల్పించడం మానేయండి. విగ్రహాలను పూజించడం మానుకోండి. నన్ను విశ్వసించండి. నన్ను నమ్మండి. నాతో సహకరించండి. నన్ను ఏ పని కోసం దేవుడు నియమించాడో ఆ పని పూర్తి చేసేవరకు నాతో ఉండండి అని బోధించేవారు.

రాబియా ఇంకా ఇలా వివరించారు. ప్రవక్త(స) వెనుక ఒక వ్యక్తి ఎల్లప్పుడు వస్తూండేవాడు. ప్రవక్త(స) తన మాటలు ముగించగానే, ఈ వ్యక్తి ముందుకు వచ్చి ... ప్రజలారా, ఈ మనిషి మిమ్మల్ని లాత్, ఉజ్జా దేవతలను పూజించకుండా అడ్డుకుంటున్నాడు. మిమ్మల్ని ధర్మభ్రష్టులు చేస్తున్నాడు. కాబట్టి ఇతడి మాటలు వినకండి, ఇతడు చెప్పినట్లు చేయవద్దు.. అని ప్రసంగం చేసేవాడు. ప్రవక్త(స) వెనుక వచ్చి ఆయనకు వ్యతిరేకంగా ప్రచారం చేసే ఈ వ్యక్తి ఎవరని రాబియా తన తండ్రిని ప్రశ్నించాడు. ఆ వ్యక్తి మరెవరో కాదు ప్రవక్త(స) పినతండ్రి అబూలహబ్ అని ఆయన తెలియజేశాడు. హజ్ యాత్ర సందర్భంగా ప్రవక్త(స) బహిరంగ ఉపన్యాసాలు చేసేవారు. ఆయన ఉపన్యసిస్తున్నప్పుడు అబూ లహబ్ సంచుల్లో దుమ్ముధూళి తీసుకువచ్చి ప్రవక్త(స) మీద గుమ్మరించేవాడు.... ఈ మనిషి మాటలు విని మోసపోవద్దు. ఇతను లాత్, ఉజ్జా దేవతలను పూజించకుండా వ్యతిరేకిస్తున్నాడు అని అరిచేవాడు. నానాటికి తీవ్రతరమవుతున్న ఈ వ్యతిరేకతను చూసి అబూతాలిబ్ ఒక పద్యాన్ని రాశారు. ఆ పద్యాన్ని కాబా గోడఒకు వేలాడదీశారు. అందులో ఆయన తాను ముహమ్మద్(స) బోధిస్తున్న మతాన్ని స్వీకరించక పోయినప్పటికీ, తాను ప్రవక్త(స) ఉద్యమాన్ని అడ్డుకోనని, ప్రవక్త(స)కు మద్దతుగా అవసరమైతే ప్రాణాలు ధారబోస్తానని పేర్కొన్నారు.



మక్కాకు వచ్చే ప్రతి కొత్త వ్యక్తిపై గట్టి నిఘా ఉంచేవారు. ఆ వ్యక్తి ప్రవక్త(స)ను కలుసుకోకుండా శాయశక్తులా అడ్డుకునేవారు. తుఫైల్ బిన్ ఉమర్ దౌసి అలా మక్కాకు వచ్చిన ఒక యాత్రికుడు, ఆయన ఒక మంచి కవి. ఆయన మక్కాకు రాగానే ఖురైషులు ఆయన్ను కలుసుకుని .. తుఫైల్ మీరు మా నగరానికి వచ్చారు. కాని ముహమ్మద్(స) కార్యకలాపాలు ఈ నగరంలో మాకు భరించరానివిగా తయారయ్యాయి. ఆయన మా ఐక్యతను దెబ్బతీశాడు. మా ప్రయోజనాలకు నష్టం కలిగిస్తున్నాడు. ఆయన మాటల్లో మంత్రజాలం ఉంది. ఆయన తండ్రికొడుకుల మధ్య, భార్యభర్తల మధ్య, సోదరుల మధ్య విభేదాలు సృష్టిస్తున్నాడు. కాబట్టి మీరు ఆయన మాటల మాయలో పడకండి. ఆయనతో మాట్లాడకుండా ఉండడం, ఆయన మాటలు వినకుండా జాగ్రత్త తీసుకోవడం మంచిది అని చెప్పారు. తర్వాత తుఫైల్ ఈ విషయం గురించి తెలియజేస్తూ తన వద్దకు వచ్చిన ఖురైషు ప్రతినిధులు తన వద్ద నుంచి ముహమ్మద్(స) మాటలు విననన్న వాగ్దానం తీసుకుని కాని తనను వదిలిపెట్టలేదని చెప్పారు. అందువల్ల ఆయన కాబా గృహానికి వెళ్ళినప్పుడల్లా తన చెవుల్లో దూది పెట్టుకుని వెళ్ళేవారు. ఆ విధంగా ప్రవక్త(స) మాటలు వినబడకుండా జాగ్రత్తలు తీసుకునేవారు. కాని ఒకరోజు ముహమ్మద్(స) కాబా గృహం వద్ద ప్రార్థన చేస్తుండగా తుఫైల్ అక్కడకువెళ్ళారు. ముహమ్మద్(స) దగ్గర నిలబడ్డారు. కాస్సేపు ఆలోచించారు. తనకు బుద్ధివివేకాలున్నాయి. తాను ఒక కవి, మంచిచెడుల విచక్షణ

తనకు ఉంది. అందువల్ల ప్రవక్త(స) ఏం చెబుతారో తప్పక వినాలని, మంచిదైతే ఆ మాట ఒప్పుకోవాలని, మంచిది కాకపోతే తిరస్కరించాలని నిర్ణయించుకున్నారు. తుఫైల్ ఈవిధంగా ఆలోచిస్తుండగానే ప్రవక్త(స) తన ప్రార్థన ముగించి ఇంటికి వెళ్ళడానికి సిద్ధమయ్యారు. తుఫైల్ ఆయన్ను అనుసరిస్తూ జరిగినదంతా ఆయనకు వినిపించారు. ముహమ్మద్(స) సందేశం ఏమిటో తెలుసుకోవాలన్న ఆసక్తి ఉందని, ఆయన ఉద్యమం గురించి చెప్పాలని కోరారు. ప్రవక్త(స) తన ఉద్యమం గురించి వివరించారు. దివ్యఖుర్‌ఆన్ నుంచి కొన్ని వాక్యాలు వినిపించారు. ఆ వాక్యాలు విన్న తుఫైల్ అమితంగా ప్రభావితుడయ్యారు. ఆ వెంటనే ఇస్లామ్ స్వీకరించారు. ఆ తర్వాత ఆయన తన స్వస్థలానికి తిరిగివెళ్ళి అత్యుత్సాహంగా సత్యసందేశ ప్రచారం కొనసాగించారు. ఆయన ఎంత ఉత్సాహంగా ప్రచారం చేశారంటే, ఆయన తెగ యావత్తు ఇస్లాం స్వీకరించింది. ఇలాంటిదే మరో సంఘటన ఆషా బిన్ ఖైస్‌కు సంబంధించినది. ఆయన కూడా మంచి కవి. ఆయన్ను కూడా ఖురైషులు తుఫైల్ మాదిరిగానే అడ్డుకున్నారు. నిజానికి ఆయన ఇస్లామ్ స్వీకరించే ఉద్దేశ్యంతోనే మక్కా నగరానికి వచ్చారు. కాని ఖురైషులు ఆయన్ను చుట్టుముట్టి, ఈ సంవత్సరం తిరిగి వెళ్ళిపోవాలని, ఇస్లామ్ స్వీకరించాలనే ఉంటే మరుసటి సంవత్సరం వచ్చి స్వీకరించాలని పట్టుబట్టారు. ఆయన్ను వాగ్దానం చేయమన్నారు. కాని ఆ మరుసటి సంవత్సరం ఖైస్ మక్కా రాలేకపోయాడు, ఈ లోగా ఆయనకు మృత్యువు వాటిల్లింది.

మరో సంఘటన ఆరాషీకి సంబంధించినది. అబూ జహల్ అతడి వద్ద నుంచి ఒక ఒంటెను కొన్నాడు. కాని ఒంటెకు ధర చెల్లించలేదు. ఆరాషీ ఈ విషయంలో సహాయం చేయాలని పలువురిని అభ్యర్థించాడు. అబూజహల్ నుంచి సొమ్ము ఇప్పించండని కోరాడు. కాని ఎవరికి ఆ ధైర్యం లేదు. ఈ సందర్భంగా కొందరు ఆటపట్టించడానికి ప్రవక్త ముహమ్మద్(స) వద్దకు వెళ్ళమని ఆరాషీకి చెప్పారు. ముహమ్మద్ మాత్రమే ఈ పని చేయగలరని కూడా చెప్పారు. అలా చెప్పిన వారికి అబూజహల్‌కు ప్రవక్త(స) పట్ల ఉన్న వైరం గురించి తెలుసు. అబూ జహల్‌నుంచి సొమ్ము ఇప్పించడానికి ప్రవక్త(స) ప్రయత్నిస్తే అబూజహల్ ఆయన్ను అవమానిస్తాడని భావించారు. ఆరాషీ ప్రవక్త(స) వద్దకు వెళ్లి తన సొమ్ము ఇప్పించాలని కోరాడు. ప్రవక్త(స) అతడిని తనతో రమ్మని చెప్పారు. ప్రవక్త ముహమ్మద్(స) తిన్నగా అబూజహల్ ఇంటికి వెళ్ళి తలుపు తట్టారు. లోపలి నుంచి అబూజహల్ ఎవరొచ్చారని అడిగాడు. తాను ప్రవక్త ముహమ్మద్(స) వచ్చానని, బయటకు రమ్మని ముహమ్మద్



అన్నారు. అబూజహల్ బయటకు రావడమేకాదు, కిమ్మనకుండా ఆరాషీకి ఇవ్వవలసిన సొమ్ము చెల్లించాడు. ఈ సంఘటన ప్రభావం ఆరాషీపై ఎంతగా ఉంటుందో ఊహించండి. ఆరాషీపై మాత్రమే కాదు, మక్కా నగర ప్రజలపై ఈ సంఘటన ఎలాంటి ప్రభావాన్ని వేస్తుందో ఆలోచించండి.

ప్రవక్త ముహమ్మద్(స) సందేశం హజ్ యాత్రకు వచ్చినవారి ద్వారా మదీనా నగరానికి కూడా చేరుకుంది. మదీనా నుంచి ప్రజలు బృందాలుగా మక్కా నగరానికి వచ్చారు. ప్రవక్త(స) సందేశాన్ని శ్రద్ధగా విన్నారు. దివ్యఖుర్‌ఆన్ వాక్యాలను ఆలకించారు. ఈ వాక్యాలు వారిపై అపరిమిత ప్రభావాన్ని వేశాయి. ఎంతో సంతోషంగా ఇస్లామ్ స్వీకరించారు. ఖురైష్ వ్యతిరేకులు వారి వద్దకు కూడా వెళ్ళారు. వారికి నచ్చజెప్పి ముహమ్మద్(స)కు దూరమయ్యేలా చేయాలనుకున్నారు. కాని మదీనానుంచి వచ్చి ఇస్లామ్ స్వీకరించినవాళ్ళు తమ విశ్వాసంపై స్థిరంగా నిలబడ్డారు. అకాబా అనే ప్రదేశంలో మదీనా వాసులు మొదట ప్రవక్త(స)ను కలుసుకున్నారు. ఆయన చేతిమీదుగా ప్రతిజ్ఞ చేశారు. అకాబా వద్ద రెండవసారి మదీనా వాసులు ప్రవక్త ముహమ్మద్(స)ను కలుసుకోవడం అత్యంత రహస్యంగా జరిగింది. ఖురైషుల వైరం చాలా తీవ్రంగా ఉండడం వల్ల రాత్రి చీకటిలో ఈ రహస్యసమావేశం జరిగింది. కాని ప్రవక్త(స) వద్ద ప్రతిజ్ఞ చేసి మదీనావాసులు తిరిగి తమ శిబిరం చేరుకోగానే మక్కా ఖురైషులు వారిపై దాడి చేశారు. ప్రవక్త ముహమ్మద్(స)ను వాళ్ళు మదీనా తీసుకువెళుతున్నారా అని ప్రశ్నించారు. మక్కా నగరంలో అలజడి, విభేదాలు సృష్టించడానికి ప్రయత్నిస్తున్నారా అని నిలదీశారు. మదీనా వాసులు తమ ప్రతిజ్ఞ గురించి రహస్యంగా ఉంచి మక్కా ఖురైషులకు నచ్చజెప్పి పంపించేశారు. కాని మక్కా ఖురైషులు మదీనా వారిపై గట్టి నిఘా ఉంచారు. మదీనాలో బోధనలు చేయడానికి నియమించబడిన ఇద్దరు వ్యక్తులను చివరకు పట్టుకున్నారు.

ఆ ఇద్దరిలో ఒక వ్యక్తి ముంజార్ బిన్ అమ్ర్, చాలా సన్నగా, బలహీనంగా ఉండేవారు. అతను ఎలాగోలా ఖురైషుల చెర నుంచి తప్పించుకున్నాడు. రెండవ వ్యక్తి సాద్ బిన్ ఉబాదా, ఇతడిని పట్టుకుని ఖురైషులు మక్కా తీసుకొచ్చారు. కాళ్ళు చేతులు విరిచికట్టేసి భయంకరంగా కొట్టారు. చివరకు జుబైర్ బిన్ ముతిమ్, హారిస్ బిన్ హర్బ్‌లు కలుగజేసుకుని అతడిని కాపాడారు.

ప్రవక్త(స) వ్యతిరేకుల్లో నజ్ర్ బిన్ హారిస్ ప్రముఖుడు. ప్రవక్త ముహమ్మద్(స) నుంచి ఆయన మద్దతుదారులను వేరు చేయడానికి అతడు ఒక కొత్త పద్ధతి

కనిపెట్టాడు. అతడు తరచూ తన వ్యాపార పనులపై ఈరాన్ వెళ్ళి వస్తూ వుండేవాడు. అక్కడి నుంచి ఈరాన్‌కు చెందిన ప్రాణయోధుల కథలు మోసుకు వచ్చేవాడు. ఇందులో చాలా వరకు కల్పిత కథలు కూడా ఉండేవి. ప్రవక్త ముహమ్మద్(స) చెప్పే ఆద్, సమూద్ జాతుల కథల కన్నా ఈరాన్‌కు చెందిన రుస్తుం, అస్ఫాందియార్‌ల కథలు చాలా ఆసక్తికరంగా ఉంటాయి వినండంటూ ఆ కథలు వినిపించేవాడు. ఈ వ్యక్తి గురించి దివ్యఖుర్ఆన్ క్రింది వాక్యంలో చక్కగా తెలియజేసింది.

> **"జ్ఞానం లేకుండానే ప్రజలను అల్లాహ్ మార్గం నుండి తప్పించటానికీ, ఈ మార్గం వైపునకు పిలిచే పిలుపును ఎగతాళి చేయటానికీ మానవులలోనే మనస్సును రంజింపజేసే ప్రసంగాన్ని కొనుక్కుని తీసుకువచ్చేవాడు కూడా ఒకడు ఉంటాడు"** ***(దివ్యఖుర్ఆన్ 31 : 6)***

ప్రవక్త ముహమ్మద్(స) బోధనల పట్ల ఆసక్తి చూపిస్తున్న వారిని తన వైపునకు ఆకర్షించడానికి ఇతడు పాటలు పాడే అమ్మాయిలను కూడా నియమించేవాడు. విచిత్రమేమిటంటే ఈ నజ్ర్ బిన్ హారిస్ ఒకసారి ఖురైషుల సమావేశంలో అబూ జహల్‌ను ఉద్దేశించి ఇలా అన్నాడు.

ఖురైష్ ప్రజలారా, మీరిప్పుడు పెద్దసమస్యను ఎదుర్కొంటున్నారు. భవిష్యత్తులో మీకు ముహమ్మద్(స) నుంచి తప్పించుకునే మార్గం ఏదీ ఉండదు. ముహమ్మద్(స) ఒకప్పుడు మీ అందరి ప్రశంసలు పొందిన యువకుడు. మీ అందరికన్నా ఎక్కువ నిజాయితీ కలిగినవాడు. మీ అందరికన్నా విశ్వసనీయుడు. ఆయన ప్రౌఢ వయసుకు చేరుకున్నప్పుడు ఆయన ఒక సందేశాన్ని మీకు ఇస్తున్నాడు. ఇప్పుడు మీరు ఆయన్ను జ్యోతిష్యుడని అంటున్నారు. మంత్రగాడని, కవి అని, పిచ్చివాడని అంటున్నారు. ఈ ఆరోపణలేవీ సత్యాలు కావు. ఖురైష్ ప్రజలారా మీరు తీసుకుంటున్న నిర్ణయాలపై ఆలోచించండి. దేవుని తోడు, భవిష్యత్తులో మీకు పెద్ద విషయమే ఎదురుకాబోతోంది అన్నాడు. అంటే ఆ వ్యక్తికి ప్రవక్త(స) ఉద్యమం గురించిన పూర్తి అవగాహన ఉంది. అతను ప్రవక్త(స)ను వ్యతిరేకించడం అన్నది ఉద్దేశ్యపూర్వకంగా, జాగ్రత్తగా ఆలోచించి తీసుకున్న నిర్ణయమే. కాని భావావేశాలను రెచ్చగొట్టడం ద్వారా ఒక నిర్మాణాత్మకమైన ఉద్యమాన్ని అడ్డుకోవడం సాధ్యంకాదు. ఇలాంటి ప్రయత్నాలు పటిష్టమైన ఉద్యమాన్ని నిరోధించలేవు. ఈ ప్రయత్నాలు త్వరలోనే నీరుగారిపోతాయి. అలాగే జరిగింది. అన్నిరకాల ప్రయత్నాలు, హింసా దౌర్జన్యాలు, అసత్య ప్రచారాలు అన్నీ విఫలమైన తర్వాత, సత్య సందేశ ప్రచారం విస్తరిస్తున్న వేగాన్ని చూసి, ఈ



ఉద్యమం భవిష్యత్తులో అందుకోబోయే ఎత్తుల్ని గమనించి ప్రత్యర్థులు రాజీ సూత్రాలతో ముందుకు వచ్చారు. ముహమ్మద్ (స)తో బేరసారాలు చేయాలనుకున్నారు. కాని స్థిరమైన సూత్రాలు, పునాదులపై నిలబడిన ఉద్యమం రాజీ బాట పట్టడం అన్నది అసాధ్యం. ఈ రాజీ సూత్రాల్లో ఒకటేమిటంటే, ప్రవక్త ముహమ్మద్(స) ఖురైషుల దేవతా విగ్రహాలకు వ్యతిరేకంగా ఏమీ మాట్లాడరాదు. ఖురైషులు ఆచరిస్తున్న ప్రస్తుత మతాచారాలకు విరుద్ధంగా ఏదీ చెప్పరాదు. కేవలం నైతిక ప్రమాణాలు బోధించడానికి మాత్రమే పరిమితం కావాలి. లేదా మరేదైనా తనకిష్టం వచ్చిన బోధనలు చేసుకోవచ్చు. అంటే అర్థమేమిటి. ప్రస్తుతం ఆచరణలో ఉన్న సాంఘిక వ్యవస్థ, ఖురైషుల రాజకీయ, ధార్మిక నాయకత్వం యధావిధిగా కొనసాగనివ్వాలి. అంటే మరోమాటలో చెప్పాలంటే ఇస్లామీయ ఉద్యమ లక్ష్యాలను వదులుకోవాలి. ఈ రాజీ ఫార్ములాను నిర్ద్వంద్వంగా తిరస్కరించడం జరిగింది.

ఇలాంటి మరో రాజీ ఫార్ములా గురించి స్వయంగా దివ్యఖుర్ఆన్ ప్రస్తావించింది.

> **"దీనికి బదులుగా మరొక ఖురాను తీసుకురా లేదా ఇందులో సవరణలు చెయ్యి"** ***(దివ్యఖుర్ఆన్ 10 : 15)***

ప్రవక్త(స) ఈ ప్రతిపాదనకు దైవిక ఆదేశాలతో క్రిందివిధంగా జవాబిచ్చారు

> **"ఇందులో నా అంతట నేను మార్పులు చేర్పులు చేయడం నా పని ఎంత మాత్రం కాదు. నేను నా వద్దకు పంపబడే వహీని మాత్రమే అనుసరిస్తాను. నేను గనుక నా ప్రభువు పట్ల అవిధేయత చూపితే, ఒక పెద్ద భయంకరమైన దినం నాడు పడే శిక్షకు నేను భయపడుతాను."** ***(దివ్యఖుర్ఆన్ 10 : 15)***

> **"ఒక అబద్ధవిషయాన్ని సృష్టించి దానిని అల్లాహ్‌కు అపాదించే వాడికంటే లేదా అల్లాహ్ యొక్క నిజమైన ఆయతులను అబద్ధాలుగా నిర్ధారించే వాడికంటే పరమ దుర్మార్గుడెవడుంటాడు?"** ***(దివ్యఖుర్ఆన్ 10: 17)***

మరోవిధమైన రాజీ సూత్రం కూడా ముందుకు వచ్చింది. ప్రవక్త(స) తన వద్ద చేరిన బడుగు వర్గాల వారిని వెనక్కి పంపేయాలని, వారిని చేర్చుకోరాదని, సాంఘికంగా ఉన్నత హెూదా కలిగిన వారిని మాత్రమే చేర్చుకుని వారికి నాయకుడిగా ఉండాలని, బడుగు, బలహీనవర్గాలు ఉన్నత వర్గాలతో కలిసి కూర్చునే అర్హత లేని వారని ప్రతిపాదన వచ్చింది. ఉన్నత వర్గాల కోసం మాత్రమే ప్రవక్త(స) ఈ ఉద్యమాన్ని నడిపితే వారు అందరూ అందులో చేరుతారని ఈ ప్రతిపాదన తాత్పర్యం.

ఈ ప్రతిపాదనకు కారణం ఉన్నత వర్గాలు ఉద్యమంలో చేరాలన్న ఆతృతతో ఉండడం కాదు. ఉద్యమానికి వెన్నుదన్నుగా ఉన్నవారిని ఉద్యమం నుంచి దూరం చేయాలన్న దుష్ట తలంపు ఈ ప్రతిపాదన వెనుక దాగివుంది. తీవ్రమైన హింసా దౌర్జన్యాలు భరించి ప్రవక్త(స) వెంట ఉన్న వారిని ఆయనకు దూరం చేయాలని ఈ ప్రతిపాదనతో ముందకు వచ్చారు. దివ్యఖుర్ఆన్ ఈ ప్రతిపాదనలోని దుష్ట తలంపును గుర్తించింది. ప్రవక్త(స)కు వెంటనే దేవుని తరఫు నుంచి ఖుర్ఆన్ వాక్యాలు అవతరించాయి. దేవుని రాత్రింబవలు ప్రార్థిస్తున్న వారిని ప్రవక్త(స) తన నుంచి దూరం చేసుకోరాదని, ఉద్యమాన్ని వ్యతిరేకిస్తున్నవారికి స్థానం కల్పించడం కోసం ఉద్యమం వెంట నడుస్తున్న వారిని పక్కన పెట్టరాదని పేర్కొనడం జరిగింది.

**"విశ్వాసులలో నిన్ను అనుసరించే వారిపట్ల మృదువుగా మెలుగు"**

***(దివ్యఖుర్ఆన్ 26 : 215)***

ప్రవక్త ముహమ్మద్(స) ఖురైష్ పెద్దలతో ఒక సమావేశంలో ఉన్నప్పుడు ఒక గుడ్డి సహచరుడు, ఇబ్నె ఉమ్మే మక్తూమ్ అక్కడికి వచ్చారు. ప్రవక్త(స) ఆయన పట్ల అంతగా ఆసక్తి చూపించకుండా ఖురైషులతో ఎక్కువ శ్రద్ధగా మాట్లాడారు. ఈ వైఖరిని కూడా దివ్యఖుర్ఆన్ నిరసించింది. ఒకసారి ఖురైషులతో సమావేశం సందర్భంగా ఉత్బా బిన్ రాబియా కొన్ని ప్రతిపాదనలు చేశారు. ఖురైషులు ఆ ప్రతిపాదనలు చేయడానికి ఉతాబాను ఎన్నుకున్నారు. ఉత్బా చక్కని భాషలో చాలా మర్యాదపూర్వకంగా, చాలా మృదువైన శైలిలో తన ప్రతిపాదనలు ఉంచాడు. అవి ఏమిటంటే, ఈ ఉద్యమం ద్వారా ప్రవక్త(స) ధన సంపదలు పొందాలనుకుంటే ఖురైషులు అరేబియాలో ప్రవక్త(స)ను అత్యంత ధనికుడిగా చేసేంత సంపద ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నారు. ప్రవక్త(స) ఖురైషులకు నాయకుడిగా మారాలనుకుంటే, ఆయన్ను నాయకుడిగా చేసుకోవడానికి సిద్ధంగా ఉన్నారు. ఆయన అనుమతి లేకుండా ఖురైషులు ఏ నిర్ణయమూ తీసుకోరు. ఆయన పాలకుడిగా మారాలనుకుంటే ఆయన్ను రాజుగా ఎన్నుకోవడానికి సిద్దంగా ఉన్నారు. ఒకవేళ ఆయన ఏదన్నా భూతం (జిన్) ప్రభావంలో ఉంటే దానిని తొలగించడానికి అయ్యే ఖర్చునంతా భరించడానికి సిద్ధంగా ఉన్నారు. ఈ ప్రతిపాదనలన్నింటినీ ప్రవక్త(స) విన్నారు. ఉతాబా తన మాటలు ముగించిన తర్వాత దివ్యఖుర్ఆన్‌లోని హామీమ్ సూరాలోని మొదటి ఐదు వాక్యాలు పఠించారు.

**"హా..మీమ్. స్పష్టమైన ఈ గ్రంథం సాక్షిగా! మీరు అర్థం చేసుకోవాలని మేము దీనిని అరబ్బీ భాషలో ఖురానుగా చేశాము. వాస్తవానికి ఇది మా**



**వద్ద ఉన్న మాతృ గ్రంథం(ఉమ్ముల్ కితాబ్)లో లిఖించబడి ఉన్నది. మహోన్నతమైన స్థానం గల వివేకంతో నిండిన గ్రంథం అది. ఇప్పుడు మేము మీతో విసిగిపోయి (కేవలం మీరు హద్దులు మీరిపోయారనే కారణంగా) ఈ హితబోధను మీ వద్దకు పంపటం మానెయ్యాలా?"**

***(దివ్యఖుర్ఆన్ 43 : 1-5)***

ఉత్బా మౌనంగా ఈ వాక్యాలను విన్నాడు. ఈ వాక్యాలు పఠించిన తర్వాత ప్రవక్త(స) అతడితో నేను చెప్పేదేమిటో ఇప్పుడు మీరు విన్నారు. ఇక మీరు మీ ఇష్టం వచ్చినట్లు చేసుకోవచ్చు అన్నారు. ఉతాబా వెనుతిరిగి ఖురైషుల వద్దకు వెళ్ళిపోయాడు. ఆయన ముఖం పాలిపోయి ఉండడాన్ని చూసి వాళ్ళు నిర్ఘాంతపోయారు. ఏమైందని అడిగిన తర్వాత ఉతాబా వారితో ఇలా అన్నాడు. "ఇలాంటి పఠనాన్ని నేనెన్నడూ వినలేదు. దేవుని తోడు, అది కవిత్వం కాదు, మంత్రతంత్రాలు కావు, జ్యోతిష్యమూ కాదు, ఖురైష్ ప్రజలారా, నా మాటలు వినండి. ఈ వ్యవహారాన్ని నాకు వదిలేయండి. ఆ మనిషిని ఆయన ఇష్టం వచ్చినట్లు చేసుకోనివ్వండి. ఆయన పనిలో ఆటంకాలు సృష్టించకండి. దేవుని తోడు, నేను విన్న పఠనం గొప్ప మార్పులు సాధించే పఠనం. అరేబియా ప్రజలు ఆయన సందేశాన్ని స్వీకరిస్తే, మిమ్మల్ని తొలగించడానికి పెద్దగా ప్రయత్నం అవసరం ఉండదు. కాని ఆయన అరేబియాపై అధిపత్యం సంపాదిస్తే ఆయన రాజ్యం నిజానికి మీ రాజ్యమే అవుతుంది. ఆయన శక్తి అధికారాలు మీవే అవుతాయి. ఆయన ద్వారా మీరు అత్యంత అదృష్టవంతులు కాగలరు."

ఉతాబా మాటలు విని ఖురైషులు ఎగతాళిగా నవ్వారు.

ఉతాబా నువ్వు కూడా ఆయన మాయలో పడిపోయావు అన్నారు.

ఇలాంటిదే మరో ప్రయత్నం కూడా జరిగింది. ఉతాబా బిన్ రాబియా, షైబా బిన్ రాబియా, అబూ సుఫ్యాన్ బిన్ హర్బ్, నజ్ర్ బిన్ హారిస్, కల్దా అబ్దుల్ బక్తారి బిన్ హిషామ్, అస్వద్ బిన్ ముతల్లిబ్, జమా బిన్ అస్వద్, వాలిద్ బిన్ ముగిరా, అబూజహల్ బిన్ హిషామ్,అబ్దుల్లా బిన్ అబీ ఉమయ్యా, ఆస్ బిన్ వాయిల్, నబియా, మునబ్బా, ఉమయ్యాబిన్ ఖల్ఫ్ తదితరులు కాబా వద్ద సమావేశమయ్యారు. అక్కడికి ముహమ్మద్(స)ను పిలువనంపారు. ప్రవక్త(స) అక్కడికి చేరుకున్నారు. అప్పుడు మళ్ళీ ఉతాబా ప్రతిపాదనను మరోసారి ఆయన ముందు పెట్టడం జరిగింది. ప్రవక్త(స) వారికి ఇలా జవాబిచ్చారు. నా ఉద్దేశ్యం మీరనుకుంటున్నది కాదు. నేను

ఈ ఉద్యమాన్ని సంపద కూడగట్టడానికి ప్రారంభించలేదు. జాతికి నాయకుడు కావడానికి లేదా రాజుగా మారడానికి ఇదంతా చేయడంలేదు. నిజానికి దేవుడు నన్ను మీ వద్దకు పంపించాడు. దైవప్రవక్తగా పంపించాడు. నాకు దైవిక చట్టాలను ఇచ్చాడు. మిమ్మల్ని హెచ్చరించాలని, మీకు శుభవార్తలు తెలియజేయాలని నన్ను పంపించాడు. కాబట్టి నేను దేవుని ఆదేశాలను మీకు తెలియజేస్తున్నాను. మీ సంక్షేమం కోసం నా బాధ్యతను నేను నిర్వర్తించాను. ఇప్పుడు నేను మీకు చెప్పినది మీరు అంగీకరిస్తే అది మీకు ఇహపరలోకాల్లో మేలు చేస్తుంది. మీరు తిరస్కరిస్తే నేను సహనంతో దేవుడు మీకు నాకు మధ్య ఎలాంటి తీర్పు ఇస్తాడో దాని కోసం ఎదురుచూస్తున్నాను అన్నారు.

ఈ జవాబు విన్న తర్వాత అవిశ్వాసులకు వారి ఆశలన్నీ అడుగంటిపోయాయి. ఆ తర్వాత వాళ్ళు హాస్యాస్పదమైన డిమాండ్లు చేయడం ప్రారంభించారు. ఉదాహరణకు తమ దేశం చాలా చిన్నదని, నీటి కొరత చాలా ఎక్కువగా ఉందని, జీవనం చాలా కఠినమైపోయిందని, కాబట్టి నీవు దేవుడిని అడిగి మన భూభాగం విశాలంగా మార్చమని చెప్పు, దీనిచుట్టూ ఉన్న కొండలని తొలగించి, సిరియా, ఇరాక్‌లలో మాదిరిగా ఇక్కడ కూడా నదులు ప్రవహించేలా చేయమని చెప్పు అని కోరారు. అలాంటిదే మరో హాస్యాస్పదమైన కోరిక, దేవుడు తమ పూర్వీకులందరినీ సమాధుల నుంచి లేపి నిలబెట్టాలని, వారిలో తమ పూర్వీకుడైన ఖొసే బిన్ కలాబ్ లాంటి పెద్దలు కూడా ఉండాలని డిమాండ్ చేశారు. ఖొసే బిన్ కలాబ్‌ను సమాధి నుంచి లేపితే నీ సందేశం గురించి ఆయన్నడిగి తెలుసుకుంటామని అన్నారు. ఇవన్నీ చేస్తే దేవుడు నిన్ను ప్రవక్తగా పంపించాడని అంగీకరిస్తామని చెప్పారు. అయితే ఈ పనులేవీ చేయలేకపోతే కనీసం నీవు చెప్పే ఆ దైవిక ఆపద ఏదో మా మీదకు వచ్చేలా చేయి అదీచూద్దాం అన్నారు. ఈ డిమాండ్లన్నీ ప్రవక్త(స) శ్రద్ధగా విన్నారు. ఆ తర్వాత వారితో ఇవన్నీ చేయడానికి నేను పంపబడలేదు అని జవాబిచ్చారు.

ఈ జవాబు చెప్పి ప్రవక్త(స) అక్కడి నుంచి వెళ్ళిపోయారు. ఆయన వెనకే అబ్దుల్లా బిన్ ఉమయ్యా కూడా లేచి నిలబడ్డాడు. ముహమ్మద్(స)ను తాను ఎన్నటికీ ప్రవక్తగా అంగీకరించే ప్రసక్తే లేదని, ముహమ్మద్(స) తాము అడిగిన ఏ ఒక్క పని చేసి చూపించలేకపోయారని, ఇప్పుడు ముహమ్మద్ నిచ్చెన వేసుకుని ఆకాశంలోకి అధిరోహించి అక్కడినుంచి దేవదూతలను తన వెంట తీసుకొచ్చినా సరే ఇక



ముహమ్మద్(స)ను ప్రవక్తగా అంగీకరించడం జరగనే జరగదని హూంకరించి వెళ్ళిపోయాడు. ప్రవక్త(స) వివిధ తెగల మధ్య తన ప్రచారం కొనసాగిస్తున్న సందర్భంగా బనూ ఆమిర్ తెగ నాయకుడు బహ్రా బిన్ ఫిరాస్ ప్రవక్త(స) వద్దకు వచ్చాడు. ముహమ్మద్(స) సందేశాన్ని శ్రద్ధగా విన్నాడు. తన తెగవారి వైపు తిరిగి ఇలా అన్నాడు. నేను గనక ఈ యువకుడిని నాతోపాటు తీసుకు వెళ్ళగలిగితే పూర్తి అరేబియా నా స్వాధీనం అవుతుంది అన్నాడు. ఆ తర్వాత అతను ప్రవక్త (స) వైపు తిరిగి ఇలా అన్నాడు. మేము నీ సందేశాన్ని స్వీకరిస్తే నీవు నీ ప్రత్యర్థులపై విజయం సాధించిన తర్వాత, నీ మరణానంతరం ఈ ఉద్యమాన్ని మా ఆధీనం చేస్తానని మాట ఇవ్వగలవా? అని ప్రశ్నించాడు. ఈ ప్రశ్నకు ప్రవక్త(స) జవాబిస్తూ నా తర్వాత వారసుడెవ్వరన్న నిర్ణయం దేవుని చేతిలో ఉంది అన్నారు. అప్పుడు బహ్రా మరింత గుచ్చిగుచ్చి అడుగుతూ మేము నీ సందేశాన్ని స్వీకరించి, వ్యతిరేకుల దాడులను సహించి చివరకు నీవు విజయం సాధించిన తర్వాత ఆ విజయ ఫలాలు ఇతరులకు దక్కడాన్ని మేము ఎలా ఒప్పుకోగలం. ఇలాంటి ఉద్యమంతో మాకు ఎలాంటి సంబంధంలేదు అన్నాడు.

ఇక్కడ గమనించవలసిన వాస్తవమేమిటంటే ముహమ్మద్(స) ఉద్యమంలో ఉన్న శక్తిని బహ్రా గుర్తించాడు. ఈ ఉద్యమాన్ని ప్రభావాన్ని అంచనా వేశాడు. ఈ ఉద్యమం అరేబియాలో ఎలాంటి మార్పులు తీసుకురావచ్చో ఊహించాడు. ప్రవక్త(స) రాజకీయాలతో సంబంధం లేకుండా కేవలం మతబోధ చేసుకునే వారయితే లేదా ధార్మిక బోధనలతో నైతిక సంస్కరణకు ప్రయత్నించే బోధకుడైనట్లయితే బహ్రాకు ఆయన తన వారసుడి గురించి జవాబు చెప్పి ఉండేవారు కాదు. అందుకు బదులుగా ఆయన ఇలా జవాబిచ్చి ఉండేవారు. మిత్రమా, మాలాంటి ధర్మపరాయణుల సంస్కరణా ఉద్యమంలో నాయకత్వం, అధికారాల ప్రస్తావన ఉంటుందా? వారసత్వం అన్నది ఉంటుందా? ప్రాపంచిక ప్రయోజనాలుంటాయా? అని ప్రశ్నించి ఉండేవారు. కాని ప్రవక్త(స) అలా చేయలేదు. తన ఉద్యమం గురించి సమగ్రమైన అవగాహన, తన ఉద్యమంలో ఉన్న రాజకీయ కోణాలు అన్నింటి గురించి పూర్తి అంచనా ప్రవక్త(స)కు ఉన్నాయి. బనూ అమీర్ తెగ నాయకుడు బహ్రా కూడా వాటిని అర్థం చేసుకున్నాడు. అందువల్లనే ఉద్యమ వారసత్వం గురించి ప్రశ్నించాడు. మక్కా నగరంలో ఈ విధంగా ప్రవక్త(స)ను అడ్డుకోవడానికి అనేక ప్రయత్నాలు జరిగాయి. తన ఉద్యమాన్ని కాపాడుకోవడానికి, తన సహచరులను దౌర్జన్యాలు హింసా కాండల నుంచి రక్షించుకోవడానికి ప్రవక్త(స) దిగి వచ్చేలా చేయాలని ప్రత్యర్థులు చాలా

ప్రయత్నించారు. ఆవిధంగా ఉద్యమ ఉధృతిని తగ్గించాలనుకున్నారు. ఆయన ముందు అనేక ప్రతిపాదనల రూపంలో రాజీ సూత్రాలు తీసుకొచ్చారు. ఈ ప్రతిపాదనలకు వేటికీ ఆయన ఒప్పుకోకపోతే తాము ఎంత ప్రయత్నించినా రాజీకి ఎంత తాపత్రయపడినా ముహమ్మద్(స) స్వయంగా మొండిగా వ్యవహరించారని ప్రచారం చేయడానికి అవకాశాలుండేలా చూసుకున్నారు. ఇది చాలా క్లిష్టమైన పరిస్థితి. చాలా కఠినమైన పరిస్థితి. అందుకే ఈ పరిస్థితిలో దివ్యఖుర్ఆన్ పదేపదే ప్రవక్త ముహమ్మద్(స)ను దృఢంగా నిలబడాలని ప్రోత్సహించింది. ఒక సందర్భంగా దైవిక సహాయం వస్తోందని హామీ కూడా వచ్చింది.

> **"మేము గనుక నీకు మనోబలాన్ని ఇచ్చి ఉండకపోతే నీవు వారి వైపునకు కొంతైనా మొగ్గి ఉండేవాడవు అనేది అసంభవమేమీ కాదు. కాని ఒకవేళ నీవు అలా మొగ్గి ఉంటే, మేము నీకు ప్రపంచంలో కూడా రెట్టింపు శిక్షను రుచి చూపించి ఉండేవారము. పరలోకంలో కూడా రెట్టింపు శిక్షే."**
>
> ***(దివ్యఖుర్ఆన్ 17: 74,75)***

## తీవ్రమైన విద్వేషం

ప్రవక్త ముహమ్మద్(స) సత్యసందేశాన్ని బహిరంగంగా ప్రచారం చేయడం ప్రారంభించిన మరుక్షణం నుంచే హింసాత్మక వ్యతిరేకత ప్రారంభమైంది. హింసా దౌర్జన్యాలు ఒకవైపు కొనసాగుతుండగానే మరోవైపు అనేక రాజీ ప్రతిపాదనలతో ఖురైషులు ఈ ఉద్యమాన్ని నీరుగార్చడానికి ప్రయత్నించారు. కాని ఈ రాజీ ప్రయత్నాలు బెడిసికొట్టిన తర్వాత ప్రవక్త(స) ఉద్యమాన్ని అడ్డుకోవడానికి చేసిన ప్రాపగండ విఫలమైన తర్వాత, అందులోను ప్రవక్త(స) సతీమణి హజ్రత్ ఖదీజా(రజి), ప్రవక్త(స)కు వెన్నుదన్నుగా నిలబడిన పినతండ్రి అబూ తాలిబ్ ఇద్దరూ మరణించిన నేపథ్యంలో ఒక్కసారిగా ప్రత్యర్థుల హింసా దౌర్జన్యాలు ఆకాశాన్నంటాయి. కానీ ఈ హింసా దౌర్జన్యాలు ఏ స్థాయిలో జరిగినప్పటికీ అవి ఉద్యమాన్ని బలహీన పరచలేకపోయాయి. ఉద్యమంలో చేరిన వారు కొలిమి మంటల్లో కాగిన ఉక్కులా మరింత దృఢమయ్యారు. ప్రత్యర్థులు ప్రవక్త ముహమ్మద్(స)ను లక్ష్యంగా చేసుకుని హింసా దౌర్జన్యాలు కొనసాగిస్తూ వచ్చారు. అయితే ప్రవక్త(స) సహచరులపై కూడా కష్టాల కొండలు విరిగిపడ్డాయి. వారిని చిత్రహింసలకు గురిచేయడం జరిగింది.



ఈ హింసాకాండ గురించిన పూర్తి వివరాలు నేడు లభించడంలేదు. అయినా చరిత్రకారులు చాలా వివరాలను రికార్డు చేశారు. ఈ వివరాలను చదివితే మనసు ద్రవిస్తుంది. హృదయం భారమవుతుంది.

ప్రవక్త ముహమ్మద్(స) స్వయంగా అనేక కష్టాలు అనుభవించవలసి వచ్చింది. హింసా దౌర్జన్యాలను భరించవలసివచ్చింది. అయితే తన సందేశాన్ని విశ్వసించి తన వెంట నడుస్తున్న పేద ప్రజలు తీవ్రమైన హింసా దౌర్జన్యాలకు గురికావడం చూసి ఆయన చలించిపోయేవారు. ఎంత హృదయ విదారకరమైన కథలున్నాయంటే, ఉదాహరణకు,

ఇబ్బాబ్ ఇబ్నుల్ ఉర్స్ ఉమీమి ఒక బానిస. ఇస్లామ్‌కు పూర్వమే ఆయన్ను ఉమ్మె నుమార్ బానిసగా కొనుక్కున్నాడు. మక్కాలో ఇస్లామ్ ప్రచారం జరుగుతున్నప్పుడు, ముఖ్యంగా అర్కామ్ ఇంటి నుంచి ప్రవక్త(స) సత్యసందేశ కార్యకలాపాలు నిర్వహిస్తున్నప్పుడు ఖబ్బాబ్ ఇస్లామ్ గురించి తెలుసుకుని ఇస్లామ్ స్వీకరించాడు. అంతే ఆయనపై చిత్రహింసల పర్వతాలు విరుచుకుపడ్డాయి. ఖురైష్ క్రూరులు ఆయన్ను భగభగమండుతున్న బొగ్గులపై నెట్టేశారు. ఆయన వెల్లకిలా వాటిపై పడిపోయారు. ఖురైషుల్లో ఒక వ్యక్తి వచ్చి ఆయన ఛాతిపై నిలబడి ఆయన్ను లేవకుండా చేశాడు. ఆయన వీపు కింద భగభగలాడే బొగ్గులు చల్లారే వరకు అలాగే అదిమి పట్టారు. ఖబ్బాబ్ ఈ సంఘటన గురించి తర్వాత వివరిస్తూ హజ్రత్ ఉమర్(రజి)కు తన వీపు చూపించారు. వీపంతా కాలిన వాతలతో తెల్లగా పాలిపోయి ఉండడాన్ని ఉమర్ గమనించారు. ఖబ్బాబ్ వృత్తిరీత్యా కమ్మరి. ఆయన ఇస్లామ్ స్వీకరించిన తరువాత ఆయనకు డబ్బు బాకీ ఉన్నవాళ్ళు ఇవ్వడం మానేశారు. ఇస్లామ్‌ను వదిలేస్తేనే ఇవ్వవలసిన డబ్బులు ఇస్తామన్నారు. ఆయన వద్ద పనిచేయించుకుని డబ్బులు ఎగ్గొట్టడం అంటే ఆయన్ను ఆర్థికంగా చితికిపోయేలా చేసి లొంగదీయాలన్న ప్రయత్నం. కాని ఆయన స్థిరంగా నిలబడ్డారు. మీరేం చేసుకున్నా నేను ఇస్లామ్‌ను వదిలేది లేదు పొమ్మన్నారు.

హజ్రత్ బిలాల్(రజి) కూడా ఒక బానిస. ఆయన ఉమయ్యా బిన్ ఖలాఫ్ వద్ద బానిసగా ఉండేవారు. ఆయన ఇస్లామ్ స్వీకరించిన విషయం విని ఆయన యజమాని మిట్ట మధ్యాహ్నం ఎడారిలో మండుతున్న ఇసుకపై ఆయన్ను పడవేశాడు. ఒక పెద్ద బండరాయి ఆయన ఛాతిపై ఉంచాడు. ఇస్లామ్‌ను వదిలేయకపోతే ఇలాగే

చచ్చేవరకు ఉంచుతానని ఉమయ్యా హెచ్చరించాడు. కాని హజ్రత్ బిలాల్ (రజి) ఒకటే సమాధానం ఇచ్చారు. అది, " దేవుడు ఒక్కడే, దేవుడు ఒక్కడే..." ఈ మాటలు విని ఉమయ్యా మరింత రెచ్చిపోయాడు. హజ్రత్ బిలాల్(రజి) మెడకు ఒక తాడు కట్టి. ఆ తాడు ఏవరన ఆకతాయి పిల్లల చేతికి ఇచ్చి వీధుల్లో లాక్కుంటూ తిరగ మన్నాడు. ఒక్కోసారి ఆయన్ను పశువుల తోలులో చాపలా చుట్టేసి హింసించేవారు. ఇంకోసారి మిట్ట మధ్యాహ్నం మండుటెండలో ఉక్కు కవచం తొడిగి కూర్చుండ బెట్టేవారు. చివరకు హజ్రత్ అబూ బక్ర్(రజి) ఆయన్ను మరో బానిసకు బదులుగా కొని ఆయనకు స్వేచ్ఛ ప్రసాదించారు.

కహ్‌తాన్ తెగకు చెందిన అమ్మార్ బిన్ యాసిర్ ఉదంతం కూడా వినండి. అమ్మార్ తండ్రి యాసిర్ తన ఇద్దరు సోదరులతో కలిసి మక్కా నగరానికి ఒకసారి వచ్చాడు. వాళ్ళు తప్పిపోయిన తమ సోదరుడిని వెదకడానికి మక్కా నగరానికి వచ్చారు. యాసిర్ సోదరులు ఇద్దరు తర్వాత మక్కా నుంచి తమ స్వస్థలానికి తిరిగి వెళ్ళిపోయారు. కాని యాసిర్ మాత్రం మక్కాలోనే ఉండిపోయాడు. అక్కడే పెళ్ళి చేసుకున్నాడు. ఆయన కుటుంబం యావత్తు ఇస్లామ్ స్వీకరించింది. తీవ్రమైన హింసాకాండను చవిచూసింది. యాసిర్ కుమారుడు అమ్మార్‌ను వేడి వేడి ఇసుకపై విసిరివేసి స్పృహ తప్పేవరకు చావగొట్టేవారు. యాసిర్ దంపతులను నీటిలో ముంచి ఊపిరాడకుండా చేసేవాళ్ళు. కణకణలాడే బొగ్గులపై పడుకోబెట్టేవారు. ఎన్ని కష్టాలు పడినా వాళ్ళు నమ్మిన ఉద్యమాన్ని వదల్లేదు. ప్రవక్త(స) స్వయంగా వారి వద్దకు వచ్చి ఓదార్చే వారు. కష్టాలు తొలగిపోతాయని, మంచి రోజులు రానున్నాయని చెప్పేవారు. అమ్మార్ తండ్రి యాసిర్ కూడా చివరకు హింసా దౌర్జన్యాలకు బలయ్యాడు. అమ్మార్ ఇస్లామ్ స్వీకరించినప్పుడే సుహైబ్ కూడా ఇస్లామ్ స్వీకరించారు. ఆయన్ను ఖురైషులు ఎంత తీవ్రంగా కొట్టారంటే చివరకు ఆయన మానసిక సమతుల్యాన్ని కోల్పోయారు. ముస్లిములు మక్కాలో దౌర్జన్యాలు భరించలేక మదీనా నగరానికి వలస వెళుతున్నప్పుడు సుహైబ్ కూడా మదీనా బయలుదేరారు. కాని ఖురైషులు ఆయన్ను అడ్డుకుని ఆయన తన సంపద అంతా మక్కాలో వదిలేసి కట్టు బట్టలతో వెళ్ళాలని అన్నారు. సుహైబ్ అలాగే సంపద యావత్తు మక్కాలో వదిలి ఉత్తచేతులతో మదీనా వెళ్ళవలసి వచ్చింది. అబూ ఫకీ జుహాని కూడా ఒక బానిస. ఆయన సఫ్వాన్ బిన్ ఉమయ్యా వద్ద బానిసగా ఉండేవారు. హజ్రత్ బిలాల్ (రజి) ఇస్లామ్ స్వీకరించినప్పుడే ఈయన కూడా ఇస్లామ్ స్వీకరించాడు. ఉమయ్యాకు ఈ విషయం తెలిసింది. అబూ ఫకీ జుహానీ కాళ్ళకు పెద్ద తాడు కట్టి ఎడారి వేడి



ఇసుకలో ఆయన్ను బరబరా ఈడ్చి హింసించాడు. దారిలో ఒక బొద్దింక కనబడితే ఇదా నీ దేవుడు అని పరిహసించాడు.

అబూ ఫకీ జవాబిస్తూ, నా దేవుడు అల్లాహ్ ఆయనే నీకు కూడా దేవుడు అన్నారు. ఇది విని రెచ్చిపోయిన ఉమయ్యా పూర్తి బలంతో అబూ ఫకీ మెడకు కట్టిన తాడు పట్టి లాగాడు. అబూ ఫకీ దాదాపు చనిపోయినంత పనయ్యింది. కాని దేవుడి దయవల్ల ఆయన బతికారు. మరోసారి చాలా బరువైన పెద్ద బండరాయి ఆయన రొమ్ముపై పెట్టాడు. ఆ బరువుకు ఆయన నాలుక బయటకు వచ్చేసింది. ఆయన కాళ్ళకు చేతులకు ఉక్కు సంకెళ్ళు వేసి ఆయన్ను వేడి వేడి ఎడారి ఇసుకపై పారేసేవారు. ఈయన్ను కూడా హజ్రత్ అబూబక్ర్(రజి) కొని స్వేచ్ఛ ఇచ్చారు.

లుబైనా ఒక బానిస అమ్మాయి. హజ్రత్ ఉమర్(రజి) వద్ద బానిసగా ఉండేది. అప్పటికీ హజ్రత్ ఉమర్ ఇస్లామ్ స్వీకరించలేదు. ఇస్లామ్ స్వీకరించక ముందు ఉమర్ ఆమెను చావచితగ్గొట్టేవారు. కొట్టి కొట్టి తాను అలిసిపోయే వరకు కొట్టేవాడు. జుహైరా కూడా ఉమర్ వద్ద బానిసగా ఉన్న అమ్మాయి. ఆమెను కూడా జాలిలేకుండా కొట్టేవారు. అబూ జహల్ ఒకసారి ఆమెను ఎంత నిర్దయగా కొట్టాడంటే ఆమెకు దెబ్బల వల్ల కంటిచూపు పోయింది. హజ్రత్ అబూబక్ర్(రజి) ఆమెను కొని స్వేచ్ఛ ఇచ్చారు. నాహ్‌దియా, ఉమ్మె అబీస్‌లు కూడా బానిస అమ్మాయిలు. వీళ్ళిద్దరు కూడా ఇస్లామ్ స్వీకరించిన తరువాత తీవ్రమైన హింసాకాండకు బలయ్యారు. హజ్రత్ ఉస్మాన్(రజి) మక్కాలో గౌరవ ప్రదమైన మనిషి. ఆయన ఇస్లామ్ స్వీకరించినందుకు ఆయన పినతండ్రి హాకమ్ ఇబ్నుల్ ఆస్ చావగొట్టాడు. హజ్రత్ అబూజర్(రజి) ఇస్లామ్ స్వీకరించిన వెంటనే కాబా గృహానికి వెళ్ళి అందరి ముందు బహిరంగంగా తాను ఇస్లామ్ స్వీకరించానని ప్రకటించారు. అంతే, ఖురైషులు ఆయన్ను చుట్టుముట్టి ముష్టిఘాతాలు కురిపించారు. స్పృహ తప్పి కింద పడిపోయేవరకు ఆయన్ను కొడుతూనే ఉన్నారు. ప్రవక్త (స) పినతండ్రి హజ్రత్ అబ్బాస్(రజి) ఆయన్ను కాపాడారు. కాని హజ్రత్ అబూజర్(రజి) మరుసటి రోజు మళ్ళీ కాబా గృహానికి వెళ్ళారు. మళ్ళీ బహిరంగంగా తాను ఇస్లామ్ స్వీకరించానని ప్రకటించారు. మళ్ళీ ఖురైష్ శత్రుగణం ఆయనపై విరుచుకుపడి భయంకరంగా కొట్టడం ప్రారంభించింది. హజ్రత్ జుబైర్ ఇబ్నుల్ అవ్వామ్ ఇస్లామ్ స్వీకరించినప్పుడు ఆయన పినతండ్రి అతడిని ఒక చాపలో చుట్టి, ఆయన ముక్కు వద్ద పొగపెట్టాడు. ఎంత హింసించినా తాను ఇస్లామ్‌ను వదిలేది లేదని, విగ్రహారాధన చేసేది లేదని హజ్రత్ జుబైర్ ఖచ్చితంగా చెప్పేవారు.

సాద్ ఇబ్నె వఖ్ఖాస్ హజ్రత్ ఉమర్(రజి)కు సోదరుడవుతాడు. సాద్ ఇస్లామ్ స్వీకరించాడని తెలిసి ఉమర్ ఆయన్ను తాళ్ళతో కట్టేశారు. ఆయన్ను అత్యంత క్రూరంగా హింసించారు. తరువాత అబ్దుల్లా ఇబ్నె మసూద్ ఇస్లామ్ స్వీకరించిన తర్వాత కాబా గృహంలో దివ్యఖుర్ఆన్‌ను బిగ్గరగా పఠించారు. ఖురైష్ శత్రుగణం ఆయనపై విరుచుకుపడి అత్యంత క్రూరంగా కొట్టారు. వాళ్ళెంత కొట్టినా ఆయన దివ్యఖుర్ఆన్ పారాయణం ఆపలేదు. చివరకు రక్తమోడే శరీరంతో ఇంటికి తిరిగి వెళ్ళారు. ఉస్మాన్ బిన్ మాజూన్ ఇస్లామ్ స్వీకరించిన తర్వాత ఆయనపై దౌర్జన్యాలు అంతగా జరగలేదు. అందుక్కారణం ఏమంటే ఆయన వలీద్ బిన్ ముగిరా రక్షణలో ఉన్నారు. కాని తన తోటివారు, తనతో పాటు ఇస్లామ్ స్వీకరించినవారు తీవ్రమైన హింసా దౌర్జన్యాలకు గురికావడం, తాను మాత్రం ఒక అవిశ్వాసి రక్షణలో ఉండడం వల్ల క్షేమంగా ఉండడంచూసి ఆయన చాలా సిగ్గుపడ్డారు. అంతే ఆయన వలీద్ బిన్ ముగిరా రక్షణ నుంచి తన్నుతాను పక్కకు తప్పించుకున్నారు. తన రక్షణ బాధ్యత వలీద్ బిన్‌ముగిరాపై ఇక లేదని ప్రకటించారు. వలీద్ రక్షణ ఆయనకు ఇక లేదని తెలిసిన ఖురైషులు ఆయనపై పడి భయంకరంగా కొట్టారు. ఆ దెబ్బలకు ఆయన ఒక కన్ను పూర్తిగా దెబ్బతింది. ఈ విషయం తెలిసి వలీద్ ఆయన వద్దకు వచ్చి నువ్వు గనక నా రక్షణలో ఉంటే ఆ కన్ను పోయేది కాదు గదా అన్నాడు. దానికి ఉస్మాన్ జవాబిస్తూ తాను ప్రస్తుతం అత్యున్నతుడు, వలీద్ కన్నా అత్యంత గౌరవనీయుడు అయిన దేవుని శరణులో ఉన్నానని, కాబట్టి రెండో కన్నుపోయినా కూడా బాధపడే ప్రసక్తి లేదని అన్నారు.

హజ్రత్ ఉమ్మె షారిక్ ఇస్లామ్ స్వీకరించినప్పుడు, ఆమె బంధువులు ఆమెను మండే ఎండలో నిలబెట్టారు. ఆమెకు ఆహారం ఇచ్చి ఆ తర్వాత తాగడానికి మంచినీరు ఇవ్వకుండా వేధించారు. ఈ చిత్రహింస మూడు రోజులపాటు నిరంతరంగా కొనసాగింది. ఇస్లామ్ వదిలేయకపోతే ఇలాగే పడి వుంటావని బెదిరించారు. ఎండదెబ్బకు ఆమె మెదడు మొద్దుబారిన స్థితిలో ఎవరు ఏమి అడుగుతున్నారో కూడా ఆమెకు చాలాసేపు అర్థంకాలేదు. చివరకు అర్థమైన తర్వాత నిక్కచ్చిగా దేవుడు ఒక్కడే, దేవుని తోడు నేను నా విశ్వాసంపై స్థిరంగా ఉన్నాను అని ప్రకటించారు. ఖాలిద్ ఇబ్నుల్ ఆస్ ఇస్లామ్‌ను స్వీకరించిన నేరానికి ఆయన తండ్రి తీవ్రంగా కొట్టాడు. ఆయన తల పగిలిపోయింది. అన్నపానీయాలు లేకుండా మాడ్చడం జరిగింది. ఏదిఏమైనా ఆయన తాను నమ్మిన విశ్వాసాన్ని వదిలేది లేదని బలంగా చెప్పారు.



వీళ్ళేకాదు, హజ్రత్ అబూబక్ర్, తల్హా, వలీద్ బిన్ వలీద్, అయాష్ బిన్ అబీ రాబియా, సల్మా బిన్ హిషామ్ తదితరులు భయంకరమైన హింసాకాండకు గురయ్యారు. ఇస్లామ్ స్వీకరించిన వారిపై ఖురైష్ అవిశ్వాసులు ఎంత ఆటవికంగా, ఎంత అమానుషంగా దౌర్జన్యాలకు దిగేవారో ఎంత క్రూరంగా హింసించేవారో అర్థం చేసుకోవడానికి హజ్రత్ ఉమర్ తన చెల్లెలిని, చెల్లెలి భర్తను ఇస్లామ్ స్వీకరించినందుకు అమానుషంగా చావగొట్టిన ఒక్క సంఘటన చాలు.

ఖురైషులు ఇస్లామ్ స్వీకరించిన వారిని ఎలాంటి హింసలకు గురిచేసేవాళ్ళో తెలుసుకోవడానికి ఇవి కొన్ని ఉదాహరణలు మాత్రమే. ప్రవక్త(స) సందేశం విని ఆయన ఉద్యమంలో చేరిన ప్రతి ఒక్కరికి ఈ అణిచివేతలు, అమానుష హింసాకాండలు తప్పలేదు.

## అబిసీనియాకు వలస

మనిషి ఎన్ని కష్టాలను భరించగలడు? హింసా దౌర్జన్యాలను ఎంతవరకు సహించగలడు? మనిషి అపరిమితంగా కఠిన పరిస్థితులను తట్టుకోవడం సాధ్యం కాదు. ఇస్లామ్ స్వీకరించిన వాళ్ళు తమ సహనాన్ని అప్పటికే చాటిచెప్పారు. పళ్ళ బిగువున బాధలు భరిస్తూ వచ్చారు. మరోవైపు అణిచివేతలు, అఘాయిత్యాలు, హింసోన్మాదం నానాటికి మితిమీరిపోతోంది. ఈ పరిస్థితిని ప్రవక్త(స) గ్రహించారు. తాను ఎంత ఓదార్చినా, ఎంత ఊరడించినా, ఎంత ధైర్యం చెప్పినా తనకున్న గుప్పెడు మంది సహచరుల సహనం నశించిపోయే పరిస్థితి వస్తుందనీ, వాళ్ళు ఇక ఈ కష్టాలను తట్టుకోలేకపోవచ్చని ఆయన గుర్తించారు. మక్కా నేలపై ఇస్లామీయ ఉద్యమం మొలకెత్తినప్పటికీ, మహా వృక్షంగా ఎదిగే సారం అక్కడి నేలలో లేదని తేలిపోయింది. దేవుడు హామీ ఇచ్చిన సహాయం కోసం ప్రవక్త(స) సహచరులు వేయికళ్ళతో ఎదురుచూస్తున్నారు. అయితే ప్రవక్త(స) తొందరపడలేదు. తనకన్నా ముందు ప్రవక్తలకు ఏవిధంగా దైవాదేశాల రూపంలో మార్గదర్శనం లభించిందో అలాంటి మార్గదర్శనం తనకు లభించే వరకు వేచి ఉన్నారు.

అప్పట్లో అబిసీనియా దేశం అరేబియాకు కొద్దిదూరంలో ఉన్న దేశం. అక్కడి పాలకుడు న్యాయప్రియుడని పేరుపడినవాడు. అబిసీనియాను ప్రవక్త(స) సత్యభూమిగా పిలిచేవారు. ముహమ్మద్(స)ను దేవుడు ప్రవక్తగా నియమించి అప్పటికి ఐదేళ్ళు గడిచిపోయాయి. అప్పుడు దేవుడి తరఫు నుంచి దైవాదేశాలు అవతరించాయి.

మక్కా నుంచి వలస వెళ్ళడానికి దేవుడు అనుమతించాడు. ఈ దైవాదేశాలు వచ్చిన తర్వాత హజ్రత్ ఉస్మాన్(రజి) నాయకత్వంలో పదకొండు మంది పురుషులు, నలుగురు స్త్రీలు ఒకరోజు రాత్రి రహస్యంగా ప్రయాణమై అబీసీనియాకు బయలుదేరారు. హజ్రత్ ఉస్మాన్(రజి)తో పాటు ఆయన భార్య హజ్రత్ రుఖయ్యా కూడా ఉన్నారు. హజ్రత్ రుఖయ్యా స్వయంగా ప్రవక్త ముహమ్మద్(స) కుమార్తె. ఈ బృందం మక్కా నగరాన్ని వదిలి అబీసీనియాకు వెళుతున్న విషయం తెలిసి ఖురైషులు వారిని పట్టుకోవడానికి మనుషులను పంపించారు. కాని అప్పటికే ఈ బృందం ప్రయాణిస్తున్న ఓడ రేవును వదిలి సముద్రంలో ప్రయాణమైపోయింది. అయితే ఖురైషులు ఇస్లామ్ స్వీకరించారన్న వార్త ఒకటి ఈ బృందానికి అందింది. ఈ వార్త తెలిసి వారిలో కొందరు ఆనందంగా మక్కాకు తిరిగి ప్రయాణమయ్యారు. కాని మక్కా శివార్లకు రాకముందే వారికి తాము విన్న వార్త వట్టి పుకారు అని తెలిసిపోయింది. అబీసీనియా నుంచి వచ్చిన వారిలో కొందరు రహస్యంగా మక్కాలోకి ప్రవేశించారు. మరికొందరు తమ మద్దతుదారుల శరణు తీసుకొని మక్కాలోకి ప్రవేశించారు. కాని అబీసీనియా నుంచి వీళ్ళు తిరిగి వచ్చిన తర్వాత ఖురైషుల దౌర్జన్యాలు మరింత ఎక్కువయ్యాయి. ఆ తర్వాత 85 మంది ముస్లిములతో కూడిన మరో బృందం అబీసీనియాకు ప్రయాణమైంది. అబీసీనియాలో తాము విశ్వసించిన ధర్మంపై స్వేచ్ఛగా బతకడానికి బయలుదేరి వెళ్ళిపోయారు. వీరు అబీసీనియా రాజు నీగస్ వారిని సాదరంగా ఆహ్వానించాడు. కాని రాజదర్బారులో పూజారులు, ఇతర మతపెద్దలకు ఈ పరిణామం రుచించలేదు. ఈ పూజారులు, మత పెద్దల ద్వారా ఖురైషులు అబీసీనియా రాజు నీగస్‌ను ముస్లిములకు వ్యతిరేకంగా రెచ్చగొట్టడానికి ప్రయత్నించారు. ఖురైషు శత్రుగణం ఒక ప్రతినిధి బృందాన్ని అబీసీనియాకు పంపించింది. ఈ బృందానికి అబ్దుల్లా బిన్ రాబియా నాయకుడు, అమ్ర్ ఇబ్నుల్ ఆస్ కూడా ఈ బృందంలో ఉన్నారు. రాజుకు, దర్బారులో ఇతర రాజప్రముఖులకు అత్యంత ఖరీదైన కానుకలు తీసుకొని ఈ బృందం అబీసీనియాకు చేరుకుంది. రాజదర్బారులో అధికారులకు లంచాలిచ్చి తమ వైపు తిప్పుకుంది. తమ ప్రాంతానికి చెందిన కొందరు దారితప్పిన యువకులు ఒక కొత్త మతాన్ని స్థాపించుకున్నారని, ఈ కొత్త మతం తమ పూర్వీకుల మతానికేకాదు, అబీసీనియా వారి ధర్మానికి కూడా ప్రమాదకరమైనదని వారికి చెప్పారు. రాజుకు తెలియకుండా వారిని అంతం చేయగలిగితే తమ ఉద్దేశ్యం నెరవేరినట్లేనని చెప్పారు. కాని, కోర్టు అధికారులు, పూజారులు, మత పెద్దల మద్దతు తమకు లభించిన తర్వాత ఖురైషులు ఇక రాజును కూడా తమ వైపు తిప్పుకోవచ్చని



భావించారు. వాళ్ళు రాజును కలిసి తాము తెచ్చిన కానుకలు సమర్పించారు. మక్కాలోని పెద్దలు తమను పంపించారని రాజుకు నివేదించారు. మక్కా నుంచి పారిపోయి వచ్చిన వారిని తమతో పంపాలని కోరారు. పూజారులు, మతపెద్దలు వారికి వత్తాసు పలికారు. కాని రాజు ఒప్పుకోలేదు. ఇరుపక్షాల వాదన వినకుండా తాను ఎలాంటి నిర్ణయం తీసుకోలేనని అన్నాడు. మర్నాడు ఇరుపక్షాలను రాజదర్బారుకు పిలువడం జరిగింది. రాజు నీగస్ ముందు తమ వాదన వినిపించడం ఎలాగో వలస వచ్చిన ముస్లిములకు అర్థం కాలేదు. ఎందుకంటే నీగస్ మతం వేరు. ఏది ఏమైనా ప్రవక్త(స) తమకు బోధించిన దానికి వ్యతిరేకంగా ఒక్క పదం కూడా చెప్పరాదని నిర్ణయించుకున్నారు. వాళ్ళు రాజదర్బారుకు చేరుకున్నారు. రాజదర్బారులో రాజుకు సాష్టాంగపడడం అక్కడి ఆచారం. కాని ముస్లిములు సాష్టాంగపడలేదు. దీనిపై దర్బారులో ప్రముఖులు అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ వైఖరిని తప్పుపట్టారు. కాని ముస్లిములు ఏమాత్రం సంకోచించకుండా, ఒక్క దేవునికి తప్ప మరెవ్వరికీ తాము సాష్టాంగపడడం చేయమని, కేవలం మామూలుగా సలామ్ చేస్తామని అన్నారు. చరిత్రలో ఇంత దృఢంగా తమ విశ్వాసానికి కట్టుబడి, తీవ్ర ప్రమాదకరమైన పరిస్థితుల్లో కూడా చలించని శిలాసదృశ్య సంకల్ప బలం మరెక్కడా కనబడదు. ఖురైష్ బృందం రాజుగారికి తమ వాదన వినిపించింది. ఈ ప్రవాసులు మక్కా నగరం నుంచి పారిపోయి వచ్చిన నేరస్తులని, వీళ్ల ఒక కొత్త మతాన్ని ఏర్పరచుకున్నారని, వీళ్ళని తమకు అప్పగించాలని అన్నారు.

రాజు వారితో మీరు అవలంభిస్తున్న మతం ఏమిటి? క్రైస్తవం, విగ్రహారాధనలు కాకుండా కొత్తగా ఎలాంటి మతాన్ని అవలంబిస్తున్నారని అడిగాడు. హజ్రత్ జాఫర్(రజి) ముస్లిమ్ బృందానికి నాయకుడిగా తమ వాదన వినిపించే ముందు ఖురైష్ బృందాన్ని కొన్ని ప్రశ్నలు అడుగుతానని అనుమతించాలని రాజును కోరారు. రాజు అనుమతించిన తర్వాత ఈ విధంగా ప్రశ్నలు జవాబులు నడిచాయి.

హజ్రత్ జాఫర్: మేము ఎవరికైనా బానిసలమా? మా యజమాని నుంచి పారిపోయి వచ్చామా? మమ్మల్ని తీసుకెళ్ళి యజమానికి అప్పగించవలసిన పరిస్థితి ఉందా?

అమ్ర్ ఇబ్నుల్ ఆస్: లేదు. వీళ్ళు మక్కాలో గౌరవనీయులైన స్వతంత్ర్య వ్యక్తులు.

హజ్రత్ జాఫర్: మేము ఎవరినైనా హత్య చేసి పారిపోయి వచ్చామా? అలాగైతే హతుడి కుటుంబ సభ్యులకు మమ్మల్ని అప్పగించవలసి వుంటుంది.

అమ్ర్ బిన్ ఆస్ : అబ్బే వీళ్ళు అసలు ఒక్క చుక్క రక్తం కూడా ఎవరిదీ కళ్ళ

చూడలేదు.

హజ్రత్ జాఫర్ : మేము ఎవరి సంపదనైనా దోపిడీ చేశామా? అలా అయితే అతడికి ఆ సంపద స్వాధీనం చేయవలసి ఉంటుంది.

అమ్ర్ బిన్ ఆస్ : లేదు లేదు వీళ్ళు ఎవరికి ఒక్క రూపాయి కూడా ఇవ్వవలసిన అవసరంలేదు. ఈ విధంగా నైతికంగా తమ స్థాయిని హజ్రత్ జాఫర్ నిరూపించారు. ఆ తర్వాత ముస్లిముల ప్రతినిధిగా ఆయన తన వాదన ఇలా వినిపించారు.

మహారాజా, మేము ఒక అజ్ఞాన జాతిగా బ్రతికే ప్రజ. విగ్రహాలను పూజించే వాళ్ళం. పశువుల మృత కళేబరాలను తినేవాళ్ళం. తోటి వారిని అణిచివేసేవాళ్ళం. అన్నదమ్ములు కొట్లాడుకునేవాళ్ళం. బలవంతుడు బలహీనుడిని కొట్టి తినేవాడు. అలాంటి మా మధ్య ఒక మనిషి ఆవిర్భవించాడు. ఆయన మంచితనం, నిజాయితీ, విశ్వసనీయత అన్నీ మా అందరికీ బాగా తెలుసు. ఆయన మమ్మల్ని ఇస్లామ్ వైపునకు ఆహ్వానించాడు. విగ్రహారాధన మానేయాలని బోధించాడు. సత్యం పలకాలని, రక్తపాతానికి దూరంగా ఉండాలని బోధించాడు. అనాథల ఆస్తి కాజేయరాదని, పొరుగువారితో మంచిగా ఉండాలని, దానధర్మాలు చేయాలని చెప్పాడు. మేము ఆయన్ను విశ్వసించాము. మా చెడ్డ అలవాట్లను మానుకున్నాము. కాని ఇలా చేసినందుకు మా జాతి ప్రజలు మా పట్ల శత్రువులయ్యారు. మా ప్రాణాలు తీయాలని ప్రయత్నిస్తున్నారు. అందుకే మా ప్రాణాలు కాపాడుకోవడానికి, మా మత విశ్వాసాన్ని కాపాడుకోవడానికి ఇక్కడికి పారిపోయి వచ్చాము. మా జాతి ప్రజలు మా దేశంలో మమ్మల్ని ప్రశాంతంగా బతకనిస్తే ఇక్కడికి పారిపోయి వచ్చే అవసరమే ఉండేది కాదు అని ముగించారు.

నిర్మోహమాటంగా, నిక్కచ్చిగా, క్లుప్తంగా సాగిన ఈ ప్రసంగం విని నీగస్ చాలా ప్రభావితుడయ్యాడు. మీ ప్రవక్త(స)కు అవతరించిన దివ్యగ్రంథం నుంచి కొంత భాగం చదివి వినిపించండని హజ్రత్ జాఫర్‌ను కోరాడు. హజ్రత్ జాఫర్ మర్యమ్ సూరా నుంచి కొన్ని వాక్యాలు వినిపించారు. ఈ వాక్యాలు విని నీగస్ కళ్ళలో అశ్రుధారలు కురిశాయి. అసంకల్పితంగా అతని పెదాలు ఇలా పలికాయి. దేవుని తోడు, ఈ వాక్యాలు, బైబిల్ రెండూ కూడా ఒకే దీపకాంతులు అన్నాడు. అంతేకాదు, ఇంకా ఇలా అన్నాడు, ప్రవక్త ఏసు(అలై) ఏ ప్రవక్త రాక గురించి చెప్పారో ఆ ప్రవక్త ఖచ్చితంగా ప్రవక్త ముహమ్మద్(స), దేవునికి కృతజ్ఞతలు ఈ



ప్రవక్త(స) నా జీవితకాలంలో జన్మించారు అన్నాడు.

అంతేకాదు ముస్లిమ్ ప్రవాసులను తిప్పి పంపించడం జరగదని తన నిర్ణయాన్ని ప్రకటించాడు. ఆ విధంగా రాజదర్బారులో ఖురైషుల ఎత్తుగడలు బెడిసికొట్టాయి. అయితే ఖురైషులు అంత తేలిగ్గా వదిలిపెట్టదలచలేదు. పరస్పరం సంప్రదించుకున్న తర్వాత మరో ప్రయత్నం చేయాలనుకున్నారు. నీగస్ రాజు క్రైస్తవుడు. కాబట్టి రాజదర్బారులో ఏసు గురించి ముస్లిముల అభిప్రాయం ప్రకటించేలా చేస్తే, నీగస్ క్రైస్తవుడు కాబట్టి ఖచ్చితంగా ఆయన ఆగ్రహిస్తాడు, ముస్లిములను తమకు అప్పగిస్తాడని భావించారు. మర్నాడు మళ్ళీ ముస్లిములను దర్బారుకు పిలువడం జరిగింది. ఏసు ప్రవక్త గురించి ప్రశ్న వారి ముందుకు వచ్చింది. తాము ఉన్నది ఉన్నట్లు చెబితే రాజు ఆగ్రహించి తమకు ఖురైషులకు అప్పగించడం ఖాయమని వాళ్ళు కూడా అనుకున్నారు. ఏమైనా గాని సత్యమే పలకాలని భావించారు. హజ్రత్ జాఫర్ మరోసారి రాజు నీగస్ ముందుకు వచ్చి ఇలా అన్నారు–

మా ప్రవక్త(స) మాకు చెప్పారు. ఏసు ఒక దేవుని దాసుడు, దేవుని వాక్కు అన్నారు. నీగస్ తక్షణం నేలపై నుంచి ఒక గడ్డిపరక తీసి నువ్వు చెప్పిన మాటలకన్నా ఏసు ఈ గడ్డిపరక పాటి ఎక్కువ కాదు, తక్కువ కాదు అన్నాడు. దర్బారులో అధికారులు, రాజ ప్రముఖులు, పూజారులు ఖురైషులకు మద్దతుగా నిలబడా లనుకున్నారు. కాని నీగస్ ఎవరినీ లెక్కచేయలేదు. ఖురైషులు తెచ్చిన కానుకలు తిరిగి ఇచ్చేయాలని ఆదేశించాడు. ఆవిధంగా అబిసీనియాలో ఖురైషుల ప్రయత్నాలు ఫలించలేదు.

## ఉమర్ ఇస్లామ్ స్వీకరణ

హజ్రత్ ఉమర్(రజి) ఇస్లామ్ స్వీకరించడానికి ముందు ఎలా ఉన్నారు, ఆ తర్వాత ఎలా మారారన్నది చాలా ఆసక్తికరమైన అంశం. ఇస్లామ్ స్వీకరించిన వారిపై ఖురైషులు ఎంత క్రూరంగా హింసా దౌర్జన్యాలకు పాల్పడేవారన్నది తెలుసు కోవడానికి స్వీకరణకు ముందు హజ్రత్ ఉమర్ ఇస్లామ్ వ్యవహారశైలి చూస్తే చాలు స్పష్టంగా అర్థమవుతుంది. అయితే ఇక్కడ గమనించవలసిన విషయమేమంటే, హజ్రత్ ఉమర్(రజి) ఇస్లామ్ స్వీకరణకు ముందు తమ సాంఘిక వ్యవస్థను కాపాడడానికి శాయశక్తులా ప్రయత్నించారు. తర్వాత ఇస్లామ్‌లోని ఔచిత్యాన్ని గ్రహించి ఇస్లామ్ స్వీకరించి, ఇస్లామ్ ఔన్నత్యం కోసం శ్రమించారు. ఆయన ఎన్నడూ తన స్వంత

ప్రయోజనాల కోసం, స్వార్థం కోసం ఏదీ చేయలేదు. ఆయన తాను నమ్మినదే చేశాడు. తాను నమ్మిన సిద్ధాంతం కోసం వందశాతం అంకితభావాన్ని చూపించారు. ఇస్లామీయ ఉద్యమం అంకురించినప్పుడు ఆయన 27 సంవత్సరాల యువకుడు. ఇస్లామ్ నెమ్మదిగా ఆయన ఇంటిలోకి కూడా ప్రవేశించింది. ఉమర్ బావ సయీద్ అప్పటికే ఇస్లామ్ స్వీకరించారు. సయీద్ భార్య ఫాతిమా అంటే, ఉమర్ చెల్లెలు కూడా ఇస్లామ్ స్వీకరించింది. ఆ కుటుంబంలో పలుకుబడి ఉన్న సభ్యుడు నుయీమ్ బిన్ అబ్దుల్లా కూడా ఇస్లామ్ పట్ల అనుకూలంగా ప్రతిస్పందించారు. మొదట ఉమర్‌కు ఈ పరిణామాలు ఏవీ తెలియవు. కాని తన వాళ్ళు తాతముత్తాతల మతాన్ని వదిలి కొత్త మతం స్వీకరించారని తెలియగానే ఆయన ఆగ్రహం ఆకాశాన్నంటింది. ఇంతకుముందు మనం ఉమర్ తన వద్ద బానిస అమ్మాయి లుబైనాను ఎంత నిర్దయగా కొట్టాడో తెలుసుకున్నాము. ఆగ్రహంతో ఊగిపోయిన ఉమర్ అసలు ఈ సమస్యను సమూలంగా పెకిలించి వేయాలని నిర్ణయించుకున్నాడు. అంటే ప్రవక్త ముహమ్మద్(స)ను హతమార్చాలని భావించాడు. అంతే కత్తి చేతపట్టుకుని బయలు దేరాడు. ప్రవక్త ముహమ్మద్(స)ను హతమార్చాలన్న గట్టి నిర్ణయంతో బయలుదేరాడు. దారిలో ఆయనకు నూయిమ్ బిన్ అబ్దుల్లా కనిపించారు. ఉమర్ ఆయనతో తాను ఏం చేయబోతున్నాడో చెప్పాడు. ఇది విన్న నూయిమ్ ముందు మీ ఇంటి సంగతి చూసుకోవయ్యా అని ఉమర్‌కి సలహా ఇచ్చాడు. విషయం తెలుసుకున్న ఉమర్ వెంటనే తన చెల్లెలి ఇంటికి బయలుదేరాడు. ఉమర్ వెళ్ళినప్పుడు చెల్లెలు ఫాతిమా దివ్యఖుర్ఆన్ పారాయణం చేస్తోంది. అన్నగారు వస్తున్న అడుగుల చప్పుడు వినగానే ఆమె పారాయణం ఆపేసి, ఖుర్ఆన్ సూక్తులు రాసి ఉన్న కాగితాలను దాచేసింది. ఉమర్ ఆమెతో ఏం చదువుతున్నావ్ అని అడిగారు. ఆమె జవాబు చెప్పకుండా దాటవేయాలని చూసింది. ఉమర్ ఆగ్రహంతో చెల్లెలిని చూస్తూ, నువ్వు నీ భర్త మన తాతముత్తాతల మతాన్ని వదిలేశారని తెలిసింది అన్నాడు. ఈ మాటలు అంటూ బావగారిపై దాడిచేసి కొట్టడం ప్రారంభించాడు. అడ్డు వచ్చిన చెల్లెలిని కూడా చావగొట్టాడు. ఎంతగా కొట్టాడంటే వాళ్ళిద్దరు రక్తమోడుతున్నా జాలిపడలేదు. రక్తమోడుతున్న చెల్లెలు ఫాతిమా అన్నగారితో ఉమర్ నువ్వు నీ ఇష్టం వచ్చినట్లు చేసుకో. నువ్వేం చేసినా మేం ఇస్లామ్‌ను వదిలేయడం జరగదు అని నిక్కచ్చిగా పలికింది. దెబ్బలతో శరీరమంతా రక్తమోడుతున్న ఒక స్త్రీ, అదీ తన స్వంత చెల్లెలు ఎంత బాధపడుతున్నా పట్టించుకోకుండా తన దృఢసంకల్పాన్ని ప్రకటించడం చూసి ఉమర్ ఆశ్చర్యపోయాడు. ఆయన పాషాణ హృదయం కొద్దిగా కరిగింది. నువ్వు



చదువుతున్నదేమిటో నాకు కూడా చదివి వినిపించు అని చెల్లెలిని అడిగాడు. ఆమె దివ్యఖుర్ఆన్ వాక్యాలు రాసుకున్న కాగితాలు తీసుకొచ్చి చదవడం ప్రారంభించింది. ఈ వాక్యాలు వింటున్న ఉమర్ అపరిమితంగా ప్రభావితుడయ్యాడు. దైవం, దైవప్రవక్త పట్ల మీ విశ్వాసాన్ని ప్రకటించండి అన్న వాక్యాన్ని చెల్లెలు ఫాతిమా చదవగానే హజ్రత్ ఉమర్ పూర్తిగా మారిపోయాడు. నేను ప్రకటిస్తున్నాను. అల్లాహ్ తప్ప మరో దేవుడు లేడు. ముహమ్మద్(స) దేవుని ప్రవక్త అని ప్రకటిస్తున్నాను అన్నారు. ఆ విధంగా ఇస్లామ్ గురించి తెలుసుకుని ఆకర్షితుడైన ఉమర్ అక్కడి నుంచి తిన్నగా అర్ఖామ్ ఇంటికివెళ్ళారు. అర్ఖామ్ ఇల్లు ఇస్లామ్ కార్యకలాపాలకు కేంద్రంగా ఉండేది. అక్కడ ప్రవక్త (స) గారి చేతుల మీదుగా ప్రతిజ్ఞ చేశారు. హజ్రత్ ఉమర్ ఇస్లామ్ స్వీకరణతో ముస్లిముల ఆత్మవిశ్వాసం రెట్టింపయ్యింది.

ఇక్కడ ముఖ్యంగా గమనించవలసిన వాస్తవమేమంటే హజ్రత్ ఉమర్ (రజి) ఇస్లామ్‌ను వ్యతిరేకించినంత కాలం చాలా నిజాయితీగా ఇస్లామ్‌ను ఎదిరించారు. తాను నమ్మిన తాతముత్తాతల ధర్మానికి నిజాయితీగా కట్టుబడ్డారు. కాని ఆయన ఇస్లామ్‌లో సత్యాన్ని అర్థం చేసుకుని స్వీకరించిన తర్వాత అంతే నిజాయితిగా ఇస్లామ్ కోసం తన్ను తాను అర్పించుకున్నారు. అలాంటి దృఢమైన వ్యక్తిత్వం ఉన్న మనిషి ఇస్లామ్ స్వీకరించిన సంఘటన ఇస్లామీయ చరిత్రలో ఒక మైలురాయి వంటిది. ఆయన ఇస్లామ్ స్వీకరించడానికి పైకి కనబడే కారణం ఆయన చెల్లెలితోను, బావతోను జరిగిన వాగ్యుద్ధంగా అగుపిస్తున్నప్పటికీ నిజానికి ఆయనలో మార్పు రావడానికి అంతకు ముందు జరిగిన అనేక సంఘటనలు కూడా కారణమయ్యాయి. మక్కాలో జరుగుతున్న సంఘటనలను ఆయన చూస్తూ వచ్చారు. ఆయన హృదయాన్ని కదిలించి వేసిన, కలచివేసిన సంఘటనలు అనేకం జరిగాయి. ఇస్లామీయ ఉద్యమం అనుదినం సాధిస్తున్న ప్రగతి గురించి ఆయనకు వార్తలు అందుతూ ఉండేవి. ప్రవక్త ముహమ్మద్ (స), ఆయన అనుచరుల వ్యక్తిత్వం, వారి గుణగణాల గురించి ఆయనకు తెలుసు. ప్రవక్త (స)ను వ్యతిరేకించేవారి హీనమైన ప్రయత్నాలు, కుట్రలు, కుతంత్రాల గురించి కూడా ఆయనకు తెలుసు. ఆ కాలంలో ఈ విషయమై మక్కాలో చర్చలు జరుగుతూ ఉండేవి కూడా. ఆ చర్చల ప్రభావం కూడా ఆయనపై పడింది. ఈ కారణాలే కాకుండా కొన్ని ప్రత్యేక సంఘటనలు కూడా ఆయన్ను తీవ్రంగా ప్రభావితం చేశాయి. అలాంటి సంఘటనల్లో ఒకటి అబీ హాష్మా కుమార్తె ఉమ్మె అబ్దుల్లా అబిసీనియా వలస వెళ్ళడానికి సంబంధించినది. వలసపోతున్న ప్రవాసులతో కలిసి ఉమ్మె అబ్దుల్లా కూడా వలస పోవడానికి సిద్ధమైనప్పుడు హజ్రత్

ఉమర్ (రజి) ఆమెను చూడ్డానికి అక్కడికి వెళ్ళారు. మక్కా వదిలి వెళ్ళవద్దని ఆమెకు నచ్చచెప్పే ప్రయత్నం చేశారు. కాని మక్కాలో దౌర్జన్యాలు, అణచివేతలు ఇక భరించే స్థాయిలో లేవని, తాను మక్కా వదిలి పోవడం తప్పదని ఆమె జవాబిచ్చారు. ఆమె వలస వెళ్ళిపోవడానికి సిద్ధపడడం చూసి హజ్రత్ ఉమర్ (రజి) చాలా చలించి పోయారు. ఆయన ఎంతగా కదిలిపోయారంటే, ఆయన్ను చూసిన వారు అయ్యో అనుకున్నారు. ఈ కదిలించివేసిన సంఘటన కూడా హజ్రత్ ఉమర్ (రజి) ఇస్లామ్ స్వీకరణకు దారితీసిన సంఘటనల్లో ఒకటి.

హజ్రత్ ఉమర్ (రజి) ఇస్లామ్ స్వీకరించిన సమయం కూడా ఇక్కడ గమనించ దగ్గది. అప్పట్లో ఇస్లామ్ శత్రువులు అత్యంత తీవ్రంగా ఇస్లామ్‌ను అణిచివేయడానికి ప్రయత్నిస్తున్నారు. ఇస్లామ్‌ను అడ్డుకునే ప్రయత్నాలు తారాస్థాయిలో జరుగుతున్న సమయం అది. ఈ నేపథ్యంలో హజ్రత్ ఉమర్ (రజ) ఇస్లామ్ స్వీకరణ మక్కాను ఒక్క కుదుపు కుదిపింది. హజ్రత్ ఉమర్ (రజ) ఇస్లామ్ స్వీకరించిన తక్షణం మక్కాలో ఇస్లామ్ శత్రు శక్తులను బహిరంగంగా సవాలు చేశారు. జమీల్ బిన్ మమార్ జమ్హి ద్వారా తాను ఇస్లామ్ స్వీకరించిన విషయాన్ని అందరికీ తెలిసేలా చేశారు. జమీల్ బిన్ మమార్ కాబా ద్వారం వద్దకు వెళ్ళి ఎలుగెత్తి హజ్రత్ ఉమర్ (రజి) ఒక సహాబీగా మారిపోయారని చెప్పాడు. ఆ వెనుకనే వస్తున్న హజ్రత్ ఉమర్ (రజి) ఆ మాటలను సరిచేస్తూ తాను ముస్లిమ్‌నయ్యానని అన్నారు. దేవుడు ఒక్కడేనని, ముహమ్మద్ (స) ఆయన ప్రవక్త అని ప్రకటించారు. అక్కడున్న ఖురైషులు ఈ మాటలు విని ఆగ్రహోదగ్రులయ్యారు. మూకుమ్మడిగా ఆయనపై దాడి చేసి కొట్టసాగారు. ఆస్ బిన్ వాయిల్ సహ్మీ ఆయన్ను కాపాడ్డానికి ముందుకు వచ్చి, హజ్రత్ ఉమర్ (రజి)ను తన రక్షణలోకి తీసుకున్నారు. అక్కడి నుంచి హజ్రత్ ఉమర్ (రజి) తిన్నగా అబూజహల్ ఇంటికి వెళ్ళి తలుపు తట్టారు. అబూజహల్ బయటకు రాగానే తాను ముస్లిమ్‌నయ్యానని చెప్పారు. ఆ మాటలు విన్న అబూజహల్ కోపంగా తలుపేసుకుంటూ "నిన్ను, నువ్వు తెచ్చిన వార్తను దేవుడు శపించుగాక" అన్నాడు. అక్కడి నుంచి హజ్రత్ ఉమర్ (రజి) మళ్ళీ కాబాగృహానికి వెళ్ళారు. అక్కడ బహిరంగంగా తోటి ముస్లిములతో కలిసి నమాజు చేశారు. అంతకు ముందు ముస్లిములెవ్వరు కాబాగృహంలో బహిరంగంగా నమాజు చేయడానికి సాహసించ లేదు. తమ నమాజులు రహస్యంగా చేసుకునేవారు. హజ్రత్ ఉమర్ (రజి) నిర్భయంగా అక్కడే నమాజు చేశారు. ఇది చూసి మరోసారి ఖురైషులు రెచ్చిపోయి ఆయనపై విరుచుకు పడ్డారు. కాని హజ్రత్ ఉమర్ (రజి) తీసుకున్న చొరవ, సాహసం వల్ల



ముస్లిములు కాబాగృహంలో బహిరంగంగా నమాజు చేసే మార్గం సుగమమయ్యింది.

ఆ విధంగా ముస్లిములపై అణిచివేతలు, దౌర్జన్యాలు ఎంతగా తీవ్రమవుతు న్నాయో అంత వేగంగానే ఇస్లామ్ వ్యాపించింది. ఇస్లామ్ శత్రు శిబిరం నుంచి ముఖ్యమైన వ్యక్తులు ఇస్లామ్‌లోకి రాసాగారు. ఈ సందర్భంగా హజ్రత్ హమ్‌జా (రజి) ఇస్లామ్ స్వీకరణ ఎంతయినా గమనించదగ్గది. హజ్రత్ హమ్‌జా (రజి) ప్రవక్త ముహమ్మద్ (స)కు పినతండ్రి. చాలా తెలివైనవారు. మహాసాహసి. పలుకుబడి కలిగినవారు. ప్రవక్త ముహమ్మద్ (స) బోధిస్తున్న ఇస్లామ్ ధర్మంలోకి ఆయన మారకపోయినా ఆయనకు ప్రవక్త ముహమ్మద్ (స) అంటే చాలా ప్రేమాభిమానాలు ఉండేవి. ప్రవక్త ముహమ్మద్ (స) కన్నా ఆయన రెండు లేదా మూడేళ్ళు వయసులో పెద్దవారు. అంతకన్నా వయోభేదం కూడా లేదు. బాబాయి అబ్బాయిల కన్నా వాళ్ళిద్దరు చిన్నప్పటి నుంచి మంచి మిత్రులుగా ఉన్నారు. ఒకసారి సఫా కొండ వద్ద అబూజహల్ ప్రవక్త ముహమ్మద్ (స)పై దాడి చేసి ఆయన్ను దూషించాడు. అబూ జహల్ దుర్భాషలను ప్రవక్త (స) సహనంతో విన్నారు. ఎలాంటి జవాబు ఇవ్వలేదు. కాని అబూజహల్ దురాగతాన్ని అబ్దుల్లా బిన్ జుదాన్‌కు చెందిన బానిసపిల్ల చూసింది. ఈ వార్తను హజ్రత్ హంజా (రజి)కు నివేదించింది. అప్పుడు హజ్రత్ హమ్‌జా (రజి) వేట నుంచి వెనుదిరిగి వస్తున్నారు. ఆయన భుజానికి విల్లంబులు వేలాడుతున్నాయి. ఆయన్ను కలిసిన బానిసపిల్ల ఆయనతో "మీ అబ్బాయిని ఎంతలేసి మాటలన్నాడో తెలుసా" అంటూ మొత్తం చెప్పింది. హజ్రత్ హంజా (రజి) రక్తం మరిగింది. అలాగే ఆయన అబూజహల్ వద్దకు వెళ్ళారు. అబూజహల్ ఇంకా కొంతమందితో సమావేశమై ఉన్నాడు. హజ్రత్ హంజా (రజి) తన విల్లుతో అబూ జహల్ తలపై బలంగా కొట్టి, "నువ్వు ముహమ్మద్‌ను దూషించావా? ఇప్పుడు నేను కూడా ముహమ్మద్ చెప్పే ధర్మాన్ని విశ్వసిస్తున్నాను. ఆయన చెప్పే మాటలే నేను అంటున్నాను." అన్నారు. ఇది విని బనీ మఖ్జూమ్ తెగకు చెందిన ఒక వ్యక్తి లేచి అబూజహల్‌కు మద్దతీయబోయాడు, కాని అబూహమ్‌జా (రజి) వాడికి ఆ అవకాశం ఇవ్వలేదు. అబూజహల్ దుర్భాషలను సమర్థించవద్దని ఖరాఖండిగా చెప్పారు. హజ్రత్ హమ్‌జా (రజి) ఇస్లామ్ స్వీకరణతో ఇస్లామ్ మరింత బలోపేతమయ్యింది.

## సంఘ బహిష్కరణ

. ఇస్లామ్ విస్తరణను అడ్డుకునే ప్రతి ప్రయత్నం బెడిసికొట్టసాగింది. ప్రవక్త ముహమ్మద్ (స)కు అబూతాలిబ్ ఇచ్చిన రక్షణ తొలగించడానికి చేసిన ప్రయత్నాలు

కూడా ఫలించలేదు. ఖురైషులు ఒక కొత్త కుట్రకు పూనుకున్నారు. బనూ హాషిం తెగ మొత్తాన్ని బహిష్కరించాలని నిర్ణయించారు. బనూ హాషిం తెగ ప్రవక్త ముహమ్మద్ (స)ను తమకు అప్పగించి, ఆయన్ను హతమార్చే అనుమతి ఇవ్వనంత వరకు వారితో ఎవరూ సంబంధాలు పెట్టుకోరాదని, వారికి ఎలాంటి నిత్యావసర వస్తువులు అందరాదని, వారితో ఎలాంటి లావాదేవీలు జరపరాదని బహిష్కరణ విధించారు. ప్రవక్త ముహమ్మద్ (స) సత్యసందేశ ప్రచారం ప్రారంభించిన ఏడవ సంవత్సరంలో ఖురైష్‌లకు చెందిన తెగలన్నీ ఈ బహిష్కరణ విధించాలన్న నిర్ణయానికి వచ్చాయి. బనూ హాషిం తెగను వెలివేశాయి. ఈ బహిష్కరణ అత్యంత కఠినమైనది. అందువల్ల బనూ హాషిం తెగ మొత్తం తమ ప్రాంతాన్ని వదిలి షాబె అబీ తాలిబ్ ప్రాంతానికి తరలిపోవలసి వచ్చింది. అక్కడ కూడా బహిష్కరణ వల్ల వారికి ఎలాంటి నిత్యవసర వస్తువులు అందే పరిస్థితి లేదు. ప్రవక్త సత్యసందేశ ప్రచారం కోసం మొత్తం తెగ ఈ కఠినమైన పరిస్థితిని ఎదుర్కుంది. ఈ బహిష్కరణ మూడు సంవత్సరాలు కొనసాగింది. దుర్భరమైన పరిస్థితులను ప్రవక్త ముహమ్మద్ (స) తదితరులు ఎదుర్కోవలసి వచ్చింది. ఆహార పదార్థాలు అందుబాటులో లేనందువల్ల ఆకులు అలములు తినవలసి వచ్చింది. ఎండిపోయిన పశుచర్మాలను ఉడకబెట్టి తాగేవారు. పసిపిల్లలు ఆకలితో బిగ్గరగా రోదించేవారు. ఆ రోదనలు ఖురైషులకు కూడా వినబడేవి. కాని వారి రాక్షసహృదయాలు ఈ రోదనలను విని ఆనందించేవి. ఈ పరిస్థితిని చూడలేక ఒకసారి హాకిమ్ బిన్ హాజమ్ రహస్యంగా కొన్ని గోధుమలను వారికి పంపించాడు. కాని గట్టి నిఘా ఉండడం వల్ల ఆ గోధుమలను అబూజహల్ పట్టుకున్నాడు. గోధుమలను లాక్కోవాలని ప్రయత్నించాడు. యాధృచ్ఛికంగా అక్కడే ఉన్న అబుల్ బుఖ్తారీ ఇది చూసి కల్పించుకోవడమే కాదు, గోధుమలు బనూ హాషిం తెగకు అందేలా చేశారు. అలాగే హిషామ్ బిన్ అమ్ర్ కూడా రహస్యంగా నిత్యావసర వస్తువులు కొన్ని అందజేసేవారు. చివరకు హిషామ్ బిన్ అమ్ర్ చొరవ తీసుకుని ఈ బహిష్కరణ అంతమయ్యేలా చేశారు. అత్యంత దారుణంగా బహిష్కరణ విధించ డాన్ని చాలా మంది చూడలేకపోయారు. చాలా మంది బహిష్కరణ ఎత్తేయాలని హిషామ్ బిన్ అమ్ర్ చేసిన ప్రయత్నానికి మద్దతిచ్చారు. హిషామ్ బిన్ అమ్ర్ ఈ బహిష్కరణను సవాలు చేశాడు. అబూజహల్ మాత్రం బహిష్కరణ కొనసాగాల్సిందే నన్నాడు. హిషామ్ బిన్ అమ్ర్‌ను సమర్థించేవారి సంఖ్య ఎక్కువగా ఉండడం వల్ల, అబూజహల్‌కు ఇష్టం లేకపోయినా చివరకు బహిష్కరణ రద్దయ్యింది. బహిష్కరణ పత్రాన్ని కాబాగృహం ద్వారం నుంచి తొలగించడానికి వాళ్ళు వెళ్ళి చూస్తే ఆ



పత్రాన్ని పూర్తిగా చెద తినేసింది. కేవలం "దేవుని పేరుతో" అన్న అక్షరాలు మాత్రమే మిగిలి ఉన్నాయి.

ముహమ్మద్ (స) ప్రవక్తగా నియమించబడి సత్యసందేశ ప్రచారం ప్రారంభించిన పదవ సంవత్సరం విషాద సంవత్సరంగా గడిచింది. పినతండ్రి అబూతాలిబ్ ఆ సంవత్సరం మరణించారు. ఖురైషుల తీవ్ర విద్వేషాన్ని, వైరాన్ని తట్టుకునే కంచు కోటలా అబూతాలిబ్ ప్రవక్త (స)కు మద్దతిచ్చారు. అలాంటి పినతండ్రి మరణంతో ప్రవక్త (స) శత్రుసమూహం మధ్యలో ఒంటరివారయ్యారు. అదే సంవత్సరం కష్టనష్టాలలో ఆయనకు వెన్నంటి అండగా నిలిచిన భార్య హజ్రత్ ఖదీజా (రజి) మరణించారు. హజ్రత్ ఖదీజా (రజి) ఇచ్చిన నైతికమద్దతు, ఆమె సలహా సూచనలు ప్రవక్త (స)కు వెయ్యేనుగుల బలంగా ఉండేవి. అత్యంత క్లిష్ట సమయాల్లో ఆమె వద్దనే ఆయనకు ఊరట లభించేది. ప్రవక్త (స)తో వివాహానికి ముందు ఆమె విదేశాలతో వాణిజ్యం నిర్వహించేవారు. ప్రవక్త (స) ఆ వాణిజ్య వ్యవహారాలు చూసే వారు. వివాహం తర్వాత ప్రవక్త (స) సత్యసందేశ ఉద్యమానికి ఆమె సంపూర్ణ మద్దతిచ్చారు. ఉద్యమానికి ఆర్థికంగాను, నైతికంగాను అండగా ఉన్నారు. ఇస్లామీయ ఉద్యమానికి అవసరమైనప్పుడు ఆమె తన సర్వసంపదలను ఇస్లామ్ కోసం ధారపోశారు. పేదరికాన్ని సంతోషంగా స్వీకరించి నిరుపేదగా బతికారు. అలాంటి భార్య మరణంతో ఆయన కుటుంబ జీవనం చిన్నాభిన్నమైంది. పినతండ్రి మరణంతో సమాజంలో ఒంటరి వారయ్యారు.

తనకు అత్యంత ఆప్తులైన ఈ ఇద్దరి మరణంతో ప్రవక్త (స) ఎలాంటి విషాదా నికి గురై ఉంటారో ఊహించవచ్చు. అదే సమయంలో ఒంటరివారైన ప్రవక్త (స)పై ఖురైషుల విద్వేషం మరింతగా బుసలు కొట్టింది. అత్యంత హీనమైన పద్ధతుల్లో ప్రవక్త (స)ను పరాభవించడానికి పూనుకున్నారు. అల్లరిపిల్లలను రెచ్చగొట్టి ప్రవక్త (స)ను అనుసరించి, ఈలలు, చప్పట్లతో, వెర్రికేకలతో ఆయన్ను వేధించేలా చేశారు. ఆయన వెళ్తున్నప్పుడు ఆయనపై దుమ్ముధూళి గుమ్మరించేవారు. ఆయన ఇంటి గుమ్మం ముందు ముళ్ళకంపలు పరిచేవారు. ఒక్కోసారి ఆయనపై పడి ఊపిరాడకుండా అదిమేసేవారు. చాలా సందర్భాల్లో బహిరంగంగానే ఆయనపై భౌతికదాడులు జరిగాయి. దుర్భాషలతో ఆయన్ను కించపరిచేవారు. ఆయన ముఖంపై దుమ్ముధూళి విసిరికొట్టేవారు. కొందరు ఆయనపై ఉమ్మేసేవారు. ఒక సందర్భంలో అబూలహబ్ భార్య ఉమ్మె జమీల్ ప్రవక్త (స)ను చంపాలన్న దురుద్దేశ్యంతో వచ్చింది. కాని ప్రవక్త (స) ఆమెకు కనిపించలేదు. దాంతో వెర్రెత్తి హజ్రత్ అబూబకర్ (రజి)

ముందు ప్రవక్త (స)ను ఉద్దేశించి పరుషపదాలతో నిందించింది. ఖురైషులు ఎవరి పేరునన్నా మార్చి పలకడాన్ని తీవ్ర పరాభవంగా భావిస్తారు. ఆమె ప్రవక్త ముహమ్మద్ (స) పేరు మార్చి ముజమ్మమ్‌గా సంబోధిస్తు "నేను ముజమ్మమ్ మాట వినడం లేదు. ముజమ్మమ్ మతాన్ని తీవ్రంగా ద్వేషిస్తున్నా" అని చెప్పింది. కాని ప్రవక్త (స) ఈ దుర్భాషల గురించి తెలిసినప్పుడు ఆయన ప్రశాంతంగా ఆమె దుర్భాషలను తాను పట్టించుకోవడం లేదని, ఆమె ఎవరో ముజమ్మమ్‌ను ఉద్దేశించి ఆ మాటలు చెప్పింది, నా పేరు ముహమ్మద్ అన్నారు. అబూజహల్ కూడా ప్రవక్త (స)ను హతమారుస్తానని ప్రతిజ్ఞ చేశాడు. ఒక పెద్ద బండరాయితో చంపుతానన్నాడు. కాని ప్రవక్త (స) ఎదుటపడినప్పుడు చేష్టలుడిగి ఏమీ చేయలేకపోయాడు.

ఒకసారి ఒక పెద్ద గుంపు ప్రవక్త (స)పై దాడికి దిగింది. అత్యంత తీవ్రంగా ఆయనపై దాడి జరిగింది. ఈ సంఘటన ఎలా జరిగిందంటే, ఒకసారి ఖురైషులు కొందరు ప్రవక్త (స) గురించి మాట్లాడుకుంటూ, ఆయన చెప్పే మాటలు, ఆయన కార్యకలాపాలు భరించరానివిగా తయారవుతున్నాయని, ఎలాగైనా అడ్డుకోవాలని అనుకుంటున్నారు. అప్పుడే ప్రవక్త (స) అటువైపుగా వెళ్ళడం తటస్థించింది. వాళ్ళంతా కలిసి ప్రవక్త (స)ను చుట్టుముట్టి ఆయన చెప్పిన మాటల గురించి ప్రశ్నించసాగారు. ప్రవక్త (స) తనకు సహజమైన నైతిక స్థయిర్యాన్ని ప్రదర్శిస్తూ ఆ మాటలన్నీ తాను చెప్పానని అన్నారు. ఆ వెంటనే రెచ్చిపోయిన ఆ గుంపు ఆయనపై విరుచుకుపడింది. ఆయన్ను తీవ్రంగా గాయపరిచింది. గుంపు అలసిపోయి ఆయన్ను వదిలిన తర్వాత, తీవ్ర గాయాలపాలయిన ప్రవక్త (స) నిర్భయంగా వారిని హెచ్చరిస్తూ "మీరంతా తీవ్ర పరిణామానికి గురి కాబోతున్నారన్న సందేశం నేను మీ కోసం తెచ్చాను" అన్నారు. అంటే వారి దౌర్జన్యాలకు ఫలితం తప్పదని హెచ్చరించారు.

హజ్రత్ ఉస్మాన్ (రజి) ఒక సంఘటనను వివరించారు. అకాబా బిన్ ముకీత్, అబూ జహల్, ఉమయ్యా బిన్ ఖలఫ్‌లు కాబాగృహం లోపల కూర్చుని ప్రవక్త (స) అటుగా వెళ్ళినప్పుడల్లా ఆయన్ను దుర్భాషలాడేవారు. ఇలా మూడుసార్లు జరిగిన తర్వాత ప్రవక్త (స) ఆగ్రహంగా "దేవుని తోడు, దేవుని అభిశాపం వచ్చి పడే వరకు మీరు మీ పద్ధతులు మార్చుకోరు." అన్నారు. అక్కడున్న వారంతా ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు. భయంతో వణికిపోయారు. ఆ తర్వాత ప్రవక్త (స) ఇంటికి వెళ్ళిపోయారు. ఆయనతో పాటు హజ్రత్ ఉస్మాన్ (రజి) తదితరులు కూడా అనుసరించారు. దారిలో ప్రవక్త (స) ఇలా చెప్పారు. "మీ అందరికి శుభవార్త... దేవుడు తన ధర్మానికి తప్పక విజయం ప్రసాదిస్తాడు. దైవసందేశాన్ని విస్తరిస్తాడు. ధార్మిక



విశ్వాసానికి సహాయ పడతాడు. మీరు చూస్తున్న ఇలాంటి వాళ్ళు త్వరలోనే మీ చేతుల్లో ముక్కలవుతారు"

ప్రవక్త (స) అత్యంత దుర్భరమైన పరిస్థితుల్లో చెప్పిన మాటలివి. ఈ మాటలను పరిశీలిస్తే ప్రవక్త (స) ధైర్యసాహసాలు ఏ స్థాయిలో ఉండేవో, ఆయన ఎంత విశ్వాసంగా చెప్పారో అర్థం అవుతుంది. అంతేకాదు కేవలం స్వల్ప సమయంలోనే ఈ మాటలు అక్షరసత్యాలయ్యాయి.

ఒకరోజు ప్రవక్త (స) ప్రాత: కాలాన్నే లేచి నగర పర్యటనకు బయలుదేరారు. ప్రతి వీధి, ప్రతి సందు తిరిగారు. తన సందేశాన్ని అందరికి ప్రకటిస్తూ వెళ్ళారు. కాని ఏ ఒక్కరు ఆయన మాట వినలేదు. ఎవరూ ఆయనతో మాట్లాడలేదు. ప్రవక్త ముహమ్మద్ (స) ఉద్యమాన్ని అణచడానికి అన్ని విధాల ప్రయత్నించి, చివరకు హింసాత్మక పద్ధతులు కూడా అవలంబించి విఫలమైన ఖురైషులు ఇక ప్రవక్త ముహమ్మద్ (స)ను పట్టించుకోరాదని నిర్ణయించారు. కాబట్టి ప్రవక్త (స)ను చూసిన వెంటనే ప్రతిఒక్కడు ముఖం తిప్పుకుని గబగబ వెళ్ళిపోసాగాడు. కొందరు అల్లరి మూకలు ఆయన్ను అపహసిస్తూ కించపరుస్తూ తిరగసాగారు. ప్రవక్త (స) బరువైన హృదయంతో ఇంటికి మళ్ళారు. ఈ సంఘటన తర్వాత ప్రవక్త (స) మక్కా పట్ల చాలా నిరాశ చెందారు. ఇక్కడ జ్ఞానజ్యోతులేవీ ప్రకాశించే అవకాశం లేని దట్టమైన చీకటి అలుముకుందని అనుకున్నారు. అందువల్ల ప్రవక్త (స) మక్కా పరిసర ప్రాంతాలకు వెళ్ళి సత్యసందేశ ప్రచారం చేయాలని అనుకున్నారు. అలా ప్రవక్త (స) ఎన్నుకున్న మొదటి ప్రాంతం తాయిఫ్. ఆ ప్రాంతం సస్యశ్యామలమైంది. పండ్ల తోటలు, పచ్చని పొలాలతో కళకళలాడుతుంది. అక్కడ ప్రజలు సుఖసంతోషాలతో సౌభాగ్యవంతమైన జీవితం గడుపుతున్నారు. కాబట్టి ప్రవక్త (స) తనతో పాటు జైద్ బిన్ హారిసాను వెంటబెట్టుకుని కాలినడకన తాయిఫ్ బయలుదేరారు. దారిపొడవునా ఆయన ధర్మప్రచారం చేస్తూ వెళ్ళారు. తాయిఫ్ చేరుకున్న తర్వాత అక్కడ సాఖీఫ్ తెగ నాయకులను కలిశారు. వారు ముగ్గురు సోదరులు. అబ్ద్ యాలీల్, మసూద్, హబీబ్‌లు. వారితో కలిసి ప్రవక్త (స) తన ఉద్యమం గురించి, సత్యసందేశం గురించి వివరించారు. తన ఉద్యమంలో వారి సహకారాన్ని కోరారు. తన సందేశాన్ని స్వీకరించమని చెప్పారు. కాని ఆ ముగ్గురు సోదరుల ప్రతిస్పందన విషపుబాణాల మాదిరిగా ఆయన్ను తాకింది.

అందులో ఒకడు "నిజంగా దేవుడు నిన్ను పంపి ఉంటే దేవుడు కాబాగృహం పై వస్త్రం చిరిగిపోవాలని కోరుకున్నట్లే" అన్నాడు.

రెండవ వాడు "దేవుడు తన ప్రవక్తగా నీ కన్నా మెరుగైన వ్యక్తిని ఎన్నుకోలేక పోయాడా?" అని పరిహసించాడు.

మూడవవాడు "దేవుని తోడు, నీతో నేను మాట్లాడను. నీవు చెప్పినట్లు నువ్వు దేవుని ప్రవక్తవే అయితే నీతో మాట్లాడడం అమర్యాద అవుతుంది. ఒకవేళ నువ్వు ప్రవక్తవని అబద్ధాలు చెబుతున్నట్లయితే నువ్వు మాట్లాడదగిన వ్యక్తివి కాదు." అన్నాడు.

ఈ సమాధానాలు ప్రవక్త (స)ను తీవ్ర ఆగ్రహానికి గురిచేశాయి. కాని ఆయన తన కోపాన్ని అదుపు చేసుకుంటూ తనతో చెప్పిన మాటలు ఇతరులకు చెప్పవద్దని అన్నారు. కాని ఆ ముగ్గురు మూర్ఖులు అంతటితో ఊరుకోలేదు. అల్లరిమూకలను రెచ్చగొట్టారు. తమ నౌకర్లను, బానిసలను ఆయనపై ఉసిగొల్పారు. ప్రవక్త (స)ను పట్టణం బయటకు తరిమికొట్టమని ఆదేశించారు. అల్లరిశక్తులు రెచ్చిపోయాయి. వాళ్ళు ప్రవక్త (స)ను దుర్భాషలాడుతూ ఆయనపై రాళ్ళు రువ్వడం ప్రారంభించారు. ఆయన కాళ్ళపై రాళ్ళు విసరసాగారు. దుర్భాషలతో నిందించసాగారు. ప్రవక్త (స) శరీరం రాతిదెబ్బలకు రక్తం ఓడసాగింది. ఆయన నడవడానికి కూడా ఓపికలేక కూర్చుండిపోయారు. వాళ్ళు ఆయన్ను పట్టుకుని లేపి మరలా రాళ్ళు విసిరికొట్టారు. ఆయన కాళ్ళు, పాదరక్షలు రక్తంతో తడిసిపోయాయి. ఈ తమాషా చూడ్డానికి జనం గుంపులు గుంపులుగా పోగయ్యారు. ఆ గుంపు ఆయన్ను ఉత్బా, షైబాల తోట వరకు తరుముతూ వచ్చారు. ఉత్బా షైబాలు రబియా కుమారులు. ఆ తోటలోకి చేరుకున్న తర్వాత ప్రవక్త (స) ఒక ద్రాక్షతీగ ఆసరాగా పట్టుకుని ప్రార్థనలు చేసి దేవుని ఇలా వేడుకున్నారు.

"ఓ దైవమా! నేను వీరి వద్దకు ఒంటరిగా వచ్చాను. నిస్సహాయంగా, ఎలాంటి వనరులు లేకుండా వచ్చాను. నీవు కరుణామయుల్లో కెల్లా కరుణామయుడివి. నిస్సహాయులకు, బలహీనులకు నీవే పోషకుడివి. నా పట్ల తీవ్రద్వేషంతో ఉన్న అజ్ఞాత శత్రువుకు అప్పగించినా లేక నా వ్యవహారాలపై ఆధిపత్యం ఉన్న శత్రువుకు అప్పగించినా నీవే నా ప్రభువువి. నీ అభిశాపం నాపై లేకుంటే వీటన్నింటినీ నేను లక్ష్యపెట్టను. నీ రక్షణ నాకు అత్యుత్తమ రక్షణ. నీ ఆగ్రహం, నీ అభిశాపాల నుంచి నేను నీ శరణు కోరుతున్నాను. నీ శరణు సమస్త అంధకారాన్ని దూరం చేస్తుంది. అన్ని ప్రాపంచిక వ్యవహారాలను చక్కబెడుతుంది. నేను నీ అభీష్టాన్ని, నీ ప్రసన్నతను కోరుతున్నాను. నీ నుంచి తప్ప మరెక్కడి నుంచి ఎలాంటి శక్తి, బలమూ లభించదు"

ఈ లోగా ఈ తోట యజమానులు, వారు జరిగిన సంఘటనంతా చూశారు, వారు ఆ తోటకు చేరుకున్నారు. తమ క్రయిస్తవ బానిస అద్దాస్‌కు ఇచ్చి ప్రవక్త (స) 



కోసం కొన్ని ద్రాక్షపండ్లు పంపించారు. అద్దాస్ ఆ ద్రాక్షలను ప్రవక్త (స)కు సమర్పించాడు. ప్రవక్త (స) వాటిని "దేవుని పేరుతో" అంటూ స్వీకరించారు. అద్దాస్ ప్రవక్త (స) ముందు కూర్చుని నగర ప్రజలకు ఆయన బోధించిన మతధర్మం గురించి చెప్పమన్నాడు. ప్రవక్త (స) అతడితో నీ స్వస్థలం ఏది? నీ ధర్మం ఏమిటి? అని ప్రశ్నించారు. అతను జవాబిస్తూ తాను నైనెవాకు చెందినవాడినని, క్రయిస్తవుడినని జవాబిచ్చాడు. ప్రవక్త (స) అతనితో "నీవు మత్తా కుమారుడు యూనుస్ ప్రవక్త (అస)కు చెందిన పవిత్రమైన నగరానికి చెందినవాడివి." అన్నారు. అద్దాస్ ఆశ్చర్యంగా మత్తా కుమారుడు యూనుస్ ప్రవక్త గురించి మీకెలా తెలుసని ప్రశ్నించాడు. ప్రవక్త (స) జవాబిస్తూ "ఆయన నా సోదరుడు. ఆయన ఒక ప్రవక్త. నేను కూడా ప్రవక్తను" అన్నారు. ఇది వినగానే అద్దాస్ ప్రవక్త (స) పాదాలను కళ్ళకు అద్దుకున్నాడు. అతను తిరిగి వచ్చిన తర్వాత అతడి యజమానులు మతధర్మాన్ని కించపరిచాడని ఆగ్రహించారు. అద్దాస్ వారికి జవాబిస్తూ "దీని కన్నా ఈ ప్రపంచంలో ఉత్తమమైనది లేదు. ఆయన నాతో చెప్పిన విషయం ఒక ప్రవక్తకు తప్ప మరెవ్వరికి తెలిసే అవకాశం లేదు." అన్నాడు.

తాయిఫ్ నుంచి ప్రవక్త (స) నఖ్లాకు చేరుకున్నారు. అక్కడ కొంత సమయం ఉన్నారు. అక్కడి నుంచి హీరా గుహకు చేరుకున్నారు. అక్కడి నుంచి ముతీమ్ బిన్ అదికి సమాచారం పంపి అతడి రక్షణ కోరారు. అరబ్బు సంప్రదాయం ప్రకారం రక్షణ కోరినవాడు శత్రువు అయినా సరే తిరస్కరించడానికి వీలు లేదు. కాబట్టి ముతీమ్ వెంటనే తన కుమారులను ఆయుధాలతో వెళ్ళి ప్రవక్త (స)ను కాబా గృహానికి తీసుకురావలసిందిగా ఆదేశించాడు. ఆ వెంటనే అతను ఒక ఒంటెపై ఎక్కి తాను ప్రవక్త (స)కు రక్షణ ఇచ్చినట్లు ప్రకటన చేశాడు.

ప్రవక్త (స) అధిక రక్తస్రావం వల్ల తెలివితప్పి పడిపోయినప్పుడు ఆయన్ను జైద్ బిన్ హారిసా తన భుజాలపై ఎత్తుకుని తీసుకువచ్చారు. దారిలో ఆయన ప్రవక్త (స)తో తాయిఫ్ ప్రజలను శపించమని కోరారు. ప్రవక్త (స) జవాబిస్తూ, నేనెందుకు వారిని శపించాలి. వారు ఇప్పుడు ఇస్లామ్ స్వీకరించకపోయినా వారి తర్వాతి తరాలు తప్పక ఇస్లామ్ స్వీకరిస్తాయి అన్నారు.

తాయిఫ్‌లో ఎదురైన దుర్ఘటన అత్యంత దుర్భరమైనది. శారీరకంగాను, మానసికంగాను ఆయన చిత్రహింసను అనుభవించారు. ఇలాంటి పరిస్థితుల్లోనే సాధారణంగా ప్రవక్త (స)కు దైవిక సహాయం లభించేది. దివ్యఖుర్ఆన్ ఈ సందర్భంగా ఇలా పేర్కొంది

**"వారిపై ఆపదలు, ఎనలేని వ్యధలు విరుచుకుపడ్డాయి. వారు కుదిపివేయబడ్డారు. చివరకు అప్పటి ప్రవక్త, విశ్వాసులైన అతని అనుచరులు "అల్లాహ్ సహాయం ఇంకా ఎప్పుడొస్తుంది" అని ఆక్రోశించారు. అప్పుడు, "అదిగో అల్లాహ్ సహాయం సమీపంలోనే ఉంది"(అని వారిని ఓదార్చడం జరిగింది)"**

***(దివ్యఖుర్ఆన్ 2 : 214)***

## స్వర్గారోహణ

తాయిఫ్‌కు బదులుగా దేవుడు ప్రవక్త (స)కు స్వర్గారోహణ సౌభాగ్యం ప్రసాదించాడు. ప్రవక్త (స)ను దేవుడు తన సమక్షానికి పిలుచుకున్నాడు. అక్కడ వాస్తవాలను, యదార్ధాలను తన కళ్ళతో చూసే అవకాశాన్ని కల్పించాడు. స్వర్గారోహణ ఉదంతాన్ని దివ్యఖుర్ఆన్‌లో స్పష్టంగా ప్రస్తావించడం జరిగింది. ఈ వివరణలను బట్టి మనకు  తెలిసేదేమంటే "సత్యం అరుదెంచింది.. అసత్యం అంతరించింది" అని ఆయనకు తెలియజేయడం జరిగింది. ప్రవక్త (స) మక్కా నగరాన్ని వదిలి వెళ్ళే పరిస్థితి రావచ్చు కాని, ఆయన శత్రువులు కూడా అక్కడ ప్రశాంతంగా  ఎక్కువ కాలం ఉండలేరని కూడా ఆయనకు స్పష్టం చేయడం జరిగింది. అంతేకాదు ఆయనకు వలస వెళ్ళే ప్రార్ధనను కూడా నేర్పడం జరిగింది. అది ఈ విధంగా ఉంది. "ఓ ప్రభూ! నన్ను ప్రస్తుత దశ నుంచి సత్యద్వారం ద్వారా బయటకు తీయి. నేను సత్యద్వారం నుంచి ప్రవేశించేలా చేయి. నీ సమక్షం నుంచి నీ సహాయాన్ని, నీ అధికారాన్ని నాకు ప్రసాదించు." అని వేడుకున్నారు.  వలస తర్వాతి కాలం ప్రాబల్యం వహించే కాలమని, అధికారం పొందే కాలమని ఈ భవిష్యవాణిలో సూచనప్రాయంగా తెలియజేయడం కూడా కనబడుతుంది. అంతేకాదు, ఇస్లామీయ రాజ్యానికి సంబంధించిన మౌలిక సూత్రాలను కూడా ఇక్కడ తెలియజేయడం జరిగింది. ఈ మౌలిక సూత్రాల పునాదులపై కొత్త సమాజాన్ని, కొత్త  సంస్కృతిని  నిర్మించాల్సి ఉంది. అయితే అధికారం పొందిన తర్వాత ఇస్రాయీలీల మాదిరిగా దారి తప్పరాదన్న హెచ్చరిక కూడా ఇక్కడ కనబడుతుంది. దివ్యఖుర్ఆన్‌లోని రెండవ సూరాలో ఇవన్నీ కనబడతాయి.

తాయిఫ్ సంఘటనకు, మదీనా వలసపోవడానికి మధ్య అతి ముఖ్యమైన సంఘటన స్వర్గారోహణ. ఈ సంఘటన గురించి తెలిసిన తర్వాత మక్కాలో సంచలనం చెలరేగింది. ప్రవక్త (స) బహిరంగంగా ఈ సంఘటన గురించి ప్రజలకు ప్రకటించారు. అంతేకాదు తాను చూసిన దృశ్యాలను వివరించారు. జెరుసలేం



వెళ్ళడానికి సంబంధించి ఖచ్చితమైన ఆధారాలను కూడా తెలియజేశారు. ఆ తర్వాత ఆయన చెప్పిన మాటలన్నీ నిజమని రూఢి అయ్యాయి.

మక్కా ప్రజల పట్ల నిరాశ చెందిన ప్రవక్త (స)కు తాయిఫ్ మరింత నిరాశ కలిగించింది. ఆ పరిస్థితుల్లో మదీనా నుంచి వచ్చిన వార్తలు ఉత్సాహాన్నిచ్చాయి. మదీనా ఇస్లామీయ ఉద్యమానికి కేంద్రంగా మారడానికి సిద్ధంగా ఉందని, ఇస్లామ్ ప్రవక్త (స)కు ప్రధాన వేదికగా మారడానికి సిద్ధంగా ఉందని తెలిసింది. ముహమ్మద్ (స) ప్రవక్తగా నియమించబడిన పదకొండవ సంవత్సరం మదీనా నుంచి ఆరుగురు సభ్యుల ప్రతినిధి బృందం వచ్చింది. ప్రవక్త (స)ను కలిసిన ఈ ప్రతినిధి బృందం ప్రవక్త (స)కు మద్దతుగా ఉంటామని ప్రతిజ్ఞ చేసింది. మరుసటి సంవత్సరం పన్నెండు మంది ప్రతినిధుల బృందం ఆయన్ను కలిసి విస్తృతంగా చర్చలు జరిపి, తాము ప్రవక్త (స)తో ఉంటామని ప్రతిజ్ఞ చేసింది. ఈ ప్రతిజ్ఞ ఇస్లామీయ చరిత్రలో అకాబా ప్రతిజ్ఞగా ప్రసిద్ధి పొందింది. ఆ తర్వాత హజ్‌యాత్ర సందర్భంగా మరో పెద్ద ప్రతినిధి బృందం వచ్చి ప్రవక్త (స)ను రహస్యంగా రాత్రిపూట కలుసుకుని చర్చలు జరిపింది. ఈ చర్చల్లో ఒక పూర్తి స్థాయి రాజకీయ ఒప్పందం కుదిరింది. మదీనా ప్రజలు ఇస్లామ్ కోసం అవసరమైతే యావత్తు ప్రపంచంతో శత్రుత్వానికి సిద్ధం అంటూ ప్రతిజ్ఞ చేసారు. ఇది రెండవ అకాబా ప్రతిజ్ఞగా పేరుపడింది. మదీనా ప్రజలు ఆ తర్వాత అన్సారులుగా పిలువబడ్డారు.

## మక్కాకు వీడ్కోలు

మక్కాలో వ్యతిరేకత, అణిచివేత, దౌర్జన్యాలు నానాటికి మితిమీరిపోతున్న పరిస్థితుల్లో స్వర్గారోహణ వంటి అసాధారణ, మహోన్నత సంఘటన చోటుచేసుకోవడంతో ప్రవక్త (స)కు ఈయన అనుచరులకు కొత్త బలం లభించింది. ఆ తర్వాత మదీనా నుంచి వచ్చిన ప్రతినిధి బృందాల ప్రతిజ్ఞ కొత్త ఉత్సాహాన్నిచ్చింది. మక్కాలో పరిస్థితి భరించరానిదిగా తయారైంది. ఇస్లామీయ ఉద్యమానికి కేంద్రంగా నిలబడే గౌరవాన్ని మక్కా ప్రజలు కోల్పోయారు, ఆ గౌరవం ఇప్పుడు మదీనా నగరానికి దక్కింది. మక్కా కోల్పోయిందేమిటో, మదీనా పొందిన ప్రయోజనమేమిటో తర్వాత స్పష్టంగా అర్ధమయ్యింది. ఈ మధ్యకాలంలో దివ్యఖుర్ఆన్ ఆదేశాలు అవతరించాయి. వలసపోయే అనుమతిని సూచనప్రాయంగా అందించే దివ్యవాణి అవతరించింది. అయితే ప్రవక్త (స) స్పష్టమైన దైవాదేశాల కోసం ఎదురుచూస్తూ మక్కాలోనే ' ఉన్నారు. కాని తన అనుచరులకు మదీనా వలసపోయే అనుమతి ఇచ్చారు. ఈ అనుమతి తర్వాత చాలా మంది అనుచరులు మదీనా వలసవెళ్ళారు.

అతి కొద్ది సమయంలోనే మక్కా నగరంలో చాలా ప్రాంతాలు ఖాళీ అయిపోయాయి. ఒకసారి అబూజహల్ మరికొందరితో పాటు మక్కాలోని బనూజష్ తెగ నివాసాలున్న ప్రాంతం నుంచి నడిచి వెళుతూ ఖాళీ అయిపోయిన ఇళ్ళను చూసి విచారంగా "మన సోదరుడు సాధించిందేమిటి? సమాజాన్ని చిన్నాభిన్నం చేశాడు. మన సమైక్యతను ధ్వంసం చేశాడు. మన మధ్య చిచ్చుపెట్టాడని" వ్యాఖ్యానించాడు.

మక్కాలో ముస్లిములు ఎవరూ మిగల్లేదు. దాదాపు అందరూ మదీనా వలస వెళ్ళిపోయారు. ఖురైషులు బలవంతంగా నిర్బంధించిన ముస్లిములు, చిత్రహింసలు అనుభవిస్తున్న వారు తప్ప మరెవ్వరు మిగల్లేదు. ముస్లిములకు మదీనాలో ఆశ్రయం లభించిందని, ఒకరి తర్వాత ఒకరు అక్కడికి చేరుకుంటున్నారని ఖురైషులు గ్రహించారు. త్వరలో ప్రవక్త (స) కూడా తమ పట్టుకు దూరంగా మదీనా వెళ్ళిపోతారని, అక్కడ బలం కూడదీసుకుని, సైన్యాలు సమీకరించి తమపై బదులు తీర్చుకుంటారని భయపడ్డారు. కాబట్టి వారు దారుల్ నద్వా అనబడే సమావేశమందిరంలో కూర్చుని సమాలోచనలు జరిపారు. ప్రవక్త (స) విషయంలో ఏం చేయాలని తర్జనభర్జనలు పడ్డారు. చాలా ప్రతిపాదనలు వచ్చాయి. కాని దేనిపైనా ఏకాభిప్రాయం కుదరలేదు. ఒక ప్రతిపాదన ప్రకారం ప్రవక్త (స)ను గృహనిర్బంధంలో ఉంచాలి. ఆ ఇంటికి బలమైన ఇనుప తలుపులు బిగించాలి. కాని అలా చేసినా ఆయన స్వరం ఇంటి బయటకు వినబడుతుంది కాబట్టి ఆయన అనుచరులు బలం కూడదీసుకుని దాడి చేసి ఆయన్ను విడిపించుకు వెళతారని ఆ ప్రతిపాదన తిరస్కరించారు. మరో ప్రతిపాదన ఆయన్ను వెలివేయాలని, ఆయన బహిష్కరించబడి సమాజానికి బయట ఏం చేసినా ఎవరు పట్టించుకోరాదన్నది. కాని ఆయన మృదుమధుర సంభాషణలు ఇతరులపై ప్రభావం వేస్తాయి కాబట్టి ఆయన అనుచరుల సంఖ్య ఇంకా పెరుగుతుందని, వారి వల్ల చివరకు ప్రమాదం తప్పదని ఆ ప్రతిపాదనను కూడా తిరస్కరించారు. చివరకు అబూజహల్ ఒక ప్రతిపాదన చేశాడు. ప్రతితెగ నుంచి బలమైన యువకులను ఎన్నుకోవాలని, వారంతా ఖడ్గాలు ధరించి ఒక్కుమ్మడిగా ప్రవక్త (స)పై దాడి చేయాలని, ఆవిధంగా చేస్తే ఆయనపై దాడి బాధ్యత అన్ని తెగలపై పడుతుంది కాబట్టి ప్రవక్త (స) తెగవారు ప్రతీకారం తీర్చుకోవాలంటే అన్ని తెగలపై దాడికి దిగాల్సి వస్తుందని, వారు ప్రతీకారం తీర్చుకునే పరిస్థితి ఉండదని అన్నాడు. ఈ ప్రతిపాదన అందరికీ నచ్చింది. ఈ ప్రతిపాదనను ఆమోదిస్తూ తీర్మానం చేసుకుని ఆ సమావేశాన్ని ముగించారు. ఈ సమావేశం గురించి దివ్యఖుర్ఆన్ క్రింది విధంగా వ్యాఖ్యానించింది.



> **"ఆ సమయం కూడా జ్ఞాపకం తెచ్చుకో దగ్గదే ; అప్పుడు సత్య తిరస్కారులు నీకు వ్యతిరేకంగా పన్నాగాలు పన్నుతూ ఉన్నారు, నిన్ను నిర్బంధించాలని లేదా నిన్ను హత్య చెయ్యాలని లేదా నిన్ను దేశం నుండి బహిష్కరించాలని. వారు తమ ఎత్తులు తాము వేస్తూ ఉన్నారు. అల్లాహ్ తన ఎత్తు తాను వేస్తూ ఉన్నాడు. అల్లాహ్ అందరి కంటే బాగా ఎత్తులు వేస్తాడు."**
>
> ***(దివ్యఖుర్ఆన్ 8 : 30)***

మక్కాలో మిగిలిన ముస్లిముల్లో ప్రవక్త (స)కు అతిసన్నిహిత అనుచరుల్లో అబూబకర్ (రజి), హజ్రత్ అలీ (రజి) ముఖ్యులు. మదీనా వలస వెళ్ళమని స్పష్టమైన దైవాదేశాలు రాగానే ప్రవక్త (స) హజ్రత్ అబూబక్ర్ (రజి) ఇంటికి వెళ్ళారు. మదీనా వెళ్ళే అనుమతి లభించిందని రహస్యంగా ఆయనకు తెలియజేశారు. తాను కూడా వెంట రావడానికి అనుమతి ఇవ్వాలని అబూబక్ర్ (రజి) కోరారు. ప్రవక్త (స) అంగీకరించడంతో అబూబక్ర్ (రజి) ఎంత సంతోషించారంటే ఆయన కళ్ళల్లో ఆనందభాష్పాలు కనిపించాయి. అప్పటికే హజ్రత్ అబూబక్ర్ (రజి) ఈ ప్రయాణానికి రెండు ఆడ ఒంటెలను సిద్ధం చేసి ఉంచారు. వాటికి రోజు పుష్టిగా మేత పెడుతూ ప్రయాణానికి తట్టుకునేలా పోషిస్తున్నారు. ఆ రెండు ఒంటెల్లో ఏదో ఒక ఒంటె కానుకగా తీసుకోవాలని ప్రవక్త (స)ను కోరారు. కాని ప్రవక్త (స) కానుకగా కాదు, ఒక ఒంటెను కొంటానని అన్నారు. ఒక ఒంటెను ఎన్నుకుని దానికి వెల చెల్లించారు. ఆ ఆడ ఒంటె పేరు జదా. దైవాదేశాలకనుగుణంగా ప్రవక్త (స) ఆ రాత్రి తన ఇంట నిద్రించలేదు. తన పడకపై ఎలాంటి భయం లేకుండా నిద్రించాలని హజ్రత్ అలీ (రజి)ను కోరారు. విచిత్రమేమంటే మక్కా ప్రజలు చాలా మంది తమ వస్తువులు, సంపద దాచి పెట్టమని ప్రవక్త (స) వద్దనే ఉంచేవారు. ఆయా వస్తువులు, సంపద ఎవరెవరివో హజ్రత్ అలీ (రజి)కు వివరించి వాటన్నింటిని ఎవరివి వారికి అప్పగించాలని ఆదేశించారు. ఈ పని ముగించుకుని ఆయన అబూబక్ర్ (రజి) ఇంటికి వచ్చారు. ఆయన కుమార్తె అస్మా తన నడుంకు కట్టుకున్న దట్టీని చింపి ఒక చివర కొంత ఆహారాన్ని కట్టారు. మరో చివర నీటితిత్తిని కట్టి ఇచ్చారు. ఆ రాత్రి చీకటిలో వారిద్దరు మదీనావైపు ప్రయాణమై వెళ్ళిపోయారు.

ఆ విధంగా మానవాళికి మహోపకారి ఆ రోజు మక్కాను వదలి వెళ్ళే పరిస్థితి వచ్చింది. చిన్నప్పటి నుంచి తాను తిరిగిన వీధులను, ప్రాంతాలను వదిలి ఆయన మదీనా వైపు తరలిపోయారు. ఆ నగరాన్ని ఆయన అమితంగా ప్రేమించారు. అక్కడనే ఆయన తన సత్యసందేశాన్ని ప్రకటించారు. ఫలితంగా తీవ్ర అణిచివేతను,

దౌర్జన్యాలను భరించారు. తాను అనేకసార్లు సాష్టాంగపడిన తన ప్రజల సంక్షేమం కోసం ప్రార్థించిన ఆధ్యాత్మిక కేంద్రాన్ని వదిలి ఆయన వెళ్ళిపోతున్నారు. దైవాభీష్టం అలా ఉంది. ఆయన చేపట్టిన ఉద్యమానికి ఈ త్యాగం అవసరం. ఆయన దైవాభీష్టానికి తలవంచి సంతోషంగా మక్కానగరాన్ని వదిలి మదీనావైపు అడుగులేశారు. మక్కాను వదిలే ముందు ఆయన ఒకసారి కాబాగృహాన్ని చూశారు. "దేవుని తోడు, దేవుని దృష్టిలో అత్యంత పవిత్రమైన ప్రదేశం నువ్వే. నేను తప్పనిసరిగా వెళ్ళే పరిస్థితి లేకపోతే ఎన్నటికి నిన్ను వదిలి వెళ్ళేవాడిని కాదు" అన్నారు.

దారి చూపడానికి అబ్దుల్లా బిన్ ఉరైఖత్‌ను నియమించుకున్నారు. అయితే ఏ వైపుగా వెళ్ళాలన్నది ప్రవక్త (స) స్వయంగా నిర్ణయించారు. ఈ ప్రయాణీకులు సౌర్ గుహలో మూడు రోజులు తలదాచుకున్నారు. అబూబక్ర్ (రజి) కుమారులు అబ్దులా బిన్ అబూబక్ర్ రోజు అక్కడికి తన మేకలు మేపడానికి తీసుకొచ్చేవారు. రాత్రి చీకటిలో ప్రవక్త (స) తదితరులు ఆ మేకల పాలను తీసుకునేవారు.

ప్రవక్త (స)పై దాడి చేయడానికి ఆ రోజు రాత్రంతా శత్రువులు ఇంటి బయట కాపువేసి ఉన్నారు. కాని ప్రవక్త (స) వెళ్ళిపోయారని తెలిసి అక్కడ ఉన్న హజ్రత్ అలీపై తమ కోపం వెళ్ళగ్రక్కి అక్కడి నుంచి వెళ్ళిపోయారు. ఆ వెంటనే ఖురైషులు ప్రవక్త (స)ను వెంటాడడానికి బృందాలను పంపించారు. ప్రవక్త (స)ను నిర్బంధించిన వారికి 100 ఒంటెల బహుమానం ప్రకటించారు. ప్రవక్తను కాని, ఆయన అనుచరుడిని కాని సజీవంగా లేదా నిర్జీవంగా పట్టుకున్న వారికి 100 ఒంటెల బహుమతి. ఈ బహుమతి కోసం ఆశపడి చాలా మంది ప్రవక్త (స)ను వెంటాడుతూ బయలుదేరారు. ఇలా వెంబడించిన బృందాల్లో ఒకటి సౌర్ గుహ వరకు చేరుకుంది. ఆ బృందం గుహ ముఖద్వారం వరకు రావడంతో అబూబక్ర్ (రజి) భయపడ్డారు. ప్రవక్త (స) ఆయన్ను శాంతపరుస్తూ "భయం లేదు, మనతో దేవుడు ఉన్నాడు" అన్నారు. సౌర్‌గుహ ముఖద్వారం వరకు వచ్చిన శత్రువులు గుహలో చూడకుండానే తిరిగి వెళ్ళిపోయారు. గుహ నుంచి బయటకు వచ్చిన తర్వాత ప్రవక్త (స) సముద్రపు ఒడ్డు నుంచి దూరపు దారిన మదీనాకు ప్రయాణమయ్యారు. ఆ విధంగా తనను వెంబడిస్తున్న శత్రువులకు చిక్కకుండా ముందుకు సాగారు. ప్రవక్త (స)ను పట్టుకుంటే 100 ఒంటెలు లభిస్తాయన్న ఆశతో సురఖా బిన్ జుషామ్ ఈ దూరపు దారిన ప్రవక్త (స) వెళతారన్న అంచనాతో అటే రాసాగాడు. ప్రవక్త (స)ను ఆయన అనుచరుడిని చూడగానే తన గుర్రాన్ని పరుగులు పెట్టించాడు. కాని హఠాత్తుగా గుర్రం కాళ్ళు ఇసుకలో దిగబడిపోయాయి. గుర్రం కాళ్ళు ఇసుక నుంచి బయటకు రావడం లేదు. భయపడిపోయిన సురఖా క్షమాపణ కోరుకున్నాడు. పశ్చాత్తాపపడ్డాడు.



## అధ్యాయం - 3

# మదీనాలో జీవితం - మలుపు తిరిగిన చరిత్ర

మదీనాలో ప్రవక్త (స) జీవితం గురించిన వివరాలు చర్చించే ముందు, అక్కడకు ప్రవక్త (స) చేరుకోక ముందు ఎలాంటి పరిస్థితులున్నాయో ఒక్కసారి క్లుప్తంగా మాట్లాడుకోవడం అవసరం. అక్కడ యూదుల వాడలు ఉండేవి. ఈ నగరాన్ని యస్రిబ్ అని పిలిచేవారు. యూదుల జనాభా అక్కడ పెరగడం వల్ల రాజకీయంగా కొత్త అధికార కేంద్రాలు ఏర్పడ్డాయి. వాళ్ళు కొన్ని కోటలు కట్టుకున్నారు. కాబట్టి ఆ ప్రాంతమంతా యూదుల ఆక్రమణలో, వారి అదుపులో ఉండేది. అక్కడి జనాభాలో మరో ముఖ్యమైన వర్గం అన్సారులది. వీళ్ల పూర్వీకుడు ఖహ్తాన్. ఈరాన్ జలప్రళయం తర్వాత అక్కడి నుంచి చెల్లాచెదరైన ప్రజల్లో ఇద్దరు సోదరులు ఔస్, ఖజ్‌రజ్‌లు మదీనా వచ్చి ఇక్కడ స్థిరపడ్డారు. ఇంకా కొంతమంది అక్కడకు వచ్చి స్థిరపడి ఉండవచ్చు. కాని మదీనా జనాభాలో ఈ ఇద్దరు సోదరుల సంతానమే ఎక్కువ. ప్రారంభంలో ఔస్, ఖజ్‌రజ్ తెగలు యూదులకు కాస్త దూరంగానే ఉండేవి. కాని అక్కడ యూదుల ప్రాబల్యం ఎక్కువ ఉండడం వల్ల యూదులతో శాంతి ఒప్పందం చేసుకుని వారి అధీనంలో ఉండడానికి ఒప్పుకోవలసి వచ్చింది. ఆ తర్వాత యూదుల్లో ఫత్‌యూన్ అనే ఒక తెగ నాయకుడు కామంతో కళ్ళు మూసుకుపోయి కొత్త నియమం తీసుకు వచ్చాడు. పెళ్ళయిన ప్రతి నూతన వధువు మొదటి రాత్రి తనతో గడపాలన్నాడు. ఎవరూ దీనికి వ్యతిరేకించలేకపోయారు. కాని మాలిక్ బిన్ అలీజా తిరగబడ్డాడు. ఫత్‌యూన్‌ను చంపి సిరియా పారిపోయాడు. సిరియా పాలకుడు అబూ జబ్లా. అతనికి ఈ కథంతా తెలిసింది. యూదుల దురాగతాల గురించి తెలిసి అబూ జబ్లా మండిపడ్డాడు. అతడి సైన్యాలు మదీనాపై దండెత్తి వచ్చాయి. ఈ యుద్ధంలో చాలా మంది యూదులు చంపబడ్డారు. మిగిలిన వాళ్ళు లొంగిపోయారు. ఈ యుద్ధం తర్వాత యూదుల ప్రాబల్యం అంతరించింది. సిరియా రాజు అన్సారులకు కానుకలు ప్రసాదించాడు. అన్సారుల ప్రాబల్యం పెరిగింది.

కాని అన్సారుల్లో సమైక్యత లేకపోవడం వల్ల ఔస్, ఖజ్‌రజ్ తెగల మధ్య

తరచు ఘర్షణలు జరిగేవి. ఈ రెండు తెగల మధ్య జరిగిన బూస్ యుద్ధం చారిత్రక మైనది. రెండు తెగల్లోను చాలా మంది ప్రముఖులు ఈ యుద్ధంలో హతమయ్యారు. ఫలితంగా రెండు తెగలు చాలా బలహీనమైపోయాయి. ఈ రెండు తెగలు ఆ తర్వాత ఇరుగు పొరుగున ఉన్న తెగలతో ఒప్పందాలు చేసుకున్నాయి. ఈ సందర్భంగానే వాళ్ళు మక్కాకు చెందిన ఖురైషులతోను ఒప్పందం కోసం ప్రయత్నిం చారు. కాని ఈ ప్రయత్నాలు సఫలం కాలేదు. ఫలితంగా యూదుల ఆధిపత్యం పెరిగింది. యూదుల ప్రాబల్యం పెరగడానికి ఇతర కారణాలు కూడా ఉన్నాయి. యూదులకు ఒక మతపరమైన చట్రం ఉంది. అందువల్ల వారిలో సమైక్యత ఉండేది. మతపరమైన చట్టాలు, సంప్రదాయాలు, ఒకేవిధమైన ప్రార్థనలు ఉండేవి. కాని అన్సారులకు ఇవేవీ లేవు. ఇక్కడ గమనించవలసిన మరో ఆసక్తికరమైన విషయమేమంటే, చివరి ప్రవక్త రానున్నారని యూదులు అన్సారులను బెదిరించేవారు. ఆ చివరి ప్రవక్త సహాయంతో తాము అన్సారులను పూర్తిగా అణిచేస్తామని చెప్పు కునేవారు. అయితే చివరి ప్రవక్త రానున్నారన్న భవిష్యవాణి అన్సారుల్లోను కొత్త ఆశ కలిగించేది. వారు కొత్త ప్రవక్త రాక కోసం ఎంతో ఆతృతగా ఎదురు చూడసాగారు. యూదులు ఆయన వద్దకు వెళ్ళక ముందే తాము ఆయన వద్దకు వెళ్ళి ఆయన మద్దతు కోరాలని భావించేవారు. నిజానికి అన్సారుల్లో ఉన్న ఈ న్యూనతాభావమే వారిని కొత్త ఉద్యమానికి తక్షణం ప్రతిస్పందించేలా చేసింది.

ప్రవక్త (స) మదీనా రాక ముందే అక్కడ ఒక బృందం అవసరమైన వాతా వరణాన్ని ఏర్పాటు చేసింది. ముహమ్మద్ (స) ప్రవక్తగా నియమించబడిన పదకొండవ సంవత్సరంలో మక్కాకు వచ్చిన అరుగురు అన్సారుల బృందంతో పాటు ప్రవక్త (స)కు అత్యంత విశ్వసనీయుడైన అనుచరుడు ముసైబ్ బిన్ ఉమైర్ బిన్ హాషిమ్‌ను మదీనాకు పంపడం జరిగింది. ఇస్లామ్‌కు సంబంధించిన మౌలిక సూత్రాలను ఆయన మదీనాలో ప్రజలకు బోధించడం అప్పటి నుంచే ప్రారంభించాడు. వారికి దివ్య ఖుర్ఆన్, ప్రార్థనల పద్ధతి, నైతికప్రమాణాలు ఆయన బోధించేవారు. ఇస్లామ్ ప్రచారం చేసేవారు. ఈ ప్రయత్నాల వల్ల అన్సారుల్లో ఇద్దరు యువకులు సాద్ బిన్ మాజ్, ఉసైద్ బిన్ హుజైర్‌లు, వీరిద్దరు బనీ అబ్దుల్ అష్‌హల్ తెగకు చెందిన వారు, ఇస్లామ్ స్వీకరించారు. దాంతో అక్కడ ఇస్లామీయ బృందానికి కొద్దిపాటి బలం లభించింది. అకబా మొదటి ప్రతిజ్ఞకు ముందు మక్కా వచ్చిన ఆరుగురు



ప్రతినిధుల బృందం ప్రవక్త (స)తో సుదీర్ఘంగా చర్చించింది. ఆ చర్చల్లో చివరకు వారిలా అన్నారు.

“మేము మా సముదాయం నుంచి పూర్తిగా వేరుపడిపోయాం. మా సముదాయం పూర్తిగా అనైక్యతలో పతనమైంది. మీ వ్యక్తిత్వం బహుశా మళ్ళీ మమ్మల్ని సమైక్యం చేయవచ్చు. మేము అక్కడికి వెళ్ళి వాళ్ళందరినీ మీ మతవిశ్వాసం వైపు పిలుస్తాము. మేము ఈ మతవిశ్వాసం గురించి ఏర్పరచుకున్న అభిప్రాయాన్ని వారికి తెలియజేస్తాము. దేవుడు వారి మనసు మార్చి వారు ఈ మతవిశ్వాసాన్ని స్వీకరిస్తే మీరు అందరికన్నా ఎక్కువ అధికారం కలిగిన వారవుతారు.”

అంటే మక్కా ప్రజలు తమలో ఐక్యతను దెబ్బతీస్తుందని, తమను చిన్నాభిన్నం చేస్తుందని భావించిన ఇస్లామీయ ఉద్యమం మదీనా వారికి సమైక్యతా శక్తిగా కనిపించింది.

మొదటి అకబా ప్రతిజ్ఞలో ఆరుగురు మదీనా ప్రతినిధులు క్రింది విధంగా ప్రకటించారు.

“దేవునికి భాగస్వాములను నిలబెట్టం. దొంగతనాలు చేయం. వ్యభిచారానికి పాల్పడం. మా పిల్లల్ని హతమార్చం. తెలిసి తప్పుడు ఆరోపణలు చేయం. ప్రవక్త (స) పట్ల ఎన్నటికీ అవిధేయత చూపించం.”

కాని ఆ తర్వాతి సంవత్సరం హజ్ సమయంలో జరిగిన రెండవ అకాబా ప్రతిజ్ఞ ముఖ్యమైనది. అన్సారులకు చెందిన ఒక పెద్ద బృందం ప్రవక్త (స)ను రహస్యంగా కలుసుకుని ఒక ఖచ్చితమైన రక్షణ ఒప్పందం చేసుకుంది. ఈ లోగా ఈ సంవత్సర కాలంలో మదీనాలో ఇస్లామీయ ఉద్యమం కొద్దిగా ప్రగతి సాధించింది. ఇస్లామ్ కోసం అన్ని విధాల సవాళ్ళు ఎదుర్కోవడానికి, అన్ని ప్రమాదాలు ఎదుర్కో వడానికి అన్సారులు సిద్ధపడ్డారు. ప్రవక్త (స) వారితోనే ఉండడానికి ఒప్పుకున్నారు. వారి సుఖదు:ఖాలలో పాలు పంచుకోవడానికి, వారినెన్నడూ విడవకుండా ఉండడానికి ఒప్పుకున్నారు. ఈ ఒప్పందంలో అన్సారులు క్రింది విధంగా ప్రకటించారు.

“మేము ప్రవక్త (స) ఆదేశం ప్రతి ఒక్కటి శిరసావహిస్తాం.. మేము కష్టాల్లో ఉన్నా, సుఖాల్లో ఉన్నా, ఆనందంగా ఉన్నా, దు:ఖంలో ఉన్నా ప్రతి ఆదేశాన్ని శిరసా వహిస్తాం. ప్రవక్త (స) ఆదేశాలకు అన్నింటి కన్నా ఎక్కువ ప్రాధాన్యత ఇస్తాం. ఈ ధార్మిక మార్గంలో మా ప్రయాణాన్ని విమర్శించేవారి విమర్శలు మేము పట్టించుకోము” అన్నారు

ఈ మాటలు విని అన్సారుల్లో అబ్బాస్ బిన్ ఉబాదా క్రింది విధంగా హెచ్చరించాడు:

"అన్సారుల్లారా! మీరు ఎలాంటి మనిషితో ప్రతిజ్ఞ చేస్తున్నారో గుర్తించారా? ఇది శాంతితో స్నేహం, ప్రజలతో యుద్ధం" అన్నాడు.

ప్రతినిధి బృందం జవాబిస్తూ తమ బాధ్యత ఏమిటో పూర్తిగా అర్థం చేసుకునే ఈ మాటలు చెప్పామని పలికింది.

"అవును.. యుద్ధంలో మా ఆస్తులు విధ్వంసమయ్యే ప్రమాదాన్ని, మా నాయకులను కోల్పోయే ప్రమాదాన్ని తెలుసుకున్న తర్వాతనే ఈ ప్రతిజ్ఞ చేస్తున్నాం." అన్నారు.

ఈ ప్రతిజ్ఞతో పాటే ఒక సాముదాయిక వ్యవస్థకు కావలసిన పునాదులు కూడా వేయబడ్డాయి. ఈ ప్రతినిధి బృందం సభ్యులతో చర్చించిన తర్వాత ప్రవక్త(స) ఖజ్‌రజ్ తెగ నుంచి తొమ్మిది మంది సభ్యులు, ఔస్ తెగ నుంచి ముగ్గురు సభ్యులు ఉన్న ఒక కమిటీని నియమించి వారి తెగల వ్యవహారాలను పర్యవేక్షించాలని అన్నారు. ఈ కమిటీ నియామకం తర్వాత వ్యవస్థీకృత సామాజిక నిర్మాణం ప్రారంభమయ్యింది.

ఈ ప్రతినిధి బృందం గురించి తెలిసి ఖురైషులు చాలా ఆందోళన చెందారు. ఈ బృందాన్ని పట్టుకోవాలని మనుష్యులను పంపించారు. కాని అప్పటికే ఆ బృందం చాలా దూరం వెళ్ళిపోయింది. అయితే సాద్ బిన్ మాజ్, ఉబాదా, మంజర్‌లు వారి చేతికి దొరికారు. ఖురైషులు తమ కోపాన్ని వీరిపై ప్రదర్శించారు. కాని ఈ వ్యవహారం ఇప్పుడు ఖురైషుల చేతుల్లో లేదు. కాని ఇస్లామ్ స్వీకరించిన వాళ్ళు మదీనా వెళ్ళడానికి ప్రయత్నించినప్పుడు ఖురైషులు వారిని పట్టుకుని అత్యంత క్రూరంగా చిత్రహింసలు పెట్టేవారు. వారి ఆస్తులు లాక్కొనేవారు. వారి బంధువులను విడదీసేవారు. వారి వాహనాలను లాక్కునేవారు. ఎంత క్రూరమైన అణిచివేత ఉండేదంటే ఒక చిన్న ఉదాహరణ ద్వారా అర్థం చేసుకోవచ్చు. అబూ సలామ్ అబ్దుల్లా ఇబ్నుల్ అసద్ మఖ్జూమీ ఇస్లామ్ స్వీకరించి మక్కా నుంచి మదీనా బయలుదేరారు. ఆయన భార్యా పిల్లలు ఒంటెపై కూర్చుని ఆయనతో పాటు ప్రయాణమయ్యారు. ఆయన భార్య బనూ ముగీరా తెగకు చెందినది. వీళ్ళు బయలుదేరే ముందు ఆమె బంధువులు అక్కడికి వచ్చారు. ఆమె కూర్చుని ఉన్న ఒంటెను పట్టుకుని ఆపేశారు. ఇస్లామ్ స్వీకరించిన ఆమె భర్తతో పాటు ఆమె దేశాలు పట్టుకుని తిరగడానికి వీల్లేదని, ఆమెను వెళ్ళనీయమని అన్నారు. ఇంతలో అబూ సలామా తెగకు చెందిన వారు



వచ్చి, ఆమె చేతిలో ఉన్న బిడ్డను లాక్కుని బిడ్డను ఇచ్చేది లేదన్నారు. అంటే అబూ సలామా భార్య ఒకవైపు, బిడ్డ ఒకవైపు అయ్యారు. అబూ సలామా ఒంటరిగా మిగిలారు. మొత్తం కుటుంబం చిన్నాభిన్నమై పోయింది. ఆయన భార్య ప్రతిరోజు తన భర్త పిల్లల నుంచి వేరుపడిన ఆ ప్రదేశానికి వచ్చి రోదించేది. ఇలా సంవత్సరం గడిచిన తర్వాత, ఆమెపై జాలిపడిన వ్యక్తి ఒక ఒంటెపై ఆమెను కూర్చుండబెట్టి, బిడ్డను చేతికిచ్చి మదీనా వెళ్ళే అవకాశం కల్పించాడు. ఆమె ఒంటరిగా, ఎలాంటి రక్షణ లేకుండా ఎడారిలో మదీనావైపు ప్రయాణమయ్యారు. దారిలో ఉస్మాన్ బిన్ తల్హా ఆమెను చూసి మదీనా శివార్ల వరకు తీసుకెళ్ళాడు. ఇలాంటి వేధింపులు మక్కాలో నిత్యకృత్యాలయ్యాయి. అయినా ముస్లిములు మక్కా నుంచి మదీనా తరలి పోవడం ఆగలేదు. ఈ విధంగా మక్కాలో ముస్లిములందరూ క్రమేణా మదీనా చేరుకున్నారు. చివరకు ప్రవక్త (స), ఆయన సన్నిహిత అనుచరులు, ఖురైషులు నిర్బంధించిన ముస్లిములు మాత్రమే అక్కడ మిగిలారు. ఆ పిదప ప్రవక్త (స), అబూబక్ర్ (రజి) కూడా మదీనాకు తరలి పోయారు.

## స్వాగతం పలికిన మదీనా

మొదటి అకబా ప్రతిజ్ఞ జరిగినప్పుడే మదీనా ఇస్లామీయ సందేశాన్ని స్వీకరించింది. రెండవ అకబా ప్రతిజ్ఞతో ఇది మరింత బలపడింది. అతి స్వల్ప కాలంలోనే మదీనాలోని ఒకటి రెండు తెగలు తప్ప అన్ని తెగల నుంచి ప్రతి కుటుంబం ఇస్లామ్ సేవకు తమ యువకులను పంపింది. దీంతో ఉద్యమానికి కొత్త ఊపు లభించింది. మదీనాలో ఇస్లామ్‌కు ఆశ్రయం లభించిందని తెలిసి ఖురైషులు ఆగ్రహంతో రెచ్చిపోయారు. మదీనాలో తమ ప్రాబల్యానికి ఆవల ఇస్లామ్ వృద్ధి చెందుతుందని, బలం పుంజుకుని తమపై ప్రతీకారం తీర్చుకోవటానికి దాడి చేస్తుందని భయపడ్డారు. మక్కా నుంచి ముస్లిములు మదీనా వెళ్ళకుండా వాళ్ళు ఎంత నిఘా ఉంచినా, మదీనా వెళ్ళిన వాళ్ళని వెనక్కి తీసుకురావడానికి ఎన్ని ప్రయత్నాలు చేసినా ఫలించలేదు. ఇస్లామ్ స్వీకరించిన వారెవ్వరూ వెనక్కి రావడానికి సిద్ధంగా లేరు. హజ్రత్ ఉమర్ (రజి) కూడా అత్యంత రహస్యంగా మదీనాకు వలస వెళ్ళి పోయారు. ఆయనతో పాటు అయాష్ బిన్ అబీ రాబియా, హిషామ్ బిన్ ఆస్ బిన్ అల్వాయిల్‌లు కూడా వెళ్ళారు. వీళ్ళను పట్టుకోవడానికి అబూజహల్ బిన్ హిషామ్, హారిస్ బిన్ హిషామ్‌లు వెంబడించారు. వీళ్ళు హిషామ్ బిన్ ఆస్‌ను పట్టుకోగలిగారు. ఖురైషులు మాయోపాయంతో మదీనా వచ్చి అయాష్‌ను కలుసుకున్నారు. ఆయన

తల్లి ఆయన్ను తక్షణం చూడాలనుకుంటుందని, ఆమె పరిస్థితి బాగోలేదని చెప్పారు. హజ్రత్ ఉమర్ (రజి) ఎంత నచ్చచెప్పినా హిషామ్ వెనుతిరిగి మక్కా వెళ్ళాలని నిర్ణయించు కున్నారు. చివరికి హజ్రత్ ఉమర్ (రజి) తన వద్ద అతివేగంగా ప్రయాణించే ఒంటెను ఆయనకిచ్చి ఏమాత్రం అనుమానం వచ్చినా వెనుతిరిగి రమ్మని అన్నారు. కాని మదీనా నగరం బయటకు వెళ్ళిన మరుక్షణం ఖురైషులు ఆయన చేతులు విరిచికట్టి మక్కా నగరానికి తీసుకొచ్చారు. ఆయన్ను చిత్రహింసలకు గురిచేశారు. మదీనా తరలిపోయిన వారికి తగిన బుద్ధి చెప్పామని ఖురైషులు గొప్పలు చెప్పుకున్నారు. దారి తప్పిన వారిని ఇలా దారికి తీసుకురావాలన్నారు. ఆ తర్వాత హజ్రత్ ఉమర్ (రజి) తన స్వహస్తాలతో ఒక లేఖ రాశారు. ఆ లేఖలో క్రింది దివ్యఖుర్ఆన్ వాక్యాన్ని ఉటంకించారు.

> **"మీ ఆత్మలకు అన్యాయం చేసుకున్న నా దాసులారా అల్లాహ్ కారుణ్యం పట్ల నిరాశ చెందకండి. నిశ్చయంగా అల్లాహ్ అన్ని పాపాలనూ క్షమిస్తాడు. ఆయన క్షమించేవాడు, కరుణించేవాడూను."** ***(దివ్యఖుర్ఆన్ 39-53)***

ఈ లేఖ చదువుకున్న అయాష్ వెంటనే లేఖ అంతరార్థాన్ని గ్రహించారు. సమయం చిక్కగానే ఒంటెపై ప్రయాణమై మదీనా చేరుకున్నారు.

ఆ తర్వాత ప్రవక్త (స) ఎప్పుడు వస్తారా అని మదీనాలో ప్రజలు ఎదురు చూడసాగారు. అకబా రెండవ ప్రతిజ్ఞ ప్రకారం ఆయన మదీనా రావలసి ఉంది. ఆయన కోసం మదీనాలో అన్సారులు రాత్రింబవలు ఎదురు చూడసాగారు. ప్రతిరోజు ఉదయం నుంచి మదీనా నగరం బయటకు వచ్చి మక్కా నుంచి వచ్చే మార్గం వైపు కళ్ళు కాయలు కాసేలా ఎదురు చూసేవారు. ఎండ నడినెత్తికి వచ్చి భరించరానిదిగా మారే వరకు అక్కడే వేచి ఉండేవారు. ప్రవక్త (స) రాకపోయేసరికి నిరుత్సాహంగా వెనుదిరిగి వెళ్ళిపోయేవారు. ఒక రోజు వాళ్ళు ఎదురు చూసి, ఎదురు చూసి ఇక వెనుతిరగి పోతున్నప్పుడు, ఒక యూదుడు తన ఇంటి పై అంతస్థు నుంచి చూస్తు ప్రవక్త (స)ను దూరంగా చూశాడు. అతను అన్సారులను పిలిచి వాళ్ళు ఎదురు చూస్తున్న వ్యక్తి వస్తున్నాడని చెప్పాడు. ప్రవక్త (స) మక్కా వదిలి పెట్టారన్న వార్త వచ్చినప్పటి నుంచి మదీనాలో ప్రవక్త (స) రాక గురించి తప్ప మరో విషయమేదీ ప్రజలు మాట్లాడుకోవడం లేదు. చివరకు పిల్లలు కూడా అత్యుత్సాహంగా ఎదురు చూడసాగారు. ప్రవక్త (స) వస్తున్నారని తెలియగానే మదీనాలో ఆనందోత్సాహాలు అంబరాన్ని తాకాయి. యావత్తు నగరాన్ని సంతోషతరంగాలు అలుముకున్నాయి.



దారిలో ప్రవక్త (స) మొదట ఖుబా వద్ద ఆగారు. మదీనా శివార్లలో మూడు మైళ్ళ దూరాన ఖుబా ఉంది. అక్కడ అమిర్ బిన్ ఔఫ్ ఆయనకు స్వాగతం పలికారు. ఔఫ్ ఇల్లు నిజానికి ఇస్లామీయ ఉద్యమానికి కేంద్రంగా ఉండింది. ప్రవక్త (స)కు అతిథ్యమిచ్చిన గౌరవం ఆయనకు దక్కింది. ఖుబాలో ప్రవక్త (స) ఫద్నాలుగు రోజులు ఉన్నారు. ప్రవక్త (స) వెనుక మక్కా నుంచి బయలుదేరిన హజ్రత్ అలీ (రజి) కూడా అక్కడకు వచ్చి ఆయన్ను కలిశారు. ప్రవక్త (స) అప్పగించిన సంపద, సొమ్ములు ఎవరివి వారికి అప్పగించి ఆయన మక్కా నుంచి బయలుదేరి వచ్చారు. ఖుబాలో ప్రవక్త (స) ఒక మస్జిదు నిర్మించారు. మస్జిదు నిర్మాణం సందర్భంగా ప్రవక్త (స) కూడా ఇతరులతో మాదిరిగా శారీరక శ్రమ చేశారు. బరువైన రాళ్ళు మోశారు. మస్జిదు నిర్మాణంలో పాల్గొన్న వారందరు క్రింది విధంగా ప్రార్థించేవారు :

> **"మస్జిదులు నిర్మించిన వారు, నిలబడి కూర్చుని దివ్యఖుర్ఆన్ పఠించేవారు, రాత్రిళ్ళు ప్రార్థనలకు మేలుకుని ఉండేవారు సాఫల్యం పొందుతారు."**

ప్రవక్త (స) నబవీ శకం 11వ సంవత్సరం, రబివుల్ అవ్వల్ 8వ తేదీన ఖుబా చేరుకున్నారు. అంటే క్రీ.శ.622 సెప్టెంబర్ 23న ఖుబా వచ్చి ఆ తర్వాత మదీనాకు హి.శ మొదటి సంవత్సరం రబి వుల్ అవ్వల్ 12వ తేదీన వెళ్ళారు. మదీనాలో ఆయన తల్లి తరఫు బంధువులు ఆయన స్వాగతానికి ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఇంటి పైకప్పులపై నిలబడి స్త్రీలు పాటలు పాడుతూ ఆయన్ను స్వాగతించారు.

**"వదా కొండల నుంచి పూర్ణచంద్రుడు మాపై ఉదయించాడు. మేము ఎల్లప్పుడు దేవునికి రుణపడి ఉంటాం. బాలికలు బృందాలుగా పాటలు పాడుతూ, దప్పులు మోగిస్తూ "మేం బనీ నజ్జార్ కుమార్తెలం.. ముహమ్మద్ మీకు స్వాగతం పలుకు తున్నాం"** .. అంటూ గీతాలు ఆలపించారు.

ప్రవక్త (స) హజ్రత్ అబూ అయ్యూబ్ అన్సారీ (రజి) ఇంటిని ఎంచుకున్నారు. అక్కడే ఏడు నెలలపాటు ఉన్నారు.

ప్రవక్త (స) అక్కడికి రాగానే తన ఉద్యమ కార్యకలాపాలు ప్రారంభించారు. ఆయన చేసిన మొదటి పని మస్జిదు నిర్మాణం. అందుకు కావలసిన స్థలాన్ని హజ్రత్ అయ్యూబ్ అన్సారీ (రజి) సేకరించారు. ఆ స్థలం యజమానులైన ఇద్దరు అనాథలకు తగిన వెల చెల్లించి స్థలాన్ని కొన్నారు. ఆ మస్జిదునే మస్జిదె నబవీ అంటారు. ఈ మస్జిదు కేవలం ప్రార్థనలకు మాత్రమే కాదు, ఇస్లామీయ ఉద్యమానికి ఇది కేంద్రంగా

నిర్మించారు. ఇదే న్యాయస్థానం, ఇదే సమాలోచన మందిరం, ఇదే ప్రజాస్వామిక భవనం, అధికారిక అతిథిభవనం అన్నీ ఆ మస్జిదే. ఈ మస్జిదు నిర్మాణంలోను ప్రవక్త (స) అందరితో పాటు శ్రమించారు. మస్జిదు నిర్మాణంలో పనిచేసేవారు క్రింది విధంగా పాటలు పాడుతూ పనిచేసేవారు

"దైవప్రవక్త స్వయంగా పనిచేస్తూంటే మనం కూర్చోవడమా.. మనం చేసుకున్నదంతా వ్యర్థమవుతుంది" అని పాడుకునేవారు.

పరలోకంలో శాశ్వత జీవితం తప్ప మరో జీవితం లేదు, ఓ అల్లాహ్ మదీనా స్థానికులైన అన్సారులపై, వలస వచ్చిన ముహాజిర్లపై కరుణ చూపించు అని ప్రార్థించే వారు. ఈ నిర్మాణ కార్యక్రమాల్లో అత్యంత ముఖ్యమైన పని ప్రచార కార్యక్రమాన్ని విస్తరించడం. హజ్రత్ అయ్యూబ్ అన్సారీ (రజి) ఇంట ఆరు నెలలు ఉన్న తర్వాత ఏడవ నెలలో ఈ కార్యక్రమాలు చాలా విస్తరించాయి. ప్రవక్త (స) తన ప్రచార కార్యక్రమాలను ఇప్పుడు బహిరంగ ప్రసంగాల ద్వారా కొనసాగించడం ప్రారంభించారు. మదీనాలో ఆయన తన మొదటి ప్రసంగంలో ఇలా ప్రకటించారు:

"దైవ స్తోత్రం తర్వాత, ఓ ప్రజలారా! మీ ఆత్మల కోసం కూడా కొంత సంపాదించుకోండి. అర్థం చేసుకోండి. దేవుని తోడు, మీలో ప్రతి ఒక్కరూ చావును చవిచూడవలసి ఉంది. తన ప్రజలను వదిలి ఎలాంటి పోషకుడు లేకుండా పోవలసి ఉంటుంది. ఎవరూ జోక్యం చేసుకోలేని పరిస్థితిలో దేవుని ప్రశ్నలకు జవాబు చెప్పుకోవలసి ఉంటుంది. అక్కడ ఆ మనిషి ఇలా ప్రశ్నించబడతాడు: నీ వద్దకు మా ప్రవక్త రాలేదా? మా సందేశం వినిపించలేదా? నువ్వు నీ ఆత్మకోసం ఏం సంపాదించుకున్నావు? అప్పుడు ఆ వ్యక్తి తన చుట్టు చూసుకుంటే ఏదీ కనబడదు. అక్కడ ఆ మనిషి కోసం నరకాగ్ని తప్ప మరేమీ ఉండదు. కాబట్టి మంచి చేయగలిగిన వారంతా మంచి చేయాలి. ఎంత చిన్నదైనా మంచి చేయాలి. తన్ను తాను నరకాగ్ని నుంచి కాపాడుకోవడానికి మంచి చేయాలి. కొద్దిపాటి మంచి కూడా చేయలేని పరిస్థితిలో ఉన్నవారు కనీసం మంచి మాటైనా పలుకడం ద్వారా నరకాగ్ని నుంచి బయటపడాలి. మంచికి ప్రతిఫలం పది నుంచి ఏడువందల రెట్లు అధికంగా ఉంటుంది. మీ అందరికీ రక్షణ, దేవుని అనుగ్రహాలు, కారుణ్యం లభించాలని ప్రార్థిస్తున్నాను. అన్నారు.

ఆయన రెండవ బహిరంగ ప్రసంగంలో ఇలా చెప్పారు:

సకల స్తోత్రాలు అల్లాహ్‌కే, నేను దేవుని మాత్రమే స్తుతిస్తాను, ఆయన సహాయం మాత్రమే కోరతాను. మనమంతా మన మనసులోని కోరికల విషయంలో, చెడు ఆచరణల విషయంలో దేవుని రక్షణ అర్థించాలి. దేవుడు మార్గదర్శనం ఇచ్చిన వ్యక్తిని మరెవ్వరూ దారి తప్పించలేరు. దేవుని మార్గదర్శనం దొరకని వ్యక్తికి మరెక్కడా మార్గదర్శనం లభించదు. దేవుడు ఒక్కడనీ, ఆయనకు భాగస్వాములు లేరని నేను సాక్ష్యం ఇస్తున్నాను. దేవుడు తప్ప ఆరాధనకు, విధేయతకు మరెవ్వరూ అర్హులు కాదు. సమస్త గ్రంథాల్లో దైవగ్రంథమే అత్యుత్తమమైంది. దైవగ్రంథాన్ని తన హృదయానికి హత్తుకున్న వారు, అవిశ్వాసం నుంచి విశ్వాసమార్గానికి వచ్చినవారు, మానవాళిలో ఈ గ్రంథాన్ని తమ కోసం ఎంచుకున్న వారు సాఫల్యం పొందుతారు. ఇది అత్యుత్తమ శైలి ఉన్న గ్రంథం. అత్యంత ప్రభావశీలమైన గ్రంథం. దేవుని అభీష్టం ఏదైతే దాన్నే ఇష్టపడండి. పూర్తి నిజాయితీతో దేవుని ప్రేమించండి. దేవుని వాక్కు పట్ల నిర్లక్ష్యం వహించవద్దు. మీ హృదయాలను కఠినశిలలుగా మార్చుకోవద్దు. దేవుడు తన సృష్టిలో ఉత్తమమైన వారినే ఎన్నుకుంటాడన్నది ఒక వాస్తవం. ఆయన మీ కోసం అత్యుత్తమమైన ఆచరణలను ఎన్నుకున్నాడు. అత్యుత్తమమైన ఉపదేశాలు ఇచ్చాడు. మనిషికి ప్రసాదించబడిన వాటిలో అనుమతించబడినవి కొన్ని ఉన్నాయి. నిషిద్ధమైనవి కొన్ని ఉన్నాయి. కాబట్టి దైవదాస్యాన్ని ఎన్నుకోండి. దేవునికి భాగస్వాములను కల్పించకండి. మీ శక్తిమేరకు దేవుని ఆగ్రహం నుంచి తప్పించుకునే ప్రయత్నం చేయండి. మీరు మాట్లాడే ప్రతి మంచి మాటను దేవుని ముందు ధృవీకరించండి. దేవుని కరుణ ద్వారా మీ మధ్య ప్రేమాభిమానాల సంబంధాన్ని సుదృఢం చేసుకోండి. దేవుడితో చేసిన ప్రతిజ్ఞను అతిక్రమిస్తే దైవాగ్రహానికి గురికావలసి వస్తుంది. మీరంతా రక్షణ పొందాలని కోరుకుంటున్నాను.



## ఇస్లామీయ రాజ్యం

ప్రవక్త ముహమ్మద్ (స) తీసుకున్న మరొక రాజకీయ నిర్మాణాత్మక చర్య మదీనాలో యూదులకు, ముస్లిములకు మధ్య ఒకే సామాజిక వ్యవస్థను నిర్మించడం. దీని కోసం ఒక వ్రాతపూర్వకమైన ఒప్పందం కూడా కుదిరింది. ప్రపంచంలో మొదటి వ్రాతపూర్వక సంవిధానంగా దీన్ని చెప్పుకోవచ్చు. ఈ సంవిధానంలోని కొన్ని అధికరణలు క్రింది విధంగా ఉన్నాయి.

మదీనాలోని వ్యవస్థీకృత సమాజంలో దేవుని సర్వసత్తాక అధికారం, దైవిక చట్టాలకు ప్రప్రథమ ప్రాధాన్యం ఇవ్వబడుతుంది.

ప్రవక్త (స)కు రాజకీయ, న్యాయ, శాసన వ్యవహారాల్లో అంతిమ నిర్ణయాధికారం ఇవ్వబడుతుంది.

రక్షణ పరంగా మదీనా, దాని చుట్టుపక్కల ప్రాంతాలు ఒకే సమూహంగా పరిగణన పొందుతాయి. ఖురైషులకు ఎవరైనా సహాయపడే ఎలాంటి బలహీనతలకు తావులేని సమూహంగా ఏర్పడుతాయి. రక్షణ వ్యవహారాల్లో కూడా ప్రవక్త (స)కు అంతిమ నిర్ణయాధికారం ఇవ్వబడుతుంది.

ఈ ఒప్పందం ఒక ఇస్లామీయ రాజ్యానికి కావలసిన పునాదులు వేసింది. ఒక ఇస్లామీయ జీవన వ్యవస్థకు ఆధారమయ్యింది. ఈ ఒప్పందాన్ని, దాని తర్వాత చోటు చేసుకున్న వివిధ పరిణామాలను, ఒప్పందాలను పరిశీలిస్తే ప్రవక్త (స)కు అసాధారణమైన రాజకీయ అవగాహన, దూరదృష్టి ఉండేవని, ఇతరులకు నచ్చచెప్పి తన మాట ఒప్పించే సామర్థ్యం ఉండేదని, ఆయన కేవలం ఒక ధర్మవేత్త లేదా ఒక సాధువు మాత్రమే కాదని, ప్రాపంచిక వ్యవహారాలను సమర్థవంతంగా నిర్వహించే స్థితప్రజ్ఞుడని, అలాంటి బాధ్యతలను చాకచక్యంతో వివేకంతో నిర్వహించే యోగ్యత కలిగిన వారని అర్థం అవుతుంది.

మదీనాలో ప్రవక్త (స) చేపట్టిన మరో ముఖ్యమైన రాజకీయ నిర్ణయం, మదీనాలో ఉన్న స్థానిక అన్సారులకు, మక్కా నుంచి వచ్చిన ముహాజిర్లకు మధ్య సోదర సంబంధాలు నెలకొల్పడం. మదీనాలోని చిన్న జనాభా మక్కా నుంచి వలస వచ్చిన వందలాది ముహాజిర్లను అక్కున చేర్చుకోవలసి ఉంది. కేవలం కట్టుబట్టలతో మక్కా నుంచి తరలి వస్తున్న వారందరినీ ఆదుకోవలసి ఉంది.

చరిత్రలో ఇలాంటి కాందిశీకుల సమస్య వచ్చినప్పుడు అత్యంత తీవ్రమైన రాజకీయ, ఆర్థిక సమస్యలు చుట్టుముట్టడాన్ని మనం చూశాం. పాకిస్తాన్‌లో దేశవిభజన సందర్భంగా ఇలాంటి సమస్యే ఉత్పన్నమయ్యింది. కాని ప్రవక్త (స) ఈ సమస్యకు ఇచ్చిన పరిష్కారం, ఆ పరిష్కారాన్ని అమలులో పెట్టడానికి మదీనాలోని అన్సార్లు చూపించిన త్యాగనిరతి చరిత్రలో మరెక్కడా కనబడదు. అలాంటి సంఘటన ఇక ముందు కూడా చోటు చేసుకుంటుందని ఆశించలేం. ప్రవక్త (స) ప్రతి అన్సార్‌కు, మక్కా నుంచి వచ్చిన ఒక ముహాజిర్‌తో సోదర సంబంధం ఏర్పరిచారు. ఇదేదో మాట వరుసకు సోదర సంబంధం కాదు. సోదరసంబంధం ఏర్పడిన తర్వాత మదీనాలోని అన్సార్ తనకు సోదరునిగా వచ్చిన మక్కా ముహాజిర్‌కు తన ఆస్తిలో సగం పంచి ఇచ్చాడు. తన ఆస్తులు, ఇళ్ళు, వస్తువులు, పొలాలు అన్నింటిని న్యాయంగా



ఒక సోదరుడికి పంచి ఇచ్చినట్లు పంచి ఇచ్చాడు. మరో విషయమేమంటే, అన్సారుల్లో ఒకరికి మించి భార్యలు ఉన్నవారు, ఒక భార్యకు విడాకులిచ్చి వలస వచ్చిన సోదరుడితో పెళ్ళి చేయించే స్థాయి వరకు వెళ్ళారు. కాగా మరోవైపు వలస వచ్చిన ముహాజిర్లు తమ ఆత్మగౌరవాన్ని కాపాడుకుంటూ మదీనాలోని తమ అన్సార్ సోదరులకు భారంగా మారకుండా, తమకు మదీనాలో మార్కెట్‌కు వెళ్ళే దారి, పొలాలకు వెళ్ళే దారి చూపించమని కోరుకున్నారు. కష్టపడి పనిచేసి సంపాదించడానికి నడుం కట్టారు. వ్యాపారం చేసి, వ్యవసాయం చేసి కష్టపడి సంపాదించుకోడానికి సిద్ధపడ్డారు.

మక్కా నుంచి వచ్చిన వారిలో కొందరు అవివాహిత యువకులు ధర్మ ప్రచారానికి అంకితం కావాలనుకున్నారు. ధార్మిక విద్యాజ్ఞానాలు సంపాదించడానికే సమయం వెచ్చించాలనుకున్నారు. ఈ యువకులకు ప్రవక్త (స) మస్జిదులోని ఒక భాగాన్ని కేటాయించడం జరిగింది. వారిని సుఫ్ఫా జనులుగా పిలుస్తారు. సుఫ్ఫా అంటే ఒక అరుగు అని అర్థం. వారంతా ప్రవక్త (స) మస్జిదులో ఒక అరుగుపై కూర్చుని విద్యాజ్ఞానాలు ఆర్జించేవారు. వారి పోషణ భారాన్ని పూర్తి సమాజం స్వీకరించింది.

## యూదుల నమ్మకద్రోహం

మక్కా ఖురైషుల వ్యవహారాన్నే యూదులు కూడా ప్రదర్శించడం ప్రారంభించారు. విగ్రహారాధకులైన ఖురైషులకే మద్దతివ్వడం మొదలు పెట్టారు. నిజానికి మతపరంగా యూదులకు ముస్లిములకు సాన్నిహిత్యం ఉంది. అయినా యూదులు ముస్లిములకు వ్యతిరేకంగా ఖురైషులకు సహాయసహకారాలందించడంలోనే ఎక్కువ ఉత్సాహం చూపించారు. నిజానికి యూదులకు, ముస్లిములకు మధ్య ఒక ఒప్పందం అప్పటికే జరిగింది. కాని ఆ ఒప్పందం జరిగినప్పుడు యూదులు ముస్లిముల గురించి పెద్దగా పట్టించుకోలేదు. మక్కా నుంచి బహిష్కరించబడి వచ్చిన గుప్పెడు మంది ఇక్కడ ఏం చేయగలరనుకున్నారు. త్వరలోనే ముస్లిములు తమ ఆధిపత్యంలోకి రావడం ఖాయమనుకున్నారు. కాని యూదుల బలమైన కోటల్లోకి కూడా ఇస్లామ్ చొచ్చుకురావడం చూసి కలవరపడ్డారు. మొదట్లో యూదుల్లోని కొందరు సాధారణ ప్రజలు ఇస్లామ్ పట్ల ఆకర్షితులయ్యారు. సాధారణ ప్రజలు ఇస్లామ్ పట్ల ఆకర్షించబడడాన్ని వాళ్ళు పెద్దగా పట్టించుకోలేదు. కాని యూదుల్లో పండితులు, పెద్దలు కూడా ఇస్లామ్ పట్ల మొగ్గు చూపడం ప్రారంభమయ్యేసరికి యూదుల్లోని పెత్తందారులు ఇస్లామ్ పట్ల వ్యతిరేకత పెంచుకున్నారు. యూదుల్లోకి ఇస్లామ్ ఎలా చొచ్చుకుపోయిందో ఒకటి రెండు ఉదాహరణల ద్వారా అర్థం చేసుకోవచ్చు.

యూదుల్లోని ఒక ప్రముఖుడు, అబూ ఖుబాయిస్ బిన్ అబీ అనస్ యూద సమాజం పట్ల విరక్తి చెందాడు. అప్పట్లో యూదసమాజంలో ఉన్న పరిస్థితులను ఏవగించుకుని మొదట క్రయిస్తవం స్వీకరించాడు. కాని క్రయిస్తవంలోను అతడికి సంతృప్తి లభించలేదు. ఆ తర్వాత అతను తన ఇంట్లో ఒక మస్జిదు కట్టుకున్నాడు. అందులోకి అపరిశుభ్రంగా ఉన్నవారినెవరినీ అనుమతించేవాడు కాదు. తాను ప్రవక్త అబ్రహం (అస) దేవుడిని మాత్రమే ఆరాధిస్తున్నానని ప్రకటించాడు. ఆయన వయసులో చాలా పెద్దవాడు. తన అభిప్రాయాలను నిర్మొహమాటంగా, నిస్సంకోచంగా ప్రకటిం చేవాడు. బహుశా ఆయన యూద పెద్దలతో చర్చలు కూడా జరిపి ఉంటాడు. ఆయన్ను యూద సమాజంలో ఆపి ఉంచడానికి వాళ్ళు ప్రయత్నించి ఉంటారు. కాని అతను యూద సమాజం పట్ల తిరుగుబాటు వైఖరినే కొనసాగించాడు. ప్రవక్త ముహమ్మద్ (స) మదీనా వచ్చిన తర్వాత ఆయన ప్రవక్త (స) వద్దకు వెళ్ళి ఇస్లామ్ స్వీకరించాడు.

మరో సంఘటనలో, యూద తెగ ఖైనుకాకు చెందిన ఒక యూదపండితుడు, మతపెద్ద ప్రవక్త (స) బోధనల గురించి విన్నాడు. ఇస్లామ్ పట్ల ఆకర్షితుడయ్యాడు. ఆయన తన కుటుంబ సభ్యులతో సహా ఇస్లామ్ స్వీకరించాడు. ఆయన యూదపేరు హుస్సేన్ బిన్ సలామ్. కాని ఇస్లామ్ స్వీకరించిన తర్వాత తన పేరు మార్చుకుని అబ్దుల్లా బిన్ సలామ్‌గా పెట్టుకున్నాడు. ఆయన నిజానికి యూదసమాజంలో అత్యున్నత హెూదా స్థాయి ఉన్న పండితుడు. అలాంటి వ్యక్తి ఇస్లామ్ స్వీకరించడం వారికి పెద్ద కుదుపులా తగిలింది. ఆయన ముస్లిమ్ అయిన తర్వాత, ఆయనకు యూదసమాజంలో ఉన్న లోపాలు, బలహీనతలు అన్నీ తెలుసు కాబట్టి ముస్లిములకు, యూదులకు మధ్య సంబంధాలు చెడితే ఇలాంటి వారి వల్ల చాలా ప్రమాదం ఉంటుందని యూదులు భయపడ్డారు.

మరో సంఘటనలో మరో ప్రముఖ యూద మతపెద్ద, రబ్బీ ఇస్లామ్ స్వీకరించడమే కాదు ముస్లిముల సైన్యంలో చేరి ఉహుద్ యుద్ధంలో పోరాడాడు. న్యాయం పక్షాన, సత్యం పక్షాన నిలబడి పోరాడడం తన కర్తవ్యమని ప్రకటించాడు.

యూద సమాజంలో ఈ మార్పులు చూసి యూదపెత్తందార్లు భయపడ్డారు. తమ కోటలు బీటలు వారుతున్నాయని గ్రహించారు. ముస్లిములతో ఒప్పందం చేసుకున్నప్పటికీ వారు శత్రువుల పక్షాన వ్యవస్థీకృతం కావాలని అనుకున్నారు. నిజానికి ఖురైషుల కన్నా యూదులే ప్రవక్త (స)కు తీవ్రమైన సమస్యలు సృష్టించారు.



ఎందుకంటే ఖురైషుల వైరం బహిరంగమైనది. ముస్లిముల పట్ల తమ శత్రుత్వాన్ని ఖురైషులు ఎన్నడూ దాచుకోలేదు. కాని యూదుల వ్యవహారం అలాంటిది కాదు. ముస్లిములతో వారికి స్నేహ ఒప్పందం ఉంది. యూదులు బహిరంగంగా తిరుగుబాటుకు పూనుకోలేదు. మోసపూరితంగా వెనక గోతులు తవ్వడం ప్రారంభించారు. ఖురైషుల శత్రుత్వానికి కారణం, వారు తమ ప్రాబల్యాన్ని కాపాడుకోవాలన్న ప్రయత్నం మాత్రమే. కాని యూదుల శత్రుత్వానికి కారణం తమ ఆధిక్యత కోల్పోతామన్న భయం. ఖురైషుల శత్రుత్వానికి కారణం వారి ఆధిక్యతా భావం. యూదుల శత్రుత్వానికి కారణం వారి నిమ్నతాభావం. హుయ్ బిన్ అక్తబ్ అనే యూదుడి కుమార్తె హజ్రత్ సఫియా (రజి) చెప్పిన కథనం ద్వారా యూదులు ఎలా ఆలోచించేవారో అర్థం చేసుకోవచ్చు. హజ్రత్ సఫియా (రజి) తర్వాత ప్రవక్త (స)ను పెళ్ళాడారు. ఆమె మాటల ప్రకారం, ఆమె తండ్రి, పినతండ్రి ఆమెను చాలా ప్రేమించేవారు, చాలా గారాబం చేసేవారు. కాని ఒక రోజు ప్రవక్త (స)ను కలుసుకుని ఆమె తండ్రి, పినతండ్రి రాత్రి ఇంటికి వచ్చిన తర్వాత చాలా అలసిపోయినట్లు కనిపించారు. ఆమెతో మాట్లాడ్డానికి కూడా రాలేదు. ఆమె పినతండ్రి, ఆమె తండ్రితో "ఆయనేనా వాగ్దానం చేయబడిన రక్షకుడు" అని అడగడం, ఆమె తండ్రి దేవుని ఒట్టేస్తూ అలాగే కనిపిస్తున్నాడని చెప్పడం ఆమె విన్నారు.. మళ్ళీ ఆమె పినతండ్రి, ఆమె తండ్రితో "నువ్వు ఖచ్చితంగా గుర్తుపట్టావా? ఖచ్చితంగా చెప్పగలవా?" అనడిగాడు. ఆమె తండ్రి ఔనని జవాబు చెప్పాడు. "అయితే ఇప్పుడు నువ్వేం చేద్దామనుకుంటున్నావు?" అనడిగాడు పినతండ్రి. "శత్రుత్వం.. శత్రుత్వం.. దేవుని తోడు నా చివరి ఊపిరి వరకు శత్రుత్వమే" అన్నాడు.

యూదుల ఆలోచనా విధానాన్ని అర్థం చేసుకోడానికి మరో ఉదాహరణ కూడా ఉపయోగపడుతుంది. అబూ అమామా అసద్ జురారా మరణానికి సంబంధించిన సంఘటన ఇది. ఇస్లామ్ ప్రారంభకాలంలో అత్యంత ఉత్సాహంగా ఇస్లామ్ కోసం పనిచేసిన వారు అబూ అమామా. బనూ నజ్జార్ తెగకు నాయకుడిగా ఆయన్ను ప్రవక్త (స) నియమించారు. ప్రవక్త (స) మదీనా వచ్చిన కొద్దికాలానికే అబూ అమామా మరణించారు. ఆయన మరణంతో ఒక పూరించలేని లోటు ఇస్లామీయ కార్యకర్తల్లో ఏర్పడింది. అబూ అమామా మరణం పట్ల ప్రవక్త (స) చాలా దు:ఖించారు. కాని యూదులు ఈ అవకాశాన్ని ఉపయోగించుకుని, ముహమ్మద్ (స) నిజంగా దేవుడు నియమించిన ప్రవక్త అయినట్లయితే అబూ అమామా లాంటి వ్యక్తిని కోల్పోయి ఉండేవారు కాదని ప్రచారం చేయడం ప్రారంభిం

చారు. ప్రవక్త (స) తన బాధను దిగమింగి ఇలా ప్రకటించారు: "అబూ అమామా మరణం అనివార్యమైనది. నేనే ప్రవక్త నయితే అలాంటి అనుచరుడు మరణించకుండా అడ్డుకుని ఉండేవాడినని చెప్పేవారు ద్రోహులు. ఎందుకంటే, దేవుని అభీష్టానికి వ్యతిరేకంగా నేను చావుని తప్పించలేను, నా అనుచరులను కాపాడనూ లేను" అన్నారు. ఆ తర్వాత బనూ నజ్జార్ ప్రజలు ఆయన వద్దకు వచ్చి మరో నాయకుడిని నియమించమని కోరినప్పుడు ప్రవక్త (స) ఆ బాధ్యత తానే స్వీకరించారు. "మీరంతా నా సోదరులు, నేను మీలో వాడిని. నేనే మీ నాయకుడిని" అని ప్రకటించారు.

ఏదైనా నిర్మాణాత్మక కార్యక్రమం ప్రారంభమైనప్పుడు దానితో పాటు విధ్వంసక కార్యకలాపాలు కూడా దాన్ని వ్యతిరేకించడానికి పుట్టుకు వస్తాయి. ఇలాంటి పరిణామాలే ముస్లిం సమాజంలోను చోటుచేసుకున్నాయి. బహిరంగంగా ముస్లిముల పట్ల స్నేహాన్ని ప్రదర్శిస్తూ, ముస్లిముల్లో చేరిన కొందరు రహస్యంగా ఇస్లాం శత్రువులతో కుమ్మక్కయ్యారు.

ఇలాంటి పరిస్థితుల్లో ప్రవక్త (స) ఎలాంటి సవాళ్ళను ఎదుర్కున్నారో ఊహించవచ్చు. ఆయన ఒక సమగ్రమైన, బహుళార్థసాధక నిర్మాణాత్మక పథకాన్ని అమలు చేయడానికి పూనుకున్నారు. కాని ఆయనకు ఎదురవుతున్న సవాళ్ళు అన్నీ ఇన్నీ కావు. మక్కా నుంచి ప్రవాహంలా వస్తున్న ప్రవాసుల సమస్యను పరిష్కరించ వలసి ఉంది. మక్కా ఖురైషుల నుంచి ఏ క్షణాన్నయినా దాడి జరగవచ్చు, కాబట్టి దాడిని ఎదుర్కునే రక్షణపరమైన చర్యలు తీసుకోవలసి ఉంది. వీటన్నింటికి తోడు యూదులు, ముస్లిముల్లో వారి రహస్య వేగులు కొత్త కొత్త కుట్రలు పన్నుతున్నారు. వాటిని నిర్వీర్యం చేయవలసి ఉంది. ప్రవక్త (స) ఎలాంటి సంక్లిష్టమైన, ఎలాంటి బరువైన బాధ్యతలను నిర్వహించారు. ఒంటిచేత్తో అత్యంత సంక్షోభ పరిస్థితులను ఎలా ఎదుర్కున్నారు? ఒకవైపు ఇస్లామ్ సందేశం మూల మూలలకు విస్తరిస్తూ ఉంటే, మరోవైపు శత్రువుల దాడులు అంతర్గతంగా, బహిరంగంగా నానాటికి పెరుగుతూ పోతున్నాయి. అలాంటి పరిస్థితులను తన అసాధారణ నిర్వహణా సామర్థ్యంతో ప్రవక్త (స) అధిగమించారు.

## జవాబులేని ప్రశ్నలు

ఇస్లామ్ పురోగమనాన్ని అడ్డుకోవడానికి వివిధ ప్రయత్నాలు చేసి విఫలమైన యూదులు ఒక ఎత్తుగడ వేశారు. ప్రవక్త (స)ను అర్థం లేని వాదోపవాదాల్లో దించ



డానికి ప్రయత్నించారు. ప్రవక్త (స)ను ఇబ్బంది పెట్టే అర్థం పర్థంలేని ప్రశ్నలువేయడం మొదలు పెట్టారు. ఆ విధంగా ముస్లిములను దారి తప్పించడానికి ప్రయత్నించారు. ముస్లిముల ఒక సమావేశంలో యూదులు వచ్చి ప్రవక్త (స)తో "మనిషిని దేవుడు సృష్టిస్తే, దేవుడిని ఎవరు సృష్టించారు?" అనడిగారు. నిజానికి ఈ ప్రశ్న ఎలాంటి వివరణ కోసమూ అడిగిన ప్రశ్న కాదు. యూదులకు కూడా దేవుడి గురించి దేవుని గుణగణాల గురించి, విశ్వసృష్టి గురించి అవగాహన ఉంది. వారి మత గ్రంథాల్లో కూడా ఈ సమాచారం ఉంది. ప్రవక్త (స) ఈ ప్రశ్నను చాలా నెమ్మదిగా విన్నారు. ఈ పనికిమాలిన ప్రశ్నకు చాలా సరళమైన జవాబును దివ్యఖుర్ఆన్‌లోని సూరా ఇఖ్లాస్ పఠించడం ద్వారా ఇచ్చారు. ఆ సూరాలోని వాక్యాలు ఇవి:

> **'ఇలా చెప్పెయ్యి, ఆయన అల్లాహ్, అద్వితీయుడు. అల్లాహ్ నిరపేక్షాపరుడు. ఎవరి ఆధారమూ, ఎవరి అక్కరా లేనివాడు. అందరూ ఆయనపై ఆధారపడే వారే. ఆయనకు సంతానం ఎవరూ లేరు. ఆయన కూడ ఎవరి సంతానమూ కాదు. ఆయనకు సరిసమానులు ఎవరూ లేరు."** *(దివ్యఖుర్ఆన్* ***112 : 1-4****)*

మరో సందర్భంలో యూద రబ్బీలు కొందరు ప్రవక్త (స) వద్దకు వచ్చారు. తాము అడిగే నాలుగు ప్రశ్నలకు సంతృప్తికరంగా జవాబిస్తే ఇస్లామ్ స్వీకరిస్తామని చెప్పారు. అయితే ఈ ప్రశ్నలు ఇస్లామ్ మౌలిక నియమాలకు సంబంధించినవికావు, కనీసం ప్రాపంచిక జీవితంలోని సమస్యలకు సంబంధించినవి కావు. మరణానంతరం లభించే శిక్షా బహుమానాలకు సంబంధించినవి కూడా కాదు. చిక్కు ప్రశ్నల్లాంటి అర్థం పర్థం లేని ప్రశ్నలు. ఆ ప్రశ్నలు:

1. శిశువు, తండ్రి వీర్యం నుంచి జన్మించినా తల్లిలా ఎందుకు ఉంటుంది?
2. నిద్రావస్థ ఎలాంటిది?
3. ప్రవక్త ఇస్రాయీల్ (యాకూబ్) తనకు తాను నిషేధించుకున్నవి ఏమిటి? ఎందుకు ఆయన నిషేధించుకున్నాడు?
4. మీ వద్దకు దేవుని బోధనలు తీసుకొచ్చే దైవదూత ఎవరు?

ఈ ప్రశ్నలన్నింటికి ప్రవక్త (స) సంతృప్తికరమైన జవాబులిచ్చారు. ప్రతి ప్రశ్నకు జవాబు విన్న తర్వాత వాళ్ళు.. నిజం పలికారు.. దేవుని తోడు అంటూ ఒప్పుకున్నారు. నాల్గవ ప్రశ్నకు సంబంధించి మాత్రం వాళ్ళ ప్రతిస్పందన మారింది. దేవుని బోధనలు తీసుకొచ్చే దైవదూత పేరు జిబ్రాయీల్ అన్నది మీక్కూడా తెలుసు

అని ప్రవక్త (స) వారికి జవాబిచ్చారు. ఈ జవాబు విన్న తర్వాత వాళ్ళు "ముహమ్మద్! జిబ్రాయిల్ మాకు శత్రువు. అతను ఎప్పుడు వచ్చినా మాకు సమస్యలు, ఆపదల హెచ్చరికలే తెస్తాడు. ఆయనతో మాకు మంచి సంబంధం ఏదీ లేదు. ఈ శత్రువు మన మధ్య వచ్చి ఉండకపోతే మేము తప్పక నీ మాట విని నీకు విధేయత చూపి ఉండేవాళ్ళం" అన్నారు.

దీనికి ప్రవక్త (స) ఇచ్చిన సమాధానం చారిత్రకమైనది. క్రింది ఖుర్‌ఆన్ వాక్యాలను ఆయన జవాబుగా చదివారు :

**"ప్రవక్తా! వారితో ఇంకా ఇలా చెప్పు : "జిబ్రీల్ పట్ల విరోధం ఉన్న ప్రతివాడూ ఈ యథార్థాన్ని గ్రహించాలి. అల్లాహ్ ఆజ్ఞతోనే అతను ఈ ఖురానును నీ హృదయ ఫలకంపై అవతరింపచేశాడు. పూర్వం వచ్చిన అన్ని గ్రంథాలనూ అది ధృవీకరిస్తుంది. అవి నిజమని బలపరుస్తుంది. విశ్వసించే వారికి అది హితోపదేశం. సాఫల్యం సిద్ధిస్తుందని తెలిపే శుభవార్త."**

***(దివ్యఖుర్‌ఆన్ 2 : 97)***

సులైమాన్‌కు సంబంధించిన ఖుర్‌ఆన్ వాక్యాలను కూడా యూదులు పరిహసిస్తూ, సులైమాన్(అస) ప్రవక్త కానే కాదని అన్నారు. ఆయన కేవలం ఒక మంత్రగాడని చెప్పారు. ఈ మాటలను దివ్య ఖుర్‌ఆన్ గట్టిగా ఖండించింది.

**"వాస్తవంగా సులైమాను ఎన్నడూ అవిశ్వాసానికి ఒడిగట్టలేదు. అసలు అవిశ్వాసానికి పాల్పడింది ప్రజలకు చేతబడిని బోధించే షైతానులే. వారు హారూత్, మారూత్ అనే ఇద్దరు దైవదూతలపై బాబిలోనియాలో అవతరింపజేసిన దాని వెంట పడ్డారు."** ***(దివ్యఖుర్‌ఆన్ 2 : 102)***

ఖిబ్లా మార్పు గురించి దైవాదేశాలు అవతరించిన తర్వాత ఇస్లామీయ ఉద్యమం గొప్ప మలుపు తిరిగింది. ఇది నిర్ణయాత్మక మలుపు. ముస్లిములు నేడు కాకపోతే రేపయినా మూసా ప్రవక్త (స) మతం వైపునకే రావలసి ఉంటుందని యూదులు అప్పటి వరకు భావిస్తూ వచ్చారు. కాని ఖిబ్లా మార్పు ప్రకటన తర్వాత ఆ అభిప్రాయానికి తావు లేకుండా పోయింది. ఖిబ్లా మార్పుతో ఇస్లామ్ ప్రత్యేకత మరింత స్పష్టంగా ప్రకటితమయ్యింది. బైబిల్ ప్రకారం ప్రవక్త మూసా (అస) తర్వాత నాలుగు వందల సంవత్సరాలకు ప్రవక్త సులైమాన్ (అస) జెరుసలేమ్‌ను నిర్మించారు. కాని మూసా (అస)కు ఎనిమిది లేదా తొమ్మిది శతాబ్దాలకు పూర్వం ప్రవక్త ఇబ్రాహీమ్ (అస) కాబాను నిర్మించారు. భూమిపై మొదటి ఏకదైవారాధన కేంద్రం కాబాగృహం.



ప్రవక్త (స) మదీనాకు వచ్చినప్పుడు ముస్లిముల ఖిబ్లాగా జెరుసలేమ్ ఉండేది. దీనిక్కారణం అరబ్బులు తమ ప్రాంతానికి అవతల ఎలాంటి పవిత్ర ప్రదేశాలను అంగీకరించేవారు కాదు. వారి గర్వాతిశయాన్ని నిర్మూలించడానికి జెరుసలేమ్ ఖిబ్లాగా నిర్ణయించబడింది. యూదులు జెరుసలేమ్‌ను అత్యంత పవిత్రమైన ప్రదేశంగా భావిస్తారు. వారి గర్వాతిశయాన్ని అణచడానికి జెరుసలేమ్ నుంచి కాబా గృహానికి ఖిబ్లా మార్చడం జరిగింది. మదీనాకు జెరుసలేమ్ ఉత్తరాన ఉండేది. ముస్లిములు ప్రార్థనలో ఉన్నప్పుడు ఖిబ్లా మార్పు ఆదేశం అవతరించింది. ఆ వెంటనే సామూహిక ప్రార్థనల్లో ఉన్న ముస్లిములందరూ జెరుసలేమ్ దిక్కు నుంచి కాబా గృహం దిక్కువైపు తిరిగి ప్రార్థన కొనసాగించారు. దీనికి సంబంధించిన దైవాదేశాలు ఇలా ఉన్నాయి:

**"ఇదిగో నీకు అత్యంత ప్రీతికరమైన ఖిబ్లావైపునకే ఇప్పుడు మేము నిన్ను త్రిప్పుతున్నాము. కాబట్టి నీవు ముఖాన్ని 'మస్‌జిదె హరామ్' వైపునకు త్రిప్పు. ఇకపై మీరెక్కడున్నాసరే, ముఖాన్ని ఆ వైపునకు పెట్టి నమాజు చెయ్యండి."**

***(దివ్యఖుర్‌ఆన్ 2 : 144)***

ఖిబ్లా మార్పు గురించి తెలియగానే యూదులు దుష్ప్రచారం మొదలు పెట్టారు. తమతో శత్రుత్వం ఉన్నందువల్ల ముహమ్మద్ (స) అనేకమంది ప్రవక్తల ఖిబ్లాను కూడా మార్చేశారని ఆరోపించసాగారు. ముహమ్మద్ (స) నిజంగా ప్రవక్త అయినట్లయితే ఇలాంటి పని ఎన్నడూ చేసి ఉండేవారు కాదని చెప్పసాగారు.

కాని విశ్వాసులు మాత్రం స్పష్టంగా ప్రకటించారు.

**"మేము ఆదేశం విన్నాము. శిరసావహించాము... మేము గ్రంథాన్ని విశ్వసించాము. సంపూర్ణ గ్రంథాన్ని విశ్వసించాము. ఇది మా ప్రభువు నుంచి వచ్చింది."** ***(దివ్యఖుర్‌ఆన్ 2 :285, 3:7)***

ఈ దైవాదేశం ఇలా స్పష్టంగా ప్రకటించింది :

**"ప్రప్రథమంగా మానవుల కొరకు నిర్మించబడిన ఆరాధనాగృహం నిస్సందేహంగా మక్కాలో ఉన్నదే. దానికి సకల శుభాలు ప్రసాదించబడ్డాయి. విశ్వ ప్రజలందరికీ అది మార్గదర్శక కేంద్రంగా రూపొందించబడింది. దానిలో స్పష్టమైన సూచనలు ఉన్నాయి, ఇబ్రాహీము యొక్క ప్రార్థనాస్థలం ఉన్నది. దానిలో ప్రవేశించినవాడు రక్షణ పొందుతాడు. ప్రజలపై అల్లాహ్‌కు ఉన్న హక్కు ఏమిటంటే, ఈ గృహానికి వెళ్ళే శక్తిగలవారు దాని హజ్‌ను విధిగా**

**చెయ్యాలి. ఈ ఆజ్ఞను పాలించడానికి తిరస్కరించేవాడు అల్లాహ్‌కు ప్రపంచ ప్రజల అవసరం ఎంతమాత్రం లేదు అని స్పష్టంగా తెలుసుకోవాలి."**
***(దివ్యఖుర్‌ఆన్ 3 : 96, 97)***

ఎలాంటి నిర్మాణాత్మక పథకం లేని యూదులు, మానవాళిని పతనం నుంచి కాపాడే యోగ్యత కాని, నైతికప్రమాణాలు పెంచే, ఆత్మపరిశుద్ధతకు తోడ్పడే, వారి సాఫల్యానికి హామీ ఇచ్చే, కనీసం తమను తాము సంస్కరించుకునే స్థితిలో లేని యూదులు తమ ఆధిక్యతను కోల్పోక తప్పలేదు. ఈ పరిస్థితిలో దిక్కుతోచని యూదులు అత్యంత హీనమైన ఎత్తుగడలకు పాల్పడ్డారు. ప్రవక్త (స)తో మాట్లాడేటప్పుడు ద్వందార్థాలతో అస్పష్టంగా మాట్లాడేవారు. నోట్లో నాలుకని మెలి తిప్పడం ద్వారా పదాల అర్థం మారిపోయి దుర్భాష, శాపాల భావాలు ధ్వనించేలా చేసేవారు. అలాగే ముస్లిములు నమాజు కోసం పిలిచే అజాన్‌లోని పదాలను కూడా మార్చేసి పరిహసించేవారు.

**"అల్లాహ్‌కు మంచి రుణం ఇచ్చేవారు మీలో ఎవరైనా ఉన్నారా? దానిని ఆయన ఎన్నో రెట్లు అధికం చేసి తిరిగి ఇస్తాడు."** ***(దివ్యఖుర్‌ఆన్ 2 : 245)***

ఈ దైవాదేశం వచ్చినప్పుడు ఇందులోని భావాన్ని అర్థం చేసుకునే బదులు యూదులు అపహాస్యం చేస్తూ అల్లాహ్ మరీ దరిద్రంలో ఉన్నట్టున్నాడు, అప్పు అడుగుతున్నాడని విరగబడి నవ్వేవారు. అలాగే ఒక దైవాదేశంలో ఈగలను, దోమలను పోలికకు వాడుకున్నప్పుడు యూదులు అపహాస్యం చేస్తూ ఈగలు, దోమల వంటి చిన్నా చితక జీవులను పోలికలకు వాడుకునేది దైవవాక్కు అవుతుందా అని ఎగతాళి చేశారు. దివ్యఖుర్‌ఆన్ క్రింది విధంగా ఈ అపహాస్యాలకు జవాబిచ్చింది.

**"అవును. దోమ లేక దానికంటే మరీ అల్పమైన వస్తువును దృష్టాంతంగా చెప్పటానికి అల్లాహ్ ఎంతమాత్రం సిగ్గుపడడు. ఈ దృష్టాంతాన్నే సత్య స్వీకారులు చూసి ఇది తమ ప్రభువు తరఫు నుండి వచ్చిన సత్యమే అని గ్రహిస్తారు. కాని సత్యతిరస్కారులు వాటిని విని "ఈ ఉపమానాల ద్వారా అల్లాహ్ చెప్పదలచుకున్నదేమిటి?" అని ప్రశ్నిస్తారు."** ***(దివ్యఖుర్‌ఆన్ 2 : 26)***

యూదుల మనస్తత్వం నానాటికి మరింత దిగజారసాగింది. నిజానికి కొత్త ప్రవక్త (స) వస్తున్నాడన్న భవిష్యవాణి యూదులకు ఇవ్వబడిందన్న ప్రశ్న వారి ముందుకు వచ్చినప్పుడు వారు నిస్సిగ్గుగా తాము ఎలాంటి ప్రవక్త కోసమూ ఎదురు చూడ్డం లేదని అన్నారు. ముహమ్మద్ (స) నిజంగా ప్రవక్త అయినట్లయితే ఒక



స్పష్టమైన సూచన తమ ముందుకు తీసుకురావాలని సవాలు చేశారు. ఆ సూచన కూడా యూదుల కోరికల మేరకు ఉండాలన్నారు. వారి కోరికలేమిటంటే: "ముహమ్మద్! మా కోసం రాయబడిన గ్రంథాన్ని తీసుకురా, అది ఆకాశం నుంచి మా కళ్ళ ముందు క్రిందికి దిగాలి. మేం స్వయంగా అది చదవగలగాలి. అప్పుడు మేం నీ మాట వింటాం". మరో కోరిక ఏమంటే, "ముహమ్మద్ (స) నువ్వు నిజంగా దేవుని ప్రవక్తవే అయితే మాతో మాట్లాడమని నీ దేవుడికి చెప్పు. మేం ఆయన మాటలు వినాలి"

ఈ కోరికలకు జవాబిస్తూ ప్రవక్త (స) "మీకు తెలుసు నేనే ప్రవక్తనని, ఖుర్‌ఆన్ దేవుని గ్రంథమని మీకు తెలుసు. మీ తోరా గ్రంథంలో మీరు చదివారు" అన్నారు. దీనికి యూదులు "ముహమ్మద్ ! దేవుడు ప్రవక్తను పంపేటప్పుడు ప్రవక్త కోరింది ఇస్తాడు. కాబట్టి నువ్వు మేం చదువగలిగిన పుస్తకాన్ని దేవుని నుంచి తీసుకురా" అన్నారు. ఈ వాదనలో ఎక్కడ కూడా ప్రవక్త (స) సందేశం లోని మంచి, ఔన్నత్యం మేళ్ల గురించి చర్చలేదు. ప్రవక్త (స) సందేశంలోని మేలును విశదీకరించే వాదన విషయంలో ఎక్కడా చర్చ లేదు. ప్రవక్త (స) సందేశం ప్రతిపాదించే జీవనవిధానం గురించి వారు మాట్లాడ్డం లేదు. ఈ బోధనల స్వభావం గురించి, వాటి వల్ల ఏర్పడే సామాజిక వ్యవస్థ గురించి, ఈ సందేశం మానవాళిలో సృష్టించాలనుకుంటున్న వ్యక్తిత్వం గురించి.. వీటి గురించి వీళ్ళు మాట్లాడడం లేదు. వీటన్నింటినీ పక్కన పెట్టి వాళ్ళు డిమాండ్ చేస్తున్నది ఏమంటే, ఒక రాయబడిన పుస్తకాన్ని, మేం చదువగలిగే పుస్తకాన్ని ఆకాశం నుంచి తీసుకురా అంటున్నారు. ప్రవక్త (స)కు వ్యతిరేకంగా ఈ ప్రాపగాండా కొనసాగించాలని నిర్ణయించారు. ప్రవక్త (స) సందేశం వారి ముందుకు వచ్చినప్పుడల్లా "మేం ఆయన్ను విశ్వసించడానికి సిద్ధంగా ఉన్నాం. కాని ఆయన నిజమైన ప్రవక్త అయితే మాకు ఈ సూచన తీసుకురావాలి. దేవుని నిజమైన ప్రవక్తలు దేవుని వద్ద నుంచి తాము కోరింది తీసుకువస్తారు. ఈయనెలాంటి ప్రవక్త? ఆకాశంలో ఈయన మాటకు విలువే లేదు." అనేవారు.

మదీనా ఆర్థిక వ్యవస్థ, ఆర్థిక వనరులు చాలా పరిమితమైనవి. మరోవైపు మక్కా నుంచి ప్రవాహంలా వస్తున్న ప్రవాసుల వల్ల మరింత ఆర్థిక భారం పెరిగింది. కట్టుబట్టలతో అక్కడికి వచ్చిన ప్రవాసులు కొత్త జీవితాన్ని ఆరంభించడానికి ప్రయత్నాలు చేస్తున్నారు. ఇస్లామీయ ఉద్యమ కార్యకర్తల్లో చాలా మంది తీవ్రమైన ఆర్థిక ఇబ్బందులను, పేదరికాన్ని, పోషకాహార లోపాన్ని ఎదుర్కుంటున్నారు. ప్రవక్త (స)

కుటుంబానికి కూడా ఈ ఇబ్బందులు తప్పలేదు. నిజానికి ఈ సమస్యల్లో చాలా భాగాన్ని ప్రవక్త (స) స్వయంగా తన భుజాలకెత్తుకున్నారు.. అంతేకాదు మక్కా నుంచి వచ్చిన ప్రవాసులకు మదీనా వాతావరణం పడలేదు. ఒకవైపు ఆకలిదప్పులు, మరోవైపు సరిపడని వాతావరణం వల్ల వారిలో చాలా మంది జబ్బు పడ్డారు. జ్వరం వల్ల మంచాన పడిన వాళ్ళు తమ భుక్తికి సంపాదించుకోలేని పరిస్థితిలో ఉన్నారు. ఈ విధంగా ముస్లిములు అనేక సమస్యల్లో కూరుకుపోయి ఒకవైపు కొట్టు మిట్టాడుతుంటే, మరోవైపు మదీనాలో ఒక సరికొత్త వ్యవస్థ, ఇస్లామీయ రాజ్యవ్యవస్థ అంకురార్పణ దశలో ఉంది. ఉద్యమ కార్యకర్తలు అన్నివిధాల సమస్యల్లో, కష్టాల్లో, ఒత్తిళ్ళలో ఉన్నారు. కనీసం శరీరాన్ని కప్పుకోవడానికి సరయిన దుస్తులు కూడా లేనిస్థితిలో ఉన్నారు. ఆ విధంగా అత్యంత తీవ్రమైన పరీక్షను ఎదుర్కొం టున్నారు. ఈ దుర్భర పరిస్థితిని ఎదుర్కున్న ప్రారంభ కాలం నాటి ఆ గుప్పెడు మంది ముస్లిముల చెక్కుచెదరని విశ్వాసం, మడమ తిప్పని మనోబలం అసాధ్యాన్ని సుసాధ్యంగా చేసి చూపించింది. భౌతికంగా ఎదురవుతున్న కష్టనష్టాలకు ఏమాత్రం చలించకుండా తమ ఆత్మబలాన్ని నిలబెట్టుకుని స్థిరంగా ముందుకు సాగారు.

ఎలాంటి తీవ్రమైన కష్టాలను వాళ్ళు అనుభవించారో తెలుసుకోడానికి క్రింది కొన్ని ఉదాహరణలు చాలు.

హ(జత్ అబూబక్ర్ (రజి) నొప్పితో అలమటిస్తూ, జబ్బుతో మంచాన పడి ఉన్నప్పుడు క్రింది వాక్యాలు పలికారు.

"ప్రతి రోజు ప్రతి మనిషికి చావు తన పాదరక్షల తాడు కన్నా దగ్గరగా కనబడుతోంది"

హ(జత్ బిలాల్ (రజి) జబ్బుతో మంచానపడి లేవలేని పరిస్థితిలో మక్కాలోని నీటిబుగ్గలను, పొదలను ఇలా గుర్తు చేసుకున్నారు.

"మక్కాలోయలో నా చుట్టు పొదలతో మజ్నాలోని నీటి బుగ్గల మధ్య షమా, తుఫైల్ కొండలను చూస్తూ నేను గడపగలిగితే బాగుండు" అనుకున్నారు.

హ(జత్ ఆమిర్ ముంచుకొస్తున్న మరణాన్ని గుర్తించి ఇలా పలికారు:

"చావు రుచి చూడక ముందే దాన్ని గుర్తించాను. పిరికివాని చావు పైనుంచి క్రిందికి దిగుతుంది" అన్నారు.



హ(జత్ షద్దాద్ జబ్బుతో మంచాన పడి ఉన్నారు. ప్రవక్త (స) ఆయన్ను చూడ్డానికి వెళ్ళారు. తనకు మక్కా నీళ్ళు తాగడానికి దొరికితే తన జబ్బు తగ్గిపోతుందని షద్దాద్ నిరాశగా అన్నారు. "నువ్వు వెళ్ళవచ్చు.. ఎవరు ఆపుతున్నారు? కాని ఎక్కడికి వెళ్ళినా నువ్వు ప్రవాసివే" అన్నారు.

హుదైబియా ఒప్పందం సందర్భంగా ముస్లిములు మక్కా వెళ్ళినప్పుడు వారి శరీరాలు పోషణలేమి వల్ల, జబ్బు పడ్డం వల్ల శుష్కించిపోయి ఉన్నాయి. వారిని చూసి అవిశ్వాసులు చూశారా వలస వెళ్ళాక మీకేం దొరికిందో అని ఎగతాళి చేయ సాగారు. అప్పుడు ప్రవక్త (స) ముస్లిములను హుందాగా, ఠీవిగా నడవాలని ఆదేశిం చారు. ఆ విధంగా వారి శారీరక బలహీనత బయటపడకుండా ఉండాలని చెప్పారు.

ఆ కాలం నాటి ఒక సంఘటనను హ(జత్ అబూ తల్హా (రజి) వివరించారు. పరిస్థితులు భరించరాని స్థాయికి వెళ్ళినప్పుడు ఒకరోజు వారంతా కలిసి ప్రవక్త (స) వద్దకు వెళ్ళారు. ఆయన నుంచి కొంత ఊరట పొందాలనుకున్నారు. ప్రవక్త (స) వద్దకు వెళ్ళి ఆకలిబాధను తట్టుకోడానికి పొట్టకు రాయి కట్టుకున్నామని ప్రవక్త (స)కు చూపించారు. ప్రవక్త (స) నెమ్మదిగా తన చొక్కా కాస్త పైకెత్తి చూపించారు. ఆయన పొట్టపై రెండు రాళ్లు కట్టి ఉన్నాయి. ప్రవక్త (స) వద్ద తమ కష్టం చెప్పుకోడానికి వెళ్ళిన వారు ఆ పరిస్థితి చూసి మారు మాట్లాడలేకపోయారు.

ఒకరోజు హ(జత్ అబూబక్ర్ (రజి) తన దీనస్థితిని ప్రవక్త (స)కు చెప్పుకుని కాస్త ఊరట పొందాలని వెళ్ళారు. కాని ప్రవక్త (స)కు తన గురించి చెప్పడం వల్ల ఆయన బాధపడతారని భావించి మౌనంగా ఉండిపోయారు. ఈ లోగా హ(జత్ ఉమర్ (రజి) అక్కడికి వచ్చి నిర్మొహమాటంగా ఆకలి బాధ చంపేస్తుందని అన్నారు. ప్రవక్త (స) తన పరిస్థితి కూడా ఏమంత మెరుగ్గా లేదని అంటూ, అబుల్ హైషామ్ వద్దకు వెళదామని సూచించారు. అబుల్ హైషామ్ సంపన్నుడు, అతనికి చాలా తోటలున్నాయి. ఈ ముగ్గురు అక్కడికి వెళ్ళారు. అబుల్ హైషామ్ వారికి స్వాగతం పలికాడు, వారిని కౌగిలించుకున్నాడు. ఒక దుప్పటి పరిచి దానిపై ద్రాక్షపండ్లు వారి ముందు ఉంచాడు. వారు ముగ్గురు అవి తిన్నారు. మంచినీళ్ళు తాగి, అబుల్ హైషామ్‌ను ఆశీర్వదించి వెళ్ళిపోయారు.

ప్రవక్త (స) సన్నిహిత అనుచరుడు అబూ హురైరా (రజి) ఒకసారి ఆకలిబాధ వల్ల తెలివితప్పి పడిపోయారు. ఒకసారి అబూహురైరా (రజి) హ(జత్ ఉమర్ (రజి)తో

ఉన్నారు. దివ్యఖుర్ఆన్‌లోని ఒక వాక్యం భావాన్ని చర్చిస్తున్నారు. హఠాత్తుగా ఆయన స్పృహతప్పిపోయారు. ఆకలిబాధే దానికి కారణం.

## ప్రజా ధనాగారం

ప్రవక్త ముహమ్మద్ (స) ఒక ప్రజా ధనాగారాన్ని ఏర్పాటు చేశారు. ప్రభుత్వ వనరుల వల్ల వచ్చే ఆదాయం, విరాళాల వల్ల వచ్చే ఆదాయాన్ని అక్కడ జమచేసేవారు. ఆర్థిక అవసరాలు వచ్చినప్పుడు విరాళాలు ఇవ్వగలిగిన ముస్లిములు అన్సారులు కాని, ముహాజిర్లు కాని తమ స్తోమతను బట్టి, తమ అవసరాలను కూడా పక్కన పెట్టి విరాళాలు ఇచ్చేవారు. అవసరం ఉన్నవారికి ఉదారంగా సహాయం చేయాలన్నది ప్రవక్త (స) ఆదేశం. కాని ప్రజాధనాగారంలో జమ అయిన సొమ్ము అవసరాలకు చాలేది కాదు. ఆకలి, ఆహార కొరతను తీర్చడానికి ఈ మొత్తాలు సరిపోయేవి కావు. ప్రజా ధనాగారం బాధ్యత హజ్రత్ బిలాల్ (రజి) నిర్వహించేవారు. ప్రవక్త (స) ఆదేశానుసారం ఆహారధాన్యాలు కాని, నగదు మొత్తం కాని ప్రజాధనాగారంలో నిల్వ ఉండకుండా ఆయన జాగ్రత్త వహించేవారు. ఒకసారి భారీ ఎత్తున దిర్హములు ప్రజాధనాగారానికి వచ్చాయి. వాటిని ఒక చాపపై గుట్టగా వేశారు. అక్కడికక్కడే ఒక్క నాణెం కూడ మిగల్చకుండా అంతా పంచేశారు. అన్నీ పంచేసిన తర్వాత అవసరం ఉన్న వ్యక్తి ఒకడు వచ్చాడు. ఆ వ్యక్తికి సహాయం చేయాలని, అవసరమైతే రుణం తీసుకునైనా సహాయం చేయాలని ప్రవక్త (స) అన్నారు.

హజ్రత్ బిలాల్ (రజి) వద్ద ఖర్జూరాలు నిల్వ ఉండడాన్ని ఒకసారి ప్రవక్త (స) చూశారు. అవెందుకున్నాయని అడిగారు. అత్యావసర పరిస్థితిలో ఉపయోగ పడతాయని దాచినట్లు హజ్రత్ బిలాల్ (రజి) చెప్పారు. ప్రవక్త (స) ఆయన్ను మంద లిస్తూ "వీటిని నిల్వ ఉంచినందుకు తీర్పుదినాన నరకాగ్ని పొగలు రుచి చూడవలసి వస్తుందన్న భయం నీకు లేదా? వీటిని ఖర్చు పెట్టేయ్... సర్వ శక్తిమంతుడి వద్ద దేనికీ తక్కువ లేదు.. భయపడకు" అన్నారు.

ముస్లిములు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కుంటున్నప్పుడు యూదులు ఈ పరిస్థితిని తమకు అనుకూలంగా ఉపయోగించుకోవాలని పథకం వేశారు. ఒకసారి ఒక ముస్లిమేతరుడు వచ్చి హజ్రత్ బిలాల్ (రజి)ను కలిసి ఆయనకు ఎప్పుడు అవసరమైతే అప్పుడు డబ్బు సర్దుబాటు చేస్తానని అన్నాడు. హజ్రత్ బిలాల్ (రజి) అతని నుంచి రుణం తీసుకోవడం ప్రారంభించారు. ముఖ్యంగా ప్రజాధనాగారం వనరులు తక్కువగా



ఉన్నప్పుడు అవసరాలు తీర్చడానికి ఈ రుణాలు తీసుకునేవారు. ఒక రోజు హజ్రత్ బిలాల్ (రజి) వుజూ చేసుకుని నమాజుకు అజాన్ ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నప్పుడు ఈ వ్యక్తి వచ్చాడు. రావడంతోనే అరుస్తూ, దుర్భాషలాడుతూ చేసిన అప్పు నెలాఖరు లోగా చెల్లించకపోతే ఊరుకునేది లేదని హెచ్చరించాడు. అప్పు చెల్లించకపోతే మళ్ళీ బానిసగా మార్చేస్తానని అన్నాడు. ఈ హెచ్చరికతో ఆందోళన చెందిన హజ్రత్ బిలాల్(రజి) ప్రవక్త (స) వద్దకు వచ్చారు. జరిగిందంతా చెప్పి అప్పు చెల్లించే ఏర్పాటు జరిగేవరకు తాను ఎక్కడైనా దాక్కోవడం మంచిదని అన్నారు. కాని ఆయన్ను మరుసటి రోజు పొద్దున్నే ప్రవక్త (స) పిలిచారు. అక్కడ ఫదక్ నాయకుడు పంపించిన నాలుగు ఒంటెల నిండా ఉన్న సంపద ఉంది. దాంతో అప్పు తీర్చడమే కాదు, అవసరమైన వారికి మిగిలిన సంపద పంపిణీ చేశారు.

అబూ హజ్రత్ అస్లమి యూదులకు బకాయిపడ్డారు. బాకీ తీర్చడానికి ఆయన వద్ద ఎలాంటి సొమ్ము లేదు. యూదులు ఆయనకు ఎలాంటి వ్యవధి ఇవ్వడానికి సిద్ధంగా లేరు. ఆయన్ను పట్టుకుని ప్రవక్త (స) వద్దకు లాక్కుని వచ్చారు. తమ అప్పు అప్పటికప్పుడు తీర్చాల్సిందేనన్నారు. కాని ఆయన వద్ద అప్పు తీర్చడానికి ఏమీలేదు కాబట్టి, వాళ్ళు ఆయన దుస్తులు ఒలిచేశారు. చివరకు ఆయన తన తలపాగా తీసి నడుం చుట్టు కట్టుకోవలసి వచ్చింది.

హజ్రత్ జాబిర్ బిన్ అబ్దుల్లా నిజానికి సంపన్న కుటుంబానికి చెందిన వ్యక్తి. కాని ఆయన యూదుల వద్ద అప్పు చేశారు. తనకు అవసరమైనప్పుడు యూద వ్యాపారి వద్ద అప్పు చేసేవారు. ఒకసారి ఖర్జూరాల దిగుబడి చాలా తగ్గిపోయింది. అందువల్ల జాబిర్ అనుకున్న సమయానికి అప్పు తీర్చలేకపోయారు. తర్వాతి సంవత్సరం పంట వచ్చిన తర్వాత అప్పు తీర్చేస్తానని జాబిర్ అన్నారు. కాని తర్వాతి సంవత్సరం కూడా పంట దెబ్బతిన్నది. ఆ యూదుడు మరింత సమయం ఇవ్వడానికి నిరాకరించాడు. ప్రవక్త (స) గారి వద్దకు వచ్చి జాబిర్ మొరపెట్టుకున్నారు. ప్రవక్త (స) స్వయంగా కొంత సమయం ఇవ్వమని యూదుడిని కోరారు. కాని ఎంత చెప్పినా ఆ యూదుడు మొండిగా ఏమాత్రం వ్యవధి ఇచ్చేది లేదన్నాడు. అప్పుడు ప్రవక్త (స) జాబిర్ తోట వద్దకు వెళ్ళారు. ఖర్జూరపు చెట్లను పట్టుకుని గట్టిగా ఊపమని చెప్పారు. అలా చేయడం వల్ల ఎన్ని ఖర్జూరాలు రాలి పడ్డాయంటే, అప్పు తీర్చడంతో పాటు మరిన్ని ఖర్జూరాలు మిగిలిపోయాయి.

ప్రవక్త (స) గారి తపాలా సీలు (మెయిల్ క్లాక్) ఒక యూదుడి వద్ద తనఖా

ఉండేది. దాన్ని విడిపించుకోవడానికి కావల్సినంత సొమ్ము ఆయన వద్ద ఎన్నడూ రాలేదు.

ప్రవక్త (స)కు కొంత సొమ్ము అప్పు ఇచ్చిన ఒక వ్యక్తి వచ్చి పరుష పదజాలంతో ప్రవక్త(స)తో మాట్లాడి అప్పు వెంటనే చెల్లించాలన్నాడు. ప్రవక్త (స) అనుచరులు ఇది చూసి జోక్యం చేసుకోబోయారు. ఆ వ్యక్తి తన అప్పు తిరిగి చెల్లించాలని అడుగుతున్నాను తప్ప మరేమీ అడగడం లేదన్నాడు. ప్రవక్త (స) కూడా తన అనుచరులతో ఆ వ్యక్తి చెబుతున్నది సబబేనని, వాళ్ళు కూడా ఆ వ్యక్తికి మద్దతుగా మాట్లాడ్డమే న్యాయమని చెప్పారు. అలాగే తన అప్పు తీర్చేసి మరికొంత అధికంగానే అతడికి ముట్టజెప్పారు.

జైద్ ఇబ్నె సనా ఒక యూద రబ్బీ. ముహమ్మద్ (స) ప్రవక్తనని చేస్తున్న వాదనను చాలా నిశితంగా గమనిస్తూ వచ్చాడు. అక్కడి పరిస్థితులను చాలా దగ్గరగా చూస్తున్నాడు. ఒకరోజు ఒక అరబ్బు గిరిజనుడు ప్రవక్త (స) వద్దకు వచ్చాడు. తన తెగవాళ్ళు ఇస్లామ్ స్వీకరించారని చెప్పాడు. ఇస్లామ్ స్వీకరిస్తే దేవుడు వాళ్ళందరిని ధనవంతులు చేస్తాడని చెప్పినట్లు తెలిపాడు. కాని ఇస్లామ్ స్వీకరించిన తర్వాత వాళ్ళు ధనవంతులయ్యే బదులు కరువు కాటకాలకు గురయ్యారని, వారికి సహాయం అందజేయకపోతే వాళ్ళు తిరిగి పాత మతానికి మారిపోయే అవకాశం ఉందని అన్నాడు. అప్పుడు జైద్ ఇబ్నె సనా తన తరఫున 8 కొలతల బంగారం అప్పుగా ఇస్తానన్నాడు. అంటే దాదాపు 360 గ్రాములు. తర్వాతి సంవత్సరం ఖర్జూరపు పంటలో ఆ అప్పు తీర్చమన్నాడు. సంవత్సరం గడిచిపోయింది. జైద్ ఇబ్నె సనా ఇచ్చిన అప్పు తీర్చడం వారికి సాధ్యపడలేదు. జైద్ తిన్నగా ప్రవక్త (స) వద్దకు వచ్చాడు. పరుషంగా తన అప్పు తీర్చమని నిలదీశాడు. "ముహమ్మద్ ! నువ్వు నా అప్పు తీర్చలేదు. దేవుని తోడు, నాకు బాగా తెలుసు, అబ్దుల్ ముత్తలిబ్ సంతానం అంతా ఇంతే, అప్పు ఎగ్గొడతారు." అన్నాడు. ఇది విని హజ్రత్ ఉమర్ (రజి) ఆగ్రహంగా లేచి "ఎవరితో మాట్లాడుతున్నావో తెలుసా? నేను ప్రవక్త (స) సమక్షంలో ఉన్నాను కాబట్టి ఆగుతున్నాను. లేకపోతే నా కరవాలంతో ఇక్కడే నీ తల నరికేసి ఉండేవాడిని" అన్నారు. కాని ప్రవక్త (స) హజ్రత్ ఉమర్ (రజి)ను శాంతపరుస్తూ ఇలా చెప్పారు : "ఇలాంటి పరిస్థితిలో అప్పు త్వరగా తీర్చే సలహా ఇవ్వాలి, కాస్త మర్యాదగా అడగమని అవతలి వ్యక్తికి నచ్చచెప్పాలి, సరే, ఇప్పుడు వెళ్ళి అతని అప్పు తీర్చేయండి, అంతేకాదు, మీరు అతడిపై ఆగ్రహించినందుకు 20 కొలతల ఖర్జూరాలు ఎక్కువ ఇచ్చి పంపండి" అన్నారు.



నిజానికి జైద్ బిన్ సనా ప్రవక్త (స) వైఖరిని పరీక్షించడానికి అలా మాట్లాడారు. ఇది జైద్ ప్రవక్త విషయంలో తీసుకున్న చివరి పరీక్ష. ఆ తర్వాత ఆయన హజ్రత్ ఉమర్ (రజి)ను సాక్షిగా పెట్టుకుని ఇస్లామ్ స్వీకరించారు. తన ఆస్తిలో సగం ముస్లిముల సంక్షేమానికి ఇచ్చేశారు. జైద్ ఇతర యూద వడ్డీ వ్యాపారుల వంటి వాడు కాదు. కాని ఈ సంఘటన వల్ల ముస్లిములు ఎలాంటి ఇబ్బందికరమైన పరిస్థితుల్లో ఉండే వారో తెలుస్తోంది. వారికి అప్పు చేయక తప్పని పరిస్థితి ఉండేది. ఆ తర్వాత అప్పు ఇచ్చిన వారి క్రూరమైన ప్రవర్తనను భరించవలసి వచ్చేది.

రుణగ్రస్తులైన ముస్లిములను క్రూరంగా వేధించడంతో వాళ్ళు తృప్తి చెందలేదు. బీద ముస్లిములకు అప్పులు ఇవ్వడం ఆపేయాలని యూదులు, ఇతర ముస్లిమేతరులు నిర్ణయించుకున్నారు. ఆ విధంగా ఆర్థిక ఇబ్బందులకు గురికావడం వల్ల ఉద్యమం నీరుగారిపోతుందని అనుకున్నారు. యూదుల్లో కొందరు ప్రముఖులు మదీనాలోని అన్సారుల వద్దకు కూడా వెళ్ళి "మీ సంపదను ముస్లిముల కోసం వ్యర్థం చేయకండి" అని సలహాలు కూడా ఇచ్చారు. ముస్లిములపై మీ సంపదను వ్యర్థం చేసుకుంటే మీరు నిరుపేదలవుతారు భవిష్యత్తు నాశనం అవుతుందని హెచ్చరించారు. యూదుల కుట్రకూటమి, వారి ఏజంట్లు రహస్య సమాలోచనలు జరిపి ముస్లిములకు ఎటు నుంచి ఆర్థిక సహకారం అందకుండా చేయాలనుకున్నారు. వారి కుట్రలను దివ్య ఖుర్ఆన్ ఇలా ప్రకటించింది.

> **"వారే ఇలా అనేది " ప్రవక్త అనుచరుల కోసం ఖర్చు పెట్టటం ఆపేయ్యండి. అప్పుడు వారు చెల్లాచెదరైపోతారు."** ***(దివ్యఖుర్ఆన్ 63 : 7)***

బీద ముస్లిములు అత్యంత క్లిష్ట పరిస్థితుల్లో ఇరుక్కున్నారు. వారికి ఆర్థిక సహాయం లభించడం లేదు. ఒకవేళ లభించినా అత్యంత క్రూరమైన దుర్భరస్థితి ఎదురవుతోంది. కాని శత్రువులు ఎంత దిగజారినా ఈ పరిస్థితులను కూడా ప్రవక్త(స) ఆయన అనుచరులు అత్యంత హుందాగా ఎదుర్కొన్నారు.

## యూద కుట్రలు

ఇస్లామీయ ఉద్యమం ఒక రాజ్య స్వరూపాన్ని సంతరించుకుంది. క్రమేణా విస్తరించసాగింది. ప్రజల మనోభావాలను గెలుచుకునే ప్రబలమైన సిద్ధాంతమేదీ యూదుల వద్ద లేదు. అత్యున్నత స్థాయి ఇస్లామీయ సంస్కృతికి సమానమైన నైతిక నియమావళి కూడా వారివద్ద లేదు. అంతేకాదు, వారి నైతిక సరళి అత్యంత పతనా

వస్థలో ఉంది. ఈ పతనం నుంచి వారు బయటకు వచ్చే సూచనలు కూడా ఏవీ కనబడడం లేదు. వారు ఒక విధమైన న్యూనతాభావానికి గురై ఉన్నారు. అందువల్ల వారిలో విద్వేషం, ఈర్ష్యా శత్రుత్వాలు పెరిగాయి. కాని వారు ఇస్లామ్‌ను బహిరంగంగా వ్యతిరేకించే స్థితిలో లేరు. అందువల్ల వారు మోసపూరిత కుట్రల మార్గాన్ని ఎన్ను కున్నారు. ముస్లిముల్లో తమ రహస్య ఏజంట్లను నియమించుకోగలిగారు.

ఇస్లామ్ నానాటికి విస్తరిస్తుండడం వల్ల, దినదిన ప్రవర్థమానం అవుతూ ఉండడం వల్ల కొందరు తమ స్వార్థ ప్రయోజనాలను కాపాడుకోవడానికి ముస్లిముల్లో చేరిపోయారు. ఈ కపట ముస్లిములు పైకి తాము ముస్లిములమని చెప్పుకున్నప్పటికీ వారి హృదయాల్లో ఇస్లామ్ లేదు. యూదులు ఈ కపటులను కనిపెట్టి వారిని ఉపయోగించుకోవడం ప్రారంభించారు. ఈ కపట ముస్లిములు పైకి ముస్లిముల్లా నటిస్తూ కుట్రలు కుతంత్రాలు పన్నేవారు. బనూ ఖైనుకా తెగకు చెందిన సాద్ ఇబ్నే హనీఫ్, జైద్ ఇబ్నే లుసాయిత్, నోమన్ ఇబ్నె యుఫీ ఇబ్నె అమ్ర్, రిఫా బిన్ జైద్ బిన్ తాబుత్, సిల్‌సిలా ఇబ్నే బుర్హాన్, కినానా ఇబ్నె సుర్య వంటి వారు ఈ గుంపులో ఉన్నారు. వీళ్ళందరికీ నాయకుడు అబ్దులా బిన్ ఉబై. హజ్రత్ ఆయేషా (రజి)కు వ్యతిరేకంగా దుష్ప్రచారం చేయడంలో ఉబై అందరికన్నా ముందున్నాడు. కాస్త పరిశీలించి చూస్తే ఈ గుంపులో ఉన్న వారందరూ ముసలివారు. సంపన్నులు. వారి హృదయాలు కఠిన శిలలుగా మారిపోయినవాళ్ళు, తమ ప్రయోజనాలు దెబ్బతింటున్నాయని భయపడుతున్నవాళ్ళు. ఈ గుంపులో ఉన్న యువకుడు ఒకే ఒక్కడు.. అతని పేరు ఖైస్ ఇబ్నె అమ్ర్ బిన్ సహల్.

జైద్ ఇబ్నె లుసాయిత్ ఒకసారి బజారులో హజ్రత్ ఉమర్ (రజి)తో ఘర్షణకు దిగాడు. ఒకసారి ప్రవక్త (స) ఆడ ఒంటె పోయింది. అప్పుడు జైద్ ఇబ్నె లుసాయిత్ ఎగతాళి చేస్తూ "ఆయన ఆకాశంలో సమాచారం తెలుసని అంటాడు. కాని ఇప్పుడు ఆయనగారి ఆడ ఒంటె ఎక్కడుందో ఆయనకు తెలియదని" అపహాస్యం చేశాడు. ఈ ఎగతాళికి జవాబిస్తూ ప్రవక్త (స) "దేవుని తోడు, నాకు దేవుడు తెలియజేసిన దాని కన్నా ఎక్కువగా ఏదీ తెలియదు. నా ఆడ ఒంటె ఎక్కడుందో దేవుడే తెలియజేశాడు. ఈ పక్కనే ఉన్న లోయలో ఉంది. దాని ముక్కుతాడు ఒక పొదలో ఇరుక్కుని ఉంది" అన్నారు. ఈ మాటలు విని ఆ ఒంటెను వెదకడానికి జనం వెళ్ళారు. వాళ్ళకు ఆ ఒంటె ప్రవక్త (స) చెప్పిన ప్రదేశంలో, ఆయన చెప్పిన స్థితిలోనే కనబడింది.

ఇలాంటి కుట్రదారుల్లో మరొకడు రాఫే బిన్ హురైమిలా. ఈ కుట్రదారుల



గుంపులో పేరుమోసిన వాడు. అతను చనిపోయినప్పుడు ప్రవక్త (స) "ఈ రోజు కుట్రదారుల నాయకుల్లో ఒకడు చనిపోయాడు" అని వ్యాఖ్యానించారు. ఈ గుంపులో రిఫా బిన్ జైద్ బిన్ తాబూత్ కూడా ప్రముఖుడు. ఒకసారి భీకరమైన తుఫాను విరుచుకుపడింది. ప్రజలు భయభ్రాంతులకు గురయ్యారు. ప్రవక్త (స) వారికి ధైర్యం చెబుతూ ఈ తుఫాను కుట్రదారుల నాయకుల్లో ఒకడికి శిక్ష విధించడానికి వచ్చిందన్నారు. తుఫాను శాంతించిన తర్వాత ప్రజలకు మదీనా పట్టణంలో రిఫా బిన్ జైద్ తుఫానులో చనిపోయి కనిపించాడు.

అబ్దుల్లా బిన్ ఉబైకి ప్రవక్త (స) పట్ల చాలా ద్వేషం ఉండేది. ప్రవక్త (స) రాకముందు మదీనా ప్రజలు అబ్దుల్లా బిన్ ఉబైని తమ నాయకుడిగా చేసుకోవాలను కున్నారు. కాని ప్రవక్త (స) మదీనా రావడంతో అతడి ఆశలపై చన్నీళ్ళు క్రుమ్మరించి నట్లయ్యింది. తన ప్రయోజనాలు కాపాడుకోవడానికి అబ్దుల్లా బిన్ ఉబై తనలాగా పైకి ముస్లిముల్లా నటించే వారితో కలిసి ముస్లిముల్లో చేరాడు. నిజానికి వీళ్ళంతా ఇస్లామ్‌కు బద్ధ శత్రువులు. ఒకసారి ప్రవక్త (స) సాద్ బిన్ ఉబాదాను చూడ్డానికి వెళ్ళారు. సాద్ జబ్బుపడి మంచాన ఉన్నారు. ఆయన ఒక కంచరగాడిదపై వెళుతున్నారు. ఆయనతో పాటు అదే వాహనంపై ఉసామా బిన్ జైద్ కూడా ఉన్నారు. అబ్దుల్లా బిన్ ఉబై తన మిత్రవర్గంతో రహస్యసమాలోచనలు జరుపుతున్న ప్రదేశం నుంచే వాళ్ళు వెళ్ళారు. ప్రవక్త (స) అటువైపు రావడం అబ్దుల్లా బిన్ ఉబైకి నచ్చలేదు. ప్రవక్త (స) పలకరించినా ముఖం మరోవైపుకు తిప్పుకున్నాడు. ప్రవక్త (స) అక్కడే ఆగారు. దివ్య ఖుర్‌ఆన్‌లోని కొన్ని వాక్యాలను పఠించారు. వారికి దేవుడిని గుర్తు చేశారు. దేవుని ఆగ్రహం గురించి వారిని హెచ్చరించారు. ప్రవక్త (స) ముగించిన వెంటనే అబ్దుల్లా బిన్ ఉబై అత్యంత పరుషంగా విరుచుకుపడ్డాడు. "ఓయ్! నువ్వు మాట్లాడుతున్న పద్ధతి ఏం బాగోలేదు. ఇంట్లో కూర్చుని నీ వద్దకు వచ్చేవాళ్ళతో మాత్రమే ఇలా మాట్లాడు. నీ వద్దకు రాని వాళ్ళకు ఇవన్నీ చెప్పకు. ఇలాంటి మాటలు ఇష్టపడని ఇంటికి రాకు." అన్నాడు. అతడి మాటల్లో ఎంత విషం ఉందో ఈ పదాలు చెబుతున్నాయి. ప్రవక్త (స) ఎంతో సహనంగా విన్నారు. నిజానికి ఈ మాటలు చెబుతున్నది అబ్దుల్లా బిన్ ఉబై కాదు, అతడిలో ఉన్న అజ్ఞానం, మంచిని వినడానికి ఇష్టపడని బధిరత్వం, ఇస్లామీయ ఉద్యమం పట్ల ఆగ్రహాన్ని వెళ్ళగక్కింది. అదే సమావేశంలో అబ్దుల్లా బిన్ రవాహా కూడా ఉన్నారు. ఆయన వెంటనే ఉబైకి జవాబిస్తూ "ప్రవక్త (స) ఇక్కడికి ఎందుకు రాకూడదు? మేం ఆయన్ను కోరుకుంటున్నాం. ఆయన తప్పక మా ఇళ్ళకు వస్తారు. మా సమావేశాలకు వస్తారు.

ఆయన్ను మేం అభిమానిస్తున్నాం. ఆయన వల్లనే మాకు మార్గదర్శనం లభిస్తోంది. ఆయన వల్లనే మేం బాగుపడుతున్నాం" అన్నారు.

కాని ఈ కుట్రలు కేవలం ఈ కపటుల వరకే పరిమితం కాలేదు. నిజానికి యూదుల కుట్రలో వాళ్ళు ఒక భాగం. వాళ్ళను ముస్లిముల శిబిరం నుంచి యూదులు ఎన్నుకున్నారు. తమ స్వార్థ ప్రయోజనాలు సాధించుకోడానికి. నిలకడలేని మనస్తత్వం ఉన్నవారిని వెదికి పట్టుకుని వారికి నూరిపోసి, వారిలో అనుమానాలు, సందేహాలు సృష్టించి, రహస్య సమావేశాలు నిర్వహించి, వాతావరణాన్ని విషతుల్యం చేశారు. వీళ్ళు మస్జిదులకు వెళ్ళి అక్కడ ముఖ్యమైన ప్రసంగాలను వినేవారు. తర్వాత తమ రహస్య సమావేశాల్లో ఆ ప్రసంగాల గురించి చెప్పేవారు. ఇస్లామ్ పురోగమనాన్ని అడ్డుకోవడానికి ఈ రహస్య సమావేశాలు నిర్వహించేవారు. వారి కుట్రలు, కుతంత్రాలు చాలా సార్లు బట్టబయలయ్యాయి. వీళ్ళ కుట్రల గురించి అనేక సందర్భాల్లో దైవా దేశాలు హెచ్చరించాయి. ఒక సందర్భంలో మస్జిదులో వారి గుసగుసలు తీవ్రమై అందరికీ ఇబ్బందికరంగా కూడా మారాయి. ప్రవక్త (స) వారందరినీ తక్షణం బయటకు వెళ్ళిపోవలసిందిగా ఆదేశించారు. వారు ప్రతిఘటనకు దిగితే బలవంతంగా బయటకు పంపవలసి వచ్చింది.

## దుష్ప్రచారాలు

కపటులు తమ విద్వేష కార్యకలాపాలను మరింత విస్తరించసాగారు. దుష్ప్రచారానికి ఉపయోగపడే ఎలాంటి అవకాశాన్ని కూడా వదలడం లేదు. ఏ మాత్రం అవకాశం దొరికినా ప్రవక్త (స)పై, ఇస్లామీయ ఉద్యమంపై విష ప్రచారాన్ని ఉధృతం చేయసాగారు. ఒకసారి యూదులు ఒక పుకారు లేవదీశారు. ప్రవక్త (స) ఈ ఇస్లామీయ ఉద్యమం ప్రారంభించడం వెనుక అసలు లక్ష్యం.... ఆయన ఏసుక్రీస్తు లాంటి హెూదా పొందాలనుకుంటున్నారని, ప్రజలు తనను ఆరాధించాలని పథకం వేశారని ప్రచారం మొదలు పెట్టారు. నజ్రాన్ నుంచి ఒక బృందం ప్రవక్త (స)ను కలవడానికి వచ్చింది. ఈ ప్రచారం ప్రభావానికి వాళ్ళు కూడా గురైనట్లున్నారు. ఆ బృందంలోని ఒక సభ్యుడు ఈ ప్రశ్నను సూటిగా ప్రవక్త (స)ను అడిగాడు. "క్రైస్తవులు ఏసు క్రీస్తును ఆరాధించినట్టుగా మేం మిమ్మల్ని ఆరాధించాలని మీరు కోరుతున్నారా?" అనడిగాడు. బృందంలోని మరో సభ్యుడు "ముహమ్మద్! మీరు మా నుంచి ఇదే కోరుతున్నారా? దీని కోసమే మమ్మల్ని ఆహ్వానిస్తున్నారా?" అన్నాడు. దీనికి ప్రవక్త



(స) జవాబిస్తూ "దేవుని తప్ప మరెవ్వరినైనా ఆరాధించడం నుంచి నన్ను దేవుడు కాపాడుగాక, దేవుని తప్ప మరెవ్వరినైనా ఆరాధించండని నేను ప్రజలకు చెప్పడం నుంచి నన్ను దేవుడు కాపాడుగాక. నన్ను దేవుడు ఈ ఉద్దేశ్యంతో పంపలేదు. నాకు అలాంటి ఆదేశమూ ఇవ్వలేదు." అన్నారు. దివ్యఖుర్ఆన్ కూడా ఈ విషయాన్నే స్పష్టంగా చెబుతోంది. దేవుని వదిలి ప్రవక్త (స)ను పూజించడానికి దేవుడు ఆయనకు జ్ఞానం వివేకాలు ప్రసాదించలేదు.

ప్రవక్త (స) మక్కా వదిలి మదీనా వలస వచ్చిన తర్వాత ఖురైషుల వైరం కొత్త మలుపు తిరిగింది. సమాలోచనలు, కుట్రలు కుతంత్రాలు ఎక్కువయ్యాయి. మదీనాపై దాడి చేయాలన్న ఆలోచనలు పెరిగాయి. వారి వేగులు మదీనా చుట్టుపక్కలా తిరిగేవారు. మదీనాలో ఉన్న యూదులతో రహస్య సంప్రదింపులు జరిపేవారు. ప్రవక్త (స) కూడా ఒక నిఘా వ్యవస్థను ఏర్పాటు చేశారు. రక్షణ చర్యలు తీసుకున్నారు. సైనిక, సైనికేతర బృందాలను ప్రతిరోజు పంపిస్తూ ఉండేవారు. మక్కా గూఢచారుల కదలికలపై కన్నేసి ఉంచేవారు. మక్కా సైనికదళాల కదలికలపై నిఘా ఉంచేవారు. ఈ నిఘావ్యవస్థ ఖురైషులను హెచ్చరించడానికి ఉద్దేశించింది. ముస్లిములు అప్రమత్తంగా లేరని, మదీనాలో శాంతిని భంగపరిస్తే మక్కా వారి వర్తక బిడారులు ఆ మార్గం నుంచి వెళ్ళలేవన్న హెచ్చరికలు ఈ నిఘా వ్యవస్థ ద్వారా సూచన ప్రాయంగా ఖురైషులకు చేరాయి. మదీనా వలస వచ్చిన రెండవ సంవత్సరం, రజబ్ మాసంలో ఎనిమిది మంది సభ్యులు ఉన్న ఒక నిఘా బృందాన్ని ప్రవక్త (స) నఖ్లా ప్రాంతానికి పంపించారు. ఖురైషుల సైనిక కదలికలను, భవిష్య ప్రణాళికలను కనిపెట్టడానికి మాత్రమే ఈ బృందం పంపబడింది. ఎలాంటి దాడికి దిగే అనుమతి ఈ బృందానికి ఇవ్వలేదు. ఈ బృందం ఖురైష్ వ్యాపారుల బృందానికి ఎదురయ్యింది. రెండు బృందాల మధ్య వాగ్వివాదం పెరిగి పెద్దదయి ఘర్షణగా మారింది. ముస్లిముల నిఘా బృందం దాడిలో ఒక వ్యాపారి మరణించాడు. మిగిలిన వారిని నిర్బంధించి, వారి సరుకులతో సహా మదీనాకు తీసుకొచ్చారు. ఈ సంఘటన రజబ్‌మాసం చివరిలో, షాబాన్ మాసం ప్రారంభంలో జరిగిన సంఘటన. ఈ సమయం కూడా కీలకమైనది. షాబాన్ మాసంలో ముస్లిములు ఇలాంటి దాడికి పాల్పడ్డారని ప్రాపగాండకు అవకాశం లభించింది. మక్కాలోని ఖురైషులు, మదీనాలోని యూదులు, వారి మిత్రబృందం అందరూ ఈ సంఘటనకు చిలవలు పలవలు కల్పించి ప్రచారం చేయడం మొదలు పెట్టారు. చివరకు ఈ దుష్ప్రచారం

ఎలాంటి రూపం ధరించిందంటే, "ముస్లిములు దేవునికి భయపడతామని అంటారు, కాని నిషిద్ధమాసం (షాబాన్)లో రక్తపాతానికి కూడా వెనుదీయరు." అన్న ప్రచారం ఉధృతంగా చేయడం మొదలుపెట్టారు. ఇంకా శైశవ దశలో ఉన్న ఇస్లామీయ రాజ్యానికి ఈ ప్రచారం చాలా ప్రమాదకరమైనది. ప్రజల సానుభూతి ముస్లిములకు లభించకుండా వారిని తప్పుదారి పట్టించే ప్రచారం ఇది. మరో విషయమేమంటే, నిఘాబృందం సైనికచర్య తీసుకోవడాన్ని ఇస్లామీయ ప్రభుత్వం కూడా ఆమోదించలేదు. నిర్బంధించిన ఖైదీలను వెంటనే విడుదల చేయడం జరిగింది. వారి సరుకులు, సంపద వారికి తిరిగి ఇచ్చేయడం కూడా జరిగింది. సైనికచర్య తీసుకున్న నిఘాబృందాన్ని మందలించడమూ జరిగింది. ఈ విధంగా జరిగిన సంఘటనను చక్కదిద్దడానికి ప్రయత్నించారు. కాని శత్రువులు ప్రారంభించిన దుష్ప్రచారాన్ని ఎదుర్కోవడానికి బలమైన జవాబు అవసరమయ్యింది. దివ్య ఖుర్ఆన్ దీనికి ఇలా జవాబిచ్చింది

> **"నిషిద్ధ మాసంలో యుద్ధం చేయటాన్ని గురించి ప్రజలు నిన్ను అడుగుతారు. వారికి ఇలా సమాధానం చెప్పు: "ఆ మాసంలో యుద్ధం చెయ్యటం మహా నేరమే. కాని అల్లాహ్ మార్గంలో అవరోధాలు కల్పించటం, అల్లాహ్‌ను తిరస్కరించటం, అల్లాహ్ ఆరాధకులను 'మస్జిదె హరామ్'ను దర్శించకుండా ఆటంకపరచటం, అందులో ఉండేవారిని బయటికి గెంటివెయ్యటం అల్లాహ్ దృష్టిలో అంతకంటే గొప్పనేరం."** ***(దివ్యఖుర్ఆన్ 2 : 217)***

అంటే, ప్రజలను సన్మార్గానికి రాకుండా అడ్డుకుంటున్న మక్కా అవిశ్వాసులు, దేవుని తిరస్కరిస్తున్న వాళ్ళు, కాబాగృహం నుంచి ప్రజలను వెళ్ళగొడుతున్న వాళ్ళు ఏ ముఖాలేసుకుని పవిత్ర మాసం గురించి, పవిత్ర మాసంలో పాటించవలసిన మర్యాదల గురించి మాట్లాడుతున్నారని నిలదీసింది.

జకాత్ వ్యవస్థ.. అంటే మిగులు సంపద, పెట్టుబడులపై వార్షిక శిస్తు వ్యవస్థ ఏర్పాటు చేసినప్పుడు, పెద్ద మొత్తంలో జకాత్ వసూలు చేసి అవసరార్థులకు పెద్ద స్థాయిలో పంపిణీ చేసినప్పుడు యూదులు ఆగ్రహోదగ్రులయ్యారు. అప్పటి వరకు బీదల రక్తమాంసాలను పీల్చి ఆ సంపదనంతా అనుభవిస్తున్నవాళ్ళు, సంపన్నుల నుంచి పేదలకు సంపద పంపిణీ కావడం చూసి భరించలేకపోయారు. ప్రవక్త (స) బంధుప్రీతికి పాల్పడుతున్నారన్న కొత్త ఆరోపణ లేవదీశారు. ప్రజా ధనాగారం కోసం వసూలు చేసిన మొత్తాలను ప్రవక్త (స) బంధువులకు, స్నేహితులకు పంచి



తన నాయకత్వాన్ని కాపాడుకోడానికి ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. ప్రజా ధనాగారం బాధ్యతలు నిర్వర్తిస్తున్న వారిపై ఇలాంటి ఆరోపణలు రావడం ఏ ఉద్యమానికైనా చాలా ప్రమాదకరమైనవి. కాని ప్రవక్త (స) స్థాయి వ్యక్తిపై ఇలాంటి ఆరోపణలకు దిగజారడం ఎవరూ ఊహించలేని దిగజారుడుతనం. ఆయన ప్రజల సొమ్ములో నుంచి ఒక్క నాణెం కూడా తన వద్ద ఉంచుకునేవారు కాదు. అంతేకాదు తన కుటుంబానికి, మొత్తం బనీ హాషిం వంశానికి దానధర్మాల రూపంలో ఏదైనా స్వీకరించడం నిషిద్ధంగా ప్రకటించి ఉన్నారు.

ఇలాంటి మరో నీచమైన ఆరోపణ, ప్రవక్త (స) తన బంధువు హజ్రత్ జైనబ్‌ను వివాహమాడడం గురించినది. ఆయన కామేచ్ఛతో ఈ పెళ్ళి చేసుకున్నారన్న ఆరోపణకు దిగారు శత్రువులు. నిజానికి ప్రవక్త (స) అజ్ఞాన కాలం నాటి రెండు మూఢాచారాలను తుదముట్టించాలనుకున్నారు. అవి వివాహాలకు సంబంధించినవి. ఈ మూఢాచారాల స్థానంలో కొత్త చట్టాలను తేవాలనుకున్నారు. మొదటి మూఢాచారం హోదాకు సంబంధించినది. రెండవ మూఢాచారం సాంప్రదాయిక సంబంధాల గురించినది. హజ్రత్ జైనబ్ (రజి) ప్రవక్త (స) మేనత్త కూతురు. తన వద్ద స్వేచ్ఛ పొందిన బానిస హజ్రత్ జైద్ (రజి)కు ఇచ్చి ఆమె పెళ్ళి జరిపించారు ప్రవక్త (స). హజ్రత్ జైద్ (రజి)కు స్వేచ్ఛ ఇచ్చిన తర్వాత తన కుమారుడిగా ప్రవక్త(స) ఆయన్ను చూసేవారు. కాని ఈ వివాహం సంతోషకరంగా సాగలేదు. ప్రవక్త (స) ఈ వివాహాన్ని కాపాడ్డానికి చాలా ప్రయత్నాలు చేశారు. చివరకు విడాకులుగా ఈ వివాహం ముగి సింది. హజ్రత్ జైనబ్ ఎలాంటి సహాయం లేని స్థితిలో మిగిలారు. ప్రవక్త (స) ఆమెను తన భార్యగా స్వీకరించి ఆదుకున్నారు.

ఆమె నిజానికి ఖురైష్‌లో ఉన్నత వంశానికి చెందిన స్త్రీ. ఆమె వివాహం మొదట స్వేచ్ఛ పొందిన ఒక బానిసతో జరిపించడం ద్వారా సామాజిక హోదాకు కొత్త నిర్వచనం ఇచ్చారు. కేవలం వంశం ఒక్కటే సామాజిక హోదాను నిర్ణయించే అంశం కాదని చాటి చెప్పారు. విడాకుల తర్వాత ఆమెను తాను వివాహం చేసుకోవడం ద్వారా దత్తత సంబంధాలు రక్త సంబంధాలు కాదని చాటి చెప్పారు. నిజానికి హజ్రత్ జైనబ్ మొదటి వివాహం ఒక ముస్లిమేతరుడితో జరిగింది. రెండవ వివాహం హజ్రత్ జైద్‌తో జరిగింది. ప్రవక్త (స)తో ఆమెకు జరిగింది మూడవ వివాహం. అంటే అప్పటికే ఆమె వయసు ప్రౌఢ దశకు చేరుకుంది. మరో విషయమేమంటే, ఆమె స్వయంగా ప్రవక్త (స)కు మేనత్త కూతురు, చిన్నప్పటి నుంచి ఆయనకు

తెలిసిన వారు. ప్రవక్త (స) ఆమెను చూసిన మొదటి చూపులోనే ఆమె అందం చూసి మోహించి ఆమెను వివాహం చేసుకున్నారన్న ఆరోపణ అర్థం లేని ఆరోపణ. ఈ విషయమై దివ్య ఖుర్ఆన్ స్వయంగా ఇలా తెలిపింది:

> **"నీవు అల్లాహ్ బయటపెట్టదలచిన విషయాన్ని నీ మనస్సులో దాచి ఉంచావు. నీవు ప్రజలకు భయపడుతున్నావు. వాస్తవానికి నీవు భయపడటానికి అల్లాహ్‌యే ఎక్కువ హక్కు దారుడు. తరువాత జైద్ ఆమె విషయంలో తన అవసరాన్ని పూర్తి చేసుకున్నప్పుడు మేము ఆమె (విడాకులు పొందిన స్త్రీ)తో నీకు వివాహం జరిపించాము. విశ్వాసులకు తమ దత్తపుత్రుల భార్యల విష యంలో, వారు తమ భార్యలకు సంబంధించిన తమ అవసరాన్ని పూర్తి చేసుకున్నప్పుడు ఏ విధమైన ఇబ్బంది కలుగకుండా ఉండేందుకు. అల్లాహ్ ఆదేశం అమలులోకి రావలసిందే." *(దివ్యఖుర్ఆన్ 33 : 37)***

ఈ వాక్యానికి అర్థం ఏమంటే సంప్రదాయాల్లో వచ్చిన ఈ మార్పును బహిరంగంగా ప్రకటించాలి.

ఇస్లామీయ సామాజిక వ్యవస్థపై బహిరంగంగా దాడి చేసే అవకాశం లేనందువల్ల అవిశ్వాసులు పుకార్లు సృష్టించే కార్యక్రమం ప్రారంభించారు. ఈ పుకార్ల వల్ల వచ్చే ప్రమాదం గురించి దివ్య ఖుర్ఆన్ అనేక సందర్భాల్లో ప్రవక్త (స)ను హెచ్చరించింది. నిజానికి ప్రవక్త (స) మృదువైఖరి వల్ల ఈ దుష్ప్రచారాలు మరింత ఎక్కువయ్యాయి. ఈ విషయంలో దివ్యఖుర్ఆన్ చాలా నిక్కచ్చిగా స్పష్టంగా క్రింది విధంగా ప్రకటించింది.

> **"రహస్య సమాలోచనలు చేయవద్దని నిషేధించడం జరిగినప్పటికీ తిరిగి నిషేధించబడిన దానినే చేస్తున్నవారిని నీవు చూడలేదా? వారు రహస్యంగా, పాపమూ, దౌర్జన్యమూ ప్రవక్త పట్ల అవిధేయతలకూ సంబంధించిన విషయాలను పరస్పరం మాట్లాడుకుంటారు." *(దివ్యఖుర్ఆన్ 58 : 8)***
>
> **"విశ్వాసులారా! మీరు గనుక పరస్పరం రహస్య విషయాలు మాట్లాడుకుంటే, పాపమూ, దౌర్జన్యమూ దైవప్రవక్త పట్ల అవిధేయతలకూ సంబంధించిన విషయాలు కాకుండా, సత్యానికీ, దైవభీతికీ సంబంధించిన విషయాలు మాట్లాడుకోండి. మీరు దేవునికి భయపడుతూ ఉండండి. పునరుత్థాన దినాన మీరు ఆయన సన్నిధిలో హాజరు కావలసి ఉంది.." *(దివ్యఖుర్ఆన్ 58 : 9)***



> **"రహస్యమంతనాలు చేయడం షైతాను చేష్ట. విశ్వాసులకు మనస్తాపం కలిగించ టానికే ఈ చేష్ట చేయబడుతుంది. వాస్తవానికి దైవాజ్ఞ లేనిదే అది వారికి ఏమాత్రం నష్టం కలిగించజాలదు. విశ్వాసులు అల్లాహ్‌నే నమ్ముకోవాలి." *(దివ్యఖుర్ఆన్ 58 : 10)***
>
> **"వారు తమ దుష్కర్మలను మానవులకు తెలియకుండా దాచగలరు. కాని అల్లాహ్‌కు తెలియకుండా దాచలేరు. రాత్రులందు వారు ఆయన అభీష్టానికి వ్యతిరేకంగా రహస్య సమాలోచనలు జరిపే సమయంలో కూడా ఆయన వారితో ఉంటాడు. వారి సకల చర్యలను అల్లాహ్ పరివేష్టించి ఉన్నాడు." *(దివ్యఖుర్ఆన్ 4 : 108)***
>
> **"ముగ్గురు వ్యక్తులు కలిసి ఏవైనా మంతనాలు జరిపినప్పుడు, వారి మధ్య నాలుగోవాడుగా అల్లాహ్ కాకుండా ఉండటం అనేది ఎన్నడూ జరగదు. లేదా ఐదుగురు వ్యక్తులు కలసి మంతనాలు జరిపినప్పుడు వారిలో ఆరో వాడుగా అల్లాహ్ కాకుండా ఉండడం అనేది కూడా ఎన్నడూ జరగదు. రహస్యాలో చనలు జరిపేవారు వీరికంటే తక్కువ మంది ఉన్నా లేక ఎక్కువ మంది ఉన్నా వారు ఎక్కడ ఉన్నా, అల్లాహ్ వారితో పాటు ఉంటాడు. *(దివ్యఖుర్ఆన్ 58 : 7)***
>
> **"వారు నీ సమక్షంలోనయితే "మేము విధేయులం" అని అంటారు. కాని నీ వద్ద నుండి వెళ్ళిన తరువాత వారిలోని ఒక వర్గంవారు రాత్రివేళ సమావేశమై నీ మాటలకు వ్యతిరేకంగా సంప్రదింపులు జరుపుతారు. వారి ఈ రహస్యాలోచనలన్నింటినీ అల్లాహ్ వ్రాస్తున్నాడు." *(దివ్యఖుర్ఆన్ 4 : 81)***

రహస్య సమాలోచనలు ఇస్లామ్ అభ్యున్నతి కోసం జరగాలే కాని ఇస్లామ్‌ను అడ్డుకునేందుకు జరగరాదని హెచ్చరిస్తూ, కపటుల మాయోపాయాల గురించి, రహస్యంగా వెన్నుపోటు పొడవడానికి చేస్తున్న కుట్రల గురించి ప్రవక్త (స)ను హెచ్చ రించడం జరిగింది.

కపటులు పన్నిన మరో పన్నాగం, ప్రవక్త (స)తో ఏకాంతంగా మాట్లాడాలని మాటిమాటికి కోరడం. బహిరంగ సమావేశంలో ప్రవక్త(స) దగ్గరకు వచ్చి గుసగుసగా ఆయనతో ఏదో అవసరమైన విషయం మాట్లాడుతున్నట్లు నటించడం. నిజానికి ఏ సమస్య పరిష్కారానికి కూడా ఈ గుసగుసల ఏకాంత సంభాషణ ఉద్దేశించింది కాదు. అక్కడున్న ప్రజలందరిని ఒక విధమైన భ్రమలో ఉంచడానికి ఉద్దేశించింది

మాత్రమే. ప్రవక్త (స)తో వీళ్ళు ఏదో ఒక ముఖ్యమైన విషయం మాట్లాడుతున్నారన్న భ్రమను ప్రజల్లో కల్పించడం ద్వారా తాము ప్రవక్త (స)కు చాలా సన్నిహితంగా ఉన్నామన్నట్లు వ్యవహరించడం. ప్రవక్త(స) తన సహజమైన మృదువైఖరి వల్ల ఎవరైనా తన వద్దకు ఏకాంతంగా మాట్లాడ్డానికి వస్తే కాదనేవారు కాదు. కాని ఇది ఒక కుట్రగా మారడం, ప్రవక్త(స) సమయం ఈ పనికిరాని ఏకాంత గుసగుసల్లో వ్యర్థం కావడం ఎక్కువయ్యింది. ఈ కుట్రను బద్దలు కొట్టడానికి దైవిక చర్యలే అవసరమయ్యాయి.

**"విశ్వసించిన ఓ ప్రజలారా! మీరు దైవప్రవక్తతో ఏకాంతంలో మాట్లాడదలిస్తే, మాట్లాడబోయేముందు, ఏదైనా కొంచెం దానం చెయ్యండి."**

***(దివ్యఖుర్ఆన్ 58 : 12)***

ఆ విధంగా ఎవరైనా ఏకాంతంగా సంభాషించాలనుకుంటే కొంత సొమ్ము చెల్లించాలన్న నియమం విధించారు. కాని పిసినారి యూదులు ఈ చెల్లింపులకు ఇష్టపడరు. ఆ విధంగా ఈ గుసగుసల కుట్రకు అడ్డుకట్ట వేయడం జరిగింది. కాని ఈ లోగా యూదులు వారి మిత్రబృందం మరో కొత్త పన్నాగం పన్నారు. ఇస్లామీయ ఉద్యమం తీసుకునే ప్రతి ఒక్క మలుపును అపహసించడం, ఎగతాళి చేయడం ప్రారంభించారు. హింసకు పాల్పడవద్దని, అణిచివేతలను సహనంతో భరించాలని, శత్రువుల క్రూరత్వాన్ని సహించాలని, ప్రార్థనలకు, దానధర్మాలకు అంకితం కావాలని ముస్లిములకు ఆదేశాలు వచ్చినప్పుడు (దివ్యఖుర్ఆన్ 4 : 77) ఈ కుట్రదారులు సంతృప్తి చెందలేదు. కాని, అణిచివేతలకు వ్యతిరేకంగా ఆయుధాలు ఎత్తండని ఆదేశాలు వచ్చినప్పుడు ఈ కపటులు దేవుని కన్నా ఎక్కువగా మనుష్యులకు భయపడ్డం ప్రారంభించారు. ఈ విషయమై దివ్య ఖుర్ఆన్ ఇలా ప్రకటించింది: పోరాడాలని ఆదేశం వారికి అందినప్పుడు, చూడండి, వారిలో కొందరు దేవునికి భయపడినట్లు లేదా దేవుని కన్నా ఎక్కువగా మనుష్యులకు భయపడుతున్నారు. "మా ప్రభూ! మమ్మల్ని పోరాడాలని ఎందుకు ఆదేశిస్తున్నావు" అంటున్నారు.

ప్రవక్త (స)పై జరిగిన మరొక దాడిని దివ్య ఖుర్ఆన్ క్రింది విధంగా ప్రస్తావించింది.

**"వారికి ఏదైనా లాభం కలిగితే ఇది అల్లాహ్ తరఫు నుండి వచ్చింది అని అంటారు. ఒకవేళ ఏదైనా నష్టం కలిగితే ప్రవక్తా! ఇది నీ వల్ల జరిగింది అని అంటారు."** ***(దివ్యఖుర్ఆన్ 4 : 78)***



నష్టాలు వచ్చినప్పుడు, ప్రతికూల పరిస్థితి వాటిల్లినప్పుడు వారు ప్రవక్త (స)ను నిందించేవారు. కాని వారికి మంచి జరిగినప్పుడు, లాభం పొందినప్పుడు మాత్రం ప్రవక్త (స) వల్ల జరిగిందని చెప్పేవారు కాదు.

ఈ నీచమైన మనస్తత్వంతో కపటులు ప్రతి ఒక్క విషయాన్ని అడ్డుకునేవారు. "అదృష్టం తిరగబడి ఘోర విపత్తు వాటిల్లుతుందని భయపడుతున్నాం" అనే స్థాయి వరకు వెళ్ళేవారు.

అంటే వారి మాటలకు అర్థం ఉద్యమ నాయకత్వం ఇలా ఉన్నంత కాలం ఏ క్షణాన్నయినా ఘోరవిపత్తు వచ్చి పడుతుందని ప్రచారం చేయడం.

ఇలాంటి ప్రచారాల వల్ల ప్రవక్త(స) ఎలాంటి మానసిక చిత్రహింసను అనుభవించి ఉంటారో అర్థం చేసుకోవచ్చు. రహస్య సమాలోచనలతో ఇలాంటి దాడులు ఎన్నో జరిగాయి. కాని ప్రవక్త (స) దేవుని పట్ల ఉన్న దృఢమైన విశ్వాసంతో వాటన్నింటిని తట్టుకుని నిలబడ్డారు.

## హజ్రత్ ఆయెషా (రజి)పై విష ప్రచారం

కపటుల అత్యంత నీచమైన కుట్ర హజ్రత్ ఆయెషా (రజి)పై విషప్రచారానికి తెగబడడం. దురదృష్టవశాత్తు ముస్లిమ్ సమాజంలోని కొందరు ముస్లిములు కూడా ఇందులో కూరుకుపోయారు. అబ్దుల్లా బిన్ ఉబై వంటి ద్రోహులు ఈ పరిస్థితిని తమకు అనుకూలంగా వాడుకోవడానికి పూర్తి ప్రయత్నాలు చేశారు. ఈ విష ప్రచారంలో హజ్రత్ హసన్, మిస్తాన్ బిన్ అసాసా, జహష్ కుమార్తె హమ్నా లాంటి వారు కూడా ఈ విషప్రచారానికి గురయ్యారు. అసలు జరిగిందేమిటంటే, ఒక బిడారుతో ప్రయాణిస్తున్నప్పుడు హజ్రత్ ఆయెషా (రజి) తన కంఠహారాన్ని పోగొట్టుకున్నారు. ఆ కంఠహారాన్ని ఆమె వెదుక్కుంటూ వెళ్ళారు. ఆమె బిడారులో లేదన్న విషయం గ్రహించకుండా బిడారు ముందుకు సాగిపోయింది. ఆమె ఒంటరిగా మిగిలిపోయారు. బిడారు వెనుక ఒంటెపై వస్తున్న సఫ్వాన్ బిన్ అల్‌మొతల్ ఆమెను చూసి గౌరవ పూర్వకంగా ఆమెకు వాహనం ఇచ్చి బిడారు తర్వాతి మజిలీ వరకు చేర్చారు. ఈ విషయం తెలియగానే కపటులు ఒక అత్యంత నీచమైన, హేయమైన కథ అల్లారు. ఈ నీచమైన ఆరోపణ ఒకరి నుంచి ఒకరికి దావాగ్నిలా వ్యాపించింది. ప్రవక్త (స) ఈ విషప్రచారం గురించి తెలిసి మనస్తాపానికి, ఆగ్రహానికి లోనయ్యారు. హజ్రత్ ఆయెషా (రజి)కు దూరంగా ఉన్నారు. హజ్రత్ ఆయెషా (రజి)కు మొదట

ఏం జరుగుతుందో అర్థం కాలేదు. తర్వాత ఈ విషప్రచారం గురించి తెలిసి ఆమె భరించరాని మనస్తాపంతో రాత్రింబవలు విలపిస్తూ గడిపారు. ఈ విషయమై మాట్లాడి తనపై వచ్చిన అపనిందలను రూపుమాపాలని ఆమె తన తల్లిదండ్రులను కోరారు. కాని వారు నిస్సహాయతను వ్యక్తం చేశారు. చివరకు ఆమె భర్త, ఆమె నడవడి గురించి బాగా తెలిసిన ప్రవక్త (స) కూడా నిస్సహాయంగా ఉండిపోయారు. ఈ పుకార్లు, ఆయన అనుభవిస్తున్న మనోవ్యధ. ఆయనకు ఎలాంటి జవాబు కానరాలేదు. చివరకు ఆయన ఈ వ్యవహారాన్ని తానే వ్యక్తిగతంగా విచారించాలనుకున్నారు. హజ్రత్ అలీ (రజి)ను, ఉసామా బిన్ జైద్ (రజి)ను సంప్రదింపులకు పిలిచారు. హజ్రత్ ఉసామా నిర్ద్వంద్వంగా ఖండించారు. ప్రవక్త (స) సతీమణి గురిం మంచినే విన్నాను కాని ఒక్క చెడు కూడా వినలేదని తేల్చి చెప్పారు. కాని హజ్రత్ అలీ (రజి) మాత్రం ప్రతికూలంగా మాట్లాడారు. మదీనాలో స్త్రీలకు కొరత లేదని, హజ్రత్ ఆయెషా (రజి)కు బదులు మరో స్త్రీని ప్రవక్త (స) తన భార్యగా స్వీకరించవచ్చని అన్నారు. ప్రవక్త (స) కోరితే తాను ప్రవక్త (స) ఇంటి పనిమనిషిని ఈ విషయమై విచారిస్తానని చెప్పారు. హజ్రత్ అలీ (రజి) సూచనలోని రెండవ భాగాన్ని ప్రవక్త(స) ఒప్పుకున్నారు. పని మనిషిని విచారించమని చెప్పారు. పని మనిషిని అక్కడికి పిలిచారు. హజ్రత్ అలీ (రజి) ముందుగానే ఆమెను కఠినంగా హెచ్చరించారు. ప్రవక్త (స) సమక్షంలో నిజమే చెప్పాలని గట్టిగా చెప్పారు. పనిమనిషి జవాబిస్తూ హజ్రత్ ఆయెషా (రజి)లో ఎలాంటి చెడును తాను చూడలేదని, అప్పుడప్పుడు ఆమె రొట్టెల పిండి అలాగే వదిలేసి వెళ్ళి పడుకుంటుందని, మేకలు రొట్టెల పిండి తినేస్తా యని, అంతే తప్ప మరెలాంటి తప్పు ఆమె చేయడం ఎన్నడూ చూడలేదని చెప్పింది. హజ్రత్ ఆయెషా (రజి) శీలసంపదకు సంబంధించి ఇంతకన్నా ఎక్కువ సాక్ష్యం ఏం కావాలి? ఆమె ఒక చాలా సరళమైన, అమాయకమైన, స్వచ్ఛమైన అమ్మాయి. ఆమె స్వభావంలో ఎక్కడా ఎలాంటి మచ్చలేదు. కాని ఈ లోగా విష ప్రచారం మరింత ఉధృతమైంది. ప్రవక్త (స) ఒక బహిరంగ సమావేశాన్ని ఏర్పాటు చేశారు. అందులో ప్రసంగిస్తూ ఇలా అన్నారు :

"దేవుడే సర్వ స్తోత్రాలకు అర్హుడు. నా భార్య విషయంలో నన్ను వేధిస్తూ, వాస్తవానికి విరుద్ధమైన విషయాలను ప్రచారం చేస్తున్న వారి ఉద్దేశ్యమేమిటి? దేవుని తోడు, వారికి మంచి జరగాలని తప్ప మరేమీ నేను కోరుకోవడం లేదు. కాని వాళ్ళు నేను బాగా ఎరిగిన మనిషిని, నేను లేనప్పుడు ఎన్నడూ నా ఇంటికి రాని వ్యక్తి గురించి ఇలాంటి మాటలు ప్రచారం చేస్తున్నారు"



ఈ మాటలు విని ఔస్ తెగ నాయకుడు ఆగ్రహంగా లేచి, "ఈ ప్రచారం ప్రారంభించిన వ్యక్తి నా తెగవాడైతే మేము వాడి సంగతి చూసి ఉండేవాళ్ళం. కాని అతను ఖజ్‌రజ్ తెగ వాడైతే, వాడి తల నరకడానికి నేను మీ ఆదేశం కోసం ఎదురు చూస్తున్నాను. అలాంటి వ్యక్తికి ఇదే సరయిన శిక్ష" అన్నాడు.

కాని ఈ విషప్రచారం ప్రారంభించిన వ్యక్తి ఖజ్‌రజ్ తెగకు చెందినవాడు కాబట్టి ఆ తెగ నాయకుడు సాద్ బిన్ ఉబాదా ఆగ్రహంతో ఊగిపోయాడు. "దేవుని తోడు, మేము అతడిని చంపం. ఆ వ్యక్తి మా తెగకు చెందిన వాడు కాబట్టే నువ్వు ఆ మాటలు అన్నావని" ఆరోపించాడు.

రెండు తెగల మధ్య వివాదం మొదలైంది. ఇక కత్తులు దూసుకోవడమే మిగిలింది. పరిస్థితి చూసి ప్రవక్త (స) సమావేశాన్ని ముగించి అందరినీ శాంతింపజేసి పంపేశారు.

దాదాపు నెల రోజుల పాటు ఈ పుకార్లు వ్యాపిస్తూ పోయాయి. ప్రవక్త(స) హజ్రత్ ఆయెషా (రజి) మానసిక వ్యథను అనుభవించసాగారు. ఈ విషయమై దైవ వాక్యాలు అవతరించే వరకు వారి మనోవ్యధ తీరలేదు. ఈ దైవవాక్యాలు నూర్ సూరాలో ఉన్నాయి.

> **"ఇది మేము అవతరింపజేసిన ఒక సూరా. మేము దానిని విధిగా జేశాము, మీరు గుణపాఠం నేర్చుకుంటారేమో అని, అందులో మేము స్పష్టమైన ఉపదేశాలను అవతరింపచేశాము."** *(దివ్యఖుర్‌ఆన్ 24 : 1)*
>
> **"ఈ అభాండాన్ని సృష్టించి తీసుకువచ్చినవారు, మీలోని ఒక వర్గం వారే. ఈ సంఘటనను మీ విషయంలో కీడుగా భావించకండి. పైగా ఇది మీకు మేలైనదే. ఎవడు ఇందులో ఎంత పాత్ర వహించాడో, వాడు అంతే పాపాన్ని మూటగట్టు కున్నాడు. ఇంకా ఈ బాధ్యతలో పెద్ద భాగాన్ని తన నెత్తిపై వేసు కున్న వ్యక్తికి పెద్ద శిక్షేపడుతుంది."** *(దివ్యఖుర్‌ఆన్ 24 : 11)*

చివరి పదాలు అబ్దుల్లా బిన్ ఉబైని ఉద్దేశించినవి. అతడే ఈ పుకార్లను ప్రారంభించినవాడు. ఈ పుకార్లు వ్యాపించేలా చేసినవాడు. ఈ దైవవాక్యాలు ముస్లిము లను ఉద్దేశించి కూడా ఇలా ప్రశ్నించాయి.

> **"మీరు దానిని గురించి విన్నప్పుడే విశ్వాసులైన పురుషులూ, విశ్వాసులైన స్త్రీలూ తమను గురించి తాము సదభిప్రాయాన్ని ఎందుకు ఏర్పరచుకోలేదు? ఇది స్పష్టమైన అభాండమని ఎందుకు ఖండించలేదు?"**
>
> *(దివ్యఖుర్‌ఆన్ 24 : 12)*

**"(కొంచెం ఆలోచించండి, అప్పుడు మీరు ఎంత ఘోరమైన తప్పు చేశారో) అప్పుడు మీ నాలుకలు ఒకదాని నుండి మరొకటి ఈ అబద్ధాన్ని అందుకుంటూ పోయాయి. మీరు మీకు తెలియని దాన్ని మీ నోటితో అంటూ పోయారు. మీరు దానిని మామూలు విషయంగా భావించారు. వాస్తవానికి అల్లాహ్ దృష్టిలో అది చాలా పెద్ద విషయం."** ***(దివ్యఖుర్ఆన్ 24 : 15)***

ఈ విష ప్రచారానికి ఒడిగట్టిన వారిని గట్టిగా మందలించడం జరిగింది.

**"శీలవతులు, అమాయికులు అయిన విశ్వాసం గల స్త్రీలపై అభాండం వేసే వారు ప్రపంచంలోనూ, పరలోకంలోనూ శపించబడ్డారు. వారికి పెద్ద శిక్షే పడుతుంది."** ***(దివ్యఖుర్ఆన్ 24 : 23)***

ఈ విషప్రచారం వలలో కొందరు ముస్లిములు కూడా ఇరుక్కున్నప్పటికీ, ముస్లిముల్లో చాలా మంది దీనికి దూరంగానే ఉన్నారు. హజ్రత్ అబూ అయ్యూబ్ అన్సారీ వైఖరే దీనికి సాక్ష్యం. ఆయన భార్య ఈ నీచమైన పుకారు గురించి ఆయనకు చెప్పినప్పుడు ఆయన భార్యతో ఇలా ప్రశ్నించారు "హజ్రత్ అయెషా (రజి) స్థానంలో నువ్వుంటే అలాంటి పని చేస్తావా?" ఆమె ఛస్తే చేయనంది. అప్పుడాయన "ఆయెషా (రజి) నీ కన్నా చాలా ఉత్తమమైన మహిళ.. అలాగే నేను సఫ్వాన్ స్థానంలో ఉంటే అలాంటి విషయం గురించి ఆలోచించనైనా ఆలోచించలేను. సఫ్వాన్ నా కన్నా ఉత్తమమైన ముస్లిమ్" అన్నారు.

హజ్రత్ హసన్ నుంచి ఈ నీచమైన పుకారు వినగానే సఫ్వాన్ తీవ్రమైన ఆగ్రహంతో తన కరవాలం దూసి హజ్రత్ హసన్‌పై వేటు వేశారు. అటుగా వెళు తున్న సాబిత్ బిన్ ఖైస్ ఇది చూసి వారిద్దరిని విడదీసి, సఫ్వాన్‌ను బనీ హర్స్ ఇంటికి తీసుకెళ్ళారు. తర్వాత ఈ వ్యవహారం ప్రవక్త (స) సమక్షంలోకి వచ్చింది. ఆయన వారిద్దరిని శాంతింపజేశారు. సఫ్వాన్ కత్తివేటు వేసినందుకు గాను హసన్‌కు నష్టపరిహారం చెల్లించాలని ఆదేశించారు.

ఆ తర్వాత చట్టబద్ధంగా ఈ విషప్రచారానికి పాల్పడినవారికి శిక్షలు పడి నప్పుడు... మిస్తా బిన్ అసాసా, హసన్ బిన్ సాబిత్, హమ్నా బింతె జహష్ స్వచ్ఛం దంగా ముందుకు వచ్చి తమ తప్పుకు శిక్షను కోరారు. ఎనిమిది కొరడా దెబ్బల శిక్ష అనుభవించి తమ పాపానికి ప్రాయశ్చిత్తం చేసుకున్నారు. హసన్ ఆ తర్వాత క్రింది కవిత రాసి తన పశ్చాత్తాపాన్ని ప్రకటించారు.



"ఆమె పరదాలో ఉన్న పవిత్రమైన మహిళ

అనుమానాలు.. సందేహాలకు అతీతమైన మహిళ

శీలవతులైన మహిళల మర్యాదల విషయంలో జోక్యం చేసుకోవడాన్ని ఇష్టపడని మహిళ

మృదువైఖరి కలిగిన మహిళ.. ఆమె పవిత్రతను దేవుడే ధృవీకరించాడు.
పాపాలు చెడుల నుంచి ఆమెను పవిత్రంగా ఉంచాడు.
ఇప్పటి వరకు ఆమె గురించి చెప్పబడినది ఏదీ ఆమెకు వర్తించదు.
అది నిజానికి ఒక కట్టుకథ.. ఒక వ్యక్తి కల్పించి నాకు చెప్పిన కథ"

ఈ సంఘటన తర్వాత దైవాదేశాలు అవతరించి ఈ విషప్రచారానికి అడ్డుకట్ట పడిన తర్వాత ప్రవక్త (స) చిరునవ్వుతో హజ్రత్ ఆయేషా (రజి)కు దేవుడు ఆమె నడవడిని ధృవీకరించినందుకు గాను శుభాకాంక్షలు తెలియజేశారు. హజ్రత్ ఆయేషా (రజి) తల్లి ఆమెతో "లేచి ప్రవక్త (స)కు ధన్యవాదాలు చెప్పు" అన్నప్పుడు హజ్రత్ ఆయేషా (రజి) హుందాగా చెప్పిన మాటలతో ఆమె ఔన్నత్యం, ఆమె వ్యక్తిత్వం మరింత ఎత్తుకు ఎదిగాయి. తన భర్త ప్రవక్త (స)కు ధన్యవాదాలు చెప్పమన్న తల్లికి జవాబిస్తూ "నేను ప్రవక్త (స)కు గాని, నీకు గాని, నా తండ్రికి గాని ఎవరికి ధన్యవాదాలు చెప్పను. నా దేవుడికి తప్ప మరెవ్వరికీ ధన్యవాదాలు చెప్పను. ఈ అబద్ధపు ఆరోపణలకు మీరెవ్వరూ జవాబు చెప్పనప్పుడు దేవుడే నా నడవడికను ధృవీకరించి ఆదుకున్నాడు" అన్నారామె.

## మేలు చేసిన కీడు

ఈ మొత్తం వ్యవహారం చాలా బాధకరమైనదే అయినప్పటికీ, దీని వల్ల చాలా ప్రయోజనాలు కూడా ఒనగూడాయి. మొత్తం ముస్లిమ్ సముదాయాన్ని ఈ వ్యవహారం కుదిపేసింది. ముస్లిమ్ సమాజంలో ఉన్న బలహీనతలను ఎత్తి చూపింది. వాటిని సంస్కరించుకునే ఆలోచన కల్పించింది. దైవాదేశాలు కూడా ముస్లిముల పట్ల సానుభూతి చూపుతూ క్రుంగిపోవద్దని ప్రోత్సహించాయి. దివ్య ఖుర్ఆన్ క్రింది విధంగా బోధించింది:

**"ఈ సంఘటనను మీ విషయంలో కీడుగా భావించకండి. పైగా ఇది మీకు మేలైనదే."** ***(దివ్యఖుర్ఆన్ 24 : 11)***

ఈ వ్యవహారం ఒక విధంగా ముస్లిములకు మేలే చేసింది. వారు చాలా హుందాగా, విశ్వాసం పట్ల దృఢచిత్తంతో ఈ మొత్తం వ్యవహారాన్ని ఎదుర్కొన్నారు. మరోవైపు కుట్రదారులు, ముస్లిమ్ సమాజంలో ఉన్న శత్రువుల ఏజంట్లు బట్టబయలయ్యారు. ఆచరణాత్మకంగా వారిలో ఉన్న లోపాలు, బలహీనతలు తెలిసి వచ్చిన తర్వాత ముస్లిములు మరింత జాగ్రత్తగా ఉండసాగారు. ఈ పరీక్షలో ప్రతి ఒక్కరు మరింత ఆత్మపరిశీలన అలవరచుకున్నారు. మరింత బలపడ్డారు.

ఈ పరీక్షలో, పుకార్లు దావానలంలా వ్యాపిస్తుంటే, హజ్రత్ ఆయెషా (రజి)తో పాటు తీవ్రమైన మనోవ్యధను అనుభవించిన వారు స్వయంగా ప్రవక్త (స). ఆయన ప్రదర్శించిన సాటిలేని హుందాతనం, సహనం, సంయమనం ఆశ్చర్యపరుస్తాయి. ఆయన తర్వాత వచ్చిన ఇస్లామీయ ఉద్యమానికి, సంస్థలకు సంబంధించిన నాయకులందరికీ ఆయన ఒక ఆదర్శంగా నిలుస్తారు. ఒక దుర్భరమైన, ఎంతో కష్టభరితమైన మానసిక హింసను ఆయన సహించారు. కారుణ్యాన్ని వ్యవస్థీకరించడం ద్వారా యావత్తు మానవాళికి ప్రయోజనం చేకూర్చాలనుకున్నారు. మానవాళి గౌరవమర్యాదలను కాపాడేది అది ఒక్కటే. కాని ప్రపంచం ఆయన గౌరవమర్యాదల పైనే దాడి చేసింది. ఈ పరిస్థితుల్లో మరెవరున్నా ప్రత్యర్థులను పూర్తిగా అణిచివేసి ఉండేవారు. లేదా దిక్కుతోచక అన్నింటిని వదిలి వెళ్ళిపోయి ఉండేవారు. కాని మూర్తీభవించిన సహనం, అంకితభావం ఉన్న ప్రవక్త (స) తన మార్గంపై స్థిరంగా నడిచారు. చుట్టూ శత్రువులు పరుస్తున్న ముళ్ళను ఆయన పట్టించుకోలేదు.

యూదులు మదీనాలో అన్సార్లతో రాతపూర్వక ఒప్పందం కలిగి ఉన్నప్పటికీ అన్సార్లపై పెత్తనం చెలాయించాలని భావించేవారు. ముస్లిమ్ సముదాయం విస్తరిస్తూ ఉండడం, రోజు రోజుకీ బలపడడం చూసి ఆందోళనకు గురయ్యారు. వారి ఈర్ష్యాసూయలు, ముస్లిముల పట్ల విద్వేషం నానాటికి అధికమయ్యాయి. కాని బహిరంగంగా దాడికి దిగే పరిస్థితి వారికి లేదు. అందువల్ల కుట్రపూరితమైన నీచమైన ఎత్తుగడలకు పాల్పడడం ప్రారంభించారు.. తమ గూఢచర్య కార్యకలాపాలను కొనసాగిస్తూ ముస్లిముల్లో చీలికలు, అలజడులు తీసుకువచ్చే ప్రయత్నం చేశారు. ఒక సంఘటన వల్ల ఈ విద్వేషాగ్ని మరింత ప్రజ్వరిల్లింది. బనీ ఖైనుకా మార్కెట్టుకు ఒక ముస్లిమ్ మహిళ వెళ్ళింది. యూదుల్లోని ఒక తెగ వాళ్ళు ఆ ముస్లిమ్ మహిళ పట్ల అసభ్యంగా ప్రవర్తించి బజారులో ఆమెను వివస్త్ర చేశారు. ఈ నీచమైన చర్యను ఖండించే బదులు అక్కడున్న యూదులు తమాషా చూస్తూ నవ్వుకోసాగారు. గాయపడిన ఆ



మహిళ సహాయం కోసం ఆర్తనాదాలు చేసింది. ఒక ముస్లిమ్ యువకుడు అది చూసి ఆమెకు సహాయంగా వచ్చాడు. ఈ ఘర్షణలో ముస్లిమ్ యువకుడి చేతిలో ఆమెను గాయపరిచిన యూదుడు మరణించాడు. ఇరు వర్గాల మధ్య ఆగ్రహావేశాలు తారాస్థాయికి చేరుకున్నాయి. ముస్లిములకు, యూదులకు మధ్య ఘర్షణ వాతావరణం నెలకొంది. ఈ విషయం తెలిసి ప్రవక్త (స) అక్కడికి చేరుకున్నారు. ఇరువర్గాలను శాంతింపజేశారు. మహిళ పట్ల అసభ్యంగా ప్రవర్తించిన వారిని మందలించారు. వాళ్ళు పద్ధతి మార్చుకోకపోతే బద్ర్ యుద్ధంలో ఖురైషులకు పట్టిన గతే వారికి పడుతుందని హెచ్చరించారు. ఈ హెచ్చరికను ఎగతాళి చేస్తూ బనీ ఖైనుకా నాయకుడు "ముహమ్మద్! నీ గురించి పెద్దగా ఊహించుకోవద్దు. ఖురైషులు బలహీనులు, యుద్ధం ఎలా చేయాలో తెలియని వారు కాబట్టి నువ్వు వారిలో కొందరిని చంపగలిగావు. మా లాంటి వారిని నువ్వు ఎదుర్కోలేదు" అన్నాడు. ఈ అహంకారపూరిత ప్రగల్భాలకు ప్రవక్త (స) హుందాగా మౌనంగా ఊరుకున్నారు. సమస్య మరింత పెరగకుండా ఆపేశారు.

అన్సారుల్లోని రెండు తెగల మధ్య విభేదాలు సృష్టించడానికి కూడా యూదులు ప్రయత్నించారు. అన్సారులు, ముహాజిర్లు కూర్చుని ఉన్న ప్రదేశం నుంచి వెళుతూ ఒక ముసలి యూదుడు వారి మధ్య ఉన్న స్నేహాన్ని, సుహృద్భావాన్ని చూసి భరించలేకపోయాడు. ఒక కుట్ర పన్నాడు. కొందరు యూదులు వెళ్ళి అన్సారులతో కలిసిపోయి బాస్ తదితర యుద్ధాల వీరోచిత కథలను వారికి గుర్తు చేయాలని చెప్పాడు. అన్సారుల్లోని రెండు తెగలు ఇస్లామ్ స్వీకరించక ముందు జరిగిన యుద్ధాలవి. ఈ కుట్ర పనిచేసింది. అన్సారుల రెండు తెగల సమావేశం జరుగుతున్నప్పుడు ఈ యుద్ధాల ప్రస్తావన, ఆ యుద్ధాల్లో వారు పోషించిన పాత్ర, యుద్ధ వివరాలు అన్నీ ప్రస్తావనకు వచ్చి ఉద్రిక్తతలు పెరిగాయి. ఇరుపక్షాలు ఆయుధాలు దూయడానికి సిద్ధపడ్డాయి. ఈ లోగా కొందరు అనుచరులతో ప్రవక్త (స) అక్కడికి వచ్చారు. అక్కడి పరిస్థితిని చూసి వారిని మందలిస్తూ "ముస్లిములారా! దేవుడిని గుర్తు చేసుకోండి. మీకు దేవుడు ఇస్లామ్ మార్గం చూపించాడు, ఇస్లామ్ ద్వారా మిమ్మల్ని ఉద్ధరించాడు. అజ్ఞాన కాలం నాటి బంధనాల నుంచి విముక్తి ప్రసాదించాడు. విగ్రహారాధన నుంచి స్వేచ్ఛ ప్రసాదించాడు. మిమ్మల్ని ప్రేమాభిమానాలు, సమైక్యతా బంధంలో ఒక్కటి చేశాడు. నేను మీ మధ్య ఉన్నప్పుడే మీరు ఈ అజ్ఞాన కాలం నాటి నినాదాలు ఇస్తారా" అన్నారు.

ఈ మందలింపుతో వారి కళ్ళు తెరుచుకున్నాయి. తమలో ఈ భావావేశాలను రెచ్చగొట్టిన చెడును గుర్తించారు. వారి తలలు సిగ్గుతో వాలిపోయాయి. పశ్చాత్తాపంతో ప్రవక్త (స) వెంట నడిచారు.

ఈ కపటుల అతిపెద్ద కుట్రల్లో ఒక మస్జిదు నిర్మాణం కూడా ఉంది. ముస్లిమ్ సమాజంలో దాగిన ఈ కపటులు తమ రహస్యసమాలోచనలకు ఒక మస్జిదును నిర్మించారు. ప్రవక్త (స) మస్జిదుకు పోటీగా దీన్ని కట్టుకున్నారు. ఈ మస్జిదును ఖజ్‌రజ్ తెగకు చెందిన ఒక సాధువు అబూ ఆమిర్ నిర్మించాడు. మతగ్రంథాల జ్ఞానం ఉన్న పండితుడిగా, మతపరమైన దుస్తులు ధరించి తిరిగే అబూఆమిర్‌కు మదీనాలో మంచి పలుకుబడి ఉంది. కాని ప్రవక్త (స) వచ్చిన తర్వాత ఇతడి పలుకుబడి దెబ్బతింది. అందువల్ల ప్రవక్త (స)కు వ్యతిరేకంగా పనిచేయడం ప్రారంభించాడు. బద్ర్ యుద్ధం తర్వాత తన భవిష్యత్తు మరింత అగమ్యగోచరంగా కనబడ్డంతో బెంబేలు పడి మక్కాలోని తెగల నాయకులను మరో యుద్ధానికి రెచ్చగొట్టాడు. ఉహుద్ యుద్ధానికి ఇతడి కుట్రలు కూడా కారణం. కొందరు అరబ్బు నాయకులతో కలిసి కుట్రపన్ని ప్రవక్త (స)కు వ్యతిరేకంగా మదీనాలోని అన్సారులను రెచ్చగొట్టాడు. మదీనాపై దాడి చేయాలని రోమ్ చక్రవర్తిని ఆహ్వానించాడు. అన్నింటికీ పరాకాష్ఠ ప్రవక్త (స) శిబిరానికి ప్రత్యర్థి శిబిరంగా ఒక మస్జిదును నిర్మించాడు. తాను కట్టిన మస్జిదుకు ప్రవక్త (స)నుంచి ఆమోదం పొందాలని చాలా ప్రయత్నించాడు. కాని దివ్యఖుర్ఆన్‌లో దేవుడు స్వయంగా ఈ విషయమై ప్రవక్త (స)ను హెచ్చరించాడు.

> **"ఇంకా కొందరున్నారు, వారు ఒక మసీదును నిర్మించారు, (సత్యసందేశానికి) నష్టం కలిగించాలనే ఉద్దేశ్యంతో, ఇంకా (దేవుని ఆరాధన చెయ్యటానికి బదు లుగా) అవిశ్వాసాన్ని అనుసరించాలని, విశ్వాసులలో చీలిక తీసుకు రావాలని, (ఈ బూటకపు ఆరాధనాలయాన్ని) ఇదివరకు అల్లాహ్‌కు ఆయన ప్రవక్తకూ వ్యతిరేకంగా పోరాడిన వ్యక్తికి మాటుగా చెయ్యాలని. వారు మాటి మాటికీ ప్రమాణాలు చేసి మా ఉద్దేశ్యం మేలు చెయ్యటం తప్ప మరొకటి కాదు అని తప్పకుండా అంటారు. కానీ అల్లాహ్ సాక్షిగా ఉన్నాడు, వారు పూర్తి అసత్య వాదులు. నీవు ఎన్నడూ ఆ కట్టడంలో నిలబడకు. మొదటి రోజు నుండే భయభక్తులు ఆధారంగా స్థాపించబడిన మసీదే నీవు (ఆరాధన కొరకు) నిలబడడానికి తగినది. అందులో పరిశుద్ధంగా ఉండటానికి**



> **ఇష్టపడేవారు ఉన్నారు. అల్లాహ్‌కు పరిశుద్ధతను పాటించేవారు అంటేనే ఇష్టం."**
> ***(దివ్యఖుర్ఆన్ 9 : 107, 108)***

ఈ మస్జిదును తర్వాత ప్రవక్త ముహమ్మద్ (స) ఆదేశాల మేరకు కూల్చి వేయడం జరిగింది. కపటులు ఇలాంటి కుట్రలు అనేకం పన్నారు. యూదులు న్యాయ వ్యవస్థలో జోక్యం చేసుకునే కుట్రలు పన్నారు. యూదులకు ముస్లిములకు కుదిరిన ఒప్పందం మేరకు రాజకీయ, న్యాయపరమైన వ్యవహారాల్లో అంతిమ నిర్ణయాధికారం ప్రవక్త (స)దే. ఒక యూదుడికి సంబంధించి వ్యభిచార నేరం ప్రవక్త (స) సమక్షానికి వచ్చింది. ప్రవక్త (స) ఈ కేసులో యూద ధార్మిక చట్టాల ప్రకారం తీర్పు ఇవ్వాలను కున్నారు. అందువల్ల వారి ధర్మగ్రంథం తౌరా తీసుకు రావాలని కోరారు. తౌరా ప్రకారం వ్యభిచార నేరానికి గాను రాళ్ళతో కొట్టి చంపా లన్నది శిక్ష. కాని నేరస్తుడికి ఈ శిక్ష పడడం యూదులకు ఇష్టం లేదు. అందువల్ల ధర్మగ్రంథంలో ఆ శిక్ష ఉన్న భాగంపై చెయ్యి అడ్డంగా పెట్టి చూపించారు. కాని అబ్దుల్లా బిన్ సలామ్‌కు వారి గ్రంథంలో ఏముందో తెలుసు. ఆయన ఇస్లామ్ స్వీకరించక ముందు యూదుల మత పెద్ద అంటే రబ్బీగా ఉన్నారు. ఆయన తౌరాపై అడ్డంగా పెట్టి ఉన్న యూదుడి చేయి తొలగించి అక్కడ ఉన్న శిక్షను చూపించారు. వారి మతగ్రంథం ప్రకారమే ప్రవక్త (స) శిక్ష విధించారు.

ప్రవక్త (స) మదీనాకు రాకముందు మదీనాలోని యూదులు న్యాయ వ్యవహారాల్లో ఇష్టం వచ్చినట్లు వివక్షాపూరితంగా వ్యవహరించేవారు. సమాజంలో పలుకుబడి ఉన్న పెత్తందార్ల విషయంలో చాలా ఉదారంగా, మెతకగా శిక్షలు ఉండేవి. అదే నేరం చేసిన ఒక నిరుపేదను అత్యంత కఠినంగా శిక్షించేవారు. ప్రవక్త (స) ఈ వివక్షలు తొలగించి అందరికీ సమాన న్యాయం అందేలా చేశారు. దౌర్జన్యభరితమైన అనేక సమాజాల మాదిరిగానే మక్కాలోని ఖురైషులు కూడా న్యాయం విషయంలో ఇలాంటి వివక్ష చూపేవారు. మక్కా విజయం సందర్భంగా మఖ్జూమీ తెగకు చెందిన ఫాతిమా అనే మహిళపై దొంగతనం ఆరోపణ వచ్చింది. ఆమె కులీన వర్గానికి చెందిన మహిళ కాబట్టి శిక్ష విషయంలో మెతకగా ఉండాలని ఖురైషులు ప్రవక్త (స)కు నచ్చచెప్పాలనుకున్నారు. ఉసామా బిన్ జైద్‌ను ప్రవక్త (స)తో మాట్లాడమని కోరారు. ఉసామా ఈ విషయాన్ని ప్రవక్త (స) పద్ద ప్రస్తావించి నప్పుడు ప్రవక్త (స) ఆగ్రహంగా ఉసామాతో "ఒక దైవాదేశాన్ని పక్కన పెట్టమని సిఫారసు చేస్తున్నావా?" అన్నారు. ఉసామా వెంటనే పరిస్థితి ఏమిటో గ్రహించారు.

పశ్చాత్తాపపడ్డారు. ప్రవక్త (స)ను మన్నించవలసిందిగా వేడుకున్నారు. ఆ సాయంత్రం ప్రవక్త (స) ముస్లిములను ఉద్దేశించి ప్రసంగిస్తూ ఇలా అన్నారు :

"మీ కన్నా ముందు జాతులు పతనం కావడానికి, నాశనం కావడానికి ఒక కారణం ఇదే. ఎవరైనా ప్రముఖ వ్యక్తి దొంగతనానికి పాల్పడితే దాన్ని పట్టించుకోకుండా వదిలేసేవారు. కాని అదే పని ఒక నిరుపేద చేస్తే కఠినంగా శిక్షించేవారు. కాని నా విషయంలో, దేవునిపై ఒట్టేసి చెబుతున్నాను. నా కూతురు ఫాతిమా దొంగ తనానికి పాల్పడినా ఆమె చేతులు ఖండించే శిక్షే విధిస్తాను"

మదీనాలోని ముస్లిమ్ రాజ్య అంతర్గత వ్యవహారాల్లో, పౌరపరిపాలనలో యూదులు జోక్యం చేసుకోవడం ప్రారంభించారు. అలాంటి ఒక సంఘటన ఖైబర్ విజయం తర్వాత చోటు చేసుకుంది. ఖైబర్ విజయం తర్వాత అక్కడి యూదుల విజ్ఞప్తి మేరకు, వారి భూములు వారి స్వాధీనంలోనే ఉంచడానికి, వాటి ఫలసాయంలో సగం కప్పంగా చెల్లించడానికి ఒప్పుకోవడం జరిగింది. ఆ తర్వాతి సంవత్సరం కప్పం వసూలు చేయడానికి అబ్దుల్లా బిన్ రవాహను అక్కడికి పంపినప్పుడు యూదులు ఆయనకు లంచం ఇవ్వజూపారు. అబ్దుల్లా నిక్కచ్చిగా వారితో "దైవద్రోహులారా! నిషేధించబడింది స్వీకరించేలా నాపై ఒత్తిడి చేస్తారా?" అని ప్రశ్నించారు. ఫలసాయంలో సగం ఖచ్చితమైన కొలతలతో వసూలు చేయడానికే వచ్చానని చెప్పారు. "మీ వాటాను లాక్కురమ్మని ప్రవక్త (స) నన్నిక్కడికి పంపలేదు. ఫలసాయాన్ని న్యాయంగా రెండు భాగాలు చేసి మీకు, ముస్లిములకు పంచడానికి పంపారు. మీకు ఇష్టమైతే నేను లెక్కవేసి సగం మీకు ఇస్తాను. లేదా మీరు లెక్కవేసి నాకు సగం ఇవ్వండి" అన్నారు. చివరకు అబ్దుల్లా లెక్కించి మొత్తం 40 కొలతల్లో 20 కొలతలు ముస్లిములకు తీసుకున్నారు.

ప్రవక్త (స) గృహజీవితంలో చిచ్చుపెట్టి, అసమ్మతి రాజేసి ఇబ్బందుల పాలు చేయడానికి యూదులు మరో నీచమైన కుట్ర పన్నారు. ఇక్కడ గమనించవలసిన విషయమేమంటే మదీనా స్త్రీలకు, మక్కా స్త్రీలకు మౌలికంగా స్వభావంలో తేడా ఉంది. మదీనా సమాజంలో స్త్రీలకు కాస్త ఎక్కువ స్వేచ్ఛ ఉండేది. మక్కాలోని ఖురైష్ కుటుంబాల్లో స్త్రీలు భర్త పట్ల సంపూర్ణ విధేయత చూపే కఠినమైన నియమాలు ఉండేవి. ఈ తేడా మనకు హజ్రత్ ఉమర్ (రజి)కు సంబంధించిన ఒక సంఘటనలో కూడా తెలుస్తుంది. ఒకసారి హజ్రత్ ఉమర్ (రజి) తన భార్యను మందలించారు, ఆమె అదే స్వరంతో జవాబిచ్చారు. ఇది విని హజ్రత్ ఉమర్ (రజి) కాస్త ఆగ్రహంగా



"నువ్వు నాతో ఇలా మాట్లాడతావా?" అన్నారు. కాని వెంటనే ఆయనకు అర్థమయ్యింది, మదీనాలో వాతావరణం మక్కా ప్రజల కుటుంబ సంప్రదాయాలను తీవ్రంగా ప్రభావితం చేసిందని తెలుసుకున్నారు. ఈ తేడాను తమకు అనుకూలంగా ఉపయోగించుకోవాలనుకున్నారు యూదులు. కొందరు మహిళలను ఇందుకు నియమించారు. ప్రవక్త (స) భార్యలను రెచ్చగొట్టి ప్రవక్త (స)పై తిరగబడేలా చేయాలనుకున్నారు. తమకు లభిస్తున్నది ఖర్చులకు సరిపోవడం లేదంటూ వాళ్ళు ప్రవక్త (స) తిరుగుబాటు చేసేలా పథకం వేశారు. ఈ పథకానికి వాడుకున్న మహిళల్లో ఒక మహిళ పేరు ఉమ్మే జల్దా. ఈ మహిళను ప్రవక్త (స) భార్యలను రెచ్చగొట్టడానికి ఉపయోగించుకున్నారు. ఇలాంటి స్త్రీలను ఉపయోగించుకుని ప్రవక్త (స) గృహ జీవితంలో చిచ్చుపెట్టడానికి ప్రయత్నించారు. ఫలితంగా అనేక ఇబ్బందికరమైన సంఘటనలు చోటుచేసుకున్నాయి. నిజానికి ఈ సంఘటనలు చాలా తీవ్రమైన పరిణామాలకు దారితీసి ఉండేవి, కాని దేవుని దయవల్ల, ప్రవక్త (స) ఉన్నత వ్యక్తిత్వం, ప్రవక్త అనుచరుల సహకారం, స్వయంగా ప్రవక్త (స) భార్యల మంచితనం వల్ల పరిస్థితులు చేజారకముందే చక్కబడ్డాయి. ఒక సందర్భంలో ప్రవక్త (స) భార్యలందరూ ఏకమై తమకు కేటాయిస్తున్న ఇంటిఖర్చులు పెంచాలని డిమాండ్ చేయడం కూడా జరిగింది. ప్రవక్త (స) భార్యల్లో హజ్రత్ ఉమర్ (రజి) కుమార్తె, హజ్రత్ అబూబక్ర్ (రజి) కుమార్తె కూడా ఉన్నారు. వారిద్దరిని వారి తండ్రులు తీవ్రంగా మందలించారు. ఈ సందర్భంగానే క్రింది దైవవాక్యాలు అవతరించాయి:

> **"ఓ ప్రవక్తా! నీ భార్యలతో ఇలా అను; "ఒకవేళ మీరు ప్రాపంచిక జీవితాన్నీ, దాని శోభనూ కోరుతూ ఉన్నట్లయితే, రండి. నేను మీకు ఎంతో కొంత ఇచ్చి వేసి మంచి పద్ధతి ప్రకారం సాగనంపుతాను. కాని ఒకవేళ మీరు అల్లాహ్‌ను, ఆయన ప్రవక్తను, పరలోక నివాసాన్ని కోరుతూ ఉన్నట్లయితే, తెలుసుకోండి మీలోని పుణ్యవతుల నిమిత్తం అల్లాహ్ గొప్ప ప్రతిఫలాన్ని సిద్ధపరచి ఉంచాడు."**
> ***(దివ్యఖుర్ఆన్ 33 : 28-29)***

ప్రవక్త (స) భార్యల ముందు రెండు ప్రత్యామ్నాయాలు ఉంచబడ్డాయి. ఒకటి, వారు ప్రవక్త (స) నుంచి విడివడి వారికి ఇష్టమైన రీతిలో జీవించవచ్చు. రెండవది, దైవప్రవక్త (స)తో ఉంటూ ఇహలోకంలో నిరుపేద సాధు జీవితాన్ని గడిపి పరలోకంలో గొప్ప బహుమతి పొందడం. ఈ ప్రత్యామ్నాయాలు వారి ముందుకు రాగానే ప్రవక్త(స) భార్యలు వెంటనే తమ తప్పు తెలుసుకున్నారు. పశ్చాత్తాపపడ్డారు. నిజానికి

ఈ తిరుగుబాటుకు నాయకత్వం వహించింది హజ్రత్ ఆయేషా (రజి). తెలివి తేటల్లోను, వివేకవిచక్షణల్లోను మేటి అయిన హజ్రత్ ఆయేషా(రజి) ఈ తిరుగుబాటును నడిపారు. కాని ఆ తర్వాత వెంటనే వాస్తవాలు గ్రహించి, అందరికన్నా తానే ముందుగా ప్రవక్త (స)తో సాధు జీవితం గడపడానికి సమస్తం వదిలివేయడానికి సిద్ధమని ప్రకటించారు.

## హత్యా ప్రయత్నాలు

ప్రవక్త (స)ను హతమార్చడానికి చాలా ప్రయత్నాలు జరిగాయి. ప్రతిసారి ఆయన్ను దేవుడే కాపాడాడు. సరయిన సమయంలో ఆయనకు హెచ్చరికలు అందుతూ వచ్చాయి. కొన్ని సంఘటనలు ఇక్కడ ప్రస్తావించదగినవి.

మదీనాకు తరలివచ్చిన నాల్గవ సంవత్సరంలో ఆమిర్ తెగకు చెందిన ఇద్దరిని అమ్ర్ బిన్ ఉమయ్యా దామ్రి చంపేశాడు. ఈ విషయం తెలిసి ప్రవక్త (స) బనూ నజీర్ తెగకు వెళ్ళారు. ఈ హత్యలకు నష్టపరిహారం విషయంలో మాట్లాడడానికి ప్రవక్త (స) అక్కడికి వెళ్ళారు. అలాగే యూదులకు ఒప్పంద నిబంధనలు గుర్తు చేయాలనుకున్నారు. అక్కడ వాళ్ళు ప్రవక్త (స)ను ఒక కోటగోడ నీడలో కూర్చోబెట్టారు. పై నుంచి ఆయన తలపై ఒక పెద్ద బండరాయి పడేసి చంపాలని పథకం వేశారు. కాని ప్రవక్త (స)కు దైవికంగా ఈ విషయం తెలిసి తక్షణం అక్కడి నుంచి లేచి వచ్చేశారు.

యూద నాయకుల్లో కాబ్ బిన్ అష్రఫ్ ఒకడు. అతడి తండ్రి తాయి తెగకు చెందినవాడు. తల్లి సంపన్న యూద కుటుంబానికి చెందిన స్త్రీ. ఆమె తండ్రి అబూ రాఫే ఇబ్నే అబీ హకీక్. తల్లిదండ్రుల్లో ఒకరు ప్రముఖ యూదకుటుంబానికి చెందినవారు, మరొకరు ప్రముఖ అరబ్బు కుటుంబానికి చెందినవారు, కాబట్టి కాబ్ బిన్ అష్రఫ్‌కు అటు యూదుల్లోను, ఇటు అరబ్బుల్లోను పలుకుబడి ఉండేది. బాగా సంపన్నుడు, అంతేకాదు కవి కూడా. కాని ఇస్లామ్ పట్ల తీవ్ర విద్వేషాన్ని మనో మస్తిష్కాల్లో నింపుకున్నాడు. కాబ్ బిన్ అష్రఫ్ మదీనాలో కొందరిని కిరాయికి కుదుర్చు కుని ప్రవక్త (స)ను హతమార్చడానికి పథకం వేశాడు. ఈ విషయాన్ని గ్రహించిన ప్రవక్త (స) ఈ హత్యాప్రయత్నం నుంచి కూడా తప్పించుకున్నారు.

బనూ ఖురైజా తెగతో ప్రవక్త (స) ఒప్పందాన్ని పొడిగిస్తున్న సమయంలో బనూ నజీర్ నుంచి ఒక సమాచారం వచ్చింది. ప్రవక్త (స) తన మనుష్యులు



ముగ్గురితో రావాలని, బనూ నజీర్ తరఫున ముగ్గురు పండితులను పంపుతామని, ఆ పండితులు ప్రవక్త (స) బృందంతో చర్చలు జరిపి, ప్రవక్త (స) వాదన సరయిందనిపిస్తే బనూ నజీర్ తెగ యావత్తు ఇస్లామ్ స్వీకరిస్తుందని తెలిపారు. ప్రవక్త (స) వారి వద్దకు బయలుదేరారు. కాని దారిలోనే ఆయనకు వారి కుట్ర గురించి సమాచారం తెలిసింది. యూదులు అక్కడ కరవాలాలు దూసి మాటువేసి కూర్చున్నారని, ఆయన రాగానే దాడికి సిద్ధంగా ఉన్నారని తెలిసింది. వెంటనే ప్రవక్త (స) వెనుదిరిగి వెళ్ళిపోయారు.

ప్రవక్త (స)కు విషం ఇచ్చి చంపే ప్రయత్నం కూడా జరిగింది. అల్ హార్స్ కుమార్తె, జైనబ్ అనబడే యూద మహిళ మాంసం వండి అందులో విషం కలిపింది. ప్రవక్త (స)కు మేక కాలి మాంసం ఇష్టమని తెలిసి అందులో విషాన్ని ఎక్కువగా కలిపింది. అలా విషం కలిపిన మాంసాన్ని ప్రవక్త (స)కు ఆయన అనుచరులకు కానుకగా పంపింది. ప్రవక్త (స) అందులో కొంతభాగం తీసుకుని వెంటనే ఉమ్మేశారు. అందులో విషం కలిపినట్లుందని అన్నారు. అనుచరులు ఎవ్వరూ ఆ మాంసాన్ని తాకకుండా నిరోధించారు. కాని ఈ లోగా ఒక అనుచరుడు బరా బిన్ మారూర్ ఒక మాంసం ముక్కను నోట్లో పెట్టుకుని, ప్రవక్త (స) సమక్షంలో ఉమ్మలేక అలాగే మింగేసి చనిపోయారు. వెంటనే ఆ యూదమహిళను పిలిచి విచారించారు. ఆమె తన తప్పు ఒప్పుకుంది. ముహమ్మద్ (స) నిజంగా ప్రవక్త అయినట్లయితే విషం గురించి ఆయనకు ముందుగానే తెలియాలి కాబట్టి పరీక్షించడానికి అలా చేశానని చెప్పింది. ఆయన ప్రవక్త కానట్లయితే విషప్రయోగంతో చనిపోతారు కాబట్టి తమకు బాధలుండవని చెప్పింది. ప్రవక్త (స) ఆమెను క్షమించి వదిలేశారు.

తబూక్ యుద్ధం ఇస్లాం విరోధులను తీవ్రంగా కుదిపేసింది. వారికి అనూహ్యంగా భారీ నష్టం సంభవించింది. ఈ యుద్ధం తర్వాత ప్రవక్త (స) యుద్ధరంగం నుంచి వెనుదిరిగి వెళుతున్నప్పుడు ఆయన్ను అకబా వద్ద హతమార్చడానికి కుట్ర పన్నారు. ఈ కుట్రలో పన్నెండు మంది పాల్గొన్నారు. అబ్దుల్లా బిన్ ఉబై, సాద్ బిన్ అబీ సారా, అబూ కాతిర్ అరబీ, ఆమిర్, అబీ ఆమిర్ రాహిబ్, జలాస్ బిన్ సువాయిద్, మిజ్మా బిన్ జారియా, మాలిహ్ తాయిమి, హిస్న్ బిన్ నుమాయిర్, తాయిమా బిన్ ఉబైరఖ్, అబ్దుల్లా బిన్ ఖైనా, ముర్రా బిన్ రాబిలు ఈ కుట్రలో ఉన్నారు. వీళ్ళందరూ

ఒకరి తర్వాత ఒకరు ప్రతిజ్ఞ చేశారు. ప్రవక్త (స) అకబా నుంచి వెళుతున్నప్పుడు భీకరంగా దాడి చేయాలని కాచుక్కూర్చున్నారు. అవకాశం దొరగ్గానే విరుచుకుపడాలని మాటువేశారు. ప్రవక్త (స) అకబా దగ్గరకు రాగానే ఆయన తన అనుచరులతో లోయ నుంచి వెళ్ళాలనుకున్న వాళ్ళు ఆ దారిన వెళ్ళవచ్చని అన్నారు. చాలా మంది అనుచరులు ఆ దారినే సాగిపోయారు. ప్రవక్త (స) మాత్రం అకబా నుంచి వెళ్ళే దారిన పయనమయ్యారు. అయితే కొంతసేపటికే ఆయనకు అనుమానం వచ్చింది. తనతో పాటు ఇద్దరు అనుచరులు, అమ్మార్ బిన్ యాసిర్, హుజైఫా బిన్ యమన్‌లను రమ్మన్నారు. అందులో అమ్మార్‌ను ఒంటె తాడు పట్టుకుని ముందు నడువమన్నారు. హుజైఫాను ఒంటె వెనుక నడవమన్నారు. ఆయన అకబాలోకి ప్రవేశించగానే కుట్రదారులు దూసుకువచ్చారు. అది చీకటి రాత్రి, వారంతా నల్లముసుగులు ధరించి ఉన్నారు. కాని ప్రవక్త (స) వారి అడుగుల సవ్వడి విని గుర్తించారు. వారిని వెనక్కి పారద్రోలమని అనుచరులను ఆదేశించారు. హుజైఫా వారివైపు కదిలి వారిలో ఒకరి ఒంటె ముఖానికి బాణం గురిపెట్టి వదిలారు. ఆ ఒంటెపై ఉన్నదెవరో కూడా హుజైఫా గుర్తించారు. కుట్రదారులకు తమ పన్నాగం బట్టబయలైందని తెలిసి పోయింది. వెంటనే కాలికి బుద్ధి చెప్పి ఇతరులతో కలిసిపోయారు. ప్రవక్త (స) హుజైఫాతో వారిలో ఎవరినైనా గుర్తుపట్టారా అనడిగారు. హుజైఫా జవాబిస్తూ, తాను వారి ముఖాలు చూడకపోయినా, వారి ఒంటెలను బట్టి కనీసం ఇద్దరు ముగ్గుర్ని గుర్తుపట్టగలనని చెప్పారు. మర్నాడు ప్రవక్త (స) దైవిక ఆదేశాలతో ఆ పన్నెండు మంది కుట్రదారులను గుర్తించి వారి పేర్లు చెప్పి వారిని పిలిపించారు. అంతేకాదు, ఆ కుట్రపథకం వేస్తున్నప్పుడు వారు మాట్లాడుకున్నదంతా అక్షరం పొల్లుపోకుండా వారికి వినిపించారు. నిర్ఘాంతపోయిన కుట్రదారులు తమ తప్పు ఒప్పుకున్నారు. అందులో కొందరు క్షమాపణ కోరుకున్నారు. మరికొందరు కుంటిసాకులు చెప్పారు. కాని హిస్న్ బిన్ నుమాయిర్ మాత్రం పూర్తిగా మారి పోయాడు. ముహమ్మద్ (స) దేవుని ప్రవక్త అని తాను నమ్ముతున్నానని బహిరంగంగా ప్రకటించాడు. ఈ కుట్ర గురించి తెలిసి ప్రవక్త (స) అనుచరుల్లో ఒకరు తీవ్రంగా మండిపడ్డారు. ఈ కుట్రదారులకు చెందిన తెగల నాయకులను పిలిచి, తమ తెగలో ఇలాంటి కుట్రకు పాల్పడిన వాడి తలను ఆ తెగ నాయకుడు తెగనరికేలా ఆదేశిం చాలని అన్నారు. కాని ప్రవక్త (స) వారందరినీ క్షమించి వదిలేశారు.



మంత్రతంత్రాలతో ప్రవక్త (స)ను చంపడానికి కూడా ఒక ప్రయత్నం జరిగింది. బనీ రుజాయిక్ తెగకు చెందిన లబీబ్ బిన్ ఆసిమ్ యూదులకు మిత్రుడు. ఈ నీచమైన పనికి అతడు ఒడిగట్టాడు. ప్రవక్త (స) వద్ద ఒక యూదబాలుడు పనిచేసేవాడు. ఆ బాలుడి ద్వారా ప్రవక్త (స) వెంట్రుకను, ఆయన వాడే దువ్వెన పండ్లను సేకరించాడు. మంత్రప్రయోగం చేసి వాటిని జర్వాన్ అనబడే నూతిలో పారేశాడు. ఈ మంత్ర ప్రయోగం వల్ల ప్రవక్త (స) మనోమస్తిష్కాలపై తీవ్రమైన ప్రభావం పడింది. దైవవాక్కులు అవతరించి దానికి కారణం తెలిపే వరకు ఈ ఇబ్బంది ఆయన్ను బాధపెట్టింది. దైవవాక్కులు ఈ ఇబ్బందికి కారణం తెలిపిన తర్వాత ఆ నూతి నుంచి మంత్రప్రయోగం చేసిన సామాగ్రిని తొలగించిన తర్వాత కాని ప్రవక్త (స)కు నెమ్మది కలుగలేదు. ప్రవక్త (స)ను చంపడానికి చివరకు మంత్రప్రయోగాల వంటి నీచమైన ప్రయత్నాలకు కూడా శత్రువులు పాల్పడడం చూసిన తర్వాత అనుచరులు మరింత అప్రమత్తమయ్యారు. ప్రవక్త (స) బయటకు వెళ్ళిన ప్రతిసారీ వారు చాలా ఆందోళనకు గురయ్యేవారు. ఆయన కాసేపు కనబడకపోయినా వారి ఆందోళన పెరిగేది. ఆయన కోసం వెదికేవారు. అలాంటిదే ఒక సంఘటనలో ప్రవక్త (స) కాస్సేపు కనబడకపోయే సరికి హజ్రత్ అబూ హురైరా (రజి) చాలా ఆందోళనపడ్డారు. ప్రవక్త (స) కోసం అన్ని చోట్లా వెదికారు. చివరకు బనూ నజ్జార్ తోట వద్దకు వెళ్ళారు. ఆ తోట చుట్టు గోడ ఉంది. ఆయన తలుపుల కోసం చూశారు. కాని కంగారులో ఆయనకు తలుపులు ఎక్కడున్నాయో కనబడలేదు. చివరకు ఆయన నీరు బయటకు పోవడానికి గోడకు చేసిన ఒక కన్నం నుంచి కష్టపడి లోపలికి దూరి అక్కడ ప్రవక్త (స)ను చూసి ఊపిరి పీల్చు కున్నారు. ప్రవక్త (స) భద్రత విషయంలో అనుచరులు ఎంతో ఆందోళన పడినప్పటికీ, ప్రవక్త (స)కు మాత్రం దేవునిపై సంపూర్ణ విశ్వాసం ఉండేది. దేవుడే కాపాడతాడన్న అచంచల నమ్మకం ఉండేది. అందువల్లనే తన రక్షణ కోసం అంగరక్షకులను కొందరు అనుచరులు నియమించినప్పుడు ప్రవక్త (స) వారందరినీ పంపించేశారు. తాను దేవుని రక్షణలో ఉన్నానని అన్నారు. ఒక సంఘటనలో ఒక వ్యక్తి ప్రవక్త (స)ను చంపడానికి ప్రయత్నిస్తు రెడ్‌హ్యాండెడ్‌గా దొరికిపోయాడు. అప్పుడు కూడా ప్రవక్త (స) ఆ వ్యక్తిని క్షమించి వేస్తూ అతడిని వదిలేయమని అనుచరులను ఆదేశించారు. అంతేకాదు, "అతను నన్ను చంపాలనుకున్నా చంపలేదు" అన్నారు.

బద్ర్ యుద్ధంలో ఘోరపరాజయం తర్వాత ఖురైషులు ప్రతీకారేచ్ఛతో రగిలి పోయారు. తమకు యుద్ధంలో సంభవించిన నష్టాల ప్రతీకారేచ్ఛ తగ్గకుండా ఉండ డానికి, తమ పరాభవం పదిమందికి తెలియకుండా ఉండడానికి గాను బద్ర్ యుద్ధంలో నష్టాలపై విషాద వ్యక్తీకరణలను నిషేధించారు. తన ముగ్గురు కుమారు లను బద్ర్ యుద్ధంలో పోగొట్టుకున్న అస్వద్, తన కన్నీళ్ళను తనలోనే దిగమింగాడు. అతడికి ఒక మహిళ రోదనలు వినిపించాయి. ఆ వెంటనే అతను తన నౌకరును పంపి ఏమిటో చూడమన్నాడు. యుద్ధంలో చనిపోయిన వారిని తలచుకుని ఏడ్వడంపై ఉన్న నిషేధాన్ని ఎత్తేశారేమో చూడమన్నాడు. కాని ఆ మహిళ తన ఒంటె పోయి నందుకు ఏడుస్తుందని ఆ నౌకరు వచ్చి చెప్పాడు. ఈ సందర్భంగా అస్వద్ చెప్పిన కవిత అరబీ సాహిత్యంలో ఉన్నతమైన కవితగా నిలిచిపోయింది. ఆ కవితలోని పంక్తులు ఇలా ఉన్నాయి :

"ఆమె తన ఒంటె కోసం ఏడుస్తుంది, నిద్రపోలేక పోతోంది. కాని.. ఒంటె కోసం ఏడవకు.. ఏడ్వాలని ఉంటే అదృష్టం ముఖం చాటేసిన బద్ర్ విషాదంపై రోదించు. ఏడుపొస్తే ఆఖిల్ కోసం, హారిస్ కోసం రోదించు వాళ్ళు సింహాలు" అన్నాడు.

ఈ విషాద వాతావరణంలో ఉమైర్ బిన్ వహాబ్, సఫ్వాన్ బిన్ ఉమయ్యాలు ఒకసారి మాట్లాడుకుంటూ బద్ర్‌లో మరణించిన వారిని తలచుకోసాగారు. అప్పుడు ఉమైర్ మాట్లాడుతూ "ఇప్పుడు జీవితంలో ఎలాంటి ఆనందమూ లేదు. నాకు రుణ భారం లేనట్లయితే, నా పిల్లల పోషణభారం నాపై లేనట్లయితే నేను మదీనా వెళ్ళి ప్రవక్తను హతమార్చి ఉండేవాడిని, నా కుమారుడు కూడా అక్కడ ఖైదీగా ఉన్నాడు" అని చెప్పాడు. ఆ తర్వాత ఇంటికి వెళ్ళిన ఉమైర్ విషం పూసిన ఖడ్గం చేతిలోకి తీసుకుని తిన్నగా మదీనా బయలుదేరాడు. అక్కడ అతడికి హజ్రత్ ఉమర్ (రజి) ఎదురయ్యారు. వాడి ముఖం చూడగానే హజ్రత్ ఉమర్ (రజి) వాడి దురుద్దేశాన్ని గ్రహించి, వాడిని పట్టుకుని ప్రవక్త (స) సమక్షానికి తీసుకొచ్చారు. ప్రవక్త (స) వాడి కట్లువిప్పమని హజ్రత్ ఉమర్ (రజి)ను ఆదేశించారు. ఆ తర్వాత వాడిని తన దగ్గరకు పిలిచారు. అతనేం చేయడానికి వచ్చాడో నెమ్మదిగా అడిగారు. తన కొడుకును విడిపించుకోవడానికి వచ్చానని ఉమైర్ అన్నాడు. "అలా అయితే



ఈ ఖడ్గం ఎందుకు" అనడిగారు ప్రవక్త (స). అప్పుడు ఉమైర్ జవాబిస్తూ "బద్ర్‌లో ఖడ్గం ఏం చేసింది?" అని ఎదురు ప్రశ్నించాడు. ప్రవక్త (స) అప్పుడు మక్కాలో ఉమైర్, సఫ్వాన్‌లు ఇద్దరు కలిసి మాట్లాడుకున్న మాటల్ని చెబుతూ మీ ఇద్దరు నన్ను చంపడానికి ఒక గదిలో తలుపులేసుకుని కుట్రపన్నారు కదా అన్నారు. ఉమైర్ నిర్ఘాంతపోయి ఒప్పుకున్నాడు. అంతేకాదు, "దేవుని తోడు, మీరు నిజంగా దేవుని ప్రవక్త (స). సఫ్వాన్‌కు, నాకు తప్ప ఈ విషయం మరొకరికి తెలియనే తెలియదు" అని ప్రకటించాడు.

బద్ర్ యుద్ధ పరాజయంతో మక్కా ఖురైషులు తీవ్ర ఆగ్రహావేశాలతో ఉన్నారు. ప్రతీకారం తీర్చుకోడానికి ఎంత నీచానికైనా దిగజారడానికి సిద్ధంగా ఉన్నారు. వారికి మదీనాలోని కపటుల నాయకుడు అబ్దుల్లా బిన్ ఉబై దొరికాడు. అబ్దుల్లా బిన్ ఉబై ముస్లిములకు వ్యతిరేకంగా ఏం చేయడానికైనా వెనుకాడడు. మక్కా ఖురైషులు అతడికి ఒక లేఖ రాశారు. "మీ ప్రజలు అక్కడ మా మనిషికి (అంటే ప్రవక్త (స)కు) శరణు ఇచ్చారు. మేము దేవునిపై ఒట్టేసి చెబుతున్నాం. మీరు అతడిని చంపనైనా చంపండి లేదా మీ పట్టణం నుంచి బహిష్కరించండి. లేదా మేమంతా కలిసి మీపై దాడి చేస్తాం. మీ మనుష్యులను చంపుతాం. మీ స్త్రీలను చెరబడతాం" అని రాశారు. అబ్దుల్లా బిన్ ఉబైకి ఏమాత్రం రోషం, సిగ్గు లజ్జల్లాంటివి ఉన్నా, ఆ లేఖను జాతి నాయకుల వద్దకు తీసుకువెళ్ళి, మదీనా ప్రజలను రక్షణ చర్యలకు ప్రోత్సహించి, తమ జాతి మర్యాద కాపాడుకునేలా వారిని సంసిద్ధం చేసి, మక్కా దురాక్రమణ దారులను తిప్పికొట్టడానికి సిద్ధమయ్యేలా చేసేవాడు. కాని అందుకు వ్యతిరేకంగా అబ్దుల్లా బిన్ ఉబై మక్కా ముస్లిమేతరులకు సహాయ పడాలని నిర్ణయించుకున్నాడు. ఈ లోగా ఈ లేఖ గురించి ప్రవక్త (స)కు తెలిసింది. ఆయన స్వయంగా అబ్దుల్లా బిన్ ఉబై వద్దకు వెళ్ళారు. మదీనాలో వారి స్వంత బంధువులు, సన్నిహిత బంధువులు ఇస్లామ్ కోసం ప్రాణాలు అర్పించడానికి సిద్ధంగా ఉన్నారని, ఒకవేళ యుద్ధమే జరిగితే వారి స్వంత బంధువులు, వారి సంతానమే వారికి ప్రత్యర్థి శిబిరంలో కనబడతారని, తమ సన్నిహిత బంధువులతోనే వారు యుద్ధం చేయవలసి ఉంటుందని వివరించారు. ప్రవక్త (స) నచ్చ చెప్పిన తర్వాత అబ్దుల్లా బిన్ ఉబై అర్థం చేసుకున్నాడు. ఈ కుట్రను మానుకున్నాడు.

కాని అబ్దుల్లా బిన్ ఉబై మరో కుట్రపన్నాడు. బనూ నజీర్ యూదులు ఒప్పందాన్ని అనేకసార్లు ఉల్లంఘించారు. వారిలో మార్పు ఎన్నటికీ రాదని తేలి పోయింది. వారిని మదీనా నగరం నుంచి 10 రోజుల్లోగా వెళ్ళిపోవాలని బహిష్కరణ ఉత్తర్వులు వెలువడ్డాయి. వారు కూడా వెళ్ళిపోవడానికి సిద్ధంగా ఉన్నప్పుడు అబ్దుల్లా బిన్ ఉబై వారికి వర్తమానం పంపాడు. బహిష్కరణ ఉత్తర్వులను వాళ్ళు తిరస్కరించాలని, వారికి తాను తన వద్ద ఉన్న 2000 మంది మనుష్యులతో సహాయంగా వస్తానని అన్నాడు. అలాగే బనూ ఖురైజా, బనూ గత్ఫాన్ తెగలు కూడా వారికి సహాయంగా వస్తాయని చెప్పాడు. దీంతో బనూ నజీర్ తెగ సర్దారులకు చాలా ధైర్యం వచ్చింది. తాము మదీనా వదిలి వెళ్ళేది లేదని ప్రవక్త తాన ఏమన్నా చేసుకోవచ్చని తలబిరుసు సమాధానమిచ్చారు. తప్పనిసరి పరిస్థితుల్లో ప్రవక్త (స) సైనికచర్యకు దిగవలసి వచ్చింది.

అలాగే ఉహుద్ యుద్ధం సందర్భంలో కూడా ఇలాంటి వ్యవహారమే జరిగింది. ముస్లిమ్ సైన్యం మదీనా నుంచి బయలుదేరిన కొద్దిసేపటికే అబ్దుల్లా బిన్ ఉబై తనతో ఉన్న 300 మంది కపటులను తీసుకుని వెనక్కి వెళ్ళిపోయాడు. అత్యంత సంక్లిష్టఘడియల్లో ఇది ఊహించరాని నమ్మకద్రోహం. నిజానికి ముస్లిమ్ సైన్యం మదీనా శివార్లు దాటడం అతడికి ఇష్టం లేదు. అదే విషయాన్ని సంప్రదింపుల సమయంలో సమావేశంలో చెప్పాడు. కాని ఎవరూ అతడి సూచనను బలపరచలేదు. అనవసరంగా యుద్ధంలో తన ప్రాణాలకు ప్రమాదం తెచ్చుకోవడం ఎందుకు అనుకున్నాడు.

ముస్లిములకు వ్యతిరేకంగా కుట్రలు పన్నిన మరో పేరుమోసిన కుట్రదారుడు అబూ ఆమిర్. ఈ కపటుల కోసం, కుట్రదారుల కోసం ప్రత్యేకంగా మస్జిదు కట్టించిన వాడు. నిజానికి ఉహుద్ యుద్ధానికి అబూ ఆమిర్ కూడా కారకుడు. అతను స్వయంగా మక్కా వెళ్ళాడు. ఖురైషులను దాడి చేసేలా రెచ్చగొట్టాడు. అతడు ఉహుద్ యుద్ధరంగంలో ఉన్నాడు. యుద్ధం మొదలైన తర్వాత ఔస్ తెగకు చెందిన తన మనుష్యులందరూ ప్రవక్త (స)ను వదిలి ఖురైషుల పక్షానికి వచ్చేస్తారని కూడా హామీ ఇచ్చాడు. ఉహుద్ యుద్ధం తర్వాత ఇతడు రోము చక్రవర్తి వద్దకు వెళ్ళాడు. మదీనాపై దాడి చేయాలని రోము చక్రవర్తిని రెచ్చగొట్టాడు. రోమన్ సైన్యానికి



సహాయం చేయా లని మదీనాలో ఉన్న కపటులందరికీ వర్తమానం పంపాడు. హునైన్ యుద్ధంలో ప్రవక్త (స)ను దెబ్బతీయడానికి దొంగచాటుగా గోతులు తవ్వాడు. ఆ గోతుల్లో ప్రవక్త (స) పడిపోతారని అనుకున్నాడు. నిజానికి అలాంటి ఒక గోతిలో ప్రవక్త (స) పడిపోవడం, తీవ్రంగా గాయపడడం కూడా జరిగింది.

ఇస్లామ్ శత్రువుల కుట్రలు కుతంత్రాల ఈ వాతావరణంలో ముస్లిములు రక్షణ పరంగా ప్రత్యేక ఏర్పాట్లు చేసుకోవలసి వచ్చింది. రాత్రులు గట్టి నిఘా ఏర్పాటు చేశారు. ప్రవక్త (స) అనుచరులే కాదు స్వయంగా ప్రవక్త (స) కూడా వంతులవారీగా రాత్రులు మేలుకుని నిఘా బాధ్యతలు నిర్వర్తించేవారు. ఒక రాత్రి ప్రవక్త (స) అనుచరు లతో "ఈ రాత్రి బలమైన మనుష్యులు నిఘా విధులు నిర్వర్తించాలని" చెప్పారు. హజ్రత్ సాద్ బిన్ వఖ్ఖాస్ ఆయుధాలు ధరించి రాత్రంతా నిఘా పెట్టారు. అకస్మాత్తుగా జరిగే మెరుపుదాడులను తిప్పికొట్టడానికి ఒక పహరా వ్యవస్థను కూడా ఏర్పాటు చేసుకున్నారు. రక్షణ అవసరాలు పెరిగిన కొద్దీ ఈ పహరా వ్యవస్థను మరింత విస్తరిస్తూ పోయారు. శత్రువుల కదలికలను గమనించడానికి సాయుధ బృందాలను పంపేవారు. ముస్లిములు అప్రమత్తంగా ఉన్నారని, ఆకస్మిక దాడులతో వారిని దెబ్బతీయడం సాధ్యం కాదన్న సూచనలు ఈ చర్యల ద్వారా శత్రువులకు అందాయి. ఇక ముస్లిముల్లో దాగి ఉన్న కపటులు అవకాశం కోసం చూస్తున్నారు. పైకి ముస్లిములతో ఉన్నట్లు నటిస్తూ అవకాశం రాగానే, యుద్ధం తలెత్తగానే ముస్లిములకు ద్రోహం చేయడానికి కాచుకుని కూర్చున్నారు. వారు మోసపూరితంగా వ్యవహరించని సందర్భం అంటూ ఏదీ లేదు. మరోవైపు బద్ర్ యుద్ధంలో ఓటమితో గంగవెర్రులెత్తిన మక్కా ఖురైషులు ప్రతీకారేచ్ఛతో రగిలిపోతున్నారు. ఒకవైపు అబ్దుల్లా బిన్ ఉబై నమ్మక ద్రోహానికి పాల్పడినా, ఖురైషులు భారీ సైన్యంతో తరలివచ్చినా ఉహుద్ యుద్ధంలో ఎవరికీ నిర్ణయాత్మక విజయం లభించలేదు. కపటులు తమ కుట్రలను సరికొత్తగా ప్రారంభించారు. బనూ నజీర్ తెగ నాయకులు కొందరు బనూ వాయిల్ తెగ నేతలతో చేతులు కలిపారు. మక్కా ఖురైషులను మరింత సైన్యంతో వచ్చి ఇంకోసారి దాడి చేయమన్నారు. అనేక తెగలను కలుపుకోవడంలో విజయం సాధించారు. ఆ విధంగా పదివేల సైన్యంతో మదీనాను చుట్టుముట్టారు. అదే అహ్జాబ్ యుద్ధం లేదా కందక యుద్ధం. ఈ యుద్ధంలో ముస్లిముల సరికొత్త యుద్ధ వ్యూహం,

కందకం తవ్వడం ద్వారా మదీనాను కాపాడుకునే వ్యూహం, దానికి తోడు నూయిమ్ ఇబ్నె మసూద్ వివిధ తెగలతో వ్యూహాత్మకంగా జరిపిన చర్చలు ఫలించాయి. ముస్లిమేతరుల భారీసైన్యాలు మరోసారి ఘోరపరాజయాన్ని చవిచూశాయి. అయితే కుట్రదారులు తమ కుతంత్రాలను వివిధ రకాలుగా అమలు చేయడం ఆపలేదు. కుట్రదారులు కొంతమంది రోమన్ చక్రవర్తిని కలుసుకుని, మదీనాపై దండెత్తాలని విజ్ఞప్తి చేశారు. రోమన్ చక్రవర్తి నలభైవేల భారీ సైన్యంతో మదీనాపై దండెత్తి వస్తున్నాడన్న పుకారు కూడా లేచింది. ఇంత భారీ సైన్యాన్ని ఎదుర్కొనే స్థితిలో ముస్లిమ్ సైన్యం లేదు. పైగా అది తీవ్రమైన వేసవికాలం. సైన్యం యుద్ధానికి దూరప్రాంతాలు వెళ్ళవలసి ఉంటుంది. ఆహారం, నీటి సరఫరాలు చాలా కష్టమవుతాయి. ఇదే అదనుగా కుట్రదారులు రెచ్చిపోయారు. ప్రవక్త (స) మాట విని సైన్యంతో వెళ్ళవద్దంటూ ప్రచారం చేయడం మొదలు పెట్టారు. వారి ప్రచారం ఫలించి చాలా మంది ఆగిపోయారు. అయినా ప్రవక్త (స) తనకు లభించిన సైన్యంతో యుద్ధానికి బయలుదేరారు. సైన్యం తబూక్ వద్దకు చేరుకుని మజిలీ చేసింది. కాని రోమన్ సైన్యాలు రాలేదు. తమ ఆధీనంలో ఉన్న ఆ ప్రాంతాల్లో తమ ప్రాబల్యాన్ని పటిష్టం చేసి ముస్లిమ్ సైన్యం వెనక్కి మళ్ళింది.

## ఖురైషుల కక్షసాధింపు ప్రయత్నాలు

ఖురైషులు అత్యంత నీచంగా కక్షసాధింపు ప్రయత్నాలకు దిగారు. పెద్ద పెద్ద ఖురైషు సర్దారులు కూడా కక్షసాధింపు కోసం ఏ స్థాయికైనా దిగజారడానికి వెనుకాడలేదు. నిజానికి యుద్ధం జరగక ముందే, మదీనాలోని ఔస్ తెగకు చెందిన ప్రముఖుడు సాద్ బిన్ మాజ్ మక్కా యాత్రకు వెళ్ళాడు. అక్కడ తన స్నేహితుడు ఉమయ్యా బిన్ ఖలఫ్ వద్ద విడిది చేశాడు. వారిద్దరు కలిసి కాబాగృహం ప్రదక్షిణకు వెళ్ళారు. కాబా ప్రదక్షిణ సంప్రదాయం ఎప్పటి నుంచో అరబ్బుల్లో కొనసాగుతూ వస్తోంది. అటు నుంచి వెళుతున్న అబూజహల్ వారిని చూశాడు. ఉమయ్యాను చూసి ఆగ్రహంగా ధర్మభ్రష్టులకు ఆశ్రయమిస్తున్నావా అన్నాడు. ఆ తర్వాత సాద్ వైపు తిరిగి, నువ్వు కాబాగృహంలో ప్రవేశించడాన్ని నేనెన్నటికీ సహించలేను. నువ్వు ఉమయ్యా శరణులో లేనట్లయితే ఇక్కడి నుంచి సజీవంగా వెళ్ళగలిగేవాడివి కాదన్నాడు. ఇలాంటి హెచ్చరికలకు బెదిరిపోయే మనిషి కాదు సాద్. అబూజహల్ బెదిరింపులకు తగిన జవాబు ఇచ్చాడు. మమ్మల్ని అడ్డుకోవడానికి నువ్వు ప్రయత్నిస్తే



మదీనా నుంచి వెళ్ళే మీ వ్యాపారమార్గాన్ని మూసేస్తాం అన్నాడు. అంటే మక్కా ఆర్థిక వ్యవస్థకు జీవనాడిని తెగగొట్టడంతో సమానం. దాంతో అబూజహల్ దిగివచ్చాడు. క్రోధం పట్టలేక తాను చేసిన వ్యాఖ్యలను వెనక్కి తీసుకున్నాడు. ఈ పరిణామాలకు అను గుణంగా మదీనాలోని ముస్లిమ్ రాజ్యం తన విధానాలను మార్చుకోవలసి వచ్చింది. ఆ తర్వాత దివ్యఖుర్ఆన్ బహిరంగంగా ఖురైషులను సవాలు చేసింది. కాబా గృహం ఆజమాయిషీ వారి గుత్తసొత్తు కాదని తేల్చి చెప్పింది. దివ్యఖుర్ఆన్ ఇలా ప్రకటించింది:

> **"అల్లాహ్ ఆరాధనాలయాలలో ఆయన నామ సంస్మరణను నిషేధించి, వాటి వినాశానికి ఒడికట్టే వానికంటే పరమ దుర్మార్గుడెవడు? అటువంటి వారు ఆ ఆరాధనాలయాలలో అడుగుపెట్టటానికి అర్హులు కారు. ఒకవేళ వారు వాటిలో ప్రవేశించినా భయపడుతూ ప్రవేశించాలి. కాని వారికి ప్రపంచంలో తీవ్రపరాభవమూ, పరలోకంలో ఘోరశిక్షా తప్పవు"** *(దివ్యఖుర్ఆన్ **2 : 114**)*
>
> అంతేకాదు, ఇంకా ఇలా ప్రకటించింది :
>
> **'నిషిద్ధ మాసంలో యుద్ధం చేయటాన్ని గురించి ప్రజలు నిన్ను అడుగుతారు. వారికి ఇలా సమాధానం చెప్పు: "ఆ మాసంలో యుద్ధం చెయ్యటం మహా నేరమే. కాని అల్లాహ్ మార్గంలో అవరోధాలు కల్పించటం, అల్లాహ్‌ను తిరస్కరించటం, అల్లాహ్ ఆరాధకులను 'మస్జిదె హరామ్'ను దర్శించకుండా ఆటంక పరచటం, అందులో ఉండేవారిని బయటికి గెంటివేయటం అల్లాహ్ దృష్టిలో అంతకంటే గొప్ప నేరం."** *(దివ్యఖుర్ఆన్ **2 : 217**)*
>
> **"కాని, ఇప్పుడు ఆయన వారిపై శిక్షను ఎందుకు అవతరింపచెయ్యకూడదు. వారు "మస్జిదె హరామ్" యొక్క మార్గాన్ని ఆటంకపరుస్తూ ఉన్నప్పుడు? వాస్తవానికి వారు ఈ మసీదుకు ధర్మసమ్మతమైన ముతవల్లీలు (ధర్మకర్తలు) కాదు."** *(దివ్యఖుర్ఆన్ **8 : 34**)*

దివ్య ఖుర్ఆన్ స్పష్టంగా చేసిన ఈ ప్రకటనల ప్రభావం అరేబియా ప్రజలపై వెంటనే కనబడింది. ఖురైషుల ఆధిపత్యం క్రమేణా సన్నగిల్లడం ప్రారంభించింది. దాంతో ఖురైషుల కక్షసాధింపు కార్యకలాపాలు మరింత ఎక్కువయ్యాయి. హుదైబియా ఒప్పందం సమయంలో (హిజ్రీ.శ.6) ముస్లిములను కాబా గృహంలోకి అడుగు

పెట్టకుండా అడ్డుకోవడం భారీ స్థాయిలో జరిగింది. దైవాదేశాలతో ప్రవక్త (స) నిరాయుధంగా మక్కాకు ఉమ్రా చేయడానికి ప్రయాణమయ్యారు. ఆయన ప్రయాణంలో పోరాట ఉద్దేశ్యాలు ఏవీ లేవు. ఆయనతో పాటు అనేకమంది స్వచ్ఛందంగా బయలుదేరారు. ఖుర్బానీ పశువులు కూడా వారి వద్ద ఉన్నాయి. సంప్రదాయం ప్రకారం ఖుర్బానీ పశువులపై జుల్‌హలిఫా అన్న సంకేతాలు కూడా ఉన్నాయి. వాటి మెడలకు తాళ్ళు కట్టబడి ఉన్నాయి. అంటే అవి కేవలం ఖుర్బానీకి ఉద్దేశించిన పశువులన్నది స్పష్టంగా చూడగానే అర్థమవుతోంది. ఈ ప్రయాణంలో పోరాడాలన్న ఉద్దేశ్యాలు ఏవీ లేవు. ఈ బృందం మక్కావైపు ప్రయాణమయ్యింది. అయితే దారిలో పహారాకు పంపిన బృందం ఒకటి వెనక్కి వచ్చింది. ఆ బృందంలోని బష్ర్ బిన్ సుఫియాన్ అల్కాబీ ప్రవక్త (స)తో ముస్లిములను కాబాలోకి ప్రవేశించకుండా అడ్డుకోవడానికి బనీ కాబ్ బిన్ లోవీ తెగ యుద్ధానికి సిద్ధంగా ఉందని తెలిపారు. హుదైబియా చేరుకున్న తర్వాత ప్రవక్త (స) వారికి ఒక వర్తమానం పంపారు. తాము యుద్ధానికి రాలేదని, కేవలం ఉమ్రా చేసుకోవడానికి, అంటే కాబాయాత్ర చేసుకోవడానికి వస్తున్నామని తెలియజేశారు. అయినా పరిస్థితి ఉద్రిక్తంగానే ఉంది.

బుదాయిల్ బిన్ వరకా కుర్జాయ్ శాంతి చర్చలకు ప్రయత్నించాడు. తర్వాత ఉర్వా బిన్ మసూద్ కూడా ఖురైషుల తరఫున చర్చలకు వచ్చాడు. ఆ తర్వాత బనీ కనానా తెగ జోక్యం చేసుకుంది. ఆ తెగ సర్దారు స్వయంగా ముస్లిముల శిబిరానికి వచ్చారు. లోయలో మేస్తున్న ఖుర్బానీ పశువులను తమ కళ్ళతో చూశారు. ఈ దృశ్యం చూసిన తర్వాత ఆయనపై గొప్ప ప్రభావం పడింది. ఆయన పేరు హులయిస్. ఆయన వెంటనే ఖురైషుల వద్దకు వెళ్ళి “ఖురైష్ తెగ ప్రజలారా! అలాంటి మనుష్యులు కాబాలోకి ప్రవేశించకుండా అడ్డుకోవడానికి సంబంధించింది కాదు మన మధ్య ఉన్న ఒప్పందం. వాళ్ళు కాబా ఔన్నత్యాన్ని పెంచడానికి వస్తున్నారు. ఇలాంటి ప్రయోజనాల కోసం మేం మీతో ఒప్పందం చేసుకోలేదు. నా జీవితాన్ని కాపాడుతున్న దేవుని ఒట్టు, ముహమ్మద్ (స) ఏం చేయాలనుకుంటున్నారో చేయనివ్వండి. లేకపోతే మేం మా తెగలన్నింటిని వెనక్కి ఉపసంహరించుకుని వెళ్ళిపోతాం” అన్నాడు.

ఈ మాటలతో ఖురైషులకు ఏం చేయాలో తోచలేదు. హులాయిస్ చేసిన హెచ్చరిక మామూలు హెచ్చరిక కాదు. ఆ తెగలన్నీ వెనక్కి వెళ్ళిపోతే ఖురైషుల



బలం మిగలదు. అందువల్ల హులాయిస్‌కు నచ్చచెబుతూ తాము ముస్లిములను కాబాలోకి ప్రవేశించకుండా అడ్డుకోవడం లేదని, వారితో ఒప్పందానికి ప్రయత్నిస్తున్నామని, ఈలోగా జరుగుతున్నది మౌనంగా పరిశీలించాలని కోరారు. ఆ తర్వాత వాళ్ళు ముస్లిములకు ఒక షరతు విధించారు. ఈసారి ముస్లిములు ఉమ్రా వాయిదా వేసుకుని వెనక్కి వెళ్ళిపోవాలి. తర్వాతి సంవత్సరం చేసుకోవాలి.

ఖురైషుల కుట్రను దివ్యఖుర్‌ఆన్ స్పష్టంగా బట్టబయలు చేసింది :

**“సత్యాన్ని తిరస్కరించి, మిమ్మల్ని మస్జిదె హరామ్‌కు రాకుండా నిరోధించి, ఖుర్బానీ ఒంటెలను వాటి వధ్యస్థలాల దగ్గరకు చేరనీయకుండా చేసినది వారే కదా!”** ***(దివ్యఖుర్‌ఆన్ 48 : 25)***

ధార్మిక ఆచరణలను ఈ విధంగా అడ్డుకోవడం, ప్రవక్త ఇబ్రాహీమ్ (అస) కాలం నుంచి ఉన్న ధార్మిక ఆచరణలను ఈ విధంగా అడ్డుకోవడం వల్ల ఖురైషులు అప్రతిష్ఠపాలయ్యారు. ఖురైషుల ఈ కక్షసాధింపు ధోరణి అరేబియాలో చాలా మందికి నచ్చలేదు. అరేబియాలో అనేక తెగలు దీన్ని వ్యతిరేకించాయి. ఖురైషుల వ్యవహారశైలి ధార్మికంగా లేదని, అహంకార పూరితంగా ఉందని యావత్తు అరేబియా భావించింది. ఖురైషుల అత్యంత నీచమైన కక్ష సాధింపు చర్య మరొకటి ఉంది. ప్రవక్త (స) కుమార్తెల భర్తలు మక్కాలోనే ఉన్నారు. వారికి విడాకులిచ్చేలా ఒత్తిడి చేసి ఆవిధంగా ప్రవక్త (స)పై కక్ష తీర్చుకోవాలనుకున్నారు. ప్రవక్త (స) ఇద్దరు కుమార్తెలు, హజ్రత్ రుఖయ్యా, హజ్రత్ ఉమ్మే కుల్సుమ్‌ల వివాహాలు అబూ లహబ్ కుమారులతో జరిగాయి. వారి పేర్లు ఉత్బా, ఉతైబా. నిజానికి వీరందరూ దగ్గరి బంధువులు. ముస్లిములకు ఎలాంటి హానీ చేయకుండా అబూలహబ్ చేతులు నిర్వీర్యమైపోయాయని దివ్యఖుర్‌ఆన్‌లో దైవిక వచనాలు అవతరించిన తర్వాత మండిపడిన అబూలహబ్ తన కుమారులను పిలిచి వారి భార్యలకు అంటే ప్రవక్త (స) కుమార్తెలకు విడాకులిచ్చేయమన్నాడు. ఇప్పుడు తన ఇంట్లో ప్రవక్త (స) కుమార్తెలను ఉంచడం ధర్మభ్రష్టత్వం అవుతుందన్నాడు. హజ్రత్ రుఖయ్య నిజానికి వేరుగా తన ఇంట్లో నివసిస్తున్నారు. తండ్రి చెప్పిన మాట తక్షణం పాటిస్తూ ఆమె భర్త ఉత్బా వెంటనే ఆమెకు విడాకులిచ్చేశాడు. మరో కుమారుడు ఉతైబా దుర్మార్గంలో తన తండ్రికన్నా రెండాకులు ఎక్కువ చదివాడు. తన భార్యకు విడాకులివ్వగానే, గర్వంగా ప్రవక్త (స) వద్దకు వెళ్ళి

అమర్యాదకరంగా మాట్లాడుతూ "నేను నీ మతాన్ని కాదంటున్నాను. నీ కూతురినీ వదిలేశాను. నీకు నా మీద అభిమానం లేదు. నేను నిన్ను ఇష్టపడను" అన్నాడు. ఆ తర్వాత ప్రవక్త (స) చొక్కా పట్టుకుని చింపేశాడు. ఇలాంటి తలబిరుసు వైఖరిని అత్యంత మృదుస్వభావం ఉన్న వాళ్ళు కూడా భరించలేరు. ప్రవక్త (స) తన జీవితంలో ఒకే ఒకసారి శపించారు. "అల్లాహ్! నీ దగ్గరున్న భయంకరమైన మృగాలను వీడిపై పంపు" అన్నారు. ఈ మాటలు విన్న తర్వాత అబూతాలిబ్, ఉతైబాతో ఇక ప్రపంచంలో నిన్ను ఎవరూ కాపాడలేరు అన్నారు. ఆ తర్వాత కొంతకాలానికి ఉతైబా ఒక వర్తక బిడారుతో సిరియా వెళ్తున్నప్పుడు ఒక రాత్రి నిద్రలో ఉండగా అతడి తలను ఒక సింహం నమిలేసింది.

ప్రవక్త (స) మరో కుమార్తె హజ్రత్ జైనబ్. ఆమె భర్త అబుల్ ఆస్. ప్రవక్త (స) కుమార్తెకు విడాకులివ్వాలని అబుల్ ఆస్‌పై ఖురైషులు ఒత్తిడి తెచ్చారు. ఖురైషుల్లో ఏ అమ్మాయినైనా ఇచ్చి పెళ్ళి చేస్తామన్న ప్రతిపాదన కూడా చేశారు. కాని అబుల్ ఆస్ ఒప్పుకోలేదు. "దేవుని తోడు, నేనెన్నటికీ అలాంటి పని చేయను. జైనబ్ స్థానంలోకి ఖురైషుల మరో అమ్మాయి రావడాన్ని కూడా భరించలేను" అన్నారు. అబుల్ ఆస్ ప్రదర్శించిన ఈ మంచితనాన్ని ప్రవక్త (స) రెండు సందర్భాల్లో ప్రత్యేకంగా స్మరించుకున్నారు. ఒకసారి అబుల్ ఆస్ యుద్ధ ఖైదీగా ఆయన వద్దకు బంధనాలతో వచ్చారు. హజ్రత్ జైనబ్ తన కంఠహారాన్ని ఆయన విడుదలకు బదులుగా పంపించారు. ముస్లిములందరి ఆమోదంతో ప్రవక్త (స) ఆ కంఠహారాన్ని కూడా వెనక్కి ఇచ్చేస్తూ ఆయన్ను విడుదల చేశారు. ఇది బద్ర్ యుద్ధం తర్వాత జరిగిన సంఘటన. అబుల్ ఆస్‌ను విడుదల చేస్తూ ఒక షరతు పెట్టారు. హజ్రత్ జైనబ్ మదీనా రావడానికి అనుమతించాలని అడిగారు. ఆయన చెప్పిన రోజున ప్రవక్త (స) ఇద్దరు అనుచరులు, జైద్ బిన్ హారిసా (రజి)తో పాటు ఒక అన్సారీని పంపించారు. వాళ్ళు మక్కాకు ఎనిమిది మైళ్ళ దూరంలో యజీజ్ అనే ప్రదేశంలో వేచి ఉండాలని చెప్పారు. హజ్రత్ జైనబ్ అక్కడికి రాగానే ఆమెను తీసుకురావాలని కోరారు. హజ్రత్ జైనబ్ ఆరోజు పొద్దున్న తన మరిది కినాన్ బిన్ రాబితో కలిసి అక్కడికి బయలుదేరుతున్నప్పుడు ఖురైషులు ఆమెను వెంటాడి జీ తువా వద్ద పట్టుకున్నారు. అక్కడ హబ్బార్ బిన్ అస్వద్ బాణంతో హజ్రత్ జైనబ్ కూర్చున్న ఒంటెకు గురిపెట్టి వదిలాడు. గర్భవతిగా ఉన్న హజ్రత్ జైనబ్‌కు ఈ దుర్ఘటనలో గర్భస్రావమయ్యింది. ఆమెతో



ఉన్న కినానా వెంటనే ఆయుధాలు తీసి వారిపై భీకరంగా లంఘించాడు. దాంతో వాళ్ళు పారి పోయారు. ఈ లోగా అక్కడికి అబూ సుఫ్యాన్ వచ్చాడు. ఆయన కినానాతో మాట్లాడి ఆమెను వెనక్కి మక్కా తీసుకుపొమ్మన్నాడు. తర్వాత ఎప్పుడైనా ఆమెను రహస్యంగా మదీనాకు పంపుకోవచ్చని చెప్పారు.

ప్రవక్త (స) మదీనాకు రాగానే ధర్మప్రచార బృందాలను చుట్టుపక్కల ప్రాంతాలకు పంపించే వ్యవస్థను రూపొందించారు. అలాంటి ఒక బృందం బనూ హుజాయిల్ తెగ వద్దకు వెళ్ళింది. ఈ బృందంలో ఆరుగురు ఉన్నారు. ఆ తెగ నాయకుడే వాళ్ళను ఆహ్వానించాడు. వారు రాగానే హతమార్చడానికి కుట్రపన్నాడు. ఈ బృందంలో నలుగురు దారిలోనే హత్యకు గురయ్యారు. మిగిలిన ఇద్దరు, హజ్రత్ జైద్ బిన్ దాస్నా, హజ్రత్ ఖబ్బాబ్‌లను నిర్బంధించి మక్కా తీసుకెళ్ళారు. ఈ ఖైదీల కథ హృదయవిదారకమైనది. వారిద్దరిని మక్కా తీసుకెళ్ళి మక్కా ఖురైషులకు వారిని అప్పగించి, అక్కడ నిర్బంధంలో ఉన్న హుజాయిల్ తెగ వారిద్దరిని విడిపించుకుని వెళ్ళిపోయారు. హజ్రత్ ఖబ్బాబ్‌ను హోజిర్ ఇబ్నే అహ్వాబ్ తమీమీ స్వాధీనంలోకి తీసుకున్నాడు. ఆ తర్వాత ఆయన్ను ఉత్బా బిన్ హారిస్‌కు అప్పగించాడు. బద్ర్ యుద్ధంలో ఉత్బా తండ్రి హజ్రత్ ఖబ్బాబ్ చేతిలో హతమయ్యాడు. ఆ ప్రతీకారం తీర్చుకోడానికి ఉత్బా ఆయన్ను తీసుకున్నాడు. ఆ రకంగా బద్ర్ యుద్ధంలో మరణించిన వాడి ప్రతీకారాన్ని నిస్సహాయంగా నిర్బంధంలో ఉన్నవ్యక్తిని చంపి తీర్చుకున్నారు.

మరో బందీ, జైద్ బిన్ దాస్నాను సఫ్వాన్ స్వాధీనం చేసుకున్నాడు. ఆయన్ను తన బానిస ఫస్తాస్‌కు అప్పగించి, కాబా బయట ఉన్న తనీమ్ వద్దకు తీసుకెళ్ళమన్నాడు. అక్కడ ఆయన్ను హతమార్చారు. ఈ అమానుష హత్యను చూడ్డానికి అవిశ్వాసుల పెద్ద గుంపు అక్కడ పోగయ్యింది. ఈ గుంపులో స్వయంగా అబూ సుఫియాన్ కూడా ఉన్నారు. ఆయన జైద్ వద్దకు వెళ్ళి ఏదో గుసగుసగా "నువ్వు విడుదలై నీ కుటుంబంతో సంతోషంగా ఉండాలనుకుంటున్నావా; నీ బదులుగా నీ ప్రవక్తను మేం చంపితే బాగుండేదనుకుంటున్నావా" అనడిగారు. జైద్ నిబ్బరంగా "ప్రవక్త (స) వెంట్రుక గాయానికి బదులుగా నన్ను విడుదల చేస్తానన్నా, ఆ స్వేచ్ఛ నాకు వద్దు" అన్నారు.

హజ్రత్ ఖబ్బాబ్ కొంతకాలం నిర్బంధంలో ఉన్నారు. నిర్బంధంలో ఉన్నప్పుడు కూడా ధర్మప్రచారం చేసేవారు. ఈ ధర్మప్రచారం వల్ల హాజిర్ బిన్ అహ్హాబ్ వద్ద బానిసగా ఉన్న అమ్మాయి ఇస్లామ్ స్వీకరించింది. నిర్బంధంలో ఖబ్బాబ్ కథ ఆమె వల్లనే తర్వాత తెలిసింది. ఆమె కథనం ప్రకారం, ఒక రోజు ఆయన ఒక చిన్న కత్తి కావాలని అడిగి తీసుకున్నారు. ఆయన హాజిర్ బిన్ అహ్హాబ్ ఇంటనే బందీగా ఉన్నారు. అప్పుడు శత్రువుల చిన్న పిల్లవాడు ఆయన ఒళ్ళో ఉన్నాడు. ఆ బానిస పిల్ల ఇది చూసి భయపడింది. ఆమె భయాన్ని అర్థం చేసుకున్న ఖబ్బాబ్ తాను ఆ అమాయకపు పిల్లవాడి ప్రాణాలు తీయడం లేదని హామీ ఇచ్చారు. అంతేకాదు వెంటనే ఆ పిల్లవాడిని క్రిందికి దించి వెళ్ళమన్నారు. శత్రువుల సంతానం తనకు అందుబాటులో ఉన్నా, తన చేతిలో కత్తి ఉన్నా ఆయన ఏమీ చేయలేదు. ఆయన్ను ఉరి తీసిన రోజున ఆయన వ్యక్తిత్వం మరింత ప్రస్ఫుటంగా అందరిపై ప్రభావం వేసింది. ఆయన్ను చంపడానికి తనీమ్ వద్దకు తీసుకెళ్ళినప్పుడు ఆయన స్వచ్ఛంద ప్రార్థనలు చేశారు. ఆ తర్వాత ఇలా దేవుడిని వేడుకున్నారు "దేవుడా! నేను ప్రవక్త(స) తెచ్చిన సందేశాన్ని జనం వద్దకు చేరవేశాను. నా పట్ల ఎంత క్రూరంగా వీళ్ళు వ్యవహరించారో ప్రవక్త (స)కు తెలియాలి. దేవుడా, శత్రువుల సంఖ్యను తగ్గించు. వారిలో విభేదాలు సృష్టించు, ఈ హంతకుల్లో ఎవరూ బతకరాదు." అన్నారు. ఆయన్ను ఉరితీసి, ఆ తర్వాత ఆయుధంతో ఆయనపై వేటు వేశారు. మరణ సమయంలో ఆయన సంతోషంగా ఒక కవిత చదవసాగారు. అందులో ఒక పంక్తి ఇలా ఉంది :

"నేను ఇస్లామ్ సౌభాగ్యం పొందిన తర్వాత చంపబడినా, అల్లాహ్ మార్గంలో ఎటువైపు నేను పడతానన్నది పెద్దగా పట్టించుకోను."

హుదైబియా ఒప్పందం ప్రకారం ఏ తెగ అయినా ఎవరితోనైనా మైత్రి చేయవచ్చు. ప్రవక్త (స)తో కాని, ఖురైషులతో కాని ఇష్టమైనవారితో మిత్రసంబంధాలు ఏర్పరచుకునే స్వేచ్ఛ ప్రతి తెగకు ఉంది. ఈ విషయమై ఇరుపక్షాలు ఎలాంటి ఒత్తిడిని, బలప్రయోగాన్ని ఉపయోగించరాదు. ఈ నియమం ప్రకారం బనూ బక్ర్ తెగ ఖురైషులతో మిత్రసంబంధాలు పెట్టుకుంది. అలాగే బనూ ఖజా ప్రవక్త (స)తో మిత్రసంబంధాలు పెట్టుకుంది. ఈ రెండు తెగల మధ్య చాలా కాలం నుంచి ఘర్షణలు జరుగుతున్నాయి. ఇస్లామ్‌కు పూర్వం ఈ రెండు తెగల మధ్య హత్యలు, ప్రతీకార హత్యల పరంపర కొనసాగుతూ వచ్చింది. కాని ఇస్లామ్ వచ్చిన తర్వాత ఈ ఘర్షణలు, వివాదాలు తెరమరుగయ్యాయి. అందరూ ఇస్లామ్ వ్యతిరేకతలో



ఒక్కటయ్యారు. కాని హుదైబియా శాంతి ఒప్పందం తర్వాత ఈ ఘర్షణలు మరోసారి తెరపైకి వచ్చాయి. బనూ బక్ర్ తెగలో ఒక శాఖ బనూ వాయిల్, ఈ శాఖకు సర్దారు నోఫాల్ బిన్ ముఆవియా. ఈ తెగలో అస్వద్ బిన్ రజాన్ అనే వ్యక్తి కొడుకుల హత్యకు ప్రతీకారం తీర్చుకోవాలని ముఆవియా అనుకున్నాడు. కొందరు మనుష్యులను వెంటబెట్టుకుని, శాంతిఒప్పందం వల్ల లభించిన అవకాశాన్ని ఆసరాగా చేసుకుని బనూ ఖజాపై దాడి చేసాడు. అల్‌వతీర్ బావి వద్ద దాడి చేసి ఒక వ్యక్తిని హత మార్చాడు. బనూ ఖజాకు చెందిన ఇతరులు ఈ దాడి అర్థం కాక అయోమయంలో పారిపోయారు. కాని వారిని వెంటాడి హతమార్చడం జరిగింది. హుదైబియా శాంతి ఒప్పందాన్ని ఉల్లంఘిస్తూ ఖురైషులు ఈ దాడికి అవసరమైన ఆయుధాలను బనూ బక్ర్ తెగకు సరఫరా చేశారు. బనూ ఖజాపై రహస్యంగా దాడి చేశారు. ఆ విధంగా వాళ్ళు హుదైబియా ఒప్పందాన్ని ఉల్లంఘించడం, ప్రవక్త (స)తో మిత్రసంబంధం ఉన్న ఒక తెగ శత్రువులకు రహస్యంగా సహాయ పడడం వంటి నేరాలకు పాల్పడ్డారు. అంతటితో వాళ్ళు ఊరుకోలేదు. బనూ ఖజా తెగవారిని కాబా వరకు వెంటాడారు. బనూ ఖజా తెగ వాళ్ళు కాబాలో శరణు తీసుకుని బనూ బక్ర్ తెగ సర్దారును ఎలుగెత్తి పిలుస్తూ, "నుఫాల్, మేం ఇప్పుడు పవిత్ర ఆరాధానా స్థలం ఆవరణలో ప్రవేశించాం. దేవుడి కోసం ఇప్పుడైనా వెనక్కి తగ్గు," అని అరిచారు. కాని నుఫాల్‌కు అప్పటికే అహంకారం మత్తు అలుముకుంది. "ఈరోజు దేవుడు లేడు" అన్నాడు.

మీ ప్రతీకారాన్ని పూర్తిగా తీర్చుకోండని బను బక్ర్ తెగవారిని రెచ్చగొట్టాడు. కాబా గృహం పవిత్రత కోసం మీ గౌరవమర్యాదలకు సంబంధించిన ప్రతీకారాన్ని వదిలేస్తారా అన్నాడు. దాంతో వారి రక్తదాహానికి అంతులేకుండా పోయింది. కాబాగృహంలోనే రక్తపాతానికి పాల్పడ్డారు. బనూ ఖజా తెగవారిలో కేవలం కొద్ది మంది మాత్రమే బుదాయిల్ బిన్ వరఖా ఇంటికి పారిపోయి శరణు పొందడం ద్వారా తమ ప్రాణాలు కాపాడుకోగలిగారు.

ఖురైషుల ఈ తప్పిదం చాలా ఘోరమైనది, దీనికి భారీ మూల్యం చెల్లించవలసి వచ్చింది. ఈ సంఘటనే తర్వాత మక్కా విజయానికి దారితీసింది. ఆమిర్ బిన్ సాలిమ్ ఖజా ఆ తర్వాత మదీనా వెళ్ళి జరిగిందంతా వివరించాడు. బనూ బక్ర్ వారి అమానుషాన్ని, ఖురైషుల నేరాన్ని ప్రవక్త (స)కు తెలియజేశాడు. అప్పుడు ప్రవక్త (స) మస్జిదులో ఒక సమావేశాన్ని ఉద్దేశించి ప్రసంగిస్తున్నారు. అమ్ర్ జరిగిందంతా గుండెలు పిండేసే కవితలతో చెప్పాడు. ఆయన మాటల్లో కొన్ని :

"దేవుడా, నేను ప్రవక్త (స)కు మన పాత కుటుంబాల మధ్య కుదిరిన మిత్ర ఒప్పందాన్ని గుర్తు చేస్తాను. ప్రవక్త (స), మాకు సహాయం చేయండి, దైవదాసులను అందరినీ రమ్మని పిలవండి, సైన్యాన్ని ముందుకు నడపండి, సముద్రకెరటాల్లా, ఆకాశానికెగసే ధూళిమేఘాల్లా సైన్యాన్ని నడపండి. ఖురైషులు ఒప్పందాన్ని ఉల్లంఘించారు. అర్ధ రాత్రి సమయంలో, నీటివనరు వద్ద ఖురైషులు మాపై దాడి చేశారు. మేం నిద్రలో ఉన్నప్పుడు మాపై విరుచుకుపడ్డారు. ప్రార్ధనల్లో ఉన్న మా మనుష్యులను నిర్దాక్షిణ్యంగా హతమార్చారు"

ఈ మాటలు విని ప్రవక్త (స) "నీకు తప్పక సహాయం చేస్తాం అమ్ర్ బిన్ సాలిమ్" అన్నారు.

చివరకు ఖురైషులకు అర్ధమయ్యింది. తాము ఆత్మహత్యాసదృశమైన తప్పు చేశామని తెలిసివచ్చింది. అబూసుఫ్యాన్ మదీనాకు పరుగు పరుగున వచ్చాడు. కాని అక్కడ వాతావరణంలో అప్పటికే ఆగ్రహావేశాలు అలుముకుని ఉన్నాయి. అబు సుఫ్యాన్ తిన్నగా తన కూతురి ఇంటికి వెళ్ళాడు. ఆయన కుమార్తె స్వయంగా ప్రవక్త (స) సతీమణి. కుమార్తె ఇంటికి వెళ్ళిన అబూ సుఫ్యాన్ అక్కడ మంచంపై కూర్చోబోయాడు. ఆమె వెంటనే మంచంపై దుప్పటి లాగేసి, ఈ మంచం ప్రవక్త(స) ఉపయోగించే మంచమని, ఒక కలుషిత అవిశ్వాసి దానిపై కూర్చోరాదని నిర్మొహమాటంగా చెప్పింది. అబూ సుఫ్యాన్ నిరాశా నిస్పృహలతో వెనుదిరగవలసి వచ్చింది. మక్కా చేరుకోగానే ఆయనకు ముస్లిముల భారీ సైన్యం మక్కాలో ప్రవేశించే వార్త అందింది.

కాని ప్రవక్త (స) ఎంత ఉదారంగా వ్యవహరించారంటే, అలాంటి దృష్టాంతం మరొకటి మనకు చరిత్రలో కనబడదు. మక్కా ఖురైషులు ఎంత క్రూరంగా వ్యవహరించినప్పటికీ, మోసాలకు, ద్రోహాలకు పాల్పడి కుట్రలు పన్ని, యుద్ధాలకు దిగి ఎంత వేధించినప్పటికీ మక్కా కరువు కాటకాలతో అలమటిస్తున్నప్పుడు ఆయనే సహాయహస్తం అందించారు. యమామా నాయకుడు అప్పటికి ఇస్లామ్ స్వీకరించి ఉన్నాడు. మక్కాకు వెళ్ళే ఆహారధాన్యాల సరఫరాను ఆయన ఆపేశాడు. మక్కా కరువు కాటకాలతో అలమటిస్తున్న కాలం అది. అప్పుడు స్వయంగా ప్రవక్త (స) కల్పించుకుని యమామా నాయకుడితో మాట్లాడి మక్కాకు ఆహారధాన్యాల సరఫరాను పునరుద్ధరింపజేశారు. అంతేకాదు తాను స్వయంగా 500 బంగారు నాణాలను మక్కాలోని పేదప్రజల కోసం పంపించారు.



## అధ్యాయం - 4

# కరవాలాల ఛాయలో

మక్కా నుంచి ప్రవక్త (స)ను ఆయన అనుచరులను బయటకు పంపించేయడం ద్వారా తాము చాలా పెద్ద విజయం సాధించామని మక్కా అవిశ్వాసులు భావించారు. కానీ అకబా ప్రతిజ్ఞ ద్వారా ప్రవక్త (స)కు మదీనాలోని అన్సార్ల సహాయ సహకారాలు లభించాయి. అంటే మదీనా బలమైన ఇస్లామీయ కేంద్రంగా ఆవిర్భవించింది. అక్కడ ఒక పరిపాలనా వ్యవస్థ క్రమేణా రూపుదిద్దుకోవడం ప్రారంభమయ్యింది. మదీనాలో బలపడిన ఈ ఇస్లామీయ వ్యవస్థ త్వరలోనే తమకు ప్రమాదంగా మారుతుందని, రోజురోజుకీ విస్తరిస్తున్న ఈ వ్యవస్థను అడ్డుకోవడం, ఆపడం తమ శక్తికి మించిన పనవుతుందని భయపడడం ప్రారంభించారు. మదీనా చేరుకున్న తర్వాత ప్రవక్త (స) యూదులతోను, ఇతర అరబ్బు తెగలతోను ఒప్పందాలు చేసుకోవడం ప్రారంభించారు. దాంతో ఖురైషులకు ప్రమాదం మరింత అధికమయ్యిందన్న భావం కలిగింది. ఆ తర్వాత ప్రవక్త (స) పటిష్టమైన రక్షణ వ్యవస్థను రూపొందించారు. పహరాబృందాలను పంపడం ప్రారంభించారు. మదీనా సరిహద్దులపై నిఘా వ్యవస్థను ఏర్పాటు చేశారు. చుట్టుపక్కల ప్రాంతాల్లో శత్రువుల కదలికలపై నిఘా ఉంచారు. మక్కాలో ఖురైషులకు ఈ పరిణామాలన్నీ బెంబేలెత్తించాయి. మక్కా నుంచి సిరియాకు వాణిజ్య మార్గం మదీనా నుంచి వెళుతుంది. ఆ మార్గంలో రాకపోకలను మదీనా ప్రభుత్వం ఏ క్షణాన్నయినా అడ్డుకునే ప్రమాదం పొంచి ఉంది. అబూజహల్ మక్కాలో సాద్ బిన్ మాజ్‌ను అడ్డుకుని ఉమ్రా చేయకుండా నిరోధించడానికి ప్రయత్నించినప్పుడు వారి ఆర్థిక వ్యవస్థకు ప్రాణాధారమైన సిరియా మార్గాన్ని మూసేస్తామని నిర్ద్వంద్వంగా హెచ్చరించడం కూడా జరిగింది.

మరో వాస్తవమేమంటే ప్రవక్త (స) మదీనా వెళ్ళిపోయాక మక్కా ఖురైషులకు ఆయనపై ఆధిపత్యం చెలాయించే అవకాశమే లేకుండా పోయింది. మక్కాలో ఉన్నంత కాలం ప్రవక్త (స) ఒక బోధకుడు మాత్రమే. కాని ఇప్పుడాయన మదీనాలో ఒక ఇస్లామీయ ప్రభుత్వాధినేత. మక్కాలో ఉన్నప్పుడు ఆయన బాధితుడు, అణిచివేతలను భరించినవాడు. దౌర్జన్యాలను సహించినవాడు. కాని ఇప్పుడాయన ప్రతి

అణిచివేతను బలప్రయోగంతో తిప్పికొట్టే స్థాయికి చేరుకున్నాడు. ఖురైషులు సత్యధర్మ సందేశ ప్రచారాన్ని వివిధ దశల్లో అడ్డుకోవడానికి ప్రయత్నిస్తూ చివరకు యుద్ధం అనివార్యమయ్యే దశకు చేరుకున్నారు. కాని ఖురైషులు తమ అణిచివేత కార్య కలాపాలతో, కుట్రలు కుతంత్రాలతో చివరకు తీరని రక్తదాహాన్ని అలవరచుకున్నారు. ఒక కొత్త యుగాన్ని నిర్మించడానికి ప్రవక్త (స) తన వద్ద ఉన్న పరిమిత వనరులతో ప్రయత్నించి సఫలమయ్యారు. ఆ పునాదులపై ఏర్పడిన కొత్త రాజ్యం ప్రమాదంలో పడడమంటే అప్పటి వరకు సాధించింది అంతా కోల్పోవడమే అవుతుంది. అందువల్ల మదీనాలో ఏర్పడిన కొత్త రాజ్యాన్ని కాపాడుకోవడం, రక్షణకు పూర్తి ఏర్పాట్లు చేయడం అత్యవసరమయ్యింది. ఎలాంటి విపత్తునైనా ఎదుర్కునే రక్షణ వ్యవస్థను ఏర్పాటు చేసుకోవడం అవసరమయ్యింది. శత్రువుల కదలికలపై గట్టి నిఘా పెట్టడం కొత్త ప్రభుత్వానికి తప్పనిసరి అవసరం. కొత్త రాజ్యవ్యవస్థను కాపాడుకోవాలంటే ఇలాంటి చర్యలు తప్పనిసరి. మదీనాకు వలస వచ్చిన తర్వాత పూర్తిస్థాయి యుద్ధం తప్పదన్న వాస్తవాన్ని ప్రవక్త (స) ఆయన అనుచరులు గుర్తించారు. అందుకు పూర్తిగా సంసిద్ధంగా ఉండాలన్నది కూడా గ్రహించారు. ఈ పరిస్థితి త్వరలోనే వచ్చింది. ఈ పరిస్థితి గురించి వివరించే ముందు ఇస్లామీయ రాజ్యంలో జిహాద్ భావన గురించి క్లుప్తంగా ప్రస్తావించడం, దివ్యఖుర్ఆన్ ప్రకారం జిహాద్ అంటే ఏమిటో తెలుసుకోవడం అవసరం.

సామాజిక రుగ్మతలతో పతనావస్థలో ఉన్న సమాజాన్ని సమూలంగా సంస్కరించాడానికి ఒక విప్లవాత్మక ఉద్యమాన్ని ప్రారంభించినప్పుడు సాధారణంగా స్వార్థ శక్తుల నుంచి ప్రతిఘటన ఎదురవుతుంది. ఈ స్వార్థ శక్తులు కొత్త వ్యవస్థలో తమ హోదా పెత్తనాలు, సాంఘికంగాను, ఆర్థికంగానూ దెబ్బతింటాయని భయ పడతాయి. ఈ ఉద్యమాన్ని అడ్డుకోవడానికి అన్ని విధాల ప్రయత్నిస్తాయి. ఈ పద్ధతు లన్నీ సాధారణంగా కుట్రలు కుతంత్రాలే ఉంటాయి. ఏదో ఒక విధంగా విప్లవాన్ని అణిచివేయాలని భావిస్తాయి. ఇలాంటి సందర్భాల్లో విప్లవాన్ని ప్రారంభించినవారు కేవలం రక్షణాత్మక చర్యలతో సంతృప్తి చెందితే సరిపోదు. అవసరమైతే ఎదురు దాడులకు దిగి శత్రువులను అడ్డుకుని, వారి ప్రతిఘటనలను తుదముట్టించి సామాజిక సంస్కరణా మార్గం సుగమం చేసుకోవలసి ఉంటుంది.అందువల్ల జిహాద్ అనేది కేవలం రక్షణ చర్య మాత్రమే అనుకోవడం కూడా పొరబాటు. దురదృష్టవశాత్తు మనలో చాలా మంది చదువుకున్న పెద్దలు కూడా ఇస్లామ్ వ్యతిరేక ప్రాపగాండ ప్రభావానికి గురై, జిహాద్‌కు వ్యతిరేకంగా వస్తున్న ప్రాపగాండాను చూసి జిహాద్‌కు



సంబంధించిన కొన్ని మౌలిక లక్షణాలను వివరించడానికి ప్రయత్నిస్తూ తమ తార్కిక శక్తియుక్తులన్నీ ఉపయోగించి, ఒక్కోసారి మౌలిక వాస్తవాలను కూడా వక్రీకరిస్తూ ఇస్లామీయ జిహాద్ కేవలం ఆత్మరక్షణకు సంబంధించినదిగా చెప్పే ప్రయత్నం చేస్తున్నారు. ఇది సరయిన పద్ధతి కాదు. జిహాద్ లక్ష్యాలు ఏమంటే :

ముస్లిమ్ సమాజం, ముస్లిమ్ రాజ్యాన్ని రక్షించేచర్య. జిహాద్ ముఖ్యోద్దేశ్యం సత్యం ప్రాతిపదికన ఏర్పడే వ్యవస్థకు సంబంధించిన మౌలిక సిద్ధాంతాల రక్షణ.

ఇస్లామీయ ఉద్యమం సాధించిన విజయాలకు ఎదురయ్యే ప్రమాదాలను, ఆ ప్రమాదాలకు కారణమయ్యే విధ్వంసకర శక్తులను, ఉద్యమమార్గంలో అడ్డంకులను సృష్టించే శక్తులను అణిచివేయడం.

మానవసంక్షేమం, సామాజిక పరిణామాల మార్గంలో ఎదురయ్యే అడ్డంకులను తొలగించడం.

ఈ విషయాలు మనకు క్రింది దివ్యఖుర్ఆన్ వాక్యాల ద్వారా స్పష్టంగా అర్థమవుతాయి.

> **“ఎవరికి వ్యతిరేకంగా యుద్ధం చెయ్యబడుతూ ఉందో, వారికి (యుద్ధం చేయటానికి) అనుమతి ఇవ్వబడింది; ఎందుకంటే వారు అన్యాయానికి గురి అయిన వారు. నిశ్చయముగా అల్లాహ్ వారికి సహాయం చేయగల సమర్థుడు. వారు అన్యాయంగా తమ ఇళ్ళనుండి తరిమి వేయబడినవారు. వారి తప్పు కేవలం, “అల్లాహ్ మా ప్రభువు” అని అనటమే. అల్లాహ్ గనక ప్రజలను ఒకరి ద్వారా మరొకరిని తొలగిస్తూ ఉండకపోతే, ఆశ్రమాలు, చర్చీలు, యూదుల ప్రార్థనాలయాలు, మశీదులు – వేటిలో అల్లాహ్ పేరు అత్యధికంగా స్మరించబడుతుందో – అన్నీ ధ్వంసం చేయబడి ఉండేవే. అల్లాహ్ తనకు సహాయం చేసేవారికి తప్పకుండా సహాయపడతాడు. అల్లాహ్ మహా శక్తి మంతుడు, మహా బలవంతుడూను. మేము గనక వారికి భూమిపై అధికారాన్ని ప్రసాదిస్తే, వారు నమాజ్‌ను స్థాపిస్తారు, జకాత్ ఇస్తారు. మంచి చేయమని ఆజ్ఞాపిస్తారు. చెడు నుండి నిరోధిస్తారు. సకల వ్యవహారాల అంతిమ నిర్ణయం అల్లాహ్ చేతులలో ఉంది.” *(దివ్యఖుర్ఆన్ 22 : 39-41)***

“మీతో పోరాడేవారితో మీరూ అల్లాహ్ మార్గంలో పోరాడండి. కాని హద్దులు అతిక్రమించకండి. హద్దులు అతిక్రమించే వారిని అల్లాహ్ ప్రేమించడు. మీకు వారు ఎక్కడ ఎదురైనా, మీరు వారితో పోరాడండి. మిమ్మల్ని వారు ఎక్కడనుండి

పార ద్రోలారో, అక్కడినుండి మీరూ వారిని పారద్రోలండి. చంపటం చెడ్డదే. కాని, ఫిత్నా (పీడన) అంతకంటే చెడ్డది. 'మస్జిదె హరామ్' వద్ద వారు మీతో యుద్ధం చెయ్యనంత వరకు, మీరూ వారితో యుద్ధం చెయ్యకండి. కాని వారే అక్కడ కయ్యానికి కాలు దువ్వితే, మీరు వారిని చంపటానికి వెనుదీయకండి. అవిశ్వాసులకు ఇదే తగిన శిక్ష. వారు యుద్ధం చెయ్యటం మానుకుంటే (మీరూ మానండి) అల్లాహ్ క్షమించేవాడు, కరుణించేవాడూ అనే విషయం తెలుసుకోండి.

> **పీడన అంతమయ్యే వరకు, దైవధర్మం స్థాపించబడేవరకు మీరు వారితో యుద్ధం చేస్తూనే ఉండండి. తరువాత వారు దానిని మానుకుంటే, దౌర్జన్య పరులను తప్ప మరెవ్వరినీ శిక్షించకూడదు." *(దివ్యఖుర్ఆన్ 2 : 193)***
>
> **"అసలు మీరు నిస్సహాయులైన ఆ పురుషులూ, స్త్రీలూ, పిల్లల కొరకు అల్లాహ్ మార్గంలో పోరాడక పోవటానికి కారణం ఏమిటి? బలహీనులవటం చేత అణచబడి, వారు "మా ప్రభూ! దుర్మార్గులైన ఈ నగరవాసుల నుండి మాకు విమోచనం కలిగించు. మా కొరకు నీ తరఫు నుండి ఒక సహాయకుణ్ణి, ఒక రక్షకుణ్ణి పంపించు" అని ఫిర్యాదు చేస్తున్నారే." *(దివ్యఖుర్ఆన్ 4 : 75)***
>
> **"ఒకవేళ ఒడంబడిక కుదుర్చుకున్న తర్వాత వారు మళ్ళీ తమ ప్రమాణాలను భగ్నం చేస్తే, మీ ధర్మంపై దాడులు చెయ్యటం ప్రారంభిస్తే, అవిశ్వాస పతాక ధారులతో యుద్ధం చెయ్యండి; ఎందుకంటే, వారి ప్రమాణాలు ఏమాత్రం నమ్మదగ్గవి కావు. బహుశా(కరవాల శక్తి వల్లనే) వారు మానుకోవచ్చు. తమ వాగ్దానాలను భంగం చేస్తూ ఉన్నవారితో, సందేశహరుణ్ణి దేశం నుండి బహిష్క రించాలని నిర్ణయించుకున్న వారితో మీరు యుద్ధం చెయ్యరా?"**
>
> ***(దివ్యఖుర్ఆన్ 9 : 12-13)***
>
> **"మీరు గనక లేవకపోతే, దేవుడు మీకు వ్యధాభరితమైన శిక్ష విధిస్తాడు. ఇంకా మీ స్థానంలో మరొక సంఘాన్ని దేనినయినా లేపుతాడు. మీరు దేవునికి ఏమాత్రం నష్టం కలిగించలేరు. ఆయన ప్రతి వస్తువుపై అధికారం కలిగి వున్నాడు." *(దివ్యఖుర్ఆన్ 9 : 39)***

ఇవేకాక దివ్య ఖుర్ఆన్‌లో ఈ విషయానికి సంబంధించి మరికొన్ని అతి ముఖ్యమైన, ఆలోచనలను ప్రేరేపించే వాక్యాలున్నాయి. దివ్యఖుర్ఆన్‌లో ఈ విషయానికి సంబంధించి స్పష్టంగా ఉన్న వాక్యాలను, మౌలిక సూత్రాలను తెలియజేసే వాక్యాలను ఇక్కడ ప్రస్తావించడం జరిగింది. ఈ వాక్యాలను లోతుగా పరిశీలించిన



పాఠకులు ప్రవక్త (స)కు, ఆయనపై అణచివేతలకు పాల్పడిన వారికి మధ్య జరిగిన ఘర్షణలు యుద్ధాల స్వరూప స్వభావాలను అర్థం చేసుకోవడం తేలికవుతుంది.

చాలా సంవత్సరాలు ప్రవక్త (స), ఆయన అనుచరులు అనేక అణిచివేతలకు, దౌర్జన్యాలకు గురయ్యారు. శత్రువులు ముస్లిమ్ సమాజం పురోగమించే అవకాశాలే ఇవ్వలేదు. ఆలోచనాస్వేచ్ఛను అణిచేశారు. మనస్సాక్షిని అనుసరించే స్వేచ్ఛ లేకుండా చేశారు. సత్య ప్రచారాన్ని అడ్డుకున్నారు. ఈ అణచివేతలను ముస్లిములు అసాధారణ సహనంతో భరించారు. తమపై అణిచివేతలకు పాల్పడుతున్న వారిపై తిరగబడలేదు. చివరకు ముస్లిములు తమ ఇళ్ళల్లో ఉండడం సాధ్యపడని దుర్భర పరిస్థితి నెలకొంది. అందువల్ల వేరే చోట ఆశ్రయం పొందవలసి వచ్చింది.

సంస్కరణా ఉద్యమాన్ని అర్థం చేసుకోవడానికి, ప్రతిస్పందించడానికి అవసర మైన సమయాన్ని, సాధ్యమైనంత ఎక్కువ సమయాన్ని ఇస్లామ్ ప్రత్యర్థులకు ఇస్తుంది. ఈ ఉద్దేశ్యంతోనే ముస్లిములకు కష్టనష్టాల పరిస్థితులను ఎదుర్కునేలా చేస్తుంది. కాని ఇస్లామ్‌ను నమ్ముకున్న వారు శాశ్వతంగా అణచివేతలకు గురికావడాన్ని ఇస్లామ్ సమ్మతించదు. శత్రువులకు తేలికైన లక్ష్యాలుగా మారిపోవడాన్ని భరించదు. నిజానికి ముస్లిములకు ఎదురయ్యే కష్టనష్టాలు, వారు సహనం వహించే పరిస్థితులు అన్నీ వారికి శిక్షణ వంటివి. అణచివేతలను ఎదుర్కొని దాన్ని తుదముట్టించి మానవ సంక్షేమానికి అడ్డంకులు లేని ప్రగతి మార్గం వేయడానికి కావలసిన శిక్షణ అది.

అందువల్ల అణిచివేత శక్తులను తుదముట్టించడం ఎంతో అవసరం. చెడును బలప్రయోగం ద్వారా అంతమొందించకపోతే, నిరాటంకంగా దుర్మార్గాలు చేస్తూ పోయే అవకాశాన్ని ఇస్తే ఇక మంచితనం, దైవభయం, సన్మార్గం అనేవి ఏవీ మిగలవు.

కాబట్టి అరాచకం, అజ్ఞానం, చెడు, అణచివేతలకు పాల్పడే వారి చేతులనుంచి అధికారం క్రమేణా మంచి, దానధర్మాలు, ప్రార్థనలు, సన్మార్గాలను అవలంబించే వారి చేతుల్లోకి రావాలన్నదే ఇస్లామ్ విప్లవ సిద్ధాంతం. చెడుకు మూలాలను నిర్మూలించాలి.

మీపై యుద్ధానికి దిగినవారిపై యుద్ధం చేయడమంటే కేవలం శత్రువులు దాడి చేసినప్పుడు మాత్రమే ఆత్మరక్షణకు చర్యలు తీసుకోవాలని అర్థం కాదు. ఇక్కడ భావమేమంటే, శత్రువుల్లో కొందరు చురుకుగా లేరు, అలాంటి వారి విషయంలో జోక్యం చేసుకోవలసిన అవసరం లేదు. కాని మీ పనిలో మిమ్మల్ని అడ్డుకుంటున్న వారి విషయంలో, మిమ్మల్ని చంపడానికి ప్రయత్నిస్తున్న వారి

విషయంలో, మీ వ్యవస్థను నాశనం చేయడానికి చూస్తున్న వారి విషయంలో బలప్రయోగానికి దిగడం అనివార్యం. వాళ్ళు ఇస్లామీయ రాజ్యంపై దాడి చేసేవరకు ఆగవలసిన అవసరమూ లేదు. వారిని అణిచివేయడం ఎక్కడ ఎప్పుడు సాధ్యపడితే అప్పుడే చేయాలి. రక్తపాత మన్నది మంచిది కాదు, కాని ఇస్లామీయ ఉద్యమాన్ని, మానవసంస్కరణా ఉద్యమాన్ని అడ్డుకోవడం అంతకన్నా పెద్ద చెడు. కాబట్టి ఉద్యమాన్ని కాపాడ్డానికి, వ్యవస్థను రక్షించడానికి సాయుధపోరాటం లాంటివి తప్పవు. సత్యమార్గంలో అడ్డంగా నిలబడి ఉన్న శక్తులను ఓడించే వరకు ఇది కొనసాగవలసిన అవసరం ఉంటుంది.

ధార్మిక సంప్రదాయాల పవిత్రతను కాపాడ్డం గురించి నొక్కి చెప్పడంతోపాటు కృత్రిమ ధార్మికత విషయంలోను ముస్లిములను హెచ్చరించడం జరిగింది. శత్రువు పవిత్రతను భంగపరచి, నిషిద్ధమాసాల్లో దాడులకు దిగితే, ముస్లిములు ప్రతిఘటించ కుండా హత్యలకు గురికారాదని, వాళ్లు పవిత్రతను భంగపరిస్తే వారిని అణచి వేయాలని ఆదేశించింది.

ముస్లిములు తమ ప్రాణాలను కాపాడుకోవడం మాత్రమే వారి ధార్మిక విధి కాదు, బలహీనులు అణచివేతలకు గుర్రైనప్పుడు, వారు సహాయం కోసం ఆర్తనాదాలు చేస్తున్నప్పుడు వారికి సహాయమందించడానికి సాధ్యమైన ప్రయత్నాలన్నీ చేయాలి. కాబట్టి ఇస్లామీయ ఉద్యమం నిజానికి యావత్తు మానవాళిని పరిరక్షించే బాధ్యత కలిగి ఉంది. అంతేకాదు, ఉన్నత నాగరికత, ధార్మిక విలువలను కాపాడవలసిన బాధ్యత కూడా ఇస్లామీయ ఉద్యమంపై ఉంది.

ప్రత్యర్థి శక్తులను బలహీనపరచడానికి ఒప్పందాలు, అంగీకారాలు కూడా మంచి సాధనాలు. ప్రవక్త(స) వాటిని పూర్తిగా ఉపయోగించుకున్నారు. ఈ విషయంలో దివ్య ఖుర్ఆన్ ఒక గొప్ప హెచ్చరిక చేసింది. ఎవరైతే ఒప్పందాలను ఉల్లంఘిస్తారో వారిని ఒప్పందాలకు కట్టుబడేలా బలప్రయోగంతో నిర్బంధించాలి. ముఖ్యంగా హామీలు ఇచ్చి వాటికి వ్యతిరేకంగా కుట్రలు పన్ని, ఇస్లామ్‌ను ధ్వంసం చేయడానికి, ఇస్లామ్ నాయకుడిని తొలగించడానికి ప్రయత్నించినవారి చర్యలను వారి పన్నాగా లను యుద్ధ ప్రకటనగా భావించాలి. బహిరంగంగా యుద్ధప్రకటన లేకపోయినా, ఇలాంటి కుట్రలకు పాల్పడడం యుద్ధ ప్రకటనగానే పరిగణించాలి.

ఈ సందర్భంగా సైనికచర్యల ముఖ్య ఉద్దేశ్యం ప్రజలను చంపడం కాదని, శత్రుసైన్యాల నాయకత్వాన్ని నిర్మూలించాలన్న హెచ్చరిక కూడా ఇవ్వబడింది.



జిహాద్ బాధ్యతను కాదనడమంటే రాజ్యం అంతరించినట్లే. ఇస్లామ్ శక్తి, ఇస్లామ్ వ్యవస్థ, ప్రగతి వికాసాలు అన్నీ దెబ్బతిన్నట్లే. ప్రత్యర్థి శక్తులు ముందుకు దూసుకువస్తుంటే, ఇస్లామ్‌ను తొలగించడానికి, పూర్తిగా అణచివేయడానికి, వారి పరిపాలనను రుద్దడానికి ప్రయత్నిస్తుంటే ఏదీ చేయలేని స్థితి ఏర్పడుతుంది. జిహాద్‌ను కాదంటే, ఈ పరిస్థితి ఎంత తీవ్రంగా ఉంటుందో అర్థం చేసుకోవడం కష్టం కాదు.

పై పరిశీలన ద్వారా మనం ఇస్లామ్‌కు, ఇస్లామ్ శత్రువులకు మధ్య జరిగిన యుద్ధాలను అర్థం చేసుకోవలసి ఉంది. ఇక్కడ తెలుసుకోవలసిన మరో ముఖ్య విషయం ఏమంటే, అరేబియా చరిత్రలో రెండు సైన్యాలు యుద్ధానికి దిగాయి. ఒక సైన్యం ప్రజలను చెడు కబంధహస్తాల నుంచి కాపాడ్డానికి ప్రయత్నిస్తుంటే, మరో సైన్యం దుర్మార్గపు వ్యవస్థను కాపాడ్డానికి, కొత్త ఉద్యమాన్ని నిర్మూలించడానికి ప్రయత్నిస్తుంది. ఈ రెండు సైన్యాల ఉద్దేశ్యలక్ష్యాల్లో ఎలాంటి రాజీకీ అవకాశంలేదు. ఈ రెండు పక్షాలు అలాంటి సంప్రదింపులు జరిపే పరిస్థితి కూడా లేదు. ఇది నిజానికి చేయి లేదా చావు పరిస్థితి. అంటే నువ్వు ప్రత్యర్థిని చంపకపోతే, ప్రత్యర్థి నిన్ను చంపేస్తాడన్న పరిస్థితి. ఈ పరిస్థితిని అర్థం చేసుకుంటే ఈ యుద్ధాలు ఆత్మరక్షణ యుద్ధాలా అన్న ప్రశ్నే పుట్టదు. అలాగే ఒక మతవిశ్వాసాన్ని బలవంతంగా రుద్దడానికి చేసిన యుద్ధాలన్న విమర్శ కూడా అర్థరహితంగా కనబడుతుంది. ప్రతి యుద్ధానికి తక్షణ కారణాలేమిటో చర్చించడం అంత అవసరమూ కాదు. వాస్తవాలను అటూ ఇటూ తిప్పి ఈ యుద్ధాలు ముస్లిములపై బలవంతంగా రుద్దబడిన యుద్ధాలని, ఆత్మరక్షణ ప్రధానంగా జరిగిన యుద్ధాలని చెప్పవలసిన అవసరమూ లేదు. దురదృష్టం కొద్ది కొందరు ముస్లిమ్ పండితులు యూరోపియన్ రచయితల ఆరోపణలకు సమాధానం చెప్పడానికి పూనుకుని తర్కవితర్కాలతో ము ్యంగా బద్ర్ యుద్ధానికి సంబంధించి ఇది ఆత్మరక్షణ ప్రధానంగా జరిగిన యుద్ధంగా చూపించే ప్రయత్నం చేస్తున్నారు. వాళ్ళు మౌలిక వాస్తవాలను అర్థం చేసుకుంటే వివరణలిచ్చుకునే ధోరణి వదిలి, ఇస్లామ్ విమర్శకుల న్యాయస్థానంలో తీర్పుల కోసం ప్రయత్నించే వైఖరి నుంచి బయటపడతారు. ప్రవక్త ముహమ్మద్ (స) వ్యవహారశైలిపై సరయిన అభిప్రాయం చెప్పగలిగే యోగ్యత, అర్హత ముస్లిములకే ఉన్నాయి కాని పాశ్చాత్య లేదా ప్రాచ్య సోకాల్డ్ మేధావులకు లేదని నిర్మొహమాటంగా చెప్పడమే మేలు. గతకాలంలో ముస్లిములు సాధించిన విజయాలను వివరించడం, మన సాంకేతిక పారిభాషిక పదాల అర్థాలు వివరించడం మన పనే కాని మరెవరి పని కాదు. మన విశ్వాసాలు, మన చరిత్ర, మన ప్రవక్త (స) జీవితం గురించి ఒక అభిప్రాయానికి

రావడానికి పాశ్చాత్య క్రైస్తవ చర్చి ఇచ్చిన ప్రమాణాలు మనకు అవసరం లేదు. లేదా ఆధునిక భౌతికవాద ప్రమాణాలు ఆధారంగా అభిప్రాయాలు ఏర్పరచుకోవలసిన పనీ లేదు. ఈ కుహానా ప్రమాణాలతో మన గతంపై ఒక అభిప్రాయానికి వచ్చే పద్ధతిని నిర్మొహమాటంగా తిరస్కరిద్దాం.

ఇస్లామీయ రాజ్యం అప్పట్లో చేపట్టిన సైనికచర్యలు రెండు రాజ్యాల మధ్య యుద్ధాల వంటివి కావు. లేదా రెండు మతవర్గాల మధ్య ఘర్షణల వంటివి కూడా కాదు. అలెగ్జాండర్, నెపోలియన్, హిట్లర్‌ల మాదిరిగా ప్రపంచాన్ని జయించాలన్న సామ్రాజ్య విస్తరణాకాంక్ష కూడా వాటి వెనుక లేదు. బ్రిటన్, ఫ్రాన్స్, హోలెండ్‌ల మాదిరిగా వలసలు స్థాపించి, స్థానిక ప్రజలకు స్వేచ్ఛాస్వతంత్రాలు లేకుండా చేయడం కూడా వాటి ఉద్దేశ్యం కాదు. ఒకే దేశానికి, ఒకే జాతికి, చెందిన రెండు వర్గాల ప్రజల మధ్య జరిగిన ఘర్షణలవి. అందులో ఒక వర్గం సరికొత్త విలువల ప్రాతిపదికన ఒక వినూత్న జీవనవ్యవస్థ నిర్మాణానికి ప్రయత్నిస్తుంటే, మరో వర్గం ఆ ప్రయత్నాలను అడ్డుకోవడానికి సర్వశక్తులు ఒడ్డుతోంది. కొత్త వ్యవస్థను పూర్తిగా నాశనం చేయడానికి పూనుకుంది. అజ్ఞానం, దురాచారాలతో కూడుకున్న పాత వ్యవస్థను కాదని, ఒక కొత్త వ్యవస్థ నిర్మాణానికి దైవికమార్గదర్శనం ప్రకారం ప్రవక్త ముహమ్మద్ (స), ఆయన అనుచరులు శతధా ప్రయత్నిస్తుంటే, మరోవైపు ఖురైషులు వారికి మనశ్శాంతి పొందే స్వేచ్ఛను నిరాకరిస్తూ పోరాటాలకు దిగారు. ప్రవక్త (స) ప్రారంభించిన ఆరోగ్యకరమైన విప్లవాన్ని ఖురైషులు, యూదులు, బదూయిన్ సంచారతెగలు పైన పేర్కొన్న మాదిరిగా అత్యంత నీచంగా కుట్రలు, కుతంత్రాలు, మోసాలు, హత్యలతో ప్రతిఘటించడానికి పూనుకున్నారు. అనేక సంవత్సరాలుగా విద్వేషభరితమైన అణిచివేతలను భరించిన తర్వాత ఇక ప్రవక్త (స)కు మిగిలిన ఒకే ఒక్క మార్గం ఆయుధాలు చేపట్టి మైదానంలో ఎదుర్కోవడం. సాధ్యమైతే ఈ ఘర్షణలను శాశ్వతంగా అంతమొందించడానికి ప్రయత్నించవలసి ఉంది. ఖురైషులు భీకరంగా పోరాటానికి దిగారు. ఇతర శక్తులు కూడా అంతే భయంకరమైన కుట్రలు పన్నాయి. కాని అందరూ చివరకు పరాజితులు కావలసి వచ్చింది. దాదాపు పదిసంవత్సరాలుగా కొనసాగిన ఈ సైనికసంఘర్షణలు ఏం సాధించాయన్నది తెలుసుకోవాలంటే, ఈ సైనికసంఘర్షణల్లో ఎంతమంది మరణించారన్నది పరిశీలిస్తే అర్థమవుతుంది.

అతితక్కువ ప్రాణనష్టంతో ప్రవక్త (స) తన విప్లవాన్ని విజయవంతం చేశారు. దాదాపు పది లక్షల చదరపు మైళ్ళ విశాల సామ్రాజ్యాన్ని స్థాపించారు. ఈ మధ్య



కాలంలో జరిగిన యుద్ధాల్లో మరణించిన ముస్లిములు 255 మంది కాగా శత్రువులు 279 మంది. ఈ ప్రాణనష్టం ఎంత తక్కువో నేటి యుద్ధాలను పరిశీలిస్తే అర్థం కావడం కష్టం కాదు. నిజానికి నేటి యుద్ధాల్లో సైనికుల కన్నా ఎక్కువగా సాధారణ పౌరులు మరణిస్తున్నారు. అతితక్కువ ప్రాణనష్టంతో ప్రతిఘటనను తొలగించి, ఒక సరికొత్త జీవనవ్యవస్థకు పునాదులు వేశారు. ఈ యుద్ధాలే కనుక ముస్లిమేతరులను తుడిచిపెట్టడానికి జరిగి ఉన్నట్లయితే అసంఖ్యాక దౌర్జన్యాలు, చిత్రవధలు చోటుచేసుకుని ఉండేవి. క్రయిస్తవులు, యూదులు చేసిన యుద్ధాలను పరిశీలిస్తే ఈ వాస్తవం అర్థం అవుతుంది. ప్రవక్త (స) కేవలం సామ్రాజ్య విస్తరణ కాంక్షతో ఈ యుద్ధాలకు దిగిఉన్నట్లయితే యావత్తు అరేబియాలో రక్తం నదులై ప్రవహించి ఉండేది. చరిత్రలో అనేకమంది చక్రవర్తులు చేసింది ఇదే. రెండు రాజ్యాల మధ్య యుద్ధాలుగా ఈ సంఘర్షణలు జరిగినా ప్రాణనష్టం భారీగా ఉండేది. ఇక ఈ యుద్ధాలన్నింటిలోను యుద్ధఖైదీలుగా పట్టుబడిన వారి సంఖ్య కేవలం 6,564 మంది మాత్రమే. ఈ యుద్ధఖైదీల్లోను కేవలం ఇద్దరి విషయంలో వారి నేరాలు రుజువైనందువల్ల మరణశిక్ష విధించడం జరిగింది. 6347 మందిని విడిచిపెట్టేశారు. మిగిలిన 215 మంది యుద్ధఖైదీలు ఏమయ్యారన్నది తెలియరాలేదు. బహుశా వారు ఇస్లామ్ స్వీకరించి ముస్లిమ్ సమాజంలో కలిసిపోయి ఉండవచ్చు. నిజానికి ప్రవక్త (స) ఒక మిలిటరీ హీరోగా ఎన్నడూ వ్యవహరించలేదు. బద్ర్ యుద్ధం తర్వాత ఆయన వ్యవహారశైలి చూస్తే ఈ వాస్తవం ఇంకా స్పష్టంగా బోధపడుతుంది. బద్ర్ యుద్ధ ఖైదీల విషయంలో ఆయన తీసుకున్న నిర్ణయాలు ఈ వాస్తవాన్ని చాటి చెబుతున్నాయి. యుద్ధఖైదీల్లో బనూహాషిం తెగవారిని వదిలేయమన్నారు. ఎందుకంటే బనూహాషిం తెగ అయిష్టంగా శత్రువులతో కలిసి ఉంది కాబట్టి. అలాగే అబ్బాస్ బిన్ అబ్దుల్ ముత్తలిబ్‌ను, అబుల్ భుక్తారీ బిన్ హిషామ్‌ను చంపవద్దన్నారు. అబుల్ భుక్తారీ తర్వాత ప్రమాదవశాత్తు మరణించారు. బద్ర్‌యుద్ధ ఖైదీల బాధల గురించి తెలిసి ఆయన రాత్రంతా నిద్రపోలేకపోయారు. వారి చేతుల కట్లను వదులు చేయవలసిందిగా ఆదేశించారు. అంతేకాదు, యుద్ధవాతావరణంలోను ఆయన మక్కా వారికి సహాయం అందించారు. యమామా ప్రజలు ఇస్లామ్ స్వీకరించిన తర్వాత మక్కాకు ఆహారధాన్యాల సరఫరాను ఆపేశారు. మక్కాలో అప్పుడు కరువు అలుముకుని ఉంది. ప్రవక్త ముహమ్మద్ (స) స్వయంగా కల్పించుకుని యమామా పాలకుడితో మాట్లాడి మక్కాకు ఆహార ధాన్యాల సరఫరాను పునరుద్ధరించారు., అంతేకాదు మక్కాలోని బీదప్రజల సహాయం కోసం 500 బంగారు నాణేలను పంపారు. చివరకు

మక్కా విజయం తర్వాత శత్రువుల దౌర్జన్యాలను, హింసాహత్యాకాండలను అన్నింటిని క్షమించేశారు. దాదాపు పదిహేను ఇరవై సంవత్సరాలుగా అత్యంత అమానుషంగా అణచివేతలకు పాల్పడిన వారందరినీ క్షమించారు. "ఈ రోజు పగ ప్రతీకారాలు లేవు. వెళ్ళండి మీరు స్వతంత్రులు" అని ప్రకటించారు.

వాస్తవమేమంటే, శత్రువులకు వ్యతిరేకంగా కత్తిదూసినప్పటికీ, కేవలం మరో మార్గం ఏదీ లేనందువల్ల మాత్రమే అలా చేశారు. ఆయన రాజ్యాన్ని ఆక్రమించుకోవ డానికి అలా చేయలేదు. హృదయాలను జయించాలన్నదే ఆయన ఉద్దేశ్యం. ఆయన బలప్రయోగంతో ప్రజలను లొంగదీసుకోవాలని అనుకోలేదు. హేతుబద్ధమైన వాదనతో వారి మనోమస్తిష్కాలను, నైతికబలంతో, దయాహృదయంతో వారి హృదయా లను జయించాలనుకున్నారు.

## ప్రవక్త (స) సైనిక విధానం

ప్రవక్త (స) పాటించిన మౌలిక సైనికవిధానం ఏమంటే, ఆయన శత్రువులను చంపడం కన్నా శత్రువును బలహీనం చేయడానికి ఎక్కువ ప్రాధాన్యం ఇచ్చారు. శత్రువు ప్రతిఘటన విరమించేలా, శత్రువు సహకరించడానికి సిద్ధపడేలా బలహీనం చేయడానికే ఎక్కువ ప్రాముఖ్యం ఇచ్చారు. ప్రముఖ చరిత్రకారుడు డా. హమీదుల్లా సిద్దీఖీ ఈ విషయమై మాట్లాడుతూ "నిజానికి ప్రవక్త (స) శత్రువును బలహీనం చేయడానికే ఎక్కువ ప్రాధాన్యత ఇచ్చారు. శత్రువును తుదముట్టించడానికి చూడలేదు" అన్నారు.

ప్రవక్త (స) ఖురైషులను నిర్మూలించాలనుకోలేదు. వారిని బలహీనులుగా మార్చి వారిని లొంగదీయాలనుకున్నారు. ఈ విధానం ప్రకారం ఆయన క్రింది వ్యూహాలు ఎన్నుకున్నారు.

ఆయన సత్వరమే మదీనాలో రక్షణ యంత్రాంగాన్ని రూపొందించారు. సైన్యం సంఖ్యాబలాన్ని పెంచారు. వ్యవస్థీకరించారు. సైనికంగా అప్రమత్తమయ్యారు. కఠిన శ్రమ, నైతికశిక్షణలతో క్రమశిక్షణ కలిగిన దళాలను, శత్రువుల గుండెల్లో గుబులు పుట్టించే సైన్యాన్ని సిద్ధం చేసుకున్నారు.

మక్కా వాణిజ్య మార్గాలను అడ్డుకోవడం ద్వారా మక్కాను బలహీనం చేశారు. శత్రు శిబిరంలోని వివిధ తెగలతో ఒప్పందాలు చేసుకుని తనతో చేతులు కలిపేలా ఒప్పించారు.



సైనిక ఎత్తుగడల పరంగా చూస్తే కొన్నిసార్లు ఆయన శత్రువుపై మెరుపుదాడు లకు దిగారు. శత్రువుకు ఆలోచించే అవకాశం, సమయం ఇవ్వకుండా దాడి చేశారు. మక్కాపై దాడి అలాంటిదే. కొన్ని సందర్భాల్లో ఆయన శత్రువు ఊహించని మార్గాల్లో ప్రయాణించారు. తన కదలికలను శత్రువులు ఏమాత్రం పసిగట్టకుండా జాగ్రత్తలు తీసుకున్నారు. బనూ ముస్తలక్ యుద్ధంలో ఇదే జరిగింది. శత్రువులు కలలో కూడా ఊహించని ఎత్తుగడలు వేశారు. ఉహుద్ యుద్ధంలో జరిగిందదే.

శత్రువుల పట్ల ప్రవక్త (స) ఎంత ఉదారంగా వ్యవహరించారో కొన్ని ఉదాహరణల ద్వారా అర్థం చేసుకోవచ్చు.

ప్రవక్త (స)పై దౌర్జన్యాలు, అణిచివేతలు పరాకాష్ఠకు చేరుకున్న కాలంలో, అమానుష హింసాకాండను ఆయన భరించారు. ఆయన స్థానంలో మరెవ్వరు ఉన్నా శత్రువుల సర్వనాశనాన్ని కోరుకుని ఉండేవారు. తనకు వ్యతిరేకంగా చాలా చురుగ్గా పనిచేస్తున్న ఇద్దర్ని ప్రవక్త (స) గుర్తించారు. వారిద్దరిలో ఒకరు అబూజహల్, మరొకరు ఉమర్ ఇబ్నే ఖత్తాబ్. వారిద్దరిలో కనీసం ఒకరిని ఇస్లామీయ ఉద్యమానికి సహాయపడేలా మార్చమని దేవుడిని వేడుకున్నారు. ఆయన ప్రార్థనను దేవుడు ఆలకించాడు. మొండిగా ఇస్లామ్‌ను వ్యతిరేకించి, ప్రవక్త (స)పై కత్తికట్టిన హజ్రత్ ఉమర్ (రజి) ఇస్లామ్ స్వీకరించడమే కాదు ప్రవక్త (స)కు సన్నిహిత అనుచరు లయ్యారు. ప్రవక్త (స) తన శత్రువులను సంస్కరించాలనుకున్నారే కాని వారిని అంతం చేయాలని భావించలేదు. పై సంఘటన ద్వారా ఈ వాస్తవం స్పష్టం అవుతుంది.

తాయిఫ్ ప్రజలకు సత్యధర్మ సందేశం అందజేయడానికి, అక్కడ సంస్కరణోద్య మాన్ని ప్రారంభించడానికి ఆయన వెళ్ళినప్పుడు తాయిఫ్ ప్రజలు వ్యవహరించిన తీరు అత్యంత అమానుషమైనది. ప్రవక్త (స)ను శారీరకంగా, మానసికంగా హింసించారు. మరొకరైతే తాయిఫ్ ప్రజలను సర్వనాశనం చేయాలనుకుని ఉండేవారు. కాని ప్రవక్త (స) ఈ చిత్రహింసలను సహించారు. ఈ ప్రజలు సత్య సందేశాన్ని స్వీకరించకపోతే, కనీసం వారి సంతానమైనా స్వీకరిస్తుందని ఆశాభావాన్ని వ్యక్తం చేశారు.

ఉహుద్ యుద్ధంలో ముస్లిములు చేసిన ఒక పొరబాటు వల్ల యుద్ధ రంగంలో పరిస్థితులు తారుమారయ్యాయి. శత్రువులది పైచేయి అయ్యింది. శత్రువులు

సర్వనాశనం అయ్యేలా శపించాలని ప్రవక్త (స)ను ఆయన అనుచరులు కోరారు. అప్పుడు ప్రవక్త (స) జవాబిస్తూ తాను ప్రజలను శపించడానికి రాలేదని, ప్రజలకు కరుణా సందేశాన్ని అందించడానికి వచ్చానని అన్నారు. “దేవుడా! నా ప్రజలకు దారి చూపించు.. వారేం చేస్తున్నారో వారికి తెలియదు” అని ప్రార్థించారు.

ఖైబర్ యుద్ధసమయంలో హజ్రత్ అలీ(రజి)ను ఖముస్ కోటను ఆక్రమించు కోవాలని ఆదేశిస్తూ ప్రవక్త (స) “అలీ! నీ వల్ల ఒక్కరు హితబోధను గ్రహించినా అది చాలా గొప్ప అనుగ్రహం అవుతుందని” చెప్పారు.

ఇస్లామీయ చరిత్రలో కనబడే గజ్వాలు, సుర్యాల సుదీర్ఘమైన జాబితా వల్ల చాలా మంది ముస్లిమేతరులతో పాటు ముస్లిములకు కూడా అనేక అపోహలు, అపార్థాలు ఏర్పడ్డాయి. కాబట్టి ఇక్కడ కొన్ని పదాల అర్థాలను స్పష్టంగా తెలుసుకోవడం అవసరం. గజ్వా, సుర్యా అన్న పదాలు నిర్దిష్టమైన అర్థంతో ఉపయోగించబడ్డాయి. వ్యూహాత్మక రక్షణ చర్యగా లేదా నిఘా పెట్టడానికి, పహరా కాయడానికి, లేదా తిరుగుబాటుదారులను అణచడానికి, నేరస్తులను శిక్షించడానికి లేదా ధర్మప్రచారం చేయడానికి లేదా ఒప్పందాల కోసం చర్చలు జరపడానికి కేవలం ఇద్దరు మనుష్యులున్న బృందాన్ని పంపినా దాన్ని సుర్యా అంటారు. ఒకవేళ ప్రవక్త (స) స్వయంగా ఆ బృందంతో పాటు వెళ్ళితే దాన్ని గజ్వా అంటారు. ఈ బృందానికి శత్రువులతో ఘర్షణ జరిగినా, సరిహద్దుల వద్ద దొమ్మి జరిగినా, మరెలాంటి సైనికచర్య జరిగినా వాటన్నింటిని సుర్యాలోనే చేర్చడం జరిగింది. ఇలాంటి చిన్నా చితక వ్యవహారాలన్నింటినీ తీసేస్తే పూర్తిస్థాయి యుద్ధాలు కేవలం కొన్నే ఉన్నాయి. అవి: బద్ర్, ఉహుద్, అహ్జాబ్, ఖైబర్, మక్కా (హునైన్‌తో సహా). సిరియా నుంచి విదేశీ ఆక్రమణను నిరోధించడానికి ప్రవక్త (స) సైన్యాన్ని పంపించారు. కాని ఈ సైనికచర్య స్వభావం వేరు. మనం ఈ యుద్ధాల గురించి క్లుప్తంగా ఇప్పుడు చూద్దాం. ఈ యుద్ధాల గురించి చర్చించే ముందు ఇరువర్గాల స్థితిగతుల గురించి ఒకసారి పరిశీలించడం అవసరం.

మొదటి నుంచి ఖురైషులు దాడులకు, అణిచివేతలకు పాల్పడ్డారన్నది స్పష్టంగా అర్థమవుతున్న వాస్తవం. ప్రవక్త (స) మదీనాకు వలస వెళ్ళిన తర్వాత మక్కా ఖురైషులు మదీనాపై దాడి చేసే ప్రమాదం పెరిగింది. గుప్పెడు మంది ముస్లిములకు మదీనాలో ఆశ్రయం దొరకడం వారక్కడ బలపడడం ఖురైషులకు నచ్చలేదు. ఇంతకు ముందు ప్రస్తావించిన అనేక కుట్రలు, కుతంత్రాలు, మోసాలతో అణిచేయాలని ప్రయత్నిం



చారు. వీటన్నింటినీ ప్రవక్త (స) నిర్లక్ష్యం చేయలేని పరిస్థితి. అంతేకాదు, మదీనాలోని యూదులతో కలిసి ఖురైషులు కుట్రలు పన్నడం ప్రారంభించారు. మదీనాపై త్వరలో దాడి చేసి అణిచేస్తామన్న స్పష్టమైన సూచన ఈ కుట్రల్లో దాగి ఉంది. మదీనా మేత మైదానాల నుంచి ఒంటెలను ఇతర పశువులను కుర్జ్ బిన్ జాబిర్ ఫహ్రీ దోచుకున్న సంఘటనను పరిశీలిస్తే శత్రువులు మదీనాకు 300 కిలోమీటర్ల దూరంలో ఉన్నప్పటికీ మదీనా పరిసరాల్లో దౌర్జన్యాలకు పాల్పడే శక్తి కలిగి ఉన్నారని స్పష్టం అవుతోంది. నిజానికి పశువులను దోచుకుపోయిన సంఘటన యుద్ధప్రకటన వంటిది. మక్కా ఖురైషులు విసిరిన సవాలు వంటిది. ఇదొక్కటే కాదు మక్కా నుంచి వచ్చిన చిన్న చిన్న సైనికబృందాలు మదీనా పరిసర ప్రాంతాల్లో దోపిళ్ళకు బరితెగించడం ఎడతెగకుండా కొనసాగింది. ప్రవక్త (స)కు ఈ సమాచారం అంది సైనికదళాలను పంపడం, వారిని చూసి మక్కా బృందాలు పారిపోవడం జరుగుతూ వచ్చింది.

మరోవైపు ప్రవక్త (స), ఆయన అనుచరుల పరిస్థితి ఎలా ఉందంటే యుద్ధం వారికి తలకు మించిన పని. వలస వచ్చిన గుప్పెడు మంది ఒక కొత్త వాతావరణంలోకి వచ్చి నిలదొక్కుకోవడానికి ప్రయత్నిస్తున్నారు. అందులో సగం మంది ఆర్థిక ఇబ్బందుల్లో కొట్టుమిట్టాడుతున్నారు. పునరావాసానికి ప్రయత్నిస్తున్నారు. ఒక విప్లవ నినాదానికి ప్రతిస్పందనగా సరికొత్త సమాజస్థాపనకు నడుంకట్టారు. విభిన్న తెగలను ఒక్కటి చేసి వారికి నైతిక శిక్షణ ఇచ్చి కొత్తరాజ్యంలోని విభిన్న విభాగాలను నిర్వహించేలా తీర్చిదిద్దుతున్నారు. ఇస్లామీయ ఉద్యమనాయకులు ఎదుర్కుంటున్న ఈ సమస్యలన్నీ చాలా తీవ్రమైనవి. నిరంతర కృషి అవసరమైన సమస్యలు. ఇలాంటి సమస్యల్లో కూరుకుపోయిన ఒక చిన్న సమూహం యుద్ధం గురించి ఆలోచించే స్థితిలో ఉండదు. వారి ముందు ఒక అంతర్జాతీయ ఉద్యమం ఉంది. యావత్తు మానవాళి సంక్షేమానికి చేయవలసిన కృషి ఉంది. దైవిక సందేశాలను యావత్తు మానవాళికి అందించే కార్యభారం ఉంది. అందుకోసం వారు సమస్తం త్యాగం చేశారు. సహనంతో, ఓరిమితో బాధలను కష్టాలను భరిస్తున్నారు. త్యాగాలు చేస్తున్నారు. వారి వద్ద ఉన్న ఏకైక బలం సత్యబలం. అది చాలా చిన్న సమూహం. మదీనా రాజ్యం కొత్తగా ఏర్పడిన రాజ్యం. వారి భవిష్యత్తు దీన్ని కాపాడుకోవడంపైనే ఆధారపడి ఉంది. వారు తమ ఆకలిని తీర్చుకోవడానికి చాలా తక్కువగా తినేవారు. ఉద్యమం కోసమే ఉన్నదంతా ఖర్చు చేసేవారు. పోషణ కరువైన శరీరాలతోనే ఉద్యమాన్ని అడ్డుకోవడానికి ఎదురయ్యే ప్రతి సవాలును నిరోధించారు: వారు సాధువులు కాదు, మునిపుంగవులు కాదు. వారు వివేకంతో, వివేచనతో, సహనంతో,

శాంతితో, అవసరమైతే యుద్ధాలను ఎదుర్కొని, బలప్రయోగాన్ని బలప్రయోగంతో నిరోధించడానికి సిద్ధపడి ఒక నూతన ప్రపంచసరళిని నిర్మించడానికి నడుం కట్టిన వారు. మదీనాకు ప్రవక్త (స)తో వలసవచ్చినవారు కేవలం శాంతిధామం కోసం రాలేదు. హాయిగా బతకడానికి రాలేదు. ఆర్థిక పురోభివృద్ధి సాధించడానికి రాలేదు. వారి ముందు ఒక మహోన్నత లక్ష్యం ఉంది. ఆర్థిక ప్రగతి ప్రయత్నాల్లో తమ కాలాన్ని వారు వ్యర్థం చేసుకోలేదు. ప్రవక్త (స) వారి మధ్య పటిష్టమైన సోదర సంబంధాలు ఏర్పరచారు. వారి మధ్య ఆర్థిక, సామాజిక సంబంధాలు సుదృఢం చేశారు. వారికి అన్సార్లకు మధ్య ఏర్పడిన సంబంధాలు చరిత్రలో ఎక్కడా మనకు కానరావు. మస్జిదులను సామాజిక కేంద్రాలుగా మార్చి ఒక వ్యవస్థీకృత సామాజిక సరళిని నిర్మించారు. ఆ వెంటనే వారి నైతిక, ఆచరణాత్మక, విచక్షణాత్మక శిక్షణకు పూను కున్నారు. ప్రార్థనల ద్వారా, ప్రచారం ద్వారా, ఖుర్ఆన్ పాఠాల ద్వారా ఇలాంటి అనేక మార్గాల ద్వారా త్వరితగతిన ఈ కార్యక్రమాలను విస్తరించారు. అదే సమయంలో వారందరినీ ఒక వ్యవస్థీకృత రాజ్యంగా తీర్చిదిద్దారు. ఒక బలమైన రాజ్యంగా మార్చారు. ఆ విధంగా ఎలాంటి వనరులు లేకుండా వచ్చిన ప్రవాసులు, తమ సమస్తాన్ని మక్కాలో వదిలేసి వచ్చినవారు, మదీనాలోని అన్సారులతో కలిసి ఒక బలమైన శక్తిగా మారారు.

## వ్యూహాత్మక పరిస్థితి

మదీనా నగరం వ్యూహాత్మకంగా మంచి ప్రదేశంలో ఉంది. రక్షణ చర్యలకు అనువైన నగరం. దాదాపు పది చదరపు మైళ్ళ వరకు విస్తరించి ఉన్న నగరం. నగరానికి కొద్ది దూరంగా వివిధ తెగల జనావాసాలు అక్కడక్కడా కనబడతాయి. ఈ మైదానప్రాంతం మధ్యన ఇతర గుట్టలతో పాటు సలా కొండ కూడా ఉంది. ఈ మైదానానికి బయట ఈర్, సౌర్ కొండలున్నాయి. ఆ చుట్టు అజమీ తెగలకు అంటే అరబ్బేతర తెగలకు చెందిన కోటలున్నాయి. ఒకప్పుడు ఈ కోటలు దాదాపు వంద వరకు ఉండేవి. వీటన్నింటికి మధ్యన మదీనా నగరం ఉంది. నగరంలో మస్జిదు దానికి అనుబంధంగా నివాసగృహాలున్నాయి. ఈ నగరం ఇస్లామీయ రాజ్యానికి రాజధాని నగరం. ఇరాక్, సిరియా దేశాలు దీనికి అభిముఖంగా ఉన్నాయి. అరేబియాలోని ముఖ్యమైన వాణిజ్య రహదారి ఇక్కడి నుంచి వెళుతుంది. సముద్ర తీరం కేవలం 70 నుంచి 75 మైళ్ళ లోపే ఉంది. నగరానికి ఆగ్నేయదిశన (సౌత్ఈస్ట్) ఖుబా, అవాలీ గ్రామాలు తోటలతో అలరారుతుంటాయి. ఖుబా నుంచి తూర్పుకు ఉహుద్ వరకు యూదుల ఆవాసాలు తూర్పు నుంచి పశ్చిమానికి విస్తరించి ఉన్నాయి. పాత మదీనా నగర ప్రహరీగోడ ప్రధానద్వారం, బాబుష్షమ్సి వద్ద బనూ సాయిదా తెగ ఉంది. మరికాస్త దూరం సలా కొండ వరకు వెళితే అక్కడ బనూ హారమ్ తెగ ఆవాసాలున్నాయి. వాయవ్యదిశన (నార్త్ వెస్ట్) వాది ఉల్ అతీక్ నుంచి బీరి రోమా వరకు అసంఖ్యాక తోటలున్నాయి. దక్షిణాన పెద్ద పెద్ద గుట్టలున్నాయి. మదీనాకు తూర్పున, దక్షిణాన లావా ప్రవహించిన రాతిమయమైన మైదానాలున్నాయి. ఈ మైదానాలు సైనిక శిబిరాలకు పనికిరావు, యుద్ధ మైదానాలుగా కూడా పనికిరావు. కఠినమైన లోయలు, గుట్టలతో ఈ మైదానాల నుంచి ప్రయాణించడమే కష్టం. మదీనాపై దాడికి వచ్చే సైన్యానికి ఒకేఒక్క అవకాశం ఉంది. ఉత్తర దిశన మాత్రమే శత్రుసైన్యాలు నగరంలోకి రాగలవు. ఇటు నుంచే ఖురైషులు బద్ర్, ఉహుద్ యుద్ధాల్లో నగరంపై దాడి చేశారు. కాని ఇటు నుంచి మదీనాపై దాడికి వచ్చిన మక్కా సైన్యాలకు ఎదురైన పరిస్థితులు మదీనాకు అనుకూలంగా మారాయి. కాబట్టి మదీనా రక్షణ పరంగా చాలా అనుకూలమైన ప్రదేశంలో ఉంది. మదీనా నగరమే ఒక కోటలాంటిది. కొద్దిపాటి ఏర్పాట్లు, వ్యవస్థీకృత రక్షణ చర్యలు తీసుకుంటే చాలు మదీనా మరింత బలంగా మారుతుంది. భౌగోళికంగా, వ్యూహాత్మకంగా మదీనాకు ఉన్న ప్రత్యేకతను మదీనా ప్రజలు సమైక్య ప్రయత్నాలతో ఉపయోగించుకుంటే అద్భుత ఫలితాలు సాధించవచ్చు. ఈ సానుకూల పరిస్థితులను ప్రవక్త ముహమ్మద్(స) చక్కగా ఉపయోగించుకున్నారు. యూదులను, ఔస్, ఖజ్రజ్ తదితర తెగలను సమీకరించారు. ధార్మికంగా, సాంఘికంగా, సాంస్కృతికంగా ఈ తెగల మధ్య విభేదాలనున్నప్పటికీ అందరినీ ఏకత్రం చేశారు. నిజానికి ఆ ప్రదేశంలో ఆయన కొత్త వ్యక్తి. అయినప్పటికీ విభేదాలు, వైరుధ్యాలు ఉన్న వివిధ తెగలను ఒక రాజకీయ వేదికపై సమైక్యపరచడం అసాధారణం, అనన్యసాధ్యం. ఈ అద్భుతాన్ని ఆయన సాధించి చూపించారు. ప్రవక్త ముహమ్మద్ (స) రాజకీయ వివేచనకు ఇది ఒక తార్కాణం. మరింత ఆశ్చర్యకరమైన విషయమేమంటే, ఈ రాజకీయ వేదిక ఒక రాతపూర్వక సంవిధానం ప్రాతిపదికన ఏర్పడింది. ఇంకా అబ్బురపరిచే వాస్తవమేమంటే, ఆ సంవిధానం ప్రకారం దేవుని సర్వసత్తాకఅధికారాల స్ఫూర్తితో ప్రవక్త (స)కు న్యాయ, సైనిక, ఆర్థికపరమైన అధికారాలన్నీ కట్టబెట్టడం జరిగింది. ఈ రాజకీయ ఒప్పందంలో పాల్గొన్న వారందరూ యుద్ధంలోనూ, శాంతి సమయంలోనూ ముస్లిములతో సహకరించడానికి ప్రతియుద్ధాన్ని అందరి యుద్ధంగా పరిగణించడానికి అంగీక రించారు. అంతేకాదు, సైనికదళాల్లో తప్పనిసరిగా పనిచేస్తామని, మక్కావారికి

శరణు ఇవ్వమనీ, ఖురైషులపై ముస్లిములు దాడి చేస్తే ఎలాంటి అడ్డంకులు సృష్టించబోమని ప్రతిజ్ఞపూర్వకంగా ప్రకటించారు. సైనిక ఖర్చులను ఈ ఒప్పందంలోని పక్షాలన్నీ దామాషా ప్రకారం పంచుకోవాలని అంగీకరించాయి. ముస్లిములు ఎవరితో యుద్ధం చేస్తారో వారితో తాము కూడా యుద్ధం చేస్తామని, ముస్లిములతో ఎవరు సామరస్యంగా ఉంటారో వారితో తాము కూడా సామరస్యంగా ఉంటామని యూదులు ప్రకటించారు. అందరూ మదీనా రక్షణ బాధ్యతను సమానంగా పంచుకుంటామని ఒప్పందానికి వచ్చారు. ఒకవేళ ముస్లిములపై దాడి జరిగితే యుదులు సహాయానికి వస్తారు. అలాగే యూదులపై దాడి జరిగితే ముస్లిములు సహాయపడాలి. మదీనా నగర సంవిధాన పత్రంలోని ఈ నిబంధనలను పరిశీలిస్తే మక్కానుంచి దాడి ప్రమాదాన్ని ప్రవక్త ముహమ్మద్ (స) ముందే పసిగట్టారన్నది అర్థం అవుతుంది. అందుకే అలాంటి ప్రమాదాన్ని ఎదుర్కోవ దానికి అవసరమైన చర్యలు ముందుగానే తీసుకున్నారు. ఈ ఒప్పందంలోని ఒక ముఖ్యమైన విషయమేమంటే మదీనా నగరాన్ని శాంతి నగరంగా ప్రకటించడం. ఈ పవిత్రతను మదీనా వాసులందరూ ఎట్టిపరిస్థితి ఎదురైనా కాపాడాలని పేర్కొనడం. అంటే మక్కా నగరానికి సమానంగా మదీనా నగరాన్ని నిలబెట్టడం జరిగింది. మరో విధంగా చెప్పాలంటే మక్కావాసులను సవాలు చేయడం, మక్కా ఖురైషులు మదీనా పవిత్రతను భంగపరిస్తే మక్కా పవిత్రతకు ప్రమాదం తప్పదని హెచ్చరించడం.

ఈ వివరాలను ఇక్కడ ఎందుకు ప్రస్తావించడం జరిగిందంటే, ఈ ఒప్పందం తర్వాత యూదులు ఎలా వ్యవహరించారు, ముస్లిములు ఎలా వ్యవహరించారు, ఈ ఒప్పందానికి ఎవరు ఎంతగా కట్టుబడ్డారన్నది పాఠకులు అర్థం చేసుకోవాలని.

శాంతినగరం మదీనా సరిహద్దులను నిర్ధారించడానికి ప్రవక్త ముహమ్మద్(స) నగరం చుట్టు స్తంభాలను నిర్మించాలని ఆదేశించారు. ఈ పని కాబ్ బిన్ మాలిక్‌కు అప్పగించడం జరిగింది. ఈ ఆదేశం ప్రకారం జాతుల్ జైష్ (మక్కారహదారిలో), ముషాఅరిబ్ (జాతుల్ జైష్‌కు దగ్గరలో), మఖిజ్ గుట్టలు (సిరియా రహదారిలో), హాఫియ్యా (మదీనాకు ఉత్తరాన ఉన్న అడవిలో), జిల్ ఉషాయిర్ (హాఫియాకు పక్కన), తాయిమ్ గుట్టలు (మదీనాకు తూర్పున) స్తంభాలు కట్టడం జరిగింది. వీటి అవశేషాలు నేటికి కూడా మనకు కనబడతాయి.

మదీనా అంతర్గత పాలనావ్యవస్థను పటిష్టపరచిన తర్వాత ప్రవక్త ముహమ్మద్ (స) మదీనా చుట్టపక్కల ఉన్న వివిధ తెగలపై దృష్టి పెట్టారు. మదీనా అగ్నేయ



(సౌత్ వెస్ట్) దిశన ఉన్న వివిధ తెగలు, ఎర్ర సముద్ర తీరాన ఉన్న తెగల ప్రాంతాలలో పర్యటించారు. వారితో ఒప్పందాలు చేసుకున్నారు. మక్కా దారిలో ఉన్న బనీ హంజా తెగతోను, యంబూ పరిసర ప్రాంతాల్లో ఉన్న తెగలతోను, బనూ దమ్రా, బనూ జురా, బనూ అర్రబా, బనూ ముద్లిజ్ తదితర తెగలతో ఒప్పందాలు చేసుకున్నారు. ఈ ఒప్పందాల్లో కొన్ని రక్షణాత్మకమైనవి కాగా మరికొన్ని ఆక్రమిక స్వభావం కలిగినవి. ఇంకొన్ని ఒప్పందాలు శత్రువుతో ఆ తెగలు స్నేహం చేయకుండా నిరోధించడానికి, యుద్ధం వస్తే తటస్థంగా ఉండేలా ఒప్పించడానికి సంబంధించినవి. ఆ విధంగా ప్రవక్త ముహమ్మద్ (స) సానుకూల రాజకీయ వ్యూహాన్ని అనుసరించారు. ఇది ఒక శాశ్వత విధానంగా ఆయన పాటించారు. వివిధ తెగలతో ఇలాంటి ఒప్పందాలు చేసుకున్నారు. మదీనా నగరాన్ని వదిలి బయటకు వెళ్ళిన ప్రతి సందర్భాన్ని ఇలాంటి ఒప్పందాలు చేసుకోవడానికి ఉపయోగించుకున్నారు. ప్రవక్త ముహమ్మద్ (స), ఆయన అనుచరులకు వాస్తవాల గురించిన అవగాహన ఉంది. విద్వేషవైరాల మహాసముద్రంలో ఒక చిన్న ద్వీపంలాంటిది మదీనా. అక్కడ తలదాచుకున్న తమపై శత్రు దాడి జరిగే ప్రమాదం పొంచి ఉందన్నది వారికి బాగా తెలుసు. ఈ దాడులకు సిద్ధంగా లేకపోతే సమసిపోతామని కూడా వారికి తెలుసు. అందువల్ల వారు మెరుపు వేగంతో కదిలే సైనికదళంగా మారిపోయారు. మదీనా నుంచి పిలుపు వినబడగానే క్షణం సంకోచించకుండా పోరాటపథాన దూసుకుపోయేలా రూపొందారు. ఈ చిన్న సమూహంలోని వ్యక్తులు సత్యధర్మ ప్రచారంలో అత్యంత నిబద్ధులైన కార్యకర్తలుగా పనిచేసేవారు అవసరమైతే తమ శాంతినగరాన్ని, తమ విద్యాకేంద్రాన్ని, జ్ఞానదీపాన్ని, ఇస్లామీయ సాంస్కృతిక కేంద్రాన్ని కాపాడే అత్యుత్తమ సైనికులుగా కూడా నిరూపించుకున్నారు. ఆ విధంగా మదీనా నగరం ఒక బలమైన సైనిక శిబిరంగా మారిపోయింది. ప్రవక్త ముహమ్మద్(స) తన వద్ద వనరులు అతిస్వల్పంగా ఉన్నప్పటికీ ఒక సైన్యాధ్యక్షుడిగా అద్భుత చాకచక్యంతో, సామర్థ్యంతో, వివేకవివేచనాలు ప్రదర్శిస్తూ అత్యుత్తమ ప్రమాణాలు నెలకొల్పారు.

మదీనా నగరానికి తరలి వచ్చిన నాలుగైదు నెలల తర్వాతి నుంచి ప్రవక్త ముహమ్మద్ (స) సైనికదళాలను పరిసరప్రాంతాల పహరాకు పంపడం ప్రారంభించారు. బద్ర్ యుద్ధానికి ముందు ఇలాంటి సైనికవిధులను నిర్వర్తించిన దళాల వివరాలు పరిశీలిస్తే :

1. ఆమిర్ హంజా బిన్ అబ్దుల్ ముత్తలిబ్ నాయకత్వంలో 30 మందితో కూడుకున్న ఒక దళాన్ని సిఫల్ బహ్ర్ వైపు పంపించారు. ఈ దళం శత్రు కదలికలపై

నిఘా ఉంచడానికి వెళ్ళింది. అబూ జహల్ 300 మందితో మక్కా నుంచి బయటకు వచ్చి ముస్లిములు అప్రమత్తంగా ఉండడాన్ని చూసి వెనక్కి మరలిపోయాడు.

2. రాబి ఉబైదా బిన్ హారిస్ నాయకత్వంలో అరుగురు సభ్యుల సైనికదళాన్ని మక్కాలో సైనిక కార్యకలాపాలపై నిఘా ఉంచడానికి పంపించారు. ఇక్రమా లేక అబూసూఫ్యాన్ నాయకత్వంలో దాదాపు 200 మంది ఉన్న ఖురైషుల దళాన్ని వీళ్ళు సానియాతుల్ ముర్రా వద్ద చూశారు. ఈ పహారా విధి బాధ్యతలను జయప్రదంగా నిర్వర్తించిన ముస్లిముల దళం మదీనాకు సురక్షితంగా చేరుకుంది.

3. సాద్ ఇబ్నె అబీ వఖ్ఖాస్ నాయకత్వంలో 80 మంది సభ్యుల దళాన్ని జహ్ఫా వద్ద శత్రు కదలికలు పరిశీలించడానికి పంపించారు. ఈ దళం కూడా సురక్షితంగా మదీనాకు చేరుకుంది.

4. ఖురైషుల వాణిజ్యమార్గంలో ఉన్న అబ్వాకు స్వయంగా ప్రవక్త ముహమ్మద్ (స) 70 మంది సభ్యుల దళాన్ని తీసుకువెళ్ళారు. అక్కడ అమ్ర్ బిన్ ఫహ్మీ దామ్రితో ఒప్పందం కుదుర్చుకుని ఎలాంటి ప్రతిఘటన లేకుండా మదీనా సురక్షితంగా చేరుకున్నారు.

5. యాంబుకు దగ్గరలో రాద్వా కొండప్రాంతం వద్ద ఉన్న బువాత్‌కు ప్రవక్త ముహమ్మద్ (స)స్వయంగా 200 మంది సభ్యుల దళంతో వెళ్ళారు. దారిలో వారికి ఉమయ్యు బిన్ ఖలఫ్ నాయకత్వంలో ఉన్న 100 మంది సభ్యుల ఖురైష్ దళం కనబడింది. అయితే ఎలాంటి ఘర్షణ జరగలేదు.

6. మదీనాకు చెందిన పశువులను కుర్జ్ బిన్ జాబిర్ ఉల్ ఫహ్రీ దొంగిలించే ప్రయత్నం చేశాడు. ఇది తెలియగానే ప్రవక్త (స) స్వయంగా 70 మంది ఉన్న దళంతో వెంటాడారు. కుర్జ్ కాలికి బుద్ధి చెప్పి పారిపోయాడు. కుర్జ్ పట్టుబడక పోయినప్పటికీ, ఈ సంఘటన వల్ల మదీనా ప్రజలు అత్యంత అప్రమత్తంగా ఉన్నారన్న సూచన శత్రువులకు అందింది.

7. యాంబుకు దగ్గరగా మక్కా, మదీనాలకు మధ్యన ఉన్న జుల్ ఉషైరాకు ప్రవక్త ముహమ్మద్ (స) స్వయంగా 150 మంది సభ్యుల దళంతో వెళ్ళారు. బనూ ముద్లిజ్, బనీ దామ్రాలతో ఒప్పందాలు చేసుకుని తిరిగి వచ్చారు.



8. అబ్దుల్లా బిన్ జహష్ నాయకత్వంలో 125 మంది సభ్యుల బృందం నఖ్లా ప్రాంతంలో నిఘా నిర్వహించడానికి వెళ్ళింది. ఈ బృందం ఖురైష్ దళంతో పోరాడవలసి వచ్చింది.

ఇక్కడ గమనించవలసిన విషయమేమంటే ఈ సైనికదళాలేవీ ఘర్షణ కోసం పంపబడలేదు. నఖ్లా వద్ద జరిగిన ఘర్షణ యాధృచ్ఛికమైనది. ఈ సంఘటన పట్ల ప్రవక్త (స) చాలా అసంతృప్తికి గురయ్యారు. అక్కడ హతమైన వారికి నష్టపరిహారం చెల్లించారు. యుద్ధఖైదీలుగా పట్టుబడిన వారిని విడుదల చేశారు. స్వాధీనం చేసుకున్న సొత్తును వెనక్కి ఇచ్చేశారు.

మదీనా రాజ్యం సరిహద్దుల భద్రత కోసమే ఈ సైనికదళాలను పంపడం జరిగింది. శత్రు దళాల కదలికలపై నిఘా ఉంచడానికి, ఒక పటిష్టమైన ప్రభుత్వం పనిచేస్తుందని, మదీనా దానికి రాజధాని నగరమని ఖురైషులకు ఇతర తెగలకు స్పష్టమైన సూచన పంపడానికి ఉద్దేశించిన చర్యలు మాత్రమే ఇవి. విప్లవాత్మక ముస్లిముల స్వచ్ఛంద సైనికదళాలు పరిసరప్రాంతాల గురించి తెలుసుకోవడానికి, భౌగోళిక రూపురేఖలను గ్రహించడానికి, రహదారులు, నీటివనరుల గురించి అవగాహన పెంపొందించుకోవడానికి కూడా ఉద్దేశించిన చర్యలివి. సైన్యంలో ఆదేశాల పాలన, విధినిర్వహణ, సమయం, శ్రమశక్తుల నిర్వహణ, ప్రణాళికా రచన, సమయస్ఫూర్తితో నిర్ణయాలు తీసుకోవడం వంటివి నేర్పడానికి కూడా ఈ చర్యలు ఉపయోగపడ్డాయి. ఈ నైపుణ్యాలు లేకుంటే ఎలాంటి రక్షణవ్యవస్థయినా ఎందుకూ పనికిరాదు. ఈ నిఘాబృందాలను పంపడం వెనుక ఉన్న మరొక ఉద్దేశ్యమేమంటే, ఖురైషుల ఆర్ధికవ్యవస్థకు ఆధారమైన వాణిజ్యమార్గం మదీనా చేతుల్లో ఉందని, ఎప్పుడైనా ఈ మార్గాన్ని మదీనా అడ్డుకోగలదనీ, వారి వాణిజ్యబృందాలను ఆపేయగలదని ఖురైషులను హెచ్చరించడం కూడా ఇందులో ఉంది. ప్రవక్త ముహమ్మద్ (స) బాల్యంలో బస్రా, మదీనాలు వెళ్ళి ఉన్నారు. యవ్వనంలో ఉన్నప్పుడు రెండుసార్లు సిరియా వెళ్ళారు. ఈ వాణిజ్య పర్యటనల వల్ల ఆయనకు భౌగోళికంగా, రాజకీయంగా మదీనాకు ఉన్న ప్రాముఖ్యం గురించిన అవగాహన ఉంది. ఖురైషుల వాణిజ్యమార్గం గురించిన వివరాలన్నీ ఆయనకు తెలుసు. ఆయన స్వయంగా ఖురైషుతెగకు చెందినవారే కాబట్టి, ఖురైషుల ఆర్ధికవ్యవస్థలోని వాణిజ్యవనరుల గురించి తెలిసిన వారు కాబట్టి ఖురైషులను ఆత్మరక్షణలో నెట్టివేసేలా హెచ్చరించడానికి అవసరమైన విధానాలు రూపొందించడం ఆయనకు కష్టం కాలేదు. ఈ నిఘాబృందాలను ఎలా

రూపొందించడం జరిగిందంటే, ఈ బృందంలోని సభ్యులకు వ్యవస్థీకృత సైనికచర్యల అనుభవం వీటివల్ల లభించింది. ఒక నాయకత్వం క్రింద యంత్రంలా విధులు నిర్వర్తించడం, సైనిక ఎత్తుగడలు, నేర్పులు గ్రహించడం, క్రమం తప్పక ఉపవాసాలు పాటించడం, ప్రార్థనలు ఆచరించడం, అత్యంత కఠిన పరిస్థితుల్లోను ఆదేశాలకు అనుగుణంగా విధులు నిర్వర్తించడం, అదేసమయంలో ఒక క్రమబద్ధమైన వార్తా వాహక వ్యవస్థను ఏర్పాటు చేసుకుని ప్రవక్త (స)కు మక్కాలోని శత్రువుల కదలికలను, పరిసరప్రాంతాల్లోని తెగల వారి సమాచారాన్ని పంపించడం ఈ బృందాలు నిర్వహించేవి.

అయితే యుద్ధ ప్రమాదం అనుకున్న సమయం కన్నా ముందే ముంచుకు వచ్చింది. నఖ్లా వద్ద జరిగిన సంఘటన, కుర్జ్ బిన్ జాబిర్ ఫిహ్రీ నాయకత్వంలో వెళ్ళిన బృందంతో జరిగిన ఘర్షణ వల్ల ఉద్రిక్తలు చెలరేగాయి. మక్కాలో యుద్ధోన్మాదం పెచ్చరిల్లింది. ఉద్రిక్తతలు తారాస్థాయికి చేరుకున్నప్పటికీ హిజ్రీ శకం అంటే మదీనా వలస వెళ్ళిన తర్వాత రెండవ సంవత్సరంలో మాత్రమే యుద్ధం జరిగింది. దీనికి కారణం లేకపోలేదు. మక్కాలో ఖురైషులు యుద్ధానికి ఉవ్విళ్ళూరుతున్నప్పటికీ వారికి కొన్ని సమస్యలు కూడా ఎదురయ్యాయి. మదీనాపై దాడి చేయాలంటే మక్కాకు మదీనాకు మధ్యన ఉన్న బనూ కినానా తెగ అడ్డంకిగా మారింది. బనూ కినానాతో ఖురైషులకు ఎప్పటి నుంచో వైరం ఉంది. కాని ఈ సమస్యను కూడా ఖురైషులు అధిగమించగలిగారు. బనూ కినాన ప్రతినిధులు మక్కా వెళ్ళి ఖురైషులతో చర్చించారు. ఖురైషులు ముస్లిములపై దాడి చేస్తే సహకరిస్తామని మాట ఇచ్చారు. ఖురైషులకు ఉన్న మరో సమస్య బలమైన సైన్యాన్ని సమీకరించడం. ఆ సమస్య కూడా పరిష్కారమయ్యింది. అహాబిష్ తెగలకు చెందిన బనూ నజీర్, బనూ మాలిక్, ముతయ్యిబిన్ వంశాలతో ఖురైషులు ఒప్పందాలు చేసుకున్నారు. ఈ తెగలు యుద్ధనైపుణ్యం ఉన్న తెగలు. ఇక మిగిలింది యుద్ధఖర్చుల సమస్య. మక్కావాసులందరూ యుద్ధఖర్చులకు విరాళాలు సేకరించారు. ఆభరణాలు కూడా యుద్ధఖర్చులకు తెచ్చి ఇచ్చారు. అంతే కాదు సిరియాతో వాణిజ్యంలో వచ్చిన లాభాలను యుద్ధఖర్చులకు కేటాయించారు. సిరియా వాణిజ్యం ద్వారా వచ్చిన లాభాలను యుద్ధఖర్చులకు కేటాయించడంలో మక్కాలోని జనాభా అంతా సహకరించింది. ఈ ఏర్పాట్ల ఫలితంగా బద్ర్ యుద్ధం ముంచుకు వచ్చింది.

సిరియాకు వెళ్ళిన ఒక పెద్ద వర్తక బృందం తిరుగు ప్రయాణమైన వార్త మదీనా చేరుకుంది. ఇది చాలా పెద్ద వర్తక బృందం. ఈ వర్తక బృందం సిరియా



వెళ్ళడానికి కారణం యుద్ధఖర్చులకు అవసరమైన లాభాలు సంపాదించుకుని రావడానికి. ఈ లాభాలను పెట్టుబడిగా పెట్టి యుద్ధం చేసి మదీనాను అక్రమించుకోవడానికి ఉద్దేశించిన వాణిజ్యం అది. ఆ వర్తక బృందానికి నాయకుడు అబూ సుఫ్యాన్. సిరియా వెళ్తున్నప్పుడే మదీనాలో పరిస్థితులను పరిశీలించుకుని వెళ్ళాడు. తిరుగు ప్రయాణంలో ఈ వర్తక బృందం తమ ఉద్దేశ్యాలను దాచిపెట్టుకోలేదు. ఈ వర్తక బృందం వైఖరి గమనిస్తే వారి ఉద్దేశ్యాలు శాంతి సామరస్యాలకు విరుద్ధంగా ఉన్నా యన్నది స్పష్టంగా అర్థమయ్యింది. ఈ పరిస్థితిలో ప్రవక్త ముహమ్మద్ (స) స్వయంగా 300 పై చిలుకు సైనికబలగంతో బయలుదేరారు. ఇందులో 86 మంది మక్కా నుంచి వచ్చిన ప్రవాసముస్లిములు ఉన్నారు. 170 మంది మదీనాకు చెందిన ఖజరజ్ తెగవారున్నారు. 61 మంది మదీనాకు చెందిన ఔస్ తెగవారున్నారు. ఒకవేళ యుద్ధమే జరిగితే మదీనాను రక్షించుకునే ఆత్మరక్షణ చర్యగా ప్రవక్త (స) ఈ బలగంతో బయలుదేరారు. ఈ లోగా ఖురైష్ వర్తకబృందం నాయకుడు అబూ సుఫ్యాన్ మదీనా నుంచి దాడి గురించి భయపడ్డాడు. వెంటనే మక్కాకు వర్తమానం పంపించాడు. మదీనా నుంచి దాడి ప్రమాదం ఉందని, అందువల్ల మరిన్ని సైనిక దళాలు అవసర మని, వర్తకబృందాన్ని రక్షించడానికి మక్కా నుంచి సైనికపటాలం కదిలి రావాలని వర్తమానం పంపించాడు. అంతేకాదు మక్కాకు తాను వెళ్ళే మార్గాన్ని కూడా మార్చుకున్నాడు. అబూసుఫ్యాన్ పంపిన వర్తమానం మక్కాలో కలకలం రేపింది. మక్కా నుంచి వెయ్యికి పైచిలుకు సైనికులున్న ఒక పెద్ద సైనికపటాలం పటిష్టమైన ఆయుధాలతో బయలుదేరింది. ఈ సైనిక పటాలంలో మక్కాకు చెందిన ప్రముఖులు కూడా వెళ్ళారు. ప్రవక్త (స) ముందు క్లిష్టమైన సమస్య వచ్చింది. వర్తకబృందం ఒకవైపు, మక్కా నుంచి వస్తున్న సైనికపటాలం మరోవైపు ఉన్నాయి. ఈ రెండింటిని ఒకే సమయంలో ఎదుర్కోవడం సాధ్యంకాదు. ఆయన వద్ద ఉన్న సైనికబలం కూడా అంత పెద్దది కాదు. జఫ్రాన్ లోయ వద్దకు చేరుకున్న తర్వాత ప్రవక్త (స) తన అనుచరులతో సంప్రదింపులు జరిపారు. ఆయన అనుచరులు, మక్కా నుంచి తరలివచ్చిన ప్రవాసులు, మదీనాలో ఆయనకు సహకారం అందిస్తున్న ఖజరజ్, ఔస్ తెగల వారు అందరూ ముక్తకంఠంతో ఆయన ఏ నిర్ణయం తీసుకున్నా తాము అనుసరిస్తామని చెప్పారు. ప్రవక్త ముహమ్మద్ (స) మదీనా నుంచి సైనిక పటాలంతో బయలుదేరినా ఆయన ఎక్కడికి, ఏ ఉద్దేశ్యంతో వెళుతున్నారన్నది శత్రువులకు అంతు బట్టలేదు. ఆయన దృష్టి ఒకవైపు అబూసుఫ్యాన్ నాయకత్వంలో వస్తున్న వర్తక బృందంపై ఉంది. మక్కా చేరుకోవడం అంత సులభం కాదని,

ప్రవక్త (స) సైన్యం దారిలో కాచుకుని ఉందన్న భీతి అబూసుఫ్యాన్‌లో కలిగించడం ఒక లక్ష్యం కాగా, మరోవైపు ఆయన దృష్టి మక్కా నుంచి వస్తున్న భారీ సైనికపటాలంపై ఉంది. ఈ పరిస్థితిలో వర్తకబృందం ఎక్కడ ఉందో ఖచ్చితంగా తెలుసుకోవడం అవసరం. అలాగే మక్కా నుంచి వస్తున్న సైనికపటాలం ఎక్కడ ఉందో ఖచ్చితమైన సమాచారం ఉండాలి. ఈ రెండింటికి మధ్య ఎంత దూరం ఉందో కూడా తెలుసుకోగలగాలి. వర్తక బృందాన్ని మక్కావారి సైనికపటాలం కలుసుకోగలిగే అవకాశాలు ఎంతవరకు ఉన్నాయన్నది బేరీజు వేసుకోవాలి. ప్రవక్త (స) మదీనా నుంచి బయలుదేరి సఫ్రా చేరుకున్న తర్వాత బస్బాస్ బిన్ అమ్ర్ అల్ జుహ్నీ, అదీ బిన్ అబీ రగ్బాలను బద్ర్ పంపించారు. ఖురైషుల వర్తక బృందం ఎక్కడ ఉంది? మక్కావారి సైనిక పటాలం ఎక్కడ ఉంది ఖచ్చితమైన సమాచారం సేకరించమని ఆదేశించారు. ఆయన స్వయంగా జఫ్రాన్ లోయ వరకు చేరుకున్నారు. అయితే అబూసుఫ్యాన్ మదీనా దాడికి భయపడి సురక్షితమైన మార్గం ఎంచుకున్నాడు. మార్గం మార్చుకుని దూరం ఎక్కువైనా సరే ఫర్వాలేదనుకుని, కోస్తాప్రాంతాలను చుట్టుకుంటూ మక్కాకు ప్రయాణమయ్యాడు. ఈ సమాచారం అందిన తర్వాత ప్రవక్త (స) బద్ర్‌కు ప్రయాణమయ్యారు. ఈ లోగా అబూసుఫ్యాన్ మక్కా సైన్యానికి తాము సురక్షిత ప్రాంతానికి చేరుకున్నామని, ఇక దాడి ప్రమాదం తమకు లేదని, మక్కా సైన్యాలు తిరిగి వెళ్ళిపోవచ్చని వర్తమానం పంపించాడు. కాని మక్కాసైన్యంలో అబూజహల్ తదితరులు మాత్రం వెనక్కి తిరిగి వెళ్ళిపోవడానికి అంగీకరించలేదు. మదీనాపై బలమైన దెబ్బతీయడానికి ఇదే అదనని వాదించారు. మదీనాపై దాడి చేసిగాని వెనక్కి వెళ్ళేది లేదన్నారు. వర్తకబృందాన్ని రక్షించడానికి వచ్చిన కొన్ని తెగల సైనికులు వర్తకబృందం సురక్షితంగా ఉందని తెలియగానే ఇక వెనక్కి వెళ్ళిపోవాలనుకున్నారు. హాకిబ్ బిన్ హజమ్, ఉత్బా వంటి వారు కూడా యుద్ధాన్ని కోరుకోలేదు. కాని అప్పటికి అబూజహల్ ఆగ్రహంతో ఊగిపోతున్నాడు. యుద్ధం పట్ల అసమ్మతితో ఉన్నవారిని నయానా, భయానా ఒప్పించాడు. మరోవైపు ప్రవక్త (స) బద్ర్‌లో అనువైన చోట మజిలీ చేసి యుద్ధవ్యూహాన్ని రచించుకున్నారు. శత్రుసైన్యంలో ఎంతమంది ఉన్నారన్న సమాచారం సేకరించారు. ఎవరెవరు దళాలకు నాయకత్వం వహిస్తున్నారో కూడా తెలుసుకున్నారు. శత్రుసైన్యం గురించి పూర్తి సమాచారం తెలుసుకున్న తర్వాత, శత్రుదళాలకు నాయకత్వం వహిస్తున్న వారెవరో తెలుసుకున్న తర్వాత ఆయన తన అనుచరులతో మాట్లాడుతూ మక్కా ఖురైషులు తమ వద్ద ఉన్న అత్యుత్తమ సైనికశక్తిని పంపించారని అన్నారు. మక్కా సైన్యంలో 1000 మంది సైనికులు



ఉన్నారు. ఇందులో 600 మంది కాల్బలం కాగా 100 మంది ఉన్న అశ్వికదళం ఉంది. చాలా ఒంటెలు ఉన్నాయి. ఆయుధాలు సమృద్ధిగా ఉన్నాయి. అంతేకాదు ఆహార పదార్థాలకు కొదువలేదు. వీటన్నింటికి మించి మద్యం, నాట్యకత్తెలతో వినోదవిలాసాల సామగ్రి కూడా ఉంది. ముస్లిముల సైన్యం పరిస్థితి పరిశీలిస్తే మొత్తం అందరూ కలిసి 300 పైచిలుకు ఉంటారు. వారు కూడా అర్ధాకలితో ఉన్నారు. ఆహార పదార్థాలు అంతంతమాత్రంగా ఉన్నాయి. కాని వారం దరికి విశ్వాస శక్తి పుష్కలంగా ఉంది. ఈ యుద్ధ ఫలితంపైనే వారి జీవితాలు ఆధారపడి ఉన్నాయి. ఈ పరిస్థితి గమనించిన ప్రవక్త (స) దేవుని ముందు సాష్టాంగ పడ్డారు. దేవునికి మొరపెట్టుకున్నారు.

"ఓ అల్లాహ్! ఇక్కడ గర్వాతిశయంతో మత్తెక్కిన ఖురైషులు నిన్ను ఆరాధించే నీ దాసులను అణచివేయడానికి, నీ ప్రవక్తను అబద్ధపు ప్రవక్తగా చెప్పడానికి వచ్చారు. కాబట్టి మాకు నువ్వు వాగ్దానం చేసిన సహాయాన్ని పంపు." అని వేడుకున్నారు. అంతేకాదు "ఓ అల్లాహ్! ఈ చిన్న సైన్యం నేడు నాశనమైతే తుదిదినం వరకు నిన్ను ఆరాధించేవాళ్ళెవ్వరూ ఉండరు." అని ప్రార్థించారు.

ప్రవక్త (స) ప్రార్థనలను దేవుడు ఆలకించాడు. యుద్ధంలో విజయం వరిస్తుందన్న శుభవార్త వినిపించాడు.

ఈ యుద్ధం రమజాన్ మాసం 17వ తేదీన జరిగింది. ఇస్లామీయ సైన్యంలో 22 మంది అమరగతులయ్యారు.. శత్రుసైన్యంలో 70 మంది మరణించారు. ముస్లిములెవ్వరు శత్రువులకు బందీలుగా చిక్కలేదు. కాగా శత్రుసైనికుల్లో 70 మంది ముస్లిములకు యుద్ధ ఖైదీలుగా చిక్కారు.. నష్టపరిహారం తీసుకుని యుద్ధఖైదీలను విడుదల చేశారు. ప్రతి యుద్ధఖైదీ 4000 దిర్హములు పరిహారంగా చెల్లించాడు. ధనవంతులైన యుద్ధఖైదీలు మరికాస్త ఎక్కువగా చెల్లించవలసి వచ్చింది. ఆ విధంగా ఖురైషులు దాదాపు 2.5 లక్షల దిర్హముల నష్టాన్ని చవిచూశారు. అంతేకాదు, యుద్ధధనంగా చాలా సొమ్ము వారు కోల్పోవలసి వచ్చింది. అబూజహల్, అబూ భఖ్తారీ, జమా బిన్ అస్వద్, అస బిన్ హిషామ్,, ఉమయ్యా బిన్ ఖలఫ్, మున్నాబ్బా బిన్ అల్‌హజ్జాజ్ వంటి ఖురైష్ ప్రముఖులు యుద్ధంలో హతమయ్యారు. ఈ నష్టం మక్కా ఖురైషుల పోరాటశక్తిని కుంగగొట్టింది. వారి ఆత్మవిశ్వాసం అడుగంటింది. అందుకే బద్ర్ యుద్ధాన్ని దివ్యఖుర్ఆన్ న్యాయదినంగా, విజయదినంగా అభివర్ణించింది.

**"జ్ఞాపకం తెచ్చుకోండి ఆ సమయాన్ని అప్పుడు మీరు అల్పసంఖ్యలో ఉండే**

**వారు. భూమిపై మీరు దుర్బలులుగా పరిగణించబడేవారు. మిమ్మల్ని ప్రజలు రూపుమాపుతారేమో అని మీరు భయపడుతూ ఉండేవారు. తరువాత అల్లాహ్ మీకు ఆశ్రయస్థలాన్ని సమకూర్చాడు. తన సహాయంతో మీ చేతులకు బలం చేకూర్చాడు. మీకు మంచి ఉపాధిని ఏర్పాటు చేశాడు. బహుశా మీరు కృతజ్ఞు లవుతారేమో అని."** ***(దివ్యఖుర్ఆన్ 8 : 26)***

అంతేకాదు అవిశ్వాసులకు ఒక సవాలు విసరడం కూడా జరిగింది.

**"అవిశ్వాసులతో ఇలా అను "మీరు గనక తీర్పును కోరితే, ఇదో, తీర్పు మీ ముందుకు వచ్చేసింది. కాబట్టి ఇక మానండి, అది మీకే మేలు. ఒకవేళ మీరు ఈ బుద్ధి తక్కువ పనిని మళ్ళీ చేసినట్లయితే మేము కూడా మళ్ళీ అదే శిక్షను విధిస్తాము."** ***(దివ్యఖుర్ఆన్ 8 : 19)***

అలాగే ముస్లిములు ఇంతటితో సంతృప్తిపడి ఊరుకోరాదని, సంఘర్షణ కొనసాగించాలని సూచించడం కూడా జరిగింది.

**"విశ్వసించిన ప్రజలారా! పీడన ఏమాత్రం మిగలకుండా పోయేవరకు, అల్లాహ్ నిర్ణయించిన ధర్మం పూర్తిగా నెలకొల్పబడేవరకు ఈ అవిశ్వాసులతో యుద్ధం చెయ్యండి.'** ***(దివ్యఖుర్ఆన్ 8 : 39)***

ముస్లిములు, ఖురైషులు ఈ రెండు వర్గాల్లో ఏ వర్గం విజయపథాన ఉందో, ఏ వర్గం వినాశ పథాన ఉందో బద్ర్ యుద్ధ ఫలితం ప్రకటించింది. ఈ యుద్ధం సందర్భంగా చోటు చేసుకున్న కొన్ని సంఘటనలు ఈ వాస్తవాన్ని చాటి చెబుతున్నాయి.

మక్కా నుంచి ఇద్దరు ముస్లిమ్ యువకులు, అబూ హాజైఫా బిన్ యమాన్, అబూ ఉసైల్ మదీనా తరలి వస్తుంటే దారిలో ముస్లిమేతరులు వారిని అడ్డుకున్నారు. ప్రవక్త ముహమ్మద్ (స)కు సహాయపడనివ్వమని అన్నారు. ఈ ఇద్దరు యువకులు తాము ప్రవక్త (స)కు సహాయం చేయమని ప్రమాణం చేసిన తర్వాత మాత్రమే వారిని వెళ్ళనిచ్చారు. మదీనా వచ్చిన ఆ ఇద్దరు యువకులు జరిగిందంతా ప్రవక్త (స)కు వివరించారు. ఆ సమయం ఎలాంటిదంటే ఎంత చిన్న సహాయమైనా ఎంతో అవసరమైన సమయం. అలాంటి సమయంలో ప్రవక్త(స)కు ఎలాంటి సహాయం చేయమంటూ వాగ్దానం చేసి గాని వారు మదీనాకు రాలేకపోయారు. అంతా విన్న ప్రవక్త (స) వారిని వాగ్దానానికి కట్టుబడి ఉండమని చెప్పారు.



యుద్ధంలో మరణించిన ఖురైష్ అవిశ్వాసుల శవాలను తగిన గౌరవమర్యాదలతో ఖననం చేయించారు. ఏ ఒక్క మృతదేహానికి అమర్యాద జరగలేదు.

ఆ కాలంలో సాధారణంగా యుద్ధంలో దొరికే కొల్లసొత్తు విషయంలో ఎలాంటి నియమాలు ఉండేవి కావు. ఎవరికి ఎంత దొరికితే అంత తానే తీసుకునేవాడు. అందువల్లనే యుద్ధంలో విజయం లభిస్తుందన్న చిన్న సూచన కనబడగానే ఎటు చూసినా ఆయోమయం, అరాచకం తాండవించేవి. కాని ఈ విషయంలో దివ్య ఖుర్ఆన్ స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. యుద్ధంలో లభించే కొల్లసొత్తు దేవునికి, దేవుని ప్రవక్త (స)కు సంబంధించిందని ప్రకటించింది. అందువల్ల కొల్లసొత్తు యావత్తు సైన్యాధిపతి సేకరించేవాడు. అందులో ఐదవవంతు రాజ్య వ్యవహారాల్లో సాధారణ వినియోగానికి కేటాయించేవారు. మిగిలిందంతా సైనికులందరికీ పంచేవారు.

సాధారణంగా యుద్ధ ఖైదీలు విజేతల దయాదాక్షిణ్యాలపై ఆధారపడి ఉంటారు. వారి పట్ల క్రూరంగా వ్యవహరించడం జరిగేది. వారిని బానిసలుగా మార్చేవారు. కాని ప్రవక్త(స) యుద్ధఖైదీలకు కొత్త హోదా ఇచ్చారు. వారికి కావలసిన సదుపాయాలు కల్పించాలని ఆదేశించారు. ఆ విధంగా చాలా మంది ప్రవక్త (స) అనుచరులు తాము కేవలం ఖర్జూరాలు తిని బతుకుతూ కూడా యుద్ధఖైదీలకు మంచి ఆహారం పెట్టేవారు. వారికి మంచి దుస్తులు ఇచ్చేవారు. అలాంటి యుద్ధఖైదీల్లో సుహేల్ బిన్ అమ్ర్ ఒకడు. ప్రవక్త ముహమ్మద్ (స) ను నిందించడం, దుర్భాషలాడడమే పనిగా పెట్టుకున్న వాడు. హజ్రత్ ఉమర్ (రజి) వాడి వ్యవహారం చూసి, అతని నోటిదురుసు అరికట్టాలంటే పండ్లు పీకేయాలన్నారు. కాని ప్రవక్త (స) ఈ మాట విని కఠినంగా వారించారు. ఒకవేళ ప్రవక్త (స) ఎవరి శరీరభాగాన్నయినా ఈ విధంగా నష్టపరిస్తే, ప్రవక్త అయినప్పటికీ తన స్వంత శరీరం కూడా అదేవిధంగా నష్టానికి గురికావలసి ఉంటుందని చెప్పారు.

యుద్ధంలో విజేతలు విజయగర్వంతో అనుచిత చేష్టలకు పాల్పడడం సాధారణం. కాని ప్రవక్త (స) సైన్యం విజేతలుగా నిలిచినప్పటికీ ఎలాంటి అనుచిత చేష్టలు అక్కడ చోటు చేసుకోలేదు. ప్రవక్త (స) స్వయంగా దేవునికి ధన్యవాదాలు తెలుపుతూ సాష్టాంగపడ్డారు. విజేతలుగా ఆ సైన్యం మదీనాలోకి మౌనంగానే ప్రవేశించింది. విజయోత్సవాలేవీ లేవు. అందుకు బదులుగా విజేతలు దేవునికి కృతజ్ఞతలుగా మోకరిల్లారు. తమ విజయం దేవుని అనుగ్రహంతోనే సాధ్యమైందని సూచిస్తూ దేవునికి సాష్టాంగపడ్డారు.

తన విజయం పట్ల, తన శక్తి సామర్థ్యాల పట్ల గర్వించే బదులు ప్రవక్త (స) దివ్యఖుర్‌ఆన్ వాక్యాలు పఠించారు. బలహీనతలను విమర్శిస్తూ, సమైక్యతను మరింత పటిష్టపరచాలని ఉపదేశించిన ఖుర్‌ఆన్ పంక్తులు వినిపించారు.

## తదనంతర పరిణామాలు

బద్ర్ యుద్ధంలో మక్కా అవిశ్వాసులు స్వల్పసంఖ్యలో ఉన్న ముస్లిముల చేతుల్లో ఘోరపరాజయం పాలైనప్పటికీ, వారి నాయకులు చాలా మంది మరణించినప్పటికీ, వారి యుద్ధశక్తి తునాతునకలైనప్పటికీ వారు గుణపాఠం గ్రహించలేదు. గాయపడ్డ తాచుపాముల్లా తమ పుట్టల్లోకి దూరిపోయారు. మరో పోరాటానికి ఏర్పాట్లు చేసుకో సాగారు. బద్ర్ తర్వాత వరుసగా జరిగిన కవ్వింపు చేష్టలు, రెచ్చగొట్టే ప్రయత్నాలే అందుకు సాక్ష్యం. మరోవైపు ప్రవక్త ముహమ్మద్ (స)కు పరిస్థితి తీవ్రత గురించి పూర్తి అవగాహన ఉంది. ఒకసారి ఒర నుంచి బయటకు వచ్చిన శత్రు ఖడ్గాలు పూర్తిగా విరగాలే కాని మళ్ళీ ఒరలోకి వెళ్ళవన్నది ఆయనకు తెలుసు. కాబట్టి ఆయన తన ఏర్పాట్ల విషయంలో అప్రమత్తంగా ఉన్నారు. ముస్లిముల సైన్యం ఎల్లప్పుడు సర్వసన్నాద్ధంగా ఉండేలా చూశారు. భారతదేశం, యూరప్ దేశాలకు జరిగే వాణిజ్యం మక్కా, ఎమన్‌ల నుంచే జరుగుతుంది. మక్కావాసులు కేవలం సిరియా వాణిజ్యంతోనే ఏటా రెండున్నర లక్షల దిర్హములు సంపాదిస్తారు. ఈ వాణిజ్యమార్గం మదీనా నుంచే వెళుతుంది. ఇప్పుడు ఈ మార్గం ప్రమాదంలో ఉంది. సిరియాకు వెళ్ళే వర్తకబృందాలు చుట్టుతిరిగి వెళ్ళవలసి వచ్చేది. దానివల్ల దూరభారం పెరిగింది. లాభాలు తరిగాయి. తమ వాణిజ్య మార్గాల రక్షణకు మక్కా ఖురైషులు దాదాపు రెండున్నర లక్షల దిర్హములు ఖర్చు చేయవలసి వచ్చింది. పైగా యుద్ధఖైదీల విడుదలకు మరో రెండున్నర లక్షల దిర్హములు ఖర్చయ్యాయి. మక్కా ఖురైషులు ఆ విధంగా ఆర్థికసంక్షోభంలో పడ్డారు. ఈ సంక్షోభం నుంచి బయట పడడానికి మరోసారి మదీనాపై దాడి చేసి ముస్లిములను ఓడించాలని నిర్ణయించు కున్నారు. బద్ర్ తర్వాత జరిగిన ఉహుద్ యుద్ధానికి దారి తీసిన కొన్ని సంఘటనలు ఇలా ఉన్నాయి.

బద్ర్ యుద్ధం ముగిసిన వారం రోజులకే ఒక వార్త వచ్చింది. మదీనాపై దాడి చేయడానికి బనీ గత్ఫాన్ తెగ సైన్యసమీకరణకు పూనుకుంటుందన్న వార్త అది. ఈ వార్త అందగానే ప్రవక్త (స) స్వయంగా ఒక చిన్న సైనికదళంతో మావుల్ కుజర్ వెళ్ళారు. కాని శత్రువులు ముందుకు రాలేదు. ప్రవక్త ముహమ్మద్ (స)



అక్కడ మూడు రోజులు ఉండి తిరిగి మదీనాకు వచ్చారు. ఆ తర్వాత కూడా ఈ తెగలు సైన్యసమీకరణకు పూనుకుంటున్నాయన్న వార్త మళ్ళీ వచ్చింది. గాలిబ్ బిన్ అబ్దుల్లా లైసీ ఒక చిన్న దళంతో వారిని ఎదుర్కోవడానికి వెళ్ళారు. ఇక్కడ చిన్న స్థాయి పోరాటం జరిగింది. శత్రువులు పారిపోయారు. యూద తెగ బనూ ఖైనుకా ఒప్పందాన్ని ఉల్లంఘించి తిరుగుబాటు చేసింది. ప్రవక్త (స) మదీనాకు దూరంగా బద్ర్ యుద్ధంలో ఉన్నప్పుడు యూద తెగ ఈ తిరుగుబాటుకు పూనుకుంది. ఈ చర్యను ఉపేక్షిస్తే మదీనాకు ఎప్పటికైనా ప్రమాదమే. అందువల్ల హిజ్రీ శకం రెండవ సంవత్సరం షవ్వాల్ మాసంలో బనూఖైనాకా తెగపై సైనికచర్యకు ప్రవక్త (స) పూను కున్నారు. సంధి చర్చల్లో వారు కోరుకున్న విధంగానే వారిని మదీనా నుంచి బహిష్క రించడం జరిగింది. బద్ర్ యుద్ధం ముగిసిన రెండునెలల తర్వాత అబూసుఫ్యాన్ 200 మందితో కలిసి మదీనా వచ్చాడు. మదీనాలో సల్మా బిన్ మిష్కామ్‌తో కలిసి రహస్య దాడికి కుట్రపన్నాడు. కాని ఈ కుట్ర విఫలమయ్యింది. కాలికి బుద్ధి చెప్పిన అబూసుఫ్యాన్ ఆరిజ్ వద్ద తోటలను నాశనం చేసి ఒక అన్సారీ వ్యక్తిని (మక్కా నుంచి వచ్చిన ముస్లిములకు సహాయపడిన మదీనా స్థానికులు) హతమార్చాడు. అబూసుఫ్యాన్‌ను వెంటాడుతూ ప్రవక్త (స) ఖార్కాతుల్ కుజర్ వరకు వెళ్ళారు. కాని వాళ్ళు పారిపోయారు. పారిపోతూ తమ వెంట తెచ్చుకున్న ఆహారపదార్థాలు (సత్తు పిండి) సంచులు పారేసి పోయారు. ఈ బస్తాలు ముస్లిములకు ఎంతో ఉపయోగ పడ్డాయి. అందుకే ఈ సంఘటనను గజ్వా సావిక్ (పిండి పోరాటం) అంటారు. హిజ్రీ శకం మూడవ సంవత్సరం ముహర్రమ్ మాసంలో బనూ తలాబా, బనూ మహారిబ్ తెగలు దాడికి సిద్ధమవుతున్నాయన్న వార్త వచ్చింది. ఆ వెంటనే ప్రవక్త (స) నజ్ద్ వరకు వెళ్ళారు. అక్కడ ఆయన దాదాపు ఒక నెలరోజుల పాటు విడిది చేశారు. కాని శత్రువులు ముందుకొచ్చే సాహసం చేయలేదు. ఎలాంటి పోరాటం లేకుండానే ప్రవక్త (స) మదీనా తిరిగి వచ్చారు. అయితే ఆ ప్రాంతంలోని తెగలతో ఆయన ఒప్పందాలు చేసుకుని వచ్చారు. మక్కా వాణిజ్య బృందాలు వెళ్ళకుండా ఆ మార్గాన్ని అడ్డుకునే ఉద్దేశ్యంతో ఈ ఒప్పందాలు జరిగాయి. రబీవుస్సానీ మాసంలో ఖురైషుల దాడి గురించిన వార్తలు వచ్చాయి. ప్రవక్త (స) మదీనాలో ఇబ్నె ఉమ్మే మక్తూమ్‌ను నియమించి తాను సైన్యంతో బొహ్రాన్ చేరుకున్నారు. అక్కడ ఒక నెలరోజుల పాటు విడిది చేశారు. అక్కడ సరిహద్దుల రక్షణను పటిష్టం చేసారు. ఎలాంటి పోరాటం లేకుండానే ఆయన మదీనా తిరిగి వచ్చారు. అదే మాసంలో మక్కా నుంచి ఒక వాణిజ్యబృందం బయలుదేరింది. వారి కొత్త మార్గంలో

కూడా ప్రమాదం ఉందని తెలియజేసేలా ఆ బృందంపై సైనికచర్య తీసుకోవడం జరిగింది. జమాదివుస్సానీ మాసంలో జైద్ బిన్ హారిసా నాయకత్వంలో 100 మంది ఉన్న దళాన్ని ఈ వాణిజ్యబృందంపై చర్యకు పంపారు. వాణిజ్యబృందం మార్గదర్శి ఖరత్ బిన్ హయ్యాన్ బందీ అయ్యాడు. ఆ తర్వాత ఆయన ఇస్లామ్ స్వీకరించి ముస్లిముల్లో చేరిపోయాడు. లక్షల దిర్హముల విలువ చేసే వెండి ముస్లిం సైన్యం స్వాధీనం చేసుకుంది. మక్కాలో ప్రముఖ కవులు అమ్ర్ జమ్హీ, మసాఫీ వంటి వారు తమ కవితా నైపుణ్యాలన్నీ ఉపయోగించి ప్రజల్ని మదీనాకు వ్యతిరేకంగా రెచ్చగొట్టే ప్రయత్నాలు తీవ్రం చేశారు. యుద్ధంలో తమ కుమారులను, సోదరులను కోల్పోయిన మక్కా స్త్రీలు తర్వాతి యుద్ధంలో ముస్లిముల రక్తంతో దాహం తీర్చుకోవాలని తహతహ లాడుతున్నారు. కులీన కుటుంబాలకు చెందిన ప్రముఖ మహిళలు, అబూసుఫ్యాన్ భార్య హింద్, ఇక్రమా బిన్ అబూజహల్ భార్య ఉమ్మే హాకిమ్, హజ్రత్ ఖాలిద్ సోదరి ఫాతిమా, తాయిఫ్ నాయకుడు మసూద్ తక్ఫీ కుమార్తె బర్జా, అమ్ర్ ఇబ్నుల్ ఆస్ భార్య రాయితా, హజ్రత్ ముసాయిబ్ బిన్ ఉమైర్ తల్లి హన్నాస్ వంటి వారు మక్కా సైన్యంతో వెళ్ళడానికి ఉద్యుక్తులై ఉన్నారు. ముస్లిములకు వ్యతిరేకంగా వివిధ అరబ్బు తెగలను రెచ్చగొట్టడానికి ఖురైషులు అమ్ర్ ఇబ్నుల్ ఆస్, అబ్దుల్లా బిన్ అజ్జాబారా, హుబైరా బిన్ అబీ వహాబ్, మసాఫీ బిన్ అబ్ద్ మనాఫ్, అమ్ర్ ఇబ్న్ అబ్దుల్లా జమ్హీ వంటి వారిని పంపించారు. ఆ విధంగా 3000 మందితో ఒక పెద్ద సైన్యాన్ని కూడగట్టారు. ఇందులో 700 మందికి కవచాల రక్షణ ఉంది, 200 అశ్విక దళం ఉంది. ఒక సంవత్సర కాలం ఏర్పాట్ల తర్వాత ఈ సైన్యం మక్కా నుంచి బయలుదేరింది. మదీనా మైదానాల్లో తమ పశువులను మేపుకుంటూ ఉహుద్ వద్ద ఈ సైన్యం మజిలీ చేసింది. ప్రవక్త ముహమ్మద్ (స) పట్ల అపరిమిత అభిమానం ఉన్న హజ్రత్ అబ్బాస్ ఇస్లామీయ ఉద్యమానికి మద్దతుగా ఉండేవారు. ఆయన ప్రవక్త (స) సూచన మేరకు మక్కాలోనే నివసిస్తున్నారు. మక్కాలో జరిగే యుద్ధసన్నాహాలను గమనించి తెలియజేయడానికి ఆయన అక్కడ ఉన్నారు. మక్కా వారి సన్నాహాల గురించి ఆయన ప్రవక్త (స)కు వర్తమానం పంపించారు. ప్రవక్త(స) స్వయంగా తన గూఢచార వ్యవస్థ ద్వారా హిజ్రీ శకం మూడవ సంవత్సరం షవ్వాల్ మాసం 5వ తేదీన మక్కా సైన్యం మదీనా చేరుకుంటుందన్న వార్త తెలుసుకున్నారు. ఆరిజ్ వద్ద ఉన్న పచ్చికనంతా మక్కా సైన్యంలోని పశువులు మేస్తున్నాయన్న వార్త కూడా ఆయనకు అందింది. మక్కా సైనిక బలం గురించిన సమచారం కూడా ఆయనకు చేరుకుంది. ఆయన మదీనాలో రాత్రిపహరాకు ఏర్పాట్లు చేశారు.



తర్వాతి ఉదయం అత్యవసర సమాలోచనలు జరిపారు. ఆ సమావేశంలో అధికశాతం ప్రవాస ముస్లిములు (ముహాజిర్లు), అన్సార్లలోని ప్రముఖులు మదీనా నగరంలోనే ఉండి శత్రువును ఎదుర్కోవాలని సూచించారు. కాని యువకులు మాత్రం మదీనా నగరాన్ని విడిచి బయటకు వెళ్ళి శత్రువును మార్కోవాలని అన్నారు. ప్రవక్త (స) ఈ రెండవ సూచననే స్వీకరించారు. ఆయన వెంటనే కవచాన్ని ధరించి బయలుదేరారు. మక్కా ఖురైషులతో చేతులు కలిపిన కపటి, అబ్దుల్లా బిన్ ఉబై మదీనాలోనే ఉండి శత్రువును ఎదుర్కోవాలని అన్నాడు. తన సూచనను తిరస్కరించడం చూసి అగ్రహొదగ్రు దయ్యాడు. రెండో దళాన్ని ఏర్పాటు చేసి రెండువైపుల నుంచి పోరాడాలని కొత్త ప్రతిపాదన చేశాడు. కాని ఆ ప్రతిపాదన కూడా తిరస్కరించబడింది. శుక్రవారం ప్రార్థనల తర్వాత ప్రవక్త (స) 1000 మంది సైనికులతో శత్రువును ఎదుర్కోవడానికి బయలుదేరారు. ఇందులో కపటి అబ్దుల్లా ఇబ్నె ఉబై కూడా ఉన్నాడు. అతను తర్వాత 300 మంది తన అనుచరులతో ప్రవక్త (స)ను వదిలి వెనక్కి వెళ్ళిపోయాడు. ఇది చూసి కొందరు ముస్లిములు నిరుత్సాహపడ్డారు. బనూ సల్మా, బనూ హారిసా వంటి వారు తిరిగి నగరంలోకి వెళ్ళిపోదామని అన్నారు. కాని ఇతరులు వారికి నచ్చచెప్పి ముందుకు నడిపించారు. మదీనా శివార్లలో ప్రవక్త (స) తన సైన్యాన్ని పరిశీలించారు. అత్యుత్సాహంతో వచ్చిన కొందరు పిల్లలు కూడా అందులో కన బడ్డారు. వారిని అందరినీ తిప్పి పంపించేశారు. అయితే కొందరు పిల్లలు మునివేళ్ళపై నిలబడి ఎత్తుగా కనబడడానికి ప్రయత్నించి సైన్యంలో ఉండే ప్రయత్నం చేశారు. అలాంటి పిల్లల్లో సుమ్రా ఒకడు. సైనికుడిగా తన శక్తిని నిరూపించడానికి రాఫేతో పోరాడి ఓడించి సైన్యంలో కొనసాగాడు. హజ్రత్ ఆయేషా (రజి), అబూ సయీద్ ఖుద్రీ తల్లి ఉమ్మే సులాయిత్, హజ్రత్ అనస్ తల్లి ఉమ్మే సులాయిమ్, ఉమ్మే అమ్మారా తదితరులు కూడా ముస్లిమ్ సైన్యంతో వచ్చారు. సైన్యానికి అపరిమిత సేవలందిం చారు. మొత్తం ముస్లిమ్ సైన్యం 700 అందులో కేవలం 100 మందికే కవచా లున్నాయి.

ప్రవక్త (స) తనకు వెనక ఉహుద్ కొండ ఉండేలా యుద్ధవ్యూహాన్ని రచించారు. అశ్వికదళానికి జుబైర్ ఇబ్నె అవ్వామ్ నాయకత్వం వహించారు. హజ్రత్ హంజా కవచాల్లేని కాల్బలానికి నాయకుడిగా నియమించబడ్డారు. ఐనైన్ కొండ వెనక ఉన్న మార్గంలో అబ్దుల్లా బిన్ జుబేర్ నాయకత్వంలో 50 మంది విలుకాండ్రను నియమించడం జరిగింది. బద్ర్ యుద్ధ అనుభవం తర్వాత ఖురైషులు కూడా ముస్లిములను చూసి పక్కా యుద్ధవ్యూహాన్ని రచించుకున్నారు. ఖురైషుల్లో 14 మంది మహిళలు

దప్పుల మోతతో యుద్ధగీతాలు ఆలపించడం ప్రారంభించారు. ఆ యుద్ధ గీతాల భావం ఇలా ఉంది

"మేం నక్షత్రాల కుమార్తెలం. తివాచీలపై నడుస్తాం. మీరు ధైర్యంగా యుద్ధం చేస్తే మిమ్మల్ని కౌగిలించుకుంటాం. మీరు వెన్నుచూపితే మేం మిమ్మల్ని వదిలేస్తాం."

యుద్ధం ప్రారంభం కావడానికి ముందు అన్సార్లను అబూఆమిర్ ఎలుగెత్తి పిలిచాడు. కాని అబూ ఆమిర్ కుట్రల గురించి బాగా తెలిసిన అన్సార్లు "ఓ ద్రోహి, నీ గురించి మాకు బాగా తెలుసు" అని జవాబిచ్చారు. ద్వంద్వ యుద్ధంలో హజ్రత్ అలీ (రజి) తల్హాతో పోరాడి హతమార్చారు. తల్హా కుమారుడిని హజ్రత్ హంజా (రజి) పరిమార్చారు. ముస్లిములు సంఖ్యాబలంతో చాలా తక్కువ ఉన్నప్పటికీ అత్యంత ధైర్యంగా పోరాడారు. హజ్రత్ హంజా (రజి), హజ్రత్ అలీ (రజి), హజ్రత్ అబూ దుజ్జానా శత్రు భీకరంగా పోరాడారు. శత్రువులు వెనకడుగు వేయకతప్పలేదు. ముస్లిములు విజయం సాధించే సూచనలు కనబడ్డాయి. యుద్ధంలో లభించే కొల్లసొత్తు సేకరించడం ప్రారంభమయ్యింది. ఈ అయోమయంలో యుద్ధప్రణాళిక దెబ్బతిన్నది. కొండమార్గంలో నియమించబడిన విలుకాండ్రు, యుద్ధంలో ఎలాంటి పరిస్థితి ఉన్నా తమ స్థానాల నుంచి కదలరాదన్న స్పష్టమైన ఆదేశాలున్నప్పటికీ, రాబందులు తమ తోటివారి శవాలను పీక్కుతింటున్న దృశ్యం చూసినా తమ స్థానాలు వదిలిపెట్ట వద్దన్న ఆదేశాలున్నప్పటికీ, కొల్లసొత్తు సేకరణలో పాల్గొనడానికి తమ స్థానాలు వదిలి బయటకు వచ్చారు. మిగిలిన వారితో కలిసి కొల్లసొత్తు సేకరించడం ప్రారంభించారు. గందరగోళంలాంటి పరిస్థితి నెలకొంది. ఈ పరిస్థితిని ఖురైషుల్లో ఉన్న గొప్ప యోధుడు ఖాలిద్ బిన్ వలీద్ చక్కగా ఉపయోగించుకున్నారు. ఆయన వెను వెంటనే కొండచరియ మార్గంలో విలుకాండ్రు తప్పుకోవడాన్ని గ్రహించారు. ఆ మార్గాన సైన్యాన్ని నడిపి ముస్లిములపై దాడిచేశారు. పారిపోతున్న ఖురైష్ సైనికులు కొందరు దాడికి కొత్తదారి తెరుచుకోవడం చూసి ఉత్సాహంగా యుద్ధరంగంలోకి మళ్ళీ వచ్చారు. ముస్లిముల చేతికి వచ్చిన విజయం చేజారిపోయింది. అనేకమంది ముస్లిమ్ యోధులు ప్రాణాలు కోల్పోయారు. ప్రవక్త ముహమ్మద్ (స)కు కూడా తీవ్రగాయాలయ్యాయి. ప్రవక్త (స) మరణించారన్న పుకార్లు షికారు చేశాయి. తీవ్రమైన గందరగోళం, అయోమయం అలుముకున్నాయి. ఈ గందరగోళం ఏ స్థాయిలో ఉందంటే స్వయంగా ప్రవక్త ముహమ్మద్ (స) పిలుస్తున్నప్పటికీ ఎవరూ గమనించని పరిస్థితి ఏర్పడింది. చివరకు అతికష్టంపై పరిస్థితిని అదుపులోకి తేగలిగారు. పారిపోతున్న ముస్లిమ్ సైనికులు తిరిగి పంక్తుల్లోకి వచ్చారు. మరోసారి యుద్ధ



రంగంలో పరిస్థితిని తమకు అనుకూలంగా మార్చుకునే ప్రయత్నం చేశారు. ఇప్పుడు ఖురైషులకు భయం పట్టుకుంది, తమకు లభించిన చిరువిజయం లాంటిది కూడా చేజారిపోయి పరాజయం పాలవుతామని భయపడ్డారు. అందువల్ల యుద్ధరంగం నుంచి వైదొల గడమే మంచిదని భావించి వెనక్కి తప్పుకోవడం ప్రారంభించారు. అప్పుడు అబూ సుఫ్యాన్ ఒక కొండపైకెక్కి ముస్లిముల్లో ప్రముఖులను పేర్లతో పిలవడం ప్రారం భించాడు. కాని అటు నుంచి ఎవరూ జవాబివ్వకపోయేసరికి వారంతా మరణిం చారని ప్రకటించాడు. ఈ ప్రకటన విన్న హజ్రత్ ఉమర్ (రజి) బిగ్గరగా "ఓరి, దైవవిరోధి.. మేమంతా బతికే ఉన్నాం" అని జవాబిచ్చారు.

అబూసుఫ్యాన్ ఈ జవాబు విని "హుబల్ దేవతకు జై" అన్నాడు.

ఈ జయధ్వనాలకు జవాబిస్తూ ముస్లిముల నుంచి "దేవుడు అత్యున్నతుడు.. సకల స్తోత్రాలకు అర్హుడు" అన్నారు.

అబూసుఫ్యాన్ ఈ మాటలు విని "మాతో ఉజ్జా దేవత ఉంది.. మీకెవరు లేరు" అన్నాడు.

ముస్లిములు జవాబిస్తూ "మా ప్రభువు దేవుడే.. నీకెవరు లేరు" అన్నారు.

ఈ క్లుప్తమైన వాక్యాలు రెండు సిద్ధాంతాల సంఘర్షణను ప్రతిబింబిస్తున్నాయి. ఈ సంఘర్షణే చరిత్రను సృష్టించింది.

ఉహుద్ యుద్ధంలో 70 మంది ముస్లిములు అమరులయ్యారు. 40 మంది గాయపడ్డారు. ఖురైషుల్లో 30 మంది మరణించారు. ముస్లిమ్ సైన్యంలో అత్యంత పరాక్రమవంతులైన సేనానులు హజ్రత్ హంజా, అబ్దుల్లా బిన్ జహష్, ప్రవక్త అనుచరుల్లో ప్రముఖులైన ముసాయిబ్ బిన్ ఉమైర్, రఫీ బిన్ మాలిక్, ఖజ్రజ్ తెగకు చెందిన అబ్దుల్లా బిన్ అమ్ర్, అమ్ర్ ఇబ్నే జుమాన్ తదితరులు ప్రాణాలు కోల్పోయారు. యుద్ధ రంగంలో గందరగోళ పరిస్థితులను అదుపులోకి తీసుకొచ్చిన తర్వాత ముస్లిమ్ సైనికులు తిరిగి పంక్తుల్లో స్థిరంగా నిలబడుతున్నప్పుడు శత్రువులు వెనక్కుతగ్గి యుద్ధరంగం నుంచి తప్పుకున్నారు. యుద్ధరంగంలో ముస్లిములు చేసిన ఒక పొరబాటుకు భారీ మూల్యం చెల్లించుకోవలసి వచ్చింది. కాని వారు పరాజితులు కాలేదు. ఆత్మవిశ్వాసం అవగింజంతైనా తగ్గలేదు. పారిపోతున్న ఖురైష్ సైన్యాన్ని వెంబడించవలసిందిగా ప్రవక్త (స) ఇచ్చిన ఆదేశాలను అమలు చేస్తూ 70 సైనికుల దళం వారిని వెంటాడింది.

ఖురైష్ దళం వెనుకంజవేసింది. తిరోన్ముఖమైన ఖురైష్ సైన్యాన్ని తీసుకుని అబూసుఫ్యాన్ రోహా చేరుకున్న తర్వాత కాని పరిస్థితిని మదింపు చేసుకోలేదు. పరిస్థితిని సమీక్షించుకున్న అబూసుఫ్యాన్ చాలా బాధపడ్డాడు. తాను తొందరపాటుతో వెనక్కితగ్గానని గ్రహించాడు. దాదాపుగా ఖాయమైన విజయాన్ని చేజేతులా వదిలేసి యుద్ధరంగం నుంచి తప్పుకున్నానని తెలుసుకున్నాడు. మదీనాను పూర్తిగా అణిచివేసే అవకాశం చేజారిపోయిందే అనుకున్నాడు. మరోసారి దాడి చేసి విజయాన్ని పరిపూర్ణం చేసుకోవాలనుకున్నాడు కాని అప్పటికే ఆలస్యమైపోయింది. అటు ముస్లిమ్ శిబిరం లోను భయాలున్నాయి. వెనక్కితగ్గిన ఖురైష్ సైన్యం మరోసారి దాడికి వచ్చే ప్రమాదం ఉందని ప్రవక్త (స) భయపడ్డారు. అందువల్ల ప్రవక్త (స) మదీనాకు తిరిగి వచ్చే బదులు సైన్యాన్ని ముందుకు నడుపుతూ, మదీనాకు ఎనిమిది మైళ్ళ దూరంలో ఉన్న హమ్రా ఉల్ అసద్ చేరుకున్నారు. ఈ లోగా ఖుజా తెగ నాయకుడు మాబాద్ అబూ సుఫ్యాన్ వద్దకు వెళ్ళి ముస్లిములు అతిపెద్ద సైన్యంతో వస్తున్నారని హెచ్చరించాడు. మాబాద్ ఇస్లామ్ స్వీకరించలేదు కాని ఇస్లామీయ ఉద్యమం పట్ల అత్యంత సానుభూతి ఉన్న నాయకుడు. మాబాద్ చేసిన హెచ్చరికతో అబూసుఫ్యాన్ బెంబే లెత్తాడు. పెద్ద సైన్యంతో వస్తున్న ముస్లిములను నిరోధించడం సాధ్యంకాదని భయపడి తక్షణం మక్కా వైపు శరవేగంగా ప్రయాణమయ్యాడు.

ఉహుద్ యుద్ధంలో ముస్లిములకు వాటిల్లిన నష్టం కేవలం వారి పొరబాట్ల వల్ల, క్రమశిక్షణను అతిక్రమించడం వల్ల జరిగిన నష్టమే. ఈ సంఘటనలు వారికి మంచి పాఠాలు నేర్పాయి. ఆ తర్వాత ఈ గుణపాఠాన్ని దృష్టిలో ఉంచుకుని ముస్లిములు వ్యవహరించారు. ఈ అనుభవాలు వారికి ప్రయోజనకరంగా మారాయి. ఈ సంఘటన గురించి దివ్యఖుర్ఆన్ చేసిన వ్యాఖ్యలు ఎంతైనా గమనించదగ్గవి. ముస్లిముల పొరబాట్లను విమర్శిస్తూ, ఇలాంటివి భవిష్యత్తులో పునరావృతం కారాదని కఠినమైన హెచ్చరికలు ఆ వ్యాఖ్యల్లో ఉన్నాయి.

దివ్యఖుర్ఆన్ ఈ సంఘటన గురించి ఇలా వ్యాఖ్యానించింది:

**"అల్లాహ్ మీకు చేసిన (సహాయం చేస్తాననే) తన వాగ్దానాన్ని నెరవేర్చాడు. ప్రారంభంలో ఆయన ఆజ్ఞ ప్రకారం మీరే వారిని చంపుతూ ఉన్నారు. కాని మీరు బలహీనతను ప్రదర్శించినప్పుడు మీ కర్తవ్యం విషయంలో పరస్పరం విభేదాలకు గురి అయినప్పుడు మీరు వ్యామోహపడిన వస్తువును (అంటే విజయధనం) అల్లాహ్ మీకు చూపగానే మీరు మీ నాయకుని ఆజ్ఞను**



**ఉల్లంఘించారు. - ఎందుకంటే, మీలో కొందరు ఇహాన్ని కోరారు, మరి కొందరు పరాన్ని కోరారు - అప్పుడు అల్లాహ్ మిమ్మల్ని పరీక్షించటానికి అవిశ్వాసులకు బదులుగా మిమ్మల్ని ఓటమి పాలు జేశాడు. అయినప్పటికీ వాస్తవానికి అల్లాహ్ మిమ్మల్ని క్షమించాడు. ఎందుకంటే, విశ్వాసుల పట్ల అల్లాహ్‌కు ఎనలేని అనుగ్రహం. (దివ్యఖుర్ఆన్ 3: 152)**

**జ్ఞాపకం తెచ్చుకోండి. అప్పుడు మీరు పారిపోతున్నారు. వెనక్కి తిరిగి ఎవరినీ చూసే అంత స్పృహ కూడా మీకు లేదు. వెనుక నుండి ప్రవక్త మిమ్మల్ని కేక వేస్తూ ఉన్నాడు. అప్పుడు మీ ఈ వైఖరికి ప్రతిఫలంగా అల్లాహ్ మీకు దు:ఖం తరువాత దు:ఖం కలుగజేశాడు, మీరు ఏదైనా పోగొట్టుకున్నా లేదా మీకు ఏదైనా ఆపద కలిగినా మీరు చింతించకుండా ఉండేటందుకు ఇది భవిష్యత్తులో మీ కొరకు గుణపాఠంగా ఉండాలని. అల్లాహ్‌కు మీరు చేసే పనులన్నీ తెలుసు."** ***(దివ్యఖుర్ఆన్ 3 :153)***

దివ్యఖుర్ఆన్ ముస్లిముల పొరబాట్లను కుండబ్రద్దలు కొట్టినట్లు ఖండించింది. ఈ నష్టాన్ని మనోధైర్యంతో ఎదుర్కోవాలని సలహా ఇచ్చింది.

**"క్రుంగిపోకండి, దు:ఖపడకండి, మీరే ప్రాబల్యం పొందుతారు, మీరు విశ్వాసులే అయితే. ఇప్పుడు మీరు దెబ్బతిన్నారు. నిజమే. ఇదివరకు మీ ప్రత్యర్థి కూడా ఇటువంటి దెబ్బనే తిన్నాడు కదా! ఇవి కాలం యొక్క మిట్టపల్లాలు. వాటిని మేము ప్రజల మధ్య త్రిప్పుతూ ఉంటాము. ఇటువంటి కాలం మీకు ఎందుకు ప్రాప్తించిందంటే మీలో నిజమైన విశ్వాసులెవరో అల్లాహ్ చూడదలిచాడు. (సత్యానికి) నిజమైన సాక్షులెవరో ఏరదలిచాడు - ఎందుకంటే దుర్మార్గులైన ప్రజలంటే అల్లాహ్‌కు ఇష్టం లేదు."** ***(దివ్యఖుర్ఆన్ 3:139-140)***

అంతేకాదు, ఈ ప్రపంచంలో లభించే ప్రతిఫలం కన్నా పరలోకంలో లభించే ప్రతిఫలం ఎంతో మేలైనదనీ ఉపదేశించింది.

**"ప్రాపంచిక ప్రతిఫలం పొందే ఉద్దేశ్యంతో పనిచేసే వాడికి మేము ప్రపంచాన్నుండే ఇస్తాము. పరలోక ప్రతిఫలాపేక్షతో పనిచేసే వాడు పరలోక ప్రతిఫలాన్ని పొందుతాడు. కృతజ్ఞతలు తెలిపే వారికి మేము వారి ప్రతిఫలాన్ని తప్పకుండా ప్రసాదిస్తాము."** ***(దివ్యఖుర్ఆన్ 3 :145)***

యుద్ధరంగంలో ప్రవక్త సహచరులు చూపించిన అంకితభావం, ప్రవక్త (స)

పట్ల వారి ప్రేమాభిమానాలు సాటిలేనివి. ప్రపంచంలో ఏ నాయకుడికీ ఇలాంటి సహచరులు లభించలేదు. యుద్ధరంగంలో ఈ వాస్తవాన్ని చాటిచెప్పే అనేక సంఘటనలు చోటుచేసుకున్నాయి. వాటిలో కొన్ని ఇక్కడ ప్రస్తావిస్తున్నాము.

ముస్లిముల సంఖ్యాబలం చాలా తక్కువగా ఉంది. శత్రువులు ఒక్క ఉదుటున ముస్లిములపై పెద్దసంఖ్యలో విరుచుకుపడినప్పుడు ప్రవక్త ముహమ్మద్ (స) "నా కోసం ప్రాణాలివ్వడానికి ఎవరు ముందుకు వస్తారు?" అని ఎలుగెత్తి పిలిచారు. జైద్ బిన్ సాకన్ కొందరు అన్సారులతో కలిసి ముందుకు వచ్చారు. అందులో ఏడుగురు ఒకరి తర్వాత ఒకరు అమరగతులయ్యారు. అలా ప్రాణాలర్పించిన వారిలో స్వయంగా జైద్ కూడా ఉన్నారు. శరీరమంతా రక్తసిక్తమైన గాయాలతో కొన ఊపిరితో ఉన్న ఆయన్ను ప్రవక్త ముహమ్మద్ (స) వద్దకు తీసుకొచ్చినప్పుడు జైద్ తన ఒంట్లో మిగిలిన సత్తువనంతా కూడబలుక్కుని ప్రవక్త (స) పాదాల వద్ద శిరస్సు ఉంచారు. యుద్ధరంగంలో అబ్దుల్లా బిన్ ఉమయ్యా తన ఖడ్గంతో ప్రవక్త (స)పై వేటు వేస్తున్నప్పుడు అక్కడే ఉన్న ఉమ్మే అమ్మారా ఒక్కుదుటున ఆ కత్తివేటుకు అడ్డంగా వచ్చారు. ఆమె భుజంపై చాలా లోతైన గాయమయ్యింది. శత్రువు కత్తివేటు నుంచి ప్రవక్త (స)ను కాపాడ్డానికి ఆమె తన శరీరాన్ని డాలుగా మార్చారు. ప్రవక్త (స)వైపు వస్తున్న శత్రువుల బాణాల వర్షాన్ని చూసి అబూ దుజ్జానా ప్రవక్త (స)కు అడ్డుగా నిలబడ్డారు. ఆయన వీపు శరాఘాతాలతో జల్లెడై పోయింది. యుద్ధరంగంలో ప్రవక్త (స)పై విరుచుకు పడుతున్న కరవాలాలను తల్హా తన చేతులతో ఆపారు. ఆయన చేతులు కత్తివేటులతో ఛిద్రమయ్యాయి. ఒక చేయి పూర్తిగా తెగిపోయింది. అబూ తల్హా ఒక చేత్తో కవచం పట్టుకుని ప్రవక్త (స)కు రక్షణగా నిలబడ్డారు. మరోచేత్తో శత్రుదళాలపై శరపరంపర కురిపించారు. యుద్ధానంతరం ప్రవక్త ముహమ్మద్ (స) ఎవరెవరు మరణించారన్నది వాకబు చేస్తూ సాద్ బిన్ రాబి గురించి అడిగారు. నెత్తురోడుతున్న సాద్ బిన్ రాబిని ఆయన వద్దకు తీసుకు వచ్చారు. సాద్ తుదిశ్వాస విడుస్తూ ప్రవక్త (స)కు సలామ్ చేశారు. యుద్ధ రంగంలో ఒక కన్ను కోల్పోయిన పరిస్థితిలో ఉన్నా ప్రవక్త ముహమ్మద్(స)పై శత్రు దాడిని ఒక కంటితో చూసినా వెంటనే అడ్డుకోవాలని, అలా చేయకపోతే ఆ నిర్లక్ష్యానికి ఎలాంటి సాకులు దేవుని ముందు చెప్పుకోలేమని అన్నారాయన. మదీనాకు చెందిన ఒక యువకుడు అమ్ర్ బిన్ సామిత్ ఉహుద్ యుద్ధం వరకు ఇస్లామ్ స్వీకరించలేదు. ఇస్లామ్ పట్ల సానుభూతితో ఉండేవాడు. ఉహుద్ యుద్ధంలో ఆయన ఇస్లామ్ స్వీకరించాడు. యుద్ధరంగంలో ప్రాణాలు విడిచాడు. సామిత్ మృతశరీరం వద్ద నిలబడి ప్రవక్త(స) "ఒక్క సారి కూడా ప్రార్థన



చేయకుండా స్వర్గార్హత పొందిన వ్యక్తి" అని ప్రకటించారు. బనీ తలాబా తెగకు చెందిన యూదుడు ముఖాయిరిక్ ఇస్లామ్ స్వీకరించాడు. సత్యమైన యూదధర్మం ఇదే ఉపదేశిస్తుందని నమ్మాడు. ప్రవక్త (స)తో చేతులు కలుపమని ఇతర యూదులను కూడా కోరాడు. కాని సబ్బాత్ రోజు కాబట్టి రాలేమని వారంతా సాకులు చెప్పారు. ముఖాయిరిక్ వారితో "సబ్బాత్ ఉన్నా లేకపోయినా ప్రస్తుతం సంక్షోభ పరిస్థితి ఉంది" అని తెగేసి చెప్పి యుద్ధ రంగానికి వచ్చాడు. శత్రువులతో పోరాడుతు అమరగతు డయ్యాడు. యుద్ధరంగం నియమాలను కూడా ప్రవక్త (స) ఖచ్చితంగా ఉపదేశించారు. అబూ దుజ్జానా శత్రు పంక్తులను చెల్లాచెదురు చేస్తూ భీకరంగా పోరాడుతూ ముందుకు సాగుతున్నప్పుడు ఖురైష్ సేనాని అబూసుఫ్యాన్ భార్య హింద్ ఆయనకు ఎదురయ్యింది. ముస్లిముల పట్ల హింద్ ఎంత తీవ్రమైన వైరభావం కలిగి ఉందో అందరికీ తెలిసిన విషయమే. శత్రుసేనాని భార్య, ముస్లిములకు వ్యతిరేకంగా ఖురైషులను రెచ్చగొడుతున్న శత్రువు ఎదురుగా ఉన్నా అబూ దుజ్జానా తన కరవాలాన్ని పైకెత్తలేదు. ప్రవక్త (స) స్వయంగా తనకు ఇచ్చిన కరవాలాన్ని ఒక మహిళపై ప్రయోగించడం అనుచితంగా భావించి వదిలేశారు. ప్రవక్త(స) వద్ద నుంచి కరవాలాన్ని స్వీకరించిన అబూ దుజ్జానా తలకు ఎర్రటి రుమాలు కట్టుకుని, యుద్ధరంగంలో రొమ్ము విరుచుకు తిరిగారు. అలా గర్వంగా తిరగడాన్ని సాధారణ పరిస్థితుల్లో ప్రవక్త (స) ఖండించేవారు. గర్వంగా, రొమ్ము విరుచుకు తిరగడాన్ని దైవం ఇష్టపడడు. కాని యుద్ధ రంగంలో శత్రువుల్లో భయభీతులు సృష్టించడానికి అలాగే నడవాలని చెప్పారు. యుద్ధ రంగంలో మృదువైఖరి, నమ్రత పనికిరావు.

ఈ యుద్ధంలో ముస్లిమ్ మహిళలు పోషించిన పాత్ర కూడా అద్వితీయమైనది. హజ్రత్ హంజా (రజి) సోదరి హజ్రత్ సఫియా యుద్ధ రంగానికి వచ్చారు. హజ్రత్ హంజా (రజి) యుద్ధంలో అమరగతులయ్యారు. ఆయన రొమ్ము చీల్చి గుండెను బయటకు తీసి హింద్ అవమాన పరిచింది. ఈ విషాదవార్త విని హజ్రత్ సోఫియా అక్కడికి వచ్చారు. సోఫియా కుమారుడు జుబైర్ యుద్ధ రంగంలోనే ఉన్నారు. ఆమెకు సోదరుడి మృతదేహాన్ని చూపించవద్దని, ఆమె ఆ బీభత్స దృశ్యం చూడలేకపోవచ్చని ప్రవక్త (స) ఆమె కుమారుడు జుబైర్‌కు చెప్పారు. హజ్రత్ సోఫియా ప్రవక్త ముహమ్మద్ (స)కు జవాబిస్తూ జరిగిన విషాదం గురించి తనకు యావత్తూ తెలుసనీ, సత్యం కోసం చేసే ఈ త్యాగాలు చాలా చిన్నవని వ్యాఖ్యానించారు. ఆ తర్వాత ఆమెకు సోదరుడి మృతదేహాన్ని చూడడానికి ప్రవక్త (స) అనుమతించారు. ఆమె సోదరుడి మృతదేహాన్ని చూసి, ఆత్మశాంతికి దేవుని ప్రార్థించి

వెనుదిరిగారు. ఒక అన్సారి మహిళ తండ్రి, సోదరుడు, భర్త అందరూ యుద్ధంలో మరణించారు. కాని ఆ మహిళ యుద్ధరంగానికి వచ్చి ప్రవక్త (స) క్షేమసమాచారాలు విచారించింది. ప్రవక్త (స) క్షేమంగానే ఉన్నారని తెలుసుకున్న తర్వాత "ఆయన క్షేమంగా ఉంటే చాలు. ఇక ఎలాంటి విషాదమైనా అంత పెద్దది కాదు, తట్టుకోవచ్చు" అని వ్యాఖ్యా నించింది. సాధారణ పరిస్థితుల్లో ఉండే నియమాలు కొన్ని యుద్ధ పరిస్థితుల్లో ఉండవు. హజ్రత్ ఆయెషా (రజి), ఉమ్మే సులైమ్, ఉమ్మె సులైత్ వంటి మహిళలు పరదా నిబంధనలు పక్కన పెట్టి యుద్ధరంగంలో సేవలందించారు. క్షతగాత్రులకు నీళ్ళు అందించేవారు. ప్రథమ చికిత్స చేసేవారు. ప్రవక్త (స) మరణించారన్న పుకారు విని హజ్రత్ ఫాతిమా (రజి) పరుగు పరుగున యుద్ధ రంగానికి వచ్చారు. ప్రవక్త ముహమ్మద్ (స) గాయాలను కడిగి కట్లు కట్టారు.

యుద్ధరంగంలో ఖురైష్ సేనల వ్యవహారశైలి అత్యంత హేయంగా ఉంది. ముస్లిములు మృతదేహాల పట్ల అమర్యాదగా వ్యవహరించారు. మృతదేహాల అవయవాలను ఖండించారు. ముస్లిమ్ మహిళల పట్ల అమర్యాదగా వ్యవహరించారు. తమ ప్రతిజ్ఞలు పూర్తి చేసుకోవడానికి మృతదేహాలను చీల్చారు. ముక్కు చెవులు కోసి మెడలో దండలుగా వేసుకున్నారు. శత్రువుల్లో మహిళలకు నాయకత్వం వహిస్తున్న హింద్ మరింత పాశవికంగా వ్యవహరించింది. హజ్రత్ హంజా (రజి)ను దొంగ చాటుగా చంపించి, ఆయన మృతదేహాన్ని అవమానపరిచింది. ఆయన ముఖాన్ని చెక్కేసింది. పొట్టచీల్చింది. కాలేయం బయటకు తీసి నమిలింది. హజ్రత్ అబ్దుల్లా బిన్ జహష్ మృతదేహం పట్ల కూడా చాలా అమర్యాదకరంగా వ్యవహరించారు. అవయవాలు కోశారు. హజ్రత్ హంజా (రజి) మృతదేహం ముఖంపై అబూసుఫ్యాన్ కొడుతూ "ఇప్పుడు ఫలితం అనుభవించు" అన్నాడు. ఈ సంఘటనను కనానా తెగకు చెందిన జాలిస్ బిన్ జాబన్ చూశాడు. తన తెగవారికి చూపిస్తూ "చూడండి! మహా గొప్ప ఖురైష్ తెగ నాయకుడు ఎలా వ్యవహరిస్తున్నాడో చూడండి" అన్నాడు. ఈ మాటలు విన్న అబూసుఫ్యాన్ చాలా సిగ్గుపడ్డాడు. శత్రువుల ఈ వ్యవహారశైలితో పోల్చితే ప్రవక్త ముహమ్మద్ (స) ఎంతో హుందాగా వ్యవహరించారు. శత్రువుల మృత దేహాల పట్ల అమర్యాదకరంగా వ్యవహరించరాదని ముస్లిమ్ సైనికులకు స్పష్టమైన ఆదేశాలిచ్చారు. మృత దేహాలకు సక్రమంగా అంత్యక్రియలు జరగాలని చెప్పారు. మృతదేహాలను కప్పడానికి అవసరమైన కఫన్ వస్త్రాలు లభించనందువల్ల చాలా మృతదేహాలు కఫన్ లేకుండానే ఖననం చేయడం జరిగింది. ముసాయిబ్ బిన్ ఉమైర్ మృతదేహాన్ని కప్పడానికి వస్త్రం లేనందువల్ల కేవలం ముఖాన్ని మాత్రం



వస్త్రంతో కప్పి మిగిలిన శరీరాన్ని గడ్డితో కప్పారు. దీన్ని బట్టి ఎలాంటి పరిస్థితుల్లో ముస్లిములు యుద్ధం చేశారో గ్రహించవచ్చు.

దివ్యఖుర్ఆన్ ఈ యుద్ధంలో ముస్లిముల పొరబాట్లను ఎత్తిచూపుతూ వారిలో రాజకీయ చైతన్యాన్ని మేలుకొల్పింది. వారి పోరాటస్ఫూర్తికి ప్రోత్సాహమిచ్చింది.

> **"ఇలా అను: "ఓ అల్లాహ్! విశ్వసామ్రాజ్యాధిపత్యానికి ప్రభూ! నీవు కోరిన వారికి ప్రభుత్వాధికారాన్ని ప్రసాదిస్తావు. నీవు కోరిన వారినుండి దాన్ని లాక్కుం టావు. నీవు కోరిన వారికి గౌరవాన్ని ప్రసాదిస్తావు. నీవు కోరిన వారిని పరాభవం పాలు చేస్తావు. శుభాలు నీ అధీనంలో ఉన్నాయి. నిస్సందేహంగా నీకు అన్నింటిపైనా అధికారం ఉంది. నీవు రాత్రిని పగటిలోకి ప్రవేశింప జేస్తావు. పగలును రాత్రిలోకి ప్రవేశింప చేస్తావు. ప్రాణం లేని దాని నుండి ప్రాణమున్న దానిని తీస్తావు. ప్రాణమున్న దాని నుండి ప్రాణంలేని దానిని తీస్తావు. నీవు కోరిన వారికి లెక్కలేనంత ఉపాధిని ప్రసాదిస్తావు."**
>
> ***(దివ్యఖుర్ఆన్ 3 : 26-27)***

ప్రవక్త ముహమ్మద్ (స) తీవ్రంగా గాయపడడాన్ని చూసి కొందరు సహచరులు అయనతో శత్రువులను శపించమని కోరారు. దేవుడు వారిని నాశనం చేసేలా శపించమన్నారు. ప్రవక్త (స) వారికి జవాబిస్తూ "నేను శపించడానికి రాలేదు. మానవాళికి కారుణ్యంగా పంపబడ్డాను" అన్నారు. ఆ తర్వాత దేవుడిని ప్రార్థిస్తూ "ఓ దేవా! నా ప్రజలకు సరయిన మార్గదర్శనమివ్వు, వారు నన్ను, నా ఉద్యమాన్ని, జీవిత వాస్తవాలను సరిగా అర్థం చేసుకోలేదు." అన్నారు.

బద్ర్ యుద్ధం నిర్ణయాత్మకంగా ముగిసింది. కాని ఉహుద్ యుద్ధం నిర్ణయాత్మక మైనది కాదు. యుద్ధంలో ఎవరు విజేతలన్నది తేలలేదు. వెనుకంజ వేసిన శత్రు సైన్యాన్ని వెంటాడుతూ ప్రవక్త (స) సేనలను నడిపి తన ధైర్యస్థయిర్యాలను ప్రదర్శిం చినప్పటికీ, ముస్లిమ్ సైన్యానికి వాటిల్లిన నష్టాలు ఎక్కువే. ఈ నష్టాలను చూసిన కొన్ని ఇరుగు పొరుగు తెగలు తిరుగుబాటుకు పూనుకున్నాయి. ఈ తిరుగుబాట్లను తక్షణమే ప్రవక్త (స) ఎదుర్కొన్నారు. మొదటి తిరుగుబాటు ఖతన్ తెగ నుంచి వచ్చింది. ఖతన్ తెగకు చెందిన తల్హా బిన్ ఖ్వాలద్, సల్మా బిన్ ఖ్వాలద్‌లు కలిసి అసద్ బిన్ ఖుజైమాను ముస్లిములకు వ్యతిరేకంగా రెచ్చగొట్టాడు. మదీనాకు వ్యతిరేకంగా అసద్ బిన్ ఖుజైమా కుట్రపన్నేలా చేశాడు. సాయుధదోపిడీకి సంబంధం

చిన కుట్ర ఇది. ఈ ప్రమాదం గురించి తెలియగానే ప్రవక్త (స) 150 మంది సైనికులతో అబూ సల్మా మఖ్జూమీని పంపించారు. కాని ముస్లిమ్ దళాలు ఖతన్ చేరుకుంటున్న విషయం తెలియగానే దోపిడీగాళ్ళు పారిపోయారు. తమ పశువులను అక్కడే వదిలి పలాయనం చిత్తగించారు. ఈ పశువులను ముస్లిమ్ సైన్యం స్వాధీనం చేసుకుని పంపిణీ చేసింది. ఈ సంఘటన హిజ్రీ శకం నాలుగవ సంవత్సరం ముహర్రమ్ మాసం ఐదవ తేదీన జరిగింది. అదే తేదిన మరో వార్త వచ్చింది. ఖాలిద్ బిన్ సుఫ్యాన్ అల్‌హజ్‌లీ సైన్యాన్ని సమీకరిస్తున్నాడని, మదీనాపై దాడికి ఏర్పాట్లు చేస్తున్నాడన్నది ఆ వార్త. అతడిని ఎదుర్కోవడానికి అబ్దుల్లా బిన్ అనిస్ జుహ్‌ని అన్సారీని పంపడం జరిగింది. ఈ తిరుగుబాటును ఆయన కఠినంగా అణిచివేశారు. తిరుగుబాటు నాయకుడి తల ఖండించి ప్రవక్త (స) వద్దకు తీసుకు వచ్చారు. ఆయన ఒంటిచేత్తో సాధించిన ఈ విజయాన్ని అభినందిస్తూ ప్రవక్త (స) తన చేతికర్రను బహుమతిగా ఆయనకిచ్చారు. రెండు మూడు రోజుల తర్వాత అజల్ వఖ్కారా తెగ సంఘటన ముందుకు వచ్చింది. ఆ తెగ వద్దకు ఏడుగురు ముస్లిములను మతబోధకులుగా పంపడం జరిగింది. ఈ ఏడుగురిలో ఐదుగురిని మోసపూరితంగా హతమార్చారు. మిగిలిన ఇద్దరిని బానిసలుగా ఖురైషులకు అమ్మేశారు. అదే మాసంలో మరో సంఘటన జరిగింది. నజ్ద్ వద్ద మతబోధనకు పంపించిన 70 మందిలో 69 మందిని దారుణంగా చంపేశారు. అబూ బరా ఆమిర్ బిన్ మాలిక్ హామీ ఇవ్వడం వల్ల ఈ మతబోధకులను పంపడం జరిగింది. ఈ బృందంలో అత్యుత్తమ ఖారీలు, హాఫీజులు ఉన్నారు. ధర్మవేత్తలున్నారు. ఈ బృందం బనీ ఆమిర్, హర్రా బనీ సులైమ్ మధ్యన ఉన్న బీరి మూనా ప్రదేశానికి చేరుకుంది. బృందం సభ్యులకు ప్రవక్త (స) తన లేఖను ఇచ్చి పంపించారు. అక్కడికి చేరుకున్న బృందం ఆమిర్ బిన్ తుఫైల్‌కు ప్రవక్త (స) ఇచ్చిన లేఖను ఇచ్చింది. మతబోధనకు వచ్చిన బృందంలో హరమ్ బిన్ మల్హాన్ ఈ లేఖను ఆమిర్ బిన్ తుఫైల్‌కు ఇచ్చాడు. ఆమిర్ బిన్ తుఫైల్ లేఖలో ఏమున్నదో చూడనే లేదు. లేఖనిచ్చిన హరామ్ బిన్ మల్హాన్‌ను హతమార్చాడు. బనీ ఆమిర్ తెగను పిలిచి మదీనా వారిపై దాడి చేయమన్నాడు. కాని అబూ బరా ఇచ్చిన హామీ, అబూ బరా భద్రతలను దృష్టిలో ఉంచుకుని బనీ ఆమిర్ తెగ దాడికి ఇష్టపడలేదు. ఆ వెంటనే ఆమిర్ బిన్ తుఫైల్ ఇతరులను పిలిచాడు. ౹ాల్, జక్వాన్, ఉసయ్యా, బనీ లహ్యాన్‌లను దాడి చేయమన్నాడు. మదీనా నుంచి వచ్చిన బృందం తాము పోరాటానికి రాలేదని, అక్కడ తాము ఉండేది కూడా లేదని, తాము ఇంకా ముందుకు పోతున్నామని



ఎంత చెప్పినా వారు వినలేదు. మదీనా బృందాన్ని చుట్టుముట్టారు. అత్యంత అమానుషంగా 70 మందిపై దాడికి పాల్పడ్డారు. 69 మంది అక్కడే మరణించారు. ఒకే ఒక్క వ్యక్తి కాబ్ బిన్ జైద్ ప్రాణాలతో, తీవ్రమైన గాయాలతో శవాల మధ్య స్పృహతప్పి పడిపోయారు. అలా బతికి బయటపడిన కాబ్ బిన్ జైద్ మదీనా తిరిగి వచ్చి జరిగిందంతా ప్రవక్త (స)కు వివరించారు. ఈ దుర్ఘటన తెలిసిన ప్రవక్త (స) నిర్ఘాంతపోయారు. ప్రత్యర్థులను ఆయన శపించింది బహుశా ఇదే మొదటిసారి. ఆయన తన ఉదయం ప్రార్థనల తర్వాత ఒక నెలరోజుల పాటు ఈ అమానుషానికి పాల్పడిన వారిని శపిస్తూ ఉన్నారు.

ఉహుద్ యుద్ధం చివరిలో అబూ సుఫ్యాన్ మళ్ళీ యుద్ధానికి వస్తామని సవాలు చేసి ఉన్నాడు. ఆ సవాలును నిలబెట్టుకోడానికి అబూ సుఫ్యాన్ 2000 కాల్బలంతో, 50 గుర్రాలతో యుద్ధానికి బయలుదేరాడు. ప్రవక్త ముహమ్మద్ (స) 1500 మంది సైన్యంతో 10 గుర్రాలతో బయలుదేరి బద్ర్ వద్ద ఎనిమిది రోజులపాటు విడిది చేశారు. కాని అది మక్కాలో కరువు కాలం. అందువల్ల అబూ సుఫ్యాన్ మక్కా నుంచి ఎక్కువ దూరం రాలేదు. జహ్రాన్ వరకు వచ్చి వెనుదిరిగి వెళ్ళిపోయాడు. ఎలాంటి పోరాటం లేకుండానే ప్రవక్త ముహమ్మద్ (స) మదీనాకు తిరిగి వచ్చారు. హిజ్రీ శకం నాలుగవ సంవత్సరం ముహర్రమ్ మాసంలో మరో వార్త వచ్చింది. బనీ గఫ్తాన్ తెగకు చెందిన బనీ మహారిబ్, బనీ తాలాబా వంశాలు దాడికి ఏర్పాట్లు చేసుకుంటున్నాయన్నది ఆ వార్త. ప్రవక్త (స) స్వయంగా 400 మంది లేదా 700 మంది సైనికులతో అక్కడికి వెళ్ళారు. శత్రువుల సైనికసేకరణను ఆయన అక్కడ గమనించారు. కాని శత్రువులు దాడికి ముందుకు రాలేదు. ఇక్కడ ఒక ఆసక్తికరమైన సంఘటన జరిగింది. శత్రు పంక్తుల నుంచి ఒక ముస్లిమేతరుడు గౌరస్ ప్రవక్తను ఎలాగైనా హతమార్చడానికి పూనుకున్నాడు. ప్రవక్త ముహమ్మద్ (స) ఒక చెట్టు క్రింద నీడన కూర్చుని విశ్రాంతి తీసుకుంటున్నప్పుడు, నెమ్మదిగా అక్కడికి చేరుకున్నాడు. ప్రవక్త (స) ఒంటరిగా ఉన్నారు. ప్రవక్త (స) ఖడ్గం చెట్టుకు వేలాడదీసి ఉంది. గౌరస్ తన కత్తిదూసి ప్రవక్త(స) ముందుకు వచ్చాడు. ప్రవక్త (స)తో "ఇప్పుడు ఎవరు నిన్ను కాపాడగలరు?" అన్నాడు. ప్రవక్త (స) నిర్భయంగా "దేవుడే రక్షకుడు" అన్నారు. ఈ జవాబు విని దాడికి వచ్చిన గౌరస్ అయోమయానికి గురయ్యాడు. అచేతనంగా చేతిలో కత్తి జారవిడిచాడు. అరబ్బు ప్రాంతంలో దుమతుల్ జిందాల్ ఒక కూడలి. వర్తకబృందాలకు ఇది కూడలి. ఇక్కడ యూద మతప్రచారకులు, రాజకీయ ఏజంట్లు ఎక్కువగా ఉండేవారు. ఖైబర్‌లో బనీ నాదిర్ తెగకు చెందిన

యూదులు నివసిస్తుండడం వల్ల ఈ ప్రాంతం శత్రువుల కుట్రలకు కేంద్రంగా మారింది. మదీనాకు వ్యతిరేకంగా కుట్రలు కుతంత్రాలకు ఈ ప్రదేశం వేదికయ్యింది. క్రయిస్తవ నాయకుడు ఉకాయిదిర్‌తో కలిసి ఖైబర్ యూదులు ఒక కుట్ర పన్నారు. మదీనాకు నిత్యావసరాలు తీసుకువచ్చే బిడారులపై దాడికి కుట్రపన్నారు. దుమతుల్ జిందాల్ వద్ద శత్రువులు సైన్యాన్ని సమీకరిస్తున్న వార్త ప్రవక్త (స)కు చేరింది. మదీనాపై దాడికి పథకం రచిస్తున్నట్లు తెలిసింది. హిజ్రీ శకం ఐదవ సంవత్సరంలో రబీవుల్ అవ్వల్ నెలలో ప్రవక్త(స) 1000 మంది సైనికులతో ఈ ప్రమాదాన్ని ఎదుర్కోడానికి బయలుదేరారు. కాని ప్రవక్త (స) సైన్యంతో వస్తున్నట్లు తెలుసుకుని శత్రువులు పారిపోయారు. ప్రవక్త(స) వారిని వెంటాడదలచుకోలేదు. అక్కడే ఉండి వివిధ తెగలతో ఒప్పందాలకు ప్రాముఖ్యం ఇచ్చారు. ఉబయ్యానా బిన్ హిస్న్‌తో ఒప్పందం చేసుకున్నారు. ఈ లోగా బనూ ముస్తలక్ తెగ మదీనాపై దాడికి ప్రయత్నాలు చేస్తున్న వార్త వచ్చింది. ఈ వార్తలోని వాస్తవాలు తెలుసుకోవడానికి ప్రవక్త (స) బురైదా అస్లమీని పంపించారు. వార్త నిజమేనని తెలిసింది. ప్రవక్త (స) తక్షణమే హుటాహుటిన అక్కడికి చేరుకున్నారు. మరిసి అనబడే ఒక నీటి ఊట ప్రాంతానికి ప్రవక్త (స) చేరుకునేసరికి శత్రువులు కూడా ముస్లిమ్ సైన్యాన్ని చూశారు. అకస్మాత్తుగా ముస్లిమ్ సైన్యం వారి ముందుకు వచ్చేసరికి అయోమయానికి గురై పలాయనం చిత్తగించారు. బనీ ముస్తలక్ తెగ నాయకుడు హారిస్ బిన్ జరార్ పోరాటానికి ఉవ్విళ్ళూరాడు కాని ఆయన తెగ మనుషులు చెల్లాచెదరయ్యారు. మొదటి దాడిలోనే చాలా మంది కాలికి బుద్ధి చెప్పారు. పెద్ద సంఖ్యలో పశువులు, భారీగా కొల్లసొత్తు ముస్లిమ్ సైన్యం స్వాధీనమయ్యాయి. శత్రుదళం బందీగా దొరికింది. అలా బందీలుగా దొరికిన వారిలో జువైరియా ఒకరు. ఆమె తర్వాత ఇస్లామ్ స్వీకరించారు. ప్రవక్త (స) ఆమెను వివాహమాడారు. ఆ తర్వాత యుద్ధ ఖైదీలందరినీ విడుదల చేయడం జరిగింది. ఎందుకంటే, జువైరియాను ప్రవక్త (స) వివాహమాడిన తర్వాత ఆ తెగతో ప్రవక్త (స)కు బంధుత్వ సంబంధం ఏర్పడింది. ప్రవక్త (స) బంధువులను ఖైదీలుగా నిర్బంధించడం తగదని ముస్లిములు వారందరిని విడుదల చేశారు.

మక్కా ప్రజలు బద్ర్ యుద్ధంలో తమ ఘోరపరాజయాన్ని మరిచిపోలేదు. ఉహుద్‌లో విజయం చేజార్చుకున్న సంఘటనను మరిచిపోలేదు. మదీనాపై నిర్ణయాత్మక దాడికి, మదీనాను నాశనం చేసే దాడికి ఏర్పాట్లు చేసుకుంటూనే ఉన్నారు. ఒక సంవత్సరం పాటు వారు ఏర్పాట్లు చేసుకుని దాడికి చేసిన ప్రయత్నం



మధ్యలోనే మానుకున్నారు. మక్కా నుంచి బయలుదేరి సగం దూరం వచ్చిన తర్వాత ఈ సంవత్సరం మంచిది కాదని, మరుసటి సంవత్సరం దాడి చేయాలని వెనక్కి వెళ్ళిపోయారు. ఈ విధంగా రెండు సంవత్సరాల పాటు మక్కాతో పోరాటం లేకుండా గడిచాయి. ఈ రెండు సంవత్సరాలు మదీనాలో ముస్లిములు బలపడడానికి అవకాశం ఇచ్చాయి. మదీనాపై దాడి మక్కాకు మరింత కష్టంగా మారింది. ముస్లిములు మదీనాలో ఏర్పరచుకున్న చిన్న రాజ్యం ఎన్ని కష్టాలు ఉన్నా, ఎన్ని ప్రమాదాలు ఉన్నా ప్రగతిపథాన ముందుకు సాగింది. రాజ్యం విస్తరించింది. మరోవైపు మక్కావారి వాణిజ్యమార్గాలు మూసుకుపోయాయి. ఫలితంగా ఖురైషులు తీవ్రమైన ఆర్థికసంక్షోభంలో పడ్డారు. భారీ స్థాయి దాడికి కావలసిన ఏర్పాట్లు ఖురైషులు స్వంతంగా చేసుకునే పరిస్థితి లేదు. అయితే ముస్లిమ్ రాజ్యానికి వివిధ కారణాల వల్ల శత్రువులుగా ఉన్న వివిధ తెగలన్నీ కలిశాయి. అన్ని తెగలు తమ వనరులను సమీకరించుకున్నాయి. ఖైబర్‌లోను, వాదివుల్ ఖురాలోను బహిష్కరణకు గురైన యూదులు ఇందులో చురుకైన పాత్ర పోషించాయి. మదీనాకు వ్యతిరేకంగా ఒక మహాసైన్యాన్ని ఏర్పాటు చేయడానికి ప్రయత్నాలు చురుకుగా జరిగాయి. మక్కాలో అబూసుఫ్యాన్ మదీనాపై మరో దాడికి ప్రయత్నాలు చేస్తున్నట్లు వీరికి తెలిసి మరింత సంతోషించారు. ఖైబర్‌లో పండే ఖర్జూరపు పంటలో సగం ఇస్తామని, భవిష్యత్తులోను పంటలో వాటా ఇస్తామని బనీ గఫ్తాన్ తెగను ప్రలోభపెట్టి యూదులు వారిని కూడా తమ వైపు తిప్పుకున్నారు. ఆ తర్వాత యూదులు ఒక ప్రతినిధి బృందాన్ని మక్కాకు పంపించారు. ఈ బృందంలో సలామ్ ఇబ్నే ఆబిల్ హకీక్, సలామ్ బిన్ మిష్కామ్, హుయాయ్ బిన్ అక్తాబ్, కినానా ఇబ్నుర్రాబీ (బనూ నాదిరి తెగ), హూజా బిన్ ఖైస్, అబూ అమ్మారా (బనూ వాయిల్ తెగ) వంటి ప్రముఖులు ఉన్నారు. ఈ బృందం మక్కా ఖురైషుల వద్దకు వెళ్ళి మదీనాపై దాడికి తమ పూర్తి సహకారం ఉంటుందని చెప్పింది. ప్రవక్త (స) అనుచరులను అందరిని సంపూర్ణంగా అణిచి వేసేవరకు తమ సహకారం కొనసాగుతుందని తెలిపారు. మక్కాలో ఈ బృందానికి సానుకూలమైన జవాబు లభించింది. ఆ తర్వాత ఈ బృందం ఇతర తెగల మద్దతు కూడగట్టుకోడానికి ప్రయత్నాలు తీవ్రం చేసింది. ఖురైషులు కూడా తమ మిత్రులను పిలుచుకున్నారు. అహాబిష్ తెగ మద్దతు సంపాదించుకున్నారు. చివరకు అబూసుఫ్యాన్ 4000 మంది సైనికులతో, 300 గుర్రాలతో, 1000 ఒంటెలతో మక్కా నుంచి మదీనాపై దాడికి బయలుదేరాడు. దారిలో బనూ సాలిమ్, బనూ అసద్, ఫజారా, అష్జా, బనూ ముర్రా తెగలు ఈ సైన్యానికి కలిశాయి. మరోవైపు బనూ గఫ్తాన్

తెగ కూడా ఉయాయినా బిన్ హిస్న్ నాయకత్వంలో బయలుదేరింది. ఆ విధంగా మదీనాపై దాడికి వచ్చిన సైన్యంలో దాదాపు పదివేలు.. లేదా పాతికవేల వరకు సైనికులున్నారని అంచనా. చాలా మంది పది వేలని భావిస్తున్నారు. అంటే మక్కా ఖురైషులకు పూర్తి అరేబియాలోని తెగలన్నీ మద్దతిచ్చాయి.

ఈ సైనిక సమీకరణల గురించిన వార్తలు ప్రవక్త (స)కు దూమతుల్ జందల్ వద్ద ఉన్నప్పుడు తెలిశాయి. ఆయన హుటాహుటిన మదీనా చేరుకున్నారు. సహచరులతో సమాలోచనలు జరిపారు. మదీనా నగరానికి రక్షణ ఏర్పాట్లు చేసుకోవాలని నిర్ణయించుకున్నారు. ఒక కందకం తవ్వి రక్షణ ఏర్పాట్లు చేయాలని హజ్రత్ సల్మాన్ ఫార్సీ చేసిన సూచనను అందరూ ఆమోదించారు. తక్షణం కందకం తవ్వే పని ప్రారంభమయ్యింది.

ప్రవక్త ముహమ్మద్ (స) స్వయంగా కందకాన్ని ఎలా తవ్వాలో పథకం రచించారు. నగరం ఉత్తరదిక్కున కందకం అవసరం. ఎందుకంటే మిగిలిన దిక్కులన్నీ ఇళ్ళతోను, అడ్డుగోడలున్న తోటలతోను రక్షణాత్మకంగా ఉన్నాయి. ఈ కందకం ఒక అర్ధవలయాకారంలో సలా కొండ వరకు తవ్వాలని నిర్ణయించారు. అయితే కొన్ని తెగలు ఈ కందకాన్ని మరింత దూరం వరకు తవ్వి తమ ఇళ్ళకు కూడా రక్షణ ఉండేలా చేసుకున్నాయి. వెయ్యిమంది స్వచ్ఛంద కార్యకర్తలు, సైనికవిధులు నిర్వర్తించేవారు ఈ పనికి నియుక్తులయ్యారు. వీరందరినీ బృందాలుగా విభజించారు. ఒక్కో బృందంలో పదిమంది ఉన్నారు. ప్రతి బృందం 20 గజాల పొడవు కందకం తవ్వాలి. మొత్తం కందకం పొడవు మూడున్నర మైళ్ళు. వెడల్పు దాదాపు పదిగజాలు. లోతు దాదాపు ఐదు గజాలు. ఇంత పెద్ద కందకాన్ని కేవలం మూడు వారాల కాలంలో తవ్వేశారు. చరిత్రలో ఇలాంటి సంఘటన మరొకటి మనకు కనబడదు. వారికి ఉన్న వనరులు చాలా తక్కువ. తవ్వడానికి కావలసిన పలుగు పార వంటి సాధనాలు కూడా అరువు తెచ్చుకోవలసిన పరిస్థితి. బనూ ఖురైజా తెగతో ఒప్పందం చేసుకుని వారి నుంచి పలుగు పారలు అరువు తెచ్చుకున్నారు. అంతేకాదు, తవ్విన మట్టిని ఎత్తిపారవేసే గంపలు కూడా వారి వద్ద లేవు. హజ్రత్ అబూబకర్ (రజి), హజ్రత్ ఉమర్ (రజి) వంటి ప్రముఖ సహచరులు తమ వస్త్రాల్లో మట్టిని ఎత్తుకుని బయటికి తెచ్చేవారు. కొన్ని కీలకమైన ప్రదేశాల్లో కందకం పొడవునా నిఘాకేంద్రాలు ఏర్పాటు చేశారు. ఈ తవ్వకం పనిలో ప్రవక్త ముహమ్మద్ (స) స్వయంగా పాల్గొన్నారని ప్రత్యేకించి చెప్పనవసరం లేదు. ఆయన కూడా ఇతరుల మాదిరిగానే ఒక కూలీలా



పనిచేశారు. కందకం తవ్వడం పూర్తయిన తర్వాత శత్రుదళాలు తండోపతండాలుగా రావడం మొదలయ్యింది. హిజ్రీ శకం 5వ సంవత్సరం షవ్వాల్ మాసంలో శత్రు దళాలు అక్కడికి చేరుకున్నాయి. మదీనాలో ఉన్న వివిధ తెగలు కందకం చుట్టు నిఘాకేంద్రాల వద్ద తమకు నిర్దేశించిన సైనికవిధుల్లో అప్రమత్తంగా ఉన్నాయి. సలా కొండకు పక్కన ముస్లిముల ప్రధాన సైన్యం అప్రమత్తంగా ఉంది. ప్రవక్త (స)కు ప్రత్యేకించిన శిబిరం పక్కనే ఒక మస్జిదును కూడా నిర్మించారు. అదే మస్జిదె ఫతా అంటే విజయాల మస్జిదు.. ఇప్పటికి కూడా చూడొచ్చు.

## ముట్టడి

శత్రుసైన్యం భారీగా ఉన్నప్పటికీ వారికి ఈ కందకం గురించి తెలియదు. యుద్ధంలో కందకంతో రక్షణ ఏర్పాట్ల గురించి వారికి అవగాహన లేదు. ఇలాంటి ప్రతిఘటన వారికి ఎన్నడూ ఎదురుకాలేదు. వారి గుర్రాలు, ఒంటెలు కందకం వరకు మాత్రమే రాగలిగాయి కాని దాన్ని దాటలేకపోయాయి. ఆ కందకాన్ని లంఘించాలని ప్రయత్నించిన అశ్వికదళంలోని ఇద్దరు ముగ్గురు కందకంలో పడిపోయారు. శత్రుదళం కందకాన్ని దాటాలని ప్రయత్నించిన ప్రతిచోట నిఘా కేంద్రాల వద్ద ఉన్న ముస్లిమ్ విలుకాండ్రు శరపరంపర కురిపించారు. శత్రువులు తప్పనిసరిగా వెనక్కి తగ్గవలసి వచ్చింది. కందకం వల్ల శత్రువుల వద్ద ఉన్న కరవాలాలు, ఈటెలు ఎందుకూ పనికిరానివిగా మారిపోయాయి. ఇరుపక్షా ١ కేవలం బాణాలపైనే ఆధారపడ్డాయి. ఇరువైపుల నుంచి బాణాల వర్షం కురిసింది. కందకాన్ని దాటడానికి, దాడి చేయడానికి వివిధ చోట్ల శత్రువులు ప్రయత్నించారు కాని విఫల మయ్యారు. ఇలా ముట్టడి కొన్ని రోజులపాటు కొనసాగింది. శత్రుదళంలో ఉన్న ప్రముఖ కుస్తీయోధుడు, అశ్వికదళంలో సైనికుడు అమ్ర్ బిన్ అబ్ద్ వుద్ కొందరితో కలిసి కందకం వెడల్పు తక్కువగా ఉన్న ప్రదేశంలో ఎలాగో దాటి ముందుకు వచ్చాడు. కందకం దాటి రాగానే అబ్ద్వుద్ ముస్లిములను సవాలు చేశాడు. హజ్రత్ అలీ (రజి) ముందుకు వచ్చి ద్వంద్వయుద్ధానికి దిగారు. అబ్ద్వుద్ ఆయన్ను గాయపరిచాడు. గాయంతో చెలరేగిపోయిన హజ్రత్ అలీ (రజి) వాడిని పరిమార్చారు. ఆ రోజు శత్రుదాడి చాలా తీవ్రంగా ఉంది. శత్రువులు కందకం దాటకుండా అడ్డుకోవడం కష్టంగా మారింది. ముస్లిములు ఆరోజు చేయవలసిన ప్రార్థనలు ఐదింటిలో నాలుగు ప్రార్థనలు ఆలస్యంగా చేసుకోవలసి వచ్చింది. రోజుల తరబడి సాగుతున్న ముట్టడి ముస్లిములకు చాలా కఠినంగా మారింది. అయితే ఈ ముట్టడిని కొనసాగించడం

శత్రువులకు కూడా అంతే కఠినంగా ఉంది. మదీనాను ఎలా దెబ్బతీయాలా అని శత్రువులు సమాలోచనలు జరిపారు. ముస్లిములతో ఒప్పందం చేసుకున్న బనూ ఖురైజా తెగకు నచ్చచెప్పి ఒప్పందాన్ని ఉల్లంఘించేలా చేయాలనుకున్నారు. ఈ కార్యభారం హుయాయ్ బిన్ అక్తబ్ తన భుజాలపై వేసుకున్నాడు. బనూ ఖురైజా తెగ నాయకుడు కాబ్ బిన్ అసద్ వద్దకు వెళ్ళాడు. ప్రవక్త (స)తో చేసుకున్న ఒప్పందాన్ని తెంచుకోవాలని కోరాడు. మొదట కాబ్ అంగీకరించలేదు. ప్రవక్త (స) ఎల్లప్పుడు తాను ఇచ్చిన మాటకు కట్టుబడేవారని, అలాంటి వారితో చేసుకున్న ఒప్పందాన్ని ఉల్లంఘించడం సముచితం కాదన్నాడు. కాని అక్తబ్ అతనితో వాదించాడు, యావత్తు అరేబియా తమతో ఉందని, మొత్తం అరేబియా ప్రవక్త రక్తాన్ని కళ్ళచూడాలను కుంటోందని, ఇస్లామ్‌ను నిర్మూలించే సమయం వచ్చిందని, ఈ అవకాశాన్ని వదులుకోరాదని వాదించాడు. అక్తబ్ వాగ్ధాటి పని చేసింది. బనూ ఖురైజా నాయకుడు మెత్తబడ్డాడు. ముస్లిములతో చేసుకున్న ఒప్పందాన్ని ఉల్లంఘించి వారిపై వెనుకనుంచి దాడి చేయడానికి సిద్ధమయ్యాడు. ఇది నమ్మకద్రోహం. ఈ విషయం గురించి ప్రవక్త (స)కు తెలిసింది. ఈ వార్త తెలిసిన తర్వాత ఆయన చెప్పిన మాట "దేవుడు అత్యున్నతుడు. మనకు దేవుడే చాలు. ఆయనే వ్యవహారాలను అత్యుత్తమంగా పరిష్క రించేవాడు"

**"మాకు అల్లాహ్ చాలు. ఆయనే శ్రేష్ఠుడైన కార్యసాధకుడు"**

***(దివ్యఖుర్ఆన్ 3 : 173)***

యుద్ధరంగంలో భీకర పరిస్థితులు, సుదీర్ఘంగా కొనసాగుతున్న ముట్టడి, నిద్రలేని రాత్రులు వీటికి తోడు ముస్లిం సైన్యంలో ఉన్న కపటులు నెమ్మదిగా జారుకోవడం, తమ ఇళ్ళకు రక్షణ లేదన్న సాకు చూపించి వెనక్కి వెళ్ళిపోవడం ఇవన్నీ ముస్లిములకు కఠినపరీక్షలుగా మారాయి. ఈ లోగా బనూ ఖురైజా కూడా ఒప్పందాన్ని ఉల్లంఘించి శత్రువులతో చేతులు కలిపిందన్న వార్త తెలిసింది. బనూ ఖురైజాలో 2000 మంది పోరాడేయోధులున్నారు. వారంతా ఇప్పుడు ముస్లిములను మోసగించి వారిపై దాడికి సిద్ధంగా ఉన్నారు. ఈ పరిస్థితిలో నామమాత్రంగా వనరులున్న 3000 మంది ముస్లిముల సైన్యం ఎలాంటి భావాలకు గురై ఉంటుందో అర్థం చేసుకోవచ్చు. అబూబక్ర్ (రజి) మాటల్లో చెప్పాలంటే "ఈ వార్త తెలిసి మా ఇళ్ళలో వదిలేసి వచ్చిన మా మహిళలు, పిల్లల భద్రత విషయంలో చాలా ఆందోళనకు గురయ్యాము. సలా కొండ ఎక్కి మాటి మాటికి చూసేవాళ్ళం. ఏమైనా జరుగుతుందా



అని. ఎలాంటి అవాంఛిత దృశ్యాలు లేకపోవడం చూసి దేవుడికి కృతజ్ఞతలు చెల్లించు కునేవాళ్ళం." ప్రవక్త (స) 300 మంది సైనిక దళాన్ని మదీనాలో రక్షణకు పంపిం చారు. ఈ పరిస్థితిని దివ్యఖుర్ఆన్ క్రింది విధంగా వర్ణించింది.

**"శత్రువులు మీ మీదకు పై నుండీ, క్రింది నుండి దండెత్తి వచ్చినప్పుడు, భయం వల్ల మీ కళ్ళు తేలగిల్లినప్పుడు మీ గుండెకాయలు గొంతుల్లోనికి వచ్చినప్పుడు, మీరు అల్లాహ్‌ను గురించి రకరకాలుగా అనుమానిస్తున్నప్పుడు, ఆ సమయంలో విశ్వాసులు కఠిన పరీక్షకు గురి అయ్యారు. తీవ్రంగా ఊపి వేయబడ్డారు."** ***(దివ్యఖుర్ఆన్ 33 :10)***

అంతకు ముందు జరిగిన రెండు యుద్ధాల్లో ముస్లిములకు ఇలాంటి కఠినమైన పరీక్ష ఎదురుకాలేదు. ఉహుద్ యుద్ధంలో వారికి చాలా కష్టాలు ఎదురైనా కేవలం ఒక్క రోజులోనే అంతా ముగిసింది. కాని ఇప్పుడు ఇది సుదీర్ఘ ముట్టడి. ఎడతెగని కఠినపరిస్థితులు. ఇప్పుడు దాడికి వచ్చింది కేవలం ఖురైషులు మాత్రమే కాదు, అనేక తెగలు వారితో కలిసి ఉన్నాయి. ఈ కఠినపరిస్థితిలో ప్రవక్త (స) ఒక పథకం ఆలోచించారు. ముట్టడికి వచ్చిన కొన్ని తెగలతో మాట్లాడి వారు వెనుదిరిగేలా ఒప్పించాలనుకున్నారు. ఆ విధంగా శత్రుసైన్యం సంఖ్యాబలాన్ని తగ్గించాలను కున్నారు. ఆయన బనూ గప్తాన్ తెగతో సంప్రదింపులు జరిపారు. బనూ గప్తాన్ తమ ఆర్థిక ప్రయోజనాలకు అన్నింటికన్నా ఎక్కువ ప్రాధాన్యం ఇచ్చే తెగ. బనూ గప్తాన్ నాయకులు ఉయైనా బిన్ హిస్న్, హారిస్ బిన్ ఔఫ్‌లకు ప్రవక్త (స) కబురు పంపారు. వారితో చర్చల్లో ఒక ఒప్పందం కుదిరింది. మదీనా వ్యవసాయ ఉత్పత్తిలో మూడోవంతు ఇస్తే ముట్టడి నుంచి విరమించుకుంటామని వారు అన్నారు. ఒప్పంద పత్రం సిద్ధమయ్యింది. దానిపై సంతకాలు జరగవలసి ఉంది. సంతకం చేయడానికి ముందు ప్రవక్త(స) సాద్ బిన్ మాజ్, సాద్ బిన్ ఉబదాలతో సంప్రదిం చారు. వీరిద్దరు మదీనా లోని ప్రముఖ తెగలు ఔస్, ఖజ్‌రజ్ తెగల ప్రతినిధులు. మదీనాను ఒక భారీ సైన్యం చుట్టుముట్టి ఉందని, ఈ ముట్టడి నుంచి బయట పడడానికి ఇదే మార్గమని వారికి నచ్చచెప్పారు. కాని ఆ ఇద్దరు ఒప్పందం షరతులను విన్న తర్వాత తీవ్ర అసమ్మతి తెలియజేశారు. "మేము అవిశ్వాసులుగా ఉన్నప్పుడు ఎన్నడూ వీళ్ళు మా సంపదను ఈ విధంగా దోచుకోలేదు. నేడు మేం విశ్వాససంపద పొందిన వాళ్ళం. ఇస్లామ్ వెలుగును పొందాము. ఇంతకు ముందు కన్నా శక్తిమంతులమయ్యాం. మా సంపదను ఎన్నటికీ ఈ విధంగా అప్పజెప్పలేము. దేవుడి తోడు. ఇలా చేయడం ఎన్నటికీ సాధ్యం కాదు. ఇలాంటి రాజీ మనకు

అక్కర్లేదు." అన్నారు. ఈ మాటలు విని ప్రవక్త (స) చాలా సంతోషించారు. ఒప్పందం ప్రతిని హజ్రత్ మాజ్‌కు ఇచ్చారు. ఆయన దాన్ని చించి ముక్కలు చేశారు.

అది ముస్లిములకు చాలా క్లిష్టమైన పరిస్థితి. ఈ కఠిన పరిస్థితిలో దేవుని సహాయం లభించింది. శత్రువుల పంక్తుల నుంచి నుయామ్ బిన్ మసూద్ అనే వ్యక్తి ప్రవక్త (స) వద్దకు చేరుకున్నాడు. తాను ఇస్లామ్ స్వీకరించినట్లు ప్రకటించాడు. అయితే తాను ఇస్లామ్ స్వీకరించిన విషయం ఇతరులకు తెలియదని అన్నాడు. ప్రవక్త ముహమ్మద్ (స)కు అభ్యంతరం లేనట్లయితే తాను ఖురైషులతోనే ఉంటానని అన్నాడు. ప్రవక్త (స) అనుమతితో అతను బనూ ఖురైజా వద్దకు వెళ్ళాడు. వారితో మాట్లాడుతూ, తాము విజయం సాధిస్తే అంతా బాగానే ఉంటుంది కాని ఒకవేళ ఖురైషులు ఓడిపోతే బనూ గఫ్తాన్ తదితర తెగలన్నీ పారిపోతాయని, అప్పుడు బనూ ఖురైజా ఒక్కటే ప్రవక్త (స)ను ఎదిరించే పరిస్థితి ఉంటుందని అన్నాడు. కాబట్టి ఖురైషులతోను, బనూ గఫ్తాన్ తెగతోను మాట్లాడి, ఆ తెగలకు చెందిన కొందరిని బనూ ఖురైజా తమ వద్ద పిలుచుకోవాలని, ఆ విధంగా వారు పారిపోయే అవకాశం ఉండదని, దీనికి వారు అంగీకరిస్తే బాగుంటుందనీ, లేకపోతే బనూ ఖురైజా ఈ యుద్ధంలో వారికి సహాయపడడం మంచిది కాదని చెప్పాడు. ఆ తర్వాత నుయామి ఖురైషుల వద్దకు వెళ్ళాడు. తాను కొన్ని ముఖ్యమైన వార్తలు తెలుసుకున్నానని, వాటిని ఖురైష్ నాయకులకు చెప్పడం తన బాధ్యతగా భావిస్తున్నానని అన్నాడు. ఆ వార్తలేమంటే, బనూ ఖురైజా తెగ నాయకుడు మనసు మార్చుకున్నాడని, ఖురైషుల నుంచి కొందరిని తన వద్ద బందీలుగా ఉంచుకోవాలనుకుంటున్నాడని చెప్పాడు. ఈ వార్త విని ఖురైషులు వెంటనే బనూ ఖురైజాకు వర్తమానం పంపించారు. సుదీర్ఘంగా కొనసాగుతున్న ముట్టడితో విసిగిపోయామని, బనూ ఖురైజా ముందుకు వస్తే సమైక్యంగా బలమైన దాడి చేయవచ్చని తెలియజేశారు. అప్పటికీ నుయామీ మాటల ప్రభావంవల్ల బనూ ఖురైజా నాయకుడు దాడికి ముందు తన వద్ద కొందరు ఖురైషులు ఉండాలని చెప్పాడు. దీంతో ఖురైషులకు నుయామీ చెప్పింది నిజమేనన్న నమ్మకం కలిగింది. బనూ ఖురైజా సహాయం చేస్తుందన్న ఆశ వదులుకున్నారు. ఈ పరిణామంతో మొత్తం పరిస్థితి మారిపోయింది. ముట్టడి కొనసాగించడం ఖురైషులకు చాలా కష్టంగా మారింది. వారు తమ ఇళ్ళు వదిలి సంవత్సరంపైగా గడిచిపోయింది. వారి వ్యాపారాలు దెబ్బతిన్నాయి. భారీ ఖర్చులు భరించవలసి వచ్చింది. ఇంత చేసినా ఫలితం కనబడడం లేదు. పైగా భారీ సైన్యానికి నిత్యావసర వస్తువులు, ఆహార పదార్థాలు, పశువులకు మేత సమకూర్చడం మామూలు విషయం కాదు.



పైగా చలికాలం రావడంతో వాతావరణం కూడా చాలా కఠినంగా మారిపోయింది. ఈ లోగా వచ్చిన ఒక ప్రకృతి విపత్తు వారి కష్టాలు మరింత పెంచింది. హఠాత్తుగా ఒక రాత్రి తీవ్రమైన ఈదురుగాలులు వీచాయి. దాంతో వారి శిబిరాలు ఎగిరిపోయాయి. శిబిరాలకు కట్టిన తాళ్ళు తెగిపోయాయి. వంటపాత్రలు, సామగ్రి అంతా గాలికి చెల్లాచెదరయ్యింది. పశువులు కట్లు తెంచుకుని పారిపోయాయి. వారి పోరాట స్ఫూర్తి అణగారిపోయింది. శత్రుశిబిరంలో తీవ్ర గందరగోళం, అయోమయం నెలకొంది. పరిస్థితి గమనించిన అబూసుఫ్యాన్ తక్షణం వెనక్కితిరగాలని నిర్ణయించుకున్నాడు. ఈ విధంగా వచ్చిన దైవికసహాయం గురించి దివ్యఖుర్‌ఆన్ క్రింది విధంగా ప్రకటించింది.

> **"విశ్వసించిన ఓ ప్రజలారా! అల్లాహ్ మీకు (ఈ మధ్యనే) చేసిన ఉపకారాన్ని జ్ఞాపకం తెచ్చుకోండి. సైన్యాలు మీపైకి దండెత్తి వచ్చినపుడు, మేము వాటీ మీదకు ఒక పెను గాలిని పంపాము. మీకు కానరాని సైన్యాలను పంపాము."**
>
> ***(దివ్యఖుర్‌ఆన్ 33 : 9)***

యుద్ధమైదానం ఖాళీ అయ్యింది. శత్రుదళాలు వెనక్కివెళ్ళిపోయాయి. ప్రవక్త (స) ఊపిరి పీల్చుకున్నారు. "ఖురైషుల ఆక్రమణ ముగిసిందని" ప్రకటించారు. ఆ విధంగా బద్ర్‌లోను, ఉహుద్‌లోను తమ బలాన్ని పరీక్షించుకున్న ఖురైషులు మరోసారి అన్ని శక్తులు కూడగట్టుకుని కూడా యావత్తు అరేబియా నుంచి మద్దతు పొంది కూడా ఫలితాలు సాధించలేకపోయారు. భవిష్యత్తులో విజయం సాధించగలమన్న నమ్మకాన్ని కూడా కోల్పోయారు.

ఈ యుద్ధంలో మరణించిన వారి సంఖ్య చాలా తక్కువ. కేవలం ఆరుగురు ముస్లిములు మాత్రమే అమరగతి పొందారు. వారిలో సాద్ బిన్ మాజ్ (రజి) వంటి ప్రముఖులు కూడా ఉన్నారు. శత్రువుల బాణం వల్ల ఆయనకు తీవ్రమైన గాయమైంది. కొన్ని రోజుల తర్వాత ఆ గాయం వల్ల మరణించారు.

ఈ యుద్ధంలో అతిముఖ్యమైన విషయం కందక తవ్వకం. ఈ కందకం తవ్వకపు పనుల్లో పాల్గొన్న ముస్లిములు క్రింది వాక్యాలు పఠిస్తూ ఆ పని చేశారు

"మేము ముహమ్మద్ (స) కోసం ప్రతిజ్ఞ చేసిన వాళ్ళం

జీవితం ముగిసే వరకు ధర్మం కోసం పోరాడుతామని ప్రతిజ్ఞ చేశాం..

అంతేకాదు..

శత్రుదళాలు మాపై దాడి చేశాయి. సత్యమార్గంలో మమ్మల్ని అడ్డుకోవాలను కుంటున్నాయి. కాని మేము తలవంచం." అని పాడేవారు. ఆ వెంటనే మేము తలవంచం అని బిగ్గరగా అందరూ పలికేవారు. ఈ పిలుపులు ఎల్లెడలా అలుముకుని, ప్రతిధ్వనిస్తూ వారి ధైర్యస్థయిర్యాలను, పట్టుదలను పెంచేవి. తవ్వకం కోసం ఏర్పడిన పదిమంది సభ్యుల బృందాలు కష్టించి పని చేశాయి. ఒక బృందంలో స్వయంగా ప్రవక్త (స) పనిచేశారు. ఆయన తన ఇల్లు వదిలి, తవ్వకం జరుగుతున్న ప్రదేశంలోనే గుడారం వేయించుకున్నారు. తవ్వకం పనిలో తాను కూడా చురుకుగా పాల్గొన్నారు. తవ్విన మట్టిని పారబోయడం, రాళ్ళు పగులగొట్టడం వంటి పనులు చేస్తూ అందరి కన్నా ఎక్కువగా కష్టపడేవారు. ప్రవక్త (స)తో పాటు అదే బృందంలో తవ్వకం పని చేసిన హజ్రత్ సల్మాన్ కథనం ప్రకారం కందకం తవ్వుతున్నప్పుడు ఒక బండశిల పగలడం లేదు. దాన్ని పగులగొట్టడానికి అందరూ ప్రయత్నించి విఫలమయ్యారు. చివరకు ప్రవక్త (స) దాన్ని మూడు దెబ్బలతో పగులగొట్టారు. ఈ మూడు దెబ్బలు కొడుతున్నప్పుడు ఆయన చెప్పిన మాటలు ఇక్కడ గమనించదగ్గవి. మొదటి దెబ్బ వేస్తున్నప్పుడు ఆయన ఎమన్ రాజ్యం మన వశమైంది అన్నారు. రెండవ దెబ్బ వేస్తున్నప్పుడు సిరియా, అల్ మగ్‌రిబ్ మనకు తలవంచాయి అన్నారు. మూడవ దెబ్బ వేస్తున్నప్పుడు ఈరాన్ మన స్వాధీనమైంది అన్నారు. ఈ భవిష్యవాణులు గమనిస్తే ప్రారంభం నుంచి ప్రవక్త (స)కు తన గొప్ప ఉద్యమం సాధించే అంతిమ లక్ష్యాల గురించి పూర్తి అవగాహన ఉందని తెలుస్తుంది. దైవిక వాక్యాల ద్వారా ఆయన ప్రోత్సాహం, ప్రేరణ పొందేవారు.

ముస్లిములకు ఉన్న వనరుల కొరత గురించి మనం ఇంతకు ముందే మాట్లాడు కున్నాం. తవ్వకపు పనిముట్లు వారివద్ద లేవు. తవ్విన మట్టి పారేయడానికి గంపలు కూడా లేవు. వీటిన్నింటికి మించి ఆహారపదార్థాల కొరత కూడా తీవ్రంగా ఉండేది. మూడువేల మంది తవ్వకం పనిలో మూడు వారాల పాటు పనిచేశారు. ఆ తర్వాత మరో రెండు మూడు వారాలు ముట్టడి, యుద్ధం కొనసాగాయి. ఈ కాలంలో వ్యాపార కార్యకలాపాలు, ఉపాధి కార్యకలాపాలు ఏవీ లేవు. తీవ్రమైన ఆర్థిక సంక్షోభం వచ్చిపడింది. కందకం పనిలో చెమటోడ్చుతున్న ముస్లిమ్ సైనికులు ఒక్కోసారి మూడు రోజులపాటు పస్తులు ఉండేవారు. వారి నాయకుడు కూడా ఇవే పరిస్థితు లను తట్టుకోవడం చూసి వారు ఆకలిదప్పులను సునాయాసంగా భరించారు. ఆహార కొరత విషయానికి వస్తే ప్రవక్త (స) పస్తులున్నది ఎక్కువ. ఆకలిని తట్టుకోవ డానికి పొట్టపై రాళ్ళు పెట్టి కట్టుకునేవారు. అనుచరులు తమ పొట్టపై కట్టిన రాతిని



ప్రవక్త (స)కు చూపిస్తే, ఆయన తాను అలాగే కట్టుకున్న రెండు రాళ్ళను చూపించే వారు. అంతకు ముందు జరిగిన రెండు యుద్ధాల అనుభవం ముస్లిమ్ సైన్యంలో గొప్ప క్రమశిక్షణను అలవరిచింది. యుద్ధం జరుగుతున్నంత కాలం నిర్దేశిత విధుల్లో నియమించబడిన వారెవ్వరూ చివరి రోజు వరకు తమ స్థానాలు వదిలిపెట్టలేదు. యుద్ధంలో బనూ గఫ్తాన్‌తో ఒప్పందం కోసం ప్రయత్నించడం అన్నది కొన్ని సందర్భాల్లో వ్యూహాత్మకంగా వెనుకడుగు వేయడం అవసరమన్న విషయాన్ని సూచిస్తుంది. అలా వ్యూహాత్మకంగా వెనక్కితగ్గడానికి అనుమతి ఉందని అర్థం అవుతుంది. అయితే ఈ ఒప్పందానికి ముందు ప్రవక్త (స) అన్సారులతో సంప్రదించడాన్ని గమనిస్తే, రాజ్యవ్యవహారాల్లో అందరితోను సంప్రదింపులకు ఉన్న ప్రాముఖ్యం తెలియవస్తోంది. అలాగే ఖురైషులకు బనూ ఖురైజా సహాయం లభించకుండా చూడ్డానికి నుయామీ చేసిన ప్రయత్నాన్ని గమనిస్తే యుద్ధంలో ఇలాంటి ఎత్తుగడలకు అనుమతి ఉందన్నది కూడా అర్థం అవుతుంది. నుయామీ ఎక్కడా ఎవరితోను ఒక్క అబద్ధం చెప్పలేదు. ఆయన ఎలాంటి నైతికవిలువలను అతిక్రమించలేదు. అయినా మిత్రభేదాన్ని సాధించాడు. ఈ ముట్టడి సందర్భంగా ముస్లిమ్ మహిళలు కోటల్లో ఉన్నప్పటికీ వారు కూడా అత్యున్నత విధులు నిర్వర్తించారు. ఉన్నత వ్యక్తిత్వాన్ని ప్రదర్శించారు. రాషిదా అనబడే మహిళ గాయాలకు కట్లుకట్టే సామగ్రితో యుద్ధరంగానికి వెళ్ళి గాయపడిన వారికి సేవలం దించారు. హజ్రత్ మాజ్ (రజి) గాయానికి కూడా ఆమె కట్టుకట్టారు. మహిళలున్న కోట వద్ద ఒక యూదుడు చొరబడడానికి ప్రయత్నించాడు. ఆ కోటలోనే ప్రవక్త(స) మేనత్త హజ్రత్ సఫియా ఉన్నారు. అనారోగ్యం వల్ల యుద్ధరంగానికి వెళ్ళకుండా కోటలోనే ఉన్న హజ్రత్ హసన్‌ను పిలిచి ఆ యూదుడిని అడ్డుకొమ్మన్నారు. కాని హజ్రత్ హసన్ సిద్ధంగా లేకపోవడాన్ని గమనించి ఆమె స్వయంగా కత్తిపట్టారు. వాడి తల నరికి కోట బయటకు విసరేశారు. ఆ తర్వాత శత్రుదళంలో ఎవ్వరు ఆ కోట పరిసరాలకు రాలేదు. మరో కోటలో హజ్రత్ ఆయెషా (రజి)తో పాటు మాజ్ తల్లిగారు కూడా ఉన్నారు. ఆమె అడుగుల చప్పుడు విని ఎవరో చూడ్డానికి బయటకు వచ్చారు. హజ్రత్ మాజ్ చేతిలో ఆయుధంతో యుద్ధరంగం వైపు పాడుకుంటూ పరుగెత్తుతున్నారు.

"కాస్త నెమ్మదిగా వెళదాం... మరో యువకుడ్ని యుద్ధంలో పాల్గొననిద్దాం
చావు ఇంటి గుమ్మం ముందే ఉన్నప్పుడు చావుకు భయం ఎందుకు"

అని పాడుకుంటూ వెళుతున్న కుమారుడి గొంతు విన్న మాజ్ తల్లిగారు బిగ్గరగా "అబ్బాయి.. త్వరగా పరుగెత్తు ...ఇప్పటికే చాలా ఆలస్యం చేశావు" అన్నారు.

ముస్లిములు గుడ్డిగా ఇతరుల పద్ధతులను, సంప్రదాయాలను పాటించరాదని, తమ స్వంత సంస్కృతి సంప్రదాయాలు నిర్మించుకోవాలని ప్రవక్త (స) చెప్పేవారు. అయితే ఈ యుద్ధంలో కందకం నిర్మించాలన్న ప్రతిపాదన వచ్చినప్పుడు, అరబ్బు భూభాగంలో ఇలాంటి ప్రతిఘటనా పద్ధతులు లేకపోయినా ఇతరుల నుంచి కొత్త పద్ధతులు, కొత్త నైపుణ్యాలు గ్రహించడాన్ని ప్రోత్సహిస్తూ ఆ ప్రతిపాదనను ఆమోదించారు.

ఈ యుద్ధం ఇస్లామీయ చరిత్రలో కందక యుద్ధంగా పేరుపడింది. కందక యుద్ధం తర్వాత రెండు సంవత్సరాల వరకు చిన్న చితక సైనికచర్యలు, రాజకీయ పరిణామాలు చోటుచేసుకున్నాయి. బనూ ఖురైజా తెగకు చెందిన యూదులు నైతికంగా అత్యంత పతనాన్ని ప్రదర్శించారు. వారు ఇస్లామీయ రాజ్యం మదీనాకు చెందిన పౌరులే అయినప్పటికీ, ముస్లిములతో ఒప్పందాలు ఉన్నప్పటికీ ఎల్లప్పుడు కుట్రలు కుతంత్రాలు పన్నుతూ వచ్చారు. కందక యుద్ధంలో శత్రువులతో చేతులు కలుపడం తీవ్రమైన నమ్మకద్రోహం. ఈ నమ్మకద్రోహాన్ని ఏ రాజ్యమూ భరించదు. నిజానికి ఇది రాజ్యద్రోహం. అలాంటి వారికి తగిన శిక్ష విధించవలసిన అవసరం ఉంది. కందక యుద్ధం ముగిసి మక్కా సైన్యం వెనక్కి మరలిపోయిన తర్వాత ప్రవక్త (స) మదీనాకు వచ్చి, కవచం విప్పి స్నానం చేసిన వెంటనే ఆయనకు దైవాదేశాలు అవతరించాయి. బనూ ఖురైజాపై తక్షణం సైనికచర్య తీసుకోవాలని దైవికాదేశాలు వచ్చాయి. అప్పటికి చాలా మంది ముస్లిములు ఇంకా సైనికదుస్తుల్లోనే ఉన్నారు. వారందరిని ఈ సైనిక చర్యకు పిలువడం జరిగింది. ఈ సైన్యం తక్షణం బనూ ఖురైజా కోటను ముట్టడించింది. ఈ ముట్టడి 25 రోజుల వరకు కొనసాగింది. కోటలో ఉన్న యూదులు కోటపైకి ఎక్కి ప్రవక్త (స)ను దూషిస్తూ అసభ్యంగా మాట్లాడసాగారు. చివరకు వారు ఓటమికి గురికాక తప్పలేదు. వారి నాయకుడు కాబ్ బిన్ అసద్ సంధి ప్రస్తావనలు తెచ్చాడు. అనేక ప్రతిపాదనలు చేశాడు. కాని ఆ ప్రతిపాదనలన్నీ తిరస్కరించబడిన తర్వాత ఎలాంటి షరతులు లేకుండా వారు లొంగిపోయారు. ఆ తెగవారితో కొన్ని చర్చలు జరిగాయి. తమకు మధ్యవర్తిగా సాద్ బిన్ మాజ్ ఉండాలని వారు కోరారు. సాద్ బిన్ మాజ్ తీసుకునే నిర్ణయాన్ని ఒప్పుకుంటామని అన్నారు. ఇక ఈ వ్యవహారాన్ని సాద్‌బిన్ మాజ్‌కు వదిలేశారు



ప్రవక్త (స). సాద్ బిన్ మాజ్ యూద గ్రంథం ప్రకారం ఈ నమ్మకద్రోహానికి శిక్ష ప్రకటించారు. తెగలోని పోరాటయోధులందరిని హతమార్చాలన్నదే యూదగ్రంథం ప్రకారం ఇలాంటి నమ్మకద్రోహానికి శిక్ష. ఆ విధంగా ఒక జిత్తులమారి శత్రువర్గం రాజకీయ శక్తి పీచమణచడం జరిగింది. బనూ ఖురైజా నమ్మకద్రోహం, ఆ తర్వాత వారికి విధించిన శిక్షల విద్వేష వాతావరణంలోనూ బనూ ఖురైజాకు చెందిన ఒక వ్యక్తి ప్రవక్త (స) వద్దకు వచ్చి ఇస్లామ్ స్వీకరించాడు. బనూ ఖురైజాకు చెందిన ఉమర్ బిన్ సాద్ ఇస్లామ్ స్వీకరించి ముస్లిమ్‌గా మారాడు. ఆ తర్వాత కొన్ని రోజులకు మదీనాపై దాడికి వివిధ తెగలను ఏకం చేసిన టక్కరి, జిత్తులమారి అబూ రాఫే అబ్దుల్లా బిన్ అబీ హకీక్‌ను ఖజరజ్ తెగకు చెందిన యువకుడు హతమార్చాడు.

ముహమ్మద్ బిన్ ముస్లిమా నాయకత్వంలో 30 మంది సైనికులున్న అశ్విక దళం మదీనా సరిహద్దుల పహరా కాస్తున్నప్పుడు వారికి నజ్ద్ ప్రాంతానికి చెందిన నాయకుడు తమామా బిన్ అతల్ పట్టుబడ్డాడు. తమామా మదీనా వైపు వెళ్ళడాన్ని చూసి ఈ బృందం అతడిని పట్టుకుంది. ప్రవక్త (స) ముందు ప్రవేశపెట్టింది. తమామా ప్రవక్త (స)తో "ఓ ముహమ్మద్ ! నీవు నన్ను చంపితే, చంపదగిన వాడిని చంపినట్లే, కాని నన్ను వదిలేస్తే ఒక మనిషి కృతజ్ఞతలు నీకు లభిస్తాయి. నీవు పరిహారం కోరుతున్నట్లయితే ఎంత కావాలో చెబితే అంతా ఇచ్చేస్తా"మన్నాడు. ప్రవక్త (స) అతడిని మర్యాదపూర్వకంగా వదిలేశారు. విశాల హృదయంతో ప్రవక్త(స) తీసుకున్న ఈ నిర్ణయం అతడిపై గొప్ప ప్రభావం వేసింది. వెంటనే ఇస్లామ్ స్వీకరించాడు. "ఇప్పటి వరకు నేను మీ ముఖాన్ని చాలా ద్వేషించాను. కాని నేటి నుంచి నేను అత్యధికంగా ప్రేమిస్తున్నాను" అని ప్రకటించాడు. తమామా ఇస్లామ్ స్వీకరించడం వల్ల రాజకీయంగా అత్యంత ముఖ్యమైన నజ్ద్ ప్రాంతంలో ఇస్లామ్ విస్తరణకు ద్వారాలు తెరుచుకున్నాయి.

ఆ పిదప ప్రవక్త (స) రజీ ప్రాంతంపై సైనికచర్యకు పూనుకున్నారు. ఈ ప్రాంతంలో తెగలు మదీనాకు చెందిన మతబోధకులను క్రూరంగా హతమార్చారు. అశ్వికదళంతో ప్రవక్త (స) అక్కడికి చేరుకున్నారు. కాని శత్రువులు పారిపోయారు. ఎలాంటి పోరాటం జరక్కుండానే ప్రవక్త (స) వెనుతిరిగి వచ్చారు. అక్కడి నుంచి ఒక పదిమంది సైనికుల బృందాన్ని పహరాకు పంపించి మదీనా అప్రమత్తంగా ఉందన్న సంకేతాలు ఖురైషులకు అందేలా చేశారు.

బనీ గఫ్తాన్ తెగ వారి నివాసానికి పక్కన ఒక నీటి ఊట ఉంది. దాని పేరు జీఖర్ద్. దాని పక్కనే మదీనా పశువులకు మేత మైదానాలున్నాయి. ఉయైనా బిన్

హిస్న్ ఫజారీ (లేదా అబ్దుర్రహ్మాన్ బిన్ ఉయైనా) ఈ పచ్చికమైదానాలపై దాడి చేశాడు. అక్కడ మేస్తున్న ఒంటెలను తోలుకుపోయాడు. ఈ ప్రదేశానికి కాపలా ఉన్న సల్మా బిన్ అలకూ ఆ సమయంలో అక్కడ పహరా కాస్తున్నాడు. దోపిడీగాళ్ళపై ఆయన దాడి చేశాడు. ఈ దొంగలు అక్కడ ఒంటెలను మేపుతున్న రాయిని కూడా చంపేశారు. అతడి భార్యను కూడా అపహరించారు. వారిపై సల్మా బిన్ అలకూ దాడి చేసాడు. వారిని సవాలు చేస్తూ "నేను అలకూ కుమారుడిని. నన్ను ఎదిరించే ధైర్యం ఉన్నవాళ్ళు ముందుకు రండ"న్నాడు. దొంగలు అయోమయానికి గురై ఒంటెలను వదిలేసి, తమ ఆయుధాలు కూడా కొన్ని పారేసి పారిపోయారు. అప్పటికి సల్మా బిన్ అలకూ సహాయం అవసరమని మదీనాకు సందేశం పంపించాడు. ప్రవక్త (స) వెంటనే మిక్దాద్ బిన్ అమ్రీను కొందరు సైనికులతో పంపించి ఆ వెనుకే తాను కూడా ఒక సైన్యంతో బయలుదేరారు. దొంగలను వెంటాడారు. అబ్దుర్రహ్మాన్ బిన్ ఉయైనా (లేదా హబీబ్ బిన్ ఉయైనా) హతమయ్యాడు. మరింత దూరం వెంటాడిన ముస్లిమ్ సైన్యాలు శత్రువులకు చెందిన మరో రెండు గుర్రాలను పట్టుకుని వెనక్కి మరలాయి. ఈ సైనికదళం వెనుదిరిగి వచ్చిన తర్వాత సల్మా బిన్ అలకూ ప్రవక్త (స)తో తనకు కనుక వందమంది సైనికుల దళాన్ని ఇస్తే శత్రువులందరినీ మట్టుపెట్టి ఉండేవాడినని అన్నాడు. దానికి ప్రవక్త (స) జవాబిస్తూ "ఇప్పుడు నువ్వు విజయం సాధించావు. కాబట్టి నువ్వు మృదువుగా మాట్లాడు" అన్నారు.

మదీనాపై దాడి చేయడానికి బనీ అసద్ తెగ సైన్యాన్ని సమకూర్చుకుంటుందన్న వార్త వచ్చింది. అకాష బిన్ హిస్న్ నాయకత్వంలో పహరా విధులు నిర్వహిస్తున్న బృందం వారిపై దాడిచేసింది. వారు తమ ఇళ్ళు వదిలిపారిపోయారు. వారి పచ్చిక మైదానాల నుంచి వంద ఒంటెలు స్వాధీనమయ్యాయి.

హిజ్రీ శకం ఆరవ సంవత్సరంలో ముహమ్మద్ బిన్ ముస్లిమా నాయకత్వంలో బనీ తాలాబ తెగ వద్దకు పంపిన ముస్లిమ్ ధర్మప్రచారకులందరినీ మోసపూరితంగా హతమార్చిన సంఘటన చోటు చేసుకుంది. వాళ్ళను శిక్షించడానికి హజ్రత్ అబూ ఉబైదాకు నలభై మంది సైనికులను ఇచ్చి పంపించడం జరిగింది. శత్రువులు పారి పోయారు. వారి ఆస్తులు స్వాధీనం చేసుకోవడం జరిగింది.

బనూ సులైమ్ తెగ మదీనాపై దాడికి సేనలు సమకూర్చుకుంటుందని హలీమా అనే మహిళ సమాచారమందించింది. జైద్ బిన్ హారిసా నాయకత్వంలోని దళం వారిపై దాడి చేసింది. శత్రువులు పారిపోయారు. చిన్నస్థాయి పోరాటం జరిగింది.



జైద్ కొందరు శత్రువులను పట్టుకోగలిగారు. వారి పశువుల్ని స్వాధీనం చేసుకుని మదీనాకు వచ్చారు. కాని ప్రవక్త (స) వారందరిని విడుదల చేయాలని ఆదేశించారు. హలీమా ఇచ్చిన సమాచారం తప్పు సమాచారంగా తెలిసినందువల్ల ఆయన వారిని విడుదల చేయమని ఆదేశించారు.

జైద్ బిన్ హారిసా పద్నాలుగు మంది సైనికుల దళంతో జిల్ఖిస్సా నేరస్తులపై దాడి చేశారు. వారు పారిపోయారు. ఇరవై ఒంటెలు స్వాధీనమయ్యాయి.

అబ్దుర్రహ్మాన్ బిన్ ఔఫ్ నాయకత్వంలో ధర్మప్రచార బృందాన్ని దుమతుల్ జందాల్ వైపు పంపడం జరిగింది. వారి ప్రయత్నాల వల్ల ఒక అతిపెద్ద క్రైస్తవ తెగకు నాయకుడు అస్మ్ బిన్ అమ్ర్ కల్బీ ఇస్లామ్ స్వీకరించాడు. ఆయన వల్ల ఆ తెగ వారందరూ ఇస్లామ్ స్వీకరించారు. అసమ్ తన కుమార్తె తోమాజర్‌ను అబ్దు ర్రహ్మాన్‌కు ఇచ్చి వివాహం చేశాడు. ఆ విధంగా ముస్లిములతో బంధుత్వం కలుపు కున్నాడు.

మదీనాపై దాడి చేయడానికి ఖైబర్ యూదులకు బనీ సాద్ బిన్ బక్ర్ తెగ సహాయం చేస్తుందని, సైన్యసమీకరణకు తోడ్పడుతుందని ఫదక్ నుంచి వార్త వచ్చింది. హజ్రత్ అలీ (రజి) 200 మంది సైనికులతో రహస్యదాడికి బయలుదేరారు. పగటి పూట రహస్యంగా గడుపుతూ రాత్రి ప్రయాణిస్తూ వారిని చేరుకున్నారు. వారు దాడి గురించి తెలుసుకునేలోగానే మెరుపుదాడి చేశారు. ఈ మెరుపుదాడితో అయో మయానికి గురైన శత్రువులు ప్రాణాలు కాపాడుకోడానికి పారిపోయారు. ఈ యుద్ధంలో ముస్లిములకు ఎలాంటి ప్రాణనష్టమూ సంభవించలేదు. బనూ సాద్ పశువులను స్వాధీనం చేసుకున్నారు.

జైద్ బిన్ హారిసా కొన్ని సరుకులు తీసుకుని సిరియా వెళ్ళారు. ఈ వ్యాపార సరుకుల్లో కొన్ని ఆయన స్వంతం, మరికొన్ని కొందరు ప్రవక్త (స) సహచరులవి. ఆయన తిరిగి వస్తున్నప్పుడు వాదిఉల్ ఖురా వద్ద బనీ బద్ర్ తెగ దారిదోపిడికి పాల్పడింది. బందిపోట్లు సంఖ్యలో ఎక్కువగా ఉండడం వల్ల ముస్లిమ్ బృందంలోని తొమ్మిది మంది మరణించారు. ఒకరు తీవ్రంగా గాయపడ్డారు. మొత్తం సరుకులన్నీ దోచుకున్నారు. రెండు నెలల తర్వాత వారిని శిక్షించడానికి హజ్రత్ అబూబక్ర్(రజి) నాయకత్వంలో ఒక సైన్యాన్ని పంపడం జరిగింది. ఈ బందిపోట్లలో కొందరు ఈ పోరాటంలో మరణించారు. మిగిలిన వారు పారిపోయి ప్రాణాలు దక్కించుకున్నారు.

అఖల్, ఉరాయినా తెగల వారు కొందరు మదీనా వచ్చి ఇస్లామ్ స్వీకరించారు. కాని మదీనాలో వాతావరణం వారికి సరిపోలేదు. వారు జబ్బుపడ్డారు. వారికి మదీనా శివార్లలో బస ఏర్పాటు చేసి మదీనా ప్రభుత్వ ఖర్చులతో వైద్యం చేయించారు. కాని వారు కోలుకున్న తర్వాత శివార్లలో ఉన్న పశువుల కాపరిని గుడ్డివాడిని చేసి క్రూరంగా హతమార్చి పశువులను తోలుకుని పారిపోయారు. వారిని నిర్బంధించడానికి ప్రవక్త (స) 20 మంది సైనికుల అశ్వికదళాన్ని పంపించారు. వారందరినీ నిర్బంధించి మదీనా తీసుకువచ్చి వారి నేరాలకు గాను కఠినంగా మరణశిక్ష విధించడం జరిగింది. శాంతిభద్రతలు కాపాడ్డానికి, పాలనలో అలజడి రాకుండా చూడ్డానికి ఇలాంటి కఠినమైన నిర్ణయాలు తప్పనిసరయ్యాయి.

## హుదైబియా ఒప్పందం

హిజ్రీ శకం ఆరవ సంవత్సరంలో చోటు చేసుకున్న అతి ముఖ్యమైన సంఘటన హుదైబియా ఒప్పందం. ఈ ఒప్పందం గురించి చర్చించే ముందు ఒకసారి ఆ కాలంలో రాజకీయ స్థితిగతులను, వివిధ పక్షాల పరిస్థితులను ఒక్కసారి పరిశీలించడం అవసరం.

తిరుగుబాటు, ద్రోహాలకు పాల్పడినందుకు గాను యూదులను బహిష్కరించడం జరిగింది. యూదులు మదీనా నుంచి ఖైబర్, తైమా, వాదిఉల్ ఖురాలకు వెళ్ళి అక్కడ బలసమీకరణ చేసుకుంటున్నారు. ఇప్పుడు మదీనా రెండు శత్రు శిబిరాల మధ్య ఉంది. ఈ రెండు శత్రుశిబిరాలు కందక యుద్ధంలో మదీనాపై భయంకరమైన దాడికి పాల్పడిన శిబిరాలు. ఖురైషులతో అమీతుమీ తేల్చుకునే ముందు ప్రవక్త (స) దృష్టి పెట్టవలసిన ముఖ్యమైన సమస్య ఇక్కడే ఉంది. ఆయన మక్కాపై సైన్యాన్ని నడిపితే ఖైబర్, బనీ గత్ఫాన్‌లలో ఉన్న యూదులు మదీనాపై దాడి చేస్తారు. ఆయన ఒకవేళ ఖైబర్‌వైపు సైన్యాన్ని నడిపితే ఖురైషులు మదీనాపై దాడి చేయవచ్చు. ఈ పరిస్థితిలో ప్రవక్త (స) ఖైబర్‌పై దాడినే ముందుగా ఎంచుకున్నారు. ఆ విధంగా తిరుగుబాట్లు, ద్రోహాలకు పాల్పడిన శత్రుమూకలను ముందు అణిచివేస్తే ఆ తర్వాత మక్కాలో ఖురైషులతో లెక్క తేల్చుకోవచ్చని భావించారు. పైగా అప్పట్లో సమయం కూడా తగినదిగానే ఉంది. ఎందుకంటే మక్కాలో నాయకత్వం ఏం చేయాలో పాలుబోని అయోమయంలో ఉంది. బద్ర్, ఉహుద్, కందక యుద్ధాల్లో వారి పోరాట శక్తి దాదాపు నశించింది. వారిలో గొప్పగొప్ప పోరాటయోధులు ఈ యుద్ధాల్లో



మరణిం చారు. వారి ఆర్థిక వ్యవస్థ పూర్తిగా దెబ్బతింది. వారి యూదమిత్రులు కూడా బలంగా లేరు. అయినా పైకి మేకపోతు గాంభీర్యం ప్రదర్శిస్తున్నారు. లోలోన వారి ప్రతిఘటనా శక్తి నశించింది. ఇక మదీనా చుట్టుపక్కల ఉన్న తెగలతో ప్రవక్త(స)కు మైత్రి ఒప్పం దాలున్నాయి. అందువల్ల ముస్లిములకు మరింత బలం దొరికింది. ఆరేళ్ళుగా ప్రవాసులుగా ఉన్న ముస్లిములు తమ స్వస్థలాలకు వెళ్ళాలనుకుంటున్నారు. అంతేకాదు, వారు ఇబ్రాహీమ్ ప్రవక్త (అస) ఉద్యమాన్ని పునరుద్ధరించాలను కుంటున్నారు. ఈ ఉద్యమాన్ని వాళ్ళు స్వచ్ఛందంగా తమ భుజాలపై ఎత్తుకున్నారు. ఇబ్రాహీమ్ ప్రవక్త (అస) నిర్మించిన దైవగృహంలో ప్రార్థించాలనుకుంటున్నారు. అందువల్ల వారు కాబాగృహంలో ప్రవేశించే అవకాశం కోసం కళ్ళు కాయలు కాచేలా ఎదురుచూస్తున్నారు. ఈ నేపథ్యంలో ప్రవక్త (స)కు కలలో హజ్‌యాత్రకు వెళ్ళవలసిందిగా దైవాదేశమైంది. ఆ వెంటనే ఆయన నిషిద్ధమాసంలో (అంటే కాబాగృహం చుట్టుపక్కలా హింస, వేట నిషిద్ధమైన మాసంలో) ఉమ్రా యాత్రకు కావలసిన ఏర్పాట్లు చేసుకోవడం మొదలెట్టారు. ఆయనతో పాటు పధ్నాలుగు వందల మంది అనుచరులు బయలుదేరారు. మదీనాలో పాలనా వ్యవహారాలు చూడ్డానికి నుమాయిలా ఇబ్నే అబ్దుల్లా లైసీని ప్రవక్త (స) నియమించారు. నగర పరిరక్షణకు అవసరమైన సంఖ్యలో ముస్లిములను ఆయనతో పాటు ఉంచారు. తనతో పాటు 70 ఒంటెలను ఖుర్బానీ నిమిత్తం తీసుకుని, నిరాయుధంగా మక్కాకు బయలుదేరారు.

ఇప్పుడు ఖురైషులు ఏం చేయాలో పాలుబోని అయోమయంలో పడ్డారు. వాళ్ళు ప్రవక్త (స) బృందంపై ఒకవేళ దాడి చేస్తే నిషిద్ధ మాసంలో రక్తపాతానికి ఒడిగట్టినవారవుతారు. అందులోను ప్రవక్త (స) తన ఉద్దేశ్యాన్ని స్పష్టంగా ప్రకటించిన తర్వాత, ఆయన నిరాయుధంగా వస్తున్నప్పుడు, ఖుర్బానీ పశువులు ఆయనతో పాటు ఉన్నప్పుడు వాళ్ళు కేవలం కాబాగృహానికి శాంతిపూర్వకంగా హజ్‌యాత్రకు వస్తున్నారన్నది స్పష్టంగా అర్థం అవుతోంది. కాబట్టి వారిపై దాడి చేయడమంటే హజ్ యాత్రకు వస్తున్నవారిపై దాడిచేయడం అవుతుంది. కాని ఒకవేళ ఖురైషులు ఎలాంటి ప్రతిఘటన చూపకపోతే వాళ్ళు ప్రవక్త (స)కు భయపడిపోయి ఆయనకు దారి ఇచ్చినట్లు అవుతుంది. ఈ సంక్లిష్టపరిస్థితిలో వారి నాయకుడు అబూసుఫ్యాన్ కూడా మక్కాలో లేడు. ప్రవక్త (స) దూరదృష్టితో ఇవన్నీ అంచనా వేశారు. ఖురైషులు చర్చలకు రావడం తప్ప వారికి మరో మార్గం లేదని గ్రహించారు.

ఖురైషులు యుద్ధ ఏర్పాట్లు తక్షణం చేసుకున్నారు. మిత్ర తెగలను కూడగట్టుకున్నారు. అహాబిష్ తెగల మద్దతు సంపాదించారు. మరోవైపు శాంతిచర్చల ప్రయత్నాలు కూడా ప్రారంభమయ్యాయి. ఈ ప్రయత్నాలు ప్రారంభించిన మొదటి వ్యక్తి ఖుజా తెగ నాయకుడు బుదాయిల్ బిన్ వరఖా. తన అనుచరులతో ఆయన ప్రవక్త(స) వద్దకు వచ్చాడు. ప్రవక్త (స) ఆయనకు తమ రాకలోని ఉద్దేశ్యాన్ని వివరించారు. తాము శాంతియుతంగా హజ్‌యాత్రకు వచ్చామని, ఖురైషులు బలప్రయోగానికి పూనుకుంటే, యుద్ధానికి దిగితే వారికే నష్టమని చెప్పారు. కాబట్టి ఒక తాత్కాలిక శాంతి ఒప్పందం కుదుర్చుకోవడమే మంచిదన్న నిర్ణయానికి వచ్చారు. బుదాయిల్ వెనుదిరిగి ఖురైషుల వద్దకు వచ్చి తొందరపాటు చర్యల్లో వివేకం లేదని తేల్చి చెప్పాడు. శాంతియుత ఉద్దేశ్యాలతో వస్తున్న ప్రవక్త (స)ను నిరోధించడం తగదన్నాడు. మక్కా ఖురైషులు ఆయన మాటలు శ్రద్ధగా విన్నారు. ఆ తర్వాత అహాబిష్ తెగ నాయకుడు హులాయిస్ బిన్ అల్‌ఖమాను పంపారు. ప్రవక్త (స)తో చర్చలు జరపడానికి వెళ్ళిన హులాయిస్ అక్కడ ఖుర్బానీ పశువులు స్వేచ్ఛగా తిరుగుతున్న దృశ్యాన్ని చూసి చాలా ప్రభావితుడయ్యాడు. వెనుదిరిగి ఖురైషుల వద్దకు వచ్చి హజ్‌యాత్రకు వస్తున్న వారిని అడ్డుకోవడం మంచిది కాదన్నాడు. తన తెగవారిని వెనక్కు తీసుకుని వెళ్ళి పోవడానికి ఉద్యుక్తుడయ్యాడు. ఖురైషులు అతడిని బుజ్జగించి నచ్చచెప్పారు. తమకు యుద్ధం చేసే ఆలోచన ఏదీ లేదని, కేవలం తగిన షరతులతో శాంతి ఒప్పందం కోసం ప్రయత్నిస్తున్నామని అన్నారు. ఆ పిదప ఖురైషులు తమ మనిషి ఉర్వా బిన్ మసూద్ సఖాఫీని ప్రవక్త (స) వద్దకు పంపించారు. ఉర్వాబిన్ మసూద్ అక్కడికి వెళ్ళి ప్రవక్త (స)తో మీరు మీ స్వంత సమూహాన్ని నాశనం చేయడం వల్ల సాధించేది ఏదీ ఉండదన్నాడు. ఆయన చుట్టూ ఉన్న ఇల్లువాకిలి లేని అనుచరులు కొద్ది సమయంలోనే ఆయన్ను ఒంటరిగా వదిలి మాయమైపోతారని చెప్పాడు. ఉర్వా మాటల్లోని ఈ అహంకారం చూసి హ్జ్రత్ అబూ బక్ర్(రజి) కోపం పట్టలేక గట్టిగా మందలించారు. అరబ్బుల సంప్రదాయిక పద్ధతిలో ఉర్వా మాట్లాడుతున్నప్పుడు తరచూ తన చేతిని ప్రవక్త (స) గెడ్డం దగ్గరకు తీసుకెళ్ళేవాడు. ప్రతిసారి హ్జ్రత్ ముగీరా బిన్ షాబా తన ఖడ్గం మొనతో ఆ చేతిని వెనక్కి నెట్టేవారు. ప్రవక్త (స) చాలా సహనంగా తాను ఎందుకు వచ్చిందీ ఉర్వాకు వివరించారు. ప్రవక్త (స) మాటలతో ప్రభావితుడైన ఉర్వా వెనుదిరిగి ఖురైషుల వద్దకు వెళ్ళి ప్రవక్త (స)తో తలపడి ఖురైషులు విజయం సాధించడం జరగని పని అన్నాడు. ప్రవక్త (స) పట్ల అనుచరులకు ఉన్న ప్రేమాభిమానాలు, గౌరవాదరాలు మరెక్కడా



కనబడవని, పెద్ద పెద్ద చక్రవర్తుల దర్బారుల్లో కూడా చూడలేమన్నారు. సంప్రదింపుల ప్రక్రియ కొనసాగిస్తూ ప్రవక్త (స) తనవైపు నుంచి ఖరాష్ బిన్ ఉమయ్యాను ఖురైషుల వద్దకు పంపించారు. కాని ఖురైషులు ఏం చేయాలో పాలుబోని గందరగోళంలో ఉన్నారు. ఖురైష్ నాయకులు అయోమయావస్థలో ఉన్నారు. ఈ నేపథ్యంలో అక్కడికి వచ్చిన ఖరాష్ ఒంటెను కొందరు చంపేశారు. ఖరాష్ అతికష్టం మీద తన ప్రాణాలు కాపాడుకోగలిగారు. ఆ తర్వాత హ్జ్రత్ ఉస్మాన్ (రజి)ను ప్రవక్త (స) ఖురైషుల వద్దకు పంపించారు. నిఘా విధులు నిర్వర్తిస్తున్న ఖురైషుల బృందం వారిని అడ్డుకుని పోరాటానికి దిగింది. ఆ బృందాన్ని నిర్బంధించి ప్రవక్త (స) వద్దకు తీసుకొచ్చారు. కాని ఆయన వారందరినీ విడిచిపెట్టారు. కాని హ్జ్రత్ ఉస్మాన్ (రజి)ను ఖురైషులు బంధించారు. ఆయన్ను ఖురైషులు విడుదల చేయడంలో జాప్యం జరిగింది. దీంతో ఆయన్ను ఖురైషులు హతమార్చారన్న పుకారు లేచింది. ఈ వార్త విన్న వెంటనే ప్రవక్త (స) తన అనుచరులందరితో ప్రతిజ్ఞ చేయించారు. శత్రువుతో పోరాడకుండా వెనుదిరిగి వెళ్ళేది లేదని అందరూ ప్రతిజ్ఞ చేశారు. ఈ ప్రతిజ్ఞ గురించిన వార్త ఖురైషులకు చేరగానే బెంబేలెత్తారు. తక్షణం హ్జ్రత్ ఉస్మాన్ (రజి)ను విడుదల చేశారు. ఎందుకంటే ఖురైషులు యుద్ధం చేసే స్థితిలో లేరు.

ఆ తర్వాత ఖురైషులు మిక్రాజ్ బిన్ హఫ్స్‌ను పంపించారు. కాని ప్రవక్త (స) అతడితో మాట్లాడ్డానికి నిరాకరించారు. ఒక మోసగాడితో మాట్లాడనని చెప్పేశారు. ఆ పిదప ఖురైషులు సుహేల్ బిన్ అమ్ర్‌ను పంపారు. ఖురైషులు నిజంగానే శాంతి కోరుతున్నారని ప్రవక్త (స) అర్థం చేసుకున్నారు. సుహేల్‌తో చర్చలు జరిగి కొన్ని షరతుల విషయంలో అంగీకారం కుదిరిన తర్వాత ప్రవక్త (స) హ్జ్రత్ అలీ(రజి)ను పిలిచి ఒప్పంద పత్రం రాయమన్నారు. కాని ఈ చర్చల సందర్భంగా చాలా ఉద్రిక్త వాతావరణం ఏర్పడింది. ప్రతిదశలోను పరిస్థితి చేజారుతున్నట్లు కనబడింది. ఒప్పంద పత్రాన్ని రాయమని ఆదేశించిన ప్రవక్త (స) "బిస్మిల్లా హిర్రహ్మా నిర్రహీమ్" (అంటే అనంత కరుణామయుడు, అపారకృపాశీలుడు అయిన అల్లాహ్ పేరుతో అని అర్థం) అని ప్రారంభించమన్నారు. వెంటనే సుహేల్ అభ్యంతరం చెప్పాడు. రహ్మాన్, రహీమ్‌లు ఎవరో తమకు తెలియదన్నాడు. సంప్రదాయిక పద్ధతిలో "బి ఇస్మిక అల్లాహుమ్మ" (అల్లాహ్ పేరుతో) అని ఒప్పందపత్రం ప్రారంభించాలన్నాడు. ప్రవక్త (స) అంగీకరించారు. ఈ ఒప్పందం దైవప్రవక్త ముహమ్మద్ (స)కు, సుహేల్ బిన్ అమ్ర్‌కు మధ్య కుదిరిన ఒప్పందం అని రాయమన్నారు.

దీనికి కూడా సుహేల్ అభ్యంతరపెట్టాడు. ఆయన్ను దైవప్రవక్తగా తాము అంగీకరిస్తే ఆయనపై ఆయుధాలు ఎత్తవలసిన అవసరమే ఉండేది కాదన్నాడు. ఈ అభ్యంతరానికి కూడా ప్రవక్త (స) ఒప్పుకున్నారు. అప్పటికి హజ్రత్ అలీ (రజి) దైవప్రవక్త (స) అని ఒప్పంద పత్రంపై రాసేశారు. తాను రాసిన ఆ పదాలను కొట్టేయడం ఆయనకు ఇష్టం లేదు. తన చేతులతో చేయలేనన్నారు. ప్రవక్త (స) స్వయంగా ఒప్పంద పత్రాన్ని తీసుకుని ఆ పదాలను చెరిపేసి, ఆ స్థానంలో ముహమ్మద్ బిన్ అబ్దుల్లా అని రాయమన్నారు. సుహేల్ వైఖరి చూసి ప్రవక్త (స) అనుచరులు ఆగ్రహంతో ఊగిపోయారు. కాని ప్రవక్త (స) పట్ల అపారమైన గౌరవంతో పల్లెత్తు మాట అనకుండా ఊరుకున్నారు.

ఈ చారిత్రాత్మక ఒప్పందంలో క్రింది అంశాలున్నాయి :

1. రెండు సంవత్సరాల వరకు ఇరుపక్షాల మధ్య నిర్యుద్ధసంధిక ఉంటుంది. శాంతియుతంగా జీవించాలి.
2. ముస్లిములు ఈ సంవత్సరం వెనుదిరిగి వెళ్ళిపోవాలి. తర్వాతి సంవత్సరం హజ్‌యాత్రకు రావచ్చు. అయితే తన ఖడ్గాలు ఒరల్లోనే ఉంచుకోవాలి. మక్కాలో కేవలం మూడు రోజులు మాత్రమే ఉండాలి.
3. ఈ రెండు పక్షాల్లో ఎవరితోనైనా అరబ్బు తెగలు మైత్రి ఒప్పందాలు చేసుకోవచ్చు.
4. మదీనా నుంచి వెళ్ళే మక్కా వారి వర్తకబిడారులపై దాడులు చేయరాదు.
5. మక్కా నుంచి ఎవరైనా ఖురైషుల అనుమతి లేకుండా మదీనా వస్తే వారిని తిరిగి మక్కావారికి అప్పగించాలి.

కాని మదీనా నుంచి ఎవరైనా ముస్లిములు మక్కాకు వచ్చేస్తే వారిని వెనక్కి పంపడం జరగదు.

ఇందులో చివరి అంశం ముస్లిములకు అవమానకరమైనదిగా భావించారు. ఇది పూర్తిగా మక్కా ఖురైషులకు అనుకూలంగా, వారిపట్ల పక్షపాతంతో చేర్చిన అంశం. అందువల్ల ముస్లిముల్లో దీనిపట్ల తీవ్ర అసంతృప్తి అలుముకుంది. ఒప్పందంపై సంతకాలు జరిగిన తర్వాత ప్రవక్త (స) తన అనుచరులతో హజ్‌యాత్ర ఆ సంవత్సరం లేనందువల్ల, అక్కడే శిరోముండనం చేయించుకుని, పశువులను ఖుర్బానీ చేయమని ఆదేశించారు. కాని అసంతృప్తితో రగిలిపోతున్న ముస్లిములు ఎవరూ కదల్లేదు. మూడుసార్లు చెప్పినా ఎవరూ కదలకపోయేసరికి ప్రవక్త (స)



నిరాశగా తనవారి అసమ్మతి వైఖరి గురించి ఉమ్మెసల్మా వద్ద ప్రస్తావించారు. ఆమె ప్రవక్త (స)తో, వాళ్ళంతా ఒప్పందంలోని షరతుల పట్ల చాలా అసంతృప్తితో ఉన్నారని, కాబట్టి ప్రవక్త (స) తానే ముందుగా ఖుర్బానీకి పూనుకుంటే అందరూ అనుసరిస్తారని సలహా ఇచ్చారు. ప్రవక్త (స) అలాగే చేశారు. ముస్లిములు అసంతృప్తి, ఆగ్రహాలతోనే ఆయన్ను అనుసరిస్తూ తాము కూడా ఖుర్బానీ ఇచ్చేశారు. ముస్లిముల్లో ఎంత అసంతృప్తి అలుముకుందో అప్పుడు హజ్రత్ ఉమర్ (రజి) చెప్పిన మాటలను బట్టి తెలుస్తుంది. ఆయన ప్రవక్త(స)తో నిర్మొహమాటంగా ఇలా ప్రశ్నించారు:

"ఓ దైవప్రవక్తా! మీరు ప్రవక్త కాదా?"

ప్రవక్త (స) జవాబిస్తూ "ఎందుక్కాదు (నేను దైవప్రవక్తనే)" అన్నారు

అయితే మనం ఇంత దిగివచ్చి వారితో ఒప్పందం చేసుకోవలసిన అవసరం ఏముంది? అని ప్రశ్నించారు హజ్రత్ ఉమర్ (రజి).

ప్రవక్త (స) జవాబిస్తూ, నేను దేవుని దాసుడిని, దైవప్రవక్తను. నేను దేవుడి ఆదేశాలను జవదాటలేను. నేనలా చేస్తే నాకు దైవసహాయం లభించదు అన్నారు.

ఈ జవాబుతో హజ్రత్ ఉమర్ (రజి) సంతృప్తి చెందలేదు. అయినా విధేయంగా ఒప్పందపత్రంపై సాక్షి సంతకం చేశారు. ఆ రకంగా తన వ్యక్తిగత అభిప్రాయాల కన్నా దైవప్రవక్త (స) ఆదేశాలకే ఎక్కువ ప్రాముఖ్యం ఇస్తున్నట్లు చాటి చెప్పారు.

ఒప్పందంపై సంతకాలు జరక్కముందే ఒక సంఘటన జరిగింది. ఖురైష్‌ల ప్రతినిధిగా వచ్చిన సుహేల్ కుమారుడు అబూ జందాల్ అక్కడికి పారిపోయి వచ్చాడు. అతడి కాళ్ళకూ చేతులకు సంకెళ్ళు వేసి ఉన్నాయి. విపరీతంగా కొట్టిన గాయాలున్నాయి. తనను మక్కా వారికి అప్పగించవద్దని ప్రవక్త (స)కు, ముస్లిములకు మొరపెట్టుకున్నాడు. అక్కడ ముస్లిమేతరుల చేతుల్లో చిత్రహింసలు భరించలేనన్నాడు. వెంటనే సుహేల్ లేచి, ఒప్పందం ప్రకారం మక్కా నుంచి పారిపోయి వచ్చిన మొదటి వ్యక్తి అబూ జందాల్ కాబట్టి అతడిని మక్కావారికి అప్పగించవలసిందే అన్నాడు. కాని ఒప్పందంపై ఇంకా సంతకాలు జరగలేదు. ఆ విషయాన్నే ప్రవక్త (స) అతడికి నచ్చచెప్పే ప్రయత్నం చేశారు. సంతకాలు జరగలేదు కాబట్టి గాయాలతో పారిపోయి వచ్చిన అబూ జందాల్‌ను ఒప్పందం నుంచి మినహాయించాలని చెప్పారు. కాని అబూజందాల్‌ను వెనక్కి పంపకపోతే ఒప్పందం లేదని సుహేల్ పట్టుబట్టాడు. ప్రవక్త (స) నచ్చచెప్పే ధోరణిలో తనకోసం వదిలేయమని చెప్పారు. కాని సుహేల్

మొండిగా కుదరదన్నాడు. చివరకు ఒప్పందం కుదుర్చుకోవడానికి ప్రవక్త (స) అంగీకరించక తప్పలేదు. అబూ జందాల్‌ను వారికి అప్పగించడానికి ఒప్పుకున్నారు. ఈ సంఘటనతో ముస్లిముల అసంతృప్తి ఇంకా పెరిగింది. కాని తాను ఒప్పందానికి విరుద్ధంగా నిర్ణయాలు తీసుకోలేనని ప్రవక్త (స) స్పష్టం చేశారు. అబూజందాల్ సహనం వహించాలని, దేవుడు అతడికి ఏదో ఒక మార్గం చూపిస్తాడని చెప్పారు.

ఈ ఒప్పందం ప్రభావానికి గురైన మరో వ్యక్తి అబూ బుసీర్ ఉత్బా బిన్ ఉసైద్. అతను ఎలాగోలా మక్కా నుంచి పారిపోయి మదీనా చేరుకున్నాడు. ఖురైషులు వెంటనే ఇద్దరు మనుష్యులను మదీనా పంపించి అతడిని వెనక్కి పంపమన్నారు. ప్రవక్త (స) ఒప్పందానికి కట్టుబడి అబూబుసీర్ ఉత్బాను ఖురైషులకు అప్పగించారు. సహనం వహించమని, సహాయం కోసం ఎదురుచూడమని చెప్పారు. వారిద్దరు అబూబుసీర్ ఉత్బాను తీసుకుని మక్కా బయలుదేరారు. దారిలో ఉత్బా తిరగబడ్డాడు. ఆ ఇద్దరిలో ఒకడిని చంపేశాడు. మళ్ళీ పారిపోయి మదీనా వచ్చాడు. ప్రవక్త (స)కు తాను చేసిన పని గురించి వివరిస్తూ "మీరు ఒప్పందానికి కట్టుబడి నన్ను ముస్లిమేతరు లకు అప్పగించారు. కాని నేను ఖురైషుల అణిచివేతలకు గురై నా ధార్మిక విశ్వాసాన్ని ప్రమాదంలో పడేయలేను. కాబట్టి నేను నా స్వంత బాధ్యతపై నేను చేయగలిగింది చేశాను. దీనికి మీ బాధ్యత లేదు. దేవుడే నన్ను రక్షించాడు" అని చెప్పాడు. ప్రవక్త(స) ఆ మాటలు విని నర్మగర్భంగా "ఈ మనిషి తనలాంటి కొందరిని తనతో కలుపుకుంటే యుద్ధానికి దిగవచ్చు" అన్నారు. తన్ను మళ్ళీ మక్కావారికి అప్పగిస్తారని భయపడిన అబూ బుసీర్ ఉత్బా మదీనా వదలి వెళ్ళిపోయాడు. కోస్తా ప్రాంతంలో ఉన్న ఐస్ ప్రదేశానికి చేరుకున్నాడు. ఆ తర్వాత అబూ జందాల్ కూడా పారిపోయి అతనితో చేరాడు. ఆ తర్వాత మక్కా నుంచి పారిపోయే ముస్లిములు అక్కడికి చేరుకోవడం ప్రారంభించారు. ఆ విధంగా కొంతకాలానికి అక్కడ 70 మంది చేరుకున్నారు. అది ఖురైషుల వర్తకబిడారులు వెళ్ళేదారి. ఈ 70 మంది కలిసి ఆ బిడారులపై దాడులు చేసి దోచుకోవడం ప్రారంభించారు. ఈ 70 మంది హుదైబియా ఒప్పందం పరిధిలోకి వచ్చేవారు కాదు. వారు మదీనాలో లేరు. మదీనా వారికి మక్కా ఖురైషులకు కుదిరిన ఒప్పందంతో వారికి సంబంధం లేదు. కాబట్టి వారిని ఒప్పందంతో అడ్డుకోవడం సాధ్యంకాదు. ఈ 70 మంది వల్ల ఖురైషులకు తర్వాత ఎంత ఇబ్బంది కలిగిందంటే, చివరకు ఖురైషులే దిగివచ్చి ఒప్పందంలోని ఆ ఆఖరు షరతును తీసేయాలని కోరుకున్నారు. ఆ తర్వాత ప్రవక్త (స) వీళ్ళందరినీ మదీనా పిలుచుకున్నారు. ఆ



తర్వాతి నుంచి మక్కాలో ఇస్లామ్ స్వీకరించిన వారు మదీనా రావడానికి మార్గం సుగమమైంది.

ఇక్కడ మరో ముఖ్యమైన సంఘటన ప్రస్తావించదగింది. మక్కా నాయకుడి కుమార్తె ఉమ్మె కుల్సుమ్ మదీనా వలస వచ్చేశారు. ఆమెను తిరిగి తీసుకెళ్ళడానికి ఆమె సోదరులు అమారా, వలీద్‌లు మదీనా వచ్చారు. కాని హుదైబియా ఒప్పందంలో ఉన్న పదాలు కేవలం మక్కా నుంచి వచ్చే పురుషులకు మాత్రమే వర్తించేలా ఉన్నాయి, కాబట్టి ఆమెను తిప్పి పంపడం కుదరదని ప్రవక్త (స) తిరస్కరించారు. ఖురైషులు కూడా మరోదారి లేక ఒప్పుకోవలసి వచ్చింది.

నిజానికి హుదైబియా ఒప్పందం ముస్లిములకు అవమానకరమైన ఒప్పందంగా ముస్లిములకు కనబడింది కాని ప్రవక్త (స) దూరదృష్టితో ఆ ఒప్పందం వల్ల ఒనగూడే లాభాలు గుర్తించారు. తన వ్యూహం ఎంత పకడ్బందీగా ఉందో ముందే అంచనా వేసుకున్నారు. ఈ ఒప్పందం వల్ల తక్షణం ఒనగూడిన లాభాలేమిటంటే, ఈ ఒప్పందం వల్ల మక్కా ప్రజలకు, మదీనా ప్రజలకు మధ్య సాధారణ సంబంధాలు ఏర్పడ్డాయి. రెండు నగరాలకు మధ్య రాకపోకలు ప్రారంభమయ్యాయి. దీర్ఘకాలంగా తమ కుటుం బాలను చూడకుండా ఉండిపోయిన వారు తిరిగి తమ కుటుంబాలను కలుసుకో గలిగారు. వారి మధ్య సంభాషణలకు, చర్చలకు అవకాశం కలిగింది. ప్రవక్త (స) గురించి, మదీనాలో ఉన్న ముస్లిముల గురించి అపార్థాలు, అపోహలు ఈ చర్చల వల్ల తొలగిపోయాయి. ముస్లిములు మక్కా వారి ప్రశ్నలకు సమాధానాలిస్తూ ఇస్లామ్ వల్ల తాము సాధించిన నైతిక, ఆధ్యాత్మిక, భౌతిక ప్రగతిని వివరించారు. ప్రతి ఇంటిలోను ఇస్లామ్ సందేశం, ఇస్లామీయ సిద్ధాంతాల చర్చ సర్వసాధారణమయ్యింది. ఇస్లామ్‌ను అర్థం చేసుకుని ఇస్లామ్‌లోకి వచ్చేవారి సంఖ్య పెరిగింది. హుదైబియా ఒప్పందం తర్వాతి రెండు సంవత్సరాల్లో ఇస్లామ్ స్వీకరించిన వారి సంఖ్య అంతకు ముందు ఇరవై సంవత్సరాల్లో ఇస్లామ్ స్వీకరించిన వారి సంఖ్య కన్నా ఎక్కువ. ఈ ఒప్పందం తర్వాతే ఖురైషుల్లో ప్రముఖ సేనానులు ఖాలిద్ బిన్ వలీద్, అమ్ర్ బిన్ ఆస్ వంటి వారు ఇస్లామ్ స్వీకరించారు.

ఒప్పందం వల్ల మరో లాభం ఏమంటే, ముస్లిములు యుద్ధాల భయం లేకుండా నిర్మాణాత్మక కార్యక్రమాలపై తమ శక్తియుక్తులు కేంద్రీకరించే అవకాశం దొరికింది. నైతిక, ఆధ్యాత్మిక, వివేచనాత్మక సంస్కరణకు పూనుకునే వీలు కలిగింది.

మదీనాలో పాలనా యంత్రాంగాన్ని బలోపేతం చేసుకోగలిగారు. ఇతర దేశాలకు ఇస్లామ్ సందేశాన్ని పంపే మార్గాలు సుగమమయ్యాయి. మూడవ ప్రయోజనం ఏమంటే, మక్కాతో శాంతి ఒప్పందం ఉన్నందువల్ల ఖైబర్‌లో యూదుల ప్రమాదాన్ని అణిచివేసే అవకాశం దొరికింది. హుదైబియా ఒప్పందం తర్వాత కొద్దికాలానికే ఈ శత్రుశిబిరాన్ని మట్టుపెట్ట గలిగారు. నాల్గవ ప్రయోజనం ఈ ఒప్పందం తర్వాత అరబ్బు తెగలు మదీనా ముస్లిములతో మైత్రి ఒప్పందాలు చేసుకునే వీలు కుదిరింది. చాలా అరబ్బు తెగలు మదీనాతో ఒప్పందాలు చేసుకున్నాయి. దీనిపై ఖురైషులకు అభ్యంతరాలు చెప్పే అవకాశం లేకుండా పోయింది. ఈ వాతావరణం లోనే బనూ ఖజా తెగ మదీనాతో ఒప్పందం చేసుకుంది. చివరి ప్రయోజనం ఏమంటే, సంవత్సరం తర్వాత ముస్లిములు నిర్భయంగా మక్కా వెళ్ళే అవకాశం దొరికింది. ఆ విధంగా చూస్తే ఖురైషుల వంటి ప్రాణ శత్రువులు చేతులు ముడుచుకు కూర్చుని శాంతికి కట్టుబడ్డా రంటే ప్రవక్త (స) దూరదృష్టితో తీసుకున్న నిర్ణయాల వల్లనే. ఈ ఒప్పందం కుదిరిన తర్వాత ప్రవక్త (స) మదీనాకు తిరుగు ప్రయాణమై దారిలో ఉండగానే ఫతహ్ సూరా అవతరించింది. ఇందులో దేవుడు, జరిగిన సంఘటనలను ప్రస్తావిస్తూ భవిష్యత్తు విజయాల గురించి శుభవార్త వినిపించాడు. అసంతృప్తికి గురైన వారికి ఊరట కలిగించాడు.

మరోవైపు ఖురైషులు ఈ ఒప్పందంలో తమదే పైచేయిగా ఉందని గర్వించారు. కాని ఒప్పందం తర్వాతి పరిణామాలతో చాలా విసిగిపోయారు. మక్కాలోనే ముస్లిముల ప్రభావం పెరిగింది. ఖురైషుల సామూహిక బలాన్ని ఇది చాలా వరకు దెబ్బతీసింది. అబూజందాల్, అబూబుసీర్‌లు మరో 70 మందిని కలుపుకుని ఖురైషుల వర్తకబిడారులకు సింహస్వప్నంగా మారిన సంఘటనలు ఇంతకు ముందు వివరించాము. మరో ముఖ్యమైన పరిణామం ఏమంటే ఇస్లామ్‌ను వ్యతిరేకించడానికి అనేక తెగలు ఇంతకు ముందు ఒక్కటయ్యాయి. బనూ బక్ర్, బనూ ఖజా తెగల మధ్య చిరకాల వైరం ఉండేది. ఇస్లామ్‌ను వ్యతిరేకించడానికి ఈ రెండు తెగలు తమ వైరాన్ని మరిచి ఒక్క టయ్యాయి. ఈ రెండు తెగల మధ్య హుదైబియా ఒప్పందం తర్వాత పాతవైరాలు రాజుకున్నాయి. బనూఖజా తెగ మదీనా వారితో మైత్రి ఒప్పందం చేసుకుంది. బనూ బక్ర్ ఖురైషులతో ఒప్పందం చేసుకుంది. బనూ బక్ర్ తెగ ఆ తర్వాత బనూ ఖజా తెగకు చెందిన ఒక వ్యక్తిని హతమార్చడమే కాదు, వారిపై భయంకరమైన దాడికి తెగబడింది. అమానుషంగా దాడి చేయడమే కాదు,



కాబాగృహంలో ఆశ్రయం పొందిన వారిని కూడా వెంటాడి అక్కడ ప్రార్థనలో ఉన్నవారిని కూడా హతమార్చింది. ఖురైషులు వారికి పూర్తి మద్దతు ప్రకటించారు. ఆ విధంగా హుదైబియా ఒప్పందాన్ని ఉల్లంఘించారు. బనూ ఖజా తెగకు చెందిన అమ్ర్ బిన్ సులైమ్ సహాయం కోసం ప్రవక్త (స)కు విజ్ఞప్తి చేశారు. ఆ తర్వాత బుదాయిల్ బిన్ వరఖా నేతృత్వంలో ఒక బృందం వచ్చి ప్రవక్త (స)కు జరిగిన సంఘటనల గురించి వివరించే ప్రయత్నం చేసింది. కాని ఒప్పందం ప్రకారం ప్రవక్త (స) బనూ ఖజాకు సహాయం చేయవలసి ఉంది. వెంటనే ప్రవక్త (స) ఖురైషులకు స్పష్టమైన సందేశం పంపించారు. బనూఖజా హతులకు బదులు రక్త పరిహారం చెల్లించాలి. లేదా బనూబక్ర్‌కు చెందిన బనూ కనానాకు మద్దతు మానుకోవాలి. లేదా హుదైబియా ఒప్పందం రద్దయ్యిందని ప్రకటిం చాలి. ఖురైషులు ఉన్మాదంతో మతిభ్రమించినట్లు వ్యవహరించారు. చివరి ప్రత్యామ్నా యాన్ని ఎంచుకున్నారు. హుదైబియా ఒప్పందం రద్దయ్యిందన్నారు. ఆ విధంగా ఒప్పందం నిర్వీర్యమైపోయింది. కాని ఒప్పందం రద్దు చేయడానికి మొదట మొగ్గు చూపిన ఖురైషులు ఆ తర్వాత దాని పరిణామాలు గుర్తించి కంగారు పడ్డారు. వెంటనే జరిగిన నష్టాన్ని పూరించే ప్రయత్నాలు ప్రారంభించారు. ఒప్పందాన్ని పునరుద్ధ రించడానికి తీవ్రంగా ప్రయత్నించారు. ఒప్పంద పునరుద్ధరణకు మొదట ప్రయత్నాలు ప్రారంభించింది మక్కా నాయకుడు అబూసుఫ్యాన్. ఒప్పందం రద్దయిన వెంటనే ఆయన మదీనాకు పరుగెత్తాడు. ముస్లిములను శాంతపరచడానికి అన్నివిధాలుగా ప్రయత్నించాడు. కాని చివరకు నిరాశగా వెనుదిరగవలసి వచ్చింది.

## ఖైబర్ యుద్ధం

ప్రవక్త (స) హుదైబియా నుంచి జుల్‌హిజ్జా మాసం 6వ తేదీన వెనుదిరిగి వచ్చారు. హి.శ.7వ సంవత్సరం ముహర్రమ్ మాసం 7వ తేదీన ఆయన ఖైబర్‌పై సైన్యాన్ని నడిపారు. ఇస్లామ్‌కు వ్యతిరేకంగా కుట్రలు కుతంత్రాలకు కేంద్రంగా ఉన్న ఖైబర్‌లో యూదులు ఉహుద్ యుద్ధం సందర్భంగా నమ్మకద్రోహానికి పాల్పడ్డమే కాదు, కందకయుద్ధంలో శత్రువులకు పూర్తి సహాయసహకారాలు అందించారు. ఈ రాజ్యద్రోహులను మదీనా సహించడం సాధ్యంకాదు. కాబట్టి ఖైబర్ యూదులపై దాడి పూర్తిగా రాజకీయపరమైనది. ఈ యుద్ధంలో యూదులు ఓడిపోయిన తర్వాత వారి పట్ల వ్యవహరించిన వైఖరి కూడా రాజకీయమైనదే. ఈ యుద్ధంలో ముస్లిమ్ పురుషులతో పాటు పెద్ద సంఖ్యలో ముస్లిమ్ మహిళలు కూడా సైన్యంతో వెళ్ళారు.

ప్రవక్త (స) వారికి ముస్లిమ్ సైనికులకు సేవలందించే అనుమతి ఇవ్వడమే కాదు, యుద్ధ సొత్తులో వారికి వాటా కూడా ఇచ్చారు.

మదీనాలో సబ్బా బిన్ అర్ఫతాను తన ప్రతినిధిగా నియమించి ప్రవక్త (స) తనతో పాటు 1400 మందిని తీసుకుని ఖైబర్‌కు దండెత్తి, రాజీ వద్ద మజిలీ చేశారు. ముస్లిమ్ సైన్యాన్ని చూసి యూదులు పారిపోయి తమ కోటల్లో తలదాచుకున్నారు. మొదటిగా అన్నతాత్ కోటపై దాడి చేయడం జరిగింది. ఆ కోటను ఆక్రమించుకోవడం కూడా చాలా త్వరితగతిన జరిగిపోయింది. ఆ పిదప సాబ్ కోటను ముట్టడించారు. ఆ కోట నుంచి మర్హాబ్ అనే యూదుడు బయటకు వచ్చాడు. ద్వంద్వయుద్ధానికి సవాలు చేసి అమీర్ బిన్ అలకూను హతమార్చాడు. కొంత ప్రతిఘటన తర్వాత ఆ కోట కూడా వశమైంది. ఆ పిదప బలమైన కోట ఖుముస్‌ను ముట్టడించారు. అక్కడ కూడా మర్హాబ్ మళ్ళీ బయటకు వచ్చి ద్వంద్వ యుద్ధానికి సవాలు చేశాడు. ముహమ్మద్ బిన్ ముస్లిమా వాడిని ఎదుర్కోవడానికి ముందుకు వెళ్ళి యుద్ధంలో వాడి రెండు కాళ్ళు ఖండించారు. హజ్రత్ అలీ (రజి) వాడిని హతమార్చారు. మర్హాబ్ తర్వాత వాడి సోదరుడు యాసిర్ బయటకు వచ్చాడు. హజ్రత్ జుబేర్ ఇబ్నుల్ అవ్వామ్ వాడిని హతమార్చారు. ఈ కోట ముట్టడి 20 రోజులపాటు కొనసాగింది. చివరకు హజ్రత్ అలీ(రజి) ఈ కోటను ఆక్రమించుకోగలిగారు. అందుకే ఆయన్ను ఖైబర్ విజేతగా పిలుస్తారు. ప్రవక్త (స) తీవ్రమైన శిరోవేదన వల్ల ఈ యుద్ధంలో పాల్గొనలేదు. అందువల్ల సైన్యాధికారిగా హజ్రత్ అలీ సేనలను నడిపారు. ఈ కోట వశమైన తర్వాత పేరుమోసిన ఇస్లామ్ శత్రువు హుయ్యాయ్ బిన్ అక్తబ్ కుమార్తె సఫియా, తన ఇద్దరు బంధువులతో యుద్ధఖైదీగా ముస్లిమ్ సైన్యం చేజిక్కారు. కాని ఆమె ఒక నాయకుడి కుమార్తె. ఆమె హోదాను దృష్టిలో ఉంచుకుని ప్రవక్త(స) తన అనుచరులతో సంప్రదించిన పిదప ఆమెను వివాహమాడారు. ఆ తర్వాత యూదులు అల్ జోబాయిర్ కోటలో గుమిగూడారు. మూడు రోజుల ముట్టడి తర్వాత చివరకు బయటకు వచ్చి ప్రాణాలు కాపాడుకోవడానికి పోరాడారు. పదిమంది యూదులు, కొద్దిమంది ముస్లిములు మరణించారు. చివరకు కోట వశమైంది. ఇక మిగిలిన మూడు కోటలు... అల్‌కాతియా, అల్‌వతీహ్, అస్సులాలమ్‌లలో యూదులు తమ బలాన్నంతా కేంద్రీకరించుకున్నారు. పధ్నాలుగు రోజుల పాటు ముట్టడి కొనసాగింది. చివరకు యూదులు కాళ్ళ బేరానికి వచ్చారు. మొదట వారిని అక్కడి నుంచి బహిష్కరించాలన్న నిర్ణయం జరిగింది. కాని తర్వాత ప్రవక్త (స) మనస్సు మార్చుకుని వారిని అక్కడే ఉండనిచ్చారు. వారి



వ్యవసాయభూములు, తోటలను వారే ఉంచుకోవచ్చని, ఫలసాయంలో సగం కప్పంగా చెల్లించాలని ఒప్పందం కుదిరింది.

ఈ సందర్భంగా ఇద్దరు యూద యువకులు హవైసా, మహిసాలు ఇస్లామ్ స్వీకరించారు. ఒక మేకలకాపరి ఇస్లామ్ స్వీకరించిన తర్వాత ఆ మేకలన్నింటిని వాటి యజమానికి అప్పగించాలని ఆదేశించారు. నిజానికి యుద్ధ సొత్తుగా వాటిని ఉంచుకునే అవకాశం ఉన్నా వాటిని ఇచ్చేయమన్నారు.

ఖైబర్ విజయం ముగిసిన వెంటనే హజ్రత్ జాఫర్ బిన్ అబీ తాలిబ్ అనేక మంది ముస్లిములతో మదీనా వచ్చి ప్రవక్త (స)ను కలుసుకున్నారు. ఖైబర్ విజయోత్సాహంతోపాటు వీరి రాక మరింత ఆనందాన్ని కలిగించింది. బనీ సులైమ్ ప్రాంతంలో గనులు కలిగి ఉన్న హజాజ్ బిన్ అలాత్ సాల్మి ఇస్లామ్ స్వీకరించారు. ఆయన నిరాటంకంగా మక్కా వెళ్ళి అక్కడి నుంచి తన కుటుంబాన్ని, అపారమైన తన సంపదను తెచ్చుకోగలిగారు.

ఖైబర్ యుద్ధం ముగిసిన తర్వాత ముస్లిమ్ దళాలు వాది ఉల్ ఖురా వైపు తిరిగాయి. అక్కడ కొందరు అరబ్బులు, యూదులతో చేతులు కలిపి ఇస్లామ్‌కు బలమైన శత్రుశిబిరంగా మార్చారు. కోటపై నుంచి శత్రువులు ముస్లిమ్ సైన్యంపై రాళ్ళవాన కురిపించారు. ప్రతిరోజు ఎవరో ఒకరు కోట నుంచి బయటకు వచ్చి ద్వంద్వయుద్ధానికి సవాలు చేయడం, హతం కావడం జరిగేది. ఈ ముట్టడి పదకొండు రోజులు కొనసాగింది. ఈ పదకొండు రోజుల్లో పదకొండు మందిని శత్రువులు ద్వంద్వయుద్ధాల్లో కోల్పోయారు. చివరకు వారు లొంగిపోయారు. ఖైబర్ యూదుల మాదిరిగానే కప్పం కట్టి తమ వ్యవసాయ భూములను, తోటలను సాగు చేసుకోవడానికి అనుమతి పొందారు. వాది తైమా యూదులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి ఈ సంధి షరతులకు అంగీకరించి లొంగిపోయారు.

ఈ సైనిక చర్యల వల్ల ముస్లిముల అధీనంలోకి వచ్చిన సువిశాలమైన పంట భూముల్లో ఖైబర్, ఫదక్‌లోని కొన్ని భూములు ముస్లిమ్ కార్మికులు, వారి కుటుంబాలు, నిరుపేదల పోషణకు కేటాయించడం జరిగింది. ప్రవక్త (స) మరణం తర్వాత ఈ భూముల విషయంలో కొంత వివాదం చెలరేగింది. కాని ఖలీఫాగా ఉన్న అబూ బక్ర్ (రజి) ప్రవక్త (స) సహచరులతో సంప్రదించి ఈ భూముల యథాతథ స్థితిని కొనసాగించారు.

హజ్రత్ ఉమర్ (రజి) ఒక సైనికదళాన్ని వెంటబెట్టుకుని బనూ హవాజున్ తెగను హెచ్చరించడానికి వెళ్ళారు. బనూ హవాజున్ వెనక్కి తగ్గారు.

బషీర్ బిన్ దరామ్ (ఉసాయిర్ బిన్ రిజామ్) అనే యూదుడు బనూ గష్ఫాన్ తెగను మదీనాపై దండెత్తేలా రెచ్చగొడుతున్నాడన్న వార్త వచ్చింది. అబ్దుల్లా బిన్ రవాహా ఒక సైనిక దళాన్ని వెంటబెట్టుకుని అక్కడికి వెళ్ళారు. బషీర్‌తొ మాట్లాడి ప్రవక్త (స) వద్దకు వచ్చి మాట్లాడమని అతడిని ఒప్పించి అతడితో మదీనా బయలు దేరారు. దారిలో బషీర్ తిరగబడి అబ్దుల్లా కత్తిని చేజిక్కించుకుని పోరాటానికి దిగాడు. ఈ ఇద్దరి పోరాటం చివరకు దొమ్మిగా మారింది. ఈ దొమ్మిలో 31 మంది యూదులు హతమయ్యారు.

ముహర్రమ్ 7వ తేదీ, హి.శ.7వ సంవత్సరంలో మరోసారి యుద్ధ మేఘాలు కమ్ముకున్నాయి. బనూ మహరిబ్, బనూ తాలాబా, బనూ అమ్మార్, బనూ గష్ఫాన్ తెగలు మదీనాపై దాడి చేయడానికి సన్నాహాలు చేస్తున్నాయన్న సమాచారం అందింది. ప్రవక్త(స) వారిని నిలువరించడానికి సైన్యంతో బయలుదేరారు. కేవలం 400 మందితో ప్రవక్త (స) అక్కడికి వెళ్ళారు. కాని వాళ్ళు పారిపోయారు. ఈ సైనిక చర్యను జాతుర్రికా అంటారు.

బుషాయిర్ బిన్ సువాయిద్ మనిషిని చంపిన బనూ మహ్‌లూహ్ తెగను శిక్షించడానికి ఒక సైనిక దళాన్ని పంపించారు. అబ్దుల్లా లైసీ ఈ దళానికి నాయకుడు. చిన్న ఘర్షణ తర్వాత శత్రువులు కాలికి బుద్ధి చెప్పారు. వారి సొత్తును స్వాధీనం చేసుకోవడం జరిగింది.

బనూ కిలాబ్ దాడికి సిద్ధపడుతున్న వార్త తెలిసిన హజ్రత్ సిద్దీఖ్ వారిని అణచడానికి వెళ్ళారు. చిన్నపాటి ఘర్షణ తర్వాత వాళ్ళు పారిపోయారు.

జహైనా ప్రాంతం నుంచి ఇలాంటి సమస్య తలెత్తుతున్న వార్త వచ్చింది. ఉసామా బిన్ జైద్‌ను ఈ తిరుగుబాటు అణచడానికి పంపారు. వారిని నచ్చచెప్పడానికి ఉసామా ప్రయత్నించారు. కొద్దిసేపటికే చర్చలు ఉద్రిక్తతకు దారితీసి ఘర్షణ చోటు చేసుకుంది. కొద్దిసేపటికే వాళ్ళు ఆ ప్రాంతం వదిలి పారిపోయారు. ఉసామా వారిని వెంటాడసాగారు. వారి నాయకుడు సాహిక్ బిన్ మర్దాస్ బిగ్గరగా విశ్వాసవచనాన్ని పఠించాడు. ఇస్లామ్ స్వీకరిస్తున్న సూచన అది. కాని ఉసామా అదొక ఎత్తుగడగా భావించారు. ప్రాణాలు కాపాడుకోవడానికి వేసిన ఎత్తుగడగా భావించి అతడిని హతమార్చారు. ఈ విషయం ప్రవక్త (స)కు తెలిసి ఆయన చాలా దు:ఖించారు. శత్రువులను సంస్కరించాలన్నదే ఆయన ఉద్దేశ్యం కాని వారిని తుదముట్టించడం కాదు.



ఖైబర్ యూదులకు సహాయమందించిన ఫజారా, అజ్రా తెగలను అణచడానికి ఖజ్‌రజ్ తెగకు చెందిన బుషాయిర్ బిన్ సాద్ బిన్ తాలాబాను పంపారు. కొద్దిపాటి ప్రతిఘటన తర్వాత వారు లొంగిపోయారు.

బనూ సులైమ్, బనూ ఖజా తిరుగుబాట్లను అణచడానికి పంపిన సైనికదళాలు యుద్ధంలో సామూహిక హత్యలకు గురయ్యాయి. ఎందుకంటే ముస్లిమ్ సైనికుల కన్నా శత్రువులు సంఖ్యలో చాలా ఎక్కువగా ఉన్నారు.

అనేక యుద్ధాల్లో ఇస్లామ్ శత్రువులకు సహాయమందించిన బనూ హవాజున్ తెగ సైన్యాన్ని కూడగట్టుకుంటుందని, దాడికి సన్నాహాలు చేస్తుందని తెలిసింది. షుజా బిన్ వహ్బా అసదీ నాయకత్వంలో చిన్న బృందాన్ని అక్కడికి పంపారు. ఎలాంటి ప్రతిఘటన లేకుండా శత్రువులు లొంగిపోయారు.

ఖైస్ బిన్ రిఫా లేదా రిఫా బిన్ ఖైస్ మదీనాపై దాడి చేయడానికి సైన్యసమీకరణ చేస్తున్నట్లు తెలిసింది. అబూ హజ్రత్ అస్లమీ కేవలం ఇద్దర్ని వెంటబెట్టుకుని అక్కడికి వెళ్ళారు. ఆయన చక్కని ఎత్తుగడతో శత్రువును భయభ్రాంతులకు గురిచేశారు. భయపడిన శత్రువులు పారిపోయారు. వారి పశువులను స్వాధీనం చేసుకుని వెనుదిరిగారు.

బనూ ఖజామా మదీనాపై దాడికి సన్నాహాలు చేస్తున్నట్లు తెలిసింది. అమ్ర్ బిన్ ఆస్ 300 మందితో అక్కడికి చేరుకున్నారు. ఆయన జాతుస్సలాసీ వద్దకు వెళ్ళిన తర్వాత ఆయనకు శత్రువులు చాలా పెద్దసంఖ్యలో ఉన్నట్లు తెలిసింది. ఆయన వెంటనే అదనపు బలగాల కోసం కబురు పంపారు. అబూ ఉబైదా ఇబ్నుల్ జర్రా నాయకత్వంలో మరో 200 మంది వచ్చి చేరారు. కాని పెద్ద సంఖ్యలో ఉన్న శత్రువులు కూడా మొదటి దాడి తర్వాతే కాలికి బుద్ధి చెప్పారు. వారి పశువులను స్వాధీనం చేసుకోవడం జరిగింది.

అబూ ఖతాదా, ముహ్‌లామ్ బిన్ జుసామా నిఘా విధులు నిర్వర్తిస్తున్నప్పుడు అమ్ర్ బిన్ అలజ్‌బత్ అష్‌జాయ్ వారికి ఎదురయ్యాడు. అతను అబూ ఖతాదాకు ఇస్లామీయ పద్ధతిలో సలామ్ చేశాడు. కాని ఇదొక ఎత్తుగడగా భావించి అబూ ఖతాదా అతడిని హతమార్చాడు. ఈ చర్యను దివ్యఖుర్‌ఆన్ తీవ్రంగా ఖండించింది.

> **"విశ్వసించిన ప్రజలారా! మీరు అల్లాహ్ మార్గంలో "జిహాద్" కొరకు బయలు దేరినప్పుడు, మిత్రులు, శత్రువుల మధ్య విచక్షణ చేయండి. మీ వైపునకు సలాము చేస్తూ ముందుకు వచ్చేవాణ్ణి, "నీవు ముస్లిమువు కావు" అని త్వరపడి అనకండి.**
> ***(దివ్యఖుర్‌ఆన్ 4 : 94)***

ఈ చర్యను ప్రవక్త(స) కూడా తీవ్రంగా అభిశంసించారు. ఆ తర్వాత హతుడి తెగ నాయకుడు ఉయాయ్‌నా బిన్ బద్ర్ పరిహారం కోరడానికి వచ్చాడు. ప్రవక్త (స) అతడికి 50 ఒంటెలు ఇచ్చారు. ఆ తర్వాత మరో 50 ఒంటెలు ఇస్తామన్నారు. అతను సంతోషంగా ఒప్పుకున్నాడు. హి.శ. 8వ సంవత్సరం, రజబ్ మాసంలో ప్రవక్త (స) ఆదేశాల మేరకు అబూ ఉబైదా 300 మంది ఉన్న దళంతో కోస్తా ప్రాంతానికి వెళ్ళారు. అక్కడ కొన్ని రోజులు ఉన్నారు. ఎలాంటి ఘర్షణ లేకుండా మదీనా తిరిగివచ్చారు. ఈ సైనికచర్య ముఖ్య ఉద్దేశ్యం ఆ ప్రయాణమార్గానికి రక్షణ కల్పించడం, మదీనా ఆ ప్రయాణ మార్గం పట్ల ఆసక్తి కలిగి ఉందని ఖురైషులను హెచ్చరించడం.

హుదైబియా ఒప్పందం ప్రకారం ఆ సంవత్సరం ప్రవక్త (స) వెనుదిరిగి వెళ్ళి మరుసటి సంవత్సరం హజ్‌యాత్ర చేసుకోవచ్చు. ప్రవక్త (స) 2000 మందితో మక్కాకు బయలుదేరారు. ఆయనతో పాటు 100 గుర్రాలు, 60 లేదా 80 ఒంటెలు న్నాయి. ఇవి ఖుర్బానీ పశువులు. అది హి.శ. 7వ సంవత్సరం. ఆయుధాలు ఒరల్లోనే ఉన్నాయి. వాటిని యహాజ్ వద్ద వదిలేశారు. ఒప్పందం ప్రకారం ఖురైషులు కాబా గృహం తలుపులు తెరువవలసి ఉంది. ఇస్లామ్ పట్ల ఘోరశత్రుత్వం ఉన్న కొద్దిమంది ఖురైషులు ఈ ముస్లిముల బృందాన్ని చూడ్డం ఇష్టంలేక ఖిఖాన్ కొండపైకి, మరి కొన్ని చోట్లకు వెళ్ళిపోయారు. కాని మక్కాలో పురుషులు స్త్రీలు దారికి ఇరుపక్కలా నిలుచుని ఈ ముస్లిముల బృందాన్ని చూడ్డానికి ఉత్సుకత ప్రదర్శించారు. ప్రవక్త (స) అధిరోహించిన ఒంటె తాడును అబ్దుల్లా బిన్ రవాహా పట్టుకుని పాడుతూ నడుస్తున్నారు. ఆ గేయం పంక్తులు :

"ఆ ఏకైక దేవుని పేరుతో ఆయన మార్గమే సత్యమార్గం
ఆ ఏకైక దేవుని పేరుతో ఆయన ప్రవక్త ముహమ్మద్ (స)
మా మార్గం నుంచి తప్పుకోండి అవిశ్వాసుల్లారా
ఇది మాకు కరుణామయుడు పంపిన పుస్తకం ద్వారా బోధించబడింది
ఆ దేవుడి కోసం పోరాడేదే ఉత్తమమైన యుద్ధం
ఓ దైవమా నేను ప్రవక్త (స) చెప్పింది విశ్వసిస్తున్నాను."

ఈ గేయంలోని కొన్ని పంక్తుల్లో సత్య సందేశం మొత్తాన్ని వినిపించడం జరిగింది. ఈ సందేశం అనేక సంవత్సరాలుగా మక్కాకు చేరలేదు. మక్కాలో ఇస్లామ్ పట్ల మక్కువ ఉన్నా బయటపడని వాళ్ళు ఈ దృశ్యం చూసి చాలా సంతోషించారు.



మూడు రోజుల పాటు అక్కడి వాతావరణంలో ఈ సత్యసందేశం ప్రతిధ్వనించింది. నాల్గవరోజు ప్రవక్త (స) అన్సారులతో కూర్చుని ఉండగా సుహేల్ బిన్ అమ్ర్, హువైతాబ్ బిన్ అబ్దుల్ ఉజ్జా అక్కడికి వచ్చారు. మూడు రోజులైపోయాయి కాబట్టి ఇక ఆ ప్రాంతం వదిలి వెళ్ళిపోవాలని చెప్పారు. ఈ పొగరుబోతు మాటలకు సాద్ బిన్ ఉబాదా మండిపడ్డారు. "ఈ నేల నీది కాదు, నీ బాబుది కాదు, మేం వెళ్ళేది లేదు" అన్నారు. కాని ప్రవక్త (స) చాలా మృదువుగా మాట్లాడారు. ఆయన అప్పుడే హజ్రత్ మైమూనాను వివాహం చేసుకుని ఉన్నారు. అదే విషయాన్ని చెబుతూ "నేను ఇప్పుడే వివాహం చేసుకున్నాను. వంటలు పూర్తయ్యాయి. మీరు కూడా విందు ఆరగించి వెళితే బాగుంటుంది" అన్నారు. కాని వాళ్ళిద్దరు చాలా మొండిగా "మాకు విందు వద్దు.. మీరు తక్షణం వెళ్ళిపోవాలి" అన్నారు.

ముస్లిములు పోషణలేమి వల్ల, జ్వరాల వల్ల చాలా బలహీనమైపోయారన్న ప్రచారం కూడా అప్పుడు జరుగుతోంది. ఈ ప్రచారాన్ని తిప్పి కొట్టడానికి ప్రవక్త (స) తన వారందరూ నిటారుగా రొమ్ము విరుచుకుని నడవాలని ఆదేశించారు. ఈ దృశ్యం సాధారణ ప్రజలపై చాలా ప్రభావం వేసింది.

## మక్కా విజయం

ఈ సైనిక చర్యల ద్వారా ప్రవక్త (స) శత్రువులపై ఆధిపత్యం సంపాదించారు. ఇక మిగిలింది మక్కాలో శత్రువుల కంచుకోటను ధ్వంసం చేయడం. అంతకు ముందు జరిగిన బద్ర్, ఉహుద్, కందకయుద్ధాలు మదీనా సమీపంలో, మదీనా నగరాన్ని శత్రుదాడి నుంచి కాపాడ్డానికి జరిగిన యుద్ధాలు. కందకయుద్ధం తర్వాత ప్రవక్త (స) దూరదృష్టితో ఇక ఖురైషుల అణిచివేతలు అంతరించాయని, మక్కా విజయం త్వరలోనే ఉందని భవిష్యవాణి వినిపించారు. ఆ పిదప హుదైబియా ఒప్పందం కుదిరింది. ఈ ఒప్పందం వల్ల లభించిన శాంతికాలాన్ని ప్రవక్త (స) తన శక్తిసామర్థ్యాలు మరింత పటిష్టపరచుకోడానికి ఉపయోగించుకున్నారు. ద్రోహులు, చొరబాటుదారులకు వ్యతిరేకంగా సమయానుకూలంగా కఠినచర్యలు తీసుకోవడం వల్ల మదీనా చుట్టుపక్కల శాంతియుత వాతావరణం ఏర్పడింది. మదీనాలో మొలకెత్తిన ఇస్లామీయ రాజ్యం ఇక మహావృక్షంగా ఎదుగుతోందన్న సత్యాన్ని అందరూ గుర్తించారు. ఖురైషుల దురదృష్టమేమంటే, వారు స్వయంగా హుదైబియా ఒప్పందాన్ని రద్దుచేసుకున్నారు.

ఆ వెంటనే ప్రవక్త (స) తన సైన్యాన్ని సమీకరించారు. ఆయుధ సేకరణకు

ఆదేశాలు జారీచేశారు. సైనికచర్య గురించి ప్రవక్త (స) చాలా రహస్యంగా ఉంచారు. ఆయనకు కవచం తొడిగిన హజ్రత్ ఆయెషా (రజి)కు కూడా ఈ సైనికచర్య ఎవరిపై జరుగుతుందో తెలియదు. పదివేల మంది స్వచ్ఛంద సైనికులు సైన్యంలోకి వచ్చారు. ఇంత భారీ సైన్యాన్ని సమీకరించడం ఒక్కటే మక్కాపై దాడికి సూచనగా కనబడింది తప్ప మరో సూచనేది లేదు.

రమజాన్ మాసం 10వ తేదీన ప్రవక్త(స) పదివేల సైన్యంతో మదీనా నుంచి బయలుదేరారు. ఆయన మక్కాకు వెళ్ళే మార్గాన్ని కూడా జాగ్రత్తగా ఎంచుకున్నారు. చుట్టు తిరిగి మక్కాకు బయలుదేరారు. ఆ విధంగా ఖురైషుల నిఘాబృందాలను అయోమయంలో పడేశారు. ఖురైషుల నిఘా బృందాలు ఆయన సైనిక కదలికలను పరిశీలించడానికి ఎటో తిరుగుతుండగా, అకస్మాత్తుగా ఆయన సైన్యం మక్కా సమీపానికి చేరుకుంది. ప్రవక్త (స) హైఫా వద్దకు చేరుకున్నప్పుడు, ప్రవక్త (స)గారి పినతండ్రి అబ్బాస్ (రజి) తన కుటుంబంతో వచ్చి ప్రవక్త (స)ను కలుసుకున్నారు. అబవా చేరుకోగానే ప్రవక్త (స)కు వరుసకు సోదరుడైన అబూ సుఫ్యాన్, హజ్రత్ ఉమ్మె సల్మాకు సవతి సోదరుడు అబ్దుల్లా బిన్ ఉమయ్యా వచ్చి కలిశారు. కాని వారిద్దరు సన్నిహిత బంధువులైనప్పటికీ ప్రవక్త (స)ను అమానుషంగా వేధించినవాళ్ళు. ప్రవక్త (స) వారిని కలుసుకోడానికి నిరాకరించారు. నిరాశతో అబూ సుఫ్యాన్ తాము తమ కుటుంబాలతో మండే ఎడారి ఇసుకలో పడుకుని ఆకలిదప్పులతో ప్రాణాలు వదులుతామని ప్రకటించారు. హజ్రత్ ఉమ్మె సల్మా తన సవతి సోదరుడి కోసం ప్రవక్త (స)తో వేడుకున్నారు. హజ్రత్ అలీ (రజి) వారికి సలహా ఇస్తూ ప్రవక్త యూసుఫ్ (అస) సోదరులు ఏ విధంగా ఆయన్ను క్షమాపణ వేడుకున్నారో అదే విధంగా ప్రవక్త ముహమ్మద్ (స)ను క్షమాపణ కోరుకొమ్మని అన్నారు. ప్రవక్త యూసుఫ్ (అస) సోదరులు ఆయనతో "దేవుని తోడు, నీవు మాపై ఆధిపత్యం పొందావు. నిస్సందేహంగా మేము తప్పు చేశాము" అని క్షమాపణ వేడుకున్నారు. ఈ పదాలతో వాళ్ళు క్షమాపణ కోరడం వినగానే ప్రవక్త (స) కూడా ప్రవక్త యూసుప్ (అస) మాదిరిగా "ఈ రోజు మీపై ఎలాంటి ఆరోపణ లేదు. దేవుడు మీకు క్షమాపణ ప్రసాదించాలి. ఆయన అమితదయాళువు, అపార కృపాశీలుడు" అన్నారు.

ముస్లిమ్ సైన్యం మారుజ్జహ్రాన్ వద్ద మజిలీ చేసింది. ప్రతి మనిషి తన ఆహారం వండుకోడానికి ప్రత్యేకంగా పొయ్యి వెలిగించాలని ప్రవక్త (స) తన సైన్యాన్ని ఆదేశించారు. శత్రువుల నాయకుడు అబూసుఫ్యాన్ బిన్ హర్బ్, బుదాయిల్ బిన్ వరఖాలు ఒక ఎత్తయిన ప్రదేశం నుంచి పదివేల పొయ్యిలు మండుతున్న దృశ్యాన్ని



చూసి బెంబేలెత్తారు. అటునుంచి వెళుతూ హజ్రత్ అబ్బాస్ (రజి) అబూసుఫ్యాన్ స్వరం గుర్తించి అతడిని పలకరించారు. సుఫ్యాన్‌తో మాట్లాడుతూ ప్రవక్త (స) చాలా పెద్ద సైన్యంతో వచ్చారని, ఖురైషులను అణిచివేయడం ఖాయమని అన్నారు. ఈ సమస్యకు ఏదన్నా పరిష్కారం ఉందా అని అబూసుఫ్యాన్ ఆయన్ను అడిగారు. హజ్రత్ అబ్బాస్ (రజి) సమాధానమిస్తూ, తన గుర్రంపై తనతో పాటు వచ్చి ప్రవక్త (స)ను కలుసుకుని మాట్లాడమన్నారు. అబూసుఫ్యాన్ అంగీకరించి హజ్రత్ అబ్బాస్ (రజి)తో పాటు ముస్లిమ్ సైన్యం విడిది చేసిన ప్రదేశానికి వచ్చారు. వారిద్దరిని ప్రతి చోట ముస్లిమ్ సైనికులు అడ్డుకున్నారు. కాని హజ్రత్ అబ్బాస్ (రజి) జోక్యం చేసుకోవడంతో అబూసుఫ్యాన్ ముందుకు వెళ్ళగలిగారు.

దారిలో హజ్రత్ ఉమర్ (రజి) వారిని చూశారు. వెంటనే అబూసుఫ్యాన్‌ను కడతేర్చే అనుమతి పొందడానికి తన వాహనాన్ని శరవేగంగా ప్రవక్త (స) వద్దకు పోనిచ్చారు. అది చూసి హజ్రత్ అబ్బాస్ (రజి) కూడా తన గుర్రాన్ని ముందుకు దూకించారు. హజ్రత్ ఉమర్ (రజి) అతివేగంగా ఆయన కన్నా ముందు చేరుకున్నారు. కాని హజ్రత్ ఉమర్ (రజి) ప్రవక్త (స)తో మాట్లాడుతున్నప్పుడే అక్కడికి హజ్రత్ అబ్బాస్ (రజి) చేరుకుని అబూ సుఫ్యాన్ తన శరణులో ఉన్నారని, తానే ఆయన్ను తీసుకొచ్చానని ప్రకటించారు. ప్రవక్త (స) అబూ సుఫ్యాన్ వైపు తిరిగి "దేవుడు తప్ప మరో ఆరాధ్యుడు లేడన్న విషయంలో నీకు ఇంకా అనుమానాలున్నాయా?" అని ప్రశ్నించారు.

అబూ సుఫ్యాన్ జవాబిస్తు "మరో ఆరాధ్యుడు ఉన్నట్లయితే మాకు సహాయంగా వచ్చి ఉండేవాడు" అన్నారు.

ప్రవక్త ముహమ్మద్ (స) "నేను దైవప్రవక్తనన్న విషయంలో నీకు ఇంకా అనుమానం ఉందా?" అనడిగారు. అబూ సుఫ్యాన్ ఈ ప్రశ్నకు జవాబిస్తూ "ఇంకా కొద్దిపాటి అనుమానం మిగిలే ఉంది" అన్నారు. అప్పుడు హజ్రత్ అబ్బాస్ (రజి) అబూ సుఫ్యాన్‌కు నొక్కి చెబుతూ "ఇస్లామ్ స్వీకరించు" అన్నారు. మర్నాడు తెల్లవారేసరికి ఇస్లామ్‌ను అతి తీవ్రంగా వ్యతిరేకించిన శత్రువుల నాయకుడు ముస్లిమ్‌గా మారిపోయాడు.

కాని మక్కాలోకి ముస్లిమ్ సైన్యం ప్రవేశించే ముందు అబూసుఫ్యాన్‌పై గట్టి నిఘా ఉంచారు. కాని ఆ విషయం అబూ సుఫ్యాన్‌కు తెలియదు. సైన్యం మక్కాలో ప్రవేశించడానికి "కదా" ప్రదేశం నుంచి వెళుతున్నప్పుడు హజ్రత్ అబ్బాస్ (రజి) ప్రవక్త (స) ఆదేశం మేరకు అబూ సుఫ్యాన్‌ను కాస్త ఎత్తయిన్న ప్రదేశానికి తీసుకెళ్ళి

ముస్లిమ్ సైన్యం ఎంత బలంగా ఉందో చూపించారు. ఆ సైన్యంలో అనేక తెగలున్నాయి. ప్రతి తెగ తన నాయకుడి వెనుక ఆ తెగ తన ప్రత్యేక పతాకంతో కదులుతోంది. అబూ సుఫ్యాన్ ప్రతి తెగ గురించి అడిగి తెలుసుకున్నాడు. వివిధ తెగల సైనిక దళాలు ఒకటి తర్వాత ఒకటిగా ఆయన కళ్లముందు నడిచిపోతున్నాయి. సాద్ బిన్ ఉబాదా తన దళంతో అబూ సుఫ్యాన్ ముందు నుంచి నడిచి వెళుతున్నప్పుడు, అబూ సుఫ్యాన్‌ను చూడగానే ఖురైషుల సుదీర్ఘ అణచివేతలు ఆయనకు గుర్తొచ్చాయి. సాద్ బిన్ ఉబాదా ఆగ్రహం పట్టలేక "ఈరోజు గొప్ప విజయం సాధించిన రోజు... ఈ రోజు కాబాగృహం పవిత్రత మసదైన రోజు" అని బిగ్గరగా అరిచారు. ఈ మాటలు ప్రవక్త (స) విన్నారు. ఆయన వెంటనే సాద్‌బిన్ ఉబదా నుంచి వారి దళం పతాకాన్ని తీసుకుని, ఆయన కొడుకు చేతికి ఇవ్వాలని ఆదేశించారు. ఆ తర్వాత ఇలా అన్నారు. "ఈరోజు కాబా గృహం ఔన్నత్యం, దయ ధర్మపరాయణతలు ప్రకటితమైన రోజు" అన్నారు. ఆ దళం అత్యంత నిరాడంబరంగా, హజ్రత్ జుబైర్ బిన్ అవ్వామ్ చేతుల్లో పతాకం రెపరెపలతో నడిచిపోయింది. ఒక చిన్న వాక్యంతో ప్రవక్త (స) విజేతగా తన విధానమేమిటో అక్కడే ప్రకటించారు. ఆ వెంటనే విజేత సైన్యం తరఫున ప్రకటన వెలువడింది. కాబా గృహం ఆవరణలో ఆశ్రయం పొందిన వారికి భయం లేదని, అబూసుఫ్యాన్ ఇంట ఆశ్రయం పొందిన వారికి భయం లేదని, ముస్లిమ్ సైన్యంపై కత్తి ఎత్తని వారు, వారిపై తీవ్రనేరారోపణ ఏదీ లేకపోతే సురక్షితంగా ఉంటారని ప్రకటించారు. అబూసుఫ్యాన్ స్వయంగా బిగ్గరగా ఎలుగెత్తి ఈ ప్రకటన చేశారు. ఈ ప్రకటన విన్న వెంటనే అబూ సుఫ్యాన్ భార్య, ఉత్బా కుమార్తె హిందా ఆగ్రహంగా తన భర్త మీసాలు పట్టుకుని లాగుతూ "బనూ కినానా ప్రజలారా! వీడేం చెబుతున్నాడు? వీడిని చంపేయండి" అని అరిచింది. ఆమె భర్తను తీవ్రస్వరంతో నిందిస్తూనే ఉంది. ఈ లోగా అక్కడ చాలా మంది గుమిగూడారు. కాని అబూ సుఫ్యాన్ చాలా ప్రశాంతంగా మాట్లాడుతూ, ఇప్పుడు ఈ ఆగ్రహావేశాల వల్ల ఎలాంటి ప్రయోజనం లేదని, ఇప్పుడు ప్రవక్త (స) సైన్యాన్ని ఎవరూ ఎదుర్కొనే పరిస్థితి లేదని అన్నారు. ప్రవక్త (స) మక్కా విజయం తర్వాత నగరంలోకి ప్రవేశిస్తున్నప్పుడు సాధారణ విజేతల మాదిరిగా గర్వంగా వ్యవహరించ లేదు. ఆయన తన తలవాల్చి, దేవునికి ధన్యవాదాలు తెలుపుతూ ప్రవేశించారు. ఆయన తల ఎంతగా వాలిందంటే, ఒంటె మూపుకు తగిలేంతగా వాలింది, మరోవైపు ఆయన ఫతహ్ సూరా పఠిస్తూ అక్కడికి వచ్చారు.

ఇక్రమా బిన్ అబూ జహల్, సఫ్వాన్ బిన్ ఉమయ్యా, సుహేల్ బిన్ అమ్రులు



మరికొంత మంది అల్లరిశక్తులను కూడగట్టుకుని ఖాందామా కొండ వద్ద దాడికి పథకం వేయసాగారు. హమ్స్ బిన్ ఖైస్ బిన్ ఖాలిద్ కూడా వారితో చేరాడు. ఈ అల్లరి శక్తులు అక్కడ కుట్ర చేస్తున్నప్పుడే ప్రవక్త (స) అనుచరులిద్దరు, కుర్జ్ బిన్ జాబిర్ అల్‌ఫహ్రీ, ఖునాయిస్ బిన్ ఖాలిద్ బిన్ రాబి తమ శిబిరం నుంచి బయట తిరుగుతూ అటుగా వచ్చారు. వారిద్దరినీ ఈ అల్లరిశక్తులు హతమార్చాయి. హజ్రత్ ఖాలిద్‌కు ఈ విషయం తెలియగానే వారిపై మెరుపుదాడి చేసారు. ఈ పోరాటంలో శత్రువులు పన్నెండు మంది హతమయ్యారు. హమ్స్‌తో సహా మిగిలిన వారు పారిపోయారు. నగరంలో కూడా మరో గుంపు దాడికి పన్నాగాలు వేసింది. హజ్రత్ అబూ హురైరా (రజి) నాయకత్వంలో ఒక దళాన్ని ప్రవక్త (స) వారిని అణచడానికి పంపించారు. అల్లరిశక్తులు సమస్యలు సృష్టించడానికి ప్రయత్నిస్తే కఠినంగా వ్యవహరించి హతమార్చమని ఆదేశించారు. ఈ ఆదేశం గురించి తెలియగానే అబూసుఫ్యాన్ అక్కడకు చేరుకున్నారు. ఖురైషులకు అప్పటికే చాలా నష్టం వాటిల్లిందని, వారిని పూర్తిగా తుడిచిపెట్టవద్దని వేడుకున్నాడు. పోరాటంలో కొంతసేపు ప్రతిఘటించిన తర్వాత అల్లరిశక్తులు పలాయనం చిత్తగించాయి.

ఖురైషుల పట్ల ప్రవక్త (స) మెతగ్గా వ్యవహరించడాన్ని మదీనాకు చెందిన అన్సార్లు గమనిస్తూ వచ్చారు. వారిలో కొద్దిపాటి అసమ్మతి చోటు చేసుకుంది. ప్రవక్త (స) తన స్వస్థలం, తన స్వంత ప్రజల పట్ల ప్రేమ వల్ల అలా వ్యవహరిస్తున్నారని, ప్రవక్త (స)కు తమ పట్ల ఉన్న ప్రేమాభిమానాలు తగ్గుముఖం పడతాయేమోనని భయపడ్డారు. ఈ విషయం ప్రవక్త (స) వరకు చేరింది. ఆయన వెంటనే అన్సార్లను ఉద్దేశించి ప్రసంగించారు. "దేవుని తోడు, నేను అలా వ్యవహరించేవాడిని కాదు. నేను దేవుడి సేవకుడిని. దేవుడి ప్రవక్తని. దేవుడి ఆదేశం ప్రకారం నేను మీతో కలిసి జీవించాలనుకుంటున్నాను. జీవితాంతం వరకు నేను మీతోనే ఉంటాను" అన్నారు. ఈ ప్రసంగం అన్సార్లను కదిలించివేసింది. తమ అనుమానాలు, అపార్థాలకు సిగ్గుపడి క్షమాపణ వేడుకున్నారు. ప్రవక్త (స) వారిని మన్నించారు.

ప్రవక్త (స) మక్కాలోని తన పూర్వీకుల ఇంట్లో నివసించాలనుకుంటున్నారా అని చాలా మంది అడిగారు. ప్రవక్త (స) ఎంతో విచారంగా జవాబిస్తూ "నేనక్కడ ఉండడానికి, అఖీల్ నా ఇంటి ఆనవాలు కూడా లేకుండా చేశాడు" అన్నారు. ఆయన పతాకాన్ని హాజున్ (జన్నతుల్ ముల్లా) వద్ద ప్రతిష్ఠించారు. ఆయన అక్కడ విడిది చేయాలనుకున్నారు. ఆయన మొదట చారిత్రక ప్రదేశం ఖాయిఫ్‌కు వెళ్ళారు. అక్కడే ఆయన తన వారితో కలిసి నిర్బంధజీవితాన్ని కొంతకాలం గడుపవలసి

వచ్చింది. ఆ తర్వాత సన్నిహిత సహచరులతో కలిసి కాబాగృహాన్ని సందర్శించారు. అక్కడ నల్లరాతిని ముద్దాడారు. ఆ తర్వాత అక్కడ ఉన్న ప్రతి ఒక్క విగ్రహం వద్దకు వెళ్ళి తన విల్లుతో దాన్ని తాకుతూ

**"సత్యం వచ్చేసింది. అసత్యం నశించింది. అసత్యం నశించక తప్పదు"**

***(దివ్యఖుర్ఆన్ 17 : 81)***

అని ప్రకటించారు. విల్లు తాకగానే ప్రతి విగ్రహం నేలకొరిగింది. ఆ తర్వాత ఆయన కాబాగృహం తాళం చెవులు తెప్పించారు. తలుపులు తెరిపించారు. కాబా గృహం లోపల హజ్రత్ ఇబ్రాహీమ్ (అస), హజ్రత్ ఇస్మాయీల్ (అస)ల చిత్రపటాలున్నాయి. చేతుల్లో బాణాలను జూదంలో పాచికల్లా పట్టుకున్న చిత్రాలు. ప్రవక్త (స) వెంటనే వాటిని చెరిపివేయమన్నారు. "ఈ అవిశ్వాసులను దేవుడు శపించుగాక, ఈ ఇద్దరు దేవుని ప్రవక్తలు (అస); వారెన్నడు జూదమాడలేదు" అన్నారు. ఆ తర్వాత ప్రవక్త (స) ఆదేశం మేరకు కాబాగృహం చుట్టు ఉన్న విగ్రహాలను ధ్వంసం చేశారు. ప్రవక్త (స) ఆ పిదప దైవప్రార్థనలో మోకరిల్లారు. బయట పెద్ద సంఖ్యలో ప్రజలు తమకేం జరుగనుందో అన్న ఆందోళనతో గుమికూడి ఉన్నారు. ప్రవక్త (స) బయటకు వచ్చి వారిని ఉద్దేశించి ప్రసంగించారు.

"అల్లాహ్ తప్ప ఆరాధ్యుడు ఎవ్వరూ లేరు. ఆయనకు భాగస్వాములు ఎవరూ లేరు. ఆయన తన వాగ్దానాన్ని నెరవేర్చాడు. తన దాసుడికి సహాయం చేశాడు. ఒంటి చేత్తో సమస్త సైన్యాలను నిర్మూలించాడు. నేడు అన్ని విధాల అహంకారాలు, రక్తపరిహారాలు అన్నీ నా పాదాల క్రింద ఉన్నాయి. కేవలం కాబాగృహం సంరక్షణ, యాత్రికులకు నీటిసరఫరా విధులకు మాత్రమే మినహాయింపు ఉంది. "ఖురైషులారా! మీ అజ్ఞాన అహంకారం, పుట్టుకరీత్యా గొప్పవాళ్ళమన్న గర్వం అణగారిపోయాయి. సమస్త మానవులు ఆదమ్ సంతానం. ఆయన మట్టితో సృష్టించబడ్డారు."

ఈ మాటలన్న తర్వాత ఆయన దివ్యఖుర్ఆన్ పఠించారు.

**"మానవులారా! మేము మిమ్మల్ని ఒకే పురుషుని నుండి, ఒకే స్త్రీ నుండి సృజించాము. తరువాత మీరు ఒకరినొకరు పరిచయం చేసుకునేందుకు మిమ్మల్ని జాతులు గాను, తెగలు గానూ చేశాము. వాస్తవానికి మీలో అందరి కంటే ఎక్కువ భయభక్తులు కలవాడే అల్లాహ్ దృష్టిలో ఎక్కువ గౌరవపాత్రుడు, నిశ్చయంగా అల్లాహ్ సర్వజ్ఞానం కలవాడు, సకల విషయాలూ తెలిసిన వాడూను."** ***(దివ్యఖుర్ఆన్ 49 : 13)***



ఆ తర్వాత ఆయన ఒక శాసన ప్రకటన చేశారు.

"దేవుడు మద్యం వ్యాపారాన్ని నిషేధించాడు"

ఆ పిదప ఆయన అక్కడున్న వారిని ప్రశ్నిస్తూ "మీ పట్ల నేను ఎలా వ్యవహరిస్తానని అనుకుంటున్నారు?" అని ప్రశ్నించారు.

ఈ ప్రశ్నతో పాటు 21 సంవత్సరాలుగా ఖురైషులు ముస్లిములపై చేసిన దౌర్జన్యాలు, అణిచివేతలు, క్రూర అమానుష వ్యవహారాలు వారి కళ్ళ ముందు తిరిగి ఉంటాయి. వారు విధేయంగా, పరాభవభారంతో, పశ్చాత్తాపభావంతో జవాబిస్తూ "మీరు ఒక మంచి సోదరులు. ఒక మంచి సోదరుని కుమారులు." అన్నారు. ప్రవక్త (స) మాట్లాడుతూ "ఈ రోజు మీపై ఎలాంటి నేరారోపణ లేదు. మీరందరూ స్వతంత్రులు.. వెళ్ళండి." అన్నారు.

ఇక్కడ ఒక విషయాన్ని జ్ఞాప్తికి తెచ్చుకోవాలి. కాబాగృహం తాళం చెవులు సంరక్షించే ఉస్మాన్ బిన్ తల్హా గతంలో ఒకసారి ప్రవక్త (స) కాబా గృహాన్ని తెరవమని కోరినప్పుడు నిర్ద్వంద్వంగా తిరస్కరించాడు. అప్పుడు ప్రవక్త (స) భవిష్యవాణి తెలియజేస్తూ "ఒకరోజు ఈ కాబాగృహం తాళాలు నా దగ్గర ఉంటాయి. నేను నాకు ఇష్టం వచ్చిన వారికి ఈ తాళాల బాధ్యత అప్పగిస్తాను" అన్నారు. అప్పుడు ఉస్మాన్ జవాబిస్తూ "అది మొత్తం ఖురైష్ జాతి యావత్తు చంపబడినప్పుడు కాని సాధ్యం కాదు" అన్నాడు. దానికి ప్రవక్త (స) జవాబిస్తూ "కాదు, అది ఖురైషులు నిజమైన ఔన్నత్యం సాధించుకున్న రోజవుతుంది" అన్నారు.

మక్కా విజయం తర్వాత కాబాగృహం తాళాలు తెప్పించుకున్న ప్రవక్త (స)తో హజ్రత్ అలీ (రజి) ఆ తాళాలు తనకు ఇవ్వవలసిందిగా కోరారు. కాని ప్రవక్త (స) మాత్రం ఆ తాళాలను తిరిగి పాత సంరక్షకుడు ఉస్మాన్‌కే అప్పగించారు. ఉస్మాన్ గతంలో తనకు ప్రవక్త (స)కు మధ్య జరిగిన సంభాషణ గుర్తు చేసుకుంటూ, "నిజంగా మీరు దైవప్రవక్త" అని ప్రకటించాడు.

"నమ్మకం, జాలి దయల రోజు ఈ రోజు" అన్నారు ప్రవక్త (స)

ప్రవక్త (స) ఆదేశాల మేరకు హజ్రత్ బిలాల్ (రజి) కాబాగృహం పైకెక్కి అజాన్ వినిపించారు. అది ఇస్లామీయ ఉద్యమ విజయానికి సంకేతంగా ప్రతిధ్వనించింది. ఆ పిదప ప్రవక్త(స) ఉమ్మె హానీ ఇంట స్నానం చేసి, ఎనిమిది రకాతుల కృతజ్ఞతా నమాజులు చేశారు. మర్నాడు కూడా ప్రవక్త (స) సఫా కొండ నుంచి ప్రజలను ఉద్దేశించి ప్రసంగించారు. కాబాగృహం పవిత్రతను వివరించారు. కాబా పవిత్రత శాశ్వతంగా స్థాపించబడింది.

ఆ తర్వాత అనేక వ్యాఖ్యాలు ముందుకు వచ్చాయి. ఈ వ్యాఖ్యాలన్నింటిలోను న్యాయబద్ధమైన తీర్పుల్లో జాలీదయలే ప్రాబల్యం వహించాయి. సర్వసాధారణ క్షమాభిక్ష ప్రకటించడం జరిగినప్పటికీ, తీవ్రమైన నేరాలకు పాల్పడిన కొందరికి మాత్రం మరణశిక్ష విధిస్తూ వారెక్కడ దొరికినా హతమార్చాలని చెప్పారు. ఇందులో స్త్రీలు, పురుషులు కూడా ఉన్నారు. అయితే ఈ జాబితాలో చాలా మందిని తర్వాత క్షమించడం జరిగింది. ఈ విధంగా మరణశిక్షకు గురైనవారు నలుగురికి మించి లేరు. మరొక కథనం ప్రకారం కేవలం ఒకే ఒక్క వ్యక్తి అబ్దుల్ ఉజ్జా ఇబ్నే హంజల్‌కు మరణశిక్ష పడింది. ఇతను మొదట ఇస్లామ్ స్వీకరించానని ప్రకటించాడు. అతడిని జకాత్ వసూలు కోసం పంపడం జరిగింది. జకాత్ సొమ్ము వసూలు చేసిన తర్వాత అతను తనతో ఉన్న ఇతర ముస్లిములను చంపి ఖుర్బానీ పశువులతో సహా పారిపోయాడు.

మరణశిక్ష పడి తర్వాత క్షమాపణ పొందిన వారిలో సఫ్వాన్ బిన్ ఉమయ్యా ఒకడు. ఇస్లామ్ పట్ల తీవ్రవిద్వేషాన్ని, వైరాన్ని ప్రదర్శించిన సఫ్వాన్ మక్కా విజయం తర్వాత యమన్ పారిపోవడానికి ప్రయత్నించాడు. కాని దారిలో జిద్దా వద్ద అతనికి ప్రవక్త (స) క్షమించారన్న వార్త అందింది. ఉమైర్ బిన్ వహ్బా జమ్హీ ఈ వార్త చేరవేశారు. అతను మక్కా తిరిగి వచ్చి ఇస్లామ్ స్వీకరించాడు. ఇక్రమా బిన్ అబూ జహల్ కూడా ఎమన్ పారిపోవడానికి ప్రయత్నించాడు. కాని అతడి భార్య అబూజహల్ మేనకోడలు ఉమ్మె హాకిమ్ ఇస్లామ్ స్వీకరించింది. ఆమె తన భర్తకు క్షమాభిక్ష సాధించుకుని అతడిని తీసుకువచ్చింది. తనలాంటి ప్రాణశత్రువును కూడా ప్రవక్త(స) క్షమించారని తెలుసుకుని అతను ఆశ్చర్యపోయాడు. అబ్దుల్లా బిన్ అబీ సాద్ బిన్ అబీ సారా చేసిన నేరం చాలా తీవ్రమైనది. ఇతను ఇస్లామ్ స్వీకరించిన తర్వాత, దివ్యఖుర్ఆన్‌గా అవతరించిన దైవవాక్యాలను సంరక్షించే బాధ్యత ఈయనకు ప్రవక్త (స) అప్పగించారు. కాని ఇతను శత్రువులతో కలిసి కుట్ర పన్నాడు. దేవుని సందేశాన్ని, దైవవాక్యాలను నిజానికి తానే స్వీకరించేవాడినని, ముహమ్మద్ (స) తన నుంచి వాటిని విని రాసుకునేవారని కూడా ప్రకటించాడు. (ప్రవక్త (స)కు చదవనూ రాయనూ రాదని గమనించాలి). ఇతని నేరం చాలా తీవ్రమైనది. మరణశిక్ష తప్పని నేరం అది. కాని హజ్రత్ ఉస్మాన్ (రజి) బలంగా సిఫారసు చేయడం వల్ల ఇతడిని కూడా క్షమించడం జరిగింది. ఆ తర్వాత కూడా అతను ముస్లిమ్‌గానే ఉన్నాడు. మరో శత్రువు మిక్యాస్ బిన్ సబాబా. ఇతను శత్రువుల గూఢచారిగా వ్యవహరించడానికి ఇస్లామ్ స్వీకరించాడు. అన్సార్ తెగకు చెందిన ఒక ముస్లిమ్‌ని



మోసంతో చంపి పారిపోయాడు. ఇతను పాల్పడిన ఇంకా భయంకరమైన నేరాలు ఉండడం వల్ల ఇతనికి కూడా మరణశిక్ష విధించారు. నీచమైన నేరాలకు పాల్పడిన మరో వ్యక్తి హబ్బార్ ఇబ్నుల్ అస్వద్. ఇతను పాల్పడిన నేరాల్లో హజ్రత్ జైనబ్ మదీనా నుంచి మక్కా వస్తున్నప్పుడు ఆమెపై దాడి చేయడం ఒకటి. ఈ దాడిలో ఆమెకు గర్భస్రావం అయ్యింది. కొంతకాలం రహస్య జీవితం గడిపిన తర్వాత ఇతను లొంగిపోయాడు. పశ్చాత్తాపం ప్రకటించి, క్షమాపణ కోరుకుని ఇస్లామ్ స్వీకరించాడు. ప్రవక్త (స) అతడిని క్షమించి వదిలేశారు. అంతేకాదు, హజ్రత్ హంజా (రజి)ను హతమార్చిన వ్యక్తి లొంగిపోయి ఇస్లామ్ స్వీకరించాడు. ప్రవక్త (స) అతడిని కూడా క్షమించి వదిలేశారు. తన ముందుకు ఎప్పుడూ రావద్దని, అతడి ముఖాన్ని చూస్తే ఆ విషాదకర సంఘటన గుర్తుకు వస్తుందని చెప్పారు. అబ్దుల్లా బిన్ జిబార్ ఇస్లామ్‌కు వ్యతిరేకంగా విద్వేషపూరితమైన కవితలు రాసేవాడు. అతను కూడా లొంగిపోయి ఇస్లామ్ స్వీకరించాడు. ప్రవక్త (స) అతడిని కూడా క్షమించి వదిలేశారు. కాబ్ బిన్ జుహైర్ కూడా ఇస్లామ్‌కు వ్యతిరేకంగా రెచ్చగొట్టే రాతలు రాసేవాడు. విద్వేషభరితమైన కవితలు రాసేవాడు. అతను తన సోదరుడితో కలిసి ప్రవక్త (స) ముందు హాజ రయ్యాడు. క్షమాపణ కోరుకుంటూ ఇస్లామ్ స్వీకరించాడు. తన పొరబాట్లకు ప్రాయశ్చిత్తంగా ప్రసిద్ధ కవిత "బనాత్ సుఆద" రాశాడు. ప్రవక్త (స) అతడిని క్షమించడమే కాదు, తన దుస్తులను అతడికి బహుమతిగా ఇచ్చారు. ప్రవక్త (స) మక్కాలో ఉన్నప్పుడు ఒకరోజు కాబాగృహం ప్రదక్షిణ చేస్తున్నప్పుడు ఫుజాలా బిన్ ఉమైర్ ప్రవక్త (స)ను హతమార్చే ఉద్దేశ్యంతో రహస్యంగా నక్కి నక్కి అక్కడికి వచ్చాడు. ప్రవక్త (స) అతడి ముందుకు వెళ్ళి అతను ఏ ఉద్దేశ్యంతో వచ్చాడో అతడికే చెప్పాడు. అతను పశ్చాత్తాపపడి క్షమాపణ కోరుకుని ఇస్లామ్ స్వీకరించాడు. ప్రవక్త (స) అతడిని కూడా క్షమించారు. మహిళల్లో అత్యంత హేయమైన, తీవ్రమైన నేరానికి పాల్పడిన మహిళ హిందా బిన్తె ఉత్బా, ఆమె ఇస్లామ్ పట్ల తీవ్ర విద్వేషంతో అనేక నేరాలకు పాల్పడింది. హజ్రత్ హంజా (రజి) మృతదేహాన్ని అవమానపరిచింది. హజ్రత్ హంజా (రజి) మృతదేహం రొమ్ము చీల్చి కాలేయం తీసి నమిలింది. ఆమె ప్రవక్త (స) వద్దకు తన ముఖాన్ని కప్పుకుని ఇతరులకు కనబడకుండా దాచుకుంటూ వచ్చింది. మక్కా విజయం తర్వాత అక్కడికి వచ్చినప్పుడు కూడా ఆమె ప్రవక్త (స)తో మాట్లాడిన మాటలు ఆమెలో ఉన్న విద్వేషాన్ని ప్రకటిస్తున్నాయి. ఆ సంభాషణ ఇలా ఉంది :

హిందా : "ఓ దైవప్రవక్తా! మా నుంచి మీరేమి కోరుతున్నారు?"

ప్రవక్త : "దేవుడికి భాగస్వాములను కల్పించడం మానేయండి"

హిందా : "మీరు పురుషులను ఈ విధంగా అడగలేదు. అయినా నేను ఒప్పుకుంటున్నాను."

ప్రవక్త : "దొంగతనాలు చేయవద్దు"

హిందా : "నేను కొన్ని సార్లు నా భర్త అబూ సుఫ్యాన్ నుంచి కొంత డబ్బు దొంగతనంగా తీసుకుంటాను. దీనికి అనుమతి ఉందనుకుంటున్నాను"

ప్రవక్త : "మీ సంతానాన్ని హతమార్చవద్దు"

హిందా : "వారిని మేము చిన్నప్పుడు జాగ్రత్తగా పోషించాము. వారు పెరిగి పెద్దయిన తర్వాత మీరు బద్ర్ యుద్ధంలో వారిని హతమార్చారు. ఇప్పుడు మీరు వారు తేల్చుకోవాలి."

ఈ నిర్లక్ష్యపు సమాధానాలను ఎవరూ సహించలేరు. కాని ప్రవక్త (స) దయాహృదయం ఆమెను క్షమించింది.

ఇబ్నె హంజల్ వద్ద బానిసపిల్ల ఖర్తానా. ఆమె ప్రవక్త (స)కు వ్యతిరేకంగా అవమానకరమైన పాటలు పాడేది. మక్కా విజయం తర్వాత ఆమె పారిపోయింది. కొంతకాలానికి తిరిగి వచ్చి పశ్చాత్తాపం ప్రకటించి ఇస్లామ్ స్వీకరించింది.

మక్కా విజయం కన్నా గొప్ప సంఘటన, గొప్ప విజయం...ఆ తర్వాత సఫా కొండపై ప్రవక్త (స) కూర్చుని ఉండగా ప్రజలు గుంపులు గుంపులుగా ఆయన వద్దకు వచ్చి ఇస్లామ్ స్వీకరించడం. ఈ సందర్భంగా వారి నుంచి తీసుకున్న ప్రతిజ్ఞ క్రింది విధంగా ఉంది :

"నేను దేవుడికి భాగస్వాములను కల్పించను. ఆయన వ్యక్తిత్వంలో కాని గుణగణాల్లో కాని, నా ప్రార్థనల్లో కాని, సహాయం వేడుకోవడంలో కాని దేవుడికి భాగస్వాములను కల్పించను.

"నేను దొంగతనాలు చేయను. వ్యభిచరించను. న్యాయబద్ధంగా తప్ప ఎవరినీ హతమార్చను. కుమార్తెలను హతమార్చను. అన్యాయంగా ఎవరిపైనా నిందలు వేయను."

"హేతుబద్ధమైన విషయాల్లో నేను సాధ్యమైనంత వరకు ప్రవక్త (స)కు విధేయత చూపుతాను"

మక్కాలో దాదాపు పక్షం రోజులు ఉన్న తర్వాత ప్రవక్త (స) అక్కడి నుంచి బయలుదేరారు. తన ప్రతినిధిగా అక్కడ హజ్రత్ ముఆజ్ బిన్ జబల్‌ను నియమించి,



సందేశ ప్రచార కార్యభారం ఆయనకు అప్పగించారు. ఇస్లామీయ జీవనవిధానం, ఇస్లామీయ నియమాలు, ఇస్లామీయ నైతిక ప్రమాణాలు, ఇస్లామీయ చట్టాలు, ఇస్లామీయ సంస్కృతి గురించి ఆయన ప్రజలకు దిశానిర్దేశనం చేయాలని ఆదేశించారు. ప్రవక్త(స) ఇస్లామీయ చట్టాలను ఎలా అమలు చేశారన్నది పరిశీలిస్తే ఎలాంటి ఒత్తిళ్ళు వచ్చినా న్యాయం విషయంలో, నేరం శిక్ష విషయంలో ఆయన రాజీపడలేదు. అబిల్ అసద్ కుమార్తె ఫాతిమాకు దొంగతనం నేరారోపణపై చేతులు ఖండించే శిక్ష విధించారు. ఈ శిక్షను ఆపాలని, మినహాయింపు ఇవ్వాలని ఎంత బలమైన సిఫారసులు వచ్చినా ఆయన లెక్కచెయ్యలేదు. హునైన్, తాయిఫ్ సైనికచర్యల తర్వాత ప్రవక్త (స) మక్కా తిరిగి వచ్చినప్పుడు ఆయన ఇతాబ్ బిన్ ఉసైద్‌ను తన ప్రతినిధిగా అక్కడ నియమించారు. అందుగ్గాను రోజుకు ఒక దిర్హామ్ పారితోషికం చెల్లించేవారు.

మక్కా విజయం తర్వాత ఇస్లామీయ సత్యసందేశ ప్రచార మార్గంలో ఉన్న అతిపెద్ద అవరోధం తొలగిపోయింది. ఎందుకంటే ఇస్లామ్‌ను అడ్డుకునే బలమైన నాయకత్వం అప్పట్లో మక్కాలోనే ఉండేది. మక్కా విజయం తర్వాత ఇస్లామ్ త్వరితగతిన వ్యాపించే మార్గాలు సుగమమయ్యాయి. అంతకు ముందు ఖురైషులతో మైత్రి ఒప్పందాలు ఉన్నందువల్ల, లేదా ఆర్థికంగా ఖురైషులపై ఆధారపడి ఉన్నందు వల్ల, లేదా ఖురైషుల ధార్మిక, సామాజిక ఆధిపత్యానికి భయపడడం వల్ల ఇస్లామ్ స్వీకరించడానికి వెనుకాడిన అనేక తెగలు ఇప్పుడు స్వేచ్ఛగా ఇస్లామ్ స్వీకరించడానికి ముందుకు వచ్చాయి. ఈ తెగలు స్వేచ్ఛగా ముందుకు వచ్చి ఇస్లామ్‌ను స్వీకరించే మార్గం సుగమమైంది. ఆ విధంగా అనేక తెగలు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి ఇస్లామ్ ఛత్రఛాయల్లోకి చేరాయి. ప్రవక్త ముహమ్మద్ (స) అనుచర సమాజంలో చేరాయి.

ముహమ్మద్ (స) తన సైన్యంతో మక్కాపై దాడికి బయలుదేరినప్పుడు ముందుగానే చాలా జాగ్రత్తగా వ్యవహరించారు. ఎలాంటి రక్తపాతం లేకుండా మక్కాను లోబరచుకోవడానికి అవసరమైన చర్యలు తీసుకున్నారు. ఆయన తన సైన్యం కదలికలను, తన ఉద్దేశ్యాలను చాలా రహస్యంగా ఉంచారు. ఖురైషులు ఎలాంటి యుద్ధ ఏర్పాట్లు చేసుకునే అవకాశం లేకుండా చేశారు. చుట్టుపక్కల ప్రాంతాల నుంచి ఖురైషులు సహాయాన్ని పొందే అవకాశాలు కూడా మూసేశారు. చాలా హఠాత్తుగా మక్కా ద్వారం వద్దకు ముస్లిమ్ సైన్యాలు ఒక్కసారిగా వచ్చాయి. అప్పటికే అబూసుఫ్యాన్ లొంగిపోయాడు. అబూసుఫ్యాన్ బెంబేలెత్తేలా ఆయన ముందు ముస్లిమ్ సైన్యం బలసంపద ప్రదర్శించబడింది. అబూ సుఫ్యాన్ రంగం నుంచి తప్పుకున్నాక మక్కాలో ప్రతిఘటించే నాయకత్వం ఏదీ మిగల్లేదు.

ప్రవక్త ముహమ్మద్(స) తన పట్ల తీవ్ర శత్రుభావంతో వ్యవహరించిన వారం దరినీ క్షమించారు. ప్రవక్త (స)పై అణచివేతలకు పాల్పడినవారు, అమానుషంగా వ్యవహరించినవారు, ఏళ్లతరబడి దౌర్జన్యాలకు పాల్పడినవారు, అపహాస్యం చేసి కించపరిచినవారు, ఆయనపై దుమ్ము పోసినవారు, చెత్తాచెదారాలను ఆయనపై విసరినవారు, ఆయన దారిలో ముళ్ళు పరిచినవారు, ఆయన్ను నిర్బంధించినవారు, ఆయనపై హత్యాప్రయత్నాలకు ఒడిగట్టినవారు, ఆయన్ను దేశం నుంచి బహిష్క రించినవారు, ఆయనపై కత్తికట్టి యుద్ధానికి దిగినవాళ్ళు.. అందరినీ క్షమించారు. సర్వసాధారణ క్షమాభిక్షను ప్రకటించారు. చివరకు హత్యానేరాలకు గాను రక్తపరిహారం చెల్లించవలసిన వారిని కూడా క్షమించారు. వారికి కూడా శిక్షలు పడలేదు. ఒక సంస్కరణా ఉద్యమానికి ఈ మృదువైఖరి ఎంతో అవసరమైనది. సాధారణంగా యుద్ధాల్లో విజేతలు అవలంబించే కఠినవైఖరి వల్ల నైతిక విప్లవానికి ఎలాంటి ప్రయోజ నమూ ఉండదు. దండెత్తి వచ్చిన సైన్యాల చేతుల్లో ఓడిపోయిన ప్రజలు బలప్రయోగం వల్ల లొంగిపోతారు, బలప్రయోగం వల్ల విజేతలకు విధేయత చూపిస్తారు. కాని ఇలాంటి బలప్రయోగం వల్ల నైతిక విప్లవానికి కావలసిన మార్పు రాదు. ప్రవక్త(స) వారి మనసులు మార్చాలనుకున్నారు. వారి హృదయాలను గెలుచుకోవాలనుకున్నారు. హృదయాలను గెలుచుకోవడం అన్నది మృదువైఖరి వల్ల, దయాస్వభావం వల్ల మాత్రమే సాధ్యపడుతుంది. ఆ విధంగా వారిలో పశ్చాత్తాపభావం జనించి, జీవన విధానాన్ని మార్చుకునే ప్రేరణ కలుగుతుంది. దైవప్రవక్త (స) మానవ స్వభావాన్ని బాగా తెలిసిన వారు, ముఖ్యంగా ఖురైషుల స్వభావం గురించి పూర్తి అవగాహన కలిగిన వారు. ఆయన కూడా ఖురైష్ వంశానికి చెందినవారే. ఒక గొప్ప ఉద్యమా నికి నాయకత్వం వహించే గుణగణాలు ఖురైషులకే ఉన్నాయని, అరేబియాలో మరో తెగకు ఇలాంటి సామర్థ్యం లేదని ఆయన భావించారు. వారు తమ తాతముత్తాతల జీవన వ్యవస్థకు, అజ్ఞానకాలం నాటి వ్యవస్థకు కట్టుబడి ఉన్నప్పుడు దాన్ని కాపాడుకో డానికి అత్యంత ధైర్యసాహసాలతో ప్రాణాలకు తెగించి పోరాడారు. వారు ఇస్లామ్‌ను స్వీకరిస్తే, ఇస్లామ్‌ను కాపాడ్డానికి కూడా అంతే నిబద్ధతతో, ధైర్యసాహసాలతో వ్యవహ రిస్తారు. ఈ సందేశ ఉద్యమ నాయకత్వానికి మొట్టమొదటి యోగ్యత ఒకే ఒక్క దేవుడిపై దృఢమైన విశ్వాసం, ధర్మపరాయణతలు కాగా, ఉద్యమ నాయకత్వానికి మేధోపరమైన, ఆచరణాత్మకమైన, యోగ్యతలు అవసరం. హుందాతనం, పలుకుబడి, అనుభవం, పాలనానుభవం, నాయకత్వ పటిమ ఇవన్నీ కావాలి. చాకచక్యం, సమ యోచిత నిర్ణయాలతో కార్యసాధనాదక్షత, మానవ స్వభావం పట్ల అవగాహన కలిగిన



వ్యవహార దక్షతలతో పాటు సాధారణ ప్రజానీకం గుర్తించిన ఆధిక్యత కలిగినవారై ఉండాలి. ఖురైషులకు ఈ లక్షణాలన్నీ ఉన్నాయి. కొత్త వ్యవస్థలో ఈ లక్షణాలకు మరింత పదును పెట్టవచ్చు. ఓడిపోయిన ఖురైషులు బలప్రయోగం వల్ల పరాభవితు లైతే వారి వల్ల ఎలాంటి ప్రయోజనమూ లేదు. కాని ప్రవక్త (స) అనుసరించిన మృదువైఖరి వల్ల, క్షమాశీలం వల్ల వారిలో కావలసిన మార్పు వచ్చింది.

ప్రవక్త (స) ఒక విజేతగా మక్కాలో ప్రవేశించారు. కాని ఎలాంటి విజయ దుందుభులు లేవు. ఆయన తల వంచుకుని దేవునికి కృతజ్ఞతలు తెలుపుతూ, దైవ ప్రార్థన చేస్తూ మక్కాలో ప్రవేశించారు. ద్వారంలోకి తలవంచి ప్రవేశించండి అన్న సాధారణ ఆదేశం జారీ చేశారు. ప్రార్థనలు, ప్రార్థనల పిలుపులు మక్కా వాతావరణాన్ని అలుముకున్నాయి. వ్యక్తిగత స్వార్థం కోసం ఎవరూ ఏమీ చేయలేదు. అంతేకాదు, ఖురైషులు బలవంతంగా లాక్కున్న ఆస్తులను కూడా వారికే వదిలేశారు. ఖురైషుల అధీనంలో ఉన్న సాంప్రదాయిక బాధ్యతలను వారి వద్దనే ఉండనిచ్చారు. ఇది భీకరయుద్ధం జరిగే రోజని ప్రకటించిన వ్యక్తి నుంచి ప్రవక్త (స) పతాకాన్ని తీసుకుని ఇతరులకు ఇచ్చారు. ఇది కాబాగృహం పవిత్రత శాశ్వతంగా స్థాపించబడిన రోజని ప్రకటించారు.

ఖురైషుల పట్ల ఈ విధంగా సానుభూతి చూపడంలో కూడా ఔచిత్యం ఉంది. ఖురైషులు కాబాగృహం సంరక్షణ బాధ్యత నిర్వహిస్తూ వచ్చినవారు. మేధోపరంగా ఆధిక్యత కలిగిన వారు. రాజకీయంగా, ధార్మికంగా అరబ్బులకు నాయకులుగా ఉన్నవారు. ఈ ఆధిక్యతను కాపాడుకోవడానికి అలుపెరగక ఇరవై సంవత్సరాల పాటు పోరాడారు. యుద్ధాల్లో ఓడిపోయారు. దాంతో పాటు సామాజి కంగా వారి ఆధిక్యత కూడా పోయింది. ప్రవక్త (స)కు సన్నిహిత బంధువులైనప్పటికీ మదీనాకు చెందిన అన్సారుల వెనుక నిలబడవలసి వచ్చినప్పుడు వారి మనోభావాలు ఎలా ఉండి ఉంటాయి? ఇరవై సంవత్సరాల పాటు ఇస్లామ్‌కు వ్యతిరేకంగా పోరాడి ఓడిపోయి పరాభవం పాలయ్యారు. ఆత్మస్థయిర్యాన్ని కోల్పోయారు. వారిపట్ల మృదువైఖరితో వ్యవహరించడం ద్వారా మాత్రమే వారిలో ఆత్మస్థయిర్యాన్ని పునరుద్ధరించవచ్చు. ఈ పరిస్థితిని ప్రవక్త (స) పూర్తిగా అంచనా వేశారు. అసాధారణ దూరదృష్టితో వ్యవహరించారు. వారిపట్ల అత్యంత మృదువుగా వ్యవహరించారు. దయాభావం ప్రదర్శించారు. అబూసుఫ్యాన్, హాకిమ్ బిన్ హజ్మ్, నాదర్ బిన్ హారిస్, సఫ్వాన్ బిన్ ఉమయ్యా, అక్రా బిన్ హాబిస్ వంటివారు, ప్రవక్త (స) ను అనేక సంవత్సరాలుగా వేధించినవారు, అవమానాలకు, అణిచివేతలకు గురిచేసినవారు, ప్రవక్త(స)ను అసత్యవాదిగా అభివర్ణించినవారు, ఆయన్ను కించపరిచినవారు,

ఆయనపై భౌతికంగా దాడులు చేసినవారు, ఆయన్ను హతమార్చడానికి కుట్రలు పన్నినవారు, ఆయన్ను బహిష్కరించినవారు, ఆయనపై యుద్ధాలు చేసినవారు, వలసవెళ్ళిన తర్వాత కూడా ఆయన్ను శాంతిగా బతకనివ్వకుండా వెంటాడినవారు మక్కా విజయం తర్వాత అన్సారుల కన్నా ఎక్కువగా ఆయన అనుగ్రహాన్ని పొందారు. యుద్ధసొత్తులో అత్యధికభాగం... 24 వేల ఒంటెలు, 4 లక్షల మేకలు, 4 వేల కొలతల వెండిని జారానా వద్ద పోగు చేయడం జరిగింది. అందులో ఐదవ వంతును సామూహిక ప్రయోజనాల కోసం, బీదరిక నిర్మూలన కోసం తీసుకుని మిగిలినదంతా పంచేయడం జరిగింది. ఈ ఉదార నిర్ణయానికి ముఖ్యకారణం శత్రువుల పోరాటశక్తిని అదుపు చేయడంతో పాటు పోగుచేసిన సంపదను పంపిణీ చేయడం ద్వారా ఆర్థిక అసమతుల్యాన్ని చక్కదిద్దడం కూడా. ఇందులో ఖురైషులకు అత్యధిక భాగం లభించింది. ఈ ఉదారస్వభావం కొంతమంది అన్సారులకు ఆగ్రహం కూడా కలిగించింది. ప్రవక్త (స)కు మద్దతివ్వడానికి ప్రాణాలొడ్డింది వారు, ఆయన కోసం యుద్ధాలు చేసింది వారు. అయినా ఖురైషులకు అత్యధికభాగం లభించడంతో వారిలో కొందరు అసంతృప్తికి, ఆగ్రహానికి లోనయ్యారు. ప్రవక్త (స) ఖురైషుల పట్ల అత్యంత ఉదారంగా వ్యవహరిస్తున్నారని, ప్రవక్త (స) శత్రువుల రక్తంతో అన్సారుల ఖడ్గాల తడి ఇంకా ఆరకపోయినా, అన్సారులను ఆయన చిన్నచూపు చూస్తున్నారన్న పుకార్లు పుట్టాయి. "ఆపద కాలంలో మా సహాయం తీసుకున్నారు. విజయం వరించిన తర్వాత విజయఫలాలు ఇతరులకు దక్కుతున్నాయి" అన్న మాటలు కూడా వ్యాపించ సాగాయి. ప్రవక్త (స) ఈ మాటలు విన్నారు. ఆయన ఒక శిబిరంలో అన్సారులను పిలిచారు. ఈ పుకార్లు నిజమేనా అని ప్రశ్నించారు. అన్సార్లు జవాబిస్తూ కొందరు బాధ్యతలేని కుర్రాళ్ళు అలాంటి మాటలు చెప్పింది నిజమేనని ఒప్పుకున్నారు. అప్పుడు ప్రవక్త (స) ఇలా అన్నారు :

"మీరు తప్పుబాటన ఉన్నప్పుడు దేవుడు నా ద్వారా మీకు సన్మార్గం చూపించాడన్నది నిజం కాదా? మీరు ముక్కలు చెక్కలై ఉన్నప్పుడు దేవుడు నా ద్వారా మిమ్మల్ని ఒక్కటి చేసాడన్నది నిజం కాదా? మీరు పేదవారిగా ఉన్నప్పుడు దేవుడు నా ద్వారా మిమ్మల్ని సంపన్నులు చేసాడన్నది నిజం కాదా?"

ప్రతి వాక్యం విన్న వెంటనే అన్సారులు "నిజం.. మేం దేవుడికి, దైవప్రవక్త(స)కు రుణపడి ఉన్నాం" అని ఎలుగెత్తి చెప్పారు.

ప్రవక్త (స) ఇంకా ఇలా అన్నారు. "కాదు.. మీరు అలా కాదు అనాల్సింది.. ఓ ముహమ్మద్! ప్రజలు నిన్ను తిరస్కరించినప్పుడు మేం నిన్ను విశ్వసించాం.. ఖురైషులు నిన్ను వదిలేసినప్పుడు మేం ఆశ్రయమిచ్చాం.. నీవు మా వద్దకు నిరుపేదగా



వచ్చినప్పుడు మేం నీకు అన్ని విధాల సహాయం అందించాం.. అని మీరు అంటే .. మరి ఈ ప్రతి మాటకు నేను "అవును.. ఇది నిజం" అంటాను.. కాని అన్సారులారా! ఇతరులు ఒంటెలను, మేకలను తోలుకుపోతుంటే మీరు ముహమ్మద్‌ను మీతో తీసుకు వెళ్ళడాన్ని మీరు ఇష్టపడరా?" అని ప్రశ్నించారు. ఈ ప్రశ్న అన్సారులను తీవ్రంగా కదిలించివేసింది. వారి గెడ్డాలు అశ్రుధారలతో తడిసిపోయాయి. వారు భావావేశాలను అదుపు చేసుకోలేక రోదిస్తూ "మాకు ముహమ్మద్ (స) మాత్రమే కావాలి, మరేమీ వద్దు" అన్నారు. ఆ తర్వాత ప్రవక్త (స) వారికి మృదువుగా ఖురైషుల పట్ల సానుభూతి, ఉదారస్వభావాలతో ఎందుకు వ్యవహరించవలసి వచ్చిందో వివరించారు.

మొత్తం ఆరువేల మంది యుద్ధ ఖైదీలుగా పట్టుబడ్డారు. తమ విషయంలో నిర్ణయంకోసం ఎదురుచూస్తున్నారు. ప్రవక్త(స) రెండు వారాల పాటు వారి విషయంలో ఎవరైనా వచ్చి మాట్లాడతారని ఎదురు చూసారు. ఈ కారణం వల్లనే యుద్ధసొత్తు పంపకం కూడా ఆపి ఉంచారు. కాని ఎవరూ యుద్ధఖైదీల విషయంలో మాట్లాడ్డానికి రాలేదు. ఆ తర్వాత యుద్ధ సొత్తును, యుద్ధ ఖైదీలను పంపిణీ చేశారు. ఆ తర్వాత హలీమా సాదియా (ప్రవక్త (స)కు పాలిచ్చిన దాది) తెగకు చెందిన ప్రతినిధి బృందం జుహేర్ బిన్ సర్ద్ నాయకత్వంలో ఈ యుద్ధ ఖైదీల గురించి మాట్లాడ్డానికి వచ్చింది. ఈ సందర్భంగా జుహేర్ కదిలించివేసే ప్రసంగం చేశారు.

"రెల్లుగడ్డి పైకప్పుల క్రింద నిర్బంధించబడిన స్త్రీలలో మీ తండ్రిగారి సోదరీ మణులు ఉన్నారు. మీ తల్లిగారి సోదరీమణులు ఉన్నారు. దేవుని తోడు, అరేబియా పాలకుల్లో ఎవరైనా మా కుటుంబం మహిళ పెంపకంలో కొంతకాలం ఉన్నట్లయితే, అతని నుంచి మేము చాలా ఆశిస్తాం. మీ నుంచి అంతకన్నా ఎక్కువ ఆశిస్తాం."

అంటూ ఆయన ప్రసంగం కొనసాగింది. ప్రవక్త (స) ఆయనకు జవాబిస్తూ, యుద్ధ ఖైదీల విషయంలో మాట్లాడ్డానికి ఎవరైనా వస్తారని తాను ఎదురుచూసిన విషయం తెలిపారు. కాని ఎవరూ రానందున వారిని పంపిణీ చేయడం జరిగిందని, తన తెగ ఖురైషుల వాటాగా వచ్చిన యుద్ధ ఖైదీలను తాను అప్పగించగలననీ, మిగిలిన వారి విషయంలో సామూహిక ప్రార్థనల్లో సమావేశమయ్యే ముస్లిము లందరితో మాట్లాడాలని అన్నారు. ఆ తర్వాత జుహైర్ తన విజ్ఞప్తిని ముస్లిములందరి ముందు మరోసారి ప్రకటించాడు. ప్రవక్త (స) మాట్లాడుతూ నేను నా స్వంత తెగ విషయంలో బాధ్యత వహిస్తాను, వారి విషయంలో నిర్ణయం తీసుకుంటాను, అయితే ముస్లిము లందరూ ఈ విషయంలో సానుభూతితో నిర్ణయం తీసుకోవాలని చెప్పారు.

ఆ వెంటనే ముస్లిములందరూ తాము తమ వాటాగా వచ్చిన యుద్ధ ఖైదీలను

అప్పగిస్తున్నామని ప్రకటించారు. కేవలం బనూ సులైమ్, బనూ ఫజారా తెగలు సంకోచించాయి. యుద్ధంలో పట్టుబడిన ఖైదీలను పరిహారం లేకుండా విడుదల చేయడం అసాధారణంగా భావించారు. అప్పుడు ప్రవక్త (స) ఒక్కో యుద్ధ ఖైదీకి బదులుగా ఆరు ఒంటెలను వారికి ఇచ్చి ఖైదీలను విడుదల చేయించారు. యుద్ధ ఖైదీలకు దుస్తులు, ఇతర సామాగ్రి కూడా అందజేశారు. ఆ విధంగా వారి తెగల హృదయాలను గెలుచుకున్నారు.

## విజయం పరిపూర్ణం

విజయాన్ని పరిపూర్ణం చేయడానికి కొన్ని చిన్నస్థాయి సైనికచర్యలు చేపట్టడం జరిగింది.

బనూ తమీమ్ తెగ కొన్ని ఇతర తెగలను కూడా రెచ్చగొట్టి శిస్తు చెల్లింపులు నిలిపేసింది. ఇది ఒకరకంగా రాజ్యంపై తిరుగుబాటు. ఈ తిరుగుబాటును అణచడానికి 50 మంది రౌతులతో అశ్వికదళాన్ని ఉయైనా బిన్ హిస్న్ నాయకత్వంలో వారిని శిక్షించడానికి పంపారు. మొదటి దాడిలోనే బనూ తమీమ్ కాలికి బుద్ధి చెప్పారు. కొందరిని నిర్బంధించి మదీనా తీసుకొచ్చారు. వారిని తర్వాత విడుదల చేయడం జరిగింది.

ఖసామ్ తెగ తిరుగుబాటుకు సన్నాహాలు చేస్తోందన్న వార్తలు అందాయి. ఖుత్బా బిన్ అమీర్ నాయకత్వంలో కేవలం 20 మందితో కూడిన చిన్న దళాన్ని ఈ తిరుగుబాటును అణచడానికి పంపారు. ఈ దళాన్ని చూడగానే తిరుగుబాటుదారులు పలాయనం చిత్తగించారు. కొందరిని నిర్బంధించి మదీనా తీసుకురావడం జరిగింది. ప్రవక్త (స) ఆ యుద్ధఖైదీలను తర్వాత విడుదల చేశారు.

బనూ కిలాబ్‌లో తిరుగుబాటును అణచడానికి హజ్రత్ జహ్హాక్‌ను పంపించారు. ఈ దళంలో ఉసైద్ బిన్ సల్మా కూడా ఉన్నారు. ఆయన బనూ కిలాబ్ తెగకు చెందినవారు. ఈ పోరాటంలో ఉసైద్ తండ్రి మరణించారు.

జిద్దా వద్ద కొందరు అబిసీనియాకు చెందిన సముద్ర దొంగలు గుమిగూడారన్న వార్తలు వచ్చాయి. అబ్దుల్లా బిన్ హుజాఫా నాయకత్వంలో 300 మంది సైనికులున్న దళాన్ని ఈ సముద్రదొంగలను ఎదిరించడానికి పంపించారు. సముద్ర దొంగలు సైన్యాన్ని చూడగానే పారిపోయారు. అక్కడ బనీ తాయ్‌కు చెందిన పెద్ద మందిరం ఉంది. ఈ మందిరం ముస్లిమ్ రాజ్యానికి వ్యతిరేకంగా కుట్రలు పన్నుతున్న వారికి కేంద్రంగా మారింది. ప్రసిద్ధ నావికుడు హాతిమ్‌కు చెందిన చారిత్రక గృహంలో అది బిన్ హాతిమ్ పెద్ద సైన్యాన్ని సమకూర్చుకున్నాడు. మదీనాపై దాడికి సన్నాహాలు



చేస్తున్నాడు. తాయి తెగతో పాటు మరికొన్ని ఇతర తెగలు కూడా వారితో చేరాయి. హజ్రత్ అలీ (రజి) నాయకత్వంలో 150 మంది సైనికుల దళాన్ని ఈ కుట్రదారులను అణచడానికి, కుట్రకు కేంద్రమైన తాయి మందిరాన్ని ధ్వంసం చేయడానికి పంపించారు. ఈ మందిరం కుట్రదారులకు కేంద్రం మాత్రమే కాదు, అజ్ఞానకాలం నాటి విగ్రహారాధనకు చిహ్నంగా కూడా ఉండేది. హజ్రత్ అలీ (రజి) వారిపై దాడి చేశారు. అది బిన్ హాతిమ్ సిరియా పారిపోయాడు. సిరియా నుంచి సహాయం పొందడానికి ప్రయత్నించాడు. ఆ తెగకు చెందిన ఇతరులు కొంత ప్రతిఘటించినా తర్వాత పారిపోయారు. కుట్రకు కేంద్రంగా ఉన్న ఆ మందిరాన్ని ధ్వంసం చేయడం జరిగింది. ఇక్కడ పట్టుబడిన యుద్ధ ఖైదీలను మదీనా తీసుకువచ్చారు. ఆ యుద్ధఖైదీల్లో హాతిమ్ తాయి సోదరి కూడా ఉన్నారు. ఆమె దీనంగా ప్రవక్త (స)తో ఇలా విన్నవించుకున్నారు: “నా తండ్రి చనిపోయారు. నా సంరక్షకుడు నన్ను నిస్సహాయంగా వదిలేసి పారిపోయాడు. నేను ఒక వృద్ధ మహిళను. ఏమీ చేయలేను. నా పట్ల దయతో వ్యవహరించండి. దేవుడు మీ పట్ల దయతో వ్యవహరిస్తాడు.” ఆమె విజ్ఞప్తి తర్వాత ప్రవక్త (స) ఆమెను విడుదల చేయడమే కాదు, ఆమె వెనుతిరిగి వెళ్లడానికి కావలసిన ప్రయాణ ఏర్పాట్లు కూడా చేయించారు. తిరిగి వెళ్ళిన తర్వాత ఆమె తన సోదరుడితో ప్రవక్త(స) దయాహృదయాన్ని వివరించి చెప్పారు. ఆయన ఎంత మర్యాదగా వ్యవహరించింది తెలియజేశారు. ప్రవక్త(స) పోరాటం గురించి ఆలోచనలు మానుకోవాలని అన్నారు. అంతేకాదు, ప్రవక్త (స) వద్దకు వెళ్ళి జ్ఞానం పొందాలని నచ్చచెప్పారు. ఆ తర్వాత అది బిన్ హాతిమ్ మదీనా వచ్చి ఇస్లామ్ స్వీకరించారు.

ఆ పిదప ప్రవక్త (స) చుట్టుపక్కల ఉన్న వివిధ రాజ్యాధినేతల పేర లేఖలు పంపారు. సత్యసందేశాన్ని స్వీకరించాలని వారిని కోరారు. కొన్ని రాజ్యాలకు తన రాయబారులను పంపించారు. అందులో ఒక రాయబారి హారిస్ బిన్ ఉమైర్ ఉజ్దీ. ఆయన్ను సిరియా పంపడం జరిగింది. సిరియా అప్పుడు రోమన్ చక్రవర్తి హెర్క్యులిస్ ఆధీనంలో ఉండేది. సిరియాలో క్రయిస్తవ గవర్నర్ తన వద్దకు వచ్చిన రాయబారిని హతమార్చాడు. ఒక రాయబారిని హతమార్చడం అంతర్జాతీయ చట్టాల ప్రకారం తీవ్ర మైన నేరం. ఆత్మగౌరవం ఉన్న ఏ దేశం కూడా ఈ చర్యలను సహించదు. హిజ్రీ శకం ఎనిమిదవ సంవత్సరంలో ప్రవక్త ముహమ్మద్ (స) 30 వేల మంది ఉన్న సైనిక దళాన్ని జైద్ బిన్ హారిస్ (స్వేచ్ఛ పొందిన బానిస. ఈయన్ను ప్రవక్త (స) తన దత్తకుమారుడిగా స్వీకరించారు) నాయకత్వంలో సిరియాలోని బల్ఖా వైపు పంపారు. ఇది ఒక అత్యంత కీలకమైన సైనికచర్య. అలాంటి సైనిక చర్యకు నాయకత్వ

బాధ్యతను ముహాజిర్లు, అన్సారుల్లోని ప్రముఖ యోధులకు ఇవ్వలేదు. ప్రవక్త (స)కు అత్యంత సన్నిహితులైన అనుచరులు, బంధువులకు కూడా ఇవ్వలేదు. ఒక స్వేచ్ఛ పొందిన బానిసకు ఇచ్చారు. సర్వమానవ సమానత్వాన్ని స్థాపించడానికే ఇలాంటి నిర్ణయాలు తీసుకున్నారు. ఇస్లామ్‌లో ఒక బానిస కూడా సైన్యాధ్యక్షుడి హెూదాను సాధించగలడని చాటి చెప్పారు. ఈ సైన్యానికి వీడ్కోలు పలుకుతూ ప్రవక్త (స) స్వయంగా సానియతుల్ వదా వరకు వెళ్ళారు. ఈ సైన్యం మాన్ వద్దకు చేరుకున్నప్పుడు చక్రవర్తి హెర్క్యులిస్ ఒక భారీ సైన్యంతో సిరియా పర్యటనకు వచ్చాడని తెలిసింది. అంతేకాదు, బనీ లఖమ్, బనీ జజమ్, బల్కిన్, బహ్రా క్రైస్తవులు కూడా అతడితో పాటు ఉన్నారని వార్త అందింది. మొత్తం సైన్యం దాదాపు లక్ష వరకు ఉండవచ్చు. ఇంత భారీ సైన్యాన్ని కేవలం 3 వేల మంది ఎదుర్కోవడం సాధ్యమా? ఈ విషయమై చర్చలు జరిగాయి. సంప్రదింపుల తర్వాత వెనక్కి మరలే ప్రసక్తే లేదని రోమన్ సైన్యాన్ని ఎదుర్కోవడమేనని నిర్ణయించారు. ఫలితాన్ని దేవుడికే వదిలేయాలని అనుకున్నారు. ముస్లిమ్ సైన్యం ముందుకు కొనసాగింది. మషారిఫ్ వద్ద ముస్లిమ్ సైన్యానికి రోమన్ సైన్యం ఎదురయ్యింది. తీవ్రమైన, భయంకరమైన పోరాటంలో జైద్ బిన్ హారిస్ అమరగతి పొందారు. ఆ వెంటనే సైన్యాధ్యక్ష బాధ్యతలను హజ్రత్ జాఫర్ చేపట్టారు. యుద్ధంలో హజ్రత్ జాఫర్ చెయ్యి కత్తివేటుకు తెగిపోయింది. ఆయన తన రెండవ చేత్తో రాజ్య పతాకాన్ని క్రింద పడకుండా పట్టుకున్నారు. శత్రువులు ఒక్కుమ్మడిగా ఆయనపై దాడి చేయడం, రెండవ చెయ్యి కూడా తెగిపోవడంతో ఆయన పతాకాన్ని తన రొమ్ముపై ఆన్చి కింద పడకుండా చూసుకున్నారు. చివరకు కొనఊపిరి వరకు పోరాడి మరణించారు. ఆయన మరణించినప్పుడు ఆయన శరీరంపై 90 కత్తివేట్లు ఉన్నాయి. హజ్రత్ జాఫర్ మరణించిన తర్వాత ప్రవక్త (స) ముందస్తుగా ఇచ్చిన సైనికాదేశాల ప్రకారం అబ్దుల్లా బిన్ రువాహా సైన్యాధ్యక్ష బాధ్యతలు స్వీకరించారు. ఆయన కూడా యుద్ధంలో వీరోచితంగా పోరాడుతూ నేలకొరిగారు. ఆయన మరణించిన తర్వాత సైన్యం సమ్మతితో హజ్రత్ ఖాలిద్ బిన్ వలీద్ (రజి) సైన్యాధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించారు. మడమతిప్పని పోరాటయోధునిగా పేరున్న ఖాలిద్ బిన్ వలీద్ (రజి) శత్రుభయంకరంగా పోరాడారు. ఆయన చేతుల్లో తొమ్మిది ఖడ్గాలు విరిగి ముక్కలయ్యాయి. చివరకు రోమన్ సైన్యం వెనక్కి తగ్గక తప్పలేదు. ఖాలిద్ బిన్ వలీద్ (రజి) తన సైన్యాన్ని సురక్షితంగా వెనక్కి తీసుకువచ్చారు. ఈ యుద్ధంలో కేవలం పన్నెండు మంది ముస్లిములు మాత్రమే మరణించారు. కాని మరణించిన వారిలో ప్రముఖులు, సైన్యాధ్యక్షులు ఉన్నారు. శత్రుసైన్యం సంఖ్యాపరంగా చాలా ఎక్కువగా ఉండడం వల్ల, విదేశీ భూభాగంలో



పోరాడుతున్నందువల్ల, ఆహారపదార్థాల సరఫరా కష్టంగా ఉన్నందువల్ల, అదనపు బలగాలు వచ్చే అవకాశాలు లేనందువల్ల రోమన్ సైన్యాన్ని వెంటాడాలన్న ఆలోచన విరమించుకున్నారు. తమకు లభించిన విజయంతో సంతృప్తి చెందాలనుకున్నారు. ఈ యుద్ధంలో హజ్రత్ ఖాలిద్ బిన్ వలీద్ (రజి) చూపించిన అసాధారణ ధైర్యసాహసాలకు గాను ఆయనకు దైవఖడ్గం అన్న బిరుదు లభించింది. ఈ సైన్యం మదీనా తిరిగి వచ్చినప్పుడు ప్రవక్త (స) స్వయంగా స్వాగతించారు. మదీనాలో కొందరు యువకులు నవ్వులాటగా ఈ సైన్యాన్ని ఉద్దేశించి పారిపోయివచ్చిన సైన్యం అని వ్యాఖ్యలు చేసినప్పుడు ప్రవక్త (స) స్వయంగా ఆ వ్యాఖ్యలను ఖండిస్తూ వారు పిరికివాళ్ళు కాదని అన్నారు.

హిజ్రీ శకం 9వ సంవత్సరం రజబ్ మాసంలో సిరియా నుంచి వచ్చిన ఒక బిడారు ఒక వార్తను మోసుకు వచ్చింది. మదీనాపై ఆక్రమణకు సీజర్ సైన్యాలు సన్నాహాలు చేస్తున్నాయన్నది ఆ వార్త సారాంశం. సీజర్ (హెర్క్యులిస్) రోమన్ చక్రవర్తి. ఆయన సామ్రాజ్యం సువిశాలమైనది. అప్పటికి తెలిసిన భూభాగాల్లో సగం భూభాగాలు ఆయన పాలనలో ఉన్నాయి. అంతేకాదు, అప్పటి మరో గొప్ప సామ్రాజ్యం పర్షియన్ సామ్రాజ్యాన్ని యుద్ధంలో ఓడించి విజయోత్సాహంలో ఉన్నాడు. ఇటు మదీనాలో ప్రవక్త (స) ఒక చిన్న ఇస్లామీయ రాజ్యాన్ని స్థాపించారు. సత్య సందేశాన్ని, జ్ఞానాన్ని, నిజమైన ధార్మిక విశ్వాసాలను ప్రపంచవ్యాప్తంగా ప్రచారం చేయడానికి ప్రయత్నిస్తున్నారు. ఈ చిన్న రాజ్యం ప్రమాదంలో పడడాన్ని ఆయన ఏ మాత్రం భరించలేరు. అందువల్ల వెంటనే సైనికసన్నాహాలు ప్రారంభించారు. మదీనాకు దూరంగానే రోమన్ సైన్యాలను ఎదుర్కోవాలని భావించారు. ఆ రకంగా మదీనా ప్రాంతాల్లో విధ్వంసం జరక్కుండా చూడాలనుకున్నారు. ఈ యుద్ధ సన్నాహాలు మండు వేసవిలో ప్రారంభమయ్యాయి. పైగా కరువు వికృతనాట్యం చేస్తోంది. బీదరికం తాండవిస్తోంది. ప్రవక్త ముహమ్మద్(స) ఈ యుద్ధ ఖర్చుల కోసం విరాళాలు ఇవ్వాలని ప్రకటించారు. ఆయన ప్రకటనకు వచ్చిన ప్రతిస్పందన చరిత్రలో మరెక్కడా మనకు కనబడదు. ఆ కరువు కాలంలో హజ్రత్ ఉస్మాన్ (రజి) 900 ఒంటెలను తీసుకొచ్చి ఇచ్చారు. వాటితో పాటు 100 గుర్రాలు, 1000 బంగారు నాణాలు ఇచ్చారు. హజ్రత్ అబ్దుర్రహ్మాన్ బిన్ ఔఫ్ 4 వేల దిర్హాములు ఇచ్చారు. హజ్రత్ ఉమర్ (రజి) తన వద్ద ఉన్న సంపదలో అత్యధికభాగాన్ని ఇచ్చేశారు. అందరికీ మించి హజ్రత్ అబూబక్ర్ సిద్దీఖ్(రజి) తన వద్ద ఉన్న సంపదంతా తెచ్చి పోశారు. ప్రవక్త(స) ఆయనతో "మీ కుటుంబ సభ్యుల కోసం, మీపై ఆధారపడిన వారి కోసం ఏమైనా ఉంచుకున్నారా లేదా" అని అడిగినప్పుడు ఆయన జవాబిస్తూ, దేవుడు, దైవప్రవక్త

(స) ఉన్నారు అది చాలని అన్నారు. కాని వీటన్నింటికి మించిన త్యాగం అన్సారులకు చెందిన ఒక కూలివానిది. అతను ఒక ఖర్జూరపు తోటలో మండే ఎండలో రోజంతా కష్టపడి నాలుగు కొలతల ఖర్జూరాలు సంపాదించాడు. అందులో సగం ఖర్జూరాలు తన కుటుంబం కోసం ఉంచుకుని, మిగిలిన సగం ఖర్జూరాలు ప్రవక్త (స) వద్దకు తీసుకు వచ్చాడు. ప్రవక్త (స) ఆ ఖర్జూరాలను తీసుకుని, విరాళాల గుట్టపై ఈ ఖర్జూరాలను పరిచేయండని ఆదేశించారు. మహిళలు యుద్ధఖర్చుల కోసం తమ ఆభరణాలను విరాళాలుగా ఇచ్చారు. ఈ విధంగా యుద్ధ ఖర్చులకు కావలసిన ధనం సమకూరింది.

యుద్ధానికి సన్నాహాలు పూర్తయ్యాయి. 30,000 మంది ఉన్న సైన్యం సిద్ధ మయ్యింది. ఇందులో 10,000 మంది రౌతులున్న అశ్వికదళం కూడా ఉంది. మదీనా నుంచి ఈ సైన్యం బయలుదేరి తబూక్ చేరుకుంది. అక్కడికి చేరుకున్న తర్వాత రోమన్ సైన్యం వెనక్కి వెళ్ళిపోయిందన్న వార్త అందింది. రోమన్ సైన్యం మదీనాపై దాడి చేయాలన్న ఆలోచన విరమించుకుని వెనక్కి మరలింది. నిజానికి రోమన్ సైన్యం ఒక పుకారును నమ్మి మదీనాపై దండెత్తి వచ్చింది. ప్రవక్త ముహమ్మద్ (స) మరణించారన్న అబద్ధపు వార్త ఎవరో రోమన్ చక్రవర్తికి చేరవేశారు. మదీనాను ఆక్రమించుకోవడానికి ఇదే మంచి అదునుగా భావించి రోమన్ చక్రవర్తి సైన్యాన్ని ముందుకు నడిపాడు. కాని ముందుకు వచ్చిన తర్వాత ప్రవక్త (స) సజీవంగా ఉన్నారని, మదీనా యుద్ధానికి సంసిద్ధంగా ఉందని తెలియగానే మనసు మార్చుకుని వెనక్కి తిరిగాడు.

ఈ సైనికచర్యలో యుద్ధం జరగలేదు. కాని దీనివల్ల అనేక ఇతర లాభాలు ఒనగూడాయి. ప్రవక్త (స) తబూక్ వద్ద సైన్యంతో నెలరోజుల పాటు విడిది చేశారు. తన రాజకీయ ప్రాబల్యాన్ని పెంచుకునే చర్యలు చేపట్టారు. అక్కడ ప్రవక్త (స) ను కలుసుకున్న మొదటి వ్యక్తి ఐలా తెగ నాయకుడు. ప్రవక్త (స)తో అతను శాంతి ఒప్పందం చేసుకుని జిజియా (సైనికశిస్తు, రక్షణ కల్పించినందుకు బదులుగా ఇచ్చేది) చెల్లించడానికి అంగీకరించాడు. ఇదే విధంగా జరాబా, అజ్రా తెగలు కూడా ఒప్పందాలు చేసుకున్నాయి. ఇక్కడి నుంచి హజ్రత్ ఖాలిద్ (రజి) నాయకత్వంలో 400 మంది ఉన్న సైన్యాన్ని జూమతుల్ జిందల్‌కు పంపడం జరిగింది. అక్కడి నాయకుడు ఒకాదిర్, అతడి సోదరుడు ఈ దళాన్ని ఎదుర్కున్నారు. పోరాటంలో ఒకాదిర్ సోదరుడు మరణించాడు. ఒకాదిర్‌ను బంధించి ప్రవక్త(స) వద్దకు తీసుకు వచ్చారు. తర్వాత ఒకాదిర్ ప్రవక్త (స)తో ఒప్పందం చేసుకుని జిజియా చెల్లించడానికి ఒప్పుకున్నాడు. ప్రవక్త (స) అతడిని మదీనా రాజ్యంలో భాగాలుగా మారిన దూమతుల్



జందల్, తబూక్, తైమా ప్రాంతాలకు నాయకుడిగా నియమించారు. ఈ నియామకా నికి సంబంధించి వ్రాతపూర్వక దస్తావేజును కూడా అందించారు. ఈ సైనికచర్య నుంచి ప్రవక్త (స) మదీనా తిరిగి వచ్చినప్పుడు ఆయనకు ఘనస్వాగతం లభించింది.

మదీనా వచ్చిన తర్వాత ప్రవక్త ముహమ్మద్ (స) ముస్లిమ్ సమాజంలో కలిసి ఉన్న కపటులపై దృష్టి సారించారు. తబూక్ సైనికచర్యలో పాల్గొనకుండా వివిధ సాకులు చెప్పి తప్పించుకున్నవారు, అనేక ఇతర కుట్రలకు పాల్పడిన వారు మదీనాలో చాలా మంది ఉన్నారు. వారిని పిలిచి ప్రశ్నించినప్పుడు కుంటిసాకులు చెప్పసాగారు. ప్రవక్త (స) వారి సాకులు విని వారిని క్షమిస్తూ పోయారు. సైనికచర్యకు దూరంగా ఉండడాన్ని ఇష్టపడినవారిలో అబూఖైస్మా ఒకరు. ఆయన చల్లని నీడలో తన ఇద్దరు భార్యలతో విశ్రాంతిగా గడపసాగారు. హఠాత్తుగా ఆయన మనస్సులో తాను చేస్తున్నదేమిటో గ్రహింపునకు వచ్చింది. ఆయన తన భార్యలతో "దేవుని తోడు, నేను మీ గదుల్లోకి రాలేను. నేను వెళ్ళడానికి ఏర్పాట్లు చేయండి" అని తక్షణం తన ఒంటెను పిలిపించి, దానిపై హుటాహుటిన బయలుదేరి సైన్యంతో వెళ్ళి కలిశారు. ఆయన కాక మరో ముగ్గురు ముస్లిములు కాబ్ బిన్ మాలిక్, హిలాల్ బిన్ ఉమయ్యా, మురారా ఇబ్నురబి కూడా అలాగే సైన్యంతో వెళ్ళడం విషయంలో తాత్సారం చేశారు. చివరకు సైన్యం వెనుదిరిగి మదీనా కూడా వచ్చేసింది. వారిని పిలిచి ఎందుకు సైనికచర్యలో పాల్గొనలేదని ప్రశ్నించినప్పుడు వారు కుంటిసాకులు చెప్పలేదు, ఆలసించడం వల్లే రాలేకపోయామని ఒప్పేసుకున్నారు. క్షమించాలని కోరుకున్నారు. దైవికాదేశాలు వారిని క్షమించేవరకు వారు సామాజిక బహిష్కరణ అనుభవించాలని, కుటుంబాలకు దూరంగా ఉండాలని ప్రవక్త (స) వారిని ఆదేశించారు. ఇది నిజానికి సంకెళ్ళు, బందీఖానా లేని జైలు జీవితం వంటిది. పైగా ఇది వారు స్వచ్ఛందంగా అనుభవిస్తున్న శిక్ష. అందువల్ల మరింత తీవ్రమైన ప్రభావం వేసేదిగా ఉండేది. ఈ విషయం గురించి గస్సానీ తెగ నాయకుడికి తెలిసింది. ఆ వెంటనే అతడు కాబ్‌కు ఒక లేఖ రాశాడు. "గొప్ప సామర్థ్యం ఉన్నవారైనా మీ పట్ల ప్రవక్త (స) అనుచితంగా వ్యవహరించినట్లు తెలిసింది, మీరు గస్సాన్‌లో చేరండి. మీకు గొప్ప హోదా గౌరవాలు ఇస్తామని వాగ్దానం చేస్తున్నా"మని ఆ లేఖ సారాంశం. కాని కాబ్ బిన్ మాలిక్ ఆ లేఖను అగ్నిలో పారేశారు. ప్రవక్త (స) ఆదేశాలను తూ.చ.తప్పక విధేయత చూపించారు. యాభై రోజులు గడిచిన తర్వాత దైవికాదేశాలు వచ్చాయి. వారి పశ్చాత్తాపం నిజాయితీతో కూడుకున్నదని

ప్రకటించాయి. మదీనా అంతటా ఆనందోత్సాహాలు అలుముకున్నాయి. అన్ని వైపుల నుంచి ఆ ముగ్గురిపై అభినందనల వర్షం కురిసింది. సంతోషం పట్టలేక హజ్రత్ కాబ్ తన సంపదలో చాలా భాగం దానం చేసేశారు.

ప్రవక్త (స) తబూక్‌లో ఉన్నప్పుడు అబ్దుల్లా జుల్బాజాదీన్ చనిపోయారు. ప్రవక్త (స) ఆయన్ను పూర్తి లాంఛనాలతో సమాధి చేశారు. ఆయన స్వయంగా సమాధిలో ఇటుకలు ఉంచి ప్రార్థించారు. ఈ యువకుడు చిన్న వయసులోనే ఇస్లామ్ స్వీకరించాడు. కాని క్రూరుడైన తన పినతండ్రికి భయపడి ఆ విషయాన్ని రహస్యంగా ఉంచాడు. ప్రవక్త ముహమ్మద్ (స) మక్కా విజయం తర్వాత మక్కాలోకి ప్రవేశించి నప్పుడు ఈ యువకుడు తన పినతండ్రితో "మీ మనసు ఎప్పుడు ఇస్లామ్ కాంతిని స్వీకరిస్తుందా అని సంవత్సరాల తరబడి ఎదురుచూస్తూ వస్తున్నాను. కాని మీలో ఎలాంటి మార్పు రాలేదు. నేను వెళ్ళి ఇస్లామ్‌లో చేరుతాను నాకు అనుమతిం చండి" అని కోరుకున్నాడు. నువ్వు అలా చేస్తే వారసత్వంగా నీకు లభించే ఆస్తి దక్క కుండా చేస్తాను, కట్టుబట్టలు కూడా తీసుకోనివ్వను అని పినతండ్రి బెదిరించాడు. కాని అబ్దుల్లా జుల్బాదీన్ చలించలేదు, స్థిరంగా "మీరు మీ ఇష్టం వచ్చినట్లు చేయండి. నేను మాత్రం ఇక విగ్రహారాధన చేయను. ఇస్లామ్ స్వీకరిస్తున్నాను'' అన్నాడు. ఆ విధంగా అతను తన వారసత్వ ఆస్తిని కోల్పోయాడు. కట్టుబట్టలు కూడా లేని పరిస్థితి. అతని తల్లి ఒక దుప్పటి ఇచ్చింది. ఆ దుప్పటిని రెండుగా చింపి, ఒక ముక్కను నడుం చుట్టు కట్టుకుని, రెండవ ముక్క భుజాలపై కట్టుకునేవాడు. అతను తబూక్ సైనికచర్యలో సైన్యంతో వెళ్ళాడు. కాని జ్వరం వల్ల మరణించాడు. రాత్రి చీకటిలో అతడిని సమాధి చేశారు. హజ్రత్ బిలాల్ (రజి) దీపం పట్టుకుని చూపిస్తుం డగా స్వయంగా ప్రవక్త (స) సమాధి చేశారు. ఇది చూస్తున్న హజ్రత్ ఇబ్నె మసూద్ "ఈ సమాధిలో నేను సమాధి అయితే బాగుండు" అన్నారు.

పైన పేర్కొన్న వివరణల ద్వారా ఒక వాస్తవం స్పష్టంగా అర్థం అవుతుంది. ఇస్లామ్ కరవాలంతో వ్యాపించిందన్నది పచ్చిఅబద్ధమని తెలుస్తుంది. ఈ సైనికచర్యలేవీ దురాక్రమణ ఉద్దేశ్యాలతో చేపట్టలేదు. హృదయాలను జయించాలన్న ఉద్దేశ్యం ప్రతిసందర్భంలోను కనబడుతుంది. ఓటమిపాలైన వారందరినీ చాలా దయగా చూశారు. కక్షసాధింపు చర్యలేవీ ఎక్కడా లేవు. ప్రాణశత్రువుల పట్ల కూడా సాను భూతితో వ్యవహరించారు. ఇస్లామ్ హేతుబద్ధ వాదన ద్వారా, విజ్ఞప్తి ద్వారా, సహజ చట్టాల ద్వారా ప్రజల్లో వ్యాపించింది.



## అధ్యాయం - 5

# హేతుబద్ధవాదన

మాటల బలం వల్లనే గెలుపోటములు ప్రపంచంలో లభిస్తాయి. నచ్చచెప్పే విధంగా చెబితే గొప్ప ప్రభావం పడుతుంది. అవతలి వారిని గెలుచుకోవచ్చు. మనం మన సందేశాన్ని ఎలా వ్యక్తీకరిస్తున్నాం, ఎదుటివారి మనోమస్తిష్కాలపై ప్రభావం వేసేలా ఎలా చెబుతున్నాం అన్నది ముఖ్యం. ఈ విషయంలో ఇస్లామ్ విధానం స్పష్టంగా ఉంది. దివ్యఖుర్‌ఆన్‌లోని అనేక వాక్యాలు ఈ విషయాన్ని చాటి చెబు తున్నాయి. మనిషి మనోమస్తిష్కాలపై ప్రభావం వేస్తూ ఆహ్వానిస్తుంది ఖుర్‌ఆన్. అందువల్లనే దయ, సానుభూతి, మానవాళి పట్ల ప్రేమలతో గుబాళించే మాటలే వినిపిస్తాయి. ఈ మాటలు మనిషి అంతరంగంలో లోతుగా చొచ్చుకుపోతాయి. ప్రభావశీలమైన వాగ్ధాటికి ఇంతకన్నా మంచి ఉదాహరణ మరొకటి ఉండదు. ఇక్కడ కొన్ని దివ్యఖుర్‌ఆన్ వాక్యాలు ఈ సందర్భంగా గమనించదగ్గవి:

> **'(ఓ ప్రవక్తా) ఇలా అను "మీ ఆత్మలకు అన్యాయం చేసుకున్న నా దాసులారా అల్లాహ్ కారుణ్యం పట్ల నిరాశ చెందకండి. నిశ్చయంగా అల్లాహ్ అన్ని పాపాలనూ క్షమిస్తాడు. ఆయన క్షమించేవాడు, కరుణించేవాడూను. మీ మీదకు శిక్ష రాకమునుపే, మీకు ఎవరి నుండీ సహాయం లభించని పరిస్థితి ఏర్పడక మునుపే, మీరు మీ ప్రభువు వైపునకు మరలి, ఆయనకు విధేయత చూపండి, మీకు తెలియకుండానే మీ మీదకు ఆకస్మాత్తుగా శిక్ష రాకముందే, మీ ప్రభువు పంపిన గ్రంథంలోని ఉత్తమమైన విషయాలను అనుసరించండి. తరువాత ఏ వ్యక్తి అయినా ఇలా అనే పరిస్థితి రాకూడదు సుమా! "అల్లాహ్ విషయంలో నేను చూపిన నిర్లక్ష్యతకు నేను ఎంతో చింతిస్తున్నాను. పైగా నేను ఎగతాళి చేసే వారిలో చేరిపోయాను." లేదా "అయ్యో! అల్లాహ్ నాకు సన్మార్గం చూపి ఉంటే, నేను కూడా భయభక్తులు కలవారిలో చేరిపోయేవాణ్ణి" లేదా శిక్షను చూసి, "అయ్యో! నాకు మరొక అవకాశం దొరికితే ఎంత**

బాగుండును. నేను కూడా సత్కార్యాలు చేసేవారిలో కలిసిపోతాను"

*(దివ్యఖుర్ఆన్ 39 : 53-58)*

ఈ వాక్యాల్లో ప్రవక్త ముహమ్మద్ (స) సందేశంలోని ప్రాథమిక సత్యాలన్నీ ఉన్నాయి. ఇందులో హేతబద్ధమైన వాదన ఉంది. మనోమస్తిష్కాలపై ప్రభావం వేసే విజ్ఞప్తి ఉంది. అంతేకాదు, ఇందులో హెచ్చరిక, శుభవార్తలు కూడా ఉన్నాయి. ఆ తర్వాత యావత్తు ఆదం సంతానాన్ని ఉద్దేశించి దివ్యఖుర్ఆన్ ఇలా చెబుతోంది:

"ఆదమ్ సంతానమా! నేను మీకు ఉపదేశించలేదా, షైతానుకు దాస్యం చెయ్యవద్దని, వాడు మీకు బహిరంగ శత్రువని, నా దాస్యమే చెయ్యండి అని, ఇదే సరైన మార్గమని? కాని, దీని తరువాత కూడా వాడు మీలోని ఒక పెద్ద వర్గాన్ని అపమార్గం పట్టించాడు. మీకు బుద్ధిలేకుండా పోయిందా? భయపడండి అని మీకు చెబుతూ ఉండిన నరకం ఇదే. ప్రపంచంలో మీరు పాల్పడిన అవిశ్వాసానికి ఫలితంగా ఇపుడు దీనికి ఇంధనం అయిపోండి."

*(దివ్యఖుర్ఆన్ 36 : 60-64)*

"ముహమ్మద్ ఇలా చెప్పు: "మానవులారా! మీ వద్దకు మీ ప్రభువు తరఫు నుండి సత్యం వచ్చేసింది. ఇప్పుడు ఎవడైనా రుజుమార్గాన్ని అవలంబిస్తే అతడి రుజుమార్గ అనుసరణం అతనికే లాభదాయకం. ఎవడైనా మార్గం తప్పితే అతడి ఆ మార్గం తప్పటం అతనికే వినాశకరం. నేను మీకు కావలివాణ్ణి మాత్రం కాను." (దివ్యఖుర్ఆన్ 10 : 108)

దివ్యఖుర్ఆన్ వివిధ సమూహాలను, వర్గాల ప్రజలను ఉద్దేశించి వారి మౌలిక ప్రవృత్తికి అనుగుణంగా ప్రభావశీలంగా మాట్లాడుతుంది. చివరకు శత్రుశిబిరాల్లో ఉన్నవారినీ, తీవ్రంగా ద్వేషించేవారిని కూడా అత్యంత ఉత్తమమైన రీతిలో సంబోధిస్తూ మాట్లాడుతుంది. అంతేకాదు ద్రోహులకు కూడా అవకాశం ఇస్తూ పద్ధతి మార్చుకుని తమను తాము సంస్కరించుకోవాలని బోధిస్తుంది. దివ్యఖుర్ఆన్ లోని కొన్ని వాక్యాలను పరిశీలించండి :

"అల్లాహ్ ఒక జనపదానికి సంబంధించిన ఉదాహరణ ఇస్తున్నాడు: ఆ జనపదం శాంతిమయమూ, సంతృప్తికరమూ అయిన జీవితాన్ని గడుపుతూ ఉండేది. ప్రతి వైపునుండి దానికి ఆహారం పుష్కలంగా చేరుతూ ఉండేది. అప్పుడు అది అల్లాహ్ కానుకలకు కృతఘ్నత చూపటం ప్రారంభించింది. అప్పుడు అల్లాహ్ దాని పౌరులకు వారి అకృత్యాల రుచిని ఇలా చూపాడు:



ఆకలీ భయమూ అనే ఆపదలు వారిని చుట్టుముట్టాయి."

(దివ్యఖుర్ఆన్ 16 : 112

గ్రంథప్రజలను ఉద్దేశించి ఇలా సంబోధించింది :

'గ్రంథప్రజలారా! మా ప్రవక్త మీ వద్దకు వచ్చేశాడు. మీరు కప్పిపుచ్చుతూ ఉండిన దైవగ్రంథంలోని ఎన్నో విషయాలను ఆయన మీ ముందు బహిర్గతం చేస్తున్నాడు. ఇంకా ఎన్నో విషయాలను వదిలి వేస్తున్నాడు."

*(దివ్యఖుర్ఆన్ 5 : 15)*

"గ్రంథ ప్రజలారా! మీ ధర్మం విషయంలో అన్యాయంగా హద్దులు మీరి ప్రవర్తించకండి. మీకు పూర్వం, స్వయంగా తామూ మార్గభ్రష్టులై, ఇంకా చాలా మందిని మార్గభ్రష్టులుగా చేసి, రుజుమార్గం తప్పినవారి ఊహాపోహలను అనుసరించకండి" *(దివ్యఖుర్ఆన్ 5 : 77)*

"గ్రంథ ప్రజలారా! ప్రవక్తల ఆగమనక్రమం ఎంతోకాలంగా ఆగిపోయి ఉన్నప్పుడు మా ఈ ప్రవక్త మీ వద్దకు వచ్చాడు. మీకు స్పష్టమైన ధర్మోపదేశాలను అందజేస్తున్నాడు. మా వద్దకు శుభవార్త తెలిపేవాడు, హెచ్చరికలు చేసేవాడు ఎవడూ రాలేదు అని మీరు అనగలగకుండా ఉండాలని. కనుక చూడండి! ఆ శుభవార్త తెలిపేవాడు, హెచ్చరికలు చేసేవాడు ఇప్పుడు విచ్చేశాడు-అల్లాహ్ ప్రతి వస్తువుపై అధికారం కలవాడు."

*(దివ్యఖుర్ఆన్ 5 : 19)*

"మేము మా గ్రంథంలో ఇస్రాయీల్ సంతతిని "మీరు భువిలో రెండుసార్లు గొప్ప సంక్షోభాన్ని సృష్టిస్తారు. దురహంకారాన్ని ప్రదర్శిస్తారు " అనే విషయాన్ని గురించి కూడా హెచ్చరించాము. చివరకు వారిలో మొదటిసారి దురహంకారం వ్యక్తమైనప్పుడు, ఇస్రాయీలు సంతతి ప్రజలారా! మిమ్మల్ని ఎదుర్కోవటానికి మేము మహాబలాఢ్యులైన మా దాసులను లేపాము. వారు మీ దేశంలో చొరబడి అన్ని వైపులా వ్యాపించారు. ఇదొక వాగ్దానం. అది తప్పనిసరిగా నెరవేర్చబడ వలసి ఉండింది. దాని తరువాత మేము మీకు వారిపై ప్రాబల్యం వహించే అవకాశాన్ని కలిగించాము. సంపదతోనూ సంతానంతోనూ మీకు సహాయ పడ్డాము. మీ సంఖ్యాబలాన్ని ఇదివరకటి కంటే పెంచాము. చూడండి, మీరు మంచిని చేస్తే అది మీకే మీరు మంచిని చేసుకున్నట్లు. చెడును చేస్తే అది మీకు మీరే చెడును చేసుకున్నట్లు. రెండో వాగ్దానం నెరవేర్చవలసిన

సమయం ఆసన్నమైనప్పుడు మేము ఇతర శత్రువులను మీపైకి పంపాము, వారు మీ ముఖాలను వికృతం చెయ్యటానికి, మసీదు (బైతుల్ మక్దిస్)లోకి పూర్వం శత్రువులు చొరబడిన విధంగా చొరబడటానికి, వారి చేతికందిన ప్రతి దానినీ ధ్వంసం చేసేయ్యటానికి-బహుశా మీ ప్రభువు మీపై ఇప్పుడు కరుణ చూప వచ్చు. కాని ఒకవేళ మీరు మీ పాతవైఖరిని తిరిగి అవలంబిస్తే మేము కూడా మా శిక్షను తిరిగి విధిస్తాము. అనుగ్రహాలను పొంది కృతఘ్నులైన ప్రజలకు మేము నరకాన్ని కారాగారంగా చేసివుంచాము."

*(దివ్యఖుర్ఆన్ 17 : 4-8)*

"ప్రవక్తా! ఇలా చెప్పు : "గ్రంథ ప్రజలారా! మాకూ మీకూ మధ్య సమానమైన ఒక విషయం వైపునకు రండి. (అది ఏమిటంటే) మనం అల్లాహ్‌కు తప్ప మరెవరికీ దాస్యం చెయ్యరాదు. ఆయనకు భాగస్వాములుగా ఎవరినీ నిలబెట్టరాదు. మనలోని వారెవరూ అల్లాహ్‌ను తప్ప మరెవరినీ తమ ప్రభువుగా చేసుకోరాదు అనేది." *(దివ్యఖుర్ఆన్ 3 : 64)*

క్రైస్తవులను ఉద్దేశించి ఇలా పేర్కొంది:

"విశ్వాసుల పట్ల మైత్రి విషయంలో "మేము క్రైస్తవులం" అని అన్న వారిని అత్యంత సన్నిహితులుగా చూస్తావు. దీనికి కారణం ఏమిటంటే వారిలో దైవభక్తిగల విద్వాంసులూ, ప్రపంచాన్ని పరిత్యజించిన సన్యాసులూ ఉన్నారు. ఇంకా వారిలో అహంభావం లేదు. ప్రవక్తపై అవతరించిన ఈ గ్రంథాన్ని వారు విన్నప్పుడు, సత్యాన్ని గ్రహించిన కారణంగా వారి కళ్ళు అశ్రువులతో చెమ్మగిల్లటం నీవు చూస్తావు. వారు ఇలా అనేస్తారు: "ప్రభూ! మేము విశ్వసించాము. మా పేర్లను సాక్ష్యం ఇచ్చే వారిలో వ్రాయి"

**(దివ్యఖుర్ఆన్ 5 : 83-86**

కపట విశ్వాసులను ఉద్దేశించి ఇలా పేర్కొంది :

"సూరా ఏదైనా అవతరించినప్పుడు వారు కళ్ళతోనే పరస్పరం మాట్లాడుకుంటారు, ఎవరైనా మమ్మల్ని చూడటం లేదు కదా అని. తరువాత మెల్లగా అక్కడి నుండి జారుకుంటారు. అల్లాహ్ వారి హృదయాలను (ఖురాను నుండి) మళ్ళించాడు. ఎందుకంటే వారు బుద్ధిహీనులు. చూడండి! మీ వద్దకు ఒక ప్రవక్త వచ్చాడు. ఆయన స్వయంగా మీలోనివాడే. మీరు నష్టానికి గురికావటం అనేది ఆయనకు కష్టం కలిగిస్తుంది. మీ సాఫల్యాన్ని ఆయన తీవ్రంగా



కాంక్షిస్తాడు. విశ్వాసులపై ఆయన వాత్సల్యం కలవాడు. కారుణ్యం కలవాడు."

**(దివ్యఖుర్ఆన్ 9 : 126-128)**

దివ్యఖుర్ఆన్‌లో ఇలా మనోమస్తిష్కాలపై గొప్ప ప్రభావాన్ని వేసే వాక్యాలు ఎన్నో ఉన్నాయి. ఈ వాక్యాలు కేవలం ముస్లిములను ఉద్దేశించినవి మాత్రమే కాదు, యావత్తు మానవాళిని ఉద్దేశించిన వాక్యాలున్నాయి. ఇస్లామ్ సందేశం విశ్వజనీన మైనది. ప్రభావశీలమైనది. అర్థవంతమైనది. ఒక శక్తివంతమైన భాషలో విశ్వజనీన, శాశ్వత స్థాయిలో వినిపించిన సందేశం ఇది. మానవరచనలేవీ ఈ స్థాయిని అందుకోలేదు. ఇంత మధురంగా లేవు. ఇంత అర్థవంతంగా లేవు. ఇదే దివ్యఖుర్ఆన్ మహిమ.

ఇస్లామీయ సందేశం కేవలం హేతుబద్ధ వాదనలు, హితబోధలకు మాత్రమే పరిమితం కాలేదు. వీటితో పాటు ప్రభావవంతమైన విమర్శలు కూడా ఉన్నాయి. సూఫీతత్వంలో వేడుకోళ్ళు, ప్రార్థనలు, వ్యక్తిగత ఆరాధనలు మాత్రమే ఉంటాయి. ఇక్కడ వ్యక్తిత్వం, నియమబద్ధ వ్యక్తిగత జీవితం మాత్రమే ముఖ్యమైనది. సామూహిక జీవన విధానానికి సంబంధించిన ప్రశ్నే తలెత్తదు. సామూహిక సంస్కరణ, కొత్త జీవన విధానాల గురించిన ప్రసక్తే ఉండదు. వ్యక్తిగత జీవితం పరిధిని దాటి ఇది బయటకు పోదు. సూఫీతత్వంలో కాని ఇతర వ్యక్తిగత ధార్మిక ప్రాధాన్యతల్లో కాని తమ ప్రభావంలో ఉన్న మనిషిని కొన్ని విశ్వాసాలకు, కొన్ని వ్యక్తిగత ధర్మాచరణలు, వ్యక్తిగతంగా చెడుకు దూరంగా ఉండే నిష్ఠను నేర్పడం మాత్రమే ఉంటుంది. కాని సామూహికంగా విరుచుకుపడుతున్న చెడును నిరోధించే విషయంలో ఎలాంటి ప్రేరణ ఉండదు. చెడు అలుముకున్న వాతావరణాన్ని ఎదుర్కొనే ప్రోత్సాహం కూడా అందులో ఉండదు. ఇలాంటి పరిస్థితుల్లో చెడులో కూరుకుపోయిన నాయకత్వం మానవాళిపై అణిచివేతలకు పాల్పడుతున్నా ధర్మాచరణలకు మాత్రమే కట్టుబడిన ధర్మపరాయణులు మాత్రం పట్టించుకోరు. ఇలాంటి పరిమితమైన ఆధ్యాత్మిక వ్యవస్థలో మనిషిలోని అత్యున్నత, అత్యుత్తమ గుణగణాలు ప్రాపంచిక వ్యవహారాలకు, ప్రాపంచిక రాజకీయాలకు దూరమైపోతాయి. మనిషిలోని ఉత్తమగుణగణాలు ప్రతిఒక్కరి ముందు వేడుకోళ్ళకు, ఎవరిపై కూడా ఆగ్రహించలేని వినమ్రతకు మాత్రమే పరిమితమై పోతాయి. ఇలాంటి వ్యవస్థల్లో, మనిషిని సంఘర్షణాపథంపై నడుపకుండా, మనిషిని సాంఘీక సంఘర్షణల నుంచి దూరం చేసి అడవుల్లో

గుహల్లో ఒంటరిగా ఆరాధనల్లో గడిపేలా చేసే వ్యవస్థల్లో మానసిక సంఘర్షణకు కారణమయ్యే విమర్శలకు స్థానం ఉండదు. కాని సాంఘిక వ్యవస్థను విప్లవీకరించడానికి పూనుకున్న సిద్ధాంతాలు, బోధనల్లో హేతుబద్ధ వాదనలకు ఎంత స్థానం ఉంటుందో, విమర్శకు కూడా అంతే స్థానం ఉంటుంది. సత్యాన్ని స్థాపించడానికి మాత్రమే అవి పరిమితం కావు. అసత్యాన్ని అసత్యంగా నొక్కి చెబుతాయి. ఒకే ఒక్క దేవుణ్ని విశ్వసించాలని చెప్పినప్పుడు, దానితో పాటు ఇతర దేవతలందరినీ తిరస్కరించాలన్న భావం కూడా ఉంది. అజ్ఞాన వ్యవస్థకు వ్యతిరేకంగా ఒక విప్లవాత్మక ఉద్యమంగా ప్రారంభమైన ఇస్లామ్ చరిత్రలో ఒక కొత్త అధ్యాయాన్ని ప్రారంభించింది. ఇస్లామ్ అసత్యం ఏ రూపంలో ఉన్నా దాన్ని అలుపెరుగక విమర్శించింది. అణచివేతలు, మోసాలను విమర్శించింది. అజ్ఞానవ్యవస్థలో ఉన్న అన్ని చెడులను సంపూర్ణంగా బట్టబయలు చేసింది. సన్మార్గమేదో స్పష్టంగా చూపించింది. దుర్మార్గమేదో ఖచ్చితంగా చూపించింది. చీకటి వెలుగులు ఎంత ఖచ్చితంగా వేర్వేరుగా కనబడతాయో అంత ఖచ్చితంగా సత్యాసత్యాలను వేర్వేరు చేసింది. ఆ విధంగా ప్రజలు ఏది మంచో ఏది చెడో తెలుసుకునేలా చేసింది. సత్యం న్యాయాల ఆధారంగా కొత్త వ్యవస్థకు పునాదులు వేసింది. చెడు వ్యవస్థలో అధికారాన్ని చెలాయించిన వారు హేతుబద్ధ వాదనలతో నిరుత్తరులయ్యారు. మిథ్యాసిద్ధాంతాలు, కుహనా వ్యవస్థల అసలు స్వరూపం ప్రజల ముందు బట్టబయలైంది. పాత వ్యవస్థను వదిలిపెట్టి ఇస్లామీయ ఉద్యమపథాన నడువడంలోనే సాఫల్యం ఉందని ప్రజలు గుర్తించారు.

ఇస్లామీయ ఉద్యమ విమర్శలకు మొదటి లక్ష్యం ఖురైషులయ్యారు. అరేబియాలో ధార్మిక, మేధోపరమైన ఆధిక్యత కలిగిన ఖురైషుల పైనే ఇస్లామ్ మొదటిగా విమర్శలు సంధించింది. వారి విగ్రహారాధన, వారి మూఢాచారాలు, వారి ధార్మిక ఆచరణలు, వారి నైతిక పతనం, వారి అహంభావాలను బట్టబయలు చేస్తూ వారిలోని తప్పులను ఎత్తి చూపారు. వారి విగ్రహాలకు ఎలాంటి శక్తి లేదని అనేక సందర్భాల్లో నిరూపించారు. ఈ విగ్రహాలన్నీ కలిసి ఒక్క ఈగనైనా సృష్టించలేవని సవాలు చేశారు. ప్రవక్త ఇబ్రాహీమ్ (అస) జీవితంలోని అన్ని వివరాలను స్పష్టంగా తెలియజేస్తూ, అజ్ఞానంలో మునిగిన వారు, బహుదైవారాధనలో గడిపేవారికి ప్రవక్త ఇబ్రాహీమ్ (అస) మార్గంపై నడుస్తున్నామని చెప్పుకునే నైతిక హక్కు లేదని



విమర్శించింది. ప్రవక్త ఇబ్రాహీమ్ (అస) ఏకదైవారాధనను స్థాపించడానికి, సన్మార్గాన నడువడానికి అనేక కష్టాలు అనుభవించారు. చివరకు అగ్నిలో వేయబడ్డారు. అలాంటి ప్రవక్త ఇబ్రాహీమ్ (అస) నిర్మించిన దైవగృహం కాబాకు సంరక్షకులుగా ఉండే అర్హత బహుదైవారాధకులకు లేదని, కాబాగృహం ఏకైక దేవుడు అల్లాహ్ ఆరాధనలకు మాత్రమే పరిమితమని, అల్లాహ్‌కు భాగస్వాములు ఎవరూ లేరని ఖచ్చితంగా చెప్పారు. ఆ తర్వాత వందలాది సంవత్సరాలుగా గ్రంథ ప్రజలు చేస్తూ వచ్చిన పొరబాట్లను వివరిస్తూ, ప్రవక్త మూసా (అస) పట్ల వారు అవిధేయత చూపడాన్ని దైవచట్టాలకు మార్పులు చేర్పులు చేయడాన్ని, వారి పవిత్ర గ్రంథాలు ప్రకటిస్తున్న చివరి ప్రవక్త ముహమ్మద్ (స)ను తిరస్కరించడాన్ని వివరణాత్మకంగా తెలియజేస్తూ వారి లోపాలను వేలెత్తి చూపడం జరిగింది. మరోవైపు ముస్లిమ్ సమాజంలో చేరిన కపట విశ్వాసులను కూడా మానసికంగా పరీక్షకు గురిచేస్తూ, వారి ఆలోచనా విధానాన్ని, వారి నడవడిని బట్టబయలు చేయడం జరిగింది. ఇస్లామ్‌కు వ్యతిరేకంగా విద్వేషభరిత రాతలు రాసిన కవులు, ఇస్లామ్‌ను తీవ్రంగా వ్యతిరేకించిన ఆనాటి ప్రముఖుల అసలు స్వరూపాలను వారి పేర్లను ప్రస్తావించకుండానే ప్రజలందరి ముందు బహిర్గతం చేయడం జరిగింది. ప్రతి ఒక్కరి లోపాలను, వారి పొరబాట్లను, వారి బలహీనతలను, వారిలోని తప్పులను అత్యంత ప్రభావశీలమైన మాటలతో విమర్శించారు.

ఆ విధంగా ప్రవక్త ముహమ్మద్ (స) ద్వారా ప్రపంచంలో వచ్చిన ఇస్లామీయ ఉద్యమం హేతుబద్ధ వాదన, విమర్శల ద్వారా ఇరవై మూడు సంవత్సరాల కాలంలో లక్షలాది అరబ్బుల హృదయాలను జయించింది. కేవలం యుద్ధభూమిలో విజయం ద్వారా ఇది సాధ్యపడడం అసంభవం.

## నైతిక బలం

నైతికబలం లేని పిలుపులో పస ఉండదు. అద్భుతమైన పదాలతో ఎంత గొప్పగా చెప్పినా ఆ మాటల్లో, ఆ వాదనల్లో డొల్లతనం సుస్పష్టంగా కనబడుతుంది. నిజాయితీ లేని పిలుపులు, నిర్మాణాత్మక వైఖరి లేని విమర్శలు మానవాళిపై ప్రభావం వేయలేవు. ఏ ఉద్యమానికైనా నైతికబలమే ముందుకు నడిపే చలనశక్తి అవుతుంది. కేవలం సంపాదించడం, తినడం, తాగడం మాత్రమే ప్రధానంగా ఉన్న సమాజంలో,

ప్రతి సమావేశం ఒక మధుశాలగాను, జూదగృహంగాను మారిపోయిన సమాజంలో, ధైర్యసాహసాలు కేవలం ఒకరిపై ఒకరు దాడులు చేయడానికి, మోసాలకు పాల్పడడానికి, హత్యలు, పగ ప్రతీకారాలు, దోపిళ్ళకు మాత్రమే పరిమితమైపోయిన సమాజంలో, నాగరికత అనేది మానవాకారంలోని క్రూరమృగాలు సంచరించే కారడవిగా మారిపోయిన సమాజంలో ప్రవక్త ముహమ్మద్ (స) ఆవిర్భవించారు. నైతిక ప్రమాణాలతో నిజాయితీకి మారుపేరుగా ఆయన జీవించారు. ధర్మపరాయణులైన సహచరులను ముందుకు నడిపిస్తూ అతి కొద్దికాలంలోనే ఆయన సాధించిన విజయాలను ప్రజలు ఆశ్చర్యంతో చూశారు. మానవ విలువలతో అలరారే ఈ సరికొత్త సమాజాన్ని వీక్షించారు. ప్రతిరోజు వారి సమాజంలోని ఉత్తములు ఈ కొత్త ధర్మం పట్ల ఆకర్షితులు కావడాన్ని, ఇస్లామ్ స్వీకరించడాన్ని చూస్తున్న ప్రజల్లో తాము కూడా ఈ విప్లవాత్మక సంస్కరణోద్యమంలో పాలు పంచుకోవాలన్న ఉత్సాహం పెల్లుబికింది. ప్రవక్త ముహమ్మద్ (స)కు వ్యతిరేకంగా ప్రాణాలకు తెగించి భయంకరంగా పోరాడిన వారు కూడా మంత్రబద్ధులైనట్లు ప్రవక్త ముహమ్మద్ (స)కు లొంగిపోవడమే కాదు ఇస్లామ్ స్వీకరించారు. ఇస్లామ్ స్వీకరించిన వారి వ్యక్తిత్వంలోనూ, నడవడిలోను ఒక్కసారిగా వచ్చిన మార్పులను కూడా అందరూ చూశారు. ఇస్లామ్ స్వీకరించిన తర్వాత వారి స్నేహమూ, శత్రుత్వం కూడా ఇస్లామ్ కోసమే అయిపోయాయి. వారి అభిరుచులు, అలవాట్లు మారిపోయాయి. వారి రోజువారి కార్యకలాపాల్లో గొప్ప మార్పు వచ్చింది. హఠాత్తుగా ఒక కొత్త మనిషిగా మారిపోవడం జరిగింది. వారిలో కొత్త ఉత్సాహం పరవళ్ళు తొక్కింది. వారిలో అంతర్గతంగా ఉన్న శక్తిసామర్థ్యాలు ప్రకటితమయ్యాయి. క్లుప్తంగా చెప్పాలంటే, ముస్లిమ్‌గా మారిన తర్వాత ప్రతి మనిషి కొత్తమనిషిగా మారిపోయాడు. ఆ మనిషి పాతమనిషిగా మిగల్లేదు. సరికొత్త మనిషిగా సమాజంలో జీవించసాగాడు. హంతకులు జీవితాలను కాపాడే రక్షకులైపోయారు. దొంగలూ. దోపిడీలు చేసినవారు అత్యంత విశ్వసనీయులుగా మారిపోయారు. బందిపోట్లు శాంతి, సుహృద్భావాల సందేశాన్ని ప్రచారం చేయ సాగారు. వ్యభిచారులు ఉత్తమ నైతికప్రమాణాలు పాటించే వారిగా మారారు. అహం కారులు వినమ్రులుగా మారారు. మేధోపరంగా బలహీనులు తమలో కొత్త శక్తిసామర్థ్యాలను కనుగొన్నారు.

ముస్లిమ్ వ్యక్తిత్వంలోనే ఈ ప్రత్యేకత ఉంది. ప్రతి ఒక్కరిలో ఈ విప్లవాత్మక మార్పులను ఆ ప్రత్యేకతే సాధించింది. ప్రళయం వరకు ఆ ప్రత్యేకత కొనసాగుతుంది. అన్సారులు తమ ఇళ్ళు, ఆస్తులు, సంపదల్లో సగభాగాన్ని మక్కా నుంచి వచ్చిన



ప్రవాసులకు ఇచ్చేయడం ఆశ్చర్యకరమైన పరిణామం కాదా? అలాంటి సమానత్వం, సామాజికతత్వం గురించి విన్నప్పుడు సంభ్రమాశ్చర్యాలు కలుగవా? సామాజికంగా అత్యున్నత హోదాలో ఉన్నవారితో సమానంగా ఒక బానిస నిలబడిన దృశ్యం అత్యుత్తమ సమానత్వాన్ని చాటి చెప్పడం లేదా? నిరుపేదలు సంపన్నులతో సమానంగా భుజానికి భుజం కలిపి నిలబడడం, మదీనాలోని స్థానికులు మక్కా ప్రవాసులను సోదరులుగా మార్చుకుని సగం ఆస్తిపాస్తులు ఇచ్చేయడం, బీదలైనా, సంపన్నులైనా, స్థానికులైనా, ప్రవాసులైనా అందరు సమానహోదా గౌరవాలు పొందడం, అందరి అభిప్రాయాలకు సమాన ప్రాముఖ్యం లభించడం, ప్రతి ఒక్కరికి తమ శక్తిసామర్థ్యాల మేరకు అవకాశాలు లభించడం, బాధ్యతలు నిర్వహించడం ఇవన్నీ ఈ ప్రత్యేకత వల్లనే సాధ్యపడ్డాయి. ఇస్లామ్ సాధించిన ఈ సౌభ్రాత్ర సమాజంలో అందరూ సుఖదు:ఖాల్లో, సంతోషసంబరాల్లో ఒకరికొకరు చేదోడువాదోడుగా నిలిచారు. వారు ఒకేవిధంగా ఆలోచించారు. ఒకేవిధంగా వ్యవహరించారు. ఆచరించారు. కష్టాలు ఇబ్బందుల్లో వారి నాయకుడు అధికభాగం స్వీకరించాడు. సుఖాలు, సంతోషాల్లో అతితక్కువ భాగం స్వీకరించాడు. దురాచారాలు, మూఢాచారాలను తొలగించి ఆ స్థానంలో వచ్చిన కొత్త సామాజిక సరళి చాలా మంది ప్రజలను ఆకట్టుకుంది. ఆకర్షించింది. ఈ కొత్త సమాజంలో సభ్యులు న్యాయవేత్తలు, చదువుకున్నవారు, రైతులు, వర్తకులు అందరు తమ తమ రంగాల్లో నిష్ణాతులు. కొందరు సైన్యాధ్యక్షులుగా తమ ఆధిక్యతను నిరూపించుకున్నారు. బాధ్యతాయుతులైన పాలకులుగా, రాయబారులుగా తమ శక్తిసామర్థ్యాలు చాటి చెప్పారు. ప్రతి ఒక్కరి వ్యక్తిత్వంలో ఇస్లామీయ కొత్తదనం గుబాళిస్తుంది. వారి వ్యక్తిత్వంలో కొత్త శక్తిసామర్థ్యాలు ప్రకాశిస్తున్నాయి. ప్రజలపై చెరగని ముద్ర వేస్తున్నాయి. సమాజంలోని ఈ ఔన్నత్యం ప్రజలను ఆకర్షించడంలోను, వారిని ఆకట్టుకోవడంలోను ఆశ్యర్యమేముంది? వివిధ రంగాలకు చెందిన ప్రజలు పెద్ద సంఖ్యలో ఇస్లామ్ పట్ల ఆకర్షితులై ఇస్లామ్ స్వీకరించడం ప్రారంభమయ్యింది. అలాంటి కొన్ని ఉదాహరణలు ఇక్కడ చూద్దాం.

ప్రవక్త ముహమ్మద్(స) మక్కాలో ఉన్న ప్రారంభకాలంలో ప్రముఖ కవి తుఫైల్ దౌసీ అక్కడికి వచ్చారు. ఆయన ప్రవక్త ముహమ్మద్ (స)ను కలువకుండా ఖురైషులు అడ్డుకోవాలనుకున్నారు. కాని తుఫైల్ దౌసీ ప్రవక్త (స)ను కలిశారు. కేవలం కొన్ని ఖుర్‌ఆన్ వాక్యాలను విన్న వెంటనే ఆయన ఇస్లామ్ స్వీకరించారు. అలాగే అమ్ర్ ఇబ్నె అబ్సా మక్కాకు వచ్చి ప్రవక్త (స) గురించి విన్న వెంటనే ఇస్లామ్ స్వీకరించారు. ప్రవక్త (స)కు చిన్ననాటి స్నేహితుడు జుమాన్ బిన్ తాలాబా ప్రవక్త ముహమ్మద్

(స) ఇస్లామ్ ప్రచారం గురించి విని ఆయన్ను మందలించడానికి, ఆయన్ను దారిలో పెడదామనుకొని వచ్చాడు, కాని ప్రవక్త (స) నోటి వెంట దైవస్తోత్రాన్ని విన్న వెంటనే జుమాన్ మనసు మార్చుకుని తానే ఇస్లామ్ స్వీకరించాడు. ఎడారి తెగకు చెందిన యువకుడు అబూజర్, ఆ తెగ వృత్తి దోపిళ్ళు చేయడం. దోపిడీ వృత్తిగా ఉన్న అబూజర్ ఇస్లామ్ గురించి విని, శత్రుశక్తుల పన్నాగాలను తప్పించుకుని ప్రవక్త (స)ను కలుసుకున్నాడు. ఆయన నోట దివ్యఖుర్ఆన్ బోధనలు విన్నాడు. వెంటనే ఇస్లామ్ స్వీకరించడమే కాదు, ఇస్లామ్ పట్ల ఎలాంటి నిబద్ధత ప్రదర్శించాడంటే, నిర్భయంగా కాబా గృహానికి వెళ్ళి ఇస్లామ్ సందేశాన్ని చాటి చెప్పాడు. అక్కడున్న ఖురైషులు మండిపడి ఆయనపై పడి విపరీతంగా కొట్టారు.

ఇస్లామ్‌లో చేరిన ప్రతిఒక్కరు తమ పరిధిలో సందేశాన్ని ప్రచారం చేయడం ప్రారంభించారు. కొన్ని సందర్భాల్లో ఈ ప్రచారం వల్ల మొత్తం తెగలే ఇస్లామ్ స్వీకరించాయి. సువాయిద్ ఇబ్నె సమీత్ ఇస్లామ్ సందేశం గురించి విని ప్రవక్త ముహమ్మద్ (స)ను కలుసుకున్నారు. ఎంతో ప్రభావితుడైన సువాయిద్ తన పరిధిలో ప్రచారం ప్రారంభించారు. మదీనాకు చెందిన అయాజ్ బిన్ మాజ్ కూడా మక్కాలో ఇస్లామ్ సందేశాన్ని విని ప్రభావితుడై మదీనా వెళ్ళి ఇస్లామ్ ప్రచారాన్ని చేయడమే కాదు, మదీనాలో ఇస్లామ్‌కు ఆశ్రయం లభించే వాతావరణాన్ని సృష్టించాడు. నజ్రాన్ నుంచి 20 మంది సభ్యుల బృందం ఒకటి ప్రవక్త ముహమ్మద్ (స)ను కలుసుకుంది. ఇస్లామ్ గురించి తెలుసుకుంది. వారు ఇస్లామ్ ప్రభావానికి లోనుకాకుండా చూడాలని ఖురైషులు ఎంతగా ప్రయత్నించినా సాధ్యం కాలేదు. వారు ఇస్లామ్ ప్రభావాన్ని స్వీకరించి వెళ్ళారు. ఎమన్ ప్రజలు ఇస్లామ్ వల్ల ప్రభావితులయ్యారు. అబిసీనియాకు వలస వెళ్ళిన ముస్లిముల వల్ల ఎమన్ ప్రజలు ఇస్లామ్ గురించి తెలుసుకున్నారు. ఈ ప్రవాసుల వల్లనే అబిసీనియా చక్రవర్తి నీగస్ కూడా ఇస్లామ్ స్వీకరించాడు.

మదీనాలో ముస్లిములు వలసపోవడానికి ముందే అక్కడి ఔస్, ఖజర్‌జ్ తెగల అన్సారులు ఇస్లామ్ స్వీకరించారు. ప్రవక్త ముహమ్మద్ (స) మదీనా రాకముందే మదీనాలో ప్రతి ఇల్లు ఇస్లామ్ జ్ఞానకాంతులతో ప్రకాశించింది. యూద రబ్బీ అబ్దుల్లా బిన్ సలామ్ కూడా ప్రవక్త ముహమ్మద్ (స)ను కలుసుకుని చర్చించారు. సుదీర్ఘ చర్చల తర్వాత అతను ఇస్లామ్ స్వీకరించాడు. అప్పట్లో ప్రముఖ క్రయిస్తవ మతాచార్యుడు అబూ ఖైస్ సర్మా బిన్ అనస్ కూడా ఇస్లామ్ బోధనల గురించి తెలుసుకుని ఇస్లామ్ స్వీకరించాడు. బద్ర్ యుద్ధఖైదీల విడుదల గురించి మాట్లాడ్డానికి వచ్చిన జుబైర్ బిన్ ముతీమ్ ప్రవక్త ముహమ్మద్ (స) నోట కొన్ని ఖుర్ఆన్ వాక్యాలు విని



ఇస్లామ్ వల్ల తీవ్రంగా ప్రభావితుడయ్యాడు. ఖురైషుల బానిస అబూ రాఫే మక్కా నుంచి రాయబారిగా మదీనా వచ్చాడు. కాని ఇస్లామ్ బోధనల గురించి తెలుసుకుని ఇక మక్కా వెళ్ళడానికి ఇష్టపడక మదీనాలోనే ఉండాలనుకున్నాడు. కాని ఒక రాయబారిని మదీనాలో ఆపి ఉంచడం అన్నది సముచితం కాదని ప్రవక్త ముహమ్మద్ (స) అతడికి నచ్చచెప్పి, ఇస్లామ్ స్వీకరించాలన్న కోరిక ఉంటే ముందు మక్కా వెళ్ళి రాయబారిగా బాధ్యత ముగించి, ఆ తర్వాత మళ్ళీ మదీనా రావాలని చెప్పారు. అతను అలాగే చేశాడు. మరలా మదీనా వచ్చి ఇస్లామ్ స్వీకరించి ముస్లిముల్లో కలిసిపోయాడు. యూద తెగ బనూ ఖురైజా పాల్పడిన తీవ్రమైన నేరాలకు గాను వారిని శిక్షించడానికి సైనికదళాన్ని పంపించారు. ఈ సందర్భంగా ఆ తెగకు చెందిన అమ్ర్ బిన్ సాద్ ఇస్లామ్ స్వీకరించాడు. యమామా నాయకుడు తొమామా బిన్ అతల్ హనఫీ ఒక యుద్ధఖైదీగా మదీనా వచ్చాడు. అక్కడ ప్రవక్త ముహమ్మద్ (స) వ్యవహారశైలి చూసి ఎంతో ప్రభావితుడయ్యాడు. తాను కూడా ముస్లిముగా మారిపోయాడు. ఉహుద్ యుద్ధ సమయంలో బనీ అబ్దుల్ అషాల్ తెగకు చెందిన అమ్ర్ బిన్ సాబిత్ అసిరాం ఇస్లామ్ స్వీకరించాడు. యుద్ధంలో పాల్గొని అమరగతి పొందాడు. కందక యుద్ధంలో అత్యంత సంక్లిష్ట సమయంలో నుఆమ్ బిన్ మసూద్ ఇస్లామీయ ఉద్యమంలో చేరాడు. అనుకోకుండా మదీనా వచ్చిన అబుల్ ఆస్ అక్కడ ఇస్లామ్ గురించి తెలుసుకుని ముస్లిమ్‌గా మారాడు. యూదుల యుద్ధ సన్నాహాలు చూసిన ఒక మేకల కాపరి ఈ యుద్ధ సన్నాహాలు ఎవరిపై అని విచారించాడు. దైవప్రవక్తగా చెప్పుకునే ముహమ్మద్ (స)పై ఈ యుద్ధసన్నాహాలని తెలిసి ప్రవక్త (స) వద్దకు వచ్చి ఇస్లామ్ గురించి తెలుసుకుని ముస్లిమ్‌గా మారాడు. యుద్ధ నిపుణులుగా, పోరాట యోధులుగా పేరుపడిన ఖాలిద్ బిన్ వలీద్ (ఉహుద్ యుద్ధంలో ముస్లిములపై మెరుపుదాడి చేయించింది ఈయనే), అమ్ర్ బిన్ ఆస్ వంటి వారు తర్వాత ఖురైషులకు దూరమై ఇస్లామ్ స్వీకరించి ముస్లిముల్లో చేరిపోయారు. ఫుజాలా, షైబా బిన్ అబీ తల్హాలు భయంకరమైన కుట్రపన్నినవాళ్ళు. ప్రవక్త ముహమ్మద్ (స)ను హతమార్చ డానికి కుట్రపన్నారు. ఒకరు మక్కా విజయం సందర్భంగా ఈ కుట్రకు పాల్పడితే, మరొకరు హునైన్ యుద్ధ సమయంలో ఈ కుట్రకు పాల్పడ్డారు. కాని హతమార్చడానికి వచ్చిన వాళ్ళు ప్రవక్త ముహమ్మద్ (స) వద్దకు వచ్చి ఇస్లామ్ స్వీకరించి ముస్లిములుగా మారిపోయారు. ప్రఖ్యాత నావికుడు హాతిమ్ తాయి సోదరి, ప్రముఖ కవి కాబ్ బిన్ జుహేర్, అబ్దుల్లా బిన్ జుల్బాజాదీన్, వ్యాపారి మిన్‌కాజ్ బిన్ హబ్బాన్‌ల గురించి ఇంతకు ముందే

ప్రస్తావించుకున్నాము. ఈ ఉదంతాలను పరిశీలిస్తే ఇస్లామ్ శత్రు శిబిరంలో వ్యక్తులను కూడా ఆకర్షించిందన్న వాస్తవం అర్థం అవుతుంది.

> **"అల్లాహ్ సహాయం వచ్చినప్పుడు, విజయ భాగ్యం లభించినప్పుడు, ప్రజలు తండోపతండాలుగా అల్లాహ్ ధర్మంలో ప్రవేశించటాన్ని నీవు చూసినప్పుడు (ప్రవక్తా) నీవు నీ ప్రభువు స్తోత్రంతో పాటు ఆయన పవిత్ర నామాన్ని స్మరించు, ఇంకా ఆయన మన్నింపును వేడుకో. నిస్సందేహంగా ఆయన పశ్చాత్తాపాన్ని ఎంతగానో అంగీకరించేవాడు."** ***(దివ్యఖుర్ఆన్ 110 : 1-3)***

హిజ్రీశకం 8వ సంవత్సరం ప్రతినిధి బృందాల సంవత్సరంగా పేరుపడింది. ఎందుకంటే ఈ సంవత్సరంలో యావత్తు అరేబియా నుంచి అనేక ప్రతినిధి బృందాలు వచ్చి కలువడం, ప్రజలు పెద్ద ఎత్తున ఇస్లామ్ స్వీకరించడం జరిగింది. ఈ పరంపర ప్రవక్త ముహమ్మద్ (స) జీవితంలోని చివరి మూడు సంవత్సరాల వరకు కొనసాగింది. ఇది ప్రవక్త (స) నాటిన విత్తుల పంట. ప్రవక్త (స) జీవితంలో ఈ కాలం ఎంతో ముఖ్యమైనది. వివరణాత్మకంగా అధ్యయనం చేయవలసిన కాలం ఇది. అయితే ఈ పుస్తకంలో పూర్తి వివరాలు ఇవ్వడం సాధ్యం కాదు కాబట్టి క్లుప్తంగా ముఖ్యమైన కొన్ని సంఘటనలను ఇక్కడ ప్రస్తావిద్దాం. నిజానికి హిజ్రీశకం 8వ సంవత్సరానికి ముందు కూడా ప్రతినిధి బృందాలు రావడం జరిగింది వాటిని కూడా మనం విస్మరించలేం.

**1. ముజైనా తెగ వారి బృందం :** ఇది చాలా పెద్ద తెగ. ఖురైషులతో రక్త సంబంధం ఉన్న తెగ. హిజ్రీ శకం 5వ సంవత్సరంలో 400 మంది సభ్యులున్న బృందం ప్రవక్త ముహమ్మద్(స) వద్దకు వచ్చి ఇస్లామ్ స్వీకరించింది. మదీనా వచ్చిన మొదటి ప్రతినిధి బృందం బహుశా ఇదే. వారు వెళుతున్నప్పుడు ప్రవక్త ముహమ్మద్ (స) వారికి ఖర్జూరాలు కానుకగా ఇచ్చారు.

**2. బనూ తమీమ్ తెగ వారి బృందం:** ప్రారంభ సంవత్సరాల్లో వచ్చిన బృందాల్లో ఇది కూడా ఒకటి. ఈ తెగకు చెందిన ప్రముఖ నాయకులు అక్రా బిన్ హాబిస్, జర్ఖాన్, అమ్ర్ ఇబ్నుల్ అహ్తామ్, నుఅమ్ బిన్ యజీద్, ఉయైనా బిన్ హిస్న్ ఫజారీ వంటి వారు ఈ బృందంలో ఉన్నారు. ఈ బృందం చాలా అట్టహాసంగా వచ్చింది. ఈ బృందం సభ్యులు మస్జిదులో ప్రవేశించినప్పుడు ప్రవక్త (స) గారి మస్జిద్ ద్వారం వద్ద నిలబడి చాలా మొరటుగా "ఓ ముహమ్మద్, ఓ ముహమ్మద్, బయటకు రా" అని పిలిచారు. దివ్యఖుర్ఆన్ ఆదేశాలు సంస్కారవంతమైన



వ్యవహారశైలిని కూడా నేర్పాయి. వారు నిజానికి తమ ఇళ్ళనుంచి బయలుదేరినప్పుడు ఇస్లామ్ పట్ల ఆకర్షితులై వచ్చారు. కాని వారిలో స్వతహాగా ఉన్న అరబ్బు అహంకారం ఇంకా వారి స్వభావంలో తిష్టవేసుకునే ఉంది. కాబట్టి వాళ్ళు ఇరుపక్షాలకు చెందిన కవులు, ఉపన్యాసకులు పోటీ పడాలని కోరారు. నిజానికి అరబ్బులు మేధోపరమైన ఆధిక్యతను, నాయకత్వాన్ని కోరుకునే మనస్తత్వం కలిగి ఉంటారు. వారిలో ఉతారిబ్ బిన్ హాజిబ్ ప్రముఖ ఉపన్యాసకుడు. బనూ తమీమ్ తెగ ఆధిక్యత గురించి, గొప్పదనం గురించి, నాయకత్వ పటిమ గురించి, మంచి గుణగణాల గురించి ధారాళంగా ప్రసంగించాడు. అలాంటి గుణగణాలున్న వారెవరైనా ఉంటే ముందుకు రావాలని సవాలు చేశాడు. ప్రవక్త ముహమ్మద్ (స) అతనికి జవాబు చెప్పవలసిందిగా తబీత్ బిన్ ఖైస్‌ను కోరారు. తబీత్ సందర్భోచితంగా, అప్పటికప్పుడు ధారాళమైన వాగ్ధాటితో ఇస్లామ్ సందేశం గురించి వివరించి, గర్వించడానికి ఇస్లామ్ సంపద కన్నా గొప్పది ఏదీ లేదని చెప్పాడు. ఆయన ప్రసంగంలోని కొన్ని వాక్యాలు ఇక్కడ చదవండి :

"భూమ్యాకాశాలను సృష్టించిన దేవుడికే మా ధన్యవాదాలు, స్తోత్రాలు. దేవుడి ఆదేశాలే భూమ్యాకాశాల పనితీరును శాసిస్తున్నాయి. దేవుడి జ్ఞానమే భూమ్యాకాశాలకు విస్తృతిని ప్రసాదించింది. ఆయన గొప్పదనమే, ఆయన దయాగుణమే మమ్మల్ని పాలకులుగా చేసింది, మనలో ఒకరిని దైవప్రవక్త (స)గా నియమించింది. దేవుడు తన సృష్టిలో ఎన్నుకున్న వ్యక్తికి దైవప్రవక్త పదవి ప్రసాదించాడు. వంశ ఔన్నత్యానికి సంబంధించి అత్యున్నతుడు, ఎల్లప్పుడు సత్యమే పలికేవాడు, అత్యంత దయా హృదయుడు అయిన దైవప్రవక్త (స) ఒకే ఒక్క దేవుని ఆరాధించాలనీ, దైవప్రవక్త (స)ను విశ్వసించాలనీ ప్రజలను ఆహ్వానించారు. ఆయన సముదాయంలోని ఈ ప్రవాసులు ఈ పిలుపునకు ప్రతిస్పందించారు. వారంతా ఆయనకు సంబంధీకులే. వారు సత్యపథగాములైన సముదాయం. అసాధారణ విజయాలు వారు సాధించారు. కాబట్టి మేము దేవుడి ధర్మానికి సహాయకులం. దేవుడి ప్రవక్త (స)కు సహాయకులం. ఆయన పవిత్ర ఉద్యమానికి సహాయకులం..." ఇలా ధారాళంగా ఉరకలెత్తే జల ప్రవాహంగా ఆయన ప్రసంగం సాగింది.

ఆ తర్వాత బనూ తమీమ్ తెగకు చెందిన ప్రముఖ కవి జిబ్రికాన్ బిన్ బద్ర్ ఒక కవితను చదివాడు. ఆ కవిత భావం ఏమంటే, మేము చాలా ఉన్నతులం, జీవించి ఉన్నవారెవ్వరూ మాకు సమానులు కాదు. మాలో పాలకులు ఉన్నారు. మేము ఆరాధనాలయాలను నిర్మించాం.

ఈ కవితకు జవాబు చెప్పాలని హజ్రత్ హసన్‌ను కోరడం జరిగింది. ఈ సుదీర్ఘ కవితను ఇబ్నె హిషామ్ పూర్తిగా ఉంటంకించారు. ఈ పోటీ తర్వాత బనూ తమీమ్ బృందం ముస్లిమ్ కవులు, ఉపన్యాసకుల ఆధిక్యతను గుర్తించింది. మొత్తం బృందంలోని వారంతా ఇస్లామ్ స్వీకరించారు.

**3. బనీ అబ్దుల్ ఖైస్ తెగ వారి బృందం :** మిన్‌కాజ్ బిన్ హబ్బాన్ ద్వారా ఇస్లామ్ సందేశం బహ్రేయిన్ ప్రాంతానికి కూడా చేరింది. అక్కడ ఇస్లామ్ సందేశం శరవేగంగా విస్తరించసాగింది. హిజ్రీ శకం 5వ సంవత్సరంలో 13 మంది సభ్యుల బృందం మదీనా వచ్చింది. వారు రాబియా కుటుంబానికి చెందిన వారని తెలిసి ప్రవక్త ముహమ్మద్ (స) వారిని అత్యంత గౌరవాదరాలతో స్వాగతించారు. వారి గృహాలు చాలా దూరప్రాంతాన ఉన్నాయి కాబట్టి దారిలో ముస్లిమేతరుల ప్రాంతాలు ఉండటం వల్ల తాము కేవలం నిషిద్ధ మాసాల్లోనే (పోరాటాలు రక్తపాతం నిషిద్ధమైన మాసాలు) అక్కడికి రాగలమని, అందువల్ల ఈ మధ్యకాలంలో తమకు అవసరమైన నిర్దిష్టమైన ధార్మికపాఠాలు తెలియజేస్తే వాటిని ఆచరిస్తామని, ప్రచారం చేస్తామని చెప్పారు. ప్రవక్త ముహమ్మద్ (స) వారికి ఏకదైవారాధన గురించి, ప్రార్థనలు, ఉపవాసాలు, దానధర్మాలు, మద్యనిషేధం గురించి బోధించారు. నాలుగు రకాల పాత్రలను ప్రవక్త ముహమ్మద్ (స)వారికి నిషేధించారు. ఈ నాలుగు రకాల పాత్రలు వారి ప్రాంతంలో మద్యపాత్రలుగా ఉపయోగిస్తారు. ఆ పాత్రల పేర్లు దుబ్బా, హంతమ్, నాకిర్, ముజప్పాత్. ఈ పాత్రల పేర్లు ప్రవక్త ముహమ్మద్ (స) చెప్పడం చూసి వారు ఆశ్చర్యపోయారు. ఎక్కడో దూరాన ఉన్న తమ ప్రాంతం గురించి ఇన్ని వివరాలు ప్రవక్త (స)కు ఎలా తెలుసా అనుకున్నారు. ఇస్లామ్ స్వీకరించి వారు వెనుదిరిగి వెళ్ళిపోయారు. ఈ బృందంలో ఉన్న ఒక క్రయిస్తవ సభ్యుడు, జారుద్ బిన్ అల్ ఆలా ప్రవక్త ముహమ్మద్ (స)తో తాను మతం మార్చుకుంటే తనకు సాఫల్యం లభిస్తుందన్న హామీ ఉందా అని అడిగాడు. ప్రవక్త (స) అతడికి హామీ ఇస్తూ అతను అనుసరిస్తున్న మతం కన్నా ఇస్లామ్ ఉత్తమమైనది కాబట్టి అతను సాఫల్యం తప్పక పొందగలడని అన్నారు. ఆ వెంటనే జారుద్ ఇస్లామ్ స్వీకరించాడు.

**4. బనూ సాద్ బిన్ బక్ర్ తెగ వారి బృందం:** ఈ తెగ జుమాన్ బిన్ తలాబాను తమ ప్రతినిధిగా ప్రవక్త ముహమ్మద్ (స) వద్దకు పంపించింది. ఆయన ఒక సాధారణ మైన బదూయిన్ (ఎడారి సంచారతెగకు చెందిన వ్యక్తి)గా వచ్చాడు. మస్జిదులోకి ప్రవేశించి అక్కడున్న వారితో అబ్దుల్ ముత్తలిబ్ కుటుంబానికి చెందిన వారు ఎవరని



ప్రశ్నించాడు. తాను ప్రవక్త ముహమ్మద్ (స)నే కలుసుకున్నానని నిర్ధారించుకున్న తర్వాత "ముత్తలిబ్ కుమారుడా! నేను కొన్ని ప్రశ్నలు అడుగుతాను.. మీరు నొచ్చుకోరనే అనుకుంటున్నాను" అన్నాడు. ప్రవక్త ముహమ్మద్ (స) అడగమన్నారు. ఆ తర్వాత అతను ఏకదైవారాధన గురించి, ప్రవక్తల పరంపర గురించి, ప్రార్థనలు వగైరా గురించి ప్రశ్నించాడు. ప్రవక్త (స) అతడికి తన బోధనలు వివరించారు. ఆ తర్వాత అతను ఇలా అన్నాడు, "నా పేరు జుమాన్ బిన్ తలాబా, నా తెగ నన్ను ప్రతినిధిగా మీ వద్దకు పంపించింది. ఇప్పుడు నేను వారి వద్దకు వెళ్ళి మీరు చెప్పిన మాటలు పొల్లుపోకుండా వారికి నివేదిస్తాను." అని చెప్పి వెళ్ళిపోయాడు. తన తెగ వారి వద్దకు వెళ్ళి ఎంత ఉత్సాహంగా ఇస్లామ్ గురించి ప్రచారం చేసాడంటే, ఆ రోజే మొత్తం తెగ ఇస్లామ్ స్వీకరించింది.

**5. అషారిన్ (ఎమన్) బృందం :** ఎమన్‌కు చెందిన అత్యంత గౌరవప్రదమైన తెగ ఇది. అబూ మూసా అషారీ ఈ తెగకు చెందిన వారే. మక్కా కాలంలోనే ఈ తెగ వారికి ఇస్లామ్ సందేశం గురించి తెలిసింది. తుఫైల్ దౌసీ, అబిసీనియా ప్రవాస ముస్లిముల ద్వారా వారు ఇస్లామ్ గురించి తెలుసుకున్నారు. ఈ తెగకు చెందిన ముగ్గురు ఇస్లామ్ వల్ల ప్రభావితులై మదీనా వెళ్ళి ప్రవక్త (స)ను కలుసుకోవాలను కున్నారు. కాని గాలివాటం అనుకూలంగా లేకపోవడం వల్ల వారి నౌక దారితప్పి అబిసీనియా తీరానికి చేరుకుంది. అక్కడ వారు మక్కా నుంచి వచ్చిన మొదటి విడత ప్రవాసులను కలుసుకున్నారు. అక్కడ కొంతకాలం ఉన్నారు. ఆ తర్వాత హజ్రత్ జాఫర్ మరికొంత మంది అబిసీనియా ముస్లిములతో కలిసి మదీనా చేరుకుని ప్రవక్త (స)ను కలుసుకున్నారు. వారు ప్రవక్త (స)ను కలుసుకోవడానికి ఎంత ఆత్రపడ్డారంటే, మదీనా దగ్గరకు చేరుకోగానే ఇలా పాటలు అందుకున్నారు.

"రేపు మేము మా మిత్రులను కలుస్తాం.. అంటే ముహమ్మద్ (స) ఆయన సహచరులను కలుస్తాం" అని పాటలు పాడడం మొదలు పెట్టారు.

వారి రాక గురించి తెలిసి ప్రవక్త ముహమ్మద్ (స) తన సహచరులతో ఇలా అన్నారు, "ఎమన్ నుంచి కొందరు మన వద్దకు వస్తున్నారు. చాలా సున్నిత మనస్కులు, మంచివారు"

ఇంకా ఇలా చెప్పారు:

"ఎమన్ నుంచి వచ్చిన విశ్వాసం.. ఎమన్ నుంచి వచ్చిన జ్ఞానం"

**6. దౌస్ (ఎమన్) బృందం:** మక్కాలో ప్రారంభకాలంలోనే ఇస్లామ్ స్వీకరించిన

తుఫైల్ దౌసీ తన తెగలో ప్రచారం చేయడం ప్రారంభించారు. కాని ఆయన తండ్రి, ఆయన భార్య, మరి కొద్ది మంది తప్ప ఎవరూ ఆయన్ను పట్టించుకోలేదు. ఆయన తెగవారు పెద్దగా ప్రభావితులు కాలేదు. దీనికి కారణం తుఫైల్ చాలా కోపిష్ఠి. ఆయన ప్రచార ఉద్యమం పెద్దగా ఫలితాలు సాధించలేదు. ఆ తర్వాత తుఫైల్ మదీనా వెళ్ళి ఈ పరిస్థితిని వివరించారు. ప్రవక్త ముహమ్మద్ (స) ఆయనతో మృదువుగా బోధించాలని వివరించారు. తుఫైల్ తెగ కోసం దేవుడిని ప్రార్థించారు. అక్కడి నుంచి వెనుదిరిగి వచ్చిన తుఫైల్ ఈ సారి తన తెగలో చాలా మృదువుగా బోధించడం ప్రారంభించారు. ఈసారి చాలా మంది ఆయన బోధనలకు ప్రభావితులయ్యారు. హిజ్రీ శకం 7వ సంవత్సరంలో 80 కుటుంబాలు ఈ తెగ నుంచి మదీనాకు ప్రవాసులుగా వచ్చేశారు. వీరిలోనే ప్రముఖ సహచరులు అబూ హురైరా (రజి) ఉన్నారు.

**7. సూదా బృందం :** ఈ తెగలో ప్రవక్త ముహమ్మద్ (స)ను కలుసుకున్న మొదటి వ్యక్తి జైద్ బిన్ హారిస్. తన తెగకు తిరిగి వెళ్ళిన తర్వాత అతను అక్కడ ప్రచారం మొదలు పెట్టాడు. హిజ్రీ శకం 8వ సంవత్సరంలో ఈ తెగ నుంచి 15 మంది సభ్యుల బృందం మదీనా వచ్చి ప్రవక్త (స)ను కలుసుకుని ఇస్లామ్ స్వీకరించింది. చివరి హజ్ సందర్భంగా ప్రవక్త ముహమ్మద్ (స)తో వందమంది హజ్‌లో పాల్గొన్నారు.

ఈ బృందాలు మక్కా విజయానికి ముందు ప్రవక్త (స)ను కలుసుకున్న బృందాలు. వీటి గురించి చరిత్రలో వివరణాత్మకంగా నమోదయ్యింది. మక్కా విజయం తర్వాత ఇస్లామ్ మరింత ఉధృతంగా విస్తరించింది. తండోపతండాలుగా ప్రజలు ఇస్లామ్ స్వీకరించడానికి ముందుకు వచ్చారు. ఇక్కడ కొన్ని ముఖ్యమైన బృందాల గురించి క్లుప్తంగా చూద్దాం.

**8. తాఖీఫ్ (తాయిఫ్) బృందం :** మక్కా విజయం తర్వాత ప్రవక్త ముహమ్మద్ (స) మదీనా తిరిగి వచ్చిన పిదప, ఉర్వా బిన్ మసూద్ సఖాఫీ, ప్రవక్త (స) వద్దకు వచ్చి ఇస్లామ్ స్వీకరించారు. బనూ తాఖిఫ్ తెగలో ఇస్లామ్ ప్రచారం చేయాలన్న అభిలాషను వ్యక్తం చేశారు. తాఖిఫ్ ప్రజల స్వభావం, వారి దుందుడుకు మనస్తత్వం ప్రవక్త(స)కు బాగా తెలుసు. కాబట్టి ఏం చేసినా చాలా జాగ్రత్తగా చేయాలని సలహా ఇచ్చారు. ఉర్వాకు తన పలుకుబడిపై చాలా నమ్మకం ఉంది. అందువల్ల తనకు



ప్రచారం చేసే అనుమతి ఇవ్వాలని పట్టుబట్టారు. ఆ పిదప తాయిఫ్‌కు తిరిగి వచ్చి, తన ఇంటికప్పుపై నిలబడి ప్రజల్ని ఉద్దేశించి ఇస్లామ్ స్వీకరించాలని బోధించాడు. హఠాత్తుగా ఆయనవైపు దూసుకు వచ్చిన బాణం ఆయన్ను హతమార్చింది. కాని ఆ తర్వాత ఆ తెగ ప్రజల్లో పశ్చాత్తాపం కలిగింది. తాము చేసిన దుష్కార్యాలకు సిగ్గుపడ్డారు. ఒక నెలరోజుల తర్వాత ఆ తెగ పెద్దలు సమావేశమయ్యారు. వాస్తవ పరిస్థితులను అంచనా వేశారు. మొత్తం అరేబియా ఇస్లామ్ స్వీకరించిన నేపథ్యంలో మొత్తం దేశాన్ని వ్యతిరేకిస్తూ కత్తిపట్టడం సాధ్యం కాదని తెలుసుకున్నారు. అందువల్ల ఒక ప్రతినిధి బృందాన్ని మదీనా పంపాలని నిర్ణయించుకున్నారు. ఉస్మాన్ బిన్ అబిల్ ఆస్, ఔస్ బిన్ ఔఫ్, బెహ్జ్ బిన్ ఖర్షా (బనీ మాలిక్ తెగ), హాకమ్ బిన్ అమ్ర్ బిన్ వహ్బా, షురాబిల్ బిన్ గైలాన్ (మిత్రతెగల వ్యక్తి)లను బృందం సభ్యులుగా ఎన్నుకున్నారు. తాయిఫ్ తెగ నాయకుడు అబ్ద్ యాలిల్ ఈ బృందానికి నాయకుడిగా ఈ బృందం మదీనా వచ్చింది. ఈ బృందానికి నాయకుడిగా ఉన్న అబ్ద్ యాలిల్ పన్నెండు సంవత్సరాల క్రితం ప్రవక్త ముహమ్మద్ (స) తాయిఫ్ వచ్చినప్పుడు కనీసం ఆయనతో మాట్లాడ్డానికి కూడా నిరాకరించాడు. పైగా అల్లరి గుంపులను రెచ్చగొట్టి ఆయన్ను రాళ్ళతో కొట్టించాడు. ప్రవక్త ముహమ్మద్ (స) తబూక్ నుంచి వెనుదిరిగి వచ్చిన తర్వాత ఈ బృందం మదీనా వచ్చింది. వారి కోసం మస్జిదు బయట ఒక శిబిరం వేశారు. ఖలీల్ బిన్ సయీద్ బిన్ అల్ ఆస్ వారితో సంప్రదింపులు జరిపారు. తాయిఫ్ బృందం చాలా విచిత్రమైన షరతులు ఏవేవో పెట్టాలనుకుంది, కాని దైవిక చట్టాల్లో మార్పులు చేసే అధికారం ఎవరికీ లేదు. చివరకు ఒక రాజీ ఒప్పందం కుదిరింది. కొంతకాలం పాటు జకాత్ చెల్లింపుల నుంచి వారికి మినహాయింపు ఇవ్వడం జరిగింది. అలాగే జిహాద్‌లో పాల్గొనడానికి సంబంధించి కూడా కొంతకాలం మినహాయింపు ఇచ్చారు. ఇందుకు సంబంధించిన ఒక అంగీకారం కుదుర్చుకున్నారు. కాని ఇస్లామ్ తాయిఫ్ ప్రజల మనోమస్తిష్కాలపై బలమైన ప్రభావం వేసిన తర్వాత ఈ షరతులేవీ మిగల్లేదు. ఈ బృందంలోని ఔత్సాహిక యువకుడు ఉస్మాన్ బిన్ అబిల్ ఆస్‌ను వారికి నాయకుడిగా నియమించడం జరిగింది. ఈ బృందం వెనుదిరిగి వెళుతున్నప్పుడు నాటకీయంగా తాము విఫలమై వెళుతున్నామని, యుద్ధానికి సన్నాహాలు తప్పవని ప్రకటన చేసింది. కాని తాయిఫ్ ప్రజలు దీన్ని తీవ్రంగా వ్యతిరేకించారు. పూర్తి అరేబియా ప్రవక్త (స)కు బాసటగా ఉన్నప్పుడు ఆయనతో యుద్ధం

చేయలేమన్నారు. ఆ తర్వాత బృందం సభ్యులు ఇస్లామ్ మౌలిక నియమాలను వారికి వివరించారు. చివరకు పూర్తి తెగ ఒప్పుకుంది. కాబాగృహంలో విగ్రహాలను ప్రవక్త (స) పడగొట్టినప్పుడు ఆయనతో పాటు ఉన్న అబూ సుఫ్యాన్ బిన్ హర్బ్, ముగీరా బిన్ షాబాలు కూడా ఈ బృందంలో సభ్యులే. కాబాగృహంలో విగ్రహాలను పడగొట్టినప్పుడు చాలా భయాందోళనలు నెలకొన్నాయి. గొప్ప ఆపద ఏదో విరుచుకుపడుతుందని భయపడి మహిళలు రోదించారు. కాని అలాంటిదేమీ జరగలేదు. అజ్ఞానకాలంలో ఇస్లామ్ శత్రువుల కంచుకోట లాంటి తాయిఫ్ శాంతి యుతంగా ఎలాంటి హింస లేకుండా వశమైంది.

**9. బనీ హనీఫా బృందం :** ఈ బృందం యమామా ప్రాంతానికి చెందినది. తమామా బిన్ ఉసల్ ద్వారా ఇస్లామ్ అక్కడికి చేరింది. ఆ పిదప వాళ్ళు ఒక ప్రతినిధి బృందాన్ని పంపించారు. ఆ బృందం ప్రవక్త (స)ను కలుసుకున్న వెంటనే ఇస్లామ్ స్వీకరించింది. ఈ బృందంతో వచ్చిన ఒక వ్యక్తి పేరు ముసైలమా. ఇతనే తర్వాత ముసైలమా కజ్జాబ్ అంటే అసత్యవాది ముసైలమాగా పేరుపడ్డాడు. ఇతను ప్రవక్త (స)తో తనను ప్రవక్తకు వారసుడిగా ప్రకటించాలని కోరాడు. ప్రవక్త (స) ఈ అనుచిత కోరికను నిర్ద్వంద్వంగా నిరాకరించారు. బృందం వెనుదిరిగి వెళ్ళిన వెంటనే ముసైలమా తనను తాను ప్రవక్తగా ప్రకటించుకున్నాడు. ప్రార్థనలు రద్దు చేశాడు, మద్యపానం, వ్యభిచారాలకు పూర్తి అనుమతి ఉందని ప్రకటించాడు.

**10. బనీ తాయి బృందం :** జైదుల్ ఖైల్ నాయకత్వంలో బనీ తాయి బృందం ప్రవక్త (స)ను కలుసుకుని ఇస్లామ్ స్వీకరించింది. ఈ తెగ నాయకుల్లో అదీ బిన్ హాతిమ్ ఒకడు. ఈయన క్రయిస్తవుడు. ప్రవక్త(స) పట్ల తీవ్రమైన విద్వేషంతో బుసలు కొట్టేవాడు. ప్రవక్త (స)పై యుద్ధానికి సన్నాహాలు చేయసాగాడు. కాని ముస్లిమ్ సైన్యం అకస్మాత్తుగా ఎమన్ చేరుకోగానే ఇతను సిరియా పారిపోయాడు. ఇతని సోదరి యుద్ధ ఖైదీగా మదీనా తీసుకురాబడింది. ఆమెను ప్రవక్త (స) విడుదల చేసి సగౌరవంగా వెనక్కి పంపించారు. ఆమె తన సోదరుడితో ప్రవక్త (స) వ్యవహారశైలి గురించి, ఆయన దయాహృదయం గురించి వివరించింది. మదీనా వెళ్ళి ప్రవక్త(స)ను కలుసుకోవాలని సోదరుడికి నచ్చచెప్పింది. అతను మదీనా వెళ్ళి ప్రవక్త (స)ను కలుసుకుని ఆయన వ్యవహారశైలికి ముగ్ధుడై తక్షణం ఇస్లామ్ స్వీకరించాడు. అతను రాగానే ప్రవక్త(స) అతడితో మాట్లాడి ఇస్లామ్ పట్ల అతనిలో ఉన్న అనుమానాలు,



అపోహలను దూరం చేశారు. ముస్లిముల నిరుపేద అవస్థ చూసి ఇస్లామ్ స్వీకరించే విషయంలో సంకోచాలు ఉన్నట్లయితే దేవుడి తోడు త్వరలోనే సంపద ముస్లిముల్లో వరదగా వచ్చి పడుతుంది. సంపదను పట్టించుకునే వాడు కూడా ఇక్కడ ఎవడూ ఉండడు, అలాగే ముస్లిముల సంఖ్యాబలం తక్కువగా ఉండ డాన్ని చూసి సంకోచి స్తుంటే సంఖ్యాబలం కూడా త్వరలోనే పెరుగుతుంది. ఖదీసియా నుంచి ఒంటరి మహిళ ఎలాంటి భయం లేకుండా మదీనా చేరుకునే రోజు వస్తుంది అన్నారు.

**11. బనీ అల్ హర్స్ లేదా బనీ అల్ హారిస్ బిన్ కాబ్ తెగ వారి బృందం :** ఈ బృందం నజ్రాన్ ప్రాంతం నుంచి వచ్చింది. హిజ్రీ శకం 10వ సంవత్సరంలో ఈ తెగవారికి ఇస్లామ్ గురించి ఖాలిద్ బిన్ వలీద్ ద్వారా తెలిసింది. ఖాలిద్ అక్కడి నుంచి తిరిగి వస్తున్నప్పుడు ఆ తెగకు చెందిన కొందరిని తనతో పాటు తీసుకువచ్చారు. వారిలో కొన్ని ప్రత్యేక సుగుణాలు ఉండటం వల్ల ఆయన వారిని ప్రవక్త (స) వద్దకు తీసుకువచ్చారు. ప్రవక్త (స) వారితో మాట్లాడి ఖైస్ బిన్ హిస్న్‌ను వారి నాయకుడిగా నియమించారు.

**12. నజ్రాన్ బృందం :** ప్రవక్త ముహమ్మద్ (స) తన ఉద్యమాన్ని ముందుకు నడుపడానికి వివిధ ప్రాంతాలకు లేఖలు రాశారు. నజ్రాన్‌లోని క్రయిస్తవులకు ఆయన రాసిన లేఖ సారాంశం:

"ప్రవక్తలు ఇబ్రాహీమ్, ఇస్హాక్, యాకూబ్‌ల దేవుడి పేరుతో నేను ప్రారంభిస్తు న్నాను. మీరు తోటి మనుష్యుల ఆరాధనలను మానుకోవాలని, దేవుడి విశ్వసామ్రాజ్యా ధికారాన్ని అంగీకరించాలని కోరుతున్నాను. మీరు ఈ ఆహ్వానాన్ని తిరస్కరించేదయితే మీరు జిజియా చెల్లించి రాజకీయంగా లొంగిపోవలసి ఉంటుంది. ఈ ఆహ్వానాన్ని తిరస్కరించడం యుద్ధప్రకటనతో సమానమవుతుంది."

ఈ లేఖను చదివిన బిషప్ వణికిపోయాడు. ఆయన ముందుగా అక్కడి పెద్ద లను సంప్రదింపులకు పిలిచాడు. ఆ పిదప ఒక బహిరంగసభ ఏర్పాటు చేశాడు. అక్కడ లోయలో 73 నివాస ప్రాంతాలున్నాయి. కిక్కిరిసిన జనాభా ఉంది. లక్షమంది సైన్యాన్ని సిద్ధం చేయడం వారికి కష్టం కాదు. ఆ బహిరంగ సభలో హాజరైన ప్రజలు కూడా చాలా పెద్ద సంఖ్యలో ఉన్నారు. ఈ సభలో ముఖ్యంగా చర్చకు వచ్చిన విషయం ఒక్కటే. బనీ ఇస్మాయిల్ వంశం నుంచి రావలసిన ప్రవక్త ఈ ప్రవక్త ఒక్కరేనా అన్నది. చాలా సేపు వాదోపవాదాల తర్వాత ఒక ప్రతినిధి బృందాన్ని

మదీనా పంపి ప్రవక్త (స)తో మాట్లాడి వాస్తవాలు నిర్ధారించుకోవాలని నిర్ణయించుకున్నారు. షురాబిల్, అబ్దుల్లా, హుబర్‌లు ఈ బృందంలో వెళ్ళాలని నిర్ణయమయ్యింది. ఈ బృందం ప్రవక్త (స)ను కలుసుకుని చర్చించి, ప్రవక్త (స) జారీ చేసిన ఫర్మానా తీసుకుని తిరిగి వచ్చింది. రాజకీయ లొంగుబాటుకు, శాంతియుత జీవనం, పౌర హక్కుల భద్రత కోసం జిజియా చెల్లింపులకు అంగీకరిస్తూ చేసుకున్న ఒప్పందం అది. నజ్రాన్ బిషప్, తెగలోని ఇతర నాయకులు ఈ ఫర్మానాను స్వీకరించడానికి చాలా దూరం వచ్చి బృందాన్ని కలుసుకుని ఫర్మానా స్వీకరించారు. బిషప్ వాహనంపై స్వారీ చేస్తూనే ఈ ఫర్మానాను చదివాడు. ఆయన బంధువు బిష్ర్ బిన్ ముఆవియా ఈ ఫర్మానా చదవడంలో ఎంతగా మునిగిపోయాడంటే ఒంటెపై నుంచి జారి కింద పడ్డాడు. కిందపడిన ముఆవియా కోపంగా తాను ఒంటెపై కిందపడడానికి కారణమైన ఆ ఫర్మానా రాసిన ప్రవక్త (స)ను కోపంగా శపించాడు. ఆ వెంటనే బిషప్ అతడిని తీవ్రంగా మందలిస్తూ ప్రవక్త (స)కు వ్యతిరేకంగా ఆయన గౌరవానికి భంగం కలిగించే ఒక్కమాట కూడా మాట్లాడరాదని, ఆయన నిజమైన ప్రవక్త(స) అన్నది తెలుసుకోవాలని కోపించాడు. ఈ మాటలు విన్న బిష్ర్ ఎంతగా ప్రభావితుడయ్యాడంటే, తాను మదీనా వెళ్ళే వరకు ఒంటెపై నుంచి దిగనని ప్రమాణం చేసి ఒంటెను మళ్లించి మదీనావైపు పరుగులు పెట్టించాడు. మదీనా చేరుకుని ప్రవక్త (స)ను కలుసుకున్నాడు. ఆ తర్వాత అతను వెనుదిరిగి వెళ్ళలేదు. ప్రవక్త (స)తోనే ఉండిపోయాడు. ఒక యుద్ధంలో అమరగతి పొందే వరకు ప్రవక్త (స) సహచర్యంలోనే ఉన్నాడు. ఈ బృందం నజ్రాన్ చేరుకున్న తర్వాత వారి నివేదిక విన్న వెంటనే ఒక క్రైస్తవ సన్యాసి తక్షణం మదీనా ప్రయాణమయ్యాడు. ప్రవక్త (స)కు ఒక కప్పు, ఒక కర్ర, ఒక శాలువా కానుకలుగా సమర్పించి మదీనాలో కొంతకాలం ఉన్నాడు. ఆ తర్వాత ఇంటికి తిరుగుముఖమై, త్వరలోనే మళ్ళీ వస్తానని అన్నాడు కాని ప్రవక్త (స) జీవితకాలంలో రాలేకపోయాడు.

నజ్రాన్ బిషప్ చాలా ప్రముఖుడు. కాన్‌స్టాంటినోపుల్ చక్రవర్తి వద్ద గొప్ప గౌరవాదరాలు పొందిన వ్యక్తి. మహిమలు, మహత్యాలు ప్రదర్శించే మతాచార్యుడిగా పేరున్నవాడు. ఆయన మదీనా వచ్చారు. ఆయనతో పాటు ఒక క్రయిస్తవ న్యాయాధికారి, మరో న్యాయకోవిదుడు, మరో ఇరవై నలుగురు ప్రముఖులు వచ్చారు. వారు మదీనాలో కొన్ని రోజులు ఉన్నారు. వారు మస్జిదులోనే తమ ప్రార్థనలు చేసుకునేవారు. వారు మస్జిదులో తమ మతాచారాల ప్రకారం ప్రార్థనలు చేయడాన్ని



ప్రవక్త (స) సహచరులు అభ్యంతరపెట్టారు. కాని ప్రవక్త (స) వారి ప్రార్థనలను మస్జిదులో అనుమతించారు.

ఈ కాలంలో క్రయిస్తవులకు సంబంధించినదే మరో ముఖ్యమైన సంఘటన జరిగింది. యూదులు రెచ్చగొట్టడంతో క్రయిస్తవులు ప్రవక్త (స)ను ఒక సవాలు చేశారు. ప్రవక్త (స) తన భార్య పిల్లలపై ప్రమాణం చేయాలని, తాను నిజమైన దైవప్రవక్త కాకపోతే దేవుని అభిశాపం తనపై పడాలన్న ప్రమాణం చేయాలని, తాము కూడా అలాంటి ప్రమాణానికి సిద్ధంగా ఉన్నామని సవాలు చేశారు. మర్నాటి ఉదయం ప్రవక్త (స) తన కుమార్తె, మనుమలను తీసుకుని, హజ్రత్‌అలీ (రజి)ను వెంటబెట్టుకుని బయటకు వచ్చారు. కాని క్రయిస్తవులు భయపడ్డారు. ఆయన నిజమైన దైవప్రవక్త అయితే తాము సర్వనాశనమైపోతామని వణికిపోయారు. ఎలాంటి షరతుల్లేకుండా లొంగిపోయారు. ఎంత పన్ను విధించినా చెల్లించడానికి సిద్ధమని అన్నారు. ఆ మర్నాడు దీనికి సంబంధించిన శాసనాన్ని రాయించారు. క్రయిస్తవులకు పూర్తి మతస్వేచ్ఛను, సామాజిక స్వాతంత్ర్యాన్ని ప్రసాదించడమే కాదు, వారి ఆస్తులకు, ప్రాణాలకు పూర్తి భద్రత కల్పించడం జరిగింది. దానితో పాటు వారికి అప్పటి వరకు ఉన్న సమస్త హక్కులను కొనసాగిస్తూ, వారి మతపరమైన వ్యవహారాల్లో ఎలాంటి మార్పులు ఉండవనీ, వారి నుంచి ఎలాంటి మతవిధుల నిర్వహణకు సంబంధించి వసూళ్ళు చేయడం జరగదని పేర్కొన్నారు. అంతేకాదు అజ్ఞానకాలంలో అంటే అంతకు ముందు కాలంలో వారు పాల్పడిన నేరాలకు ఇప్పుడు ఎలాంటి శిక్షలు ఉండవనీ, వారి ప్రాంతంలో ఏ సైన్యమూ ప్రవేశించదనీ, వారితో బలవంతంగా పని చేయించడమూ ఉండదనీ, అలాగే ఒకరి నేరాలకు మరొకరిని బాధ్యుడు చేయడమూ జరగదని హామీ ఇచ్చారు. ఈ అతి పెద్ద జనాభాపై విధించిన శిస్తు కేవలం 2000 నాణాలు మాత్రమే.

ఇక్కడ గమనించవలసిన మరో విషయమేమంటే, నజ్రాన్ జనాభాలో రెండు వర్గాలున్నాయి. ఒకరు క్రయిస్తవులు. మరొక వర్గాన్ని ఉమ్మీలనేవారు. క్రయిస్తవులు రాజకీయ లొంగుబాటుకు ఒప్పుకున్నారు. ఉమ్మీలు ఇస్లామ్ స్వీకరించారు.

**13. బనూ అసద్ బృందం :** ఖురైషుల సైనిక కార్యకలాపాల్లో భారీగా సహాయమందించిన తెగ బనూ అసద్. హిజ్రీ శకం 9వ సంవత్సరంలో ఈ తెగ నుంచి ఒక ప్రతినిధి బృందం మదీనా వచ్చి ఇస్లామ్ స్వీకరించింది. కాని వారిలో

స్వభావసిద్ధమైన అరబ్బు అహం ఊరుకోలేదు. ప్రవక్త (స)తో మాట్లాడుతూ, ఆయన వారి వద్దకు ఎవరినీ పంపకపోయినా వారే స్వయంగా ప్రవక్త (స) వద్దకు వచ్చామని గొప్పగా చెప్పుకున్నారు. ఈ మాటలకు దివ్యఖుర్‌ఆన్ జవాబిచ్చింది. "మీరు ఇస్లామ్ స్వీకరించడం వల్ల నాకు ఏదో మేలు చేసారని అనుకోవద్దు." అని స్పష్టం చేసింది. నిజానికి ముస్లిములుగా మారే గొప్ప సౌభాగ్యాన్ని దేవుడు వారికిచ్చాడు. ఆ తర్వాత వాళ్ళు ఆహారధాన్యాల పంట రాకముందే దిగుబడి గురించి ముందుగానే చెప్పడం, ధాన్యం ధరను ముందుగానే నిర్ణయించడం గురించి అడిగారు. ప్రవక్త (స) ఈ పద్ధతులను నిర్ద్వంద్వంగా వ్యతిరేకించారు. ఆ తర్వాత వాళ్ళు భాషలో రాత గురించి అడిగారు. ప్రవక్త (స) జవాబిస్తూ రాతపూర్వకమైన భాషను తప్పక ఎవరో ప్రవక్త కనిపెట్టి ఉంటారని అంతకు మించి తన వద్ద దీని గురించి సమాచారం లేదని అన్నారు.

ఈ తెగలో కూడా ఒక అబద్ధపు ప్రవక్త బయలుదేరాడు. హజ్రత్ అబూబక్ర్ (రజి) ఖలీఫాగా ఉన్న కాలంలో తల్హా బిన్ ఖైలిద్ తానే ప్రవక్తనని ప్రకటించుకున్నాడు.

**14. బనూ ఫజారా బృందం :** బనూ ఫజారా చాలా బలమైన, మొండివైఖరి కలిగిన తెగ. ఉయైయ్‌నా బిన్ హిస్న్ ఈ తెగకు చెందిన వారే. హిజ్రీశకం 9వ సంవత్సరంలో ప్రవక్త ముహమ్మద్ (స) తబూక్ నుంచి వెనుదిరిగి వచ్చిన తర్వాత ఈ తెగ ప్రవక్త (స) వద్దకు వచ్చి ఇస్లామ్ స్వీకరించింది. వారి ప్రాంతంలోని పరిస్థితుల గురించి ప్రవక్త (స) వారిని ప్రశ్నించారు. వారు తమ ప్రాంతంలో ఉన్న కరువు పరిస్థితి గురించి దయనీయంగా చెప్పారు. తమ పట్టణాలు నిర్మానుష్యమై పోయాయని, పశువులు చనిపోతున్నాయనీ, తోటలు, పంటపొలాలు ఎండిపోయా యని, పిల్లలు పోషణ లేక బక్కచిక్కిపోయారని చెప్పారు. "ఓ ప్రవక్తా ! మా విషయంలో దేవుడిని కల్పించుకోమని చెప్పండి. మాపై కరుణచూపేలా దేవుని ప్రార్థించండి" అని కోరుకున్నారు. వారి కోరికలోని పొరబాటును ఎత్తి చూపుతూ ప్రవక్త (స) వారిని మందలించారు. తాను దేవుడితో ప్రార్థించగలనని, కాని ఆయన జోక్యం చేసుకోవడ మేమిటి? ఎవరిపై జోక్యం చేసుకోవాలి? అని ప్రశ్నించి, దేవుడు తప్ప ఆరాధనకు అర్హుడు మరెవ్వరూ లేరని, భూమ్యాకాశాలన్నీ ఆయన అధీనంలోనే ఉన్నాయని చెప్పారు. ఆ పిదప ఆయన వారి ప్రాంతంలో వర్షాల కోసం ప్రార్థించారు. కరువు ప్రాంతంలో ఊరటగా వెంటనే వర్షం కురిసింది.



**15. బనూ ఆమిర్ తెగ బృందం :** ప్రముఖ తెగ ఖైస్ ఏలాన్‌లోని ఒక శాఖ బనూ ఆమిర్ తెగ. ఈ తెగలో ముగ్గురు ప్రముఖ నాయకులున్నారు. ఆమిర్ బిన్ తుఫైల్, అర్బాద్ బిన్ ఖైస్, జబ్బార్ బిన్ సల్మాలు ఆ నాయకులు. ఈ తెగ నుంచి ఒక పెద్ద బృందం మదీనా వచ్చింది. ఈ ముగ్గురు నాయకుల్లో ఇద్దరు కేవలం తమ స్వార్థానికి మాత్రమే ప్రాముఖ్యం ఇచ్చేవారు. ఇందులో ఆమిర్ ఇంతకు ముందు కూడా మోసపూరితంగా వ్యవహరించిన ఉదాహరణలు ఉన్నాయి. ఈ సారి కూడా ఈ ఇద్దరు నాయకులు ప్రవక్త (స)ను హతమార్చాలన్న పథకం వేసుకుని వచ్చారు. ఈ బృందం ప్రతినిధి మాట్లాడుతూ ప్రవక్త (స)ను "ప్రభూ" అని సంబోధించాడు. ఈ సంబోధనకు ప్రవక్త (స) అభ్యంతరపెట్టారు. కేవలం దేవుడిని మాత్రమే మనం అలా పిలువగలమని చెప్పారు. ఆ తర్వాత వాళ్ళు ఇంకా ఇతర పొగడ్తలు, ప్రశంసల బిరుదులు ఉపయోగించడం మొదలుపెట్టారు. ఈ వైఖరి ప్రవక్త (స)కు నచ్చలేదు. ఆమిర్ బిన్ తుఫైల్ తన స్వార్థాన్ని సాధించుకునే ప్రయత్నం చేశాడు. ప్రవక్త (స) తన అధికారాన్ని తమ ప్రాంతంలోని గ్రామాల వరకు పరిమితం చేసుకోవాలని, పట్టణాలు తన అధీనంలో ఉంచాలని లేదా తనను ప్రవక్తకు వారసుడిగా ప్రకటించా లని లేకపోతే తాము గఫ్తాన్ తెగతో కలిసి యుద్ధం ప్రకటిస్తామని అన్నాడు. అంతకు ముందే ఆమిర్ అర్బాద్‌లు కలిసి హత్యా పథకం వేసుకున్నారు. ఆమిర్ ప్రవక్తతో మాట్లాడుతున్నప్పుడు, ప్రవక్త (స) మాటల్లో ఉన్నప్పుడు అర్బాద్ హఠాత్తుగా దాడి చేసి ప్రవక్త (స)ను హతమార్చాలన్నది కుట్ర. కాని అర్బాద్ ఎంతగా భయపడి పోయాడంటే, కత్తి కాదు కదా తన వేలు కూడా ఎత్తలేకపోయాడు. వారి మనస్సుల్లో ఉన్న దుష్టపథకాల గురించి ప్రవక్త (స)కు తెలుసు. వారి దుర్మార్గం నుంచి కాపాడాలని దేవుడిని ప్రార్థించారు. ఆ తర్వాత కొంతకాలానికే ఆమిర్ ప్లేగు వ్యాధితో మరణిం చాడు. అర్బాద్ పిడుగుపడి మరణించాడు.

**16. అజ్రా బృందం :** హిజ్రీ శకం 9వ సంవత్సరంలో ఈ తెగ నుంచి 12 మంది సభ్యుల బృందం మదీనా వచ్చి ఇస్లామ్ స్వీకరించింది. వారి వంశవృక్షం తన వంశంతో కలుస్తుందని ప్రవక్త (స)కు తెలిసి ఆయన చాలా ఆనందించారు. వారిని ఎంతో ఉత్సాహంగా స్వాగతించారు. వారితో మాట్లాడుతూ సిరియాలో ప్రభుత్వం కూలిపోతుందని, హెర్క్యులిస్ అధికారం పోగొట్టుకుని దేశం నుంచి పారిపోతాడని భవిష్యవాణి వినిపించారు. ఎలాంటి బలులు చేయవద్దని, కేవలం ప్రవక్త ఇబ్రాహీమ్ (అస) చేసిన ఖుర్బానీ తప్ప మరెలాంటి బలులు ఇవ్వరాదని

బోధించారు. వారు వెనుదిరిగి వెళుతున్నప్పుడు వారికి ఆహార ధాన్యాలు కానుకగా ఇచ్చి పంపించారు.

**17. బలీ ప్రతినిధి బృందం:** ఈ తెగ ఉన్న ప్రాంతానికి రాజకీయంగా చాలా ప్రాముఖ్యం ఉంది. హిజ్రీ శకం 9వ సంవత్సరం, మొదటి రబీ మాసంలో ఈ తెగ నుంచి ప్రతినిధి బృందం మదీనా వచ్చి, తమ తెగకు చెందిన రువైఫా బిన్ తాబిత్ వద్ద బస చేసింది. రువైఫా వారిని ప్రవక్త (స) వద్దకు తీసుకువచ్చారు. వారందరూ ఇస్లామ్ స్వీకరించారు. మూడు రోజులు మదీనాలో ఉండి వెళ్ళిపోయారు. వారు వెళుతున్నప్పుడు ప్రవక్త (స) వారికి కానుకగా ఖర్జూరాలు, ఆహారధాన్యాలు ఇచ్చి పంపించారు.

**18. కిందాహ్ తెగ బృందం :** ఎమన్‌కు చెందిన ప్రముఖ తెగ ఇది. ఈ తెగకు చెందిన హజ్రత్ అషాస్ బిన్ ఖైస్ 80 మంది (లేదా 60 మంది) సభ్యుల బృందంతో గుర్రాలపై వచ్చారు. వారు ప్రవక్త (స) వద్దకు వచ్చినప్పుడు అత్యంత ఖరీదైన సిల్కు గౌనులు తొడిగి ఉన్నారు. ప్రవక్త (స) వారితో ఇస్లామ్ స్వీకరించారా అని అడిగారు. వారు ఔనని జవాబిచ్చారు. ఇస్లామ్ స్వీకరిస్తే ఈ సిల్కుగౌనులేమిటి? అని ప్రశ్నించారు. ఆ వెంటనే వాళ్ళు తమ సిల్కు గౌనులను ముక్కలుగా చింపి పారేశారు.

**19. అజ్ద్ బృందం :** ఇది కూడా ఎమన్‌కు చెందిన తెగ. ఈ తెగ నుంచి ప్రతినిధి బృందం సర్ద్ బిన్ అబ్దుల్లా నాయకత్వంలో మదీనాకు వచ్చి ఇస్లామ్ స్వీకరించింది. హజ్రత్ సార్ద్‌ను ఆ తెగకు నాయకుడిగా నియమించారు.

**20. జురాష్ ప్రతినిధి బృందం :** ఎమన్‌లోని చాలా ప్రాంతాలు, చాలా జిల్లాలు ఇస్లామీయ రాజ్యంలో అంతర్భాగాలై పోయాయి. అయితే ఇంకా కొన్ని శత్రుభాగాలు మిగిలే ఉన్నాయి. బలమైన కోటలున్నాయి. అలాంటి తెగల్లో జురాష్ తెగ ఒకటి. ఈ తెగపై సైనికచర్య తీసుకోవాలని ఇంతకు ముందు పేర్కొన్న సార్ద్ బిన్ అబ్దుల్లాను ఆదేశించడం జరిగింది. చాలా రోజుల ముట్టడి తర్వాత జురాష్ తెగ ఓడిపోయింది. ఆ తర్వాత జురాష్ తెగ ప్రతినిధి బృందం మదీనా వచ్చింది.

**21. హమ్దాన్ ప్రతినిధి బృందం :** ఈ బృందంలో 120 మంది ఉన్నారు. మాలిక్ బిన్ నమ్త్, అబూ సౌర్, మాలిక్ బిన్ అబ్బా సల్మానీ, హుమైర్ బిన్ మాలిక్ ఖార్ఫీ (లేదా ఆమిర్ బిన్ మాలిక్), జుమామ్ బిన్ మాలిక్ వంటి ప్రముఖులు ఈ బృందంలో ఉన్నారు.  మాలిక్ బిన్ అమ్త్‌ను ఈ తెగకు నాయకుడిగా ప్రవక్త (స)



నియమించారు. ప్రవక్త (స)ను ప్రశంసిస్తూ ఈ సందర్భంగా మాలిక్ ఒక కవిత వినిపించారు. హమ్దాన్‌లో మొదట హజ్రత్ ఖాలిద్ (రజి)ను ధార్మిక బోధకుడిగా నియమించారు. ఆయన ఆరునెలలు అక్కడ పని చేశారు కాని పెద్దగా ఫలితాలు కనబడలేదు. ఆ పిదప హజ్రత్ అలీ (రజి)ను అక్కడికి పంపడం జరిగింది. హజ్రత్ అలీ (రజి) ప్రవక్త (స) లేఖతో అక్కడికి చేరుకున్నారు. ప్రార్థనల తర్వాత ఈ లేఖను బిగ్గరగా చదివి వినిపించేవారు. ఆ వెంటనే పెద్ద సంఖ్యలో ప్రజలు ఇస్లామ్ స్వీకరించే వారు. ఈ విషయాన్ని వివరిస్తూ హజ్రత్ అలీ (రజి) రాతపూర్వక నివేదికను ప్రవక్త (స)కు పంపించినప్పుడు ప్రవక్త ముహమ్మద్ (స) దేవునికి సాష్టాంగపడి, "హమ్దాన్‌కు శాంతి కలుగుగాక" అన్నారు.

**22. ఫార్వ అల్ జుజామీ నుంచి వచ్చిన వార్తాహరుడు :** రోమన్ సామ్రాజ్యంలో భాగంగా ఉన్న మాన్ ప్రాంతానికి ఫర్వా గవర్నర్. సిరియాలోని కొంతభాగం, అరేబియాలోని భాగాలు ఈ ప్రాంతంలో ఉన్నాయి. ఇస్లామ్ సందేశం గురించి తెలిసిన తర్వాత ఫర్వా తన పదవీ హోదాలను ప్రమాదంలో వేస్తూ ఇస్లామ్ స్వీకరించాడు. తాను ఇస్లామ్ స్వీకరించిన విషయాన్ని ప్రవక్త (స)కు తెలియజేస్తూ ఒక తెల్లగుర్రాన్ని ప్రవక్త (స)కు కానుకగా పంపించాడు. రోమన్ ప్రభుత్వానికి ఈ విషయం తెలిసింది. ఆయన్ను నిర్బంధించి అర్ఫా వద్ద ఉరితీశారు.

**23. తుజీబ్ బృందం :** కిందాహ్ తెగలో ఒక శాఖ తుజీబ్. ఎమన్‌కు చెందిన తెగలివి. కిందాహ్ తెగ అప్పటికే ఇస్లామ్ స్వీకరించింది. తుజీబ్ తెగకు చెందిన 13 మంది మదీనా వచ్చి ఇస్లామ్ స్వీకరించారు. తమతో పాటు నగదు మొత్తం, పశువులను జకాత్‌గా తీసుకువచ్చారు. జకాత్‌గా తీసుకొచ్చిన వాటిని వెనక్కి తీసుకెళ్ళి తమ ప్రాంతంలోని నిరుపేదలకు పంచిపెట్టాలని ప్రవక్త (స) వారికి చెప్పారు. కాని వారు పట్టుబట్టి స్థానిక నిరుపేదలకు పంచిపెట్టడం జరిగిందని, ఆ పంపిణీ తర్వాత మిగిలిన వాటినే ఇక్కడికి తీసుకొచ్చామని, స్వీకరించాలని పట్టుబట్టారు. వారు కొన్ని ప్రశ్నలడిగి ప్రవక్త (స) జవాబులను రాసుకున్నారు. ఆ తర్వాత ఈ వివరాలు తమ తెగ ప్రజలకు తెలియజేయడానికి త్వరితగతిన తిరుగు ప్రయాణమై వెళ్ళారు. ఈ బృందంలో బనీ అబ్దీ తెగ యువకుడు కూడా ఒకడు ఉన్నాడు. బృందం అతడిని తమ ప్రయాణ సామగ్రిని చూస్తూండాలని చెప్పి అతడిని అక్కడే వదిలేసి వెళ్ళింది. ప్రవక్త (స) అతడిని పిలిచి మాట్లాడారు. అతను ప్రవక్త

(స) తో మాట్లాడుతూ తన పాపాలకు క్షమాపణ కోసం ప్రవక్త (స) ప్రార్థించాలన్నదే తన కోరికని అంతకు మించి మరో కోరిక ఏదీ లేదన్నాడు. ప్రవక్త (స) అతను కోరిన విధంగా ప్రార్థించారు. యావత్తు ఎమన్‌లో ధర్మభ్రష్టత వ్యాపించినప్పుడు ఈ యువకుడే మొత్తం తెగను కాపాడాడు. ఈ బృందం వెనుదిరిగి వెళుతున్నప్పుడు ఆహారధాన్యాలు కానుకగా ఇవ్వడం జరిగింది.

**24. బనీ సాద్ హుజైమ్ (ఖుజా) బృందం :** ఈ తెగకు చెందిన కొందరు సభ్యులు బృందంగా వచ్చారు. ఈ తెగ నిజానికి అంతకు ముందే ఇస్లామ్ స్వీకరించింది. కాని అందులో కొందరు రాజకీయ కారణాల వల్ల ఇస్లామ్‌లోకి వచ్చారు. అందువల్ల ఇప్పుడు వారందరూ ప్రవక్త (స) చేతుల మీదుగా ఇస్లామీయ ప్రతిజ్ఞ చేయడానికి వచ్చారు.

**25. బహ్రా బృందం :** ఇది కూడా ఎమన్‌కు చెందిన తెగ. ఈ తెగకు చెందిన 13 మంది మదీనాకు వచ్చి ఇస్లామ్ స్వీకరించారు. ధార్మిక విధులు, బాధ్యతలను తెలుసుకుని వెనుదిరిగి వెళ్ళారు. వారికి కూడా సాంప్రదాయికంగా ఆహార పదార్థాలు కానుకగా ఇవ్వడం జరిగింది.

**26. జీ ముర్రా బృందం :** ఈ తెగకు చెందిన 13 మంది సభ్యుల బృందం మదీనా వచ్చింది. హారిస్ బిన్ ఔఫ్ వారికి నాయకుడు. తాను లూయ్ బిన్ గాలిబ్ వంశానికి చెందినవాడినని ఆయన ప్రవక్త (స)కు పరిచయం చేసుకున్నారు. లుయ్ బిన్ గాలిబ్ ప్రవక్త ముహమ్మద్ (స) పూర్వీకుల్లో ఒకరు. తమ ప్రాంతం కరువు కోరల్లో చిక్కుకుందని, తమ ప్రాంతంలో వర్షం కోసం దేవుడిని ప్రార్థించాలని ప్రవక్త (స)ను కోరారు. ఆయన వారు కోరినట్లు ప్రార్థించారు. వెనుదిరిగి వెళ్ళిన ఆ బృందానికి తమ ప్రాంతంలో ప్రవక్త(స) ప్రార్థించినప్పుడే వర్షాలు కురిశాయని తెలిసింది. కరువు పరిస్థితులు తొలగిపోయాయి. ఈ బృందం కొన్ని రోజులు మదీనాలో ఉండి, ఇస్లామ్ విధులు బాధ్యతల గురించి తెలుసుకుని వెళ్ళింది. వారి తిరుగు ప్రయాణానికి అవసరమైన సామాగ్రి వారికి ఇవ్వడం జరిగింది.

**27. ఖౌలాన్ తెగ బృందం :** ఈ తెగకు చెందిన పదిమంది సభ్యుల బృందం మదీనా వచ్చింది. ఈ తెగ అంతకు ముందే ఇస్లామ్ స్వీకరించిన తెగ. ఇస్లామ్ పట్ల నిజాయితీతో కూడిన నిబద్ధతను ప్రకటించడానికి వాళ్ళు వచ్చారు. తాము ఇంతకు ముందు సంప్రదాయంగా ఉమ్మె అనస్ అనే విగ్రహాన్ని పూజించేవాళ్ళమని ఒప్పు కున్నారు. ఇప్పటికి కూడా తెగలోని కొందరు పెద్దలు ఆ విగ్రహాన్ని పూజిస్తున్నారని,



ఇక ఇప్పటి నుంచి వారు కూడా విగ్రహారాధన మానేస్తారని చెప్పారు. ఉమ్మె అనస్ విగ్రహానికి ఇచ్చిన బలుల గురించి కూడా వారు ఒప్పుకున్నారు. ఆ తర్వాత వాళ్ళు ఇస్లామ్ మౌలిక నియమాల గురించి తెలుసుకుని తిరుగుప్రయాణ మయ్యారు. వారి ప్రయాణానికి అవసరమైన సామాగ్రి ఇవ్వడం జరిగింది.

**28. మహారిబ్ ప్రతినిధి బృందం :** ఈ తెగ చాలా దుందుడుకు తెగ. సభ్యతా సంస్కారాలకు దూరంగా ఉన్న తెగ. ఇస్లామ్ ప్రారంభ కాలంలో ఈ తెగ వద్దకు ప్రవక్త (స) వెళ్ళినప్పుడు ఆయన పట్ల అనుచితంగా వ్యవహరించారు. గతంలో తమ వైఖరికి సిగ్గుపడుతూ ఈ తెగకు చెందిన పదిమంది సభ్యుల బృందం మదీనా వచ్చింది. ప్రవక్త (స) ఈ బృందంలోని ఒక వ్యక్తివైపు ఉద్దేశ్యపూర్వకంగా చూశారు. ఆ వ్యక్తి మాట్లాడుతూ తాను ప్రవక్త (స)ను ఉకాజ్ వద్ద కలిశానని, అప్పుడు తాను ఆయనతో చాలా మొరటుగా మాట్లాడానని ఒప్పుకున్నాడు. నిజానికి ఆ తెగలో ప్రవక్త (స) పట్ల ఆ వ్యక్తి కన్నా ఎక్కువ ద్వేషంతో వ్యవహరించిన వారు మరెవ్వరూ లేరని కూడా ఒప్పుకున్నాడు. కాని ఇప్పుడు తనకు ఇస్లామ్ జ్ఞానం లభించిందని చెబుతూ తన తప్పులకు క్షమాపణ కోరుకున్నాడు. తన పాపాలకు క్షమాభిక్ష లభించేలా ప్రార్థించాలని ప్రవక్త (స)ను వేడుకున్నాడు. అతను అజ్ఞానకాలంలో చేసిన పాపా లన్నింటిని ఇస్లామ్ ప్రక్షాళనం చేసిందని ప్రవక్త (స) చెప్పారు.

**29. గస్సాన్ ప్రతినిధి బృందం :** ఈ తెగ క్రయిస్తవాన్ని స్వీకరించిన తెగ. సీజరు ఈ తెగ వారికి అరేబియాలోని కొంత భూభాగంపై అధికారం ఇచ్చాడు. హిజ్రీ శకం 10వ సంవత్సరంలో ఈ తెగకు చెందిన ముగ్గురు మదీనా వచ్చి ఇస్లామ్ స్వీకరించారు. వారు వెనుదిరిగి తమ ప్రాంతానికి వెళ్ళి ఇతరులకు కూడా నచ్చచెప్పడానికి ప్రయత్నించారు. కాని ఫలితం లభించలేదు. ఇందులో ఒకరు యర్మూక్ యుద్ధంలో హజ్రత్ అబూ ఉబైదాను కలిశాడు. తాను ఇప్పటికి కూడా ఇస్లామ్‌పై స్థిరంగా ఉన్నానని, మిగిలిన ఇద్దరు మరణించారని చెప్పాడు.

**30. సల్మాన్ బృందం:** ఈ తెగకు చెందిన ఏడుగురు సభ్యుల బృందం మదీనా వచ్చింది. ఇందులో హబీబ్ బిన్ ఉమర్ కూడా ఉన్నారు. సమయబద్ధంగా ప్రార్థనలు చేయడం ఎంతో పుణ్యప్రదమని ప్రవక్త (స) వారికి బోధించారు. వారు కూడా తమ ప్రాంతంలో తీవ్రమైన కరువు ఉందని, తమ ప్రాంతంలో వర్షం పడేలా ప్రార్థించాలని ప్రవక్త (స)ను కోరుకున్నారు. ప్రవక్త (స) వారు కోరిన విధంగా

ప్రార్థించారు. ప్రవక్త (స) ప్రార్థించిన సమయంలోనే అక్కడ వారి ప్రాంతంలో వర్షం కురిసిందని తర్వాత తెలిసింది.

**31. బనీ ఐస్ బృందం :** ఇది కూడా ఎమన్‌కు చెందిన తెగ. హిజ్రీశకం 10వ సంవత్సరంలో ఈ తెగ ప్రతినిధి బృందం మదీనా వచ్చింది. వారు వలస రావడం గురించి ప్రవక్త (స)ను ప్రశ్నించారు. వలసవెళ్ళడం అన్నది అవసరమైన నియమమైతే తాము తమ పశువులను అమ్మేసి వలసవెళతామని అన్నారు. ప్రవక్త (స) వారికి వివరిస్తూ, వారు ఎక్కడ ఉన్నా దేవుడికి భయపడుతూ జీవించాలని అన్నారు. ఇస్లామీయ శక్తులను సమీకరించవలసినప్పుడు వలసవెళ్ళడం అవసరమవుతుందని, కాని ఇప్పుడు ప్రతి వ్యక్తి తన పరిధిలో ఇస్లామీయ సందేశ ప్రచారం చేయవచ్చు కాబట్టి వలస వెళ్ళవలసిన అవసరం లేదని చెప్పారు.

**32. గామిద్ బృందం :** ఈ తెగకు చెందిన పదిమంది సభ్యుల బృందం హిజ్రీ శకం 10వ సంవత్సరంలో మదీనా వచ్చి ఇస్లామ్ స్వీకరించింది. ఈ తెగ వారికి ధార్మిక విధులు నేర్పడానికి, ఖుర్‌ఆన్ నేర్పడానికి హజ్రత్ ఉబయ్ బిన్ కాబ్ నియమితులయ్యారు. ఆ తర్వాత వారి తిరుగు ప్రయాణానికి అవసరమైన సామాగ్రి కూడా ఇవ్వడం జరిగింది.

**33. రెండవ అబ్దుల్ ఖైస్ ప్రతినిధి బృందం :** ఈ తెగకు సంబంధించిన మొదటి బృందం గురించి ఇంతకు ముందు చెప్పడం జరిగింది. హిజ్రీ శకం 5వ సంవత్సరంలో ఆ బృందం మదీనా వచ్చింది. హిజ్రీ శకం 10వ సంవత్సరంలో ఈ తెగకు చెందిన నలభై మంది సభ్యుల బృందం మదీనా వచ్చింది.

**34. బనీ అల్ ముంతఫఖ్ బృందం :** ఈ తెగ నుంచి నహీక్ బిన్ అసమ్, లఖీత్ బిన్ ఆమిర్‌లు బృందంతో వచ్చి ప్రవక్త (స)తో కొన్ని ప్రశ్నలు అడిగి సమాధానాలు పొందారు. తీర్పుదినం, స్వర్గం, నరకం గురించి వారు అడిగిన ప్రశ్నలకు ప్రవక్త (స) వివరణాత్మకంగా సమాధానాలిచ్చారు. అగోచరాల విషయంలో వారు ప్రశ్నించినప్పుడు ప్రవక్త (స) జవాబిస్తూ ఆ జ్ఞానం కేవలం దేవునికి మాత్రమే ఉందని అన్నారు.

**35.తారిఖ్ బిన్ అబ్దుల్లా ఆయన సహచరులు :** తారిఖ్ వద్ద నుంచి ప్రవక్త (స) ఒక ఒంటెను కొన్నారు. ఆ ఒంటె వెల చెల్లించడానికి సంబంధించి ప్రవక్త (స) ఇచ్చిన మాటను తూ.చ.తప్పకుండా నిలబెట్టుకున్నారు. ఈ సంఘటన తారిఖ్‌పై



బలమైన ప్రభావం వేసింది. ఆయన కొందరు సహచరులతో వచ్చి ఇస్లామ్ స్వీకరించాడు.

**36. బనీ జుబైద్ ప్రతినిధులు :** ఈ తెగ నుంచి ప్రతనిధిగా తెగ నాయకుడు అమ్ర్ బిన్ మాదీకరబ్ వచ్చాడు. ప్రవక్త (స)కు సంబంధించి కొన్ని వాస్తవాలను ధృవీకరించుకోవడానికి వచ్చిన అమ్ర్ ప్రవక్త (స)ను కలిసి తన తెగతో సహా ఇస్లామ్ స్వీకరించాడు. కాని ప్రవక్త (స) మరణం తర్వాత అమ్ర్ తన మతవిశ్వాసాన్ని మార్చుకున్నాడు.

**37. హుమైర్ ప్రతినిధి :** హుమైర్ తెగ పాలకవంశానికి చెందిన తెగ. ఈ తెగ నుంచి ఒక ప్రతినిధి ఒక లేఖ తీసుకుని వచ్చాడు. ఆ తెగకు చెందిన హార్స్ బిన్ అబ్ద్ కులాల్, నయీమ్ బిన్ అబ్ద్ కులాల్, నోమాన్ ఖైలు జుదురైన్, మఆఫర్, హమ దాన్‌లు ఇస్లామ్ స్వీకరించారని విగ్రహారాధనను మానుకున్నారని లేఖలో తెలిపారు. ప్రవక్త (స) వారి పాలకుడికి ఒక లేఖ రాసి ఇస్లామ్ మౌలిక నియమాలను వివరించారు. ఇందులో ముస్లిములు చెల్లించవలసిన జకాత్ గురించి, ముస్లిమేతరులు చెల్లించవలసిన జిజియా గురించి వివరిస్తూ, మతస్వేచ్ఛను కాపాడాలని, క్రయిస్తవులుగా, యూదులుగా ఉండాలనుకునేవారిని మతం మార్చుకునేలా ఒత్తిడి చేయరాదని తెలియజేశారు. అంతేకాదు మదీనా నుంచి మాజ్ బిన్ జబల్ నాయకత్వంలో అబ్దుల్లా బిన్ జియాద్, మాలిక్ బిన్ ఉబైదా, అకబా బిన్ నుమాయిర్, మాలిక్ బిన్ ముర్రా తదితరుల బృందం అక్కడికి వచ్చి ప్రవక్త (స) ఆదేశాలను వివరిస్తుందని, జకాత్, జిజియా వసూళ్ళను మదీనా తీసుకువెళుతుందని తెలిపారు.

**38. నఖా బృందం :** ఇది కూడా ఎమన్ తెగ. ఈ బృందం హిజ్రీ శకం 11వ సంవత్సరంలో వచ్చిన చివరి ప్రతినిధి బృందం. ఇందులో 200 మంది ఉన్నారు. మాజ్ బిన్ జబల్ ద్వారా వారు అప్పటికే ఇస్లామ్ స్వీకరించారు. అయితే ప్రవక్త (స) సమక్షంలో తమ విశ్వాసాన్ని పునరుద్ఘాటించాలని వచ్చారు. వారు కొంతకాలం మదీనాలో ఉండి వెనుదిరిగి వెళ్ళిపోయారు.

## అధ్యాయం - 6

# రాజకీయ ఒప్పందాలు

ఇస్లామ్ స్వీకరించాలని వివిధ తెగలకు ఆహ్వానాలు పంపడంతో పాటు ప్రవక్త ముహమ్మద్ (స) తన రాజకీయ కార్యకలాపాలను మరింత విస్తరించే చర్యలు కూడా చేపట్టారు. ప్రవక్త (స) రాజకీయ ఒప్పందాలు, సంబంధాలు మూడు ముఖ్యమైన పత్రాల ద్వారా తెలుస్తున్నాయి. అవి మొదటి, రెండవ అకబా ప్రతిజ్ఞలు, మదీనా రాజ్య ఏర్పాటుకు సంబంధించినది మూడవది. మొదటి అకబా ప్రతిజ్ఞలో మదీనాకు చెందిన కొందరు అన్సార్ యువకులు ప్రవక్త (స)తో ఒక ఒప్పందానికి వచ్చారు. అందులో మతవిశ్వాసానికి, నైతికతకు సంబంధించిన విషయాలున్నాయి. ఏకదైవారాధన, దేవుడికి భాగస్వాములు కల్పించకుండా ఉండడం, దొంగతనాలు, వ్యభిచారాల నిషేధం, సంతానాన్ని హతమార్చకుండా ఉండడం, అన్యాయంగా ఎవరి పైనా నేరారోపణలు చేయకుండా ఉండడం, ప్రవక్త (స)కు అవిధేయత చూప కుండా ఉండడం ... ఇవి మొదటి అకబా ప్రతిజ్ఞలో ముఖ్యాంశాలు. రెండవ అకబా ప్రతిజ్ఞలో మరికొన్ని అంశాలు చేరాయి. “మేము కష్టాల్లో ఉన్నా, సుఖాల్లో ఉన్నా, మాకు ఇష్టమైనా, ఇష్టం లేకున్నా, మా అభిప్రాయాలు వేరుగా ఉన్నా ఎలాంటి పరిస్థితిలోనైనా మేము ప్రవక్త (స) మాట వింటాము, విధేయత చూపిస్తాము. మేము ఆపదలకు భయపడం, నాయకత్వంతో ఎప్పుడూ విభేదించము” అని అన్సార్ యువకులు రెండవ అకబా ప్రతిజ్ఞలో ప్రమాణం చేశారు. ఆ విధంగా ప్రవక్త (స) మదీనా అన్సారులతో రాజకీయ సంబంధం ఏర్పరచుకున్నారు. అలా ఇస్లామీయ రాజ్యానికి పునాది వేయడం జరిగింది. ఈ ఒప్పందంలో ఉన్న మరో ప్రకటన ఏమంటే, ప్రవక్త ముహమ్మద్ (స) మదీనా వలస వచ్చిన తర్వాత అన్సారులు తమ కుటుంబ సభ్యులకు ఎలా రక్షణ కల్పిస్తారో అలా రక్షణ కల్పించవలసి ఉంది. అన్సారులకు సంబంధించిన వ్యవహారాల విషయాలు చూడ్డానికి ప్రవక్త (స) 12 మందిని నియమించారు. అబ్దుల్లా బిన్ అబూబక్ర్ ప్రకారం ఈ అన్సార్ ప్రతినిధులకు ప్రవక్త(స) స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు. “ఈసా (అస) సహచరులు ప్రవక్త ఈసా (అస) విషయంలో ఎలా బాధ్యత వహించారో అదే విధంగా మీరు మీ సముదాయం



విషయంలో బాధ్యత వహించాలి. ప్రవక్త (స) స్వయంగా తన సముదాయం (మక్కా నుంచి వచ్చినవారు) విషయంలో బాధ్యత వహిస్తాడు” అన్నారు. ఆ విధంగా అన్సార్ ప్రతినిధులకు కేవలం ధార్మిక ప్రాతినిధ్యం మాత్రమే కాదు, రాజకీయ ప్రాతినిధ్యం కూడా ఇచ్చారు. మదీనా పాలనా వ్యవహారాల్లో కూడా ఆ ప్రాతినిధ్యం ఉంది. అందుకే కేవలం కొన్ని నెలల కాలంలోనే మదీనా ఒక రాజ్యంగా అవతరించింది. ఈ రాజ్యానికి సంబంధించిన సంవిధానం ప్రవక్త (స) దూరదృష్టికి వ్యవహారదక్షతకు నిదర్శనంగా మన ముందు ఉంది. చరిత్రలో ఇలాంటి దృష్టాంతం మరొకటి కనబడదు. బలప్రయోగం లేకుండా కొత్త రాజ్యం ఏర్పడడం అన్నది చరిత్రలో ఎన్నడూ జరగలేదు, ఒక్క మదీనాలో తప్ప. ఒక సిద్ధాంతం ప్రాతిపదికన, ఒక పరాయి భూభాగంలో రాజ్యస్థాపన చేస్తున్నప్పుడు, విభిన్నమైన సముదాయాల పాత్ర అందులో ఉన్నప్పుడు, రాజ్యస్థాపన శాంతియుతంగా జరగడం సాటిలేని విశిష్టమైన దృష్టాంతం. ఈ రాజ్యానికి సంబంధించిన సంవిధానం దాన్ని స్థాపించిన వ్యక్తి దూరదృష్టికి, వివేచనాశక్తికి నిదర్శనం. ఈ ఒప్పందంలో ఉన్న పక్షాలు ముహాజిర్లు అంటే మక్కా నుంచి వలస వచ్చినవారు, మదీనా అన్సారుల్లోని రెండు ప్రముఖ తెగలు.. ఔస్, ఖజ్‌రజ్ తెగలు ఉన్నాయి. వీళ్ళే కాక ఈ తెగల్లోని ముస్లిమేతరులు వారితోపాటు యూదులు, వివిధ యూద పోరాట తెగలు ఉన్నాయి.

ప్రవక్త (స)కు మదీనా ప్రజలతో ఆత్మీయ సంబంధాలున్నాయి. ఆయన తల్లిగారి తరఫునుంచి ఈ బాంధవ్యం ఉంది. బాల్యంలో కొంతకాలం అక్కడ గడిపి ఉన్నారు. ఆ విధంగా ఆయన ఆ ప్రాంతానికి పూర్తిగా కొత్త కాదు. మదీనా ప్రజలతో పరిచయాలు సంబంధాలు ఏర్పడిన తర్వాత, ముఖ్యంగా సందేశ ప్రచారం ప్రారంభ దినాల్లో ఆయన మదీనా రాజకీయ పరిస్థితిని లోతుగా అధ్యయనం చేశారు. అక్కడి వివిధ వర్గాల గురించి సమాచారం సేకరించారు. అప్పట్లో మదీనా పూర్తి జనాభా బహుశా 5000 వరకు ఉండవచ్చు. అందులో సగం మంది యూదులు. ముస్లిములు మక్కా ప్రవాసులు, మదీనా అన్సారులు అంతా కలిపి 500కు మించి ఉండరు. ఇంత స్వల్ప సంఖ్యలో ఉన్న సముదాయంతో దాదాపు 5000 మంది జనాభా ఉన్న మదీనా నాయకత్వ బాధ్యతలను ఆయన స్వీకరించారు. మదీనాలోని రెండు తెగలు పన్నెండు ఉపతెగలుగా విభజించబడి ఉన్నాయి. ఈ తెగల మధ్య పోరాటాలు జరుగుతూ ఉండేవి. సాధారణ ప్రజలు ఈ రక్తపాతం పట్ల విసిగిపోయి ఉన్నారు. ఒకవైపు కొందరు అరబ్బులు, కొందరు యూదులు, మరోవైపు కూడా కొందరు అరబ్బులు, కొందరు యూదులు పోరాటాలకు దిగేవారు. ఎల్లప్పుడు రక్తపాతాలే

ఉండేవి. శాంతియుత జీవనం కోసం, సమర్థమైన నాయకత్వం కోసం ప్రజలు ఎదురు చూస్తున్న కాలం అది. అక్కడి యూదుల రెండు పెద్ద తెగలు కూడా పది ఉపతెగలుగా విభజిం చబడి ఉండేవి. మదీనాలోని అన్సారుల తెగలు ప్రవక్త (స) పక్షాన చేరడం చూసి యూదులు తాము వేరుపడ్డామని భావించారు. ప్రవక్త (స) ఈ అభిప్రాయాలను గుర్తించి యూదులకు నచ్చచెప్పే ప్రయత్నం చేశారు. వారి మనోభావాలకు అనుగుణంగా వారిని దగ్గరచేసే ప్రయత్నం చేశారు. ఫలితంగా ఒక సమైక్య రాజకీయ శక్తికి అనుకూలమైన వాతావరణం ఏర్పడింది. మదీనాలో ఆ కాలంలోని వివిధ వర్గాల గురించి, ఆయా వర్గాల రాజకీయ ప్రయోజనాలు, సమస్యల గురించి అర్థం చేసుకోవడం, ఆయా తెగల మనస్తత్వాలు, ఒక ప్రత్యేక దిశలో వారి ఆలోచనావిధానం గురించి అవగాహన చేసుకోవడం అది కూడా చాలా స్వల్పమైన కాలంలో ఇదంతా చేయడం అత్యున్నత స్థాయి రాజకీయ కౌశల్యానికి నిదర్శనం.

ఈ అవగాహనతో రాయబడిన మదీనా రాజకీయ సంవిధానంలో 53 నిబంధనలున్నాయి. ఈ సంవిధానం దైవస్తోత్రంతో, దేవుని పేరుతో ప్రారంభమవు తుంది. అనంత కరుణామయుడు అపారకృపాశీలుడు అయిన అల్లాహ్ పేరుతో అని ప్రారంభమైన సంవిధానంలోని మొట్టమొదటి వాక్యమే ఇస్లామ్ మౌలిక సిద్ధాం తాన్ని చాటి చెబుతోంది. ఆ సంవిధాన పత్రం "ఈ పత్రం దైవప్రవక్త ముహమ్మద్(స) తరఫున" అని ప్రకటించింది. ఈ వ్యవస్థీకృత సముదాయంలో కీలకపాత్ర ముస్లిములదే. అందువల్లనే సంవిధానంలో క్రిందివిధంగా ప్రకటించడం జరిగింది:

"విశ్వాసులు, మదీనాలోని, ఖురైషుల్లోని ముస్లిములు, వారిని అనుసరించే వారు, వారితో సంబంధం కలిగి ఉండి వారి పక్షాన పోరాడేవారి మధ్య కుదిరిన ఒప్పందం" అంటూ వివరించడం జరిగింది. యూదులను కూడా ఇందులో చేర్చుతూ "విశ్వాసులతో ఉన్నవాళ్ళు" అన్న పదాలను చేర్చడం జరిగింది. వీరంతా ఒక సముదాయం అని ప్రకటించడం జరిగింది (నిబంధన 25-35). ఆ తర్వాత "ఇతరు లకు భిన్నంగా, విశ్వాసులు ఒకే సోదరసమాజంగా కలిసి ఉంటారు" (నిబంధన 15) అని ప్రకటించడం జరిగింది. శాంతి సమయంలోను, యుద్ధ సమయంలోను ముస్లిములందరూ ఒకటిగా ఉంటారు (నిబంధన 17). రక్తపరిహారం విషయంలో ముస్లిములు సమైక్యంగా నిలబడడం తప్పనిసరి చేస్తూ, హంతకుడికి ఎవ్వరూ ఆశ్రయం ఇవ్వరాదని, వారిపై అణిచివేతలు జరిగితే, రక్తపాతం జరిగితే వారు బదులు చెప్పాలి (నిబంధనలు 19, 21, 22). ముస్లిమ్ ఎవ్వడూ మరో ముస్లిమ్‌ను



కాని, ముస్లిమేతరు డిని కాని హతమార్చరాదు, అలాగే ఒక ముస్లిమ్‌కు వ్యతిరేకంగా ముస్లిమేతరులకు మరో ముస్లిమ్ సహాయపడరాదు (నిబంధన 14). సందేహాలు, భేదాభిప్రాయాలను దేవుడు, దైవప్రవక్త (స)లకు వదిలివేయాలి (నిబంధన 23). ఎంత తక్కువ హోదా ఉన్న ముస్లిమ్ అయినా సరే ఎవరికైనా సరే ఆశ్రయం ఇవ్వ వచ్చు. దేవుని పేర అందరూ దాన్ని గౌరవించాలి. (నిబంధన 15). నేరాలను, పాపాలను, దౌర్జన్యాలను నిర్మూలించడానికి విశ్వాసులైన ధర్మపరాయణులందరూ సమిష్టిగా నిలబడాలి (నిబంధన 13). ధర్మపరాయణత్వానికి, న్యాయానికి కట్టుబడా లని కొన్ని తెగలను పేరుపెట్టి మరీ ప్రస్తావించడం జరిగింది. (నిబంధనలు 3 నుంచి 12). ఈ సంవిధానంలో ఇస్లామీయ పారిభాషిక పదం "దైవమార్గంలో" అన్నది చేర్చడం జరిగింది (నిబంధన 19). తిరుగుబాటు, దైవభీతి, పాపం (నిబంధన 36) అన్న పదాలు కూడా చేర్చబడ్డాయి. అలాగే దైవభీతిపరులైన విశ్వాసులు ఉత్తమమైన రుజుమార్గాన ఉంటారని చెప్పడం జరిగింది (నిబంధన 20). "అణిచివేయబడిన వారికి సహాయం" అన్నది నిర్దిష్టమైన ఇస్లామీయ సూత్రంగాను, అంతర్జాతీయ సూత్రంగాను నిర్ధారించడం జరిగింది. నిజాయితీ, దైవభీతి కలిగి ఈ సంవిధానం పట్ల విధేయత చూపినవారితో దేవుడు ఉంటాడని ప్రకటించడం జరిగింది (నిబంధన 42,46,47). మదీనా భౌగోళిక విస్తీర్ణం దాదాపు వంద చదరపు మైళ్ళు ఉంటుంది. మదీనా నగరం ఇస్లామీయ రాజ్యానికి ప్రాథమిక ప్రధాన కేంద్రం గాను, పవిత్ర నగరంగాను ప్రకటించబడింది (నిబంధన 39). ఈ సంవిధానంలో ఉన్న పక్షాలన్నీ ఒకే ఒక సముదాయంగా ప్రకటించడం జరిగింది (నిబంధన 1). ముస్లిములతో సహకరించిన యూదులకు సమాన పౌరహక్కులు ఉంటాయి (నిబంధన 16). అణిచివేత, హత్యల విషయంలో ఈ నేరాలకు పాల్పడిన వ్యక్తిపై ఆ నేరాల బాధ్యత ఉంటుంది. ఆ వ్యక్తి కుటుంబంపై కూడా ఆ నేరాల బాధ్యత ఉంటుంది. (రక్తపరిహారం చెల్లింపులో కుటుంబం పాలుపంచుకోవలసి ఉంటుంది). మరెవ్వరి పైనా ఆ బాధ్యత ఉండదు. (నిబంధన 25,26). రక్షణ వ్యవహారాలకు సంబంధించి మదీనాపై దాడి జరిగితే అన్ని పక్షాలు కలిసి మదీనాను కాపాడాలి (నిబంధన 37). ఈ సంవిధానంలోని పక్షాల్లో ఎవరిపై నైనా దాడి జరిగితే మిగిలిన పక్షాలన్నీ దాడిచేసిన వారికి వ్యతిరేకంగా ఒక్కటి కావాలి (నిబంధన 37). ప్రవక్త (స) అనుమతి లేకుండా ఎవరూ సైనిక చర్యలకు దిగరాదు (నిబంధన 36). కాని ఇందులో ఏ పక్షానికైనా సంబంధించిన మతపరమైన పోరాటమైతే మిగిలిన పక్షాలు అందులో పాలుపంచుకోవలసిన అవసరం లేదు. (నిబంధన 45). ఈ సంవిధానంలోని ఏదైనా

పక్షం శాంతి ప్రయత్నాలు చేస్తే అందరూ అందులో పాలు పంచుకోవాలి (నిబంధన 45). ఇస్లామ్‌ను తీవ్రంగా వ్యతిరేకిస్తున్న ఖురైషులను ఈ కూటమి నుంచి దూరంగా ఉంచడానికి గాను, ముస్లిమేతర పౌరులెవ్వరూ ఖురైషులకు సంబంధించిన వ్యక్తులకు గాని, ఆస్తులకు గాని రక్షణ కల్పించరాదని, ఈ విషయంలో ముస్లిములకు వ్యతిరేకంగా నిలబడరాదని తీర్మానించడం జరిగింది (నిబంధన 20). యుద్ధ ఖర్చుల విషయంలో కొందరు, ముఖ్యంగా యూదులు పిసినారిగా వ్యవహరిస్తారు కాబట్టి యుద్ధం వస్తే ఇందులోని ఏ పక్షమైనా తన యుద్ధఖర్చులు తానే భరించాలని తీర్మానించారు (నిబంధన 37, 44). అరబ్బుల్లో హత్యకు రక్తపరిహారం, యుద్ధఖైదీల విషయంలో పరిహారం అనేది ప్రబలంగా ఉన్న సంప్రదాయం. అలాగే నిరుపేద రుణగ్రస్తుడి రుణం తీర్చే బాధ్యత కూడా అలాంటిదే. అందరికీ మతస్వేచ్ఛ ఉంటుందన్న హామీని క్రింది పదాల్లో స్పష్టం చేయడం జరిగింది. "మీకు మీ మతం, మాకు మా మతం"(నిబంధన 25). ఆ విధంగా ముస్లిములందరూ రాజకీయంగానూ, ధార్మికంగానూ ఒకే సముదాయంగా రెండు విధాల బాధ్యతలు నిర్వర్తించవలసి ఉంది. కాగా ముస్లిమేతరులకు కేవలం రాజకీయ బాధ్యతలు మాత్రమే ఉన్నాయి. వారికి మతస్వేచ్ఛ హామీ ఇవ్వడం జరిగింది. ఈ సంవిధానం ఆధారంగా మదీనాలో ఇస్లామీయ రాజ్యం ఏర్పాటయ్యింది. అక్కడ ప్రవక్త (స) అధికారం స్థాపించబడింది. దాదాపు వంద చదరపు మైళ్ళ భూభాగం, 5000 జనాభా ఉన్న మదీనా నగరం రాజధానిగా ఏర్పాటయ్యింది. చరిత్రలో మొదటిసారి ఇస్లామీయ సందేశ ప్రచారానికి కావలసిన వాతావరణం ఏర్పాటయ్యింది. అరబ్బు తెగలతో చేసుకున్న అంగీకారాలు, ఒప్పందాలు అన్నీ ఈ సంవిధానం ప్రకారమే చేసుకున్నారు. అంతర్గతంగా వ్యవస్థీకరణ పూర్తయిన వెంటనే ప్రవక్త (స) అంతర్జాతీయ కార్యకలాపాలు ప్రారంభించారు. విశ్వజనీనమైన ఇస్లామీయ సందేశం కేవలం అరబ్బు భూభాగాల్లోనే పరిమితమై ఉండడం సాధ్యంకాదు. ఈ విషయంలో ప్రవక్త (స) సాధించిన విజయాలు ఆశ్చర్యం కలిగిస్తాయి. కేవలం 13 సంవత్సరాల స్వల్ప కాలంలో ఉద్యమంలో ప్రాథమిక దశను దాటేశారు. ఉద్యమ కార్యకర్తలను తీర్చిదిద్దారు. ఆ తర్వాత కేవలం 8 సంవత్సరాల కాలంలో శత్రు శిబిరాలన్నింటిని గెలిచి ఆయన ఒక ఇస్లామీయ రాజ్యాన్ని స్థాపించారు. ఆయన జీవితకాలంలోనే తన సందేశాన్ని అంతర్జాతీయ స్థాయిలో, ఇరుగు పొరుగు దేశాల్లో విస్తరించారు.

హిజ్రీశకం 7వ సంవత్సరంలో ఆయన తన వాయిదా వేసుకున్న ఉమ్రా యాత్రను పూర్తి చేసుకున్న తర్వాత ప్రత్యేక రాయబారులను ఇరుగుపొరుగు దేశాలకు



పంపించారు. ఆయా దేశాధినేతల పేర లేఖలిచ్చి పంపించారు. ఇక్కడ మనం ముఖ్యంగా గమనించవలసిన వాస్తవమేమంటే ఆ కాలంలోని పాలనావ్యవస్థల్లో ఎక్కడా ప్రజలకు పౌరహక్కులు లేవు. రాజరికం అమల్లో ఉండేది. తన దేశంలోని ప్రజల మధ్య పరాయి దేశస్తులు వచ్చి సందేశ ప్రచారం చేయడాన్ని రాజులెవ్వరు సహించే వారు కాదు. అందువల్లనే ప్రవక్త (స) వివిధ దేశాల రాజులకు ప్రత్యక్షంగా లేఖలు రాశారు. ఈ లేఖలు కూడా క్లుప్తంగా, సూటిగా "రోమ్ అధినేతకు", "ఈరాన్ అధినేతకు", "ఖిబ్త్ అధినేతకు" అని సంబోధించారు. రోమ్, ఈరాన్ అధినేతలకు రాసిన లేఖల్లో మీరు గనుక ఈ సందేశాన్ని తిరస్కరిస్తే మీ ప్రజలు మార్గం తప్పడానికి మీరే బాధ్యులవుతారని నిర్మోహమాటంగా హెచ్చరించడం జరిగింది. ఈ లేఖలు రాసిన పద్ధతి, సంబోధించిన పద్ధతి ప్రవక్త (స) స్వయంగా నిర్దేశించిన పద్ధతి. ఈ లేఖలపై "దైవప్రవక్త ముహమ్మద్" అన్న రాజముద్ర వేశారు. ప్రతి లేఖ "అనంత కరుణామయుడు, అపారకృపాశీలుడు అయిన అల్లాహ్ పేరుతో" అని ప్రారంభించబడింది. ఆ తర్వాత లేఖ పంపిస్తున్న ప్రవక్త ముహమ్మద్ (స) పేరు, ఆ పిదప ఎవరికి లేఖ పంపుతున్నారో వారి పేరు, ఆ పిదప చాలా క్లుప్తంగా, సమగ్రంగా సందేశ సారాంశం. ఈ లేఖల్లో ఉపయోగించిన ఒక ప్రత్యేక పదబంధం "ఇస్లామ్ స్వీకరించండి సురక్షితంగా ఉండండి". ఈ పదబంధంలో విస్తృతమైన భావాలున్నాయి. ఇస్లామ్ మాత్రమే శాంతిమార్గమని, దీని ద్వారా మాత్రమే సాఫల్యం సాధ్యమని ఒకవైపు తెలియజేస్తూనే మరోవైపు ఈ సందేశాన్ని తిరస్కరిస్తే సురక్షితంగా ఉండలేరన్న హెచ్చరిక కూడా ఇందులో దాగి ఉంది. అందరికీ ఒకేవిధమైన లేఖలు పంపలేదు. ప్రతి దేశంలోని పరిస్థితులు, అక్కడి ధార్మిక ఆచారవ్యవహారాలు దృష్టిలో ఉంచుకుని లేఖలు రాశారు. అన్నింటికి మించి ఏ దేశానికైనా అక్కడి భాషను తెలిసిన వ్యక్తినే రాయబారిగా పంపించారు. ఇరుగు పొరుగు దేశాల భాషలు తెలిసిన వారు ప్రవక్త(స) సహచరుల్లో చాలా మంది ఉండేవారు. అంతర్జాతీయ వ్యాపార సంబంధాల వల్ల ఆయా భాషలు నేర్చుకున్న వారు కొందరైతే, ప్రవక్త (స) స్వయంగా కొందరిని విదేశీ భాషలు నేర్చుకోమని ప్రోత్సహించారు.

1. మొదటి లేఖ అస్‌హమ్ బిన్ అబ్జార్ నీగస్‌కు పంపడం జరిగింది. (ఈయన అబిసీనియా రాజు. కాని ఇస్లామ్ ప్రారంభకాలంలో ముస్లిములు మక్కా నుంచి అబిసీనియాకు వలస వెళ్ళినప్పుడు అక్కడ నీగస్ దర్బారులో ఈ ప్రవాసుల వ్యాజ్యం విచారణకు వచ్చింది. అప్పుడు హజ్రత్ జాఫర్ ద్వారా నీగస్ ఇస్లామ్ స్వీకరించాడు. ఆయన మరణించిన తర్వాత అంత్యక్రియల పరోక్ష ప్రార్థనలను ప్రవక్త (స) స్వయంగా

నిర్వహించారు. ఆ నీగస్ వేరు, ఇప్పుడు ప్రవక్త (స) లేఖ రాసిన నీగస్ వేరు అనుకోవాలి. అయితే ఈ విషయంలో స్పష్టత లేదు. ఇది వివాదాస్పదమైన అంశాల్లో ఒకటి). నీగస్ వద్దకు రాయబారిగా అమ్ర్ బిన్ ఉమయ్యాకు లేఖ ఇచ్చి పంపారు. ఆ లేఖలో ముస్లిమ్ ప్రవాసులు మక్కా నుంచి అబిసీనియా వలస వెళ్ళిన ఉదంతాన్ని హజ్రత్ జాఫర్ గురించి ప్రస్తావించారు. ఇస్లామ్ స్వీకరించాలని కోరారు. నీగస్ (ఈయన మొదటి నీగస్ కాకపోవచ్చు) అప్పటికే ఇస్లామ్ వల్ల ప్రభావితుడై ఉన్నాడు. ప్రవక్త (స) లేఖకు ఆయన సుదీర్ఘమైన లేఖ జవాబుగా రాశాడు.

2. బహ్రెయిన్ పాలకుడు ముంజిర్ బిన్ సాది. బహ్రెయిన్ అప్పట్లో ఈరాన్ చక్రవర్తికి సామంతరాజ్యంగా ఉండేది. ఆయన వద్దకు ఆలా బిన్ హజ్రమీని రాయబారిగా ఒక లేఖ ఇచ్చి పంపించారు. రాజు ఇస్లామ్ స్వీకరించాడు. ఆయనతో పాటు చాలా మంది ఇస్లామ్ స్వీకరించారు. అతను జవాబుగా ప్రవక్త (స)కు లేఖ రాస్తూ కొందరు ఇస్లామ్ ప్రకాశాన్ని స్వీకరించారని, కొందరు వ్యతిరేకించారని తెలియజేస్తూ, తన కుమారుడిని ప్రవక్త (స) వద్దకు రాయబారిగా పంపాలనుకుంటు న్నానని, ప్రవక్త (స) కోరితే తానే స్వయంగా ప్రవక్త (స) వద్ద హాజరవుతానని తెలిపాడు. ఆయనకు ప్రవక్త (స) మళ్ళీ లేఖ రాస్తూ, క్రయిస్తవులుగా, యూదులుగా ఉండాలనుకుంటున్న వారు మతం మార్చుకునేలా బలవంతం చేయరాదని, వారికి మతస్వేచ్ఛ ఇవ్వాలని, కేవలం వారి నుంచి జిజియా మాత్రమే వసూలు చేయాలని తెలిపారు.

3. జలాందీ కుమారులు జాఫర్, అబ్ద్‌లు. ఒమన్‌ను వీళ్ళు పాలిస్తున్నారు. ప్రవక్త (స) లేఖతో అమ్ర్ బిన్ ఆస్ వారివద్దకు రాయబారిగా వెళ్ళారు. మొదట చిన్న సోదరుడు అబ్ద్‌ను కలుసుకున్నారు. ఆ తర్వాత దర్బారు ఏర్పాటయ్యింది. ఆ దర్బారులో ఇద్దరు సోదరుల సమక్షంలో అమ్ర్ బిన్ ఆస్ ప్రవక్త (స) లేఖను చదివి వినిపించారు. వాళ్ళు అడిగిన ప్రశ్నలకు జవాబులిచ్చారు. వారు కొంతకాలం మౌనంగా ఉండిపోయారు. ఆ తర్వాత ఇద్దరు సోదరులు తమ ప్రజల్లో చాలా మందితో సహా ఇస్లామ్ స్వీకరించారు.

4. ముంజిర్ బిన్ హారిస్ బిన్ అబూ షిమ్ర్ డమస్కస్ పాలకుడు. ఆయన వద్దకు షుజా బిన్ వహ్బ్ అల్ సాది ప్రవక్త (స) లేఖను తీసుకువెళ్ళారు. ఈ లేఖను చూసి ముంజిర్ మొదట మండిపడ్డాడు. ఆ తర్వాత నిదానంగా ఆలోచించాడు. అతను ఇస్లామ్ స్వీకరించలేదు, కాని ప్రవక్త (స) రాయబారిని సగౌరవంగా లాంఛనా లతో వెనక్కి పంపాడు.



5. హౌజా బిన్ అలీ ఎమన్‌కు రాజు. ఇతను క్రయిస్తవుడు. ఈ రాజ్యానికి సులైత్ బిన్ అమ్ర్ రాయబారిగా ప్రవక్త (స) లేఖను తీసుకువెళ్ళారు. అసలు ప్రవక్త(స) లేఖ సారాంశం ఏమిటో తెలుసుకోకుండానే ఇతను బేరసారాలు మొదలు పెట్టాడు. తనకు ఇస్లామీయ రాజ్యంలో సగభాగం ఇస్తే తాను ఇస్లామ్ స్వీకరిస్తా నన్నాడు. ఈ రాజు ఆ తర్వాత కొంతకాలానికే మరణించాడు. ఇతడి బేరసారాల గురించి తెలిసినప్పుడు ప్రవక్త (స) రాజ్యంలో ఒక్క అంగుళం భూమి కూడా ఇలాంటి బేరాలకు ఇచ్చేది లేదని చెప్పారు. ఇస్లామీయ రాజ్యం ఏర్పడిన భూభాగమంతా పవిత్రమైన నేలగా పరిగణనపొందింది.

6. జారిహ్ బిన్ మతీ మకూకస్ అలెగ్జాండ్రియా, ఈజిప్టులకు పాలకుడు. జారిహ్ క్రయిస్తవుడు. హతీబ్ బిన్ అబీ బల్తా ఈ రాజు దర్బారుకు ప్రవక్త (స) లేఖతో వెళ్ళారు. రాయబారి చాలా సూటిగా మకూకస్‌తో మాట్లాడాడు. ఈ ప్రాంతంలో ఇంతకు ముందు ఒక వ్యక్తి తనను తాను దేవుడిగా ప్రకటించి చివరకు దైవికశిక్షకు గురయ్యాడని హెచ్చరించాడు. ఈ సంఘటనల నుంచి గుణపాఠం గ్రహించాలని, ఇతరులకు ఆదర్శంగా నిలవాలని కోరాడు. ఆ తర్వాత రాయబారి ఇస్లామ్ ప్రత్యేకతలను వివరించాడు. అంతేకాదు తాను క్రీస్తు ధర్మాన్నే వారి ముందు ఉంచు తున్నానని, ఇస్లామ్ కొత్త ధర్మం కాదని వివరించాడు. మకుకస్ ఇస్లామ్ స్వీకరిం చడానికి అంగీకరించకపోయినప్పటికీ, ప్రవక్త ముహమ్మద్ (స) పంపిన దూత పట్ల అత్యంత గౌరవాదరాలతో వ్యవహరించాడు. ప్రవక్త (స) పంపిన లేఖను ఒక ఏనుగు దంతం పెట్టెలో పెట్టి తన ఖజానాలో భద్రపరిచాడు. ఒక శ్వేతాశ్వంతో సహా ప్రవక్త (స)కు అనేక కానుకలు పంపించాడు. ప్రవక్త (స)కు ఒక లేఖ రాస్తూ చివరి ప్రవక్త ఆగమనం గురించి తనకు తెలుసుననీ, కాని ఆ ప్రవక్త సిరియాలో జన్మిస్తాడని తాను భావించానని రాశాడు.

7. రోమన్ చక్రవర్తి హెర్క్యులస్ విశాలమైన తూర్పు సామ్రాజ్యానికి పాలకుడు. అతడి రాజధాని కాన్‌స్టాంటినోపుల్. ప్రవక్త (స) తన రాయబారిగా వహియా బిన్ ఖలీఫా కల్బీకి లేఖ ఇచ్చి హెర్క్యులస్ వద్దకు పంపారు. జెరుసలేమ్‌లో వహియా చక్రవర్తిని కలుసుకున్నారు. మదీనా నుంచి వచ్చిన రాయబారి గౌరవార్థం హెర్క్యులస్ ఒక పెద్ద సమావేశం ఏర్పాటు చేశాడు. ప్రవక్త ముహమ్మద్ (స) గురించి అనేక వివరాలు అడిగి తెలుసుకున్నాడు. ఆ తర్వాత చక్రవర్తి తన మనుష్యులతో మక్కా నుంచి వచ్చిన వారెవ్వరైనా పట్టణంలో ఉన్నారేమో చూడమని ఆదేశించాడు. యాధృచ్ఛికంగా మక్కాలో ఇస్లామ్ శత్రువుల నాయకుడు అబూ సుఫ్యాన్ వ్యాపార

పర్యటన కోసం సిరియా వచ్చి ఉన్నాడు. అబూ సుఫ్యాన్‌ను అతడి వ్యాపార భాగస్వామిని హెర్క్యులస్ వద్దకు తీసుకు వచ్చారు. హెర్క్యులస్ తాను అబూ సుఫ్యాన్‌ను కొన్ని ప్రశ్నలు అడుగుతానని, ఒకవేళ అతను అబద్ధాలు చెబితే తనకు తెలియజేయాలని తన మనుష్యులకు చెప్పాడు. అబూ సుఫ్యాన్ ఈ సంఘటన గురించి తర్వాత వివరిస్తూ, తన వ్యాపార భాగస్వాములు తన స్వంత భాగస్వాములు తనను మోసగిస్తారన్న భయం లేనట్లయితే తాను అబద్ధాలు చెప్పి ఉండేవాడినేనన్నాడు. అక్కడ పరిస్థితి ఎలా ఉందంటే ప్రవక్త (స)కు ప్రాణశత్రువు కూడా అబద్ధం చెప్పడానికి సాహసించలేని పరిస్థితిని చక్రవర్తి సృష్టించాడు. హెర్క్యులిస్ అతడితో ప్రవక్త ముహమ్మద్ (స) కుటుంబం గురించి ప్రశ్నించాడు. ప్రవక్త (స) వంశం, ఆయన వ్యవహారశైలి, ఆయన అనుచరుల జీవనశైలి, ఉద్యమం సాధించిన ప్రగతి, యుద్ధాల్లో ముస్లిముల పరిస్థితి, ఇస్లామీయ బోధనలు ఇంకా ఇలాంటి కొన్ని విషయాలు అడిగి తెలుసుకున్నాడు. ఇవన్నీ చాలా శ్రద్ధగా విన్న తర్వాత చక్రవర్తి మాట్లాడుతూ "నువ్వు చెప్పిందంతా నిజమే అయితే ఈ మనిషి ఒకరోజు నేను కూర్చుని ఉన్న ఈ ప్రాంతాన్ని ఆక్రమిం చుకుంటాడు. నేను ప్రవక్త వద్దకు వెళ్ళి ఆయన పాదాలు కడగాలని కోరుకుంటు న్నాను" అన్నాడు. ఆ తర్వాత ప్రవక్త (స) రాసిన లేఖను బిగ్గరగా దర్బారులో చదివి వినిపించారు. ఆ లేఖలో ఉన్న అంశాలు దర్బారులో ఉన్న పెద్దలకు నచ్చలేదు. ముఖ్యంగా చక్రవర్తి హెర్క్యులస్ స్వయంగా ప్రవక్త (స) పట్ల చూపించిన గౌరవాదరాలు వారిని కలవరపెట్టాయి. అందువల్ల మక్కా వాళ్ళను వెంటనే వెనక్కి పంపేయాలని అనుకున్నారు. అయితే ఈ సంభాషణ అబూసుఫ్యాన్‌పై గొప్ప ప్రభావం వేసింది.

8. ఈరాన్ పాలకుడు ఖుస్రో పర్వేజ్. విశాల సామ్రాజ్యానికి చక్రవర్తి. జోరాష్ట్రియన్ మతస్థుడు. అబ్దుల్లా బిన్ రవాహాను తన రాయబారిగా ప్రవక్త (స) పంపించారు. ప్రవక్త ముహమ్మద్ (స) రాసిన లేఖ చదివి ఖుస్రో ఆగ్రహంతో మండిపడ్డాడు. లేఖను ముక్కలు ముక్కలుగా చించేశాడు. తన రాజ్యంలోని ఒక సాధారణ పౌరుడు చక్రవర్తికి లేఖ రాసే సాహసం చేస్తాడా అని చిందులు వేశాడు. ఆ వెంటనే తన సామంత రాజ్యంగా ఉన్న ఎమన్ గవర్నర్ బాజాన్‌కు ఆదేశాలు జారీ చేశాడు. తనకు లేఖ రాసిన ఆ ప్రవక్తను వెంటనే నిర్బంధించి తన సమక్షంలో ప్రవేశపెట్టాలని ఉత్తర్వులిచ్చాడు. వెంటనే బాజాన్ ఒక సైనికదళాన్ని మదీనా పంపించాడు. ఈ సైన్యం తాయిఫ్ ప్రాంతం నుంచి వెళుతున్నప్పుడు, అక్కడి ప్రముఖులు ఆనందంతో సంబరాలు చేసుకున్నారు. ఎందుకంటే చక్రవర్తి ఖుస్రో పర్వేజ్ ఆగ్రహం నుంచి



ఎవరూ తప్పించుకోలేరని, కాబట్టి తమ శత్రువు ప్రవక్త ముహమ్మద్ (స)పై దాడి తప్పదని సంతోషించారు. ఈ సైనికదళం మదీనా చేరుకుంది. సైనికదళం నాయకుడు తాను ఎందుకు వచ్చింది కబురు పంపాడు. ప్రవక్త (స) అతడిని మర్నాడు ఉదయం తనను కలవమని చెప్పారు. మర్నాడు ఉదయం సైనికదళం నాయకుడు ప్రవక్త (స)ను కలుసుకున్నప్పుడు ప్రవక్త (స) అతనితో మీ చక్రవర్తిని స్వయంగా అతడి కొడుకు హతమార్చాడు. కావాలంటే ఈ విషయాన్ని ధృవీకరించుకోవచ్చు అన్నారు. ఎమన్ గవర్నర్ ఈ మాట నిజమేనని నిర్ధారించుకున్నాడు. ప్రవక్త ముహమ్మద్ (స) బోధనల గురించి తెలుసుకున్నాడు. ఆయన నడవడి గురించి, ఆయన స్వభావం గురించి సమాచారం సేకరించి తన దర్బారులోని వారందరితో సహా, తన ప్రాంతంలోని చాలా మంది ప్రజలతో సహా ఇస్లామ్ స్వీకరించాడు.

ఖుస్రో తన లేఖను చింపేశాడని విన్న తర్వాత ప్రవక్త ముహమ్మద్ (స) "అతను తన సామ్రాజ్యాన్ని చింపేశాడు" అని వ్యాఖ్యానించారు. కేవలం పది పదిహేను సంవత్సరాల్లోనే సువిశాల పర్షియన్ సామ్రాజ్యం అంతర్గత కలహాలతో అట్టుడికి చివరకు ముస్లిమ్ సైన్యాలకు వశమైంది.

ఇస్లామీయ సందేశాన్ని పంపిన చిన్న చిన్న పాలకుల్లో రోమన్ సామ్రాజ్యంలోని గవర్నర్ ఫర్వా బిన్ అమ్ర్ ఒకడు. అతను తన పదవీ హోదాలను కూడా పణంగా పెట్టి ఇస్లామ్ స్వీకరించాడు. ఇస్లామ్ కోసం తన ప్రాణాలు కూడా త్యాగం చేశాడు. నజ్ద్ పాలకుడు సమామ హిజ్రీ శకం 6వ సంవత్సరంలో ఇస్లామ్ స్వీకరించాడు. మూడవ రాజు జబల గస్సానీ. ఇతను హిజ్రీ శకం 7వ సంవత్సరంలో ఇస్లామ్ స్వీకరించాడు. నాల్గవ రాజు దుమతుల్ జందల్ పాలకుడు ఉకైదిర్. ఇతను కూడా ఇస్లామ్ స్వీకరించాడు. ఐదవ రాజు జుల్ కల్లాహ్ హుమేరీ. ఇతను ఒక సందర్భంలో తానే దేవుడినని ప్రకటించుకున్నవాడు. ప్రజలు తనకు సాష్టాంగపడాలని ఆదేశించాడు. చివరకు ఇతను కూడా ముస్లిమ్‌గా మారి కృతజ్ఞతా సూచకంగా 18,000 మంది బానిసలకు స్వేచ్ఛ ప్రసాదించాడు. హజ్రత్ ఉమర్ (రజి) ఖలీఫాగా ఉన్న కాలంలో ఇతను తన రాజ్యాధికారాన్ని త్యజించి మదీనా వచ్చి తన శేషజీవితాన్ని అక్కడే దైవధ్యానంలో గడిపాడు.

## ఉద్యమ స్ఫూర్తి

మదీనా రాజ్యం తరఫున ప్రచారబృందాలను చుట్టుపక్కల ప్రాంతాలకు పంపడం జరిగేది. అత్యంత ప్రమాదభరితమైన యుద్ధపరిస్థితుల్లో కూడా ఈ బృందాలు

వెళ్ళేవి. ఎంత ప్రమాదభరితమైన పరిస్థితులంటే, కనీసం నాలుగు సందర్భాల్లో ఇలాంటి బృందాల్లో ఉన్న సభ్యులందరూ హత్యకు గురయ్యారు. శత్రుమూకలు అత్యంత క్రూరంగా వారిని హతమార్చాయి. అదేవిధంగా వివిధ ప్రాంతాల్లో పని చేయడానికి కార్యకర్తలకు శిక్షణ ఇవ్వడం జరిగింది. విస్తృత స్థాయిలో మదీనా రాజ్యంలో పౌర అధికారులు కూడా ప్రచారబాధ్యతలు నిర్వర్తించేవారు. ఇస్లామ్‌ను ప్రచారం చేసే కార్యభారాన్ని మోసేవారు. ముస్లిమ్ రాజ్యంలోని పౌరఅధికారులు ఇతర రాజ్యాలలోని పౌర అధికారులకు భిన్నంగా ఉండేవారు. అతితక్కువ వేతనాలతో అత్యంత క్లిష్టమైన బాధ్యతలు నిర్వర్తించేవారు. ఉదాహరణకు మక్కా గవర్నర్ హజ్రత్ అతాబ్ బిన్ ఉసైద్‌కు నెలకు ఒక్క దిర్హమ్ లభించేది. ఆధునిక రాజకీయ నాయకుల వ్యవహారశైలి ఆనాటి ఈ అధికారులకు తెలియదు. అధికార దుర్వినియోగం, పరిధులను అతిక్రమించడం, ప్రజలకు దూరంగా ఉండడం, ఆడంబరాలు, అట్టహాసాలు ఏవీ వారికి లేవు. ప్రజల అవసరాల పట్ల నిరాసక్తత అన్నది వారికి తెలియదు. వారికి అంగరక్షకులు, భద్రతా సిబ్బంది లేదు. లంచాలు, వందిమాగధులు, విచక్షణ లేకుండా అస్మదీయులకు పంచిపెట్టడం, మద్యపానం, నృత్యగానాలు ఇవేవీ వారికి తెలియదు. ఒక విభిన్నమైన తరగతికి చెందిన అధికారులు వాళ్ళు. కేవలం నామమాత్రమైన పారితోషికం తీసుకుని రాత్రింబవలు పనిచేశారు. అతి సాధారణ జీవితాలు గడిపారు. తమ పని నిజాయితీతో చేశారు. పక్షపాతరహితంగా న్యాయం చేశారు. దేవుడికి భయపడుతూ నిజాయితీగా దైవదాస్యం చేశారు. వారి నడవడి, వారి వ్యవహారశైలి ప్రజల హృదయాలను గెలుచుకుంది. వారు సత్యసందేశాన్ని వినిపించినప్పుడు ఆ మాటలు ప్రజల మనోమస్తిష్కాలపై గొప్ప ప్రభావాన్ని వేసి ఉంటాయి. వారి ఆదర్శ జీవితం ఎలాంటి ప్రభావం వేసిందంటే కొన్ని చోట్ల మొత్తం జనాభా ఇస్లామ్ స్వీకరించింది. ఉదాహరణకు జబీద్ మరియు ఆదెన్ ప్రాంతానికి హజ్రత్ అబూ మూసా అషారీ గవర్నర్‌గా నియమించబడినప్పుడు అక్కడి మొత్తం జనాభా అతి కొద్ది సమయంలో ఇస్లామ్ స్వీకరించింది. జరీర్ బిన్ అబ్దుల్లా బాజ్లీ హుమైర్ పాలక కుటుంబాల్లోని సభ్యులందరినీ ముస్లిములుగా మార్చాడు. ఆ విధంగా ఇస్లామ్ సందేశం అరేబియాలోని మారుమూల ప్రాంతాలకు కూడా వ్యాపించడం జరిగింది. ఒక మానసిక విప్లవాన్ని, ఒక నైతిక పెనుమార్పును సాధించింది.

అరేబియాలో సంచారతెగలను బదూయిన్ అంటారు. ఈ తెగలు నిరుపేద జీవితాన్ని గడిపేవి. తమ వద్ద ఉన్న పశువుల ద్వారా వచ్చే ఆదాయమే వారి జీవనోపాధి. కొన్ని తెగలు సాయుధ దోపిళ్ళకు పాల్పడేవి. చిన్న చిన్న ఊళ్ళు పల్లెల్లో



అక్కడి గ్రామపెద్దలు పెత్తనం చెలాయించేవారు. శ్రామికుల ఉత్పత్తినంతా దోచుకునేవారు. పెద్దపెద్ద పట్టణాల్లో పరిస్థితి కాస్త మెరుగ్గానే ఉన్నప్పటికీ ఇక్కడ కూడా బీద ధనిక వ్యత్యాసం చాలా ఎక్కువగా ఉండేది. ధనికవర్గాలు భోగభాగ్యాల జీవితం గడిపేవి. పేదవారు ఆకలితో అలమటించేవారు. ధనికులు తమ సంపదను స్త్రీల పొందుకు, మద్యపానం, జూదం వంటి వ్యసనాలకు వెచ్చించేవారు. ఇందులో కొందరు ముఖ్యంగా యూదులు వడ్డీ వ్యాపారం చేసేవారు. తమ దగ్గర రుణం తీసుకున్న వారిని జలగల్లా పీడించేవారు. అరేబియాలోని సాధారణ ప్రజలు అత్యంత నిరుపేద జీవితాలే గడిపేవారు. క్షుద్బాధను తీర్చుకోవడానికి ఎండిన రక్తం కూడా తినేవారు. పశుచర్మాన్ని ఉడకబెట్టి తినేవారు. విద్య వైద్య సౌకర్యాల ప్రసక్తే లేదు. కొద్దోగొప్పో నేర్చుకున్న వారు తమ స్వంత అనుభవాల నుంచి మాత్రమే నేర్చుకోగలిగారు. వ్యాధులకు చికిత్స లేదు. రోగాలొస్తే విగ్రహాలకు పూజలు చేసేవారు. మంత్రతంత్రాలపై ఆధారపడేవారు. మంత్రగాళ్ళు, జోతిష్కులు వారిని దోచుకునేవారు. క్లుప్తంగా చెప్పాలంటే అప్పట్లో అరేబియా ప్రజలకు కావలసింది నాలుగు మెతుకులు. వారి సమస్య ఆకలి తీర్చుకోవడమే. ఇలాంటి పరిస్థితిలో సత్యం, వాస్తవాల గురించి పాఠాలు వినే స్థితిలో ఉంటారా? అత్యంత దయనీయమైన పేదరికంలో మునిగి ఉన్న ప్రజల నైతిక, ఆధ్యాత్మిక, రాజకీయ స్థాయిని పెంచడానికి చేసే ఏ ప్రయత్నమైనా కేవలం నైతిక విలువల ఉపన్యాసాలతో సాధ్యం కాదు. బలప్రయోగంతో శాంతిభద్రతలను, వ్యవస్థను స్థాపించడానికి ప్రయత్నించినా, నైతిక విలువలను బోధించినా ప్రజలు ఆ వ్యవస్థను ఎంతో కాలం భరించలేరు. పరలోక సాఫల్యంతో పాటు ఇహలోకంలోని సమస్యల పరిష్కారానికి మార్గాలు చూపించినప్పుడే ఏ నైతిక సిద్ధాంతమైనా ప్రజలపై ప్రభావం వేస్తుంది. నైతికబోధనలతో పాటు ఆర్థిక సమస్యల పరిష్కారం ఉన్నప్పుడే ఉద్యమం విజయవంతం అవుతుంది. ప్రవక్త ముహమ్మద్ (స) ప్రారంభించిన ఉద్యమం కేవలం నైతిక విలువలను బోధించడం, ఆధ్యాత్మిక ప్రమాణాలను ప్రచారం చేయడం మాత్రమే కాదు కడుపు నింపుకోడానికి ఎలాంటి మార్గాలు అవలంబించాలి, ఎలాంటి ప్రయత్నాలు చేయాలన్నది కూడా తెలియజేసింది. ఇస్లామ్ ప్రారంభదశలోని నైతికనియమావళిలో ఆకలితో ఉన్నవారికి అన్నం పెట్టడం అత్యంత ముఖ్యమైన నియమం. అలాగే అనాథలను ఆదరించడం, వితంతువులను, బాటసారులను ఆదరించడం ముస్లిముల బాధ్యతగా చేయడం జరిగింది.

బీదరికం తాండవించే అరేబియా నేలపై సంపదపై కొన్ని స్వార్థశక్తుల గుత్తాధిపత్యం ఉండేది. నగదు, వస్తువులు, వ్యవసాయ ఉత్పత్తులు, పశువులు అన్ని వారి

చేతుల్లో ఉండేవి. సంపన్నుల నుంచి ఈ సంపదను పేదల కోసం తీసుకోవడం అనేది అంత తేలికైన విషయం కాదు. పేదరికం సమస్య పరిష్కారానికి ప్రయత్నించక పోతే జీవితానికి, జీవిత సాఫల్యానికి సంబంధించిన ముఖ్యమైన సమస్యలపై దృష్టి పెట్టలేము. వివిధ దశల్లో అవతరించిన ఇస్లామీయ ఆర్థిక చట్టాలు సంపద పంపిణీకి కావలసిన మార్గం సుగమం చేశాయి. ఇస్లామీయ ఆర్థిక వ్యవస్థకు పునాదులు వేశాయి. కాని స్వార్థశక్తులు బలప్రయోగం లేకుండా తమ సంపదను ఇవ్వడానికి ఒప్పుకోవు. జిహాద్ భావన ఈ సమస్యను అత్యంత ఉత్తమమైన పద్ధతిలో పరిష్కరించింది. యుద్ధ సొత్తులో తమ భాగాన్ని తీసుకుని బీదలకు ఉపయోగించింది. ఎక్కడెక్కడ సంపద పోగుపడి ఉందో ఆ సంపదంతా పంపిణీలోకి వచ్చేలా చేసింది. నిరుపేదలను పీల్చి పిప్పి చేసి యూదులు కూడబెట్టిన వడ్డీ సంపద అంతా యుద్ధసొత్తుగా వెళ్ళిపోయింది. తాఖీఫ్ ప్రజలు కూడబెట్టిన సంపదను పూర్తి అరేబియా ప్రజలకు పంచడం జరిగింది. అలాగే ఎక్కడెక్కడైతే తిరుగుబాటు తెగలు తలెత్తడానికి ప్రయత్నించాయో ఆయా ప్రాంతాల్లో ఆ తెగ నాయకుల వద్ద ఉన్న సంపదను, ఇతర పెద్దల వద్ద పోగుపడి ఉన్న సంపదను తీసుకుని పంపిణీలో పెట్టడం జరిగింది. ఆ తర్వాత ఇస్లామీయ రాజ్యంలో ముస్లిమ్ ప్రజల నుంచి జకాత్ రూపంలోను, ముస్లిమేతరుల నుంచి జిజియా రూపంలోను పన్నులు, శిస్తులు వసూలు చేయడం జరిగింది. ఇందులో ఎక్కువ భాగం, ముఖ్యంగా జకాత్‌లో ఎక్కువ భాగం పేదప్రజల కోసం వినియోగిం చడం జరిగింది. ప్రతి సంవత్సరం పెద్దఎత్తున ఆహార ధాన్యాలు, ఖర్జూరాలు, పశువులు సంపన్నుల నుంచి పేదలకు పంపిణీ కావడం ప్రారంభమయ్యింది. ఆర్థిక సమస్యల పరిష్కారానికి నైతికమార్గాలను ఉపయోగించుకున్నారు. మదీనాలోని కేంద్రీయ సమాజం సాంఘిక సమానత్వం, ఆర్థిక సౌభ్రాత్రతలకు గొప్ప ఉదాహరణగా నిలిచింది. ఇల్లువాకిళ్ళు వదిలి కట్టుబట్టలతో మిగిలినవారు, పైసాలేని బానిసలు, ఆకలితో అలమటించే సంచారతెగలు, నిరుపేద యువకులు ఇస్లామ్ స్వీకరించిన తర్వాత సాధించిన ప్రగతి వికాసాలను యావత్తు అరేబియా సంభ్రమాశ్చర్యాలతో చూసింది. ఈ నిరుపేదలు సమాజంలోని ఉన్నత కుటుంబాలతో సమానస్థాయిని పొందడమే కాదు, నిర్భయంగా పెత్తందారులను సవాలు చేయగలిగారు. తమ ఆందోళనలు, కష్టాల నుంచి విముక్తి పొందారు. ఆశ్రయం, పని, ఉపాధి, ఆయుధాలు, వాహనాలు పొందగలిగారు. వారి వివాహాలకు ఎలాంటి అడ్డంకులు ఏర్పడలేదు. వారి ఇస్లామీయ సౌభ్రాత్ర భావన కేవలం మదీనాకు పరిమితం కాలేదు. క్రమేణా చుట్టుపక్కల ప్రాంతాలన్నింటికి వ్యాపించింది. చివరకు పూర్తి అరేబియా ఈ సామాజిక



వ్యవస్థ ఫలాలను అనుభవించడం ప్రారంభమయ్యింది. ప్రవక్త (స) స్వయంగా సగటు మనిషి ఎదుర్కొనే సమస్యల దృష్ట్యా తాను వ్యక్తిగతంగానే కాదు, రాజ్యాధినేతగా కూడా అత్యంత ఉదారమైన పద్ధతులను పాటించారు. ఆయన వ్యక్తిగతంగా తన వద్ద ఏదీ ఉంచుకోలేదు. తన వద్దకు వచ్చిన సంపదనంతా ఆయన వెంటనే పేదలకు పంపిణీ చేసేవారు. అలాగే ప్రజాధనాగారంలో సంపద పోగుపడడాన్ని కూడా అనుమతించేవారు కాదు. ఎప్పుడైనా ఎవరైనా అవసరార్థి వస్తే అతనికి అత్యధిక స్థాయిలో సహాయం అందించేవారు. ప్రవక్త (స) తన వద్ద ఏదీ లేని పరిస్థితిలో అప్పు చేసి అయినా అడిగిన వారికి సహాయం చేసేవారు. ప్రవక్త (స) దయాగుణం, ఉదారస్వభావాల గురించిన వార్తలు దూరదూర ప్రాంతాలకు కూడా వ్యాపించడంతో ఎక్కడెక్కడి నుంచో అవసరార్థులు ఆయన వద్దకు వచ్చి సహాయం పొందేవారు. ఇలా ఉదారంగా సహాయం చేయడమన్నది ప్రజలను ఇస్లామ్ వైపు ఆకర్షించడానికి లంచం ఇవ్వడం కానేకాదు. సంపద సమాజంలో పోగుపడకుండా అందరికీ పంపిణీ అయ్యేలా చూడ్డం. ఆ విధంగా ఒక సమానత్వ ప్రధానమైన సమాజాన్ని నిర్మించడం. ఆర్థిక కష్టాలతో కొట్టుమిట్టాడే వారికి చేయూతనిచ్చి పైకి లాగడం, ఆర్థిక పతనం నుంచి సమాజాన్ని కాపాడ్డం ఇస్లామీయ వ్యవస్థ ప్రధానోద్దేశ్యం. ఆర్థిక అణిచివేతల బాధితులు, ఆకలితో అలమటించేవారు జీవితంలోని అత్యున్నత లక్ష్యాలపై దృష్టిపెట్టలేరు, అలాంటి వారి పట్ల సానుభూతితో ఉదారంగా వ్యవహరించవలసిన అవసరం ఉంటుంది. ఆ కాలంలో అరబ్బు జనాభా చాలా వరకు ఇదే పరిస్థితిలో ఉంది. వారికి ఇస్లామీయ సత్యసందేశం ఎంత అవసరమో, ఆకలి తీర్చుకోవడానికి పట్టెడన్నం, దేహంపై కప్పుకోడానికి దుస్తులు కూడా అంతే అవసరం. ఇస్లామీయ ఆర్థిక సౌభ్రాత్ర వ్యవస్థ ఉన్న మదీనాలో ప్రజలు భౌతికపరమైన ఆందోళనలు కష్టాల నుంచి బయటపడి జీవితానికి సంబంధించిన అత్యున్నత విలువల గురించి ఆలోచించే అవకాశాన్ని పొందారు. ఈ విధంగా ఇస్లామీయ సందేశ ప్రచారానికి ఎదురయ్యే అవరోధాలన్నిం టిని తొలగించడం జరిగింది. ఇస్లామీయ ఆర్థిక వ్యవస్థ పూర్తిస్థాయిలో వికసించడానికి మరికొంత సమయం పట్టి ఉండవచ్చు, కాని ప్రారంభం నుంచి ప్రజలు ఇస్లామ్ సందేశాన్ని పొందడంతో పాటు, ఆర్థిక సమస్యల పరిష్కారానికి మదీనా వైపు చూడడం ప్రారంభించారు.

## అధ్యాయం - 7

# ప్రవక్త ముహమ్మద్ (స) సంబంధాలు

ప్రవక్త ముహమ్మద్ (స) వంశవృక్షం 32 తరాల వెనుక ప్రవక్త ఇబ్రాహీమ్ (అస)తో కలుస్తుంది. అరేబియాలోని చాలా తెగల వంశ వృక్షాలు ప్రవక్త ముహమ్మద్ (స) పూర్వీకులతో సంబంధాలు కలిగి ఉన్నవే. ఈ వంశవృక్షాన్ని ప్రవక్త (స) చాలా గౌరవించేవారు. ఈ వంశపరమైన సంబంధాలు కూడా చాలా వరకు ఇస్లామ్ వ్యాప్తికి దోహదం చేసి ఉండవచ్చు. నిజానికి ఇస్లామ్‌లోని చాలా మంది ప్రముఖులు, ప్రవక్త (స)కు సన్నిహిత సహచరులు వంశపరంగా ఆయన పూర్వీకుల నుంచి వచ్చినవారే. ఉదాహరణకు హజ్రత్ ఉమర్ (రజి) వంశవృక్షం ప్రవక్త ముహమ్మద్ (స) వంశానికి చెందిన పూర్వీకుడు కాబ్‌తో కలుస్తుంది. హజ్రత్ ఉబైదా కూడా కాబ్ వంశం నుంచి వచ్చినవారే. హజ్రత్ ఆమినా (ప్రవక్త ముహమ్మద్ (స) తల్లిగారు) పూర్వీకుడు కిలాబ్. కిలాబ్ సోదరుడు తియామ్. హజ్రత్ అబూబక్ర్ (రజి) ఈయన వంశం నుంచి వచ్చినవారు. మనాఫ్ వంశానికి చెందిన వారు సాద్. కాబాగృహం తాళం చెవుల సంరక్షకుడు ఉస్మాన్ బిన్ తల్హా వంశంలో ఖుసై పూర్వీకుడు. ఖుసై వంశం నుంచే హజ్రత్ జుబేర్ వచ్చారు. ఖుసై వంశానికి చెందిన వారే హజ్రత్ ఖదీజా (రజి). వరకా బిన్ నౌఫల్ ఆమెకు సోదరుడు. హారిస్ బిన్ అబ్దుల్ ముత్తలిబ్ బిన్ అబ్ద్ మనాఫ్‌కు ముగ్గురు కుమారులు. అబూ ఉబైదా (బద్ర్ యుద్ధంలో మరణించాడు), తుఫైల్, హిసీన్ వీరు ప్రవక్త (స)కు ప్రముఖ అనుచరులు. ఇమామ్ షాఫీ వంశం కూడా అబ్దుల్ ముత్తలిబ్‌కు సంబంధించిన వంశమే. అబ్ద్ మునాఫ్ ద్వారా హజ్రత్ ఉస్మాన్ (రజి) కూడా ఆయనతో వంశపరమైన సంబంధాలు కలిగిఉన్నారు.

ప్రవక్త ముహమ్మద్ (స) పినతండ్రుల విషయంలో కొన్ని భేదాభిప్రాయాలున్నాయి. వీరిలో ఇద్దరి గురించి వివరాలు లభించడం లేదు. ఇందులో ఒక పిన



తండ్రి జిరార్ చిన్నప్పుడే చనిపోయారు. మిగిలిన పినతండ్రులు ఇస్లామీయ చరిత్రలో కనబడతారు. వారి వివరాలు నమోదై ఉన్నాయి. ఇందులో ఒక పినతండ్రి హారిస్ ఇస్లామ్ రాకముందే మరణించారు. ఇతని నలుగురు కుమారులు నుఫాల్, అబ్దుల్లా, రాబియా, అబూసుఫ్యాన్ ముగీరా. వీరంతా ముస్లిములుగా మారారు. ఇస్లామ్‌కు ఎన్నో సేవలు చేశారు. మక్కా విజయం తర్వాత రాబియా రక్తపరిహారాన్ని ప్రవక్త ముహమ్మద్ (స) క్షమించారు. అజ్ఞానకాలం నాటి రక్తపరిహారాలన్నీ రద్దు చేశారు. మరో పినతండ్రి అబూతాలిబ్. ఈయన జీవితాంతం ప్రవక్త ముహమ్మద్ (స)కు సంరక్షకుడిగా ఉన్నారు. ఈయన ఇస్లామ్‌కు ఎంతో సేవ చేశారు. ఆయన కుమారులు నలుగురిలో ముగ్గురు ఇస్లామ్ స్వీకరించారు. ఇస్లామీయ చరిత్రలో ఆఖిల్ బిన్ అబూ తాలిబ్, హజ్రత్ జాఫర్, హజ్రత్ అలీ (రజి)ల పేర్లు తెలియని ముస్లిమ్ బహుశా ఎవరూ ఉండరు. అలాగే అబూతాలిబ్ ఇద్దరు కుమార్తెలు ఉమ్మె హానీ, జమాన్‌లు ముస్లిములుగా మారారు. ఇందులో ఉమ్మె హానీ పేరు ప్రముఖంగా చరిత్రలో కనబడుతుంది. ప్రవక్త ముహమ్మద్ (స) గగనారోహణ సంఘటనకు సంబం ధించి ఈమె పేరు ప్రముఖంగా ప్రస్తావనకు వస్తుంది. ఆయన పినతండ్రుల్లో హజ్రత్ హంజా (రజి) ఒకరు. ఉహుద్ యుద్ధంలో ఈయన అమరగతులయ్యారు. హింద్ ఆయన మృతశరీరాన్ని క్రూరంగా చీల్చింది. ఆయన కాలేయాన్ని పైకిలాగి నమిలింది. ఇది ప్రవక్త ముహమ్మద్ (స)ను చాలా విషాదంలో ముంచిన దుర్ఘటన. అబూజహల్ ప్రవక్త ముహమ్మద్ (స)ను వేధించడం చూసి భరించలేని హజ్రత్ హంజా (రజి) అతడిని సవాలు చేస్తూ ఇస్లామ్ స్వీకరించారు. మరో పినతండ్రి అబ్బాస్ బిన్ అబ్దుల్ ముత్తలిబ్. ఈయన మక్కాలోనే ఉండి అక్కడి పరిణామాల గురించి ప్రవక్త ముహమ్మద్ (స)కు నివేదించేవారు. ఇస్లామీయ ఉద్యమం క్లిష్టపరిస్థితులను దాటి వచ్చిన తర్వాత ఈయన ఇస్లామ్ స్వీకరించినట్లు ప్రకటించారు. మరో పినతండ్రి జుబైర్ ప్రవక్త ముహమ్మద్ (స) ప్రవక్తగా మారక ముందే మరణించారు. ఆయన చాలా మంచి స్వభావం కలిగిన వ్యక్తి. హిల్ఫుల్ ఫుజూల్ అనే శాంతి ఒప్పందం విషయంలో ఆయన కీలక పాత్ర పోషించారు. ఆయన కుమారుడు అబ్దుల్లా బిన్ జుబేర్ ఇస్లామీయ చరిత్రలో ఎంతో ప్రఖ్యాతి పొందారు. మరో పినతండ్రి అబూలహబ్. ఇతను ప్రవక్త ముహమ్మద్ (స) పట్ల తీవ్ర విద్వేషాన్ని ప్రదర్శించాడు. శత్రుశిబిరంలో అత్యంత చురుకుగా వ్యవహరించిన నాయకుడు.

ఇతడి భార్య కూడా ప్రవక్త (స)ను విపరీతంగా ద్వేషించేది. ప్రవక్త (స)కు కష్టాలు కలుగజేసి ఆనందించేది. ఇతను అత్యంత హీనంగా మరణించాడు. ప్లేగుతో మరణించిన ఇతడి మృతదేహానికి మూడు రోజుల పాటు అంత్యక్రియలు కూడా జరగలేదు. దగ్గరకు వెళ్ళడానికి ప్రజలు భయపడ్డారు. చివరకు ఒక ఇంటి పైకప్పు నుంచి మృతదేహంపై రాళ్ళు విసిరారు. శవం కనబడకుండా సమాధి అయ్యే వరకు ఇలా రాళ్ళు విసిరి సమాధి చేశారు. ఇతడి భార్య ఒక తాడుతో ఉరి వేసుకుని చనిపోయింది. అబూలహబ్ ఇద్దరు కుమారులు ముస్లిమేతరు లుగానే మరణించారు. మరో ఇద్దరు కుమారులు హునైన్ యుద్ధంలో ప్రవక్త ముహమ్మద్ (స) చేతుల మీదుగా ఇస్లామ్ స్వీకరించారు. అబూలహబ్ కుమార్తె దుర్రా కూడా ఇస్లామ్ స్వీకరించింది.

ప్రవక్త (స) మేనత్తల్లో ఉమ్మె హాకిమ్ బైజా ఒకరు. అబ్ద్ మనాఫ్ వంశానికి చెందిన కుజైర్ బిన్ రాబియా భార్య. ఈమె కుమారుడు ఆమిర్ ఇస్లామ్ స్వీకరించాడు. మక్కా విజయం రోజునే ఇతను ఇస్లామ్ స్వీకరించాడు. ఇతని కుమారుడు అబ్దుల్లా బిన్ ఆమిర్ హజ్రత్ ఉస్మాన్ (రజి) ఖలీఫాగా ఉన్న కాలంలో ఖురాసాన్ ప్రాంతానికి గవర్నర్‌గా నియమించబడ్డాడు. ఉమ్మె హాకిమ్ కుమార్తె ఉర్వి హజ్రత్ ఉస్మాన్‌కు తల్లి. ప్రవక్త (స)కు మరో మేనత్త ఉనైమా. ఈమె వివాహం జహ్షా బిన్ రబాబ్‌తో జరిగింది. ఈమె కుమార్తెల్లో ఉమ్మె హబీబా ఒకరు. అబ్దుర్రహ్మాన్ బిన్ ఔఫ్‌తో ఈమె వివాహం జరిగింది. మరో కుమార్తె హమ్నా. ఈమె వివాహం మొదట ముసాబ్ బిన్ ఉమైర్‌తో జరిగింది. తర్వాత తల్హా బిన్ అబ్దుల్లాను వివాహం చేసుకున్నారు. ఆమె రెండవ వివాహం ద్వారా ఇద్దరు కుమారులు కలిగారు. వారు ముహమ్మద్, ఇమ్రాన్‌లు. వీరిద్దరు ఇస్లామ్‌కు దృఢంగా కట్టుబడిన ముస్లిములుగా పేరుపడ్డారు. అబ్దుల్లా బిన్ జహ్షా ఉహుద్ యుద్ధంలో మరణించారు. ఆయన మేనమామ హజ్రత్ హంజా (రజి)తో పాటు సమాధి అయ్యారు. ప్రవక్త(స) మూడవ మేనత్త ఆతికా. బద్ర్ యుద్ధానికి ముందు ఈమె ఈ యుద్ధానికి సంబంధించి కలగన్నారు. ఆ తర్వాత బనూ హాషిమ్ అమ్మాయిలు కూడా ఇక ప్రవక్తలైపోతున్నారని కొందరు ఎగతాళి చేశారు. నాల్గవ మేనత్త హజ్రత్ సఫియా. ఈమె మొదట హజ్రత్ హారిస్ బిన్ ఉమయ్యాను వివాహం చేసుకున్నారు. వితంతువైన తర్వాత అవ్వామ్ బిన్ ఖ్వాలిద్‌ను వివాహమాడారు. ఈ వివాహం ద్వారా పుట్టిన వారే హజ్రత్ జుబేర్. ఈయన్ను ఇబ్నుల్ అవ్వామ్ అని కూడా అంటారు. జిహాద్‌లో ముఖ్యభూమిక



పోషించారు. ఈమె వరుసకు సోదరుడైన హజ్రత్ హంజా (రజి) మృతదేహం క్రూరంగా చీల్చి ఉండడాన్ని చూసి ఎంతో సహనంతో వ్యవహరించి ఆదర్శంగా నిలిచారు. ప్రవక్త ముహమ్మద్(స) ఐదవ మేనత్త బరాహ్. అబ్దుల్ అసద్ బిన్ హిలాల్‌ను పెళ్ళా డారు. ఈమె కుమారుడు అబూ సల్మా. హజ్రత్ ఉమ్మె సల్మాకు మొదటి భర్త అబూ సల్మా.

ప్రవక్త (స) మేనత్తల్లో ఒకరు ఉమైర్ బిన్ వహ్బాను వివాహం చేసుకున్నారు. ఆమె కుమారుడు తులాబ్ ఇస్లామ్ స్వీకరించాడని తెలిసినప్పుడు అతనికి లేఖ రాస్తూ ఇలా పేర్కొన్నారు :

"నీ మేనమామ కుమారుడు నీ సేవకు ఎంతయినా పాత్రుడు. దేవుని తోడు, మహిళలం మేము కూడా పురుషుల మాదిరిగా బలం కలిగి ఉన్నట్లయితే ఆయన్ను కాపాడుతూ, ఆయన శత్రువులను ఎదిరించి ఉండేవాళ్ళం"

ఈ పదాల్లో ధర్మవిశ్వాసంతో పాటు తన మేనల్లుడి పట్ల ఒక మేనత్తకు ఉండే ప్రేమాభిమానాలు కూడా మనకు తెలుస్తున్నాయి.

ప్రవక్త ముహమ్మద్ (స) తండ్రి అబ్దుల్లా గారి తల్లి ఫాతిమా బింతె అమ్ర్. ఆమె మదీనాలోని బనూ నజ్జార్‌కు చెందిన ఉన్నత వంశస్థురాలు. అలాగే ప్రవక్త ముహమ్మద్ (స) తాతగారి తండ్రిగారు హాషిమ్. ఈయన కూడా మదీనా ఖజ్‌రజ్ తెగకు చెందిన హింద్ బింతె అమ్ర్ బిన్ తాలాబాను వివాహం చేసుకున్నారు. అందువల్లనే ప్రవక్త తండ్రిగారు అబ్దుల్లాకు మదీనా పట్ల ఎంతో అభిమానం ఉండేది. యాధృచ్ఛికంగా ఆయన ఒక వ్యాపార పర్యటనలో ఉన్నప్పుడు మదీనా దగ్గరే మరణించారు. అక్కడే ఆయన్ను సమాధి చేశారు. ప్రవక్త (స) ఐదేళ్ళ ప్రాయంలో ఉన్నప్పుడు ఆయన్ను వెంటబెట్టుకుని తల్లిగారు తన బంధువులను కలుసుకోవడానికి మదీనా వెళ్ళారు. అక్కడ ఆమె తన భర్త సమాధిని సందర్శించారు. అప్పుడు నెలరోజుల పాటు ప్రవక్త (స) అక్కడ ఉన్నారు. ప్రవక్త ముహమ్మద్ (స) మక్కా నుంచి మదీనా వలస వచ్చినప్పుడు 47 సంవత్సరాల క్రితం జరిగిన ఆ సంఘటనలను గుర్తు చేసుకున్నారు. ప్రవక్త (స) కొన్ని సందర్భాల్లో గత స్మృతులను నెమరు వేసుకుంటూ అప్పట్లో మదీనాలో తనతో పాటు అనీసా అనే అమ్మాయి ఆడుకునేదని చెప్పేవారు. ఆ ఇంట్లో ఒక ప్రత్యేక ప్రదేశంలో తన తల్లి ఎలా కూర్చుని ఉండేదో గుర్తు చేసుకునే వారు. అక్కడ ఉన్న తన తండ్రిగారి సమాధి గురించి చెప్పేవారు. తాను బనీ అదీ

బిన్ అన్నజ్జార్ చెరువులోనే ఈత నేర్చుకున్నానని కూడా చెప్పేవారు. ఇక్కడి నుంచి తిరుగు ప్రయాణమవుతున్నప్పుడు ప్రవక్త తల్లిగారు అబ్వా అన్న ప్రదేశంలో మరణించారు. ఈ ప్రాంతాలతో ప్రవక్త (స)కు ఉన్న ఈ సంబంధాలు ఇస్లామీయ ఉద్యమంలో తప్పనిసరిగా ఉపయోగపడి ఉంటాయి. మదీనా ప్రజలు ముఖ్యంగా బనూ నజ్జార్ తెగ ఆయన్ను తమ సన్నిహిత బంధువుగా భావించేవారు. మదీనాలో ప్రవక్త (స)కు స్వాగతం పలికిన తెగల్లో బనూ నజ్జార్ అందరికన్నా ఎక్కువ ఉత్సాహం చూపించారు. ఈ తెగ బాలికలు పాటలు పాడుతూ స్వాగతం పలికారు.

ప్రవక్త (స) పుట్టినప్పుడు అబూలహబ్ ఇంటి బానిస స్త్రీ కొంత కాలం పాలు పట్టింది. ఆమె పేరు సౌబియా. ఆమె పట్ల ప్రవక్త (స) ఎంత అభిమానంగా ఉండే వారంటే మదీనా నుంచి ఆమెకు దుస్తులు పంపించేవారు. ఆయనకు బాల్యంలో దాదీగా బనూ హవాజిన్ తెగకు చెందిన హలీమా సాదియా ఉన్నారు. ఆమె కుమార్తె హుజాఫా (అష్షమా అని కూడా పిలుస్తారు) చిన్నప్పుడు ప్రవక్త (స)కు సేవలు చేశారు. హునైన్ యుద్ధంలో ఆమె యుద్ధఖైదీగా మదీనా తీసుకురాబడింది. ఆమె ముస్లిమ్ సైనికులతో తాను వాళ్ళ నాయకుడికి పెంపుడు సోదరినని చెప్పింది. వెంటనే ఆమెను ప్రవక్త (స) వద్దకు తీసుకువచ్చారు. ఆయన వెంటనే ఆమెను అత్యంత గౌరవాదరాలతో స్వాగతించారు. ఒక దుప్పటి పరిచి ఆమెను కూర్చో మన్నారు. ఆయన కళ్ళు చెమర్చడం అక్కడ అందరూ చూశారు. ఆ తర్వాత ఆమెతో నీవు కావాలంటే నా దగ్గర ఉండవచ్చు. నీ తెగకు వెళ్ళాలనుకుంటే అక్కడికి పంపించే ఏర్పాటు చేస్తానన్నారు. ఆమె తన తెగకు వెళతానని చెప్పింది. వెంటనే ప్రవక్త (స) ఆమె ప్రయాణానికి ఏర్పాట్లు చేయించడమే కాదు, ఆమె వెళ్ళేటప్పుడు ఎన్నో కానుకలతో సత్కరించి పంపించారు. తర్వాత కొంతకాలానికి ఆమె ఇస్లామ్ స్వీకరించింది. ఈ పెంపుడు సంబంధాల కారణంగానే హునైన్ యుద్ధం తర్వాత బనూ హవాజిన్ తెగ ప్రతినిధి బృందం యుద్ధఖైదీల విషయంలో మాట్లాడడానికి ప్రవక్త ముహమ్మద్ (స) వద్దకు వచ్చింది. యుద్ధఖైదీల్లో ఖురైషు వంశానికి పంపిణీ అయిన వారందరినీ ప్రవక్త (స) వెంటనే విడుదల చేయించారు. ఇది చూసి ఇతరులు కూడా తమ వాటాగా వచ్చిన యుద్ధఖైదీలను విడుదల చేశారు.

హజ్రత్ జైనబ్ వివాహం అబుల్ ఆస్ బిన్ రాబియాతో మక్కాలో జరిగింది. ప్రవక్త ముహమ్మద్ (స) భార్య హజ్రత్ ఖదీజా (రజి) సోదరి అబుల్ ఆస్‌కు తల్లి. ఆ



విధంగా అబుల్ ఆస్‌కు ప్రవక్త (స) మేనమామ వరుస అవుతారు. హజ్రత్ జైనబ్ తన తల్లితో పాటు ఇస్లామ్ స్వీకరించి మదీనా వలస వచ్చారు. ఆ తర్వాత అబుల్ ఆస్ కూడా ఇస్లామ్ స్వీకరించి మదీనా వచ్చారు. ఈ భార్యాభర్తలది అన్యోన్య దాంపత్యం. అబుల్ ఆస్ ఇస్లామ్ స్వీకరించక ముందు మక్కాలోని ఖురైషులు ఇస్లామ్ స్వీకరించిన భార్యకు విడాకులివ్వాలని ఆయనపై తీవ్రమైన ఒత్తిడి తీసుకువచ్చారు. కాని అతను నిర్ద్వంద్వంగా నిరాకరించాడు. ఈయనకు ప్రవక్త ముహమ్మద్ (స)తో ఉన్న బంధుత్వం వల్లనే ఆయన యుద్ధఖైదీగా మదీనా వచ్చినప్పుడు ఎలాంటి పరిహారం లేకుండా ఆయన్ను విడుదల చేయడం జరిగింది. అందుగ్గాను ముస్లిములందరి అనుమతి తీసుకోవడం కూడా జరిగింది. అంతేకాదు, అంతకు ముందు స్వాధీనం చేసుకున్న అతడి వ్యాపార సామగ్రిని కూడా తిరిగి ఇచ్చేశారు.

హజ్రత్ రుఖయ్యా హజ్రత్ ఉస్మాన్ (రజి)ను మక్కాలో వివాహం చేసుకున్నారు. అబిసీనియాకు వెళ్ళిన మొదటిదశ ప్రవాసుల్లో ఈ దంపతులు కూడా ఉన్నారు. హిజ్రీ శకం రెండవ సంవత్సరంలో ఆమె మరణించారు. హిజ్రీ శకం మూడవ సంవత్సరంలో ప్రవక్త ముహమ్మద్(స) తన మరో కుమార్తె ఉమ్మె కుల్సుమ్‌ను హజ్రత్ ఉస్మాన్ (రజి)కు ఇచ్చి వివాహం చేశారు. ప్రవక్త(స) మరో కుమార్తె హజ్రత్ ఫాతిమా (రజి)ను హజ్రత్ అలీ (రజి)కు ఇచ్చి వివాహం చేశారు. ఈ విధంగా ఇస్లామీయ ఉద్యమంలోని ప్రముఖ నాయకులు వంశవృక్షం పరంగాను, వివాహ సంబంధాల పరంగాను సన్నిహిత బంధువులు.

## ప్రవక్త ముహమ్మద్ (స) వివాహాలు

యూరోపు ప్రాచ్యశాస్త్రవేత్తలు పక్షపాతపూరితంగా వ్యవహరిస్తూ ప్రవక్త ముహమ్మద్ (స) వివాహాల గురించి చాలా వివాదాన్ని రేపారు. అందువల్ల ఈ విషయానికి సంబంధించి వివరాలు తెలుసుకోవడం ఎంతయినా అవసరం.

చరిత్రలో ప్రవక్త ముహమ్మద్ (స) అవతరణకు పూర్వం వరకు ఉన్న కాలం బహుభార్యత్వం సర్వసాధారణంగా ఉన్న కాలం. అప్పటి సామాజిక వ్యవస్థల్లో బహు భార్యత్వం అంతర్భాగం. అప్పట్లో సువిశాల భూభాగాలు ఖాళీగా పడి ఉండేవి. జనాభా చాలా తక్కువగా పలుచగా ఉండేది. జీవనోపాధి వనరులు చాలా వరకు నిరుపయోగంగానే పడి ఉండేవి. మానవ వనరుల అవసరం ఎక్కువగా

ఉండేది కాబట్టి జనాభా పెరగవలసిన అవసరం కూడా ఉండేది. అందువల్ల చాలా మంది ప్రవక్తలు, ఇస్రాయీల్ ప్రవక్తల్లో కూడా చాలా మంది బహుభార్యలను కలిగి ఉన్న వారే. జనాభా పెంచడం అవసరమైన కాలం చివరి దశలో ప్రవక్త ముహమ్మద్ (స) వచ్చారు. కేవలం ఆయన ద్వారా మాత్రమే చరిత్రలో మొదటిసారిగా వివాహాల సంఖ్యను పరిమితం చేయడం జరిగింది. ప్రవక్త ముహమ్మద్ (స) చేసుకున్న వివాహాలు ఆనాటి సామాజికవ్యవస్థలో అమల్లో ఉన్న వైవాహిక సంప్రదాయాలకు అనుగుణంగానే జరిగాయి. వివాహాల సంఖ్యపై పరిమితి విధించే దైవాదేశం వచ్చిన తర్వాత ఆయన వివాహం చేసుకోలేదు. నిజానికి ప్రవక్త ముహమ్మద్ (స) కేవలం రెండే రెండు వివాహాలు తన పరంగా చేసుకున్నారు. మొదటి వివాహం హజ్రత్ ఖదీజా (రజి)తో జరిగింది. రెండవ వివాహం హజ్రత్ ఆయేషా (రజి)తో జరిగింది. మిగిలిన వివాహా లన్నీ వివిధ కారణాల వల్ల, కొన్ని అత్యవసర సందర్భాల్లో చేసుకున్న వివాహాలు. నిజానికి ప్రవక్త ముహమ్మద్ (స) దైనందిన కార్యకలాపాల్లో పని ఒత్తిడి, ఆయన గడిపే నిరుపేద జీవితాన్ని దృష్టిలో ఉంచుకుంటే వివిధ ఉద్యమ అవసరాల కోసం ఆయన చేసుకున్న వివాహాలు, ఆ వివాహాల ద్వారా ఇంత మంది భార్యలను స్వీకరిం చడం నిజానికి ఆయన చేసిన త్యాగంగా భావించవలసి ఉంటుంది. ఇక్కడ దృష్టిలో ఉంచుకోవలసిన మరో వాస్తవమేమంటే మద్యపానం, వ్యభిచారం సర్వ సాధారణంగా ఉన్న సమాజంలో 25 సంవత్సరాల పాటు నైతికంగా అత్యుత్తమ జీవితం గడిపిన యువకుడు 25 సంవత్సరాల వయసులో వివాహానికి ఎన్నుకుంది అందమైన అమ్మాయిని కాదు, 40 సంవత్సరాల వితంతువును. ఆమెను పెళ్ళి చేసుకున్న తర్వాత మరో 25 సంవత్సరాల పాటు ఆ ఒక్క భార్యతోనే ఉన్నారు. ఇలాంటి వ్యక్తి, తనకు మహిళల విషయంలో లైంగికేచ్ఛ ఏదీ లేదని స్వయంగా ప్రకటించిన వ్యక్తి కామంతో వ్యవహరించాడని చెప్పడం ఉచితమా? ఇక్కడ చాలా మందికి తెలియని విషయ మేమంటే ప్రవక్త ముహమ్మద్ (స) బహుభార్యలను స్వీకరించడం అన్నది 55 సంవత్స రాల వయసు నుంచి 59 సంవత్సరాల వయసు వరకు కేవలం నాలుగు సంవత్సరాల కాలంలో జరిగింది. ఈ భార్యల్లో ఇద్దరు మినహా మిగిలిన వారి వయసులు 36 నుంచి 50 సంవత్సరాల మధ్య ఉంటుంది. ఆయన పెళ్ళాడాలనుకుంటే తక్కువ వయసున్న అందమైన కన్యలు దొరకరా? మరో విషయం దృష్టిలో ఉంచుకోవలసింది ఏమంటే ప్రవక్త ముహమ్మద్ (స)



ఉద్యమ బాధ్యతల దృష్ట్యా ఆయనకు విశ్రాంతి తీసుకునే సమయమే లభించేది కాదు. ఆయన సమయంలో ఎక్కువ భాగం మదీనా రాజ్యవ్యవహారాలు చక్కదిద్దడానికే సరిపోయేది. సమాజంలోని సమస్యల పరిష్కారానికే సరిపోయేది. ఇక మిగిలిన సమయంలోనూ ఆయన ఎక్కువ భాగం ప్రార్థనల్లో తన కాళ్ళు వాచిపోయే వరకు నిలబడేవారు. అలాంటి మనిషి లైంగికేచ్ఛతో బహుభార్యలను స్వీకరించాడని ఆరోపించడం సముచితమా? పధ్నాలుగు వందల సంవత్సరాల క్రితం నాటి పాలకులు, విజేతలు, చక్రవర్తుల జీవితాలను ఆయన జీవితంతో పోల్చితే మనకు ఎక్కడా పోలిక కనబడదు. ఆయన ఎన్నడూ అతిగా వ్యవహరించలేదు, మద్యం, నృత్యం, గానాల పట్ల ఆయనకు ఆసక్తి లేనేలేదు. ఖరీదైన ఆడంబరాల దుస్తులు ఆయన ధరించలేదు. తన భార్యలకు ఖరీదైన సిల్కు వస్త్రాలు, వెండి బంగారాలు కొనిపెట్టలేదు. ఉద్యమ ప్రయోజనాలకు ప్రథమ ప్రాధాన్యం ఇచ్చారే కాని భార్యల కోరికలకు కాదు. ఒక సందర్భంలో తమ ఖర్చులకు ఇస్తున్న మొత్తం చాలడం లేదని, దాన్ని పెంచాలని ప్రవక్త (స) భార్యలు కోరితే ఆయన వారితో నిరుపేద జీవితంతో సంతృప్తి చెందేదయితేనే తనతో ఉండమని లేకపోతే వారికి గౌరవాదరాలతో వివాహబంధం నుంచి విముక్తి ఇస్తానని చెప్పారు. ఇక్కడ గమనించవలసిన ముఖ్యమైన విషయమేమంటే, ఆ కాలంలోని తెగల వ్యవస్థలో తెగలతో బంధుత్వ సంబంధాలకు అత్యంత ప్రాముఖ్యం ఉండేది. అరేబియాలో ఏదైనా ప్రముఖమైన తెగకు చెందిన గుర్తింపు లేనట్లయితే ప్రవక్త (స) ప్రారంభించిన మాదిరి సంస్కరణా ఉద్యమాన్ని ముందుకు నడుపడం సాధ్యం కాదు. కాబట్టి తన ఉద్యమ ప్రయోజనాల దృష్ట్యా వివిధ తెగల మధ్య సంబంధ బాంధవ్యాలు ఏర్పరచ వలసిన అవసరం ఆయనకు ఉంది.

ప్రవక్త (స) చేసుకున్న ప్రతి ఒక్క వివాహాన్ని పరిశీలిస్తే ఇందులో హజ్రత్ జువైరియా (రజి) బనూ ముస్తలఖ్ తెగకు చెందిన వారు. ఈ తెగ దోపిడీ వృత్తిగా ఉన్న తెగ. చాలా బలమైన తెగ. ఆమె తండ్రి పేరుమోసిన బందిపోటు. ఈ తెగ ప్రారంభం నుంచి ఇస్లామ్ పట్ల తీవ్రమైన విద్వేషం కలిగి ఉన్న తెగ. ప్రతి పోరాటం లోను వారు చురుగ్గా పాల్గొన్నారు. ఎలాంటి ఒప్పందానికి, అంగీకారానికి సిద్ధ పడలేదు. చివరకు సైనికచర్య ద్వారా ఈ తెగను అణచవలసి వచ్చింది. పోరాటంలో యుద్ధ ఖైదీలుగా ఈ తెగ వారు చాలా మంది నిర్బంధితులయ్యారు. కాని ప్రవక్త

ముహమ్మద్ (స) హజ్రత్ జువైరియా (రజి)ను వివాహం చేసుకున్న తర్వాత ముస్లిములందరూ తమ వద్ద యుద్ధఖైదీలుగా ఉన్న ఈ తెగవారినందరినీ విడుదల చేశారు. ప్రవక్త (స) బంధువులను యుద్ధఖైదీలుగా ఉంచలేమని చెప్పారు. ఈ వివాహం తర్వాత మొత్తం తెగ దోపిళ్ళు మానేసింది. శాంతియుతంగా ఇస్లామీయ రాజ్యానికి విధేయంగా ఉండే పౌరుల్లా మారారు.

నజ్ద్ తెగ అత్యంత బలమైన తెగ. ఇస్లామ్ పట్ల వైరంలో మొండిగా వ్యవహరించే తెగ. ఈ తెగ నాయకుడి భార్యకు సోదరి హజ్రత్ మైమునా (రజి). ఇస్లామ్ ప్రచారానికి వచ్చిన 79 మంది సభ్యుల బృందంలో అందరినీ అత్యంత క్రూరంగా హతమార్చిన తెగ ఇది. హజ్రత్ మైమూనా (రజి)ను ప్రవక్త (స) వివాహం చేసుకున్న తర్వాత ఈ పరిస్థితి మారింది. నజ్ద్ తెగ మదీనా రాజ్యాధికారాన్ని ఒప్పుకుంది. హజ్రత్ మైమూనా (రజి) సోదరీమణులు చాలా మంది ఈ తెగలోని అనేక మంది నాయకులకు భార్యలు.

హజ్రత్ ఉమ్మె హబీబా (రజి) ఖురైష్ నాయకుడు అబూసుఫ్యాన్ కుమార్తె. హజ్రత్ ఉమ్మె హబీబా (రజి)ను ప్రవక్త (స) వివాహం చేసుకున్న తర్వాత అబూ సుఫ్యాన్ ఎన్నడూ ప్రవక్త (స)కు వ్యతిరేకంగా పోరాడలేదు. మక్కా విజయానికి ఈ వివాహం కూడా ఒక కారణం.

హజ్రత్ సఫియా (రజి) ఒక ప్రముఖ యూద నాయకుడు హుయ్ బిన్ అక్తబ్ కుమార్తె. యుద్ధంలో ఖైదీగా పట్టుబడ్డారు. ఆమె కుటుంబ హోదా కారణంగా సాధారణ ముస్లిమ్ కుటుంబంలో ఆమెను పంపడం ఉచితం కాదు. కాబట్టి ప్రవక్త (స) స్వయంగా ఆమెను వివాహం చేసుకున్నారు. ఈ వివాహం తర్వాత ఆమె తెగ యూదులు ప్రవక్త (స) పట్ల వైరాన్ని కొనసాగించలేదు. ప్రవక్త (స) అనుమతితో హజ్రత్ సఫియా (రజి) తన యూద బంధువులకు ఆర్థిక సహాయం పంపేవారు.

హజ్రత్ హఫ్సా (రజి) వివాహం విషయానికి వస్తే, ప్రవక్త (స) అనుచరులతో ఆయనకు బంధుత్వ సంబంధాలున్నాయి. ప్రవక్త (స) సహచరులే ఆయనకు సలహాదారులు, భవిష్యత్ నాయకత్వానికి వారినే ఆయన సిద్ధం చేస్తున్నారు. ఆయన హజ్రత్ అబూబక్ర్ (రజి) కుమార్తెను వివాహం చేసుకున్నారు. తన ఇద్దరు కుమార్తెలను హజ్రత్ ఉస్మాన్ (రజి)కు ఇచ్చి వివాహం చేశారు. మరో కుమార్తె హజ్రత్ ఫాతిమా (రజి)ను హజ్రత్ అలీ (రజి)కు ఇచ్చి వివాహం చేశారు. ప్రముఖ సహచరుల్లో ఒక్క హజ్రత్ ఉమర్ (రజి) మాత్రమే మిగిలిపోయారు. బంధుత్వ సంబంధాల చట్రం



నుంచి ఆయన్ను బయట ఉంచడం ఎలా సాధ్యం? ఆయన కుమార్తె హజ్రత్ హఫ్సా (రజి)ను వివాహమాడడం ద్వారా పటిష్టమైన బంధుత్వ సంబంధాన్ని ఏర్పరచుకున్నారు. ఇస్లామీయ ఉద్యమంలోని ప్రముఖులందరికీ ఈ విధంగా బంధుత్వ సంబంధాలున్నాయి.

కొన్ని సందర్భాల్లో గాయపడిన మనోభావాలను ఊరడించడానికి కూడా వివాహాలు ఉపయోగపడతాయి. ప్రవక్త ముహమ్మద్ (స) తన మేనత్త కుమార్తె హజ్రత్ జైనబ్ (రజి) వివాహం మొదట తాను స్వేచ్ఛ ప్రసాదించిన బానిస జైద్ బిన్ హారిస్ (రజి)తో చేశారు. జైద్‌ను ప్రవక్త (స) తన కుమారుడిగా దత్తత చేసుకున్నారు. ఈ వివాహం ద్వారా జైద్‌తో సంబంధం మరింత పటిష్టమవుతుందని అనుకున్నారు. కాని ఈ వివాహం విఫలమైంది. చివరకు వారిద్దరు విడాకులు తీసుకున్నారు. హజ్రత్ జైనబ్ (రజి) ఒంటరి అయ్యారు. ఈ విషయంలో ప్రవక్త (స) తన బాధ్యత స్వీకరించాలనుకున్నారు. అంతేకాదు, అప్పట్లో అరబ్బుల్లో ఉన్న మరో సంప్రదాయాన్ని కూడా ఆయన తొలగించాలనుకున్నారు. దత్తత తీసుకున్న కుమారుడు జన్మనిచ్చిన కుమారుడికి సమానం కాదు. ఈ విషయాన్ని చాటి చెప్పాలని కూడా అనుకున్నారు. హజ్రత్ జైనబ్ (రజి)ను వివాహం చేసుకోవడం ద్వారా ఈ రెండు లక్ష్యాలు నెరవేరాయి.

ఉమ్మె హబీబా (రజి)తో ప్రవక్త ముహమ్మద్ (స) వివాహానికి ఉన్న రాజకీయ ప్రాముఖ్యం గురించి ఇంతకు ముందు ప్రస్తావించుకున్నాము. ఆమె అబూసుఫ్యాన్ కుమార్తె. ఈ వివాహానికి సంబంధించి మరిన్ని వివరాలు కూడా తెలుసుకోవడం అవసరం. ఆమె వివాహం మొదట ఉబైదుల్లాతో జరిగింది. వారిద్దరు ఇస్లామ్ స్వీకరించి అబిసీనియా వలస వెళ్ళారు. అక్కడ ఉబైదుల్లా క్రయిస్తవ మతం స్వీకరించాడు. అంతేకాదు మద్యపానానికి అలవాటు పడ్డాడు. చివరకు మద్యమే అతని ప్రాణాలు తీసింది.

ఉమ్మె హబీబా (రజి) ఇస్లామ్‌కు దృఢంగా కట్టుబడి జీవించారు. తన భర్త క్రయిస్తవుడిగా మారడం, మద్యానికి బానిసై మరణించడం ఆమెను కుదిపేసిన విషాద సంఘటనలు. సానుభూతి, ఊరడింపు అవసరమైన విషాదంలో ఉన్నారామె. ఈ కాలంలో ప్రవక్త (స) అబిసీనియా రాజు నీగస్ వద్దకు అమ్ర్ బిన్ ఉమయ్యా అజ్జమ్రీని పంపించారు. ఉమ్మెహబీబా (రజి)ను వివాహం చేసుకుంటానన్న ప్రతిపాదన చేశారు. ఈ సందేశం విని ఉమ్మె హబీబా (రజి) ఎంతో ఆనందించారు. తన వద్ద

ఉన్న ఆభరణాలన్నీ తన బానిస పిల్లకు ఇచ్చేశారు. అబిసీనియా రాజు నీగస్ స్వయంగా ప్రవక్త (స)తో ఉమ్మె హబీబా (రజి) వివాహాన్ని పరోక్ష పద్ధతిలో చేశారు. ఆమెకు స్త్రీధనంగా 400 బంగారు నాణాలు ఇవ్వడం జరిగింది. వివాహ విందు కూడా రాజు ఏర్పాటు చేశారు. ఆమె మదీనా వచ్చిన తర్వాత మళ్ళీ ప్రవక్త (స)తో వివాహం జరిగిందని, మదీనాలో కూడా పెళ్ళి విందు జరిగిందని కొన్ని నివేదికలున్నాయి.

ఉమ్మె మసాకీన్ జైనబ్ (రజి) హవాజిన్ తెగకు చెందిన ఖుజైమా బిన్ హారిస్ కుమార్తె. ఉహుద్ యుద్ధంలో ఆమె భర్త చనిపోయారు. ఆమెను వితంతు జీవితం నుంచి కాపాడ్డానికి ప్రవక్త (స) ఆమెను వివాహం చేసుకున్నారు.

ప్రవక్త ముహమ్మద్ (స)కు సంబంధించి పదకొండు వివాహాల వివరాలున్నాయి. అంతకు మించి వివాహాలు చేసుకున్నట్లు ఉన్న కథనాలు అతిశయోక్తులు తప్ప మరేమీ కాదు. ఇంతకన్నా ఎక్కువ సంఖ్యలో వివాహాల వివరాలు ఏవీ నిర్ధారణ కాలేదు. ప్రవక్త ముహమ్మద్ (స) భార్యల్లో హజ్రత్ ఖదీజా (రజి) ప్రవక్త (స) మదీనా వలస రాకముందే మరణించారు. ఖుజైమా కుమార్తె హజ్రత్ జైనబ్ (రజి)తో ఆయన వివాహం హిజ్రీ శకం మూడవ సంవత్సరంలో జరిగింది. వివాహమైన మూడు నెలలకే ఆమె మరణించారు. ప్రవక్త (స) చివరి రోజుల్లో ఆయనకు తొమ్మిది మంది భార్యలున్నారు. ఈ తొమ్మిది మందిలో హజ్రత్ సౌదా (రజి) దాంపత్య జీవితానికి దూరంగా ఉండేవారు. భార్యల సంఖ్యను పరిమితం చేస్తూ దైవాదేశాలు అవతరించిన తర్వాత ప్రవక్త (స) వివాహం చేసుకోలేదు. ఒకే సమయంలో నలుగురి కన్నా ఎక్కువ భార్యలుండరాదన్న ఆంక్ష విషయానికి వస్తే స్వయంగా దైవాదేశాలే ప్రవక్త (స)కు ఈ మినహాయింపునిచ్చాయి. తన వివాహాలన్నింటిని కొనసాగించవచ్చని పేర్కొన్నాయి. మరో విషయమేమంటే, ప్రవక్త ముహమ్మద్ (స) భార్యలు ముస్లిములకు మాతృమూర్తులుగా పరిగణన పొందారు. విడాకులిస్తే వారు ఒంటరి వారైపోతారు. అన్నింటికి మించి ప్రవక్త ముహమ్మద్ (స) భార్యలు ఇస్లామీయ జీవనవిధానాన్ని మహిళల్లో ప్రచారం చేయడానికి సేవలందించారు.

ప్రవక్త ముహమ్మద్ (స) వివాహాల రాజకీయ ప్రాముఖ్యం గురించి మనం ఆలోచిస్తే ఈ క్రింది తెగలు వివాహ సంబంధం వల్ల ప్రవక్త (స)కు, ఇస్లామీయ ఉద్యమానికి దగ్గరయ్యాయి.

1. బనీ అసద్ బిన్ అబ్దుల్ ఉజ్జా 2. బనీ అమీర్ బిన్ లూయ్ 3. బనీ తియామ్ 4. బనీ అదీ 5. బనీ మఖ్జూమ్ 6. బనీ ఉమయ్యా 7. బనీ అసద్ బిన్



ఖుజైమా 8. బనూ ముస్తలఖ్ 9. అరబ్బు యూదులు 10. బనూ కిలాబ్, కల్బ్, సాలిమ్ 11. బనూ కిందాహ్.

ఈ తెగలను భౌగోళికంగా చూస్తే ప్రవక్త ముహమ్మద్ (స) భౌగోళికంగా వివిధ ప్రాంతాల తెగలతో బంధుత్వం కలుపుకున్నారు. ఆ విధంగా అరేబియాలోని ప్రముఖ తెగలన్నింటిని సమైక్యం చేశారు. ఆ విధంగా ఇస్లామీయ ఉద్యమానికి ప్రతిఘటన తగ్గింది. వైరం విద్వేషాలు తగ్గుముఖం పట్టాయి. దీర్ఘకాలిక వైమనస్యాలు కూడా ఈ వివాహాల వల్ల పరిష్కారమయ్యాయి. ఆ విధంగా విశ్వజనీన శాంతి స్థాపనకు న్యాయ సంస్థాపనకు ఇవి తోడ్పడ్డాయి. ఆ విధంగా ఈ వివాహాలు సమాజానికి ఉపయోగపడ్డాయి. ప్రవక్త ముహమ్మద్ (స) బహువివాహాలు చేసుకోవడం, నిరుపేద జీవితాన్ని గడుపుతూ బహుభార్యలను స్వీకరించడం నిజానికి సమాజం కోసం చేసిన త్యాగమనే చెప్పాలి.

## చివరి దశ

ఇస్లామ్ మూలస్తంభాల్లో హజ్ యాత్ర ఒకటి. ఇస్లామ్‌లో హజ్ యాత్రకు ఎంతో ప్రాముఖ్యం ఉంది. ప్రతి ఏటా మక్కాలో జరిగే ముస్లిముల ఈ అంతర్జాతీయ సౌభ్రాత్ర సమావేశంలో పాల్గొన్న వారు, విశ్వజనీన సౌభ్రాత్ర స్ఫూర్తిని అనుభూతి చెందిన వారు మాత్రమే హజ్ యాత్రకు సంబంధించిన సాటిలేని ఔన్నత్యాన్ని, ప్రత్యేకతను, విశిష్టతను, అక్కడ కనబడే సమానత్వాన్ని, ప్రకటితమయ్యే సమగ్రతను తెలుసుకోగలరు. ప్రవక్త ఇబ్రాహీమ్ (అస) ఏకదైవారాధనకు పిలుపునిచ్చిన కేంద్రం అక్కడి పవిత్ర మస్జిదు. అక్కడి ప్రతి కణంలోను అమూల్యమైన ఇస్లామీయ చరిత్రకు సంబంధించిన చిహ్నాలున్నాయి. అక్కడి వాతావరణంలో ప్రవక్త ఇబ్రాహీమ్ (అస) ప్రార్థనలు ప్రతిధ్వనిస్తు ఉంటాయి. ఆయన దేవునికి మిత్రుడిగా పేరుపడ్డారు. అక్కడి పరిసరాల్లో ప్రవక్త (స) ఘనకార్యాల ఆనవాళ్ళున్నాయి. ఈ నగరం ఇస్లామీయ సందేశానికి కేంద్రం. ఇస్లామీయ ఉద్యమానికి కేంద్రం. స్తోమత ఉన్న ప్రతి ముస్లిమ్ ప్రవక్త ఇబ్రాహీమ్ (అస) ఆచరణల ఉదాహరణలను అనుకరించడం తప్పనిసరి. అంటే ఖుర్బానీ ఇవ్వడం, ఇస్లామీయ సౌభ్రాత్ర వ్యవస్థలోని ఇతర ప్రాంతాలకు చెందిన సోదరులను కలుసుకోవడం, అన్ని దిశల నుంచి ముఖం తిప్పుకుని కేవలం దేవునికి మాత్రమే పూర్తి దాస్యభావంతో విధేయత చూపడం, ప్రతి ముస్లిమ్‌కు తప్పనిసరి విధి. హజ్‌యాత్ర విధిగా నిర్దేశిస్తూ హిజ్రీ శకం 9వ శతాబ్దంలో దైవాదేశాలు అవతరించాయి. అదే సంవత్సరం ప్రవక్త ముహమ్మద్ (స) హజ్రత్ అబూబక్ర్

(రజి)కు హజ్‌యాత్ర పర్యవేక్షణ బాధ్యత అప్పగించారు. అక్కడి సమావేశంలో దివ్య ఖుర్‌ఆన్‌లోని తౌబా సూరాలోని మొదటి 40 వాక్యాలు పఠించే బాధ్యత హజ్రత్ అలీ (రజి)కు అప్పగించారు. దేవుడు ఆదేశించినట్లు అవసరమైన ప్రకటనలు చేసే బాధ్యత కూడా ఆయనకే అప్పగించారు.

ఆ ప్రకటనలేమంటే, పాత అజ్ఞానకాలం నాటి దురాచారాల ప్రభావంలో ఇంకా ఉన్నవాళ్ళు, ఇంకా దేవుడికి భాగస్వాములను కల్పిస్తున్నవాళ్ళు, ఇస్లామీయ రాజ్యంతో ఒప్పందాలు చేసుకుని తమ ప్రయోజనాలు కాపాడుకుంటున్నా వాళ్ళు మరో నాలుగు నెలలలోపు ఆయా ఒప్పందాలన్నీ రద్దవుతాయని తెలియజేయడం జరిగింది. ఈ నాలుగు నెలల్లోపు వారు తమ కార్యాచరణలను నిర్ణయించుకోవాలి. ఇస్లామీయ రాజ్యంలో పౌరసత్వాన్ని వదులుకుని యుద్ధానికైనా సిద్ధపడాలి లేదా ఇస్లామీయ రాజ్యంలో ముస్లిములుగానైనా ఉండాలి. ఇకపై రాజ్యంలో సమాంతర రాజ్యంగా ఉండే అవకాశంలేదు. ఇస్లామీయ రాజ్య పరిధిలో తిరుగుబాటుదార్ల ప్రాంతాలు కొనసాగుతూ ఉంటే రాజ్యం తన విధిబాధ్యతలను సక్రమంగా నిర్వర్తించడం సాధ్యం కాదు. అందువల్ల ఈ ఒప్పందాల రద్దుకు సంబంధించి బహిరంగ ప్రకటన చేయడం తప్పనిసరయ్యింది. వివిధ పక్షాలకు ఇవ్వబడిన నాలుగు నెలల సమయం వాటి కార్యాచరణ నిర్ణయించుకోవడానికి తగినంత సమయం. ఈ సమయంలో మదీనాకు వచ్చి ఇస్లామ్‌ను అర్ధం చేసుకోవడానికి ఎవరైనా విగ్రహారాధకులు ఆసక్తి చూపేదైతే వారి రాకపోకలకు పూర్తి భద్రత కల్పించే హామీ ఇవ్వడం జరిగింది. అలాగే ఒప్పందాలకు నిజాయితీగా కట్టుబడిన ముస్లిమేతర పక్షాలకు ఆ ఒప్పందకాలం వరకు అవి చెల్లుబాటవుతాయని మినహాయింపు ఇవ్వడం కూడా జరిగింది. ఈ ప్రకటన ప్రభావం ఎవరిపై పడిందంటే, ఒప్పందాలు చేసుకుని శత్రు శిబిరంగా మారి ఇస్లామ్‌కు వ్యతిరేకంగా పనిచేస్తున్న వాళ్ళు, ఒప్పందాలను ఉల్లంఘిస్తున్న వాళ్ళు, సన్మార్గంపై ఉన్నవారికి అవరోధాలు సృష్టిస్తున్న వాళ్ళు, సత్యధర్మంపై కువిమర్శలు చేస్తున్నవాళ్ళు, ప్రవక్త ముహమ్మద్ (స)ను ఆయన ఇంటి నుంచి బహిష్క రించాలని పథకాలు పన్నిన వాళ్ళు, మొదట యుద్ధం ప్రారంభించిన వారిపై దీని వేటు పడింది. రెండవ ప్రకటన ఏమంటే, భవిష్యత్తులో పవిత్ర కాబాగృహం తదితర మస్జిదుల సంరక్షణ బాధ్యత ముస్లిమేతరులకు ఇవ్వడం జరగదన్న ప్రకటన. అంటే ఇక నుంచి పవిత్ర కాబాగృహం ఆవరణలోకి విగ్రహారాధకులు ప్రవేశించే అనుమతి లేదు. ఈ విషయంలో ప్రవక్త (స) ఆదేశాలకు అనుగుణంగా హజ్రత్ అలీ (రజి) మరింత వివరణ కూడా ఇచ్చారు. విగ్రహారాధకులు చేసినట్లు ఇకపై



కాబాగృహం ప్రదక్షిణ నగ్నంగా చేసే అనుమతి కూడా ఎవరికీ లేదు. నాల్గవ ప్రకటన, నాలుగు మాసాల పవిత్రతను దేవుడు ధృవీకరించిన ప్రకటన. ఈ నాలుగు నెలలకు సంబంధించి ఇష్టం వచ్చిన మార్పులు చేర్పులు చేసుకునే అవకాశాలు లేకుండా చేయడం జరిగింది. ప్రవక్త (స) ద్వారా రుజుమార్గ వ్యవస్థను పూర్తిగా అమలు చేయడానికి, జీవితంలోని అన్ని రంగాల్లోను దాన్ని ఆచరణలో పెట్టడానికి దేవుడు పూనుకున్నాడని దీనివల్ల అర్థం అవుతుంది. విగ్రహారాధకులకు కోపం వచ్చినా సరే ఈ పనులు చేయకతప్పదు.

ఇప్పుడు మనం ఇస్లామీయ ఉద్యమంలో ఆ చారిత్రాత్మక సమావేశాన్ని చూద్దాం, అందులో స్వయంగా ప్రవక్త ముహమ్మద్ (స) పాలు పంచుకున్నారు. ఈ సమావేశం హిజ్రీ శకం 10వ సంవత్సరంలో జరిగింది. ఈ సమావేశంలో ఇస్లామీయ ఉద్యమ శక్తితరంగాలు సముద్రంలోని అలల్లా ఎగసిపడ్డాయి. అన్ని ప్రాంతాలకు హజ్ యాత్రకు సంబంధించిన వార్త పంపడం జరిగింది. ముస్లిముల బిడారులు మదీనా నగరానికి రావడం ప్రారంభమయ్యింది. మదీనా నుంచి ఈ బిడారులు మక్కా నగరానికి బయలు దేరాయి. దారిలో మరిన్ని బృందాలు, మరిన్ని బిడారులు వచ్చి కలిశాయి. వివిధ తెగలు ఈ యాత్రలో పాలుపంచుకున్నాయి. ప్రవక్త ముహమ్మద్ (స) భార్యలందరూ ఆయనతో పాటు ఈ యాత్రలో పాల్గొన్నారు. ప్రవక్త (స) జుల్‌హులిఫా వద్ద హజ్ యాత్రకు సంబంధించిన ప్రత్యేక దుస్తులు ఇహ్రామ్ ధరించారు. ఇక్కడి నుంచి హజ్ యాత్రికుల నినాదాలు వెల్లువెత్తాయి.

"మేం వచ్చేశాం. ఓ అల్లాహ్! మేం వచ్చేశాం.. నీకు ఎవ్వరూ భాగస్వాములు లేరు. నీ దర్బారులో మేం హాజరయ్యాం. సమస్త స్తోత్రాలు నీకే. అన్ని అనుగ్రహాలు నీవే. నీదే విశ్వసామ్రాజ్యం. ఎవ్వరూ నీకు భాగస్వామి కాదు."

దారిలో ఏదైనా కొండ దాటవలసి వస్తే యాత్రికులందరూ కలిసి ప్రవక్త ముహమ్మద్ (స)తో గొంతు కలుపుతూ "ఓ ప్రభూ! మేం హాజరయ్యాం.. నీవే ఔన్నత్యం కలిగినవాడివి" అని నినాదాలు చేశారు.

మక్కా సమీపిస్తున్నప్పుడు జీతూవా వద్ద ఆయన కొంత సమయం ఆగారు. ఆ తర్వాత యాత్రికుల సమూహంతో మక్కా నగరంలోకి ప్రవేశించారు. మక్కా ఉత్తరదిశ నుంచి ప్రవేశించారు. కాబా వద్ద ప్రదక్షిణలు చేశారు. సఫా, మర్వా కొండల వద్దకు వెళ్ళారు. అక్కడి నుంచి కాబాకు అభిముఖంగా నిలబడి ఏకదైవారాధన నినాదాలు చేశారు.

జిల్‌హిజ్జ తొమ్మిదవ తేదీన ఆయన నమ్రా లోయలో దిగారు. ఆ రోజు సాయంత్రం అరఫాత్‌కు వెళ్ళారు. ఖస్వా అనే ఒక ఆడ ఒంటెపై స్వారీ చేస్తూ కొండ పైకి ఎక్కారు. అక్కడి నుంచి తన ప్రసంగాన్ని వినిపించారు. అన్ని వైపుల నుంచి ఆయనకు దగ్గరగా నిలబడిన వాళ్ళందరూ ఆయన చెప్పిన ప్రతి మాటను బిగ్గరగా పలికారు. ఆ విధంగా ప్రవక్త (స) పలికిన ప్రతిమాట అక్కడ సమావేశమైన ప్రతిఒక్కరికి వినబడింది. ప్రవక్త(స) తన జీవితంలో పడిన శ్రమకు లభించిన ప్రతిఫలాన్ని చూసి ఎలా అనుభూతి చెంది ఉంటారు? అక్కడ ఒక లక్షా నలభైనాలుగు వేల మంది హాజరయ్యారు (కొన్ని నివేదికల ప్రకారం ఒక లక్షా ఇరవై నాలుగువేలమంది). ఈ దృశ్యం అత్యంత విశిష్టమైనది.

కాని ఈ విశిష్టదృశ్యం ప్రవక్త (స)లో ఎలాంటి గర్వాతిశయాన్ని సృష్టించలేదు. పైగా ఆయన మరింత వినమ్రంగా మారిపోయారు. దేవుడికి కృతజ్ఞతలు తెలియజేయడంలో మరింత నిమగ్నమై పోయారు. ఆయనలోని ప్రవక్తల దూరదృష్టి వల్ల ప్రజలను ఉద్దేశించి ప్రసంగించడానికి ఇదే ఆఖరు అవకాశం అని తెలిసి పోయింది. ఆ ప్రసంగంలో ఆయన తన చివరి వీలునామా కూడా చేర్చారు. ఇందులో ప్రతి ఒక్క పదం అత్యంత ప్రాముఖ్యం కలిగిన పదం. పైగా మానవాళికి ఇస్లామీయ ఉద్యమం తరఫున సందేశం అందించడానికి అంతకన్నా మంచి సందర్భం మరొకటి లేదు. ఈ ప్రసంగాలు ఆయన వాగ్ధాటికి, ప్రసంగ పటిమకు నిదర్శనాలు. ఈ పవిత్రమైన వ్యక్తిత్వం గొప్పదనాన్ని అర్థం చేసుకోవడానికి ఈ ప్రసంగాలు తోడ్పడు తున్నాయి.

## అరఫాత్ ప్రసంగం

అరఫాత్ వద్ద బహిరంగ సమావేశాన్ని ఉద్దేశించి ప్రవక్త చేసిన ప్రసంగం ఇది. “సమస్త స్తోత్రాలు దేవునికే చెల్లుతాయి. మనం ఆయన్ను స్తుతిస్తున్నాము. ఆయన సహాయాన్ని కోరుతున్నాము. మన పాపాలకు ఆయన్ను క్షమాభిక్ష అర్థిస్తున్నాము. ఆయన ముందు పశ్చాత్తాపం ప్రకటిస్తున్నాము. మన హృదయాల్లో దాగిన చెడు నుంచి, మన చెడు ఆచరణల నుంచి ఆయన శరణు కోరుతున్నాము. దేవుడు సన్మార్గంపై నడిచే దారి ఎవరికి చూపిస్తాడో ఆ మనిషిని మరెవ్వరూ దారి తప్పించలేరు. దేవుడు మార్గం చూపని మనిషికి ఎవరూ దారి చూపలేరు.

“అల్లాహ్ తప్ప మరెవ్వరు ఆరాధ్యుడు లేడని, ముహమ్మద్ ఆయన ప్రవక్త అని ప్రకటిస్తున్నాను.



“దైవదాసులారా! మీరు ఒకే దేవున్ని ఆరాధించాలని బోధిస్తున్నాను, అలాగే చేయాలని కోరుతున్నాను.

“ఈ పవిత్రపదాలతో నేను ప్రారంభిస్తున్నాను.

“ఆ తర్వాత నేను చెప్పేదేమంటే, ప్రజలారా! నేను చెప్పేది జాగ్రత్తగా వినండి. నేను స్పష్టంగా మాట్లాడుతున్నాను. ఈ సంవత్సరం తర్వాత నేను ఇక్కడ మిమ్మల్ని మళ్ళీ కలుసుకునే అవకాశం ఉంటుందని నేను భావించడం లేదు.

“ప్రజలారా! మీరు మీ ప్రభువు వద్దకు చేరుకునే వరకు మీ రక్తం, మీ ఆస్తులు ఒకరివి మరొకరికి పవిత్రమైనవి. ఈ నగరంలో ఈ మాసం, ఈ సంవత్సరం, ఈ రోజు పవిత్రమైన మాదిరిగా పవిత్రమైనవి.

“జాగ్రత్త! నేను మీకు సందేశం అందజేశాను. దేవుడా! మాకు సాక్షిగా ఉండు.

“మీలో ఎవరి వద్దనైనా ఎవరి అప్పగింత (అమానతు) ఉన్నా దాన్ని యజమానికి అప్పగించాలి.

“అజ్ఞానకాలం నాటి వడ్డీ మొత్తాలన్నీ రద్దయ్యాయి. ముందుగా నేను నా పినతండ్రి అబ్బాస్ బిన్ అబ్దుల్ ముత్తలిబ్‌కు సంబంధించిన వడ్డీ మొత్తాలను రద్దు చేస్తున్నాను.

“అజ్ఞాన కాలం నాటి రక్తపరిహారాలన్నీ రద్దయ్యాయి. అన్నింటికన్నా ముందు నేను నా వంశానికి సంబంధించి రాబియా బిన్ హారిస్ బిన్ అబ్దుల్ ముత్తలిబ్ రక్తపరిహారాన్ని రద్దుచేస్తున్నాను. అజ్ఞాన కాలం నాటి బిరుదులు, కీర్తులు అన్నీ రద్దయ్యాయి. కేవలం సాదానా (కాబాగృహం సంరక్షణ), సాఖయా (హజ్ యాత్రికు లకు తాగునీరు సరఫరా చేయడం)లకు మాత్రమే మినహాయింపు ఉంది.

“ఉద్దేశ్యపూర్వకంగా చేసిన హత్యకు ప్రతీకారం తప్పదు. ఉద్దేశ్యరహితంగా మరణానికి కారణమైతే, అది కర్రవల్ల కావచ్చు లేదా రాతివల్ల కావచ్చు, అలాంటి మరణానికి పరిహారం వంద ఒంటెలు. ఈ పరిహారాన్ని పెంచేవాళ్ళు అజ్ఞానకాలానికి చెందినవారుగా పరిగణనపొందుతారు.

“ప్రజలారా! సత్యవ్యవస్థ స్థాపన జరిగిన తర్వాత షైతానుకు ఎలాంటి ఆశ మిగల్లేదు. ఈ నేలపై అతడికి స్థానం లేదు. కాని మీరు తేలిగ్గా తీసుకునే పాపాల విషయంలో అతడికి విధేయత చూపితే వాడు సంతోషిస్తాడని తెలుసుకోండి.

"ప్రజలారా! నెలల్లో మార్పులు చేయడం (అంటే పవిత్ర మాసాల్లో) అన్నది ధర్మభ్రష్టతకు ఒక కొనసాగింపు. ఇలా చేయడం ద్వారా విగ్రహారాధకులు మరింత చెడుమార్గాన నడుస్తున్నారు. ఒక సంవత్సరంలో ఒక నెలను అనుమతించబడిన నెలగా మార్చుకుంటారు. మరో సంవత్సరం అదే నెలను నిషిద్ధమాసంగా మార్చుకుంటారు. ఆ విధంగా మార్పులు చేర్పులు చేయడం ద్వారా దేవుడు నిషేధించిన మాసాలకు ప్రత్యామ్నయాలు వెదుక్కుంటారు.

"నిస్సందేహంగా, దేవుడు భూమ్యాకాశాలను సృష్టించిన సమయానికి ఈ రోజు ప్రపంచం మరలింది. దేవుడి ముందు నెలలు లెక్కకు పన్నెండు మాత్రమే. దేవుడు భూమ్యాకాశాలను సృష్టించినప్పుడు ఈ సంఖ్య ఆయన పుస్తకంలో నమోదయ్యింది (గమ్య పత్రం). ఆ సంఖ్య అక్కడ ఉంది. ఈ పన్నెండు నెలల్లో నాలుగు మాసాలు పవిత్రమైనవి. అందులో వరుసగా మూడు నెలలున్నాయి. అవి: జిల్‌ఖాదా, జిల్‌హజ్జా, ముహర్రమ్ నెలలు. మరో నెల వేరుగా ఉంది. అది రజబ్ నెల. ఈ నెల జమాదివుల్ సాని మాసానికి, షాబాన్ మాసానికి మధ్యన ఉండే నెల.

"జాగ్రత్త! నేను నా సందేశాన్ని మీకు వినిపించాను. అల్లాహ్, మాకు సాక్షిగా ఉండు.

"ప్రజలారా! మీ మహిళలకు మీ విషయంలో కొన్ని హక్కులున్నాయి. అలాగే వారి విషయంలో మీకు కొన్ని హక్కులున్నాయి. వారి పడకగదుల్లో మీరు తప్ప మరెవ్వరు ప్రవేశించకుండా చూడడం, మీరు ఇష్టపడని వారిని మీ ఇంట్లో ప్రవేశించకుండా చూడడం వారి బాధ్యత. వారు వ్యభిచారానికి పాల్పడరాదు. వారు అలా చేస్తే వారితో వేరుపడే అనుమతి మీకు దేవుడు ప్రసాదించాడు. మీ పడకగదులకు వారిని దూరంగా ఉంచవచ్చు, వారి శరీరాలపై ఎలాంటి మచ్చలు పడని స్థాయిలో మాత్రమే శారీరక శిక్ష విధించవచ్చు. వారు పద్ధతి మార్చుకుని మీకు విధేయత చూపితే వారి పోషణ మీ బాధ్యత.

"నిస్సందేహంగా, మహిళలు మీకు లోబడి ఉన్నారు. వారు తమ ఇష్టం వచ్చిన విధంగా వ్యవహరించలేరు. మీరు వారిని మీ జీవితసహచరులుగా స్వీకరించారు. దేవుడి తరఫున ఒక అమానతుగా స్వీకరించారు. వారి శరీరాలను దేవుని అనుమతితో ఉపయోగించుకుంటున్నారు. కాబట్టి మహిళల విషయంలో దేవునికి భయపడండి. వారికి సరయిన శిక్షణ ఇవ్వండి.



"జాగ్రత్త! నేను మీకు దేవుని సందేశం అందజేశాను. దైవమా మాకు సాక్షిగా ఉండు.

"నా తర్వాత మీరు మరలా విగ్రహారాధనకు పాల్పడకండి. ఒకర్ని ఒకరు హతమార్చుకోకండి.

"నేను మీ మధ్య ఒక వస్తువును వదిలి వెళుతున్నాను. మీరు దాన్ని అనుసరించినంత కాలం మార్గం తప్పడం జరగదు. ఆ వస్తువు దేవుడి గ్రంథం.

'జాగ్రత్త! నేను మీకు దేవుని సందేశం అందజేశాను. దైవమా మాకు సాక్షిగా ఉండు.

"ప్రజలారా! మీ దేవుడు ఒక్కడే. మీ పూర్వికుడు ఒక్కడే. మీరందరూ ఆదమ్ సంతానం. ఆదమ్ మట్టితో సృష్టించబడ్డారు. దేవుడి దృష్టిలో అత్యంత గౌరవమర్యాదలు కలిగిన వాడు మీలో అత్యంత దైవభీతి కలిగిన వాడు మాత్రమే. ఏ అరబ్బుకు అరబ్బేతరునిపై ఎలాంటి ఆధిక్యతా లేదు. ఏ అరబ్బేతరునికి అరబ్బుపై ఆధిక్యత లేదు. దైవభీతి ప్రాతిపదికనే ఎవరికైనా ప్రాధాన్యం లభిస్తుంది.

'జాగ్రత్త! నేను మీకు దేవుని సందేశం అందజేశాను. దైవమా మాకు సాక్షిగా ఉండు.

"ప్రజలారా! మిమ్మల్ని నా గురించి అడగడం జరుగుతుంది. చెప్పండి మీరేమి చెబుతారు?

"అందరూ బిగ్గరగా "మీరు దైవసందేశం అందజేశారని ధృవీకరిస్తాం. ప్రజలకు హితబోధ చేసే బాధ్యత నిర్వర్తించారని, సత్యంపై పడి ఉన్న పరదాలన్నీ తొలగించారని, దేవుడి అమానతును విశ్వసనీయంగా అందజేశారని చెబుతాం" అన్నారు

"దైవమా! నీవే సాక్షి! దైవమా! నీవే సాక్షి! దైవమా! నీవే సాక్షి! దైవమా! నీవే సాక్షి!

"ఇక్కడ హాజరైన వాళ్ళు ఇక్కడ హాజరు కాని వారికి ఈ మాటలు అందజేయాలి. ఇక్కడ హాజరైన వారికన్నా ఇక్కడ హాజరు కాని వారు బహుశా ఈ మాటలను ఎక్కువ శ్రద్ధతో విని గుర్తుంచుకుని ఆచరించవచ్చు.

"ప్రజలారా! దేవుడు ప్రతి వారసుడికీ ఒక నిర్దిష్టభాగం వారసత్వ హక్కును ప్రసాదించాడు. ఎవరైనా తన ఆస్తిలో మూడవ వంతు కన్నా ఎక్కువ భాగానికి వీలునామా రాసే అనుమతి లేదు.

"ఎవరి పడకపై (అంటే వివాహం ద్వారా) శిశువు జన్మిస్తాడో అతడి బిడ్డగానే ఉంటాడు. వ్యభిచారులను రాళ్ళతో కొట్టి శిక్షించాలి.

"ఎవరైనా తన స్వంత తండ్రితో పాటు పరాయి వ్యక్తిని తన తండ్రిగా పిలిస్తే, అలాగే ఏ బానిసైనా తన అసలు యజమానితో పాటు మరెవ్వరినైనా యజమానిగా భావిస్తే దేవుడి అభిశాపానికి, దైవదూతలు, సమస్త ప్రజల అభిశాపానికి గురవుతారు. తీర్పుదినాన అలాంటి వ్యక్తి ఇచ్చే ఎలాంటి జవాబు కూడా స్వీకరించబడదు.

"దేవుడి శరణు, అనుగ్రహాలు మీపై అవతరించాలి.

మినా వద్ద సమావేశాన్ని ఉద్దేశించి ప్రవక్త ముహమ్మద్ (స) ఇలా అన్నారు:

"ప్రజలారా! నా తర్వాత ఏ ప్రవక్తా రావడం లేదు. మీ తర్వాత మరో సమూహమేదీ రావడం లేదు. కాబట్టి జాగ్రత్తగా వినండి. దేవుడి విధేయతకే అంకితం కండి. రోజుకు ఐదుసార్లు దైవప్రార్థనలు చేయండి. మీ ప్రభువు పవిత్ర మస్జిదుకు హజ్ యాత్ర చేయండి. మీ నాయకులు, పాలకుల ఆదేశాలను పాటించండి. మీరు స్వర్గానికి అర్హులు కావచ్చు."

మానవ ఆలోచనాశక్తి ఏదీ ఈ ప్రసంగాలను ఇంతకన్నా మెరుగ్గా మార్చలేదు. ఈ మాటల్లో సూచించబడిన వ్యవస్థ కన్నా ఉత్తమమైన సాంఘీక వ్యవస్థ ఏదీ ఆచరణలో లేదు. ఎక్కడైనా, ఎప్పుడైనా ఇస్లామీయ వ్యవస్థ ఏర్పడితే, సత్య వ్యవస్థ స్థాపించబడితే అది తప్పనిసరిగా ఈ కట్టుదిట్టమైన సూత్రాల పునాదులపైనే ఏర్పడాలి. ఇది మౌలిక ఇస్లామీయ వ్యవస్థకు సంబంధించిన ప్రకటన. ఈ వ్యవస్థ వైపునకే మానవాళిని ఆహ్వానించవలసి ఉంది. ఈ మాటలను పట్టించుకోకుండా ఎలాంటి జీవితవిధానాన్ని నిర్మించినా అది ఇస్లామీయ వ్యవస్థ కాదు. నిజమైన ముస్లిమ్ ఎవ్వరూ దానితో సంతృప్తి చెందడం జరగదు. ఇది మన ప్రియమైన ప్రవక్త ముహమ్మద్ (స) చివరి సందేశం. ఈ సందేశం మనల్ని ఉద్దేశించి ఇచ్చిన సందేశం. ఇది ప్రవక్త ముహమ్మద్ (స) చివరి విలునామా వంటి సందేశం. ఈ సందేశం మన హృదయాలను కదిలించే సందేశం.

ప్రవక్త (స) హజ్‌కు సంబంధించిన ఆచరణలన్నీ చాలా సునాయాసంగా నిర్వహించారు. ప్రజలతో కలిసిపోయారు. వారి ప్రశ్నలకు జవాబులిచ్చారు. చివరికి కాబాగృహం ప్రదక్షిణల్లో చివరి ప్రదక్షిణ చేసి మదీనా తిరుగుముఖమయ్యారు.



## గదీర్, ఉహుద్ చెరువుల వద్ద

ఈ హజ్‌యాత్రలో ప్రవక్త (స) పాలుపంచుకున్న తీరు, ప్రజలను ఉద్దేశించి చేసిన ప్రసంగాలు, ఇచ్చిన సలహాలు, నొక్కి చెప్పిన మాటలు, ప్రకటించిన తన చివరి కోరికలు గమనిస్తే ఆయన వీడ్కోలు పలుకుతున్నారని అర్థం అవుతుంది. ఆయన తిరుగు ప్రయాణంలో గదీర్ చెరువు వద్ద ఆగారు. అక్కడ ప్రసంగించారు. ఈ ప్రసంగంలో ఆయన వీడ్కోలు తీసుకుంటున్నారన్నది మరింత స్పష్టంగా తెలుస్తోంది.

ఈ ప్రసంగంలో ఆయన దైవస్తోత్రం తర్వాత ఇలా చెప్పారు:

"దీని తర్వాత, నేను కూడా ఒక మనిషినే, నాకు కూడా త్వరలోనే దేవుడి నుంచి పిలుపు రావచ్చు అని చెప్పాలనుకుంటున్నాను. దేవుడి పిలుపును నేను ఆహ్వానిస్తాను. నేను మీపై రెండు బాధ్యతల భారాన్ని వదిలి వెళుతున్నాను. ఒకటి దేవుడి గ్రంథం. అందులో మార్గదర్శకత్వ సూత్రాలు, జ్ఞానము ఉన్నాయి. కాబట్టి ఆ దైవగ్రంథాన్ని దృఢంగా పట్టుకోండి. అందులోంచి కాంతిని పొందండి."

ఆ తర్వాత దివ్యఖుర్‌ఆన్ ప్రాముఖ్యం గురించి నొక్కి చెప్పారు. ఆ పిదప ఇలా అన్నారు:

"ఇక రెండవ విషయం నా కుటుంబ సభ్యులు. నా కుటుంబ సభ్యుల విషయంలో నేను ఆ ఏకైక దేవుడిని గుర్తుచేసుకోవాలని కోరుతున్నాను"

ఈ ప్రసంగం ద్వారా ప్రవక్త ముహమ్మద్ (స) ఒక పెద్ద సామాజిక చెడు పుట్టకముందే దాన్ని నిర్మూలించారు. చాలా మంది ప్రవక్తలు పుణ్యపురుషులు మరణించిన తర్వాత ప్రజలు వారిని మానవాతీతమూర్తులుగా భావించడమూ, వారిని దేవుడి సంతానంగా భావించడం, వారికే పూజాదికాలు చేయడం వంటివి చరిత్రలో చోటు చేసుకున్న పరిణామాలు. ఇలాంటి చెడులు ప్రబలకుండా ప్రవక్త (స) ముందుగానే తాను కూడా మామూలు మనిషినేనని స్పష్టం చేస్తూ తనకు కూడా దేవుని నుంచి పిలుపు వస్తుందని, తాను కూడా ప్రపంచాన్ని వదిలి వెళతానని తెలియజేశారు.

ఇక రెండవ విషయానికి వస్తే, ప్రవక్త ముహమ్మద్ (స) కుటుంబసభ్యులు ఆయనతో పాటు సన్నిహితంగా ఆయన్ను పరిశీలించిన వారు. ఇస్లామీయ జ్ఞాన విజ్ఞానాల విషయంలో వారు ముస్లిమ్ సమాజానికి పెద్ద సంపద వంటి వారు.

ప్రవక్త (స) వారి కోసం ఆస్తులు కూడబెట్టలేదు. వారి కోసం సంపదలు వదిలి వెళ్ళలేదు. వారి విషయంలో ఇస్లామీయ సమాజానికి బాధ్యత ఉంది. ఈ విషయంలో ప్రవక్త (స) కేవలం సూచనాప్రాయంగా చెప్పి వదిలేశారు.

మరో ప్రత్యేక ప్రసంగంలో ప్రవక్త (స) తన అనుచరుల్లో భేదాభిప్రాయాల విషయమై మాట్లాడారు. హజ్రత్ అలీ (రజి)తో పాటు ఎమన్‌కు వెళ్ళిన కొందరు అనుచరులు భేదాభిప్రాయాలను వ్యక్తం చేశారు. ఇలాంటి అభిప్రాయభేదాలు చైతన్యం ఉన్న వ్యక్తుల్లో సహజంగానే ఉంటాయి. ఈ భేదాభిప్రాయాల వివాదం గురించి ఆ అనుచరుడు ప్రవక్త (స) వద్ద హజ్రత్ అలీ (రజి)కు వ్యతిరేకంగా ఫిర్యాదు చేశారు. హజ్రత్ అలీ (రజి) స్థాయి వ్యక్తి విషయంలో భేదాభిప్రాయాలు రావడం ఆయనకు బాధను కలుగజేసింది. భేదాభిప్రాయాలను పరిష్కరించుకోకుండా, వాటిని పెంచుకుపోవడం, చివరకు హజ్రత్ అలీ (రజి) స్థాయి వ్యక్తిపై ఫిర్యాదు చేసే దశకు రావడం ఆయన సహించలేకపోయారు. ఆయన సుదీర్ఘకాలంగా శిక్షణ ఇస్తూ వచ్చిన ముఖ్యమైన అనుచరులు వాళ్ళు. ఆయన తర్వాత ఇస్లామీయ ఉద్యమ భారం మోయవలసింది వారే. అందువల్ల ఆయన కాస్త కఠినంగా క్రింది విధంగా చెప్పారు:

"నాకు స్నేహితుడైన వాడికి అలీ కూడా మిత్రుడు. దైవమా! అలీతో ఎవరు స్నేహంగా ఉంటారు వారిపట్ల నువ్వు మిత్రుడిగా ఉందు. అలీ విషయంలో శత్రుభావం కలిగి ఎవరు ఉంటారో వారి పట్ల నువ్వు శత్రువుగా ఉండు"

హిజ్రీ శకం 11వ సంవత్సరం సఫర్ మాసం నుంచి ప్రవక్త ముహమ్మద్ (స) ఈ లోకాన్ని వదిలి వెళ్ళే ఏర్పాటు చేసుకోవడం ప్రారంభించారు. ఒకరోజు ఆయన ఉహుద్ సందర్శించారు. ఉహుద్‌లో అమరగతులైన వారి కోసం ప్రార్థించిన తర్వాత ఆయన ఇలా అన్నారు :

"ప్రజలారా! నేను మీ ముందే ఈ లోకాన్ని వదిలి వెళ్ళబోతున్నాను. మీ విషయంలో సాక్ష్యం ఉంటాను. దేవుని తోడు, ఇక్కడి నుంచి నేను స్వర్గంలోని సరస్సు (కౌసర్) చూడగలుగుతున్నాను. రాజ్యాల సంపదల తాళం చెవులు నాకు ఇవ్వబడ్డాయి. (అంటే ఇస్లామీయ ఉద్యమం ఫలితంగా చాలా రాజ్యాలు స్వాధీనం కానున్నాయి). నా తర్వాత మీరు దేవునికి భాగస్వాములను కల్పిస్తారన్న భయం నాకులేదు. కాని మీరు ప్రాపంచిక ప్రయోజనాల వెంటపడతారని భయపడుతున్నాను."



ఆ తర్వాత అర్ధరాత్రి ఆయన బకీ స్మశానవాటికకు వెళ్ళారు. అక్కడ మరణించిన వారి కోసం ప్రార్థనలు చేశారు. "నేను కూడా త్వరలోనే మీతో చేరబోతున్నాను" అని అన్నారు.

ఒకరోజు ఆయన తన సన్నిహిత సహచరులను పిలిచి వారితో ఇలా చెప్పారు:

"మీకు సౌభాగ్యం కలగాలి. ముస్లిములారా! అల్లాహ్ మిమ్మల్ని తన కరుణలో ఉంచాలి. మీ పేదరికాన్ని తొలగించాలి. మీకు పోషణ ప్రసాదించాలి. మీకు భద్రత ప్రసాదించాలి. మీరు దేవుడికి మాత్రమే భయపడండి. దేవుడి శరణులోనే ఉండండి. దైవభీతిని మీలో నింపుకోండి. నేను కేవలం స్పష్టంగా హెచ్చరించేవాడిని మాత్రమే. జాగ్రత్త! దేవుని భూభాగంపై దేవుడు సృష్టించిన ప్రాణుల మధ్య అహంకారంతో, తలబిరుసుతనంతో వ్యవహరించవద్దు. ఈ ప్రపంచంలో తలబిరుసు వైఖరికి పాల్పడకుండా, కల్లోలం రేపకుండా జీవించినవారి కోసమే పరలోకంలో నివాసగృహం లభిస్తుందని దేవుడు మనకు చెప్పాడు. పరలోకంలో సాఫల్యం కేవలం దైవభీతిపరులకే లభిస్తుంది. మీ అందరికీ శుభాకాంక్షలు, ఇస్లామ్ స్వీకరించి నాతో ప్రతిజ్ఞ చేసిన వారందరికీ శుభాకాంక్షలు."

బఖీ స్మశానవాటిక నుంచి వెనుదిరిగి వచ్చిన తర్వాత ఆయనకు కొద్దిగా తలనొప్పి మొదలైంది. సఫర్ నెల 29న ఆయన ఒకరి అంత్యక్రియల్లో పాల్గొని వెనుదిరిగి వచ్చారు. అప్పటికి ఆయన తలనొప్పి చాలా ఎక్కువయ్యింది. ఈ అనారోగ్యం ప్రారంభమైన 11 రోజుల పాటు ఆయన మస్జిదుకు వెళ్ళి ప్రార్థనలు నిర్వహించారు. అనారోగ్యం ఉధృతమైన తర్వాత వారం రోజులు మాత్రమే ఆయన మంచాన విశ్రాంతి తీసుకున్నారు. తన భార్యల నుంచి అనుమతి తీసుకుని ఆయన హజ్రత్ ఆయేషా (రజి) గదికి మారారు.

ఆయన అంతిమదశలో తీవ్ర అనారోగ్యంతో ఉన్నప్పుడు కూడా తన ఉద్యమ బాధ్యతలు చూసుకునేవారు. అప్పటికీ తబూక్, మూతా సైనికచర్యలు సమాప్తికాలేదు. ఈ విషయంలో ఏమాత్రం అశ్రద్ధ చూపినా శత్రుబలగాలు మరింత బలం పుంజు కోవచ్చు. కాబట్టి తీవ్ర అనారోగ్యం బాధిస్తున్నప్పటికీ ఆయన సఫర్ నెల 26వ తేదీన రోమన్ సామ్రాజ్యానికి వ్యతిరేకంగా సైనికచర్యకు ఆదేశించారు. ఆ తర్వాతి రోజు ఉసామా బిన్ జైద్‌ను సైన్యాధ్యక్షుడిగా నియమించారు. ఆయన్ను ఉద్దేశించి ఇలా చెప్పారు:

"వెళ్ళండి.. మీ తండ్రిగారు అమరగతి పొందిన ప్రదేశానికి చేరుకోండి. దేవుని నిరాకరించే ప్రతిఒక్కరిపై దాడి చేయండి."

తన స్వహస్తాలతో సైన్యం ధ్వజాన్ని సిద్ధం చేసి బురైదా బిన్ హుసైబ్ అస్లమీకి ఇచ్చారు.

ఈ సందర్భంగా ఉసామా అనుభవ రాహిత్యం గురించి, ఆయన కుటుంబ హోదా గురించి కొందరు గుసగుసలాడసాగారు. అంత తక్కువ వయసున్న ఉసామాను సైన్యాధ్యక్షుడిగా నియమించడం, అది కూడా మక్కా ప్రవాసులు, అన్సారుల్లోని యోధానుయోధులకు నాయకుడిగా నియమించడం గురించి గుసగుసలుగా వినిపిస్తున్న విమర్శలు ప్రవక్త (స)ను తీవ్రంగా బాధించాయి. అనారోగ్యవేదనలోను తలకు పట్టీ కట్టుకుని ఆయన మస్జిదుకు వచ్చి మాట్లాడారు.

"'ఉసామా గురించి మీరు చెబుతున్న ఫలానా ఫలానా మాటలు నాకు తెలిశాయి. ఇంతకు ముందు కూడా ఇతని తండ్రిని సైన్యాధ్యక్షుడిగా నియమించినప్పుడు మీరు ఇలాగే విమర్శించారు. దేవుని తోడు, అతను ఆ పదవికి అర్హుడైనా విమర్శించారు. ఇప్పుడు అతని కుమారుడు కూడా ఈ పదవికి అర్హుడు. అతను (జైద్ బిన్ హారిస్) మాకు చాలా ఆప్తుడు. అతని తర్వాత అతని కుమారుడు (ఉసామా బిన్ జైద్) కూడా మాకు చాలా ఆప్తుడు"

దీనికి ముందు, ఆయన స్వర్గస్తులు కావడానికి ఐదు రోజుల ముందు, ఆయన తలపై ఏడు బకెట్ల నీళ్ళను గుమ్మరించుకున్నారు. ఈ స్నానం వల్ల ఆయనకు కొంత ఉపశమనం లభించింది. ఆయన ఊతంతో మస్జిదుకు వచ్చి మాట్లాడారు:

"మీకన్నా ముందు గతించిన తరాలు తమ ప్రవక్తలు, పుణ్యపురుషుల సమాధులు నిర్మించి వాటిని ఆరాధనాస్థలాలుగా చేసుకున్నారు. మీరు అలాంటి పని చేయకండి. నా సమాధిని ఆరాధనాస్థలంగా మార్చవద్దు. ప్రవక్తల సమాధులను ఆరాధనాస్థలాలుగా మార్చినవాళ్ళు తీవ్రమైన దైవికశిక్షకు గురవుతారు. నేను దీన్ని నిషేధిస్తున్నాను. నేను దేవుని సందేశాన్ని మీకు అందించాను. దైవమా! నీవే దీనికి సాక్షి.

"నేను ప్రత్యేకంగా అన్సార్ల విషయంలో మీకు అప్పీలు చేస్తున్నాను. వారు నా శరీరానికి దుస్తుల వంటి వారు. నా జీవిత ప్రయాణంలో శక్తివనరుల వంటివారు. వారు తమ బాధ్యతలు నిర్వర్తించారు. ఇప్పుడు వారి పట్ల మీ బాధ్యతలు మిగిలి



ఉన్నాయి. ఇతరులు ఇంకా విస్తరించవచ్చు. కాని వారు మాత్రం ఎక్కడ ఉన్న వారు అక్కడే ఉంటారు. వారు చేసిన మంచిపనులకు మీరు విలువ ఇవ్వాలి. వారి లోపాలను మన్నించాలి. దేవుడు తన దాసుడికి రెండు ప్రత్యామ్నాయాలు ఇచ్చాడు. ఈ ప్రపంచంలో ఉన్నదంతా తీసుకోవడం లేదా దేవుని చేతిలో ఉన్నది గ్రహించడం. ఈ దాసుడు దేవుని చేతిలో ఉన్నది స్వీకరించడాన్ని ఎన్నుకున్నాడు."

ఆయన చేసిన ఈ ప్రసంగాలన్నీ వీడ్కోలు సందేశాలుగా ఉన్నప్పటికీ ఈ చివరి వాక్యం ఆయన స్వర్గస్తులు కానున్నారన్న ముందస్తు సూచననిచ్చింది. ఈ విషయాన్ని హజ్రత్ అబూబక్ర్ (రజి) గ్రహించారు.

అనారోగ్యం తీవ్రమై ఆయన సామూహిక ప్రార్థనలకు రాలేని పరిస్థితిలో ఆయన హజ్రత్ అబూబక్ర్ (రజి)ను ప్రార్థనలకు నాయకత్వం వహించే బాధ్యత అప్పగించారు. కాని ఆయన అనారోగ్యం అధికం కావడంతో ప్రజల్లో ఆందోళన పెరిగి వారు మస్జిదు చుట్టు గుమిగూడడం ప్రారంభించారు. ప్రజలను శాంతపరచడానికి ఆయన హజ్రత్ అలీ (రజి), హజ్రత్ ఫజల్ ఇబ్నె అబ్బాస్‌ల ఊతంతో బలహీనంగా నడుచుకుంటూ మస్జిదుకు వచ్చారు. మస్జిదులో ప్రసంగపీఠం మెట్టుపై కూర్చుని చివరి ప్రసంగం చేశారు.

"ప్రజలారా! నా మరణం విషయంలో మీరు ఆందోళన చెందుతున్నారని విన్నాను. ఎవరైనా ప్రవక్త శాశ్వతంగా జీవించి ఉండడం జరిగిందా? నేను త్వరలో దేవుడిని కలుసుకుంటాను. మీరు కూడా ఆయన్ను కలుసుకుంటారు. మొదట వలస వెళ్ళిన వారి పట్ల మంచిగా వ్యవహరించాలని నేను బోధించాను. వలసవచ్చిన వారు ఒకరి పట్ల ఒకరు మంచిగా వ్యవహరించాలని బోధించాను." ఈ మాటలు పలికిన తర్వాత ఆయన సూరా అల్ అస్ర్ పఠించి ఇంకా ఇలా ప్రసంగించారు : "అన్ని వ్యవహారాలు దేవుని ఆదేశంతో నిర్వహించబడ్డాయి. ఏదైనా వ్యవహారంలో ఆలస్యం జరుగుతుంటే దాని విషయంలో తొందరపడవద్దు. ఎవరి కోసమూ ఏ విషయాన్నీ దేవుడు వేగిరం చేయడు. మీరు అన్సారులకు మంచి చేయాలని బోధిస్తున్నాను. వారు మీ కన్నా ముందు మదీనాను తమ గృహంగా చేసుకున్నారు. ఈ ధార్మిక విశ్వాసాన్ని అత్యంత ఉత్సుకతతో స్వీకరించారు. వారి ఫలాలను మీతో వారు పంచుకోలేదా? వారు తమ కన్నా మీకు ఎక్కువ ప్రాధాన్యత ఇవ్వలేదా? వారు స్వయంగా అవసరాల్లో ఉన్నప్పటికీ అలా చేయలేదా? వినండి. నేను మీ

కన్నా ముందు వెళుతున్నాను. మీరు కూడా నాతో వచ్చి కలుస్తారు. మనం స్వర్గలోకపు సరస్సు వద్ద కలుద్దాం"

సోమవారం నాడు (తేదీ విషయంలో చాలా వివాదం ఉంది. రబీవుల్ అవ్వల్ 12వ తేదీ అని చాలా మంది ఒప్పుకుంటున్నారు) ఆయన లేచి పండ్లు తోముకున్నారు, కిటికీ పరదా పక్కకు తప్పించి బయటకు చూశారు, అక్కడ గుమిగూడి ఉన్న అనుచరులను చూసి చిరునవ్వు నవ్వారు. కొన్ని క్షణాల తర్వాత ఈ పదాలను మూడు సార్లు పలికారు: "ఓ దైవమా! అత్యున్నత సహచరుడా!" ఆ పిదప తన తల హజ్రత్ ఆయెషా (రజి) ఒడిలో ఉంచి దైవసాన్నిహిత్యానికి తరలిపోయారు.

మనమంతా దేవునికి చెందినవారమే. ఆయన వద్దకే మనం మరలిపోవలసి ఉంది.

ప్రపంచాన్ని సత్యసందేశంతో సుసంపన్నం చేసి, ప్రపంచానికి కొత్త ప్రాణం పోసిన మహామనీషి, మానవాళిని సురక్షితంగా రుజుమార్గాన నడిపే ప్రయత్నాల్లో తీవ్రమైన వేధింపులను భరించిన వ్యక్తి, అన్ని విధాల కష్టనష్టాలను ఎదుర్కొని, తాను సాధించిన ఘనకార్యాలకు ఎలాంటి ప్రతిఫలం ఆశించని ప్రవక్త (స) ఆ విధంగా ఈ లోకాన్ని వదలి వెళ్ళిపోయారు.

మన కోసం ఆయన శత్రువులను ఎదుర్కొన్నారు. మన నుంచి ఏమీ తీసుకోకుండానే మన కోసం ఆయన అత్యంత ప్రమాదభరితమైన మార్గాన ప్రయాణించారు. ఇస్లామీయ వ్యవస్థను స్థాపించడానికి ఆయన సమస్తమూ త్యాగం చేశారు. చరిత్రలో ఒక కొత్త యుగాన్ని సృష్టించారు. ఒక గొప్ప రాజ్యాన్ని ఏర్పాటు చేశారు. ఆలోచనా, జ్ఞానాలకు సంబంధించి కొత్త ప్రపంచాలను మన ముందు పెట్టారు. మనకు సంబంధించిన ప్రతి అంశం ఆయనకు రుణపడి ఉండేలా చేశారు. ఈ రుణం తీర్చుకోవడానికి మనం చెల్లించే ఏ పరిహారమూ సరిపోదు. అందువల్ల మన కృతజ్ఞతలు స్వీకరించాలని దేవుడిని ప్రార్థిద్దాం. ఆయన తన అపరిమితమైన కారుణ్య సంపద నుంచి ప్రవక్త ముహమ్మద్ (స) ఆత్మపై కారుణ్యాన్ని వర్షించాలని ప్రార్థిద్దాం. అత్యున్నత గౌరవహోదాలతో ఆయన్ను లేపాలని, ఆయన సందేశానికి మరింత శక్తి సమకూర్చాలని ప్రార్థిద్దాం.. ఆమీన్.

"Mohsin-e-Insaniyat" (Telugu)

TIP : 269

ఇది మనం జీవిస్తున్న ప్రపంచం. మనం ప్రాపంచిక సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నాము. ఈ సంక్షోభం ఒక భీకరమైన సవాలు. ఆధునిక భౌతికవాద నాగరికత లేదా ఈ నాగరికత రూపొందించిన మనిషి ఈ సంక్షోభాన్ని పరిష్కరించలేదు. తాత్కాలిక ఊరటనైనా ఇవ్వగల కొత్త సిద్ధాంతం ఏదీ లేదు. ఎక్కడా ప్రశాంతత, సమస్యల పరిష్కారం అందుబాటులో లేదు. మనిషిని అన్ని వైపుల నుంచి చీకటి చుట్టుముట్టిన ఈ సంక్షుభిత సమయంలో కనబడుతున్న ఒకే ఒక్క ఆశాకిరణం, సుదూరంగా, పధ్నాలుగు వందల సంవత్సరాల క్రితం వెలిగించిన ఆశాజ్యోతి ఒక్కటే. మానవాళికి కారుణ్యకెరటంగా అవతరించిన ప్రవక్త ముహమ్మద్ (స) మాత్రమే ఆ ఆశాజ్యోతి.

TELUGU ISLAMIC PUBLICATIONS TRUST
Sandesha Bhavanam
Chatta Bazar, Hyderabad-500 002.
ISBN : 978-93-81111-20-8
TRUST
₹150